# రాజనీతి తత్వ్వ విచారము

**బి.ఏ. రాజనీతి శాస్త్రము, మూడవ సంవత్సరము, పేపరు - 3**


రచయితలు

**ప్రొఫెసర్ ఐ. దోసగిరిరావు**
రాజనీతి మరియు ప్రభుత్వ పాలనాశాస్త్ర విభాగము
ఏ.యు.యం.యస్.యన్. పి.జి. సెంటర్, కాకినాడ

**డా॥ యం. పాండురంగారావు**
లెక్చరర్, రాజనీతిశాస్త్ర విభాగము (పి.జి.)
సర్. సి.ఆర్.ఆర్. కళాశాల, ఏలూరు

**డా॥ బి.వి. బాలకృష్ణ**
ఉపన్యాసకులు, రాజనీతిశాస్త్ర విభాగము,
సర్. సి.ఆర్.ఆర్. కళాశాల, ఏలూరు

**డా॥ యం.వి.యస్. కోటేశ్వరరావు**
అసోసియేట్ ప్రొఫెసర్
రాజనీతి మరియు ప్రభుత్వ పాలనా శాస్త్ర విభాగం
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

**డా॥ యస్. సుబ్బారావు**
ఎ.యు.పి.జి. సెంటర్, శ్రీకాకుళం

**డా॥ బి. ఉదయ ప్రకాష్**
అసోసియేట్ ప్రొఫెసర్
హిందూ కళాశాల (పి.జి.), అమరావతి రోడ్, గుంటూరు

**డా॥ ఎ. వెంకటరావు**
అసోసియేట్ ప్రొఫెసర్
ఏ.యు.యం.యస్.యన్. పి.జి. సెంటర్, కాకినాడ

**డా॥ కె. రామచంద్రమూర్తి**
రీడరు, రాజనీతి శాస్త్ర విభాగము (పి.జి.)
సర్. సి.ఆర్.ఆర్. కళాశాల, ఏలూరు

**డా॥ టి.వి. లక్ష్మి**
అసోసియేట్ ప్రొఫెసర్
రాజనీతి శాస్త్ర విభాగము
సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల, గుంటూరు

సంపాదకులు

**ఆచార్య బి.యస్.ఆర్. ఆంజనేయులు** Rtd.
రాజనీతి శాస్త్ర విభాగము, ఆంధ్ర విశ్వవిద్యాలయము, విశాఖపట్నం.

సమన్వయకర్త :

**ఆచార్య బి.పి.పి. బోస్**
రాజనీతి మరియు ప్రభుత్వపాలనా శాస్త్ర విభాగము, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయము

డైరెక్టర్
**ఆచార్య డి. కృష్ణారావు,** M.Sc., Ph.D.,



**దూరవిద్యా కేంద్రము**

ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం, నాగార్జున నగర్
Ph: 0863-2293299, 2293356, 08645-211023, Cell:98482 85518
08645 - 211024 ( Study Material )
Website : www.anucde.ac.in or www.anucde.info
e-mail : info@ anucde.ac.in

B.A. Political Thought

First Edition : 2005

Second Edition : 2006

Third Editon : 2011

**Fourth Edition : 2013**

**Copies :** 1000

**(C) Acharya Nagarjuna University**

This book is exclusively prepared for the use of students of Centre for Distance Education, Acharya Nagarjuna University and this book is meant for limited circulation only.

*Published by :*

**Prof. D. Krishna Rao**

Director

Centre for Distance Education

Acharya Nagarjuna University

**Prof. M.V. Ramkumar Ratnam**

Deputy Director

Centre for Distance Education

Acharya Nagarjuna University

*Printed at :*

**Don Bosco Technical School Press**

Ring Road, Guntur-7, Ph : 2350832

# ముందుమాట

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం 1976లో స్థాపించినది మొదలు నేటి వరకు ప్రగతి పథంలో పయనిస్తూ వివిధ కోర్సులు, పరిశోధనలు అందిస్తూ, 2003 వ సంవత్సరంలో NAAC చే B++ (80-85) గ్రేడును సంపాదించుకొని దేశంలోనే ఒక ప్రముఖ విశ్వవిద్యాలయంగా గుర్తింపు సాధించుకొన్నదని తెలియజేయటానికి ఎంతో సంతోషిస్తున్నాను. ప్రస్తుతం గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాలలోని సుమారు 300 అనుబంధ కళాశాలల విద్యార్థులకు డిగ్రీ, పి.జి. స్థాయి విద్యాబోధనతో పాటు పరిశోధన డిగ్రీలను కూడా ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం అందిస్తోంది.

ఉన్నత విద్యను అందరికి అందించాలన్న లక్ష్యంతో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, దూర విద్యా కేంద్రాన్ని స్థాపించింది. దీని ద్వారా పూర్తి స్థాయిలో కళాశాలకు వెళ్ళి విద్య నభ్యసించలేనివారికి, ఎంతో వ్యయ భరితమైన ఫీజులు చెల్లించలేని వారికి, ఉన్నత విద్య చదవాలన్న కోరికవున్న గృహిణులకు ఈ దూర విద్యావకాశం ఎంతో దోహదపడుతుంది. ఇట్టి వారందరికి తమ ముంగిట్లో విద్యను అందించే ఉద్దేశ్యంతో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, 2003-04 విద్యా సంవత్సరంలో డిగ్రీస్థాయిలో బి.ఏ., బి.కాం.; పి.జి. స్థాయిలో ఎం.ఏ., ఎం.కాం., ఎం.ఎస్.సి., ఎం.బి.ఏ, ఎల్.ఎల్.యమ్ కోర్సులను ప్రారంభించడం జరిగింది.

ఈ దూర విద్యా పద్ధతి ద్వారా విద్యనభ్యసించే విద్యార్థుల కొరకు రూపొందించే పాఠ్యాంశాలు, సులభంగాను, సరళంగాను, విద్యార్థి తనంతట తానుగా అర్థం చేసికొనేలా ఉండాలనే ఉద్దేశ్యంతో విశేష బోధనానుభవం కలిగి, రచనా వ్యాసంగంలో విశేష అనుభవంగల అధ్యాపకులతో పాఠ్యాంశాలను వ్రాయించటం జరిగింది. వీరు ఎంతో నేర్పుతో, నైపుణ్యంతో, నిర్ణీత సమయంలో పాఠ్యాంశాలను తయారుచేశారు. ఈ పాఠ్యాంశాలపై విద్యార్థిని విద్యార్థులు, ఈ పాఠ్యాంశాల బోధనలో నిష్ణాతులైన వారు ఇచ్చే సలహాలు, సూచనలు సహృదయంతో స్వీకరించబడతాయి. నిర్మాణాత్మకమైన సూచనలను గ్రహించి మున్ముందు చేసే ప్రచురణలలో మరింత నిర్దిష్టంగా, మరింత సులువుగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ప్రచురణ చేయగలం. ఈ పాఠ్యాంశాల అవగాహన కోసం, సంశయాల నివృత్తి కోసం డిగ్రీ స్థాయిలో వారాంతపు తరగతులు, పి.జి. స్థాయిలో కాంటాక్టు క్లాసులు ఏర్పాటు చేయటం జరిగింది.

దూర విద్యా కేంద్రం ద్వారా విజ్ఞాన సముపార్జన చేసి, ఉన్నత విద్యార్హతలు సంపాదించి జీవనయాత్ర సుగమం చేసుకోవడమేగాక, చక్కటి ఉద్యోగావకాశాలు పొంది, ఉద్యోగాలలో ఉన్నత స్థాయికి చేరాలని వాటి ద్వారా దేశ పురోగతికి దోహదపడాలని నా ఆశయం. రాబోయే సంవత్సరాలలో దూర విద్యా కేంద్రం మరిన్ని కొత్త కోర్సులతో దిన దినాభివృద్ధి చెంది ప్రజలందరికి అందుబాటులోకి రావాలని ఆకాంక్షిస్తున్నాను. ఈ మా ప్రయత్నానికి సహకరించిన దూర విద్యా కేంద్రం డైరెక్టర్లకు, సంపాదకులకు, రచయితలకు నా అభినందనలు.

**ఆచార్య వి. బాలమోహన్‌దాస్**

కులపతి

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

B.A. Political Science

## Paper - III : Political Thought

### Syllabus

1. Introduction to the study of Political Thought.
2. Ancient Greek Political Thought Plato and Aristotle
3. Kautilya and Manu.
4. Social Contract Theoreticians : Hobbes, Locke, Rosseau.
5. Utiliterians - Bentham and J.S. Mill.
6. Idealists : Hegel and T.H. Green
7. Socialists : Utopian
8. Scientific Socialism - Karl Marx.
9. Philosophy of the Indian National Movement - Moderates and Extremists and Gandhian Era
10. Political Ideas of :

    a) Jawaharlal Nehru

    b) M.N. Roy

    c) Jayaprakash Narayan

    d) B.R. Ambedkar
11. Gandhism - International relevance and Significance.

A. DEGREE EXAMINATION, MAY 2006.

(Examination at the end ...)

Part II — ... Science

Paper III — POLITICAL THOUGHT

Maximum : 100 marks

SECTION A — (2 × 15 = 30 marks)

Answer any TWO of the following.

1. Explain Aristotle's views on slavery and revolutions.

   బానిసత్వం, విప్లవాలపై అరిస్టాటిల్ భావాలను వివరింపుము.

2. Examine Rousseau's views on popular sovereignty.

   ప్రజాసార్వభౌమాధికారంపై రూసో భావాలను పరిశీలింపుము.

3. Examine J.S. Mill's views on Liberty and Representative Government.

   స్వేచ్ఛ, ప్రాతినిధ్య ప్రభుత్వంపై జె.ఎస్. మిల్ అభిప్రాయాలను పరిశీలింపుము.

4. Discuss Karl Marx's concept of "Dictatorship of the proletariat"

   ''కార్మిక నియంతృత్వం''పై కారల్ మార్క్స్ భావాలను చర్చింపుము.

5. Explain Jawahar Lal Nehru's views on 'Democratic Socialism".

   ''ప్రజాస్వామ్య సామ్యవాదం''పై జవహర్ లాల్ నెహ్రూ భావాలను వివరింపుము.

6. Explain J.P. Narayan's views on "Partyless Democracy".

   ''పార్టీ రహిత ప్రజాస్వామ్యం''పై జె.పి. నారాయణ్ భావాలను వివరింపుము.

SECTION B — (3 × 10 = 30 marks)

Answer any THREE of the following.

7. Explain Locke's views on Natural Rights.

   సహజ హక్కులపై లాక్ భావాలను వివరింపుము.

8. Explain Plato's views on Education.

   విద్యపై ప్లేటో భావాలను వివరింపుము.

9. Elucidate the Hegel's views on Dialectics.

   గతితార్కికంపై హెగెల్ భావాలను విశదీకరింపుము.

10. What are the suggestions given to the prince by Machiavelli?

    ''ప్రిన్స్''కు మాకియవెల్లి ఇచ్చిన సలహాలేవి?

11. **What do you know on Utopian Socialism?**

"కాల్పనిక సామ్యవాదం" గురించి నీకు తెలిసింది తెలుపుము.

12. **Explain M.N. Roy's views on "Radical Humanism".**

"అభ్యుదయ మానవతా వాదం"పై ఎం.ఎన్. రాయ్ భావాలను వివరింపుము.

## SECTION C — (3 × 5 = 15 marks)

**Answer any THREE of the following.**

13. Socrates.

సోక్రటీస్.

14. T.H. Green.

టి.హెచ్. గ్రీన్.

15. Dr. B.R. Ambedkar.

డా. బి.ఆర్. అంబేద్కర్.

16. Sarvodaya.

సర్వోదయ.

17. Federick Engles.

ఫెడరిక్ ఏంగిల్స్.

## SECTION D — (25 marks)

18. (a) Answer the following in 1 or 2 sentences : (10 × 2 = 20)

(i) Polis.

పోలిస్.

(ii) Thracemachus.

థ్రాసిమాచస్.

(iii) Matsya Nyaya

మత్స్య న్యాయం.

(iv) Varna system.

వర్ణ వ్యవస్థ.

(v) The spirit.

చిదాత్మ.

(vi) Surplus value.

మిగులు విలువ.

(vii) **Total Revolution.**

సంపూర్ణ విప్లవము.

(viii) **Das capital.**

దాస్ కాపిటల్.

(ix) **Leviathan.**

లెవియథాన్.

(x) **Mandragola.**

మాండ్రగోల.

(5 × 1 = 5)

(b) **Answer the following in 1 or 2 words :**

(i) **Who supported the absolute theory of sovereignty?**

నిరపేక్ష సార్వభౌమాధికారంను ఎవరు సమర్థించారు?

(ii) **What is the name of the Aristotle's University?**

అరిస్టాటిల్ యొక్క విశ్వవిద్యాలయం పేరేమి?

(iii) **Who is the author of the book, "Why Socialism?"**

"వై సోషలిజం?" గ్రంథకర్త ఎవరు?

(iv) **"Will but not the force is the basis of the State". Who said it?**

"ప్రజాభీష్టమే కాని బలప్రయోగంకాదు రాజ్యానికి మూలాధారం" అని ఎవరనెను?

(v) **Who is the author of the book, "Hind Swaraj"?**

"హింద్ స్వరాజ్" గ్రంథకర్త ఎవరు?

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | రాజనీతి తత్వ విచారము - పరిచయం | 1.1 - 1.5 |
| 2. | ప్లేటో | 2.1 - 2.12 |
| 3. | అరిస్టాటిల్ | 3.1 - 3.10 |
| 4. | కౌటిల్యుడు | 4.1 - 4.14 |
| 5. | మనువు | 5.1 - 5.12 |
| 6. | హాబ్స్ (క్రీ.శ. 1588-1679) | 6.1 - 6.8 |
| 7. | జాన్‌లాక్ (క్రీ.శ. 1632-1704) | 7.1 - 7.8 |
| 8. | జీన్ జాక్విస్ రూసో | 8.1 - 8.8 |
| 9. | ఉపయోగితావాదము - బెంథామ్ | 9.1 - 9.7 |
| 10. | ఉపయోగితావాదము - జె.యస్.మిల్ | 10.1 - 10.6 |
| 11. | హెగెల్ | 11.1 - 11.11 |
| 12 | టి.హెచ్. గ్రీన్ | 12.1 - 12.8 |
| 14. | సామ్యవాదం - కార్ల్ మార్క్స్ | 14.1 - 14.12 |
| 15. | భారత జాతీయోద్యమ తాత్విక భావన..... | 15.1 -15.14 |
| 16. | జవహర్‌లాల్ నెహ్రూ రాజకీయ భావాలు | 16.1 - 16.9 |
| 17. | యం.ఎన్. రాయ్ | 17.1 - 17.10 |
| 18. | జయప్రకాష్ నారాయణ్ - రాజకీయ భావాలు | 18.1 - 18.9 |
| 19. | భారతరత్న భీమ్‌రావ్ రాంజి అంబేద్కర్ | 19.1 - 19.12 |
| 20. | గాంధీ తత్వము | 20.1 - 20.11 |


గమనిక : ఈ పుస్తకంలో 9, 10 వ పాఠములలో 13 వ పాఠం మిళితమైయున్నది. అందువలన ప్రత్యేకంగా 13వ పాఠమును ప్రచురించుట లేదు. ఈ విషయాన్ని విద్యార్థులు గమనించగలరు.

పాఠం-1

# రాజనీతి తత్వ విచారం - పరిచయం

## 1.0 లక్ష్యం

ఈ పాఠం చదివిన తరువాత మీరు ఈ క్రింది విషయాలను తెలుసుకోగల్గుతారు.

- ☆ రాజనీతి తత్వ విచారం అంటే ఏమిటి.
- ☆ రాజనీతితత్వ విచారానికి, రాజనీతి సిద్ధాంతానికి ఉన్న తేడా ఏమిటి.
- ☆ రాజనీతితత్వ విచారం వలన ప్రయోజనాలు ఏమిటి.

## విషయసూచిక:


1.1 రాజనీతితత్వ విచారము అంటే ఏమిటి.
1.2 తత్వవిచారం - అర్థం
1.3 ప్రదేశంతో సంబంధం ఉన్న తత్వవిచారము
1.4 కాలంతో సంబంధం ఉన్న తత్వవిచారము
1.5 సమూహాలతో సంబంధం ఉన్న తత్వవిచారము
1.6 రాజనీతి సిద్ధాంతము - రాజనీతి తత్వవిచారము
1.7 రాజనీతి తత్వవిచారం - ప్రాధాన్యత
1.8 సారాంశము
1.9 నమూనా ప్రశ్నలు
1.10 చదువదగిన గ్రంథాలు


## 1.1 రాజనీతితత్వ విచారము అంటే ఏమిటి:

ఆంగ్ల భాషలో "పొలిటికల్ థాట్" అనే పదాలను మనము తెలుగులో రాజనీతి శాస్త్రమని తర్జుమా చేసుకున్నాం. పొలిటిక్స్ అనే మాటను నిర్వచిస్తూ హెరాల్డ్ లాస్వెల్ "ఎవరు దేనిని, ఎప్పుడు, ఎలా పొందుతారో అదే రాజనీతి అని నిర్వచించారు". ("Politics is who gets what, when and how" Herald D. Lasswel). సమాజములో ఉన్న భౌతిక, భౌతికేతర వనరులను, వర్గాల మధ్య లేదా సమూహాల మధ్య అధికారయుతంగా పంచే ప్రక్రియ రాజకీయం అని డేవిడ్ ఈస్టన్ పేర్కొన్నారు. ("Politics is authoritative distribution of resources - Easton).

తత్వవిచారము (థాట్) అనే మాటను రాజనీతి శాస్త్రములోనే కాకుండా అన్ని సామాజిక శాస్త్రాలలోను అనేక అర్థాలతో వాడుతున్నారు. చాలా సందర్భాలలో భావజాలం (ఫిలాసఫి) అనే మాటకు సమానార్థకంగా వాడటం; సిద్ధాంతము (థియరి) అనే మాటకు సమానార్థకంగా వాడటం జరుగుతూ ఉంది. దీనితో అర్థానికి సంబంధించిన గందరగోళం కొంత సృష్టించబడింది. ఉదాహరణకు అరిస్టాటిల్ సిద్ధాంతము; అరిస్టాటిల్

తత్వవిచారము, అరిస్టాటిల్ భావజాలం, అరిస్టాటిల్ భావన వంటి పదాలు మనకు అనేక పాఠ్యగ్రంథాలలో ఒకేచోట కన్పిస్తూ ఉంటాయి. అలాగే మార్క్స్ సిద్ధాంతము, మార్క్స్ తత్వవిచారము, మార్క్స్ భావజాలం, మార్క్స్ భావన వంటి పదాలు కూడా తరుచుగా పాఠ్య గ్రంథాలలో కనిపిస్తూ ఉంటాయి. దీనితో విద్యార్థులు సిద్ధాంతాన్ని, భావాజాలాన్ని, తత్వవిచారాన్ని సమానార్థకాలుగా వాడటం సర్వసాధారణమైపోతుంది.

## 1.2 తత్వవిచారం – అర్థం:

ఛాంబర్ నిఘంటువు ప్రకారం, తత్వవిచారం అంటే 1. ఆలోచన చేయు, 2. వివేచక చేయు శక్తి, 3. ఒక ప్రదేశములో కాని, కాలములో కాని, సమూహములో కాని ఉద్భవించిన ఆలోచనలు. చాలా శతాబ్దాలపాటు తత్వవిచారం అనే పదాన్ని మూడవ అర్థంలో వాడుతూ వచ్చారు. ఇప్పటికి గతించిన తరాల వారు వ్రాసిన పాఠ్య గ్రంథాలలో, మూడవ అర్థంలోనే తత్వవిచారాన్ని గురించిన ప్రస్తావన కన్పిస్తుంది. ఉదాహరణలు చూద్దాం.

## 1.3 ప్రదేశంతో సంబంధం ఉన్న తత్వవిచారము:

గ్రీకుల తత్వవిచారము (Greak Thought), భారతీయుల తత్వవిచారము (Indian Thought), ప్రాశ్చాత్య తత్వవిచారము (Western Thought) మొదలైనవి. తత్వవిచారాన్ని ఈ విధంగా అధ్యయనం చేసేటప్పుడు గ్రీస్ దేశములో ఉద్భవించిన తత్వవిచార సారాన్ని అంశాల వారీగా విభజించి అధ్యయనం చేయడం జరుగుతుంది. ఉదాహరణలు : రాజ్యంపై గ్రీకుల అభిప్రాయాలు, స్వేచ్ఛపై గ్రీకుల అభిప్రాయాలు, చట్టం పై గ్రీకుల అభిప్రాయాలు.

## 1.4 కాలంతో సంబంధం ఉన్న తత్వవిచారము:

సాధారణంగా గతించిన చరిత్రను యుగాలుగా విభజిస్తున్నారు. ఉదాహరణ: ఆదిమ యుగం, పురాతన యుగం, మధ్య యుగం, వికాస యుగం మొదలైనవి. ఆ యుగాల పేరు మీద అంటే ఆ కాలంలో రచింపబడిన తత్వవిచారాన్ని, ఆ కాలం పేరు మీదనే గుర్తించి, అధ్యయనం చేసే దానిని కాలానికి చెందిన తత్వవిచారము అని పిలుస్తాము. ఇందుకు ఉదాహరణలు: మధ్య యుగాలలోని తత్వవిచారము (Medieval Thought), ప్రాచీన కాలంలోని తత్వవిచారము (Ancient Thought), ఆధునిక తత్వవిచారము (Modern Thought) మొదలైనవి.

## 1.5 సమూహాలతో సంబంధం ఉన్న తత్వవిచారము:

మానవ జాతి అనేక సమూహాలుగా గుర్తించబడుతూ ఉంటుంది. జాతుల పేరు మీద కొన్ని సార్లు (ఆంధ్రులు, తమిళులు, స్లావాక్‌లు, ఆఫ్రికన్లు మొదలైనవి), దేశాలనే జాతులుగా గుర్తించి కొన్ని సార్లు (అమెరికన్ల తత్వవిచారము, భారతీయుల తత్వవిచారము, రష్యన్ల తత్వవిచారము మొదలైనవి) తత్వవిచారాన్ని అధ్యయనం చేస్తాము.

అయితే ఈ పద్ధతి కనుమరుగైపోతూ క్రమంగా వ్యక్తుల పేరు మీదనే తత్వవిచారాన్ని అధ్యయనం చేయటం సాధారణమైపోతుంది. ప్లేటోనుగాని, అరిస్టాటిల్‌ను గాని, రూసోనుగాని, మార్క్స్‌నుగాని, ఇతర వ్యక్తులను గురించి గాని ప్రత్యేకంగా అధ్యయనం చేసేటప్పుడు రాజనీతి తత్వవిచారము అన్న మాటను వాడుతున్నాము.

## 1.6 రాజనీతి సిద్ధాంతము - రాజనీతి తత్వవిచారము:

రాజనీతి సిద్ధాంతం, రాజనీతి తత్వవిచారము అనేవి భిన్నమైనవి. ఈ రెండింటికి ఎక్కడా పోలికలు లేవు.

**సిద్ధాంతము:** సిద్ధాంతము అన్న మాటను వాడుతున్నప్పుడు దానికి ఈ క్రింది లక్షణాలు ఉంటాయి.

1. దృగ్గోచరమైన, స్పష్టంగా గుర్తించడానికి వీలైన అవకాశం ఉన్న అంశాలను ఎంపిక చేసుకోవాలి.
2. ఆ అంశాలకు సంబంధించిన విషయాలన్నింటిని అధ్యయనం [illegible]లి.
3. అధ్యయన ఫలితాన్ని అదే తీరుగా సాగిన మిగిలిన అధ్యయన సా[illegible]శంతో పోల్చాలి.
4. వివిధ అధ్యయన సారాంశములో సారూప్యత ఉన్న లక్షణాలను గుర్తించగలగాలి.
5. ఆ లక్షణాలకు విశ్వజనీనతను ఆమోదించాలి.

అప్పుడు మాత్రమే సిద్ధాంతము అన్న మాటను వాడటానికి వీలుకలుగుతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే దృగ్గోచరమైన అంశాల మధ్య, శాస్త్రీయత సహాయంతో, విశ్వజనీనతను గుర్తించటమే సిద్ధాంతం.

**తత్వవిచారము:** అయితే తత్వవిచారానికి సిద్ధాంతానికి ఉండవలసిన నిబంధనలు వర్తించవు. దానికి ప్రధాన ఆధారాలు: 1. ఒక వ్యక్తి లేదా ఒక తరం, లేదా ఒక ప్రదేశానికి సంబంధించిన తర్క పూర్వక ఆలోచనాధోరణి, 2. మంచి, చెడుల నిర్ణయం, 3. సమాజానికి దీర్ఘకాలిక ప్రయోజనాలు ఏమిటి అన్న ప్రశ్నకు సమాధానం. తత్వవిచారంలో శాస్త్రీయత ఉండవచ్చు, లేక లేకపోవచ్చు.

హెరాల్డ్ లాస్‌వెల్ ఫిలాసఫికి చెప్పిన నిర్వచనం, తత్వవిచారానికి చక్కగా అన్వయిస్తుంది. ఆయన దృష్టిలో ఫిలాసఫి అంటే ఇష్టము లేదా ఎంపిక చేసుకోవటం (Philosophy is preference). తత్వవిచారమన్నా అదే అర్థం.

ప్లేటో ప్రతిపాదించిన న్యాయాన్నో, విద్యా పద్ధతినో చదువుతున్నప్పుడు రెండు ప్రశ్నలకు అసలు అవకాశం ఇవ్వము. అవి:

1. ఆనాటి వాస్తవ పరిస్థితిని ఎంతవరకు ప్రతిబింబిస్తుంది?
2. విచక్షణను, శాస్త్రీయతను ఉపయోగించినప్పుడు అదెంతవరకు సమంజసం?

పై రెండు ప్రశ్నల కన్నా సమకాలీన పరిస్థితులను అర్థం చేసుకొనడం లోను, విశ్లేషించడంలోను, వాటికి పరిష్కారాన్ని చూపడంలోను, తత్వవేత్తలు ఏవిధమైన అభిప్రాయాలు వ్యక్తం చేశారన్న ప్రశ్నకి ఎక్కువ విలువ ఉంటుంది. ఏమిటి? ఏ విధంగా ఉంది (What is happening) అన్న ప్రశ్న కన్నా, ఏం జరగాలి (What would be) అన్న ప్రశ్నకే ఎక్కువ ప్రాధాన్యత ఉంటుంది.

## 1.7 రాజనీతి తత్వవిచారం - ప్రాధాన్యత :

రాజనీతి తత్వవిచారం యదార్థ పరిస్థితుల వర్ణనకు ప్రాధాన్యత ఇవ్వకపోయినప్పటికి, గణాంకాలకు (data), గణాంక విశ్లేషణకు (data analysis) కు దానిలో కీలకమైన స్థానంలేనప్పటికి రాజనీతి తత్వవిచారం ఈ క్రింది ప్రాధాన్యతలను కల్గి ఉంటుంది.

## 1. సమకాలీన సమాజ రాజకీయ పరిస్థితులను రేఖా మాత్రంగా పరిచయం చేయటం:

ప్రతి తత్వవేత్త రచనలలోనూ పరోక్షంగా అతని సమకాలీన సమాజంలో ఉన్న రాజకీయ పరిస్థితికి సంబంధించిన వివరణ ఉంటుంది. అయితే రాజకీయ చరిత్రకారులలాగా, తత్వవేత్త దాన్ని కూలంకషంగా చర్చించడు. అయితే ఏది మంచి పద్ధతి అని చెప్పటం తన బాధ్యతగా భావిస్తాడు కాబట్టి, తప్పనిసరిగా సమకాలీన పరిస్థితిని చెప్పవలసి ఉంటుంది. అంతర్ గర్భంగా దానిని గురించి చెపుతూ, తాను సూచించ దలచుకున్న ప్రత్యామ్నాయం మీద ఎక్కువ కాలాన్ని వెచ్చిస్తాడు.

## 2. తన కాలం నాటికి ప్రచారంలో ఉన్న తత్వవిచారాన్ని తెలియచెప్పటం :

తత్వవిచారాన్ని చదవటం వలన ఇది అతి పెద్ద ప్రయోజనం. ప్రతి తత్వవేత్త తనకు ముందు ఉన్న, తన సమకాలీన భావాలను చాలా వివరంగా చర్చిస్తాడు. ఆ తర్వాత వాటిలో కొన్నింటిని ఆమోదిస్తూ, మరి కొన్నింటిని పూర్వ పక్షం చేస్తూ, తన అభిప్రాయాలను వివరిస్తాడు. దీని వలన తత్వశాస్త్ర విద్యార్థులకు నాల్గు ప్రయోజనాలు చేకూరుతాయి. అవి:

1. ఆ కాలానికి ముందు ఉన్న రాజకీయ తత్వవిచారం పై పూర్తి అవగాహన కల్గటం.
2. తత్వశాస్త్రం ఒక క్రమపద్ధతిలో ఏవిధంగా అభివృద్ధి చెందింది, ఆ అభివృద్ధికి దారి తీసిన సామాజిక స్థితిగతులు, సామాజిక మార్పు ఏమిటి అన్న విషయాల పట్ల అవగాహన ఏర్పడుతుంది.
3. ఏ తత్వవేత్త అయినా కొనసాగుతున్న భావాలను మెరుగు పరచగలడు కాని, పూర్తిగా నూతనమయిన భావాలను సృష్టించలేడన్న విషయం బోధపడుతుంది.
4. తత్వవేత్తల భావాలను తులనాత్మకంగా అర్థం చేసుకోవటానికి అవకాశం కల్గుతుంది.

## 3. ప్రత్యామ్నాయాలను ప్రతిపాదించడం :

ప్రతి తత్వవేత్త యొక్క లక్ష్యం మెరుగైన సామాజిక భావాలను ప్రతిపాదించటము. వాటి సహాయంతో సామాజిక జీవితంలోకి ఎక్కువ సౌలభ్యాన్ని ప్రవేశ పెట్టటమే. దాని కొరకు తనదంటూ ఒక ప్రత్యేకత కలిగిన, సామాజిక, రాజకీయ ప్రత్యామ్నాయాన్ని ప్రతిపాదిస్తాడు. అయితే, అది ఆ తత్వవేత్త దృష్టి నండి చూసినప్పుడు మాత్రమే అది మెరుగైన ప్రత్యామ్నాయం. మిగిలిన వారు ఆ ప్రత్యామ్నాయాన్ని అదే దృష్టితో చూడటం సాధ్యం కాదు. ప్లేటో, మార్క్స్, హాబ్స్, మాకియవెల్లి మెదలైన ఎందరో తత్వవేత్తల చేత ప్రతిపాదించబడిన ప్రత్యామ్నాయాలు, కొందరి ఆమోదాన్ని, మరికొందరి తిరస్కారాన్ని పొందటం మన కందరకూ తెలిసిన విషయమే. అయితే, సమాజ గతిని మార్చటానికి ఉపయోగపడే ప్రత్యామ్నాయం ఏమిటి అన్న విషయంపై, స్థూలంగానైనా ఒక అభిప్రాయం ఏర్పడాలంటే, వీరి రచనలు నమూనాలుగా ఉపయోగపడ్తాయి.

## 4. మేధోపర నిర్దేశకత్వాన్ని ఇవ్వటం:

తత్వవేత్త దార్శనికుడు. అంటే తన కాలంకన్నా, చాలా దశాబ్దాల, శతాబ్దాల ముందు ముందుచూపు కల్గిఉంటాడు. విచక్షణా శక్తితోనో, తర్కశాస్త్ర శక్తితోనో, రాబోయే తరాలకు ఏదిమేలు చేస్తుంది అన్న ప్రశ్నకు సమాధానం చెప్పే ప్రయత్నం చేస్తాడు. సాధారణ మేధస్సు కలవారు ఈ పని చేయలేదు. అందుకే తత్వవేత్తల సంఖ్య ఎప్పుడూ

పరిమితంగానే ఉంటుంది. వారు సమాజానికి మార్గదర్శకులు. మేధస్సు అనేది వీటిని చేత పట్టుకుని, తమ తరాలకు, రాబోయే తరాలకు దారి చూపే ప్రయత్నం చేస్తారు. వారు చూపే దారులలో, ఏది ఉత్కృష్టమైన దారో గ్రహించగల్గటం మన బాధ్యత.

## 1.8 సారాంశము:

రాజనీతి తత్వవిచారం - రాజనీతి సిద్ధాంతం – రాజనీతి భావనలు అన్న మాటలను సమానార్ధకాలుగా వాడుతున్నప్పటికి వాటికి భిన్నమైన అర్ధాలున్నాయి. జరుగుతున్న దానిని వివరించేది సిద్ధాంతమయితే, ఏమి జరగాలో వివరించేది తత్వవిచారం. ఇది ఒక ప్రదేశానికో, ఒక కాలానికో, ఒక వ్యక్తికో చెందిన భావాల సముదాయం. తత్వవిచార అధ్యయనం వలన అనేక ప్రయోజనాలున్నాయి. దాని సహాయంతో ఆనాటి రాజకీయ పరిస్థితిని రేఖామాత్రంగా తెలుసుకోవచ్చు. ఆ కాలంలో ప్రచారంలో ఉన్న మిగిలిన తత్వవిచారాలను కూలంకషంగా అర్ధం చేసుకోవచ్చు. ఏ తత్వవేత్త ఎటువంటి ప్రత్యామ్నాయాన్ని ప్రతిపాదిస్తున్నాడు, అది ఎంతమేరకు సమాజానికి ఉపయోగపడుతుంది వంటి విషయాలను తెలుసుకోవచ్చు.

## 1.9 నమునా ప్రశ్నలు:

1. రాజనీతి తత్వవిచారమంటే ఏమిటో వివరించండి?
2. రాజనీతి తత్వవిచారాన్ని అధ్యయనం చేయటం వలన ప్రయోజనాలు ఏమిటో వివరించండి?

## 1.10 చదువదగిన గ్రంథాలు:


1. Barker, Ernest : Greek Political Theory
   Plato and His Preddecessors
2. Dunning, W.A. : History of Political Theories, Vol. I.
3. Gettle, R.G. : History of Political Thought, Chapter I.
4. Laski, H.J. : Introduction to Politics
5. Zatlin, G : Story of Political Philosophers
6. Sabine, George H : A History of Political Theory


– డాక్టర్ యం.వి.యస్. కోటేశ్వరరావు

పాఠం- 2

# ప్లేటో ( క్రీ.పూ. 427 - 347 )

## 2.0 లక్ష్యం :

ప్రాచీన గ్రీకు తత్త్వశాస్త్ర చరిత్రలో క్రీస్తుపూర్వం 5, 4 శతాబ్దాలకు ఎంతో విశిష్టతయున్నది. లౌకిక, హేతువాద దృక్పథాలతో రాజనీతి తత్త్వశాస్త్రాన్ని వివరించటంద్వారా చరిత్ర ప్రసిద్ధులైన ప్లేటో, అరిస్టాటిల్‌లు ఈ కాలానికి చెందినవారే. 21వ దశతాబ్దంలో కూడా ప్రాచీన గ్రీకు సంస్కృతి, నాగరికతలను గురించి స్మరించటానికి, చర్చించటానికి కారణభూతులైన తత్త్వవేత్తలు ప్లేటో, అరిస్టాటిల్‌లు. తన గురువైన సోక్రటిస్ బోధనలకు వ్రాతరూపమిచ్చిన ఘనత ప్లేటోది కాగా, వాటిని శాస్త్రీయదృక్పథంతో వివరించిన ఘనత ఆయన శిష్యుడు అరిస్టాటిల్‌కు చెందుతుంది. అద్భుతమైన ఊహాశక్తికి, తన మేధాసంపత్తిని జోడించి, సమకాలీన గ్రీకు సమాజంలోని పరిస్థితులను ప్రాతిపదికగా చేసికొని ఆదర్శరాజ్యం యొక్క ముఖ్యలక్షణాలను, రాజ్యం యొక్క స్వరూప స్వభావాలను, రాజ్యానికి, వ్యక్తికి మధ్య ఉండవలసిన సంబంధాలను గురించి వివరించిన ప్రముఖ గ్రీకు తత్త్వవేత్త ప్లేటో. ఇంతటి ప్రసిద్ధి చెందిన ఆయన భావాలను, వాటిని ప్రభావితం చేసిన సమకాలీన గ్రీకు సమాజం పరిస్థితులను, రాజనీతి తత్త్వ విచారం అభివృద్ధికి ఆయన చేసిన కృషిని వివరించటం ఈ పాఠం యొక్క లక్ష్యం.

## విషయసూచిక :


2.1 పరిచయము

2.2 ప్లేటోను ప్రభావితం చేసిన అంశాలు

2.3 ప్లేటో రచనలు - రచనా పద్ధతి

2.4 ప్లేటో - ధర్మ సిద్ధాంతం

2.4.1. కెఫాలస్ సిద్ధాంతం

2.4.2. థ్రాసిమాకస్ సిద్ధాంతం

2.4.3. గ్లకన్ సిద్ధాంతం

2.4.4. ప్లేటో ధర్మ సిద్ధాంతం

2.4.5. ప్లేటో ధర్మసిద్ధాంతం - విమర్శ

2.5 ప్లేటో - విద్యా విధానం

2.5.1. ప్లేటో విద్యావిధానం - ముఖ్యలక్షణాలు

2.5.2. ప్లేటో విద్యావిధానం - ప్రాథమిక విద్య

2.5.3. ప్లేటో విద్యా విధానం - ఉన్నత విద్య

2.5.4. ప్లేటో విద్యా విధానం - విమర్శ

2.6 ప్లేటో - కమ్యూనిజం

2.6.1 ప్లేటో కమ్యూనిజం - విమర్శ

2.6.2. ప్లేటో కమ్యూనిజం - ఆధునిక కమ్యూనిజం

2.7 ప్లేటో ఆదర్శ రాజ్యం

2.7.1. వృత్తి నైపుణ్య సిద్ధాంతం

2.7.2. ప్లేటో ఆదర్శ రాజ్యం - తత్వవేత్తలే పాలకులు

2.7.3. ప్లేటో ఆదర్శ రాజ్యం - విమర్శ

2.8. ప్లేటో - 'స్టేట్స్‌మన్'

2.9. ప్లేటో - 'ది లాస్'

2.10. ప్లేటో - విశిష్టత

2.11. సారాంశము

2.12. నమూనా ప్రశ్నలు

2.13. చదువదగిన గ్రంథాలు

## 2.1. పరిచయము :

ప్రాచీన గ్రీకురాజనీతి తత్త్వవేత్తలలో ప్లేటో అగ్రగణ్యుడు. ఆయన అఖండ మేధావి, పండితుడు, కవి, సంఘసంస్కర్త, గణితశాస్త్ర పారంగతుడు మాత్రమే కాక సమకాలీన రాజ్యవ్యవహారాలలో అపారమైన ప్రజ్ఞాగలిగిన రాజకీయకోవిదుడు. ఇంతటి మేధా సంపన్నుడైన ప్లేటో క్రీ.పూ. 427లో ఏథెన్స్ నగరంలో ఒక సంపన్న కుటుంబంలో జన్మించినాడు. తండ్రిపేరు అరిస్టోన్ (Ariston). ప్లేటో అసలు పేరు అరిస్టోకిల్స్ (Aristocles). ఆయన ఉన్నత కుటుంబంలో జన్మించటం ద్వారా సమాజపరిస్థితులను, రాజకీయాలను అవగాహన చేసుకోవటానికి, ప్రభుత్వం ఏ విధంగా పనిచేస్తుందో లోపలినుండి చాలా సన్నిహితంగా పరిశీలించడానికి అవకాశం కలిగినది.

ప్లేటో, సోక్రటీస్‌కు ఉత్తమ శిష్యుడు, ప్రఖ్యాత గ్రీకు తత్త్వవేత్త అరిస్టాటిల్‌కు గురువు. సోక్రటీస్ శిష్యరికం వలన ప్లేటో జీవితంలోను, అతని తాత్త్విక భావనలలోను నిర్ణయాత్మకమైన మార్పులు చోటు చేసికున్నాయి. సోక్రటీస్ మరణానంతరం ప్లేటో కొంతమంది స్నేహితులు, శిష్యులతో కలిసి సిసిలి, మెగారా, దక్షిణ ఇటలీ, ఈజిప్టు దేశాలను సందర్శించినాడు. ఈ పర్యటనల వలన వివిధ దేశాలను చెందిన విభిన్న రాజ్యాంగాలను, ప్రభుత్వాలను వాటి పనితీరును పరిశీలించటానికి, అధ్యయనం చేయటానికి ప్లేటోకు అవకాశం కలిగింది. క్రీ.పూ. 386 లో ఏథెన్స్ నగరానికి తిరిగివచ్చి 'అకాడమి' (Academy) అనే విద్యాలయాని స్థాపించినాడు. 'అకాడమీ' ఆ రోజులలో ప్రఖ్యాత విద్యాకేంద్రంగా, శాస్త్రీయ పరిశోధనలకు నిలయంగా, రాజకీయ శిక్షణా కేంద్రంగా ప్రసిద్ధికెక్కింది. దీని ప్రధాన కేంద్రంగా చేసికొని విద్యాబోధన చేస్తూ, పరిశోధనా వ్యాసంగాలను కొనసాగిస్తూ తాత్త్విక చింతనలో జీవితాంతం గడిపి క్రీ.పూ. 347లో మరణించాడు.

## 2.2. ప్లేటోను ప్రభావితం చేసిన అంశాలు :

ప్లేటో భావనలను ముఖ్యంగా మూడు అంశాలు ప్రభావితం చేసినాయి. అవి 1. సమకాలీన గ్రీకు సమాజంలోని **అరాచక** పరిస్థితులు, 2. సోక్రటీస్ బోధనలు, అతని మరణం, 3. వివిధ దేశాలలో ఆయనచేసిన పర్యటనలు. ప్లేటో కాలం నాటికి గ్రీసు**దేశం** క్షీణదశలో పయనిస్తూ వుంది. విచ్ఛిన్నకరశక్తుల ప్రాబల్యం పెరుగుటవలన, సోఫిస్ట్‌ల బోధనల వలన గ్రీస్ దేశం రాజకీయ, **సాంఘిక**, వైజ్ఞానిక రంగాలలో పతనమవుచున్నది. ఏథెన్స్ నగరంలో ప్రజాస్వామ్యం క్షీణించి అరాచక పరిస్థితులు నెలకొన్నాయి. స్వార్థ, సంకు**చిత** దుష్టశక్తులు స్వైరవిహారం చేస్తూ ఉండేవి. అందువలననే సమకాలీన ప్రజాస్వామ్యం పట్ల ప్లేటో విముఖతను ప్రదర్శించినాడు. ప్రజాస్వా**మ్యం** ప్రజలను మోసగించే భ్రమవంటిదని పేర్కొన్నాడు. అవినీతిపరులు, అసమర్థులు అయిన కొద్దిమంది పాలకులను అజ్ఞానులైన **అనేక**

మంది ఎంపిన జేయటమే ప్రజాస్వామ్యం అని ప్లేటో భావించినాడు. రాజకీయవాదుల అసమర్థత, హింసాపూరిత స్వార్థం కారణంగా ధనికులు, బీదలు అనే వ్యత్యాసాలేర్పడి అంతఃకలహాలు ప్రారంభమయినాయి. అసమర్థతను పారద్రోలి స్వార్థాన్ని నిర్మూలించి సమాజోద్ధరణ కావించటానికి ప్లేటో పూనుకున్నాడు.

సోక్రటీస్ లోకానికి అందించిన ఏకైక శిష్యుడు ప్లేటో. సోక్రటీస్ భావాలను, బోధనలను గ్రంథస్థం చేసిన ఘనత ప్లేటోకు చెందుతుంది. సోక్రటీస్ మరణ విధానం, ఆయన బోధనలు ప్లేటో రచనలపై చెరగని ముద్రవేశాయి. ప్రజాస్వామ్య విలువలను మంటగలిపి ఏథెన్స్ యువతను తప్పుత్రోవ పట్టిస్తున్నాడనే అసత్యఆరోపణలు చేసి సోక్రటీస్‌కు ఏథెన్స్ పాలకులు మరణశిక్ష విధించటాన్ని ప్లేటో జీర్ణించుకోలేకపోయినాడు. ఈ సంఘటన కారణంగానే ప్లేటో రాజకీయవేత్తగా స్థిరపడాలన్న తన నిర్ణయాన్ని మార్చుకొని తత్త్వవేత్తగా రూపొందినాడు. ప్లేటో తనగురువు సోక్రటీస్ దగ్గరనుండి తీసుకున్న భావాలలో రెండు ముఖ్యమైన సిద్ధాంతాలున్నాయి. అవి: 1. సుగుణమే జ్ఞానము (Virtue is Knowledge), 2. వాస్తవికతా సిద్ధాంతం (Doctrine of Reality).

' సుగుణమే జ్ఞానమని ' ప్లేటో అభిప్రాయం. సాధారణంగా మనం సత్యమనుకునేదానిని అధిగమించిన నిరపేక్ష సత్యం (absolute truth) ఒకటి వుంది. దీనిని వివేచన వలన తెలుసుకోవచ్చు. ఈ పరమసత్యాన్ని సుగుణమనవచ్చు. అఖండమేధా సంపత్తికలిగిన తాత్త్వికులే ఈ నిరపేక్ష సత్యాన్ని తెలుసుకోగలుగుతారు. అందువలన ప్లేటో తాత్త్వికులకే రాజ్యాధికారాన్ని అప్పగించాలని సిద్ధాంతీకరించాడు. వాస్తవికతా సిద్ధాంతాన్ని అనుసరించి ప్రతి వస్తువూ భావంలోనే పాదుకొని వుంటుంది. సోక్రటీస్ మరణానంతరం నిస్పృహ చెందిన ప్లేటో అనేక సంవత్సరాలు విదేశీ పర్యటనలో గడిపినాడు. దానితో ఆయనకు ఇతర ఆలోచనాధోరణులతో పరిచయం ఏర్పడింది.

## 2.3 ప్లేటో రచనలు - రచనాపద్ధతి :

ప్లేటో ఎన్నో గ్రంథాలను రచించినాడు. వాటిలో ప్రముఖమైనది, 1. రిపబ్లిక్, 2. స్టేట్స్‌మాన్, 3. దిలాస్. ఈ మూడు గ్రంథాలు ప్లేటో రాజనీతి భావాలను ప్రతిబింబిస్తాయి. 'రిపబ్లిక్' లో భావసిద్ధాంతం ఆధారంగా ఒక ఆదర్శ రాజ్యాన్ని ప్లేటో రూపొందించినాడు. 'స్టేట్స్‌మాన్', 'ది లాస్' గ్రంథాలలో అమలులో ఉన్న రాజ్యాలపై వ్యాఖ్యానాలు ఉన్నాయి. ప్లేటో రచనలన్నింటిలోను 'రిపబ్లిక్' ఉత్కృష్టమైన గ్రంథం. ఇది అతనికి అజరామరమైన ఖ్యాతిని సంపాదించింది. ఇది మానవుని సంపూర్ణ విజ్ఞానాన్ని క్రోడీకరించిన గొప్ప గ్రంథం. ప్లేటో రిపబ్లిక్‌లో దివ్యమైన ఆదర్శ రాజ్యాన్ని, దాని ముఖ్యలక్షణాలను వివరించినాడు. అతని భావుకత ఊహాజనితమైనది కాక తర్కం, విమర్శ, అనుభవం అనేవాటి నుంచి జనించింది.

ప్లేటో తన రచనలలో సోక్రటీస్ నుండి గ్రహించిన ప్రశ్నోత్తర పద్ధతిని అనుసరించినాడు. అవి సంభాషణ రూపంలో ఉంటాయి. ప్రశ్నోత్తరాల ద్వారా మానవుని మేధను చైతన్యవంతంచేసి విజ్ఞానాపేక్ష పెంపొందించటమే ఈ పద్ధతి ఆశయం. ప్లేటో తన భావాలను వివరించటంలో నిగమనపద్ధతి (deductive method) ని అవలంబించినాడు. కొన్ని ప్రాథమిక సూత్రాలను ప్రాతిపదికగా చేసికొని సిద్ధాంతాలను వివరించటం ఈ పద్ధతి సారాంశం. ప్లేటో రచనలు భావౌన్నత్యంతో, చదువరులను రంజింపజేసే కవితాధోరణితో ఉంటాయి.

## 2.4 ప్లేటో - ధర్మ సిద్ధాంతం

'రిపబ్లిక్' లో ప్లేటో చర్చించిన ప్రధాన అంశం 'ధర్మానికి' అర్థ వివరణను చెప్పటం. ప్లేటో 'రిపబ్లిక్' కు ఇచ్చిన ఉపమానాన్ని బట్టి అతడు ధర్మానికెంత ప్రాధాన్యమిచ్చినాడో స్పష్టంగా తెలుస్తుంది. దానిని ధర్మానికి సంబంధించిన గ్రంథంగా ప్లేటో పేర్కొన్నాడు. ఈ గ్రంథంలో ప్లేటో, ధర్మమంటే ఏమిటి ? దాని స్వభావం ఏమిటి ? అనే ప్రశ్నలకు సమాధానాల కోసం గ్రీకు సంప్రదాయవాదులను సమీక్షించి చివరకు తన అభిప్రాయాలను వ్యక్తీకరించినాడు. ప్లేటో వాటిని సోక్రటీస్, అతని అనుచరుల సంభాషణల రూపంలో ప్రస్తావించి, విమర్శనాత్మకంగా పరిశీలించి తిరస్కరించినాడు.

**2.4.1 కెఫాలస్ సిద్ధాంతం :**

దీనిలో సాంప్రదాయకవాదాన్ని అనుసరించి ధర్మాన్ని నిర్వచించడం జరిగింది. కెఫాలస్ ఏథెన్స్‌లో నివసించే ఒక ధనిక వర్తకుడు. అతని అభిప్రాయంలో సత్యం పలుకుట, ఎవరికి ఇవ్వాల్సింది (ఋణం) వారికి ఇవ్వటమే (తీర్చటం)' ధర్మం. కెఫాలస్ సిద్ధాంతాన్ని సోక్రటీస్ (ప్లేటో) అంగీకరించకపోవటంతో అతని కుమారుడు పాలిమార్కస్ తండ్రి అభిప్రాయాన్ని కొద్దిగా మార్పుచేసి తన నిర్వచనాన్ని ఈ విధంగా చెప్పినాడు. 'ఎవరికి ఏది ఇవ్వదగినదో దానిని ఇవ్వటమే ధర్మం' అంటే మిత్రుడికి మేలుచేయటం, శత్రువుకి కీడుచేయటమే ధర్మం. కాని దీనిని ప్లేటో అంగీకరించలేదు. శత్రువులు, మిత్రులు కాలంతోబాటు మారుతుంటారు. నిన్నటి శత్రువు నేటి మిత్రుడు కావచ్చు. అదేవిధంగా నేటి మిత్రుడు రేపటి శత్రువు కావచ్చు. ప్లేటో వాదననుసరించి ధర్మం అందరికి సమానంగా వర్తిస్తుంది. శత్రువులకైనా హాని చేయటం నైతిక సూత్రాలకు విరుద్ధమని ప్లేటో వాదన.

**2.4.2 త్రాసిమాకస్ సిద్ధాంతం :**

త్రాసిమాకస్ సోఫిస్ట్ తత్త్వవేత్త, తీవ్రవాది. నైతిక బాధ్యతల పట్ల అతనికి విశ్వాసం లేదు. అందువలన బలవంతుని స్వప్రయోజనమే ధర్మం' అని వాదిస్తాడు. ఈ వాదన ప్రకారం బలవంతుడు తన ప్రయోజనం కోసం ఉద్దేశించినదే ధర్మం అవుతుంది. అందువలన ధర్మం అంటే, తప్పనిసరి అయినప్పుడు అధికారికి విధేయత చూపించటం, వీలైనప్పుడు దానికి విరుద్ధంగా స్వీయ ప్రయోజనాలకోసం ప్రయత్నించటం. ప్లేటో అభిప్రాయంలో ప్రభుత్వ నిర్వహణ ఒక కళ. ప్రతి కళ దానియొక్క కళావస్తువు ప్రయోజనాన్ని కోరుతుంది. అదేవిధంగా ప్రభుత్వ పాలన కూడా ప్రజల ప్రయోజనంకోసం పాటుపడటమే ధర్మమని ప్లేటో వివరించినాడు.

**2.4.3. గ్లాకన్ సిద్ధాంతం :**

గ్లాకన్ అభిప్రాయంలో బలహీనుల శ్రేయస్సుకోసం ఏర్పడిందే ధర్మం. భయంవల్ల బలహీనులు ధర్మంనుంచి రక్షణ పొందుతారు. సమాజం ప్రారంభ దశలో చట్టం, ప్రభుత్వం లేనందువలన తన ఇష్టానుసారం వ్యవహరించటానికి వ్యక్తికి స్వేచ్ఛ ఉండేది. అందువలన బలవంతులు బలహీనులను అణచి, తమ ప్రయోజనాలను సాధించుకునేవారు. అటువంటి దోపిడి నుండి కాపాడుకొనే ఉద్దేశంతో బలహీనులందరు కలిసి ఒక ఒడంబడిక ద్వారా ప్రభుత్వాన్ని, చట్టాన్ని ఏర్పరచుకున్నారు. దీని ద్వారా చట్ట సమ్మతమైన చర్యను ప్రబోధించినారు. అటువంటి చర్యలద్వారా ప్రజలు రక్షణ పొందారు. ఈ విధంగా భయం, అభద్రతా భావంవల్ల ధర్మం జనించిందని గ్లాకన్ వాదించినారు. ఈ విధంగా అమలులోనికి వచ్చిన ధర్మం కృత్రిమమైనది, అసహజమైనది. గ్లాకన్ సిద్ధాంతాన్ని కూడా ప్లేటో అంగీకరించలేదు.

పై మూడు సిద్ధాంతాల ప్రకారం ధర్మం మానవుని బాహ్యాచర్యలకు సంబంధించినది. ఈ సిద్ధాంతాలన్నింటిని విమర్శనాత్మకంగా పరిశీలించిన తరువాత ప్లేటో తన ధర్మసిద్ధాంతాన్ని వివరించినాడు.

**2.4.4. ప్లేటో ధర్మ సిద్ధాంతం :**

ప్లేటో రాజనీతి తత్త్వంలో ధర్మ సిద్ధాంతం అత్యంత కీలకమైనది. అతని భావాలన్నింటికి ఇది పునాది వంటిది. ప్లేటో వ్యక్తికి, సమాజానికి మధ్య సామ్యాన్ని ధర్మం ద్వారా వివరించినాడు. ప్లేటో అభిప్రాయంలో ధర్మం వ్యక్తి అంతరంగానికి, సమాజానికి సంబంధించినది. ప్రతి వ్యక్తిలో మూడు గుణాలుంటాయని ప్లేటో భావన. అవి, హేతువు, ధీరత్వం, ఇచ్ఛ. వీటితోబాటు ధర్మం అనే నాల్గవ గుణం కూడా ఉంటుంది. ధర్మం మిగిలిన మూడు గుణాలను సమతుల్యంగా ఉంచుతుంది. హేతువు, బుద్ధి బలం ఎక్కువగా కలవారు పాలకులుగా, ధీరత్వం కలిగినవారు సైనికవర్గంగా, ఇచ్ఛ లేదా కోరికలను ప్రతిబింబించేవారు శ్రామికవర్గంగా వ్యవహరిస్తారు.

వ్యక్తి సామర్థ్యాన్నిబట్టి, అతనికిచ్చే శిక్షణననుసరించి అతనికప్పగించిన పనిని నిజాయితీతో నిర్వర్తించటమే ఆ వ్యక్తి ధర్మమని ప్లేటో అభిప్రాయపడినాడు. ధర్మానికి సామాజిక రూపంకూడా యుంటుందని ప్లేటో పేర్కొన్నాడు. వ్యక్తి విరాట్ స్వరూపమే రాజ్యమంటాడు.

(State is the magnified individual) . కాబట్టి వ్యక్తివలె రాజ్యానికి కూడా పైన పేర్కొన్న నాలుగు గుణాలుంటాయి. ధర్మం వ్యక్తికి, రాజ్యానికి ఒకే రకంగా వర్తిస్తుంది. వ్యక్తికున్న మూడు గుణాలను ప్రాతిపదికగా చేసుకొని ప్లేటో సమాజాన్ని మూడు వర్గాలుగా విభజిస్తాడు. అవి: 1. పాలకులు - వీరికి హేతువు, బుద్ధిబలం ఎక్కువగా ఉంటాయి. జ్ఞాన సంపాదనకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. 2. సైనికులు- వీరికి ధీరత్వం ఎక్కువగా ఉంటుంది. పాలకులు, సైనికులను కలిపి ప్లేటో సంరక్షక వర్గంగా (Guardians) పేర్కొంటాడు, 3. కార్మికులు, కర్షకులు - వీరు భౌతికపరమైన కోర్కెలను ఎక్కువగా కలిగినవారు. వీరు నిర్వహించే కార్యకలాపాలు సమాజం యొక్క భౌతిక అవసరాలను తీర్చటానికి ఎక్కువగా ఉపకరిస్తాయి. వ్యక్తులకున్న శక్తి సామర్థ్యాలను ఆధారంగా చేసికొని ప్లేటో ఈ మూడు వర్గాలను గుర్తించినాడు.

ప్లేటో దృష్టిలో ' ధర్మం అనగా సమన్వయం'. సమాజంలో ఉన్న మూడు వర్గాలలో ప్రతి వర్గం ఇతర వర్గాల కార్యకలాపాలల్లో జోక్యంచేసుకోకుండా సామాజిక శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని ఆ వర్గాలకు సంబంధించిన కార్యక్రమాలను నిర్వహించటమే ధర్మం. జోక్యంచేసుకున్నట్లైతే ధర్మభంగం జరుగును. అధర్మం తలెత్తును. కాబట్టి సామాజిక వర్గాల మధ్య సహకారం, సమన్వయం ఉండవలయును. పరస్పర విభేధాలతో తొణికిసలాడే సమాజం బలహీనతకు తార్కాణం. ధర్మాన్ని పాటించటంవలన ఇటువంటి పరిస్థితిని నివారించవచ్చునని ప్లేటో వివరించినాడు. బుద్ధి బలంగల పాలకుల ఆదేశాలను సైనికులు, కార్మిక-కర్షక వర్గం పాటించవలెను. అటువంటి సమాజంలో సామరస్యంతో కూడిన సంబంధాలుంటాయి. సాధారణ మంచిని సాధించటం సాధ్యమౌతుంది.

### 2.4.5. ప్లేటో ధర్మ సిద్ధాంతం-విమర్శ :

ప్లేటో ధర్మసిద్ధాంతం అనేక విమర్శలకు లోనైంది. ఈ సిద్ధాంతం ప్రకారం ఒక వ్యక్తి ఒకే వృత్తికి పరిమితమౌతాడు. ఈ రకమైన సంకుచితమైన నియమం కారణంగా వ్యక్తి సమగ్రమైన వ్యక్తిత్వాన్ని రూపొందించుకోజాలరు. అంతేగాక ప్రజలందరూ రాజ్యకార్యకలాపాలలో పాలుపంచుకోలేరు. రాజ్య కార్యకలాపాలు సంరక్షక వర్గానికే పరిమితమౌతాయి. ఈ సిద్ధాంతం మానవ జీవితాన్ని యాంత్రికంగా, చైతన్యరహితంగా, నిస్సారంగా రూపొందిస్తుందని అరిస్టాటిల్ విమర్శించినాడు. ప్లేటో ధర్మసిద్ధాంతం పాలకులకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చింది. ఈ కారణంగా వారు ఇతర వర్గాలపై నిరంకుశంగా పెత్తనం చెలాయించవచ్చు.

ప్లేటో వివరించిన ధర్మసిద్ధాంతం నైతికమైనది. ఆయన చట్టబద్ధమైన ధర్మసిద్ధాంతాన్ని చెప్పలేదు. అందువలన విభిన్న వ్యక్తులమధ్య, వర్గాలమధ్య వివాదాలు, ఘర్షణలు ఏర్పడినప్పుడు వాటిని ఏ విధంగా పరిష్కరించాలో ప్లేటో వివరించలేదు.

## 2.5. ప్లేటో - విద్యా విధానం :

'రిపబ్లిక్' లో ప్లేటో విద్యావిధానానికి ఎక్కువ ప్రాధాన్యమిచ్చినాడు. రూసో పేర్కొన్నట్లు 'రిపబ్లిక్' గ్రంథంలో ప్లేటో రాజకీయ విషయాల కన్నా విద్యాబోధక విషయాలకు ఎక్కువ ప్రాధాన్యమిచ్చినాడు. విద్యావిధానం సమాజంలో వైజ్ఞానిక వాతావరణాన్ని సృష్టిస్తుంది. విద్యాబోధన రాజ్యం యొక్క ముఖ్య కర్తవ్యం. ఎందుకంటే మానవస్వభావాన్ని తీర్చిదిద్ది సమాజాన్ని ప్రగతి పథంలో ముందుకు నడపటానికి ప్రభుత్వానికి విద్యావిధానం సరైన సాధనం. ప్లేటోకు 'రాజ్యమే అద్వితీయమైన విద్యాసంస్థ'.

మనుష్యులలో మంచి స్వభావాన్ని కలిగించటమే విద్యయొక్క ముఖ్యోద్దేశ్యం. విద్యఅంటే బాహ్యజ్ఞానాన్ని పెంపొందించుకోవటమే కాదు, మానసిక పరిణితి పొందటం. ప్లేటో అభిప్రాయంలో మానవుడు పరిపూర్ణతను, సమగ్రతను సాధించగలిగే శక్తి సంపన్నుడు. అది విద్యద్వారా అతనికి సాధ్యమౌతుంది.

### 2.5.1. ప్లేటో విద్యావిధానం - ముఖ్య లక్షణాలు :

ప్లేటో అభిప్రాయంలో ' విద్య అనేది ప్రజలను సంస్కరించే సాధనం'. అందువలన ఇది ప్రైవేటు వ్యక్తుల అజమాయిషీలో ఉండరాదు. ప్రభుత్వ యాజమాన్యంలో నిర్బంధ విద్యావిధానం ఉండవలెనన్నాడు. ధనిక, బీద, స్త్రీ-పురుష బేధం లేకుండా అందరికి నిర్బంధంగా విద్య నేర్పబడాలి. స్త్రీ-పురుషుల సమానత్వాన్ని ప్లేటో ప్రోత్సహించినాడు. ఇతర గ్రీకు తత్వవేత్తల వలెగాక ప్లేటో, స్త్రీలు

రాజ్యపాలకులు గాను, సైనికులుగాను ఉండటానికి అర్హులంటాడు. అతని విద్యావిధానం క్రమబద్ధమైనది. బాల్యదశలో విజ్ఞాన సముపార్జన కన్నా లోకాన్ని గురించి, మానవులను గురించి ఒక దృక్పథాన్ని ఏర్పరచుకునే పద్ధతిలో విద్యగరపవలె. యౌవనదశలో విద్యకు భౌతిక, వైజ్ఞానిక విషయాలతో సంబంధం యుంటుంది. సంగీత సాహిత్యాలు బుద్ధిని వికసింప చేయటానికి, వ్యాయామం దేహబలాన్ని పెంపొందించటానికి ఉద్దేశించినవి. చివరిదశ అయిన వయోజన దశలో సాధారణ విద్య, వృత్తివిద్య నేర్పటం జరుగుతుంది. ఒక వ్యక్తి తన అభిరుచిని, శక్తి సామర్ధ్యాలను బట్టి ఉపయుక్తమైన వృత్తిని అనుసరించటానికి విద్యతోడ్పడవలె. ప్లేటో విద్యావిధానంలో రెండు భాగాలున్నాయి. 1. ప్రాథమిక విద్య, 2. ఉన్నత విద్య.

### 2.5.2. ప్లేటో విద్యావిధానం-ప్రాథమిక విద్య :

ప్లేటో అభిప్రాయంలో ప్రాథమిక విద్య, విద్యార్ధికి 18 సంవత్సరాల వయస్సు వరకు కొనసాగుతుంది. ప్రాథమిక దశలో విద్య శరీర వ్యాయామానికి, మేథాసంపత్తికి సంబంధించి ఉండాలి. నైతిక పునాదులు వేయటానికి అవకాశం కల్పించాలి. శారీరక పటుత్వం పెంపుదలకు, మానసిక వికాసానికి అధిక ప్రాముఖ్యత ఇవ్వాలి. వీటితోబాటు మంచి అలవాట్లు, వ్యవహార పద్ధతులను కూడా బోధించాలి.

ప్రతి పాఠశాలలో వ్యాయామశాల, ఆటస్థలం ఉండాలి. ఆటపాటలతో బాటు సంగీతం, సాహిత్యాలను కూడా బోధించాలని ప్లేటో సూచించినాడు. వ్యాయామం శారీక ధారుడ్యాన్ని, క్రమశిక్షణను పెంపొందిస్తే, సంగీత, సాహిత్యాలు మానసిక వికాసానికి తోడ్పడతాయి. 18 నుండి 20 సంవత్సరాల మధ్య కాలంలో వ్యాయామ విద్యతోబాటు సైనిక శిక్షణకూడా ఇవ్వాలి. దీనివలన ధైర్యం, నిగ్రహాలన అలవర్చుకోవటానికి అవకాశం ఉంటుంది.

### 2.5.3. ప్లేటో విద్యావిధానం-ఉన్నత విద్య :

ప్రాథమిక విద్యను పూర్తి చేసిన విద్యార్థులకు 20 సంవత్సరాల వయస్సురాగానే ఒక ప్రవేశ పరీక్షను నిర్వహించి, అందులో ఉత్తీర్ణులైన వారివే ఉన్నత విద్యాభ్యాసానికి ఎంపిక చేశారు. ఈ పరీక్షలో తప్పినవారు కర్షకులు, కార్మికులుగా వ్యవహరిస్తారు. ఉన్నతవిద్య రెండు దశలలో నిర్వహించబడుతుంది. 20 నుండి 30 సంవత్సరాల వయస్సువరకు ఒక దశ, 30నుండి 35 సంవత్సరాలవరకు రెండ దశ.

ఉన్నతవిద్య మొదటి దశలో స్త్రీ పురుషులకు సమానంగా క్రమబద్ధమైన శాస్త్రీయవిద్యను బోధిస్తారు. ఈ దశలో గణితం ఇతర అధ్యయనాలతోబాటు తర్కం, హేతువాద ప్రక్రియలు, పాండిత్యం మొదలైన అంశాలతో కూడా శిక్షణ ఉంటుంది. వాటితోబాటు ప్రభుత్వంలోని వివిధ శాఖలకు సంబంధించి వృత్తిపరమైన శిక్షణ ఉంటుంది. ప్లేటో విద్య విషయంలో స్త్రీ పురుషుల సమానత్వాన్ని ప్రతిపాదించినాడు. ఆనాటి గ్రీకు సమాజంలో స్త్రీలు అనాదరణకు గురైనారు. వారికి బానిసల కంటె కొంత మెరుగైన పరిస్థితి మాత్రమే ఉండేది. ప్లేటో అభిప్రాయంలో శారీరక శక్తిని మినహాయించి, మిగిలిన విషయాలలో స్త్రీలు, పురుషులు సమానమే. అందువలన పురుషులవలెనే స్త్రీలు కూడ ఉన్నతవిద్యకు అర్హులని ప్లేటో భావన. స్త్రీలకు విద్యను నిరాకరించటం అనేరాజ్యం తన ప్రజల శక్తిలో సగం శక్తిని కోల్పోవటమే. పరిమిత జనాభా కలిగిన ఆనాటి గ్రీకు నగర రాజ్యాలలో పౌరుల సంఖ్య అల్పంగా యుండుటవలన అర్హులు, మేథాసంపత్తికలిగిన స్త్రీలకు విద్య, ఇతర రంగాలలో శిక్షణ ఇచ్చినచో వారి సేవలను కూడా ప్రభుత్వం వినియోగించుకొనవచ్చును. ఆ విధంగా నిర్బంధ విద్యా విధానాన్ని ప్రతిపాదించటం ద్వారా ప్లేటో సార్వజనీన విద్యను ప్రతిపాదించిన మొదటి రాజనీతి తత్త్వవేత్త అయినాడు.

ఉన్నతవిద్య మొదటి దశ పూర్తైన తర్వాత 30 సంవత్సరాల వయస్సులో మరో పోటీ పరీక్షను నిర్వహిస్తారు. ఈ పరీక్షలో తప్పినవారిని ప్రభుత్వాధికారులుగా, సైనికాధికారులుగా నియమిస్తారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైనవారికి మరో 5 సం॥లు శిక్షణ ఇచ్చి వారిని తాత్త్విక ప్రభువులుగా ప్రకటిస్తారు. వీరికి తర్కం, గణిత శాస్త్రం మొదలైన శాస్త్రాలలో అత్యున్నతంగా విద్యాబోధన, శిక్షణ ఇస్తారు. వీరు 50 సంవత్సరాల వయస్సువరకు ఆ పదవిలో కొనసాగుతారు. ఆ తరువాత పదవీ విరమణ అనంతరం వీరు సుప్రీం

కౌన్సిల్ లో సభ్యులుగా కొనసాగుతూ, రాజకీయ సిద్ధాంతం, ప్రభుత్వ నిర్వహణలకు సంబంధించిన వాస్తవ సమస్యలను అధ్యయనం చేస్తారు. ఈ విధంగా దేశ పాలనకు సమర్థులైన నాయకులను రూపొందించటమే ప్లేటో విద్యావిధానం యొక్క ముఖ్య లక్షణం.

### 2.5.4. ప్లేటో విద్యావిధానం-విమర్శ :

ప్లేటో విద్యావిధానాన్ని ప్రజాస్వామికవాదులు సమర్థించజాలరు. విద్యావకాశాలను పాలకవర్గం లేదా సంరక్షక వర్గానికే ప్లేటో పరిమితం చేసినాడు. సమాజంలో అధిక సంఖ్యాకులైన, ఇచ్ఛ్రప్రాతిపదికనగలిగిన సామాన్యప్రజానీకానికి కూడా విద్యావకాశాలను కల్పించకపోవటం ప్లేటో విద్యావిధానంలోని లోపమని విమర్శకుల భావన. అదేవిధంగా ప్లేటో విద్యావిధానంలో వృత్తి, సాంకేతిక విద్యలకు స్థానంలేదు. ఈరకమైన విమర్శలు ఉన్నప్పటికీ ఆనాటి సమకాలీన గ్రీకు సమాజంలో నెలకొనిఉన్న అస్థిర, అరాచక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్లేటో ఈ విద్యావిధానాన్ని రూపొందించాడని చెప్పవచ్చు.

## 2.6. ప్లేటో-కమ్యూనిజం :

ప్లేటో 'రిపబ్లిక్' లో ఆదర్శ రాజ్యాన్ని గురించి వివరిస్తూ 'కమ్యూనిజాన్ని' ప్రతిపాదించినాడు. ఇది పాలక వర్గంవారికి మాత్రమే వర్తిస్తుంది. అంటే తాత్విక ప్రభువులకు, సైనికులకు మాత్రమే వర్తిస్తుంది. ప్లేటో విద్యావిధానం వైజ్ఞానిక వాతావరణాన్ని సృష్టిస్తే, కమ్యూనిజం మంచి ఆర్థిక వాతావరణాన్ని కల్పిస్తుంది. పౌరులలో ఆర్థిక వ్యత్యాసాలు ఎక్కువగా ఉంటే రాజకీయ విప్లవాలకు దారితీస్తాయని ప్లేటో విశ్వసించినాడు.

ప్లేటో అభిప్రాయంలో రాజ్య ప్రయోజనాలకోసం పాలకవర్గం నిరంతరం చిత్తశుద్ధితో, ఏకాగ్రతతో పనిచేయాలంటే వారికి ఎటువంటి బాహ్య ఆసక్తులు, ప్రతిబంధకాలు ఉండరాదు. సమాజంలో మానవుని స్వార్థాన్ని పెంచే అంశాలుగా రెండింటిని ప్లేటో గుర్తించినాడు. అవి 1. సొంత ఆస్థి, 2. సొంత కుటుంబం. ఆస్తి మానవునిలో ఆశలను, స్వార్థాన్ని పెంపొందిస్తుంది. కుటుంబం బంధు ప్రీతిని ప్రోత్సహిస్తుంది. అందువలన ప్లేటో ఆదర్శ రాజ్యంలో పాలక, సైనిక వర్గాలకు సొంత ఆస్థిని, వ్యక్తిగత కుటుంబాన్ని నిషేధించినాడు. ఈ విధంగా నిషేధించటాన్నే ప్లేటో కమ్యూనిస్టు సిద్ధాంతంగా పేర్కొంటాడు. ఇది ఒక కొత్తసామాజిక విధానం. ప్లేటో కమ్యూనిజం 'ఇచ్ఛ' ప్రాతిపదికగాగల మూడవవర్గానికి చెందిన సామాన్య ప్రజలకు వర్తించదు. వారికి సొంత ఆస్థి, సొంత కుటుంబం ఉండవచ్చు.

ప్లేటో కమ్యూనిజం రెండు రూపాలుగా యుంటుంది. అవి : 1. ప్రైవేట్ ఆస్థి నిషేధం, 2. ప్రైవేట్ కుటుంబ వ్యవస్థ నిర్మూలనం. ప్లేటో ఆదర్శ రాజ్యంలో పాలకులకు, సైనికులకు సొంత ఆస్థిని నిషేధించినాడు. రాజ్యాధికారం, ఆర్థిక సంపద రెండూ ఒకరికే ఇస్తే దుర్వినియోగపరిచే ప్రమాదముందని ప్లేటో గుర్తించినాడు. కాబట్టి పాలకులందరూ సాముదాయక వసతి గృహాలలో నివసిస్తూ, సాముదాయక భోజనశాలలో భుజిస్తూ యుండవలె. పాలకులు, సైనికులు వారి జీవితాలను రాజ్యానికే అర్పించి నిస్వార్థంగా ప్రజాసేవచేస్తూ యుండవలె. ప్రైవేట్ ఆస్థి స్వార్థాన్ని పెంచుతుంది. నిజమైన ప్రజాసేవకునికి ఇది ఒక ప్రతిబంధకం. కాబట్టి ప్లేటో ప్రైవేటు ఆస్థిని నిర్మూలించటానికి కమ్యూనిజంను రూపొందించినాడు.

ప్రైవేట్ కుటుంబవ్యవస్థ ఆస్థి కాంక్షను, స్వార్థాన్ని పెంపొందిస్తుంది. కాబట్టి ప్లేటో ప్రైవేట్ కుటుంబ వ్యవస్థలను కూడా పాలకులకు నిషేధించినాడు. సొంత కుటుంబం బంధుప్రీతికి దారితీస్తుంది, నిస్వార్థ సేవకు ఆటంకం అవుతుంది. పాలకవర్గానికి చెందిన ఏ వ్యక్తికీ 'నా కుటుంబం, నా భార్య, నా పిల్లలు' అనే భావం ఉండరాదని ప్లేటో భావించినాడు. పాలకవర్గానికి చెందిన వారెవరూ శాశ్వత వివాహాలు చేసికోకూడదు. దీనినే 'భార్యల విషయంలో కమ్యూనిజం' అంటారు.

ప్లేటో ప్రతిపాదించిన భార్యల కమ్యూనిజంలో రెండు అంశాలున్నాయి. అవి : 1. సాంప్రదాయక వివాహ వ్యవస్థను సంస్కరించటం, 2. స్త్రీలకు స్వాతంత్ర్యాన్ని కల్పించటం. సాంప్రదాయక వివాహ వ్యవస్థను సమూలంగా సంస్కరించటానికి ప్లేటో పూనుకున్నాడు. శాశ్వతమైన వివాహ వ్యవస్థను, ఏకపత్నీ వివాహాలను రద్దుచేసి వాటిస్థానంలో తాత్కాలికంగా భార్యాభర్తలుగా వ్యవహరించే పద్ధతిని ప్రవేశ పెట్టినాడు. శాశ్వతమైన కుటుంబ వ్యవస్థయుంటే పాలకులలో స్వార్థం పెరుగుతుంది. కాబట్టి ప్లేటో వ్యక్తిగతమైన వివాహాలను నిషేధించినాడు.

కాని రాజ్యపాలనకు ఉత్తమ శ్రేణికి చెందిన పాలకులు అవసరం. అందువలన పాలకవర్గానికి చెందిన ఉత్తమ స్త్రీ, పురుషులు తాత్కాలికంగా కొంతకాలానికి దంపతులుగా వ్యవహరించాలని ప్లేటో సూచించినాడు. అటువంటి దాంపత్యజీవితంవలన ఆరోగ్యవంతమైన మంచి సంతతి కలుగుతుంది. తాత్కాలిక వివాహాలు రాజ్యానికి అత్యంత లాభదాయకమని ప్లేటో భావించినాడు. వాటి ఫలితంగా జన్మించిన శిశువులను ప్రభుత్వ శిశుసంరక్షక కేంద్రాలలో ఉంచి తగిన విద్యాబోధన చేసి వారిని ఆదర్శ పౌరులుగా తీర్చిదిద్దాలి. దీనివలన తల్లిదండ్రులకు వారి సంతతిని గుర్తించటానికి కాని, సంతతికి వారి తల్లిదండ్రులను గురించి తెలుసుకోవటానికి కాని సాధ్యపడదు. ఈ కారణంగా పాలకవర్గంలోని సభ్యుల మధ్య సామరస్యం, ఐకమత్యం పెరిగి ఒకే కుటుంబంలా వ్యవహరిస్తారని ప్లేటో విశ్వసించినాడు.

ప్లేటోను రాజనీతి తత్త్వశాస్త్ర చరిత్రలో మొట్టమొదటి స్త్రీ స్వాతంత్ర్యవాదిగా పరిగణించవచ్చు. ఈతడు స్త్రీ పురుష సమానత్వాన్ని బాహాటంగా చాటిచెప్పినాడు. సమకాలీన గ్రీకు సమాజంలో స్త్రీలపట్ల చూపే నిరాదరణను గర్హించినాడు. ప్లేటో అభిప్రాయంలో స్త్రీలు పరదాల మాటున ఉండకుండా పురుషులతో కలిసి ధర్మాన్ని తప్పకుండా జీవించవలెను. వారికి పురుషులతో సమానంగా సంగీత సాహిత్యాలు, వ్యాయామం, యుద్ధవిద్య నేర్పించవలెను. ఈ విధంగా చేస్తే దేశానికి వారిసేవకూడా అందుబాటులో యుంటుంది. భార్యల కమ్యూనిజం ద్వారా ప్లేటో స్త్రీ, పురుషుల సమానత్వాన్ని అంగీకరించినాడు.

### 2.6.1. ప్లేటో కమ్యూనిజం - విమర్శ :

ప్లేటో వివరించిన కమ్యూనిస్టు సిద్ధాంతం అనేక విమర్శలకు లోనైంది. అరిస్టాటిల్ దీనిని తీవ్రంగా వ్యతిరేకించినాడు. అరిస్టాటిల్ అభిప్రాయంలో రాజ్యానికి పునాది కుటుంబం. ప్లేటో రాజ్యనిర్వాహణలో కుటుంబం యొక్క పాత్రను గుర్తించలేదు. అదేవిధంగా వ్యక్తిగత ఆస్థి సక్రమ సామాజిక జీవనానికి అత్యంత ఆవశ్యకము. 'సామూహిక ఆస్థి సామాజిక నిర్లక్ష్యానికి గురౌతుంది. అని అరిస్టాటిల్ వాదించినాడు. మానవ చరిత్రను పరిశీలిస్తే ప్రైవేట్ ఆస్థి, కుటుంబం అనేవి అనాదిగా ఉంటున్న వ్యవస్థలే. కాని వాటి ప్రాధాన్యతను ప్లేటో గుర్తించలేకపోయినాడని విమర్శకుల భావన.

ప్లేటో కమ్యూనిజం మానవ స్వభావానికి, సామాజిక విలువలకు వ్యతిరేకంగా ఉంది. తాత్కాలిక వివాహాలు లేక దాంపత్య పద్ధతి ఆచరణ సాధ్యంకానిది. ఇది అక్రమసంబంధాలకు దారితీస్తుంది. రాజ్యమే తాత్కాలిక భార్యాభర్తలను ఏర్పాటుచేయటంచాలా కష్టతరమైనది. వారికి జన్మించిన ఉమ్మడి సంతానాన్ని అందరూ ఉపేక్షిస్తారు. దీనితో ఆ తరువాతి తరాలవారు ఇంకా చెడిపోయే ప్రమాదముంది.

### 2.6.2. ప్లేటో కమ్యూనిజం-ఆధువిక కమ్యూనిజం :

'కమ్యూనిజం' అనే భావనను మొట్టమొదట చర్చించి, వివరించిన వాడు ప్లేటో. అయినప్పటికి ప్లేటో కమ్యూనిజానికి, ఆధునిక కమ్యూనిజానికి కొన్ని బేధాలున్నాయి. ఆధునిక కమ్యూనిజాన్ని జర్మనీ తత్త్వవేత్త కార్ల్‌మార్క్స్ 1848లో ప్రతిపాదించినాడు. ప్లేటో కమ్యూనిజం పాలకవర్గాలకే పరిమితమైతే ఆధునిక కమ్యూనిజం రాజ్యంలోని ప్రజలందరికి వర్తిస్తుంది. ఆర్థిక సమానత్వంతో ప్రజలందరూ జీవించాలని మార్క్స్ చెప్పినాడు. ప్లేటో వాదం భూమి, స్థిరాస్థి మొదలైన వాటిని సమానంగా త్యాగం చేయుమంటుంది. ఆధునిక కమ్యూనిజం వీటిని సమానంగా పంచమంటుంది. ప్లేటో సిద్ధాంతంలో సామాజిక వర్గాలుంటాయి. సామాన్య ప్రజానీకానికి ప్రైవేట్ ఆస్థిని, కుటుంబాన్ని ప్లేటో అనుమతించినాడు. దీనికి భిన్నంగా మార్క్సువర్గరహిత సమాజాన్ని ఊహించినాడు. ఉత్పత్తి సాధనాలు సామాజీకరణ చెందాలని వాదించినాడు. ప్లేటో సిద్ధాంతంలో రాజ్యం కొనసాగుతుంది. మార్క్స్ సిద్ధాంతం ప్రకారం వర్గరహిత సమాజం ఏర్పడిన తరువాత రాజ్యం క్రమేణా అంతర్థానమై పోతుంది.

## 2.7. ప్లేటో-ఆదర్శ రాజ్యం :

ప్లేటో 'రిపబ్లిక్' లో ఒక ఉత్తమోత్తమమైన ఆదర్శ రాజ్యాన్ని ఊహించి వివరించినాడు. ఇది ఇతర రాజ్యాలన్నింటికి మార్గదర్శకంగా యుండే ఒక నమూనా రాజ్యం. ఇది వాస్తవానికి ఆచరణ సాధ్యంకాదు. కాని వాస్తవ రాజ్యాలకు ఇది ఆదర్శవంతమైన రాజ్యం. దీనిని ఆదర్శంగా తీసికొని వాస్తవరాజ్యాలు వీలైనంత వరకు దోషరహిత రాజ్యాలుగా రూపొందించటానికి ప్రయత్నించాలనేది ప్లేటో భావనగా

కన్పడుతుంది. ఆదర్శ రాజ్యమంటే ఎట్లాఉండాలో, దానికి ఉండవలసిన లక్షణాలేమిటో ప్లేటో తన రిపబ్లిక్‌లో చాలా రమ్యంగా, వివరంగా వర్ణించినాడు.

ప్లేటో అభిప్రాయంలో 'రాజ్యం వ్యక్తి విరాట్ స్వరూపం'. వ్యక్తి క్షేమానికి, రాజ్య క్షేమానికి మధ్య ఎటువంటి సంఘర్షణ లేదు. వివేకవంతుడైన వ్యక్తి ప్రతి స్వరూపమే రాజ్యం. వ్యక్తికి, రాజ్యానికి అవినాభావ సంబంధముంది. పైథాగరస్ సిద్ధాంతాన్ని అనుసరించి ప్లేటో, మానవుడు త్రిగుణ స్వభావుడంటాడు. అతనిలో హేతువు, ధీరత్వం, ఇచ్ఛ అనే మూడు గుణాలుంటాయి. ఇవి ఒక వ్యక్తిలో సమపాళ్ళలో యుండి వాటిమధ్య సమన్వయం ఏర్పడినప్పుడు అతడు ధర్మబద్ధంగా వ్యవహరించగులుగుతాడు. హేతువు వ్యక్తికి విజ్ఞానాన్ని, విచక్షణా జ్ఞానాన్ని యిస్తుంది. వాటి ఆధారంగా అతడు తన ఉద్వేగాలను నిగ్రహించుకొని, ఇచ్ఛలను పరిమితం చేసుకున్నప్పుడు ఉత్తమ జీవి అవుతాడు. ధర్మబద్ధుడుగా జీవిస్తాడు.

వ్యక్తిలోని మూడు గుణాలు రాజ్యంలోకూడా కన్పిస్తాయి. రాజ్యంలో మూడు వర్గాల ద్వారా ఇవి ప్రతిబింబిస్తాయి. హేతువు ప్రతినిధిగా పాలకవర్గం, ధీరత్వానికి సైనికవర్గం, ఇచ్ఛలేదా మానవ అవసరాలకు శ్రామికవర్గం ప్రతీకలు. ఈవిధంగా ప్లేటో వ్యక్తివిరాట్ స్వరూపమే రాజ్యమంటాడు. ఈ మూడు వర్గాల మధ్య వారి వారి గుణాలను బట్టి ప్లేటో పని విభజన చేసినాడు. పాలకుల రాజ్యపాలన, సైనికులకు రాజ్య రక్షణ, శ్రామికులకు ఆహారధాన్యాలు, ఇతర జీవితావసరాలను ఉత్పత్తిచేసి సరఫరా చేయటం అప్పగించినాడు. ఈ మూడు వర్గాలవారు వారికి కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించాలి. ఏ ఒక వర్గం ఇతర వర్గాల కార్యకలాపాలలో జోక్యం చేసికొనరాదు. ఆవిధంగా ప్లేటో రాజకీయాధికారాన్ని పాలకులకు, సైనికులకు కేటాయిస్తే, ఆర్థికాధికారాన్ని శ్రామికులకు అప్పగించటంద్వారా ఒకరిపై ఒకరు ఆధారపడేటట్లు తన సిద్ధాంతాన్ని రూపొందించినాడు.

### 2.7.1. వృత్తినైపుణ్య సిద్ధాంతం :

ప్లేటో ఆదర్శరాజ్యం వ్యక్తుల, వర్గాల వృత్తినైపుణ్యం మీద ఆధారపడివుంటుంది. 'జ్ఞానమేసుగుణం' అన్న సోక్రటీస్ సిద్ధాంతంనుంచి వృత్తి నైపుణ్య సిద్ధాంతం జనించింది. సంఘం వ్యక్తుల సమూహం. వ్యక్తుల విభిన్న అవసరాలను తీర్చటానికి శ్రమవిభజన అవసరమైంది. సమాజంలోని వృత్తులను అనుసరించి రాజ్యంలోని ప్రజలను మూడు వర్గాలుగా-రక్షకులు, సైనికులు, శ్రామికులుగా విభజించటం జరిగింది. ఈ మూడు వర్గాలు ఎవరిపని వారు చేసుకుంటూ, పరస్పర సహకారంతో సమాజావసరాలను తీర్చవలెను. ప్లేటో అభిప్రాయంలో శ్రమవిభజన, వృత్తి నైపుణ్యం, పరస్పర సహకారం ఆదర్శ రాజ్యంలో సంఘభావాన్ని, ఏకత్వాన్ని నెలకొల్పుతాయి. అత్యున్నత శ్రేణిలో యున్న రక్షకుల (పాలకుల) ఆజ్ఞలను సైనికులు, శ్రామికులు పాటించాలి. సైనికుల ఆదేశాలను శ్రామికులు గౌరవించాలి. ఈవిధంగా ఒక వర్గం ఇంకొక వర్గాన్ని నియంత్రిస్తూ సమాజ అవసరాలను తీర్చాలి.

### 2.7.2. ప్లేటో ఆదర్శ రాజ్యం-తత్వవేత్తలే పాలకులు :

ప్లేటో ఆదర్శరాజ్యంలో తాత్వికరాజుకు ప్రముఖ స్థానాన్ని ఇచ్చినాడు. తత్వవేత్తలే పాలకులు కావటమో లేదా రాజులు, యువరాజులు తాత్విక దృష్టి సంపన్నులు కావటమో జరగనంతవరకు నగర రాజ్యాలలోని దోషాలు నివృత్తి కావని ప్లేటో భావించినాడు. రాజ్యాధికారం తత్వవేత్తల ఆధీనంలోనే యుండాలని ప్లేటో బలంగా విశ్వసించినాడు. 'జ్ఞానమే సుగుణ' మన్న స్ఫూర్తి ననుసరించి తత్వవేత్తలు జ్ఞాన సంపన్నులు, సుగుణవంతులు అయిఉంటారు. వారే రాజ్యంలో అరాచకత్వాన్ని, అసమర్థతను, స్వార్థబుద్ధిని నిర్మూలించి ఆదర్శవంతమైన పాలనను ఇవ్వగలుగుతారు. ధర్మబద్ధంగా రాజ్యకార్యకలాపాలను నిర్వహించగలుగుతారు. సమకాలీన గ్రీకు నగర రాజ్యాలలోని అరాచక పరిస్థితులను, అస్తవ్యస్థపాలనను దృష్టిలో పెట్టుకొని ప్లేటో, వాటిని చక్కదిద్దటానికి తాత్విక రాజుల పాలనే ఏకైక మార్గమని సూచించినాడు.

ఆదర్శరాజ్యంలో పాలకులు తమ శక్తి, సమర్థ్యాలను పూర్తిగా సమాజాభివృద్ధికే వినియోగించాలని ప్లేటో భావించినాడు. వారు తమ కర్తవ్య నిర్వహణలో ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా చేయటానికే ప్లేటో పాలకవర్గానికి వ్యక్తిగత ఆస్థి, కుటుంబ వ్యవస్థలన

నిషేధించినాడు. వారికి సరైన శిక్షణ ఇవ్వటానికి, సమర్దులైన పాలకులను ఎంపిక చేయటానికి ఒక సమగ్రమైన, సుదీర్ఘమైన విద్యావిధానాన్ని రూపొందించినాడు. ఇతర వృత్తుల వలనే పాలనకూడా ఒక నిర్దిష్టమైన నిపుణతతో కూడిన ఒక వృత్తి. పాలన ముఖ్యోద్దేశం సమాజశ్రేయస్సు. కాబట్టి విజ్ఞానవంతులు, సుశిక్షితులు అయిన తత్వవేత్తలు ధర్మబద్దులుగా రాజ్యాధికారాన్ని నిర్వహిస్తారని ప్లేటో వివరించినాడు. వ్యక్తిగత ఆస్థి, ప్రైవేటు కుటుంబంవంటి ప్రతిబంధకాలు లేనందున పాలకులు నిరంతరం ఏకాగ్రతతో పాలనకు అంకితమౌతారని ప్లేటో భావించినాడు. ఆవిధంగా ఆదర్శరాజ్యంలోని పాలకులు ఎన్నిక ద్వారాకాని, వంశపారంపర్యంగాకాని కాకుండా కేవలం సమర్ధత, అర్హతల ప్రాతిపదికగా అధికారంలోనికి వస్తారని ప్లేటో వివరించినాడు.

### 2.7.3. ప్లేటో ఆదర్శరాజ్యం-విమర్శ :

'రిపబ్లిక్' లో ప్లేటో వివరించిన 'ఆదర్శరాజ్య' భావన ప్రపంచ ప్రసిద్ధి చెందినప్పటికి, దానిలో కొన్ని లోపాలున్నాయని విమర్శకుల భావన. ప్లేటో చెప్పిన ఆదర్శ రాజ్యం ఊహాజనితమైనది. వాస్తవంగా ఆచరణ సాధ్యంకానిది. ఆయన ఆదర్శరాజ్యంలో బానిసత్వాన్ని ఖండించలేదు. సమాజంలో అధిక సంఖ్యాకులుగా యుండే శ్రామిక వర్గాన్ని 'ఇచ్ఛా' వర్గంగా వర్ణించి వారిని పూర్తిగా నిర్లక్ష్యం చేసినాడు. ప్లేటో వివరించిన రాజకీయవ్యవస్థ నిర్మాణం ప్రజాస్వామ్యసిద్ధాంతానికి విరుద్ధమైనది. ఆయన సమాజాన్ని మూడు అసమాన వర్గాలు-పాలకులు, సైనికులు, శ్రామికవర్గం-గా విభజించటమేగాక, అత్యధిక సంఖ్యాకులైన శ్రామికవర్గానికి రాజ్యాధికారంలో భాగస్వామ్యాన్ని కల్గించలేదు. వారిని అధికారానికి దూరంగా ఉంచటం జరిగింది.

ప్లేటో వివరించిన కమ్యూనిస్ట్ సిద్ధాంతాన్ని అరిస్టాటిల్ తీవ్రంగా విమర్శించినాడు. అది మానవ స్వభావానికి విరుద్ధమైనది. కుటుంబం, వ్యక్తిగత ఆస్థి సక్రమ సామాజిక జీవనానికి అత్యంత ఆవశ్యకము. మావన చరిత్రను పరిశీలిస్తే ఇవి రెండూ అనాదిగా ఉంటున్న వ్యవస్థలే. కానివాటి ప్రాధాన్యతను ప్లేటో గుర్తించలేకపోయినాడు. తాత్విక ప్రభువులు కూడా మానవులే కాబట్టి వారికిచ్చిన నిరపేక్ష అధికారాన్ని దుర్వినియోగం చేయరన్న నమ్మకం లేదు.

ప్లేటో విద్యావిధానం సమగ్రంగా, ఆదర్శవంతంగా యున్నప్పటికి అది పాలకవర్గానికే పరిమితమైంది. అధికసంఖ్యాకులైన శ్రామికవర్గానికి విద్యావకాశాలను కల్పించకపోవటం శోచనీయం. వ్యక్తికంటే సమాజానికి, హక్కులకంటే విధులకు ప్లేటో ఎక్కువ ప్రాధాన్యమిచ్చినాడని విమర్శకుల భావన.

ప్లేటో వివరించిన ఆదర్శ రాజ్యంలో ఆచరణ సాధ్యంకాని అంశాలు, లోపాలు ఎన్ని ఉన్నప్పటికి ఈనాటి సమాజానికి వర్తించే ఎన్నో అంశాలు ఉన్నాయని చెప్పక తప్పదు. యోగ్యత ఆధారంగా ప్రభుత్వ ఉద్యోగాల ఎంపిక, స్త్రీ-పురుష సమానత్వం. ప్రభుత్వ నియంత్రణలో విద్య, విద్య ప్రాధాన్యతను గుర్తించటంవంటి ఎన్నో ఆదర్శవంతమైన మంచివిషయాలను గురించి. ప్రాచీనకాలంలోనే ప్లేటో చర్చించినాడు, సమగ్రంగా వివరించినాడు.

## 2.8. ప్లేటో-'స్టేట్స్‌మన్' :

ప్లేటో కొంత అనుభవాన్ని సంపాదించిన తరువాత 'స్టేట్స్‌మన్' (Statesman) అనే గ్రంథాన్ని రచించినాడు. 'రిపబ్లిక్' లో చెప్పిన ఆదర్శాలను కొంతవరకు విడిచిపెట్టి, వాస్తవదృక్పథంతో ఆదర్శప్రాయుడైన రాజ్యాంగవేత్తకు ఉండవలసిన లక్షణాలను గుర్తించి చర్చించినాడు. ఈ గ్రంథంలో తాత్విక ప్రభువు ఆధిక్యతకు బదులు చట్టం ఆధిక్యతను నెలకొల్పాడు. చట్టాన్ని అనుసరించి పాలన జరుగవలెనని వివరించినాడు.

'స్టేట్స్‌మన్' లో ప్లేటో ప్రభుత్వాలను రెండు విధాలు. అవి : 1. శాసనబద్ధమైన ప్రభుత్వాలు, 2. శాసనబద్ధంకాని ప్రభుత్వాలు-గా వర్గీకరించినాడు. దీనిననుసరించి ఆరు రకాలైన ప్రభుత్వాలుంటాయి. వీటిలో రాజరికం, కులీన పాలన, మిత ప్రజాస్వామ్యం (Moderate Democracy) శాసనబద్ధమైన ప్రభుత్వాలు. నిరంకుశపాలన, అల్పజనపాలన, మూకపాలన శాసనబద్ధం కాని ప్రభుత్వాలు. ప్లేటో అభిప్రాయంలో శాసనబద్ధమైన ప్రభుత్వాలలో రాజరికం ఉత్తమమైనది.

## 2.9. ప్లేటో-'దిలాస్' :

ప్లేటో తన అవసాన దశలో వ్రాసిన గ్రంథం 'ది లాస్'(The Laws). వయస్సులోను, అభిప్రాయాలలోను వచ్చిన పరిణితి ఈ గ్రంథంలో మనకు కనపడుతుంది. ఈ గ్రంథంలో కొంతవరకు ఆచరణాత్మకమైన రెండవ ఉత్తమరాజ్యాన్ని (Second Best State) వివరించటానికి ప్లేటో ప్రయత్నించినాడు. దీనితోపాలకుల స్థానంలో చట్టాలకు ఆధిక్యతను కల్పించినాడు. వివిధ ప్రభుత్వాలలోని లోపాలను దృష్టిలో పెట్టుకుని 'ది లాస్' లో ప్లేటో ఒక మిశ్రమరాజ్యాగాన్ని ప్రతిపాదించినాడు. దీనిలో రాజరిక లక్షణాలు, ప్రజాస్వామిక ప్రభుత్వ లక్షణాలు రెండుంటాయి. అదే విధంగా పాలకులకు కూడా కొన్ని సడలింపులను ప్రవేశపెట్టినాడు. 'రిపబ్లిక్'లో పాలకులకు నిషేధించిన వ్యక్తిగత ఆస్థి, కుటుంబ వ్యవస్థలను కొంతవరకు 'ది లాస్'లో అనుమతించినాడు. ప్రభుత్వ నిర్మాణంలో కూడ ప్రజాసభ, కార్యనిర్వాహకమండలి, శాసనరక్షకులు (Guardians of Law) ఉంటారు.

## 2.10. ప్లేటో-విశిష్టత :

ప్రాచీన రాజనీత తత్త్వవేత్తలలో ప్లేటో ప్రథముడు, ప్రముఖుడు. తన గురువైన సోక్రటీస్ భావాలను గ్రంథస్థం చేయటంద్వారా, ఆయన భావజాలాన్ని ఆ తరువాతి తరాలకు అందించిన ఘనత ప్లేటోకే చెందుతుంది. ఆదర్శవాదానికి, తీవ్రవాదానికి ఆయన మూలపురుషుడిగా గుర్తించబడినాడు. ఆదర్శ రాజ్యానికి సంబంధించి ఆయన వెలుబుచ్చిన అభిప్రాయాలు ఆచరణసాధ్యం కానప్పటికి, ఆయన చర్చించిన సమస్యలు వాస్తవమైనవి, సార్వజనీనమైనవి. ఆయన లేవనెత్తిన అంశాలు ఈనాటికి ఉపయుక్తమైనవి. ధర్మంపట్ల, స్త్రీ-పురుష సమానత్వంపట్ల, విద్యావిధానానికి వృత్తి నైపుణ్యసిద్ధాంతానికి సంబంధించి ఆయన వివరించిన భావాలు ఈ నాటికి అనుసరణీయమని చెప్పవచ్చు. ఆ కారణంగానే ఆ తరువాతి తరాలకు చెందిన సర్‌థామస్ మూర్, రూసో, జర్మనీ, ఇంగ్లీషు ఆదర్శవాదులు ప్లేటో భావాలతో ఉత్తేజితులై రచనలు చేసినారు. నేటి సామ్యవాద, కమ్యూనిస్ట్ సిద్ధాంతాలకు కూడా ప్లేటో కమ్యూనిజమే మూలమని చెప్పటం అతిశయోక్తి కాదు.

## 2.11. సారాంశము :

ప్రాచీన గ్రీకు రాజనీతి తత్త్వవేత్తలలో ప్లేటో అగ్రగణ్యుడు. ఆయన అఖండ మేధావి, మహాపండితుడు మాత్రమేగాక రాజ్యవ్యవహారాలలో అపారమైన ప్రజ్ఞ కలిగి ప్రజలదైనందిన జీవిత సమస్యల పట్ల అధికాసక్తిని కనపరచినాడు. ఆయన తాత్త్వికచింతనను ముఖ్యంగా మూడు అంశాలు ఎక్కువగా ప్రభావితం చేసినాయి. అవి : 1. సమకాలీన గ్రీకు సమాజంలోని ఆచార పరిస్థితులు, 2. సోక్రటీస్, బోధనలు, ఆయన మరణించిన తీరు, 3. సోక్రటీస్ మరణానంతరం వివిధ దేశాలలో ఆయన చేసిన పర్యటనలు. ఈ పర్యటనల వలన విభిన్న రాజ్యాంగాలను, ప్రభుత్వాలను, వాటి పనితీరును పరిశీలించటానికి ప్లేటోకు అవకాశం కలిగింది. ఏథెన్స్‌కు తిరిగి వచ్చిన తరువాత ప్లేటో 'అకాడమీ' అనే విద్యాలయాన్ని స్థాపించి, తన శేషజీవితాన్ని విద్యాబోధన, పరిశోధనా వ్యాసంగాలకు అంకితం చేసినాడు.

ప్లేటో రచనలన్నింటిలోనూ 'రిపబ్లిక్' ఉత్కృష్టమైన గ్రంథం. ఇది ఆయనకు అజరామరమైన ఖ్యాతిని సంపాదించింది. దీనిలో ప్లేటో చర్చించిన ప్రధాన అంశం 'ధర్మానికి' అర్థ వివరణను ఇవ్వటం. అందువలననే ప్లేటో దానిని 'ధర్మానికి సంబంధించిన గ్రంథం' గా పేర్కొన్నాడు. ప్లేటో నైతిక దృష్టితో ధర్మాన్ని వివరించినాడు. ధర్మాన్ని ప్రాతిపదికగా చేసికొని ప్లేటో 'రిపబ్లిక్' లో ఆదర్శ రాజ్యాన్ని గురించి వివరించినాడు. 'జ్ఞానమే సుగుణ' మన్న సూక్తిననుసరించి జ్ఞానసంపన్నులైన తత్త్వవేత్తలకే రాజ్యాధికారం అప్పగించాలని ప్లేటో వాదించినాడు. వారు తమ కర్తవ్య నిర్వహణలో ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా, తమశక్తి సామర్థ్యాలను పూర్తిగా సమాజాభివృద్ధికే వెచ్చించటానికి వీలుగా వారికి వ్యక్తిగత ఆస్థి, కుటుంబ వ్యవస్థలను నిషేధించినాన్ని. వారికి సరైన శిక్షణ యివ్వటానికి, సమర్థులైన పాలకులను ఎంపికచేయటానికి వీలుగా ఒక సమగ్రమైన, సుదీర్ఘమైన విద్యావిధానాన్ని రూపొందించినాడు. సమాజంలో సమన్వయాన్ని ·గించటానికి వీలుగా రాజకీయాధికారాన్ని రక్షక వర్గానికి - పాలకులు మరియు సైనికులకు అప్పగించి, ఆర్థికాధికారాన్ని శ్రామిక వర్గం

చేతిలో పెట్టినాడు. ప్లేటో అభిప్రాయంలో అన్ని రంగాలలో స్త్రీపురుషుల సమానత్వం ఉండాలి. పురుషులతో బాటు స్త్రీలకు కూడా సంగీత సాహిత్యాలు, వ్యాయామం నేర్పవలెను. ఆ విధంగా రాజనీతి తత్త్వశాస్త్ర చరిత్రలో ప్లేటో మొట్టమొదటి స్త్రీ స్వాతంత్ర్యవాదిగా గణతి కెక్కినాడు.

## 2.12. నమూనా ప్రశ్నలు :

### (i) వ్యాసరూప ప్రశ్నలు

1. రాజనీతి శాస్త్రానికి ప్లేటో చేసిన సేవలను విమర్శనాత్మకంగా వివరించుము.
2. ప్లేటో 'రిపబ్లిక్' ను ధర్మానికి సంబంధించిన గ్రంథంగా పేర్కొనటం ఎంతవరకు సముచితం ?
3. విద్యావిధానం పై ప్లేటో అభిప్రాయాలను వివరించుము.
4. ఆదర్శ రాజ్యాన్ని సాధించటానికి ప్లేటో కమ్యూనిజం ఏ విధంగా దోహదం చేస్తుంది ?
5. ప్లేటో వివరించిన ఆదర్శ రాజ్య ప్రధాన లక్షణాలను విమర్శనాత్మకంగా పరిశీలించుము.

### (ii) లఘు వ్యాసరూప ప్రశ్నలు :

1. ప్లేటో రాజనీతి తత్త్వవిచారాన్ని ప్రభావితం చేసిన అంశాలను పేర్కొనుము.
2. ప్లేటో రచనా పద్ధతిని సంక్షిప్తంగా వివరించుము.
3. ప్లేటో వృత్తి, నైపుణ్య సిద్ధాంతాన్ని వివరించుము.
4. తాత్త్విక ప్రభువులపై ప్లేటో అభిప్రాయాలను విమర్శనాత్మకంగా పరిశీలించుము.
5. ప్లేటో కమ్యూనిజానికి, ఆధునిక కమ్యూనిజానికి మధ్యగల భేదాలను వివరించుము.

## 2.13. చదువవదగిన గ్రంథాలు :


1. Geroge H. Sabine : A History of Political Theory
2. E. Barker : Political Thought of Plato, Aristotle
3. R.P. Sharma : Western Political Thought
4. వి. కృష్ణారావు : పాశ్చాత్య రాజనీతి తత్త్వ విచారము
5. ఆచార్య. కె. సుభాష్‌చంద్రారెడ్డి (జాకి) : రాజనీతి తత్త్వ విచారము


-డా॥ బి. దోసగిరి రావు

పాఠం - 3

# అరిస్టాటిల్ (క్రీ.పూ. 384-322)

## 3.0 లక్ష్యం

ప్రాచీన తత్త్వవేత్తలలో అరిస్టాటిల్ సుప్రసిద్ధుడు. ఈయన ప్లేటో శిష్యులలో అగ్రగణ్యుడిగా పరిగణింపబడినాడు. తన అఖండమైన మేధా సంపత్తి వలన, రచనల వలన తన గురువైన ప్లేటోకు, ప్రాచీన గ్రీకు సమాజానికి చరిత్రలో సుస్థిరమైన స్థానాన్ని సంపాదించిపెట్టినాడు. అరిస్టాటిల్ కాలానికి అతీతమైన తత్త్వవేత్త. అన్ని యుగాల వారు ఆయన రచనల నుంచి, మేధా శక్తి నుంచి స్ఫూర్తిని పొందినారు. ఆయన తాత్త్వికంగా, వైజ్ఞానికంగా ప్రాక్, పాశ్చాత్య దేశాలకు వారధిగా నిలిచినాడు. ఆయన గణిత శాస్త్రాన్ని మినహాయించి విజ్ఞానానికి సంబంధించిన అన్ని శాస్త్రాలలోను పాండిత్యాన్ని సంపాదించి రచనలు చేసినాడు. రాజనీతి శాస్త్రానికి సంబంధించి ఆదర్శ వాదానికి (Idealism) ప్లేటోను మూల పురుషుడిగా పరిగణిస్తే, వాస్తవిక వాదానికి, శాస్త్రీయ దృక్పథానికి మూల పురుషునిగా అరిస్టాటిల్‌ను పేర్కొనవచ్చును. ఈ కారణంగానే అరిస్టాటిల్‌ను రాజనీతి శాస్త్రానికి పితామహుడు (Father of Political Science) గా పరిగణిస్తారు. ఇంతటి ప్రాధాన్యత పొందిన అరిస్టాటిల్ యొక్క జీవిత విశేషాలను, రాజనీతి శాస్త్రానికి ఆయన చేసిన కృషిని వివరించడం ఈ పాఠం యొక్క లక్ష్యం.

**విషయసూచిక :**


3.1. పరిచయము
3.2. అరిస్టాటిల్ - సమకాలీన పరిస్థితులు
3.3. అరిస్టాటిల్ - రచనలు
3.4. అరిస్టాటిల్ - రాజ్యావతరణ సిద్ధాంతం
3.5. రాజ్యం - సహజమైన సంస్థ
3.6. బానిసత్వ వ్యవస్థ - సమర్థన
3.7. అరిస్టాటిల్ - పౌరసత్వం
3.8. రాజ్యం - ప్రభుత్వాల మధ్య వ్యత్యాసం
3.9. అరిస్టాటిల్ - ప్రభుత్వాల వర్గీకరణ
3.10. అరిస్టాటిల్ - ఉత్తమ రాజ్యం
3.11. అరిస్టాటిల్ - విప్లవాలు
3.11.1. విప్లవాల కారణాలు
3.11.2. విప్లవాలను నివారించటానికి మార్గాలు
3.12. అరిస్టాటిల్ - సిద్ధాంత విమర్శ
3.13. అరిస్టాటిల్ - విశిష్టత
3.14. సారాంశము
3.15. నమూనా ప్రశ్నలు
3.16. చదువదగిన గ్రంథాలు

## 3.1. పరిచయము :

అరిస్టాటిల్ గ్రీసు దేశంలో స్టాజిరా నగరంలో క్రీస్తు పూర్వం 384లో జన్మించినాడు. ఇతని తండ్రి నికోదూకస్ మాసిడోనియా రాజ్యంలో ఆస్థాన వైద్యునిగా ఉండేవాడు. అరిస్టాటిల్ బాల్యంలోనే తల్లిదండ్రులను కోల్పోయినాడు. ఆయన తన 18వ ఏట ఏథెన్స్ నగరంలో ప్లేటో నెలకొల్పిన అకాడమీలో ప్రవేశించి, సుమారు 20 సంవత్సరాల పాటు సకల విద్యలు అభ్యసించినాడు. అందువలననే ప్లేటో సిద్ధాంతాలు, భావాల ప్రభావం అరిస్టాటిల్ మీద ప్రస్ఫుటంగా కనబడుతుంది. ప్లేటో మరణానంతరం అరిస్టాటిల్ మాసిడోనియా వెళ్ళి అక్కడ అలెగ్జాండరుకు బోధకుడిగా పనిచేసినాడు. అలెగ్జాండరు జైత్రయాత్ర కోసం తరలి వెళ్ళటంతో క్రీస్తు పూర్వం 335లో ఏథెన్స్ నగరానికి తిరిగి వచ్చి లైసియం (Lyceum) అనే విద్యాలయాన్ని స్థాపించి తన జీవితశేషాన్ని విద్యా బోధన గావించుచూ గడిపెను. అదే సమయంలో వివిధ విషయాలలో పరిశోధనలు నిర్వహిస్తూ అనేక గ్రంథాలను రచించి చివరకు క్రీస్తు పూర్వం 322లో గతించినాడు.

అరిస్టాటిల్ తన రచనలలో ప్లేటోకు భిన్నంగా వాస్తవిక పరిస్థితులను ప్రాతిపదికగా చేసికొని, సిద్ధాంతాలను రూపొందించినాడు. ప్లేటో రచనలలో భావనాశక్తి ప్రధానమైనది. అరిస్టాటిల్ గ్రంథాలలో వాస్తవిక దృష్టి ప్రధానంగా కనపడుతుంది. ప్లేటో రచనలు సంభాషణా రూపంలో ఉండటం చేత అతి మనోహరంగా ఉంటాయి. అరిస్టాటిల్ రచనలు శాస్త్రీయ పద్ధతిలో కనబడుతాయి. అరిస్టాటిల్ సమకాలీన గ్రీకు సమాజంలోని 158 రాజ్యాంగాలను తులనాత్మకంగా పరిశీలించి తన సిద్ధాంతాలను రూపొందించినాడు. ప్రాచీన కాలంలోనే రాజనీతిని నైతిక శాస్త్రం నుంచి వేరు చేసి స్వతంత్రమైన అధ్యయన శాస్త్రంగా రూపొందించినాడు. అందువలననే ఇతనిని రాజనీతి శాస్త్రానికి మూల పురుషునిగా పేర్కొంటారు.

## 3.2 అరిస్టాటిల్ - సమకాలీన పరిస్థితులు :

అరిస్టాటిల్ భావాలపై సకాలీన గ్రీకు నగర రాజ్యాల రాజకీయ,సామాజిక, ఆర్థిక పరిస్థితుల ప్రభావం కన్పడుతుంది. ప్లేటో కాలం నాటి పరిస్థితులే అరిస్టాటిల్ కాలంలోకూడా కొనసాగినవని చెప్పవచ్చును. అరిస్టాటిల్ రాజనీతి తత్త్వాన్ని నిశితంగా పరిశీలిస్తే ఆయన మీద మూడు ప్రధానమైన ప్రభావాలు కన్పడతాయి. మొదటిది ఆయన కాలం నాటికి నగరరాజ్యాలు, ప్రజాస్వామ్య ప్రభుత్వాలు క్షీణదశకు చేరుకున్నాయి. అంతర్యుద్ధాలు, ముఠా తగాదాలు, ప్రభుత్వాల అస్థిరత తారాస్థాయికి చేరుకున్నాయి. స్పార్టా పతనం అరిస్టాటిల్ కాలంలోనే జరిగింది. ఏథెన్స్‌లో ప్రజస్వామ్య ప్రభుత్వాలు స్థిరత్వం లేక ఒకటి తరువాత మరొకటి ఏర్పడుతూ వచ్చాయి. రెండవది ఆనాడు గ్రీకులలో ఉన్న కొన్ని సాధారణ దురభిప్రాయాలు, సంకుచిత విశ్వాసాలు అతని మీద ప్రభావం చూపినాయి. ఉదాహరణకు గ్రీకులు కానటువంటి ఇతర జాతుల మీద గ్రీకుల ఆధిక్యతను ఆమోదించటం, నగర రాజ్యమే సాంఘిక వ్యవస్థలన్నింటిలో మేలైనదనటం, బానిస వ్యవస్థ అవసరమైన, నైతికమైన సామాజిక వ్యవస్థగా భావించటం, వ్యక్తి శ్రేయస్సు కంటే రాజ్యప్రయోజనాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వటం, రాజ్య వ్యవహారాలలో పౌరులకు ఇతోధికమైన పాత్ర ఇవ్వటం మొదలైనవి తనపై ప్రభావం చూపినాయి. మూడవది, 20 సంవత్సరాలపాటు అతనికి విద్యా బోధన చేసిన ప్లేటో బోధనలు, రచనలు, సిద్ధాంతాల యొక్క ప్రభావం కూడా అతనిపై కనిపిస్తుంది. ఇద్దరి మధ్యా తాత్త్వికంగా అనేక విభేదాలున్నప్పటికీ అరిస్టాటిల్ భావనలు, రచనలు ప్లేటో యొక్క ప్రభావానికి చాలా ఎక్కువగా లోనైనాయని చెప్పవచ్చును.

## 3.3 అరిస్టాటిల్ - రచనలు :

అరిస్టాటిల్ సర్వతోముఖ ప్రజ్ఞావంతుడు, మహాపండితుడు. ఒక్క గణిత శాస్త్రాన్ని తప్పించి మిగిలిన అన్ని శాస్త్రాలను ఆయన స్పృజించినాడు. అన్ని యుగాల వారు ఆయన రచనల ద్వారా ప్రభావితులైనారు. ఈనాటికి అనేక శాస్త్రాలకు ఆయన గ్రంథాలే మార్గదర్శకాలు. అరిస్టాటిల్ తన రచనలలో ఆనాటి ప్రజాభిప్రాయాలకు, వాస్తవికవాద దృక్పధానికి ఎక్కువ ప్రాధాన్యతనిచ్చినాడు. అందుకే అతడు వాస్తవిక

వాదతత్త్వవేత్తగా పరిగణింపబడినాడు. అరిస్టాటిల్ రచించిన గ్రంధాలలో ప్రముఖమైనది "పాలిటిక్స్" (Politics). ఇది ఆ తరువాతి కాలంలో ఎంతోమంది మేధావులను, రచయితలను ప్రభావితం చేసి చాలా ప్రముఖమైన గ్రంధంగా గుర్తింపును పొందింది. ఈ గ్రంధం అప్పటి వ్యవస్థలైన నగర రాజ్యాన్ని, బానిసత్వాన్ని, కుటుంబాన్ని సమర్ధించి రాజ్యంలోని దోషాలకు, లోపాలకు నివారణోపాయాలను సూచించింది.

## 3.4. అరిస్టాటిల్ - రాజ్యావతరణ సిద్ధాంతం :

రాజ్యావతరణ విషయంలో అరిస్టాటిల్ ప్లేటోను అనుసరించినాడు. మానవ అవసరాలను తీర్చటానికి ప్రారంభంలో రాజ్యమేర్పడిందని ప్లేటో వలెనే అరిస్టాటిల్ కూడా భావించినాడు. సోఫిస్టుల అభిప్రాయాలకు భిన్నంగా రాజ్యం ఒక ఒప్పందం ఫలితంగా ఏర్పడలేదని, ఒకానొక ప్రత్యేక కాలంలో ఏర్పాటైన రాజకీయ వ్యవస్థగా రాజ్యాన్ని భావించడం సరికాదని అరిస్టాటిల్ అభిప్రాయపడినాడు. రాజ్యం ఏర్పాటుకావటం ఒక సహజ పరిణామమని, దానికి కొన్ని ఉన్నతమైన నైతిక విలువలు ఉన్నాయని అరిస్టాటిల్ భావించినాడు.

మానవుని ప్రాధమిక అవసరాలను తీర్చటానికి ప్రారంభంలో రాజ్యం ఏర్పడిందని అరిస్టాటిల్ కూడా ప్లేటోవలెనే భావించినాడు. ప్రారంభంలో జీవిత అవసరాలను తీర్చటానికి ఏర్పడినప్పటికి, ఆ తరువాతి కాలంలో రాజ్య లక్ష్యాలు క్రమక్రమంగా పెరగటం ప్రారంభించాయి. వాటి లక్ష్యం ప్రజలకు ఉత్తమ జీవనాన్ని కల్పించటానికి ఏర్పడిన సహజమైన సంస్థ. అందువలననే "రాజ్యం మానవునికి ప్రాధమిక అవసరాలను తీర్చటానికి ఏర్పడింది. కాని అంతటిలో ఆగక అతనికి ఉత్తమ జీవనాన్ని కల్పించటానికి కొనసాగుతుంది" అని అరిస్టాటిల్ పేర్కొన్నాడు. వ్యక్తి నైతికాభివృద్ధికి కావలసిన ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించటం రాజ్యం యొక్క లక్ష్యంగా ఆయన భావించినాడు. రాజ్యం కంటే తక్కువ స్థాయిలో ఉండే సముదాయం, కుటుంబం, గ్రామం వ్యక్తి దైనందిన అవసరాలను తీర్చగలవేకాని అతనికి పరిపూర్ణమైన జీవనాన్ని కలిగించలేవు. అతని హేతుబుద్ధికి అనుగుణమైన వాతావరణాన్ని పెంపొందించలేవు. ఇవన్నీ ఒక్క రాజ్యంలోనే సాధ్యం అవుతాయి.

## 3.5. రాజ్యం - సహజమైన సంస్థ :

అరిస్టాటిల్ అభిప్రాయంలో మానవుడు స్వాభావికంగా సంఘజీవి (Social animal). మానవుని అనేక అవసరాలు తీర్చటానికి రాజ్యం ఏర్పడింది. మానవుని ప్రాధమిక అవసరాలు ముఖ్యంగా మూడు. అవి : ఆహారం, వస్త్రం, నివాసం, ఈ రకమైన ఆర్థిక అవసరాలతో బాటు మానవునికి కొన్ని సామాజిక పరమైన, మానసికపరమైన అవసరాలు, కోరికలు కూడా ఉంటాయి. ఇటువంటి అవసరాలను, కోరికలను తీర్చుకోవటానికి పురుషులు, స్త్రీల కలయికతో ప్రాధమిక వ్యవస్థ అయిన కుటుంబ వ్యవస్థ ఏర్పడింది. ఇదే రాజ్యానికి ప్రాతిపదిక. కుటుంబంలో భార్యాభర్తలిద్దరు సమానులు కారు. పురుషుడు యజమాని, స్త్రీ బానిస. భర్త కుటుంబ యజమానిగా వ్యవహరించును. అరిస్టాటిల్ అభిప్రాయంలో కుటుంబానికి నైతిక, సామాజికమైన ప్రయోజనం ఉన్నది. సహజ వాంఛల పరితృప్తి కోసం, సంతాన ప్రాప్తి కోసం స్త్రీ పురుషుల కలయికతో కుటుంబం ఏర్పడుతుంది. కుటుంబం సాఫీగా కొనసాగటానికి పోషణ కావలయును. పోషణ కొరకు నాగలి, వ్యవసాయ నిర్వహణకు బానిస కావలయును. ఆవిధంగా ప్రాధమికంగా సహజంగా ఏర్పడిన వ్యవస్థ యజమాని, భార్య, బానిసలతో కూడిన కుటుంబ వ్యవస్థ. అది మానవుని ప్రాధమిక మరియు భౌతిక వాంఛలను తీర్చగలదు. కుటుంబ అవసరాలు తీరినంత వరకు వారు స్వతంత్రంగా ఉన్నారు. కాల క్రమంలో మానవుని కోరికలు, అవసరాలు పెరిగి నాగరికత పురోగమించిన కొలది కుటుంబాలన్నీ కలిసి గ్రామం ఏర్పడింది. మానవుని ఇతర మరియు ప్రత్యేక అవసరాలు తీర్చటానికి గ్రామాల సముదాయం అవసరమైంది. గ్రామాల కలయికతో రాజ్యం ఏర్పడింది. మానవుని ప్రాధమిక అవసరాలు తీర్చటానికి గ్రామంతో ప్రారంభమై, మానవునికి ఉత్తమ జీవితాన్ని ప్రసాదించటానికి రాజ్యం అవతరించింది. ఆ విధంగా కుటుంబం రాజ్యానికి పునాది. మానవ వాంఛలు, అవసరాలు పెరగటం వలన స్వయం పోషకమైన నగర రాజ్యంగా అభివృద్ధి చెందింది. ఇటువంటి స్వయం పోషకమైన నగర రాజ్యాన్ని అరిస్టాటిల్ "పోలీస్" అంటాడు. రాజ్యంగా పరిణామం చెందటమే వ్యక్తి యొక్క పరమావధి.

రాజ్యానికి అవసరమయ్యే అంశాలు మూడు. అవి, సహజీవనం (Co-existence), రాజకీయ వ్యవస్థ (Political organisation), మరియు న్యాయం (Law). ఈ మూడు కుటుంబ వ్యవస్థలో కూడా ఉన్నాయి. కుటుంబ సభ్యులు సహజీవనం గడుపుదురు. వారి మధ్య

సహకారం, అనురాగం, త్యాగనిరతి మొదలైనవి ఉంటాయి. కుటుంబ సభ్యుల మధ్య సంబంధాలను వ్యవస్థగా భావించవచ్చును. కుటుంబ యజమాని ఏర్పరచే నియమావళి లేదా ఆదేశాలను శాసనాలుగా భావించవచ్చును. కాబట్టి కుటుంబం ఎంత సహజమైనదో రాజ్యం కూడా అంతే సహజమైనది. ఈ విధంగా అరిస్టాటిల్ రాజ్యాన్ని ఒక సహజమైన మరియు అవసరమైన వ్యవస్థగా పరిగణించినాడు. రాజ్యం కేవలం అనేక మంది వ్యక్తుల సముదాయం కాదు. అది ప్రాణంతో స్పందించే వ్యవస్థ, ప్రత్యేక అస్థిత్వం కలిగినది.

మానవుని అవసరాలు, కోర్కెలు తీర్చటానికి వ్యవస్థలు ఏర్పడతాయి. కాని ఈ వ్యవస్థలన్నింటి కన్నా రాజ్యం అత్యుత్తమమైనది. ఇతర వ్యవస్థలు మానవుని ప్రత్యేక అవసరాల కోసం, సంకుచితమైన కోర్కెలు తీర్చటం కోసం ఏర్పడి ఉండవచ్చు. కాని రాజ్యం మానవుని ఉన్నత ఆశయాల సాధన కోసం మరియు పరిపూర్ణమైన జీవనాన్ని కల్పించటానికి ఏర్పడిన సహజమైన సంస్థ. ఉన్నతమైన ఆశయాలు, భావ వ్యక్తీకరణ సామర్థ్యం మానవుని జంతుజాలానికి భిన్నంగా నిరూపిస్తాయి. అతని ప్రవర్తనను హేతువు నియంత్రణ చేస్తుంది. రాజ్యం లేకపోతే మానవునికి వాస్తవికంగా నైతిక జీవనం సాధ్యం కాదు.

అరిస్టాటిల్ రాజ్యాన్ని ఒక సహజమైన సముదాయంగా వర్ణించాడు. వివిధ కోరికలను, విభిన్నమైన అవసరాలను తీర్చుకోవటానికి వ్యక్తులు తమ స్వభావాల ద్వారా ప్రేరేపించబడి ఒక సముదాయంగా రూపొందుతారు. రాజ్యం ఒక సముదాయం కావటం వలన వారి అవసరాల రీత్యా రాజ్యానికి వ్యక్తికి మధ్య ఎటువంటి వైరుధ్యాలు, ప్రయోజనాల సంఘర్షణ ఉండదు. అది ప్రజలందరికి ఉన్నతమైన జీవనాన్ని కల్పించటానికి ప్రయత్నిస్తుంది. అదే విధంగా చట్టానికి, వ్యక్తుల స్వేచ్ఛకు మధ్య ఎటువంటి వైరుధ్యం ఉండటానికి అవకాశం లేదు. ప్లేటో తన "రిపబ్లిక్"లో ప్రతిపాదించిన రాజ్యావతరణ కూడా ఇంచుమించుగా పై విధంగానే ఉంటుంది. వ్యక్తులు తమ అవసరాలను, కోర్కెలను తీర్చుకోవటానికి శ్రమ విభజన సిద్ధాంతాన్ని ఆధారంగా చేసుకొని వివిధ కర్తవ్యాలు నిర్వహిస్తారు. అయితే వివిధ సముదాయాల నుంచి, వ్యవస్థల నుంచి రాజ్యాన్ని వేరు చేసి వివరించటానికి, అది ఏ విధంగా ఇతర వ్యవస్థల కంటే భిన్నంగా, ఉన్నతంగా ఉంటుందో విశ్లేషించటానికి అరిస్టాటిల్ ప్రయత్నించాడు.

అరిస్టాటిల్ తన సిద్ధాంతంలో వ్యక్తికంటే రాజ్యానికి ఎక్కువ ప్రాధాన్యతనిచ్చినాడు. రాజ్యం లేకపోతే మానవునికి అస్థిరత్వం లేదు. రాజ్యం మానవుని సహజమైన గమ్యం. ఎందుకంటే అతడు రాజకీయ జీవి. మానవుని శ్రేయస్సు కోసం, పరిపూర్ణత కోసం రాజ్యం ఉండవలయును. వ్యక్తి, రాజ్యం అవిభాజ్యం. రాజ్యమనే శరీరానికి వ్యక్తి ఒక అవయవం. వ్యక్తిని రాజ్యానికి, న్యాయానికి దూరం చేస్తే అతడు అడవి మృగం కన్నా హీనంగా జీవించటం తప్పదు. మానవుని ప్రాథమిక అవసరాలను తీర్చి, ఉత్తమ జీవనం కొరకు కొనసాగే వ్యవస్థ రాజ్యం. అందువలన మానవుడు తప్పనిసరిగా రాజకీయజీవి కావలయును. వ్యక్తిని రాజ్యం నుండి విడదీస్తే స్వయం పోషకుడిగా జీవించలేడు. ఒక వేళ ఎవరైనా రాజ్యంతో నిమిత్తం లేకుండా ఏకాంతంగా జీవించగలిగితే అతడు అధమ స్థాయిలో జంతువైనా అయి ఉండాలి లేదా అత్యుత్తమ స్థాయిలో భగవంతుడైనా అయి ఉండాలి. జంతువులకు సామాజిక జీవనం అవసరంలేదు. భగవంతుడు ఏకాకి కాబట్టి సామాజిక జీవన సమస్య తలెత్తదు.

## 3.6. బానిసత్వ వ్యవస్థ - సమర్ధన :

ప్లేటో, అరిస్టాటిల్‌ల కాలంలోని గ్రీకు సమాజంలో బానిస వ్యవస్థ సార్వజనీనమైన సామాజిక వ్యవస్థ. ప్రాచీన గ్రీకు నాగరికత బానిస వ్యవస్థ మీద ఆధారపడింది. అందుచేత అరిస్టాటిల్ వాస్తవిక దృష్టితో బానిస వ్యవస్థను సమర్ధించినాడు. కుటుంబ వ్యవస్థ మనుగడకు బానిసత్వం చాలా అవసరమైనదని, అది సహజమైనదని, నైతికమైనదని అతని అభిప్రాయం. పౌరునికి విరామం కల్పించటానికి అతనికి గృహ వ్యవహారాలలో సాధనంగా పని చేయటానికి అనువుగా అరిస్టాటిల్ బానిస వ్యవస్థను బలపర్చినాడు. మానవులలోని మేధాశక్తిలో గల తారతమ్యాలను ఆధారం చేసుకొని అరిస్టాటిల్ బానిసత్వాన్ని సమర్ధించినాడు. మానవులలో కొందరు మేధా శక్తి సంపన్నులు, మరికొందరు శారీరకంగా బల సంపన్నులుగా ఉంటారు. శారీరక బలం మీద మేధాశక్తిదే పైచేయి కనుక స్వాభావికంగా ఎక్కువ తెలివైన వారు ఇతరులకు నాయకత్వం వహించవలసి ఉంటుంది. అంటే వారే పరిపాలకులు అవుతారు. శారీరక బలం ఉండి, మేధా సంపత్తి లేని వారు బానిసలుగా ఉంటారు. జన్మతః ఇతరుల ఆజ్ఞలను శిరసావహించటానికి కొందరు, ఇతరులను పరిపాలించటానికి కొందరు నిర్ణీతులై ఉంటారని

అరిస్టాటిల్ అభిప్రాయపడినాడు. యజమానులు బానిసలను హింసించకపోతే బానిసత్వ వ్యవస్థ ఉభయులకు లాభదాయకమే. యజమానులందరు బానిసలను దయార్థ్ర దృష్టితో చూడవలెనని అరిస్టాటిల్ హెచ్చరించినాడు. ఎవరైనా బానిసల పట్ల అమానుషంగా వ్యవహరిస్తే వారిని శిక్షించవలెనని కూడా అతడు సూచించాడు యుద్ధంలో ఓడిపోయిన వారు విజయం సాధించిన వారి కన్నా మేధాశక్తిలో తక్కువ వారైతేనే బానిసలుగా ఉండటానికి అర్హులు. అరిస్టాటిల్ అభిప్రాయంలో గ్రీకులంతా అధిక మేధా సంపన్నులు. కాబట్టి వారిని బానిసలుగా చేయకూడదు. స్వాభావికంగా బానిస అయినవానికి, శాసన రీత్యా బానిస అయినవారికి తేడా ఉంది. శాసన రీత్యా బానిస అయినవాడు యుద్ధంలో ఓడినవాడు. స్వాభావికంగా బానిస అయిన వానికి వివేకం ఉండదు. ఇతరులను పరిపాలించే సమర్ధత కూడా ఉండదు.

బానిస వ్యవస్థను గృహ నిర్వహణకు అత్యంత అవసరమైన సాధనంగా అరిస్టాటిల్ పరిగణించినాడు. గృహ నిర్వహణకు, గృహ అవసరాలు తీర్చుకోవటానికి కొన్ని సాధనాలు అవసరం. ఈ సాధనాలు సజీవమైనవి లేదా నిర్జీవమైనవి కావచ్చు. బానిసలు సజీవమైన సాధనాలు. వారు గృహ అవసరాలు తీర్చటానికి పరికరాలుగా ఉపయోగపడతారు. కుటుంబ నిర్వహణలో అవసరమైన సేవలను వారు అందజేస్తారు. అన్ని రకాల ఆస్తులతో బాటు బానిస కూడా పౌరునికి చెందిన సజీవమైన ఆస్థి. ఆ విధంగా అరిస్టాటిల్ గ్రీకు సాంప్రదాయాల్ని అనుసరించి బానిస విధానాన్ని సమర్ధించినప్పటికి, యజమానులు బానిసలను సానుభూతితో చూడాలని భావించినాడు. చివరకు తన బానిసలను తన తదనంతరం అమ్మకుండా స్వేచ్ఛా జీవులుగా చూడాలని, వారిని వదిలి వేయాలని తన వీలునామాలో అరిస్టాటిల్ నిర్దేశించినాడు.

## 3.7. అరిస్టాటిల్ - పౌరసత్వం :

అరిస్టాటిల్ అభిప్రాయంలో రాజ్యంలో పౌరులే ప్రధానపాత్ర వహిస్తారు. బానిసలు పౌరులుకారు. ఎందుకంటే వారికి విచక్షణా జ్ఞానం ఉండదు. స్త్రీలు కూడా పౌరులు కారు. ఎందుకంటే వారికి పౌరులకు కావలసిన సుగుణాలు లేవు. విదేశీయులకు పౌరసత్వం లేదు. ఎందువలనంటే వారు మరో దేశపు పౌరులు కాబట్టి అందువలన తీరిక, విజ్ఞానం, జీవించడానికి కావలసిన సంపద ఉండి రాజ్య వ్యవహారాల్లో ఉత్సాహంగా పాల్గొనే వాడే అరిస్టాటిల్ దృష్టిలో నిజమైన పౌరుడు. పౌరుడు రాజ్య వ్యవహారాలలో శ్రద్ధాశక్తులతో పాల్గొనవలెనంటే అతనికి ఆర్థికపరమైన ఇబ్బందులు ఉండకూడదు. కాబట్టి ఆస్థి పౌరునికి అత్యవసరమని అరిస్టాటిల్ భావించినాడు. రాజ్య వ్యవహారాల్లో అంటే ప్రభుత్వ నిర్వహణలోను, న్యాయ-పరిపాలనలోను, శాసన నిర్మాణంలోను పాల్గొనగలిగే సామర్థ్యం ఉన్నవాడే పౌరుడు అని అరిస్టాటిల్ పేర్కొన్నాడు. ఆ విధంగా అరిస్టాటిల్ నిర్వచించిన పౌరులు ఏకకాలంలో పాలకులు, పాలితులుగా ఉంటారు.

## 3.8. రాజ్యం - ప్రభుత్వాల మధ్య వ్యత్యాసం :

అరిస్టాటిల్ రాజ్యం, ప్రభుత్వాల మధ్య గల వ్యత్యాసాన్ని వివరించినాడు. పౌరులతో కూడుకున్న సమాజమే రాజ్యం అని అరిస్టాటిల్ భావించినాడు. రాజ్యాన్ని నిర్వహించే పౌరుల సమూహమే ప్రభుత్వం. ప్రభుత్వం రాజ్యం యొక్క ఆశయాలను అమలులోనికి తెచ్చు భౌతిక వ్యవస్థ. రాజ్యం యొక్క నైతిక, రాజకీయ విధులను నిర్వహించే ప్రత్యక్ష సాధనమే ప్రభుత్వం. ప్రభుత్వాలు తేలికగా మారవచ్చును. కాని రాజ్యం అంత తేలికగా మారదు. ప్రభుత్వాన్ని నిర్వహించే వ్యక్తులు మారినట్లయితే ప్రభుత్వం మారిపోతుంది. రాజ్యానికి నిదర్శనం దాని రాజ్యాంగం. కాబట్టి రాజ్యాంగం మారితే కాని రాజ్యం మారదు. అరిస్టాటిల్ అభిప్రాయంలో రాజ్యం శాశ్వతమైనదికాదు. ప్రభుత్వాల వలెనే రాజ్యం కూడా మారవచ్చును. రాజ్యాంగం మారిన ఎడల రాజ్యం కూడా మారును.

## 3.9. ప్రభుత్వాల వర్గీకరణ :

అరిస్టాటిల్ సమకాలీన గ్రీకు సమాజంలోని 158 రాజ్యాంగాలను సమగ్రంగా, తులనాత్మకంగా అధ్యయనం చేసి వాటికి సంబంధించిన వాస్తవాలను, సమాచారన్ని సేకరించి వాటిని ఆధారంగా చేసికొని ప్రభుత్వాలను గుణాత్మకంగాను, సంఖ్యాపరంగాను 6 రకాలుగా వర్గీకరించాడు. అవి. 1. రాజరికం (Monarchy), 2. కులీన పాలన (Aristocracy), 3. పాలిటి (Polity), 4. క్రూరపాలన (Tyranny), 5. అల్పజన పాలన (Oligarchy), 6. ప్రజాస్వామ్యం (Democracy).

అరిస్టాటిల్ ప్రభుత్వాలను వర్గీకరించటంలో రెండు ప్రాతిపదికలను అనుసరించాడు. మొదటిది అధికారాన్ని చెలాయించేవారి సంఖ్యను అనుసరించి ఏర్పడే ప్రభుత్వం. వాటిలో రాజకీయ అధికారం అంతా ఒకే వ్యక్తి చేతిలో కేంద్రీకృతమై ఉంటే అది రాజరికం, అధికారాన్ని కొద్ది మంది వ్యక్తులు చెలాయిస్తే అది కులీన పాలన. అధికార నిర్వహణలో అనేక మంది వ్యక్తులు పాలుపంచుకొంటే దానిని పాలిటి అని అరిస్టాటిల్ వర్గీకరించినాడు. రెండవ ప్రాతిపదికను అనుసరించి అధికారం ఎవరి ప్రయోజనం కోసం చెలాయించటం జరుగుతుందో దానిని బట్టి మూడు మంచి ప్రభుత్వాలు, మరి మూడు వాటి వికృత రూపాలుగా పేర్కొన్నాడు. రాజ్యాధికారం ఒక వ్యక్తి చేతిలో ఉండి అతడు ప్రజాశ్రేయస్సు కోసం అధికారాన్ని చెలాయిస్తే ఆ ప్రభుత్వాన్ని రాచరికం అని అన్నాడు. అదే పాలకుడు అధికారాన్ని తన స్వప్రయోజనాలకు, స్వార్థానికి వినియోగిస్తే అది క్రూరపాలన అవుతుంది. అధికారాన్ని కొద్దిమంది శ్రేష్ఠ జనులు గుణవంతులు, సంపన్నులు, ఉన్నత కుటుంబ నేపథ్యం ఉన్నవారు సమాజ సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని నిర్వహిస్తే అది కులీన పాలన అవుతుంది. అట్లా కాకుండా ఆ కొద్దిమంది తమవర్గ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని అధికారాన్ని నిర్వహిస్తే అది అల్పజన పాలన అవుతుంది. అధికారం అధిక సంఖ్యాక ప్రజల చేతుల్లో ఉండి రాజ్యాంగబద్ధంగా దానిని అందరి ప్రయోజనాల కోసం వినియోగించినపుడు ఏర్పడేది పాలిటీ. పాలిటీకి వికృత రూపం ప్రజాస్వామ్యం. అరిస్టాటిల్ అభిప్రాయంలో ప్రజాస్వామ్యం అంటే "మూక పాలన" (Mobocracy).

అన్ని ప్రభుత్వాలకన్నా మధ్య తరగతి ప్రజల నిర్వహణలో ఉన్న శాసన బద్ధమైన ప్రజా ప్రభుత్వమే ఉత్తమమైనదని అరిస్టాటిల్ భావన. ఇటువంటి ప్రభుత్వానికి సంబంధించిన వ్యవహారాల్లో పౌరులందరు పాల్గొంటారు. ఇది అత్యధిక సంఖ్యాకుల పాలన. పౌరులు తమ ప్రతినిధులను ఎన్నుకొని వారి ద్వారా పరిపాలన కొనసాగిస్తారు. ఈ ప్రభుత్వంలో శాసన సార్వభౌమత్వముంటుంది. పాలకులు, పాలితులు శాసనాలకు లోబడి ఉంటారు. ప్రజలందరి శ్రేయస్సు కోసం ప్రభుత్వం కృషి చేస్తుంది. ప్రభుత్వంలో స్థిరత్వం, పటిష్టత ఉంటాయి. ఇది మధ్య తరగతి ప్రజల ప్రభుత్వం. మధ్య తరగతి ప్రజల లక్షణాలు ప్రభుత్వంలో ప్రతిఫలిస్తాయి. ఆ విధంగా అరిస్టాటిల్ ఉద్దేశంలో పాలిటీలో కులీనుల వివేకం, అధిక సంఖ్యాకుల (మధ్య తరగతి) సమ్మతి రెండూ ఉంటాయి.

## 3.10. అరిస్టాటిల్ - ఉత్తమ రాజ్యం :

అరిస్టాటిల్ తన "పాలిటిక్స్" లో ఏడు, ఎనిమిది అధ్యాయాలలో ఉత్తమ రాజ్యాన్ని లేదా ఉత్తమ ప్రభుత్వ వ్యవస్థను గురించి వివరించినాడు. ప్లేటో ఆదర్శ రాజ్యాన్ని ప్రతిపాదిస్తే, అరిస్టాటిల్ ఆచరణాత్మకమైన ఉత్తమ రాజ్యాన్ని మాత్రమే వర్ణిస్తాడు. అతని అభిప్రాయంలో రాజ్యాంగానికి మితవాదం మరియు స్థిరత్వం అనే రెండు ప్రధాన లక్షణాలు ఉండాలి. అరిస్టాటిల్ ఉత్తమ రాజ్యానికి సంబంధించి మధ్యేమార్గాన్ని అనుసరించినాడు. అల్పజన పాలన, ప్రజాస్వామ్యం అనే వివాస్తదంలో ఎన్ని లోపాలు ఉన్నప్పటికి ఎక్కువ రాజ్యాలలో కొనసాగే ప్రభుత్వాలు. అవి బాగా లేకున్నా వాటిని మనం విస్మరించలేము. అందువలన అరిస్టాటిల్ వాస్తవంలో ఏది శాశ్వత ప్రాతిపదికపై రాజకీయ సుస్థిరతను సాధించగలదో అది ఆచరణాత్మకమైన ఉత్తమ ప్రభుత్వం అని భావించినాడు. ఆచరణలో రాజకీయ సుస్థిరతను నెలకొల్పాలంటే అల్పజన పాలన, ప్రజాస్వామ్యాల మధ్య రాజీ పధంగా మధ్యే మార్గాన్ని అనుసరించాలి. ప్రభుత్వంలో ధనం, గుణం, పేద వర్గాల ప్రభావం అన్నీ మిళితమై ఉండాలి. అది రాజ్యాంగ బద్ధమైన ప్రజాస్వామ్యంలోనే సాధ్యమౌతుందని అరిస్టాటిల్ భావించినాడు. అందువలనే ప్రజాస్వామ్యానికి పర్యాయపదంగా "పాలిటి" ని రాజ్యాంగ బద్ధ ప్రజాస్వామ్యం అని అర్థం వచ్చే విధంగా రూపొందించినాడు.

అరిస్టాటిల్ అభిప్రాయంలో ప్రతిరాజ్యంలోను మూడు వర్గాలుంటాయి. అవి. 1. అతి ధనవంతులు, 2. అతి బీదవారు, 3. మధ్య తరగతివారు. అతి ధనవంతులలో అహంకారం, ధన మదం ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. బీదవారిలో హింసాత్మక, విప్లవ శక్తులు విజృంభిస్తూ ఉంటాయి. రెండు వర్గాలవారు ఒకరినొకరు బద్ధ వైరులుగా చూసుకుంటారు. అరిస్టాటిల్ ఉద్దేశంలో సామాన్య ఆదాయం, సుగుణాలు ఉన్న మధ్య తరగతి ప్రజలు కొంత హేతుబద్ధంగా వ్యవహరిస్తారు. వారికి ధనికులకు ఉన్న నిర్లక్ష్యం, సోమరి తనం మరియు పేదవారికి ఉన్న నేర ప్రవృత్తి, నీచ లక్షణం, హింసాత్మక ప్రవృత్తి ఉండవు. నిర్లక్ష్యం, నేర ప్రవృత్తికి మధ్యే మార్గంగా మధ్యతరగతి ప్రజలు వ్యవహరిస్తారు. సమాజంలో సమన్వయం సాధించటానికి మధ్యతరగతికి యోగ్యత ఉన్నదని అరిస్టాటిల్ అభిప్రాయపడినాడు. అందుచేత మధ్య తరగతి వారి మీద ఆధారపడిన రాజ్యమే ఉత్తమ రాజ్యమని అతని భావం. మధ్యతరగతివారు ఇతరులపై ఈర్ష్య కానీ, అహంభావం కానీ లేకుండా స్థిరత్వాన్ని , సంయమనాన్ని ప్రదర్శిస్తారు. అందువల్ల మధ్యతరగతి వారి సంఖ్య ఇతరుల కంటే ఎక్కువగా ఉన్న రాజ్యం

స్థిరంగాను, సమర్థవంతంగాను ఉంటుంది. పాలిటిలో మధ్య తరగతి అధికం కాబట్టి ఇదే ఉత్తమ రాజ్యమని అతని అభిప్రాయం. పాలిటికి మిశ్రమ రాజ్యాంగం ఉంటుంది. అంటే అల్పజన పాలన, ప్రజాస్వామ్యాల సమన్వయంతో గుణసంపన్నులైన సమర్థులైనవారిని సామాన్య ప్రజలు పాలకులుగా ఎంపిక చేసికొనే రాజ్యాంగ వ్యవస్థ ఉంటుంది. ఇది ధనిక, పేద వర్గాలను సమతుల్యం చేస్తుంది. అదే విధంగా ప్రజాస్వామ్యంలోని సంఖ్యా బలానికి కులీన పాలనలోని వివేకంతో సామరస్యం కుదురుతుంది. మధ్య తరగతి వారు విప్లవాలకు అనుకూలంగా ఉండరు. వారు స్థిరత్వానికి, సంయమనానికి అనుకూలంగా ఉంటారు. పాలిటికి రాజ్యాంగ సార్వభౌమత్వం ఉండి సంఘంలోని అన్ని వర్గాలకు, వ్యక్తులకు న్యాయం చేకూరుస్తుంది.

అరిస్టాటిల్ మితవాది, సంస్కరణవాది, అందువలనే అతడు ఆచరణ సాధ్యమైన భావాలను రూపొందించినాడు. సమస్యలను పరిష్కరించటంలో అరిస్టాటిల్ మధ్యే మార్గాన్ని అనుసరించినాడు. దీనిని అనుసరించి రాజ్యంలో ఏ రెండు ప్రబల వర్గాలకు చెందని మధ్య తరగతి వర్గం తృతీయ శక్తిగా ఉంటుంది. ఈ మధ్య తరగతి వర్గం ధనిక, పేద వర్గాల మధ్య సమతౌల్యాన్ని నెలకొల్పడం ద్వారా స్థిరత్వాన్ని కలిస్తుంది. అందువలన అరిస్టాటిల్ మధ్య తరగతి ప్రజల సంఖ్య అధికంగా ఉన్న రాజ్యంలో రాజకీయ సుస్థిరత ఎక్కువగా ఉంటుందని భావించినాడు. అరిస్టాటిల్ అభిప్రాయంలో ధనవంతులు పరిపాలించటానికి అలవాటుపడి ఉండరు. వారికి నిరంకుశంగా అధికారాన్ని చెలాయించటం మాత్రమే తెలుసు. నిరుపేదలు అధికారం నిర్వహించలేరు. వారికి తెలిసింది కేవలం నిరంకుశ అధికారికి లొంగి బానిస ప్రవృత్తితో వ్యవహరించటమే. అందువలన కేవలం ధనిక, పేద వర్గాలు మాత్రమే ఉండే రాజ్యంలో పాలకులు, పాలితుల మధ్య సంబంధాలు యజమాని - బానిస సంబంధాలుగా ఉంటాయి. అప్పుడు వారి మధ్య సహకారం, సమానత్వం, స్నేహ భావం అనేవి ఉండవు. ఈ భావాలు మధ్యతరగతి ప్రజలలో ఎక్కువగా కనిపిస్తాయి. అందువల్ల వారి సంఖ్య మిగతా వర్గాల సంఖ్య కంటే ఎక్కువగా ఉండాలని అరిస్టాటిల్ భావించినాడు.

అరిస్టాటిల్ అభిప్రాయంలో ఉత్తమ రాజ్యానికి స్థిరత్వం ఉండి ప్రగతి పథంలో పురోగమించాలంటే కొన్ని భౌతిక పరిస్థితులు అవసరము. రాజ్యంలోని జన సంఖ్య మరీ తక్కువ కాకుండా స్వయం పోషకమై ఉండేటట్లు, మరీ ఎక్కువ కాకుండా సక్రమమైన పరిపాలనకు అనువుగా ఉండవలెనని ఆయన భావించినాడు. కాని అదే సమయంలో ప్రజల సంఖ్య ఇతమిద్ధంగా ఇంత ఉండాలని ఆయన నిర్ణయించలేదు. జనాభా వలెనే రాజ్యం యొక్క భూభాగం కూడా మరీ పెద్దది కాకుండా, మరీ చిన్నది కాకుండా ఉండవలెను. అప్పుడే ప్రజలంతా కలిసి సభలు, సమావేశాలు ఏర్పాటు చేసుకోవటానికి అనువుగా ఉంటుంది. ఉత్తమ రాజ్యంలో అరిస్టాటిల్ విద్యకు ఎక్కువ ప్రాధాన్యతనిచ్చినాడు. విద్య మానవుని వ్యక్తిత్వాన్ని, వైజ్ఞానిక, నైతిక, భౌతిక రంగాలను అభివృద్ధి చేసి అతనిని సుశిక్షితుడైన పౌరునిగా తీర్చిదిద్దుతుంది. కాబట్టి ప్రభుత్వం నిర్బంధ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టాలని అరిస్టాటిల్ అభిప్రాయపడినాడు.

## 3.11. అరిస్టాటిల్ - విప్లవాలు :

అరిస్టాటిల్ రాజ్యాలలో సంభవించే విప్లవాలను గురించి, వాటి ద్వారా రాజ్యాల్లో చోటు చేసుకునే మార్పులను గురించి కూడా చర్చించినాడు. విప్లవాలకు దోహదం చేసే కారణాలను, వాటిని నివారించటానికి తగిన మార్గాలను కూడా సూచించినాడు. ఆనాటి సమకాలీన గ్రీకు సమాజంలో నెలకొని ఉన్న అరాచక పరిస్థితులు వాటి ఫలితంగా గ్రీకు నగర రాజ్యాలలో ఏర్పడిన రాజకీయ, రాజ్యాంగపరమైన మార్పులు అరిస్టాటిల్‌ను ఈ దిశగా ఆలోచింపజేసినాయి.

విప్లవాలు వివిధ రకాలుగా రావచ్చు. ఒక విప్లవం రాజ్యాంగాన్ని మార్చటానికి రావచ్చు లేదా కొన్నిసమయాలలో విప్లవకారులు రాజ్యాంగాన్ని మార్చకుండానే రాజ్యాధికారాన్ని వశపరుచుకోవచ్చు. అదే విధంగా ఒక ప్రభుత్వ విధానాన్ని మార్చి ఇంకొక రకమైన ప్రభుత్వ విధానాన్ని ఏర్పాటు చేసుకోవటానికి కూడా విప్లవాలు రావచ్చు. ఉదాహరణకు అల్పజన పాలనను కులీన పాలనగా మార్చుటకు కాని లేదా ప్రజాస్వామ్యాన్ని పాలిటీగా మార్చటానికి కాని విప్లవాలు రావచ్చు. ఒక్కొక్కసారి ప్రభుత్వంలోని ఏదో ఒక అంగం యొక్క స్వరూప స్వభావాలను మార్చటానికి కూడా విప్లవం రావచ్చు.

**3.11.1. విప్లవాలకు కారణాలు :** విప్లవాలు రావటానికి కాని, విప్లవ పరిస్థితులు ఏర్పడటానికి కాని గల కారణాలను అరిస్టాటిల్ రెండు రకాలుగా విభజించినాడు. అవి సాధారణ కారణాలు మరియు ప్రత్యేక కారణాలు.

అరిస్టాటిల్ ఒక రాజ్యంలో విప్లవం రావటానికి ప్రజల సమానత్వ వాంఛ మరియు న్యాయాభిలాషలు సాధారణ కారణాలుగా పేర్కొన్నాడు. సమాజంలో నెలకొన్న అసమానతలు అసంతృప్తికి, అసంతృప్తి తిరుగుబాటుకు దోహదం చేస్తుంది. ఆ విధంగా సమానత్వాన్ని సాధించటానికి విప్లవాలు చోటు చేసుకుంటాయి. వివిధ రకాల అధికారాలు, ప్రత్యేక హక్కులు, సదుపాయాలు అనుభవించేవారు, వారికి అవి లభ్యం కానపుడు తనకు అన్యాయం జరిగింది అనే అసంతృప్తితో పాలక వర్గంపై తిరుగుబాటు చేస్తారు. అదే విధంగా సామాన్య ప్రజలు తమకు లభ్యం కావలసింది పాలకులు తమకు ఇవ్వకుండా అన్నీ వారే అనుభవిస్తున్నారన్న అసంతృప్తితో తిరగబడతారు. ఆర్థిక అసమానతలు, ప్రభుత్వ అధికారాన్ని దుర్వినియోగం చేయటం, సమాజంలోని సమన్వయాన్ని కుదర్చగలిగే మధ్య తరగతి లేకపోవటం విప్లవాలు రావటానికి దోహదం చేస్తాయి.

ఒక రాజ్యంలో విప్లవాలు రావటానికి సాధారణ కారణాలతో బాటు కొన్ని ప్రత్యేక కారణాలు కూడా ఉండవచ్చునని అరిస్టాటిల్ భావించినాడు. స్వార్థం పదవీ వ్యామోహం, దురహంకారం, ప్రజాజీవితంలో కొందరికే అనుచితమైన ప్రాధాన్యత ఇవ్వటం, ఎన్నికల కుతంత్రాలు, విశ్వాస ఘాతకులకు ఉన్నతమైన పదవులు ఇవ్వటం, రాజ్యాంగంలో కొద్దిపాటు మార్పులు చేయటానికి నిరాకరించటం, రాజ్యంలో వివిధ స్థాయిలలో నెలకొని ఉన్న అసమానతలు మొదలైనవి విప్లవాలకు దారితీస్తాయి.

**3.11.2. విప్లవాలను నివారించటానికి మార్గాలు :** అరిస్టాటిల్ విప్లవాలు రావటానికి గల కారణాలను వివరించటమే కాక వాటిని అరికట్టడానికి అవసరమైన నివారణ మార్గాలను కూడా సూచించినాడు. విప్లవాలు రాకుండా నివారించాలంటే మొట్టమొదట చేయవలసినది ప్రజలలో చట్టం పట్ల విధేయతను పెంపొందించటం. ప్రజలందరు శాసనబద్ధంగా వ్యవహరిస్తే అందరికి లాభదాయకమని ప్రజలకు తెలియజేయవలె. ప్రజలను మోసగించే చర్యలు కాని, కపటోపాయాలు కాని పాలకులు అనుసరించరాదు. రాజ్యాధికారం ఒక వ్యక్తి చేతిలో కాని వర్గం చేతిలో కాని కేంద్రీకరింపబడక, అందరినీ సమదృష్టితో చూడవలయును. ప్రభుత్వ అధికారం లభించలేదనే అసంతృప్తి, అర్హులైన పౌరులలో లేకుండా చూడవలెను. పరదేశీయులకు కాని, అపరచితులకు కాని ఉన్నత పదవులు ఇవ్వరాదు. రాజ్య పాలనలో పదవీదుర్వినియోగం, అవినీతి, లంచగొండితనం మొదలగు అవలక్షణాలు లేకుండా చూడవలెను. ప్రభుత్వం యొక్క అంతర్గత వ్యవహారాలు, ముఖ్యంగా ఆర్థిక పరమైన లావాదేవీలపై ప్రజా పర్యవేక్షణకు అవకాశం కల్పించాలి. అపుడే ప్రభుత్వం ఎక్కువ ప్రజాదరణ పొందుతుంది. యోగ్యతననుసరించి పదవులను ఇవ్వాలి. ఏ ఒక్క వర్గానికీ అధికారంలో ప్రాధాన్యత ఇవ్వకూడదు. రాజ్యాంగంలో ఉన్నత పదవులన్నీ రాజ్యంగ విధేయత, పరిపాలనా సామర్థ్యం, సచ్ఛీలత ఉన్నవారికి మాత్రమే ఇవ్వాలి. ప్రజలకు రక్షణ కల్పించటమే కాకుండా వారి విలువలను, సాంప్రదాయాలను గౌరవించాలి. రాజ్యాంగం ప్రజలలో అత్యధిక సంఖ్యాకులకు ఆమోదయోగ్యమై ఉండవలెను.

## 3.12. అరిస్టాటిల్ - సిద్ధాంత విమర్శ :

అరిస్టాటిల్ రాజనీతి సిద్ధాంతం మరియు భావనలు ఎంతగా ప్రాచుర్యాన్ని పొందినప్పటికి వాటిలో కొన్ని లోపాలు కూడా కనిపిస్తాయి. అరిస్టాటిల్ బానిస వ్యవస్థను సమర్థించటం, సమర్థించటానికి ఆయవ చేసిన వాదనలు అంత సమంజసంగా లేవు. మానవులందరిని రెండు వర్గాలుగా ఆజ్ఞలిచ్చే పాలకులుగాను, శిరసావహించే బానిసలుగాను విభజించుట సహేతుకంగా లేదు. ఆధునికయుగంలోని కార్మికులు, కర్షకులు అతని భావనలో బానిసల క్రిందే లెక్క. కాని ఈ అభిప్రాయం సమర్థనీయంగా లేదు. బానిస విధానాన్ని సమర్థించటంలో అరిస్టాటిల్ జాత్యహంకారాన్ని ప్రదర్శించాడు. గ్రీకులను బానిసలుగా చేయకూడదని ఆయన అంటాడు. అదే విధంగా అరిస్టాటిల్ పౌరసత్వానికి ఇచ్చిన వివరణ కూడా చాలా సంకుచితంగా ఉంది. అతని అభిప్రాయంలో పౌరసత్వం కొద్ది మంది ఉన్నత వంశీయులకు, ఆస్తిపరులకే పరిమితమైంది. జన సామాన్యానికి, స్త్రీలకు పౌరసత్వం అందుబాటులో ఉండదు. వారికి స్వేచ్ఛలేదు, హక్కులు లేవు.

పాఠం - 4

# కౌటిల్యుడు

## 1.0 లక్ష్యం :

ఈ పాఠం ముఖ్య ఉద్దేశమేమనగా కౌటిల్యుని అర్ధశాస్త్రములోని అంశాలను, ఆ కాలము నాటి సామాజిక పరిస్థితిని, కౌటిల్యుని రాజనీతి భావాలు మరియు అతని గొప్పతనమును తెలియజేయటం.

## విషయక్రమము


4.1 పరిచయము

4.2 కౌటిల్యుని జీవితము - కాలవ

4.3 అర్ధ శాస్త్రము

4.4 సామాజిక వ్యవస్థ

4.4.1 స్త్రీల స్థానము

4.5 రాజ్య వ్యవస్థ

4.6 సప్తాంగ సిద్ధాంతము

4.6.1 రాజు

4.6.2 మంత్రి వర్గము

4.6.3 జనపద

4.6.4 దుర్గము

4.6.5 కోశ (ధనాగారము)

4.6.6 బల (సైన్యము)

4.6.7 మిత్రులు

4.7 రాజు యొక్క స్థానము

4.8 రాజు - విద్య

4.9 రాజు యొక్క అధికారములు

4.9.1 కార్య నిర్వాహక మరియు పాలనా పరమైన అధికారాలు

4.9.2 శాసనాధికారము

4.9.3 న్యాయాధికారాలు

4.9.4 ఆర్థికాధికారాలు

4.9.5 సైనికాధికారములు

4.9.6 సామాజిక క్రమాన్ని పరిరక్షించే అధికారము

4.10 శాస్త్రయుక్తమైన పాలన

4.10.1 సాధారణ పాలన

4.10.2 విత్తపాలన

4.10.3 న్యాయ పాలన

4.10.4 సైనిక పాలన

4.10.5 రాజుకు రక్షణ

4.10.6 రాజ్య విస్తరణ

4.11 మండల సిద్ధాంతము

4.12 విదేశాంగ విధానము

4.13 సారాంశము

4.14 వ్యాసరూప ప్రశ్నలు

4.15 లఘు వ్యాఖ్యలు

4.16 చదువదగిన గ్రంథాలు

## 4.1 పరిచయము :

కౌటిల్యుని, మెకైవల్లితో సరిపోల్చడంతో, కౌటిల్యున్ని మోసగానిగాను, అనైతిక రాజకీయాలను ప్రభోధించిన వానిగాను కొందరు భావించటం జరిగింది. అయితే కొందరు పండితులు ప్రాచీన భారత రాజనీతి తత్వ విచార చరిత్రలో కౌటిల్యుని అగ్రగణ్యునిగా కీర్తించటం జరిగింది. ప్రాచీన భారతదేశంలో రాజకీయ సంస్థలు, సామాజిక, మత, సాంస్కృతిక అంశాలు మిళితమై విడదీయరానంతగా కలిసిపోయి ఉన్న కాలంలో రాజనీతి తత్వాన్ని ఒక ప్రత్యేక దృక్పథంతో నిర్దిష్టంగా రూపొందించటానికి కౌటిల్యుడు గణనీయమైన కృషి చేశాడు. భారతదేశంలో కేంద్ర ప్రభుత్వము బలంగా ఉండాలని మొట్టమొదటిగా చెప్పినది కౌటిల్యుడే. కౌటిల్యుడు, పరిపాలన, దౌత్యం మొదలైన అంశాలపై, ఒక క్రమ పద్ధతిలో అధ్యయనం చేశాడు. కొందరు పండితులు కౌటిల్యుని రాజనీతి శాస్త్ర పితామహునిగా కీర్తించినారు. మత, నైతిక భావాలు ప్రబలంగా ఉన్న కాలంలో వాటిని అధిగమించి రాజనీతిని శాస్త్రీయ దృక్పథంతో విశ్లేషించడంలోనే కౌటిల్యుని గొప్పతనం విశదమవుతుంది.

## 4.2 కౌటిల్యుని జీవితము - కాలము :

ప్రాచీన భారతదేశంలో గొప్ప రాజనీతి తత్వవేత్తయైన కౌటిల్యునికి చాణుక్యుడు, విష్ణుగుప్తుడనే పేర్లు కూడా కలవు. కౌటిల్యుడు ఏ కాలము నాటి వాడనే విషయములో పండితుల మధ్య ఒక అంగీకారము లేదు. అయితే ఎక్కువ మంది పండితులు కౌటిల్యుడు క్రీ.పూ 400 మరియు క్రీ.పూ 320 మధ్య కాలములో నివసించినాడని నమ్ముచున్నారు. కౌటిల్యుడు ప్రస్తుతము పాకిస్తాన్‌లో నున్న తక్షశిలలో జన్మించినాడు.

కౌటిల్యుని కాలములో అరాచక పరిస్థితి నెలకొనియున్నది. సరియైన పాలకుడు లేకపోవటం, విదేశీ దురాక్రమణలతో పరిస్థితి విషమించింది. మగధను పాలిస్తున్న నంద వంశ రాజులు అసమర్థులు మరియు అవినీతిపరులు. అశాంతి, అరాచకము, విదేశీదురాక్రమణలు దేశ ఉనికికే ప్రమాదంగా మారాయి. అలెగ్జాండర్ భారతదేశంలో కొంత భాగాన్ని జయించినాడు. ఇటువంటి పరిస్థితులలో కౌటిల్యుడు, భారతదేశము విముక్తి పొంది, సమైక్యంగా, బలంగా ఉండాలని, అటువంటి క్లిష్టమైన లక్ష్యాన్ని సాధించగల వ్యక్తి కొరకు అన్వేషించసాగాడు. తాను విద్యార్థిగా, అధ్యాపకునిగా పనిచేసిన తక్షశిల విశ్వ విద్యాలయంలో విద్యాభ్యాసము కొరకు వచ్చిన చంద్రగుప్తుడు అతనికి తారసపడ్డాడు.

ఆనాడు కౌటిల్యునికి రెండు లక్ష్యాలున్నాయి. 1. భారతదేశమును గొప్ప దేశముగా రూపొందింఛాలని 2. నందవంశపు రాజైన ధనంజయనంద తనను అవమానపరచినందులకు ప్రతీకారము తీర్చుకోవాలని. ఈ లక్ష్యాలను చంద్రగుప్త మౌర్యుని ద్వారా సాధించుకోవాలని భావించాడు. చంద్రగుప్త మౌర్యుడు కౌటిల్యుని సలహా మరియు మార్గదర్శకత్వంలో నంద రాజును ఓడించి మగధ రాజుగా ప్రకటించుకున్నాడు. మరియు కౌటిల్యుని ప్రధాన మంత్రిగా మౌర్య సామ్రాజ్యాన్ని నెలకొల్పినాడు. అయితే కౌటిల్యుని అర్థశాస్త్రం, ఒక గొప్ప సామ్రాజ్యంగా ప్రసిద్ధి చెందిన మగధ రాజ్యం సమస్యలను, అనుసరించవలసిన విధానాలను చర్చించకుండా ఒక చిన్న రాజ్యంతో అధికార సముపార్జన, అధికార విస్తరణను గురించి వివరించటానికి పరిమితమైంది.

## 4.3 అర్థ శాస్త్రము :

కౌటిల్యుడు గొప్ప పండితునిగా, మంచి రచయితగా, నిపుణుడైన పాలకునిగా, తెలివైన సలహాదారునిగా ప్రఖ్యాతిపొందినాడు. తాను రచించిన గ్రంథము అర్థశాస్త్రములో ముఖ్యముగా రాజ్యపాలన, దౌత్యమును గురించి వివరించినాడు. కౌటిల్యునికి ముందే కొంతమంది పండితులు అర్థశాస్త్రమును వ్రాశారు. కౌటిల్యుడు తన గ్రంథ ఉపోద్ఘాతములో ఈ విధంగా మొదటి వాక్యాన్ని వ్రాసినాడు. "అర్థశాస్త్రం, ఇంతకు ముందు వెలువడిన అన్ని అర్థశాస్త్రాల సారాంశము." కౌటిల్యుడు కేవలం ఇతర రచనల సారాంశాన్ని చెప్పడమే కాకుండా పరిపాలనా వ్యవస్థను గురించి, రాజనీతిని ప్రధానాంశముగా చర్చించినాడు. కౌటిల్యుని అర్థశాస్త్రం ప్రాచీన భారత రాజనీతి తత్వ సాహిత్యంలో అద్వితీయమైన రచనగా పేరొందింది. ఇది పాలకునికి మార్గదర్శకంగా, పాలనాధికారికి నియమ నిబంధనల సంచితంగా ఉపయోగపడుతుంది. రాజ్య సిద్ధాంతాన్ని ప్రత్యేకంగా ఏ అధ్యాయంలోనూ చర్చించలేదు కాని రాజ్యావతరణకు సంబంధించిన భావాలను యాదృచ్ఛికంగా అక్కడక్కడ ప్రస్తావించటం జరిగింది. కౌటిల్యుని అర్థశాస్త్రము 1909లో వెలుగు చూడటం జరిగింది.

కౌటిల్యుడు రచించిన అర్థశాస్త్రము 32 పరిచ్ఛేదాలు 15 భాగాలు, 150 అధ్యాయాలతో కూడిన గ్రంథం. నైతిక విలువల నుండి, రాజనీతి శాస్త్రాన్ని వేరుచేసి ఒక స్వతంత్ర శాస్త్రంగా కౌటిల్యుడు దీనిని రూపొందించాడు. దీనిలో ఆచరణాత్మక వివరణ మాత్రమే ఉంది కాని సైద్ధాంతిక రాజనీతి లేదు. అర్థశాస్త్రములోని 15 భాగాలలో ప్రభుత్వము, పాలనకు సంబంధించి వివిధ అంశాలు చర్చించబడ్డాయి.

ఈ గ్రంథములోని మొదటి భాగములో యువరాజు యొక్క విద్య, క్రమశిక్షణ, మంత్రుల అర్హతలు, రాజు యొక్క బాధ్యతలు, వివిధ రకాల గూఢచారులను గురించి చర్చించబడింది.

రెండవ భాగములో, భూమి, గ్రామ పరిపాలన, ప్రభుత్వ సేవకుల, అధికారుల, ధనాగార పర్యవేక్షకుల ప్రవర్తన గురించి వ్రాయబడింది.

మూడవ భాగములో, వివాహము, ఒప్పందము, క్రయవిక్రయాలు మొదలైన వాటికి సంబంధించిన వివాదములు చర్చించబడ్డాయి

నాల్గవ భాగము, క్రిమినల్ చట్టము గురించి.

ఐదవ భాగము, రాజ్య శత్రువుల నిర్మూలన, రాజ ధనాగారమును నింపుట గురించి.

ఆరు మరియు ఏడవ భాగములు, రాజ్యము యొక్క 7 ముఖ్య లక్షణముల గురించి.

ఎనిమిదవ భాగము, రాజు దుర్గుణాల గురించి.

తొమ్మిది మరియు పదవ భాగము, సైనిక శిబిరములు, వ్యూహముల గురించి.

పదకొండవ భాగము, నగర పాలక సంస్థ, సహకార సంఘముల గురించి.

పన్నెండవ మరియు పదమూడవ భాగము, యుద్ధములో విజయము సాధించుట గురించి మరియు జయించిన రాజ్యములో ప్రజాదరణ పొందుట గురించి.

పద్నాలుగవ భాగము, రోగాలను వ్యాపింప చేయుటానికి, భ్రాంతి కల్గించే పౌడర్లు మరియు రసాయనాల తయారి గురించి.

పదిహేనవ భాగము, గ్రంధ రచనా ప్రణాళికకు కేటాయించబడింది.

## 4.4 సామాజిక వ్యవస్థ :

కౌటిల్యుడు, మనువు మరియు ఇతర వేద పండితుల వలెనే వర్ణ వ్యవస్థను సమర్థించినాడు. సమాజమును నాలుగు వర్గములుగా లేక వర్ణములుగా విభజించినాడు.

1.బ్రాహ్మణులు, 2. క్షత్రియులు, 3. వైశ్యులు, 4. శూద్రులు. ప్రతి వర్ణమునకు కొన్ని బాధ్యతలను అప్పగించటం జరిగింది. ఆయా వర్ణముల ప్రజలు తమతమ బాధ్యతలను నిర్వహించాలి. తమ బాధ్యతలను నిర్వహించిన వారు స్వర్గానికి వెళతారు, మోక్షప్రాప్తిని పొందుతారని కౌటిల్యుడు తెల్పినాడు. వివిధ వర్ణముల వారు తమతమ బాధ్యతలను నిర్వహించక పోతే అరాచకము ప్రబలి, రాజ్యము సర్వనాశనమవుతుంది. వివిధ వర్ణముల వారు తమకు అప్పగించిన బాధ్యతలను నిర్వహించేలా చర్యలు తీసికోవడము రాజు యొక్క బాధ్యత.

అధ్యయనము, మేధోపరమైన మరియు దైవ సంబంధమైన బాధ్యతలను నిర్వహించుట, బోధించుట, యజ్ఞయాగాదులను నిర్వహించుట, బహుమతులను ఇచ్చుట, స్వీకరించుట బ్రాహ్మణుల యొక్క బాధ్యత.

క్షత్రియులు అధ్యయనము, యజ్ఞయాగాదులు నిర్వహించుట, బహుమతుల నిచ్చుట, సైనిక వ్యవహారాలు, ప్రాణరక్షణ, మొదలైన బాధ్యతలు నిర్వహించాలి. వారు రాజ్యరక్షణ, సమాజ రక్షణ బాధ్యతలను చేపట్టాలి.

వైశ్యులు అధ్యయనము, బలులను ఇచ్చుట, వ్యవసాయము, పరిశ్రమలు,వ్యాపారము మొదలగు బాధ్యతలు నిర్వహించుట.

శూద్రులు, పై మూడు వర్ణముల వారికి సేవ చేయాలి. శూద్రులు వ్యవసాయము, పశుపోషణ, వ్యాపారము కూడా చేయవచ్చుని కౌటిల్యుడు తెల్పినాడు. మనువుతో పోలిస్తే కౌటిల్యుడు కొంత అభ్యుదయవాదిగా కన్పిస్తాడు.

కౌటిల్యుడు, వ్యక్తి యొక్క మతపరమైన జీవితమును నాలుగు దశలుగా విభజించాడు. 1. బ్రహ్మ చర్యము 2. గృహస్థ 3.వనప్రస్థ 4. పరివ్రాజక .

1. బ్రహ్మచర్యము : వ్యక్తి విద్యార్థిగా వేదములనభ్యసిస్తూ తన అధ్యాపకునికి లోబడి, యాచన ద్వారా జీవించాలి.

2. గృహస్థ : ఈ దశలో వ్యక్తి తన వృత్తి ద్వారా జీవనభృతిని సంపాదించుకుంటూ తన భార్యతో వివాహ జీవితము గడపాలి. తన పూర్వీకులకు, అతిధులకు, సేవకులకు బహుమతులనివ్వాలి.

3. వనప్రస్థ : ఈ దశలో అడవులకు వెళ్ళి పరిశుద్ధమైన జీవితము గడుపుతూ, నేలపై నిద్రిస్తూ , అగ్నిని పూజిస్తూ జీవించాలి.

4. పరివ్రాజక : ఈ దశలో ఐహిక సుఖములను విసర్జించి, సన్యాసిగా ప్రాపంచిక కార్యకలాపాల నుండి వైదొలగాలి. కౌటిల్యుడు ఈ దశలో ఐహిక సుఖములను విసర్జించాలని చెబుతూనే తన కుటుంబం జీవించటానికి అవసరమైన వనరులను సమకూర్చకుండా పరివ్రాజక ఆశ్రమాన్ని స్వీకరించిన వారిని శిక్షించాలని సూచించినాడు.

కౌటిల్యుడు 8 రకముల వివాహ పద్ధతులను వివరించినాడు. ఏకపత్నీ వ్రతమే సాధారణ వివాహ వ్యవస్థ. ఒకే వర్ణములోని స్త్రీ పురుషుడు పవిత్రముగా వివాహము ద్వారా ఐక్యము కావటాన్ని సమర్థించినాడు. బానిసత్వమును గురించి ప్రాస్తూ ఆర్యులను ఎవ్వరూ బానిసలుగా చేయరాదు. ఆర్యకుమారుని విక్రయించుట శిక్షార్హము. ఆర్థిక ఇబ్బందుల వలన ఎవ్వరైనా ఆర్యుడు తనంతతానుగా బానిసగా మారితే తన రుణమును తీర్చిన తరువాత బానిసతనము నుండి విముక్తి పొందవచ్చును. బ్రాహ్మణులకు ఉన్నత స్థానము ఉన్నప్పటికీ శూద్రులకు గతంలో కంటే మెరుగైన పరిస్థితి కల్పించబడింది. కౌటిల్యుడు శూద్రులకు పౌరులుగా గుర్తింపునివ్వటం జరిగింది. కౌటిల్యుని సామాజిక వ్యవస్థతో పోలిస్తే అభ్యుదయకరమైనది.

## 4.4.1 స్త్రీల స్థానము :

కౌటిల్యునికి స్త్రీల పట్ల గౌరమున్నది. రాజ్యము స్త్రీల గౌరవాన్ని కాపాడాలని కౌటిల్యుడు తెల్పినాడు. కౌటిల్యుడు వివాహము, విడాకుల అంశాలలో స్త్రీలకు ఎక్కువ గౌరవాన్నిచ్చాడు. వివాహము పవిత్రమైనదిగా కౌటిల్యుడు భావించాడు. స్త్రీ పురుష సంబంధాలు పరస్పర ఆధారితాలుగా భావించాడు. స్త్రీ తన భర్త తన పట్ల బాధ్యతగా ఉన్నంత కాలం, స్త్రీ తన భర్తకు లోబడి సేవ చేయాలి. భర్త చాలా కాలము భార్యకు దూరముగా వేరే ప్రాంతములో ఉన్నప్పుడు, నయము చేయటానికి వీలుకాని వ్యాధితో బాధ పడుతున్నప్పుడు, అసమర్థుడైనప్పుడు పునర్వివాహము చేసికొనవచ్చును. భార్యాభర్తలు స్నేహపూర్వక జీవితాన్ని జీవించాలి. భార్యాభర్తలు ఇద్దరూ కోరుకున్నట్లయితే విడాకులను కూడా కౌటిల్యుడు అనుమతించినాడు. కౌటిల్యుడు పేద స్త్రీల పట్ల జాలి చూపించాడు. పేద గర్భవతియైన స్త్రీలకు ఆర్థిక సహాయము అందించాలని సూచించినాడు. వేశ్యా కుమార్తెలకు కూడా రక్షణ కల్పించాలని, యుక్త వయస్సు రాని బాలికలతో బలవంతముగా సంబంధము నేర్పరచుకొన్న వారిని, వితంతువుల శీలమును హరించిన వారిని, శిక్షించాలని కౌటిల్యుడు సూచించినాడు. పై అంశములను బట్టి కౌటిల్యుడు స్త్రీల పట్ల ఎంత గౌరవము కల్గియుండాలని ఆశించాడో అర్థము చేసి కొనవచ్చును.

## 4.5 రాజ్యవ్యవస్థ :

రాజ్య ఆవిర్భావము, స్వభావము, విధులను గూర్చి వివరించడానికి పాశ్చాత్య పండితులు చాలా కృషి చేసినారు. భారతదేశములో కూడా కౌటిల్యునికి ముందు కొంత మంది తత్వవేత్తలు పై అంశములను వివరించటానికి ప్రాధాన్యతనిచ్చారు. కానీ కౌటిల్యుడు ప్రాధమికంగా పరిపాలనను వివరించటానికి అధిక ప్రాధాన్యతనిస్తూ అక్కడక్కడ రాజ్య ఆవిర్భావము గురించి కూడా తన అభిప్రాయములను వ్యక్తము చేసినాడు.

రాజ్యము ఏర్పడటానికి ముందు ఉన్న ప్రాకృతిక వ్యవస్థ మత్స్య న్యాయ సూత్రాన్ని అనుసరించియున్నదని కౌటిల్యుడు తెల్పినాడు. అనగా పెద్దచేప చిన్న చేపను మింగి వేయటం సూత్ర ఆధారముగా సమాజం ఉంది. సమాజములో శాంతి భద్రతలు లోపించాయి. బలహీనుడికి రక్షణ లేదు. అట్టి పరిస్థితులను అధిగమించడానికి ప్రజలు వైవశ్వతమనువును రాజుగా అంగీకరించారు. దీనికి ప్రతిగా ప్రజలు ప్రభువుకి కొంత మొత్తాన్ని పన్నుల రూపంలో చెల్లించటానికి అంగీకరించారు. అనగా ప్రజలకు, ప్రభువుకు మధ్య జరిగిన ఒడంబడిక ప్రకారము రాజ్యము ఏర్పడింది. ప్రజలు తమ ప్రయోజనాలను పరిరక్షించుకోవటానికి ఈ ఒడంబడిక చేసుకొన్నారు. కనుక [illegible] రక్షణ కల్పించటం, వారి సంపదను వృద్ధిచేసుకోవడానికి అనువైన వాతావరణాన్ని కల్పించటం ప్రభువు యొక్క బాధ్యత. కౌటిల్యుడు భారతదేశపు 'ఒడంబడిక' సిద్ధాంత కర్త. ప్రముఖ పాశ్చాత్య 'ఒడంబడిక'(Contractualists) సిద్ధాంతకర్తలైన హాబ్స్, లాక్, రూసోల కంటే చాలా ముందుగానే కౌటిల్యుడు ఈ సిద్ధాంతమును ప్రతిపాదించినాడు.

## 4.6 సప్తాంగ సిద్ధాంతము :

సప్తాంగ సిద్ధాంతమును ప్రతిపాదించినవాడు మనువు. మనువు రాజ్యమునకు ఏడు అంగాలు లేక మూల సూత్రాలను వివరించినాడు. మనువుకు, కౌటిల్యునికి మధ్యకాలములోని భారతీయ తత్వవేత్తలు కూడా తమ రచనలలో అదే సప్తాంగ సిద్ధాంతమును అదే క్రమములో, అంతే ప్రాధాన్యత నిస్తూ వివరించినారు. కౌటిల్యుడు కూడా సప్తాంగ సిద్ధాంతమును వివరించినాడు కానీ దాని యొక్క

ప్రాధాన్యత క్రమాన్ని స్వల్పముగా మార్పు చేసినాడు. అంతే కాక 'శత్రువు' అను నూతన అంగాన్ని జోడించినాడు. రాజ్యము యొక్క సప్తాంగములు కౌటిల్యుని ప్రాధాన్యతాక్రమములో ఈ క్రింది విధముగా ఉన్నాయి. 1. రాజు 2. మంత్రులు 3. రాజ్యము (జనపద) 4. దుర్గము 5. కోశాగారము 6. సైన్యము (బల) 7. మిత్రులు మరియు శత్రువు. శరీరములోని వివిధ అంగాలు శరీరము సక్రమముగా పనిచేయటానికి ఎంత ప్రాధాన్యతను కల్గియుంటాయో, రాజ్యము సక్రమముగా పనిచేయాలంటే 'శత్రువు' కాకుండా మిగిలిన ఏడు అంగాలు సక్రమముగా ఉండాలి. సప్తాంగాలలో రాజుకు కేంద్ర స్థానాన్ని కల్పించినాడు. రాజు మరియు అతని రాజ్యము ప్రాథమిక అంగాలుగా కౌటిల్యుడు పేర్కొన్నాడు.

### 4.6.1.రాజు :

రాజ్యములో రాజు అత్యంత కీలక స్థానము కల్గియుంటాడు. వాస్తవానికి రాజుకు రాజ్యమునకు పెద్ద తేడా లేదు. రాజే రాజ్యము, రాజ్యమే రాజు. ప్రభుత్వము మొత్తము రాజు చుట్టూ పరిభ్రమిస్తుంది. రాజు అన్ని కీలకమైన నియామకాలు చేపడతాడు. రాజ్యములోని ఉన్నతాధికారులందరూ రాజు యొక్క ప్రత్యక్ష నియంత్రణలో పనిచేస్తారు. రాజు దాతృత్వ స్వభావము కల్గినవాడు. ఎందువలననగా తన ప్రజలను సంతోషంగా ఉండేలా చేయటం, వారికి రక్షణ కల్పించటం రాజు యొక్క ప్రాథమిక బాధ్యత. ప్రజల సంక్షేమము, రాజ్య రక్షణ రాజు యొక్క విధి.

### 4.6.2 మంత్రి వర్గము :

రాజు అత్యంత ఉన్నతాధికారములు కల్గియుంటాడు. అయితే రాజు ఒక్కడే రాజ్యాన్ని పాలించలేడు. ఒకే చక్రం ముందుకు కదలలేదని కౌటిల్యుడు భావించాడు. అందువలన రాజు, పరిపాలనలో ఇతర అధికారుల సహాయ సహకారములను తీసికోవాలని కౌటిల్యుడు వివరించినాడు. రాజు తన మంత్రులను సంప్రదించాలి. మంత్రులు జ్ఞానవంతులును, స్థిరత్వము కల్గినవారుగాను, ధైర్యవంతులు, విధేయత లాంటి లక్షణాలు కల్గియుండాలి. మంత్రుల యొక్క స్థిరత్వాన్ని, సమర్ధతను పరీక్షించాలి. రాజు పట్ల విధేయతను, ధనాశను, స్త్రీలోలత్వమును, కష్టకాలములో స్థిరంగా బాధ్యతలను నిర్వహించగల్గిన ధీరత్వమును, స్వయం నియంత్రణ మున్నగు లక్షణాలను రాజు పరీక్షించాలి. మనువు, బృహస్పతి, వ్యాసుడు, మంత్రుల సంఖ్య ఎంత ఉండాలనే అంశమును నిర్ణయించినప్పటికీ, కౌటిల్యుడు అవసరమైనంత మేరకు మంత్రులను నియమించుకోవాలని వివరించినాడు. అయితే మంత్రి వర్గము మరీ పెద్దదిగాను, మరీ చిన్నదిగాను ఉండరాదని కౌటిల్యుడు సూచించినాడు.

మంత్రి వర్గము రాజుకు సలహా మండలిగా వ్యవహరిస్తుంది. రాజు మంత్రులతో ఒక్కొక్కరిగాను, సమిష్టిగాను సంప్రదింపులు జరుపవచ్చు. సాధారణముగా మెజారిటీ మంత్రుల అభిప్రాయమును రాజు గౌరవిస్తాడు. అయితే తప్పక గౌరవించాలనే నియమంలేదు. మెజారిటీ మంత్రుల నిర్ణయము సరియైనది కాదని రాజు భావించినట్లయితే వారి నిర్ణయమును తిరస్కరించి రాజు తనకిష్టమొచ్చిన విధానమును అమలు పరచవచ్చును. కౌటిల్యుడు వివరించిన మంత్రి వర్గమునకు ఆధునిక కేబినెట్ లక్షణములు లేవు. అది కేవలము సలహా మండలి మాత్రమే. కొన్ని సందర్భాలలో రాజు ఒకరిద్దరు మంత్రులతో మాత్రమే సంప్రదించవచ్చును లేక రాజు తనంత తానుగా నిర్ణయములను తీసికొనవచ్చును. ఇది కాలము, స్థలము, మరియు నిర్ణయాలు తీసికొనవలసిన అంశము పై ఆధారపడియుంటుంది.

మంత్రులు సలహా మండలిగానే కాక రాజు చేసిన నిర్ణయములను అమలు పరచవలసిన బాధ్యతను కూడా కల్గియుంటారు. రాజు మంచి వ్యక్తులను అధికారులుగా నియమించుకోవాలి. అధికారులు ఈ క్రింది లక్షణములను కల్గియుండాలని కౌటిల్యుడు తెల్పినాడు. స్థానికులై యుండాలి, ఉన్నత కుటుంబానికి చెందిన వారైయుండాలి, నైపుణ్యత కల్గిన వారు, ముందు చూపు, తెలివి, స్థిర నిర్ణయము, ధైర్యము, ఆత్మ గౌరవము, సత్ప్రవర్తన, ఉత్సాహము, బలము, మంచి ఆరోగ్యము, చపలచిత్తత లేకుండా, ప్రేమ మొదలగు లక్షణాలు కల్గియుండాలి. సాధారణ లక్షణాలతో పాటు మంత్రులకు సాంకేతిక అర్హతలు కూడా ఉండాలి. మంత్రుల నియామకంలో రాజు మరియు రాణి జోక్యము చేసి కోకుండా, రాజుచే నియమించబడిన మూడవ వ్యక్తి మంత్రుల నియామకం బాధ్యతలను చేపట్టాలి. ప్రత్యక్ష మరియు పరోక్ష పరీక్షల అనంతరము మంత్రుల ఎంపిక జరగాలని రాజుకు కౌటిల్యుడు సూచించాడు.

### 4.6.3 జనపద :

ప్రజలు మరియు రాజ్య భూభాగము జనపద పరిధిలోకి వస్తాయి. రాజ్య భూభాగము సారవంతమైన భూములు, గనులు, అడవులు, గడ్డి భూములు, నీటి మార్గములు మొదలైన వాటితో సమృద్ధిగా ఉండాలి. మరియు రాజ్య భూభాగములో నివసిస్తున్న ప్రజలు మంచి ప్రవర్తన, విధేయత మరియు తెలివితేటలు కల్గియుండాలని కౌటిల్యుడు వివరించినాడు.

### 4.6.4 దుర్గము :

దుర్గము అంటే భాషాపరమైన అర్థము 'కోట' అయినప్పటికీ కౌటిల్యుడు రాజధాని పట్టణ దుర్గమును గూర్చి వివరించినాడు. రాజధాని పట్టణము కేంద్ర స్థానములో ఉండాలనీ, వివిధ వర్ణముల వారికి ప్రత్యేక నివాస ప్రాంతములుండాలని, చేతివృత్తుల వారికి మరియు దేవుళ్ళకు ప్రత్యేక స్థానము ఉండాలని కౌటిల్యుడు భావించాడు. శత్రువుతో యుద్ధానికి సంబంధించిన వివిధ ఏర్పాట్లు కోట నుండే జరగాలని భావించినాడు.

### 4.6.5 కోశ (ధనాగారము) :

ధనాగారము విలువైన బంగారము, వజ్రములు, రత్నములతో నింపబడాలి. ధనాగారము సైనిక వ్యయము, అధికారుల జీతభత్యములు మరియు రాజు నిర్వహించే కార్యకలాపముల వ్యయమును భరించేదిగా ఉండాలి. ధనాగారము ఎటువంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనగల్గినదిగా ఉండాలి. కౌటిల్యుడు ధనాగారము సమృద్ధిగా ఉండాలని చెప్పినా, దానిని నింపటానికి నైతికమైన, ఆమోదయోగ్యమైన పద్ధతులను అవలంభించాలని తెల్పినాడు.

### 4.6.6 బల (సైన్యము) :

రాజు అంతర్గత సంఘర్షణలను, విదేశీ దురాక్రమణలను అణచివేయటానికి బలమైన సైన్యమును కలిగియుండాలి. కౌటిల్యుడు ఆరు రకముల సైన్యమును గురించి వివరించినాడు. 1. వారసత్వముగా వస్తున్న సైన్యము, 2. కిరాయికి తీసికొన్న సైన్యము, 3. నగర పాలక సంస్థలకు చెందిన సైన్యము, 4. మిత్రదేశాల సైనికులు, 5. శత్రుదేశాలనుండి వచ్చి చేరిన సైనికులు, 6. గిరిజన తెగలకు చెందిన సైనికులు. కౌటిల్యుడు వారసత్వ సైనికులవైపే మొగ్గు చూపటం జరిగింది. మనువు వలె కాకుండా కౌటిల్యుడు క్షత్రియులతో పాటు దిగువ వర్గాల వారు కూడా అత్యవసర పరిస్థితిలో సైన్యములో చేరవచ్చునని సూచించాడు. సైన్యము యుద్ధము చేయటంలో వివిధ ఆయుధాలను ఉపయోగించటంలో సుశిక్షితులైయుండాలి. అన్నింటి కంటే సైన్యము రాజుకు విధేయత కల్గియుండాలని కౌటిల్యుడు తెల్పినాడు.

### 4.6.7 మిత్రులు :

సరియైన మిత్రదేశము శత్రువును ఎదుర్కోవటంలో సహాయపడుతుంది. మిత్రులు రెండు రకములుగా ఉంటారు. 1. సహజ మిత్రుడు 2. కృత్రిమ మిత్రుడు.

సహజ మిత్రదేశము రాజు యొక్క తాత తండ్రుల కాలము నుండి మిత్రుడుగా ఉన్న దేశము. కృత్రిమ మిత్రుడు ప్రస్తుత లక్ష్యాలను సాధించుకోవటానికి ఏర్పరచుకొన్న మిత్రుడు. కౌటిల్యుడు సహజ మిత్రుల పట్ల మొగ్గు చూపినాడు.

ఈ ఏడు అంగాలు పరస్పర సహకారముతో పని చేసిన ఎడల అవి విలువైన సంపదగా రాజుకు ఉపయోగపడతాయి. తెలివైన, సమర్థుడైన, స్వీయనియంత్రణ కల్గిన రాజు బలహీనముగా ఉన్న అంగములను గుర్తించి వాటిని బలోపేతము చేయడానికి ప్రయత్నిస్తాడు. బలహీనుడు, దుర్మార్గుడైన రాజు బలమైన అంగాలను కూడా నాశనము చేస్తాడు.

## 4.7 రాజు యొక్క స్థానము :

కౌటిల్యుని రాజకీయ వ్యవస్థలో రాజు కేంద్ర స్థానమును కల్గియుంటాడు. రాజు ఆత్మ అయితే మిగిలిన ఆరు అంగాలు రాజు యొక్క శరీర భాగాలు. కౌటిల్యుడు వంశ పారంపర్యపాలనను సమర్ధించినాడు. నూతన బలమైన రాజు కంటె వంశ పారంపర్యంగా వచ్చే రోగ గ్రస్తుడైన రాజే మిన్నయని కౌటిల్యుడు తెల్పినాడు. రాజు రాజవంశానికి చెందిన వాడైయుండాలి. రాజు యొక్క శక్తి కంటే అతని రాజవంశపుట్టుక ఉన్నతమైనది. అతని ఉన్నత స్థాయి పుట్టుక మంచి పాలనకు, ప్రజల య్ముక్క విధేయతను పొందటానికి దోహదము చేస్తుంది. అధికారులు, ప్రజలు, ఇతర కుటుంబముల నుండి వచ్చిన రాజు కంటే వంశ పారంపర్యంగా రాజైన వానికి ఎక్కువ విధేయత కల్గియుంటారని కౌటిల్యుడు తెల్పినాడు.

## 4.8 రాజు - విద్య :

కౌటిల్యుడు రాజు యొక్క విద్యకు, శిక్షణకు ఎక్కువ ప్రాధాన్యత నిచ్చినాడు. రాజు మేధోపరంగా మరియు నైతికపరంగా బలంగా ఉండాలని కౌటిల్యుడు భావించినాడు. రాజ కుమారుడు తన 'చుడకర్మ' ( కొంతమేరకు గుండు గీయించే మతపరమైన ఆచారము) పూర్తయిన తరువాత చదవటము, అంకగణితము నేర్చుకోవాలి. పట్టాభిషేకము తరువాత పవిత్ర గ్రంధము (వేదములు) లోని నియమములను, తత్వచింతనను సంస్కారవంతులైన అధ్యాపకులవద్ద నేర్చుకోవాలి. ఆర్థిక శాస్త్రాన్ని పాలనా విభాగాధిపతుల వద్ద, అనుభవజ్ఞుల వద్ద రాజకీయాలను అధ్యయనం చేయాలి. ఈ అధ్యయనము 16 సంవత్సరములు వచ్చి గుండు గీయించే మతపరమైన పండుగ జరిగి వివాహమయ్యేంత వరకూ కొనసాగుతుంది. రాజకుమారుడు విద్యాభ్యాస కాలములోనే సైనిక శిక్షణను పగలు మొదటి అర్ధ భాగములో పొందాలని, రెండవ భాగములో సాంప్రదాయ చరిత్రను అధ్యయనం చేయాలని, మేధోపరమైన శిక్షణతో పాటు నైతిక క్రమశిక్షణమ అలవరచుకోవాలని కౌటిల్యుడు తెల్పినాడు. తృష్ణ , కోపము, అత్యాస, గర్వము, సోమరితనము, అత్యానందము వంటి ఆరు శత్రువులను నియంత్రించుకొనుటను అధ్యాపకుల వద్ద నేర్చుకోవాలి. రాజకుమారుడు నైతిక విద్య ద్వారా ఇంద్రియ నిగ్రహంను అలవర్చుకొనగల్గుతాడు. రాజు శక్తివంతుడే కాని స్వీయ నియంత్రణ లేకపోతే పతనమౌతాడు. కౌటిల్యుడు రాజకుమారునికి విద్యను, మంచి గుణగణములను పెంపొందింపచేయుటకు అధిక ప్రాధాన్యతనిచ్చినాడు. నైతిక క్రమశిక్షణ లేని రాజు రాజ్యానికి ప్రమాదకరమౌతాడు. సుఖలోలుడు రాజుగా ఉండుటకు తగడు. రాజు తన ప్రజల ప్రయోజనాల పరిరక్షణకు కట్టుబడి యుండాలి మరియు ప్రజలకు అందుబాటులో యుండాలి. కౌటిల్యుని ప్రకారము ఆదర్శవంతమైన రాజు నియంత, స్వార్ధ పరుడూ కాకూడదు. రాజుకు ప్రజల యొక్క ప్రయోజనాలే తన ప్రయోజనాలు, ప్రజా సంక్షేమమే తన సంక్షేమము, ప్రజల సంతోషమే తన సంతోషము. తన ప్రజలు కోరుకున్నట్లయితే రాజు తన భార్యను కూడా త్యజించడానికి సిద్ధంగా ఉండాలని కౌటిల్యుడు తెల్పినాడు.

## 4.9 రాజు యొక్క అధికారములు :

కౌటిల్యుడు వివరించినట్లు రాజు శక్తిమంతుడ కాని నియంత కాదు. రాజు అనెక అధికారాములను కల్గియున్నప్పటికీ అవి తన దేశ రక్షణ కొరకు మరియు తన ప్రజల సుఖ సంతోషాల కోసమే ఉపయోగించాలి. రాజు ముఖ్యపాత్రను పోషిస్తూ కేంద్ర బిందువుగా ఉంటాడు. రాజు యొక్క అధికారములను ఈ క్రింది విధముగా విభజించవచ్చును.

### 4.9.1 కార్యనిర్వాహక మరియు పాలనాపరమైన అధికారాలు :

రాజు తన మంత్రులను, అధికారులను, గూఢచారులను, రాయబారులను మరియు ఇతర అధికారులను నియమిస్తాడు. తన అధికార్ముల సహాయంతో రాజ్యములో శాంతి భద్రతలను కాపాడుతాడు. తన సైన్యము యొక్క సహకారముతో విదేశీ దండయాత్రల నుండి దేశాన్ని కాపాడుతాడు, మరియు గూఢచారుల, రాయబారుల సహాయంతో విదేశీ వ్యవహారాలను నిర్వహిస్తాడు. అవినీతి అధికారులను శిక్షిస్తాడు. నేరస్తులను శిక్షిస్తాడు.

## 4.9.2 శాసనాధికారములు :

రాజు తనంతతాను శాసనాలను రూపొందించినప్పటికీ, వేద గ్రంధాలు, ఆధ్యాత్మిక సూత్రాలు, ఆచార వ్యవహారాల ఆధారంగా రూపొందిన చట్టాలను పరిరక్షించాలి. పై చట్టాలకు అనుబంధ చట్టాలను రాజు రూపొందిస్తాడు. సాంఘిక ఆచారాలకు సంబంధించి శాసనాలను చేసే అధికారము రాజుకు లేదు.

## 4.9.3 న్యాయాధికారాలు :

రాజ న్యాయాధిపతులను నియమిస్తాడు. వారు న్యాయమును సక్రమముగా, నిష్పక్షపాతంగా అందించేలా చూడటం రాజు యొక్క బాధ్యత. అన్యాయస్థులు, పక్షపాతవైఖరి కల్గిన న్యాయాధికారులను రాజు శిక్షించవచ్చును. న్యాయాధికారి అన్యాయముగా భౌతిక శిక్షను విధించినట్లయితే రాజు అదే శిక్షను ఆ న్యాయాధికారికి విధించవచ్చునని కౌటిల్యుడు సూచించినాడు.

## 4.9.4 ఆర్థికాధికారాలు :

రాజు పన్నులను విధించుట ద్వారా వనరులను సమీకరించుకొనవచ్చును. ధనాగారము, వజ్రములు, బంగారము, రత్నములతో నిండి ఉండేలా చూడాలి. వ్యాపారస్థులను, పరిశ్రమలను నియంత్రించాలి. వస్తువుల ధరలను క్రమబద్దీకరించాలి. మోసము చేసే వ్యాపారులను శిక్షించే అధికారము రాజుకుంటుంది.

## 4.9.5 సైనికాధికారములు :

రాజు సర్వసైన్యాధ్యక్షుడు. రాజు యుద్ధమును ప్రకటించుటకు, శాంతి ఒడంబడికలు చేసుకొనటానికి అధికారముంటుంది. యుద్ధములో విజయము సాధించటానికి రాజు ఎటువంటి వ్యూహమునయినా రూపొందించవచ్చును.

## 4.9.6 సామాజిక క్రమాన్ని పరిరక్షించే అధికారము :

కౌటిల్యుని ప్రకారము సామాజికక్రమమనగా కులాధారిత స్వధర్మము. సమాజములో ప్రతివ్యక్తి తన సహజ ధర్మమును నిర్వహించాలి. రాజు, ప్రజలందరూ తమ స్వధర్మమును పాటించేలా చర్యలు తీసుకోవాలి. ప్రజలు తమ స్వధర్మమును నిర్వహించక పోతే సమాజములో క్రమశిక్షణ లోపించి అరాచకము ప్రబలుతుంది. కనుక రాజు సామాజిక క్రమమును పరిరక్షించే అధికారము కల్గియుంటాడని కౌటిల్యుడు తెల్పినాడు.

## 4.10 శాస్త్రయుక్తమైన పాలన :

కౌటిల్యుని అర్థశాస్త్రము ప్రాథమికంగా పాలనా శాస్త్రము. పాలన ప్రజాదృక్పథము కల్గియుంటుందని కౌటిల్యుడు స్పష్టముచేసినాడు. ప్రజలకు సేవలందించటము ప్రాతిపదికగా పాలన సరియైనదా ? కాదా ? అనే అంశాన్ని నిర్ణయించాలి. రాజు పట్టాభిషేకము సందర్భములో ఈ క్రింది విధముగా ప్రమాణము చేస్తాడు." తాను ప్రజలను అణచివేసినట్లయితే తాను తన పిల్లలు స్వర్గానికి వెళ్ళము". పాలన పై కౌటిల్యుడు వ్యక్తము చేసిన అభిప్రాయములను ఈ క్రింది విధముగా విభజింపవచ్చును.

## 4.10.1 సాధారణ పాలన :

రాజు తన మంత్రులను, వివిధ పాలనావిభాగాధిపతుల పనితీరును పర్యవేక్షించాలి. వారిపై సరియైన పర్యవేక్షణ లేకపోతే అది చివరకు రాజుకే ప్రమాదము. పాలనావిభాగాధిపతులపై నిరంతర పర్యవేక్షణనుంచాలి. రాజు జాగ్రత్తగా, మెళకువగా ఉంటే తన సేవకులు కూడా జాగ్రత్తగా, మెళకువగా ఉంటారు. రాజు అజాగ్రత్తగా ఉంటే తన సేవకులు కూడా అజాగ్రత్తగా ఉంటారు. కనుక పాలన [illegible] దియు తన శత్రువులు తనను సులభముగా అధికారము నుండి తొలగిస్తారు. కౌటిల్యుడు అర్థశాస్త్రములోని

రెండవ అధ్యాయములో పాలనావిభాగాధిపతుల ధర్మములు లేక కర్తవ్యములను విపులంగా చర్చించినాడు. ఇది ప్రాచీన భారతదేశ ఉద్యోగి భాగస్వామ్యంనకు కౌటిల్యుడు అందించిన గొప్ప వరముగా పరిగణించబడుతుంది. విపత్తుల సమయములో రాజు తన ప్రజలకు అండగా ఉండాలి. తండ్రి వలె ప్రజలను కాపాడాలి. చిన్న పిల్లలను, ముసలి వారిని, రోగగ్రస్తులను, దుఃఖములో ఉన్న వారిని, పిల్లలు లేని స్త్రీలను, తండ్రి లేని పిల్లలను ఆదుకోవటము రాజు యొక్క బాధ్యత. రాజు దేవాలయాల, మైనర్ పిల్లల ఆస్తులను పరిరక్షించాలి.

## 4.10.2 విత్తపాలన :

రాజ్యమునకు, ప్రజలకు రాజు అందించే సేవలకు ప్రతిగా రాజు వ్యవసాయ ఉత్పత్తిలో 1/6 వవంతు, వర్తకుల వద్ద 1/10వ వంతు పన్నులను విధిస్తాడు. ప్రజలు తమ ప్రయోజనము కొరకే రాజుకు పన్నులు చెల్లిస్తారు. కౌటిల్యుని అభిప్రాయములో ధనాగారము చాలా ముఖ్యమైనది. ధనము లేకపోతే సైన్యము శత్రువులతో చేతులు కలిపి తిరుగుబాటు చేయవచ్చు. ధనాగారము ఎప్పుడూ నిండుగా ఉండాలి. లేకపోతే అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయి. పన్నులను విధించేటప్పుడు ప్రజల స్థితిగతులను పరిగణనలోనికి తీసికోవాలి. కానీ పన్నులను వసూలు చేసేటప్పుడు మాత్రము కఠినముగా వ్యవహరించాలి. ఆదాయ, వ్యయ లెక్కలను నిర్వహించాలి. వ్యాపార లావాదేవీలకు రాజు బాధ్యత వహించాలి. గనులు, బంగారము, అటవీ ఉత్పత్తులు రాజు యొక్క నియంత్రణలో ఉండాలి. తూకము, కొలతలను పర్యవేక్షించాలి మరియు ధరలను నిర్ణయించాలి. వివిధ సుంకములు రాజ్యానికి ఆదాయ వనరులు కనుక వాటి పట్ల దృష్టి సారించాలి. ప్రభుత్వానికి పన్ను చెల్లించకుండా ఏదీ ఉత్పత్తి చేయరాదు, అమ్మరాదు, కొనరాదు, పంపిణీ చేయరాదు. మద్యము, జూదము, వ్యభిచారము నుండి కూడా పన్నుల రూపేణా ప్రభుత్వానికి ఆదాయము లభిస్తుంది. న్యాయస్థానాలు విధించే జరిమానాలు కూడా ప్రభుత్వానికి ఆదాయ మార్గమే.

## 4.10.3 న్యాయపాలన :

కౌటిల్యుడు న్యాయపాలనకు చాలా ప్రాధాన్యతనిచ్చాడు. సత్వర న్యాయము, సరియైన న్యాయము అందించ సూచనలు చేశాడు. న్యాయం అందించటము ఆలస్యము చేయటమంటే, న్యాయాన్ని నిరాకరించటమే అని కౌటిల్యుడు తెల్పి న్యాయపాలనకు కౌటిల్యుడు ప్రత్యేక స్థానము కల్పించినాడు. న్యాయస్థానాలు ప్రజలకు అందుబాటులో ఉండాలనే భావనతో సంచార కోర్టులను ఏర్పాటు చేయాలని సూచించినాడు. న్యాయపాలనను వికేంద్రీకరించాలన్నాడు. ప్రభుత్వ సమర్థత నిష్పక్షపాతంగా న్యాయాన్ని అందించే న్యాయవ్యవస్థపై ఆధారపడియుంటుంది. న్యాయం సమర్థవంతంగా, ప్రజాస్వామ్యయుతంగా అందించటానికి కౌటిల్యుడు అనేక సూచనలు చేసినాడు.

కౌటిల్యుడు చట్టములు నాలుగు రకాలుగా ఉంటాయని తెల్పినాడు. 1. ధర్మ (పవిత్ర చట్టము) 2. వ్యవహార 3. చరిత్ర 4. రాజశాసనం. రాజశాసనానికి మరియు ఇతర మూడు రకముల చట్టాలకు మధ్య సంఘర్షణ ఏర్పడినపుడు రాజశాసనమే అమలు జరుపబడుతుంది. కౌటిల్యుడు 17 రకముల చట్టాలను గూర్చి వివరించినాడు. కౌటిల్యుడు సివిల్ చట్టానికి, క్రిమినల్ చట్టానికి మధ్య తేడాను వివరించినాడు. కౌటిల్యుడు రెండు రకాల న్యాయస్థానాలను గురించి వివరించినాడు.

1.ధర్మస్థీయ 2. కంటక శోధన

ధర్మస్థీయ న్యాయస్థానాలు సాధారణ పాలనకు సంబంధించిన వివిధ అంశాలకు సంబంధించి విచారణ జరుపుతాయి. కంటక శోధన న్యాయస్థానాలు సమాజ వ్యతిరేక కేసులను అధికారుల దుష్ప్రవర్తనకు సంబంధించిన నేరాలను విచారిస్తుంది. సమాజాభివృద్ధికి అడ్డుగా ఉన్న అంశాలను తొలగించటానికి ఇవి ఉపయోగపడతాయి. మనువు వలెనే కౌటిల్యుడు నేరస్తులకు విధించవలసిన శిక్షలను సూచించినాడు. శిక్షలు న్యాయబద్ధంగా ఉండాలని, నేరమునకు, శిక్షకు మధ్య సమన్వయముండాలని కౌటిల్యుడు సూచించినాడు. ఎవరైతే తీవ్రమైన శిక్షలను అమలు పరుస్తారో వారు ప్రజాకంటకులవుతారు. ఎవరైతే తేలికపాటి శిక్షలను విధిస్తారో వారు అధికారము నుండి తొలగింపబడతారు. ఎవరైతే న్యాయమైన శిక్షలను విధిస్తారో వారు గౌరవింపబడతారని కౌటిల్యుడు తెల్పినాడు. శిక్ష తీవ్రంగానూ

ఉండరాదు మరియు తేలికగానూ ఉండరాదు. శిక్ష న్యాయబద్ధంగా ఉండాలి. ప్రజల రక్షణ కొరకు దండన లేక శిక్ష తప్పక ఉండాలని కౌటిల్యుడు తెల్పినాడు.

## 4.10.4 సైనిక పాలన :

రాజ్య రక్షణకు సైన్యము అవసరము. సైన్యమే రాజును పదవీచ్యుతుడను చేయవచ్చు కూడా. కనుక రాజు తన సైన్యమును సంతోషపరచటానికి ప్రయత్నించాలి. ప్రభుత్వ బలము, స్థిరత్వము తన సైన్యము యొక్క నిరంతర మద్దతుపై ఆధారపడియుంటుంది. తన సైన్యము యొక్క మద్దతును పొందటానికి రాజు, సైన్యములో తానూ ఒకడిగా గుర్తింపు పొందాలి. యుద్ధ సమయంలో రాజు, సైన్యములో తానూ ఒక సైనికుడిగా వ్యవహరిస్తూ తన సైన్యాన్ని ఉత్సాహ పర్చాలి. రాజు నాలుగు రకములైన సైన్యాన్ని కలిగియుండాలి. 1.గజ దళము 2. అశ్విక దళము 3. రథ బలము 4. కాల్బలము. రాజు ఈ నాలుగు దళాధిపతులను వేర్వేరుగా నియమించాలి. నాలుగు దళాలు ఒకే అధిపతి నియంత్రణలో ఉంటే అది రాజుకు ప్రమాదము. ఎందువలననగా ఆ సైన్యాధిపతి బలవంతుడౌతాడు లేక శత్రువు అతనిని లోబరచుకొని ఆ రాజును యుద్ధములో ఓడించవచ్చు. రాజు బలవంతుడైనా, బలహీనుడైనా శత్రువును ఓడించటానికి మోసము, ద్రోహము చేయటముతో పాటు వివిధ వ్యూహాలను రూపొందించి అమలు పరచటం ద్వారా ఓటమిని తప్పించుకొనగలడు.

## 4.10.5 రాజుకు రక్షణ :

కౌటిల్యుడు రాజు యొక్క రక్షణకు అధిక ప్రాధాన్యతనిచ్చాడు. ఎందువలననగా రాజే రాజ్యము. రాజు సురక్షితముగా ఉంటే రాజ్యము సురక్షితంగా యుంటుంది. రాజకుమారుల, మంత్రుల, అధికారుల కదలికలను నిరంతరమూ గమనిస్తుండాలి. గూఢచారుల ద్వారా అధికారులపై, శత్రువులపై నిఘా ఉంచాలి. రాజు శత్రువు యొక్క అధికారులను, ప్రజలను తనవైపుకు తిప్పుకోవటానికి ప్రయత్నించాలి. శత్రురాజు యొక్క ప్రజలలో రాజు పట్ల అసంతృప్తిగా ఉన్నవారిని ఒప్పించటం ద్వారా, లంచం ఇవ్వటం ద్వారా తన వైపుకు తిప్పుకోవాలి. సంతృప్తితో ఉన్నవారిని బలప్రయోగం ద్వారా జయించాలి. రాజు తీవ్ర సంక్షోభంలో ఉన్నప్పుడు శాంతియుతంగా అధికార మార్పిడి జరిగేలా జాగ్రత్త వహించటం మంత్రుల అతిముఖ్యమైన బాధ్యతగా కౌటిల్యుడు పేర్కొన్నాడు. రాజకీయ సంక్షోభం ఏర్పడినపుడు దౌత్యపరమైన ప్రయత్నం ద్వారా సంక్షోభాన్ని నివారించాలి. రాజు పట్టణమునకు నాలుగు వైపులా కోటలను నిర్మించి రక్షణ కల్పించాలి. ధనాగారము నిండుగా లేకపోతే రాజు పతనమౌతాడు. శాంతిని సాధించటానికి యుద్ధము తప్ప వేరే మార్గము లేనపుడు రాజు యుద్ధమునకు వెనుకాడరాదు. రాజు ఎప్పుడు యుద్ధము చేయాలనే అంశముపై కౌటిల్యుడు అనేక సూచనలు చేసినాడు. రాజు ఇతర దేశములతో సంబంధములను మెరుగు పర్చుకుంటూ శత్రురాజుకు సమస్యలను సృష్టించాలని కౌటిల్యుడు తెల్పినాడు.

## 4.10.6 రాజ్య విస్తరణ :

రాజు తన రాజ్యమును విస్తరింపచేసికోవటానికి 5 మార్గములను సూచించినాడు.

1. శత్రురాజు యొక్క ప్రజలలో రాజు పట్ల ద్వేషమును రగిలించుట. రాజు తన శత్రువు యొక్క సైన్యము, అధికారులు, ప్రజలలో కోపాన్ని రేకెత్తించుట ద్వారా శత్రురాజును యుద్ధంలో ఓడించవచ్చును.

2. రాజు తన గూఢచారులను వినియోగించి తన శత్రురాజు అప్రమత్తంగా లేని సమయంలో హత్య చేయించుట. స్త్రీల పట్ల శత్రువుకున్న బలహీనతను వినియోగించుకొని శత్రురాజును హత్యచేయుట.

3. రాజు తన కుమారులను రాజ్యము నుండి బహిష్కరించినట్లు నటించి వారు తన శత్రురాజు దగ్గర ఆశ్రయము పొందేలా చేసి, వారు తన శత్రువు యొక్క విశ్వాసాన్ని పొందిన తరువాత శత్రురాజును హత్య చేయించుట.

4. అపహరించుట : శత్రురాజును అపహరించి హత్య చేయుట ద్వారా తన రాజ్య విస్తరణ గావించుకొనవచ్చును.

5. దాడి చేయుట : శత్రురాజు యొక్క కోటకు మంచినీటి సరఫరాను నిలిపివేయుట, పంటలను నాశనము చేయుట, ప్రజలన

హత్య గావించుట మొదలైన పద్ధతుల ద్వారా రాజ్య విస్తరణ గావించాలని కౌటిల్యుడు తెల్పినాడు.

నూతనముగా ఆక్రమించిన రాజ్యములోని ప్రజల ప్రేమాభిమానములను చూరగొనటానికి అవలంభించవలసిన పద్ధతులను కౌటిల్యుడు సూచించినాడు. రాజు ప్రజల పట్ల ఉదారముగా వ్యవహరించుట, వారికి బహుమతులను, పురస్కారములను ఇవ్వడం ద్వారా, వారి ఆచార వ్యవహారాలను గౌరవించుట ద్వారా, పేదలకు, నిస్సహాయులకు, రోగగ్రస్తులకు సహాయము చేయుట ద్వారా వారి యొక్క అభిమానానికి పాత్రుడు కావాలి.

## 4.11 మండల సిద్ధాంతము :

కౌటిల్యుని మండల సిద్ధాంతములో రాజు అవలంభించవలసిన దేశాంగ విధానమును గూర్చి వివరించటం జరిగింది. రాజు తన ఇరుగు పొరుగున ఉన్న 12 దేశాలతో తెలివైన విధానమునవలంభించటం ద్వారా సత్సంబంధాలను కల్గియుండి తన శక్తిని, విజయావకాశములను పెంపొందింప చేసుకొనటమే కాక శత్రురాజు యొక్క విజయావకాశములకు అడ్డుకట్ట వేయగల్గుతాడు. రాజు తన రాజ్యమును విదేశీ దురాక్రమణ నుండి రక్షించుకొనడమే కాక, రాజు తన రాజ్యమును బలోపేతము చేయటానికి, విస్తరింప చేయటానికి తన ప్రభావమును పెంపొందింప చేసుకోవటానికి ప్రయత్నించాలి. కౌటిల్యునికి ధృఢ విధానము పట్ల విశ్వాసము లేదు. తాను వాస్తవిక వాది కనుక రాజ్యమునకు శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులు ఉండరని, శాశ్వత ప్రయోజనాలు మాత్రమే ఉంటాయని కౌటిల్యుడు తెల్పినాడు. ఆయన ఉద్దేశములో అంతర్జాతీయ సంబంధాలు చట్టాలు, నైతిక సూత్రాలపై ఆధారపడవని, శక్తి మరియు ఆశించిన ప్రయోజనాలు సాధించగల్గిన సమర్ధతపై ఆధారపడి ఉంటాయని తెల్పినాడు. కౌటిల్యుడు, రాజు, శక్తి - సమతౌల్యతా విధానమును అవలంభించవలెనని, ఇరుగు పొరుగు రాజ్యాలతో శక్తి - సమతౌల్యతను సాధించటానికి అవసరమైన సూచనలను చేసినాడు. ఇతర దేశములకు ధీటుగా సైన్యమును సన్నద్ధము చేసుకుంటూ, వ్యూహాత్మక విధానాల ద్వారా, దౌత్యపరమైన ప్రయత్నముల ద్వారా రాజు అంతర్జాతీయ సంబంధాలలో సమతౌల్యతను సాధించాలని సూచించాడు.

కౌటిల్యుడు మండలి సిద్ధాంతములో సార్వభౌమాధికారము గల చక్రవర్తి కాదలచిన ప్రభువు అవలంభించవలసిన విధానమును వివరించటం జరిగింది. దీనిలో ఇరుగు పొరుగున 12 మంది రాజులుంటారు. వారు 1. విజిగీషు లేదా కాబోయే విజేత. అతని తరువాత స్థానములో ఐదుగురు ఇతర రాజులుంటారు. వారు 2. శత్రువు. 3. విజిగిషు మిత్రుడు. 4. విజిగిషు మిత్రుని మిత్రుడు. 5. శత్రువు యొక్క మిత్రుడు. 6. శత్రువు యొక్క మిత్రుని మిత్రుడు. వీరి వెనుక మరో ఆరుగురు రాజులుంటారు. వారు 7. వెనుక వైపు శత్రువు. 8. వెనుక వైపు మిత్రుడు. 9. వెనుక శత్రువు మిత్రుడు. 10. వెనుక మిత్రుని మిత్రుడు. 11. మధ్యవర్తి. 12. తటస్థుడు.

పై మండలంలో విజిగిషు తన ఆధిక్యతను ప్రదర్శిస్తూ, శక్తి సమతౌల్యతను సాధించటానికి ప్రయత్నిస్తాడు. కౌటిల్యుని ప్రకారము ఇతర రాజు సమస్యలతో సతమతమౌతున్నప్పుడు రాజు సామ్రాజ్య విస్తరణ చేసికోవాలి. రాజు తన శత్రువు యొక్క శత్రువును సహజ మిత్రునిగా భావించాలి. శత్రువు యొక్క శత్రువుతో కూటమి ఏర్పరచుకోవటము ద్వారా కాని లేక ఇతర సహకారము ద్వారా శత్రువును ఓడించవచ్చును లేక నిలువరించవచ్చును. రాజు శత్రువు యొక్క శత్రువు విశ్వాసాన్ని చూరగొనాలని కౌటిల్యుడు తెల్పినాడు.

## 4.12 విదేశాంగ విధానము :

కౌటిల్యుడు రాజుకు 6 రకముల విదేశాంగ విధానాలను సూచించినాడు. 1. శాంతి 2. యుద్ధము 3. తటస్థ విధానము 4. యుద్ధమునకు సిద్ధపడుట 5. కూటమి 6. ద్వంద్వ విధానము. పై ఆరు విధములైన విదేశాంగ విధానమును అమలుపరచడానికి రాజు సామ, దాన, బేధ, దండోపాయాలను మార్గములుగా వివరించినాడు.

రాజు విదేశాంగ విధానము ద్వారా ఆశించిన లక్ష్యాలను సాధించుకోవటానికి ప్రయత్నించాలి. ఇది రాజు యొక్క బలము మరియు ఇరుగు పొరుగు రాజ్యాల బలహీనతపై ఆధారపడియుంటుంది. రాజు బలంగా ఉన్నప్పుడు యుద్ధము చేయాలి. బలహీనుడిగా ఉన్నప్పుడు శాంతి ఒప్పందము చేసికోవాలి. ఎవ్వరూ విజయము సాధించటం సాధ్యంకాదని భావించినపుడు (సమాన బలము కల్గియున్నపుడు)

తటస్థ వైఖరిని అవలంబించటం తెలివైన పని. అత్యధిక శక్తి కల్గియున్నప్పుడు దాడికి పూనుకోవాలి. బలమైన శత్రురాజు దాడికి పూనుకొన్నప్పుడు ఆశ్రయం పొందాలి. ద్వంద్వ విధానము ద్వారా రాజు విజయము సాధించగలడు. ద్వంద్వ విధానమనగా ఒకరితో శాంతి ఒడంబడిక చేసికొని వేరొక రాజుతో యుద్ధానికి సిద్ధపడటం.

యుద్ధము చేయటం లేక యుద్ధమొక్కటే కౌటిల్యుని విధానము కాదు. యుద్ధము, శాంతివలన ఒకే లక్ష్యములు సాధించబడేటప్పుడు రాజు శాంతి వైపే మొగ్గు చూపాలని, తటస్థ విధానము, దాడి చేయటం వలన ఒకే ప్రయోజనాలున్నప్పుడు తటస్థ వైఖరినే అవలంబించాలని, ద్వంద్వ విధానం మరియు ఆశ్రయం పొందటం ఒకే ఫలితాన్నిచ్చేటప్పుడు ఆశ్రయం పొందటమే మంచిదని కౌటిల్యుడు తెల్పినాడు. ఎందువలననగా మొదటి విధానము రాజుకొక్కడికే ఉపయోగపడితే, రెండవ విధానము శత్రువుకు కూడా ఉపయోగపడుతుందని కౌటిల్యుడు చెప్పినాడు. శత్రువుపై దాడికి దిగేటప్పుడు రాజు మూడు అంశాలను పరిగణనలోనికి తీసికోవాలి. అవి 1. తన శక్తి 2. స్థలము 3. కాలము. మేధోపరమైన శక్తికి కౌటిల్యుడు ప్రాధాన్యతనిచ్చాడు.

## 4.13 సారాంశము :

కౌటిల్యుడు మార్గము కంటే లక్ష్యమునకు ప్రాధాన్యతనిచ్చాడు. లక్ష్యము సరియైనది, ఆశించదగినది అయినప్పుడు, ఆ లక్ష్యమును సాధించగల్గిన ఏ మార్గమునైనా పాటించవచ్చునని చెప్పినాడు. మార్గము చెడ్డదైనప్పటికీ లక్ష్యము మంచిదైనప్పుడు పాటించటంలో తప్పు లేదన్నాడు. రాజు తన రాజ్యమును, ప్రజలను రక్షించుకొనటానికి ఏ పద్ధతులనైనా (నైతికమైనా, అనైతికమైనా) పాటించవచ్చునని తెల్పినాడు. రాజు ద్వంద్వ విధానమును పాటించాలన్నాడు. శత్రువును అవకాశము దొరికినపుడు హత్య చేయటాన్ని సమర్థించినాడు. శత్రురాజును సరియైన పద్ధతిలో ఓడించటము సాధ్యము కానపుడు మోసపూరిత పద్ధతులను అవలంభించాలన్నాడు. అధికారులపై, మంత్రులపై గూఢచారులతో నిఘా ఉంచాలన్నాడు. న్యాయమైన కారణము లేకుండా అధికారి తనతో విభేదించినపుడు చాటుగా అతనిని హత్య చేయాలన్నాడు. వారిని గూఢచారులతో చంపించవచ్చన్నాడు. రాజును హత్య చేయటానికి కుట్ర చేసాడని, రాణితో వ్యభిచరించాడనే అభియోగములు మోపి మరణ శిక్ష విధించవచ్చన్నాడు. తన కుమారులు తనకు విరోధముగా వ్యవహరించినప్పుడు వారి పట్ల కఠినముగా వ్యవహరించాలన్నాడు. ఆర్థిక అత్యవసర పరిస్థితి ఏర్పడినపుడు దేవాలయాల పర్యవేక్షకులు ప్రజల మూఢవిశ్వాసాలను అవకాశముగా చేసికొని కోశాగారమును నింపాలని తెల్పినాడు. రాజు తన లక్ష్యములను సాధించటానికి అనేక అనైతిక పద్ధతులను సూచించినా, అది ప్రజల మరియు రాజ్యము యొక్క సంక్షేమము కొరకేనని కౌటిల్యుడు తెల్పినాడు. కౌటిల్యుడు నైతిక విలువల నుండి, రాజకీయాలను వేరుపరచినా అది సంపూర్ణము కాదు మరియు శాస్వతము కాదు.

కౌటిల్యుడు తన గ్రంథములో పాలనా శాస్త్రానికి, దౌత్యనీతికి ప్రాధాన్యతనిచ్చాడు. తాను వివరించిన ఉద్యోగిస్వామ్యము, న్యాయపాలన, మంత్రి వర్గము, సైనిక వ్యూహం, గూఢచారి వ్యవస్థ, ఆధునిక సమాజములో కూడా ప్రాధాన్యతను కల్గియున్నాయి.

కౌటిల్యుడు ప్రజా సంక్షేమానికి, ప్రత్యేకముగా చిన్న పిల్లలు, ముసలివారు, నిస్పృహతో జీవిస్తున్న వారికి, నిస్సహాయులకు ప్రాధాన్యతనిచ్చాడు. ప్రజలకు న్యాయ వ్యవస్థ అందుబాటులో ఉండాలన్నాడు. బలమైన కేంద్ర ప్రభుత్వం వైపు మొగ్గు చూపాడు. రాజు తన బాధ్యతలను సక్రమముగా నిర్వహించకపోతే నరకానికి పోతాడని కౌటిల్యుడు తెల్పినాడు. కౌటిల్యుడు మనువు వివరించిన వర్ణ సిద్ధాంతాన్ని బలపరచాడు. స్త్రీలకు కొంతమేరకు స్వేచ్ఛ, సమానత్వాలను ప్రసాదించాడు. ఈ విధంగా కౌటిల్యుడు తనకు ముందున్న ప్రాచీన భారత తత్వవేత్తల కంటే అభ్యుదయ భావాలను వ్యక్తము చేసినాడు.

## 4.14 వ్యాసరూప ప్రశ్నలు :

1. ప్రభుత్వపాలనా శాస్త్రానికి కౌటిల్యుడు చేసిన సేవలను వివరింపుము.
2. అర్థశాస్త్రములోని ముఖ్యాంశాలేవి ?
3. రాజకీయాలలో నైతికతపై కౌటిల్యుని అభిప్రాయాలు వివరింపుము.

## 4.15 లఘు వ్యాఖ్యలు :

1. కౌటిల్యుని సప్తాంగ సిద్ధాంతము.
2. కౌటిల్యుని విదేశాంగ విధానము.
3. మండల విధానము.

## 4.16 చదువదగిన గ్రంథాలు :


| | | | |
|---|---|---|---|
| 1. | Hari Hara Das | - | Indian Political Tradition |
| 2. | Charles Drakmeier | - | Kingship And Community in early India |
| 3. | J.K. Baral | - | Indian Political Tradition |
| 4. | A.S. Altekar | - | State And Government in Ancient India |


డా . బి . ఉదయ ప్రకాశ్

పాఠం-5

# మనువు

## 5.0 లక్ష్యం :

ఈ పాఠం అధ్యయనం చేయడం ద్వారా భారత రాజనీతి పితామహునిగా పరిగణింపబడుతున్న మనువును గూర్చి ప్రాచీనభారత, సాంఘిక, రాజకీయ స్థితిగతులను గూర్చి తెలుసుకొనవచ్చును.

## విషయక్రమము


5.1 పరిచయము

5.2 మనుస్మృతి లేక మనుసంహిత

5.3 సామాజిక వ్యవస్థ

5.3.1 సమాజములో స్త్రీల స్థానము

5.4 రాజ్యము - మనువు అభిప్రాయములు

5.5 రాజ్యము - సప్తాంగ సిద్ధాంతము

5.6 రాజు - అధికారాలు

5.7 రాజు యొక్క లక్షణాలు

5.8 రాజు యొక్క అధికారములు

5.8.1 కార్య నిర్వహణాధికారములు

5.8.2 చట్ట నిర్మాణ అధికారము

5.8.3 న్యాయాధికారములు

5.8.4 సైనిక మరియు దౌత్యాధికారములు

5.9 రాజు యొక్క బాధ్యతలు

5.10 దండన గురించి మనువు అభిప్రాయములు

5.11 ప్రభుత్వము గురించి మనువు

5.12 స్థానిక ప్రభుత్వము

5.13 విత్తపాలన

5.14 చట్టము - న్యాయపాలన

5.15 విదేశాంగ విధానము

5.16 సారాంశము

5.17 వ్యాస రూప ప్రశ్నలు

5.18 లఘు వ్యాఖ్యలు

5.19 చదువదగిన గ్రంథాలు

## 5.1 పరిచయము :

ప్రాచీన భారత రాజనీతి తత్వవేత్తలలో మనవు ప్రముఖుడు. మనువు జీవించిన కాలము మరియు 'మనువు' ఒక వ్యక్తి పేరా! లేక అది ఒక బిరుదా ! అనే అంశము పై పండితుల మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. మనువు భూమిపై మొట్టమొదటి హిందూ రాజుగా, మొదటి చట్టరూపకర్తగా, మానవజాతికి తండ్రిగా, సూర్యభగవానుని కుమారునిగా భావించడం జరిగింది. శబ్ద వ్యుత్పత్తి శాస్త్రము ప్రకారము మనువు అనే పదము 'మన' అనే పదమునుండి ఆవిర్భవించింది. 'మన' అనగా తెలివి లేక శ్రద్ధగల. వేదాలు, పురాణాలల్లో ఒకరికంటె ఎక్కువమంది మనువులను గురించి వివరించడం జరిగింది. అగ్ని పురాణంలో స్వయంభుభ మనవును గురించి వ్రాయబడి ఉంది. స్వయంభుభ మనవు అనగా మనువు తనకు తానుగా ఆవిర్భవించి వివిధ కాలములలో రాజుగా తన శక్తిని ప్రదర్శించెను అని అర్థము. మను స్మృతిలో వివిధ కాలములలో ఏడుగురు మనువులను గురించి ప్రస్తావించబడింది. అగ్ని పురాణంలో 14 మంది మనువులను గురించి వివరించబడింది. అరబిందో 'మనువు' పేరుకాదని న్యాయనిర్దేశకుల కిచ్చే బిరుదుగా అభివర్ణించడం జరిగింది. కొందరు చరిత్రకారులు మనువు క్రీ.పూ. రెండవ శతాబ్దానికి చెందిన బ్రాహ్మణపండితుడని నమ్మారు. విలియం జోన్స్ మనుస్మృతి క్రీ.పూ. 1200 కాలము నాటిదని, హాప్కిన్స్ క్రీ.పూ. 200 మరియు క్రీ.శ. 300 మధ్య కాలమునాటిదని, భండార్కర్ మనువు క్రీ.శ 2 మరియు 5వశతాబ్దపు మధ్య కాలము నాటివాడని, మేక్స్ ముల్లర్, మనువు క్రీ.శ. 4వశతాబ్దానికి చెందిన వాడని అంచనా వేశారు.

## 5.2 మనుస్మృతి లేక మను సంహిత :

ప్రాచీన హిందూ సాహిత్యములోని అన్ని స్మృతులలో మనుస్మృతి మొదటి స్థానమును పొందుతుందనియు ఎన్. ఘోసాల్ వ్యాఖ్యానించారు. దీనిలో వేదాలలోని సారాంశము పొందుపరచబడింది. మనుస్మృతిలో జీవితంలో సామాజిక, ఆర్థిక, రాజకీయ కోణాలను సమగ్రంగా వివరించడం జరిగింది. ఇది సామాజిక, రాజకీయ వ్యవస్థలకు శాశ్వతత్వమును, పవిత్రతను ఆపాదించడం జరిగింది. మను స్మృతిని మొట్టమొదటి సివిల్ మరియు క్రిమినల్ చట్టముగా వ్యవహరించడం జరిగింది. ఈ గ్రంధములలో 12 అధ్యాయాలు ఉన్నాయి.

అధ్యాయము - 1 ప్రపంచ ఆవిర్భావము, అత్యున్నత ఆత్మసృష్టి, మానవులను నాలుగు వర్గములుగా విభజించుట, వారియొక్క ధర్మములను వివరించింది.

అధ్యాయము - 2 ధర్మానికి మూలాలు, ఆధారాలు, నాలుగు వర్గాల ప్రజల వారికి వర్తించే ధర్మాలు వివరించబడింది.

అధ్యాయము - 3 గృహస్థ జీవితము, ఎనిమిది రకముల వివాహములు, సమాజములో గృహస్థుల పాత్ర వివరించబడినది.

అధ్యాయము - 4 గృహస్థు పాటించవలసిన నియమములు, వర్ణక్రమము వివరించబడినది.

అధ్యాయము - 5 భార్యా భర్తల బాధ్యతలు, చావుకి కారణాలు, మరియు మాంసాహార నిషేధము గురించి వ్రాయబడింది.

అధ్యాయము - 6 వనప్రస్థ మరియు సన్యాస ఆశ్రమ జీవితాల గురించి వ్రాయబడింది.

అధ్యాయము - 7 రాజు యొక్క బాధ్యతలు, మంత్రుల నియామకం పన్నులు చెల్లించడం మొదలైన అంశాలు .

అధ్యాయము - 8 సివిల్ మరియు క్రిమినల్ చట్టాలు, కష్టాలలో ఉన్న స్త్రీల పట్ల రాజ్యము యొక్క బాధ్యత వివరించబడింది.

అధ్యాయము - 9 స్త్రీలు, వారియొక్క ధర్మము, కుటుంబములో వారి ప్రాధాన్యత, విడాకులు మొదలైన అంశములు వివరించబడినాయి

అధ్యాయము - 10 సృష్టి, వివిధ కులాల వృత్తులు, బాధ్యతలు.

అధ్యాయము - 11 వివిధ యజ్ఞ యాగాదుల ద్వారా ప్రాయశ్చిత్తము చేసుకొనుట, పశ్చాత్తాపము నొందుట మొదలైన అంశాలు చర్చించబడ్డాయి.

అధ్యాయము - 12 సామాజిక జీవితపు నియమావళి, మోక్షము, న్యాయ జ్ఞానము, స్వీయ పరిక్ష మరియు రాజ్యము, సమాజము పట్ల వ్యక్తుల బాధ్యత వివరించబడింది.

## 5.3 సామాజిక వ్యవస్థ :

మనువు మార్పుకు అవకాశము లేని స్థిరమైన సామాజిక వ్యవస్థను గురించి వివరించాడు. సమాజమును నాలుగు వర్ణములు లేక కులములుగా విభజించాడు. ఆ కులాలను పై నుండి క్రిందకు ఒక క్రమానుగత శ్రేణిలో బ్రాహ్మణులు ఉన్నత స్థానములోను శూద్రులు క్రింది స్థానములోను ఉండే విధంగా వివరించాడు. మనుస్మృతి ప్రకారము సృష్టి ఒడిదుడుకులు లేకుండా ముందుకు సాగటానికి బ్రహ్మ ఈ ఏర్పాటు చేశాడని, సమాజాన్ని బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణాలుగా విభజించాడని, బ్రాహ్మణులు సృష్టి కర్త నోటి నుండి జన్మించగా, క్షత్రియులు భుజాల నుండి, వైశ్యులు ఉరువుల నుండి, శూద్రులు పాదాల నుండి జన్మించారని మనువు అభిప్రాయము.

ఆయా కులాలు నిర్వర్తించవలసిన కర్తవ్యములను మను ధర్మ శాస్త్రములో వివరించటము జరిగింది. బ్రాహ్మణులు వేదాలను అధ్యయనం చేయటం, బోధించటం, దానములను స్వీకరించుట, యజ్ఞములను నిర్వహించుట. క్షత్రియులు రాజ్యమును,ప్రజలను రక్షించుట, దానము చేయుట, యజ్ఞములు జరిపించుట మరియు వేదములను చదువుట. వైశ్యులు పశుపోషణ, దానములు చేయుట, యజ్ఞములు చేయుట,వేదములను చదువుట, వ్యాపారము నిర్వహించుట, వడ్డీ వ్యాపారము చేయుట, వ్యవసాయము చేయుట. పై మూడు కులముల వారికి సేవ చేయుట శూద్రుల బాధ్యత. ప్రతి కులము సమాజములో తమకు అప్పగించిన బాధ్యతలను నిర్వహించాలి. ఎటువంటి సామాజిక మార్పు అంగీకరించబడదు. మనువు కాలమును నాలుగు యుగములుగా విభజించెను. 1. సత్య యుగము 2. త్రేతా యుగము 3. ద్వాపర యుగము 4. కలి యుగము. ఆయా యుగ ధర్మములను కూడా వివరించటం జరిగింది.

మనువు మానవుని జీవిత కాలమును నాలుగు దశలుగా విభజించెను. 1. బ్రహ్మచర్య 2. గృహస్థ 3. వనప్రస్థ 4. సన్యాస. మొదటి దశయైన బ్రహ్మచర్య దశలో మనిషి పూర్తిగా బ్రహ్మచర్యమును పాటిస్తూ అధ్యయనములో నిమగ్నము కావాలి. గృహస్థ దశలో వివాహము చేసుకొని గృహస్థ జీవితమును గడపాలి. వనప్రస్థ దశలో గృహమును వీడి అడవులకు వెళ్ళి తపస్సు చేయాలి. సన్యాస దశలో భౌతిక కోర్కెలను జయించి, సన్యాసిగా జీవిస్తూ శారీరక, మానసిక స్వచ్ఛతను సాధించాలి. మనువు వనప్రస్థాశ్రమాన్ని శూద్రులకు తప్ప మిగిలిన వర్ణాలన్నింటికి అనుమతించినాడు.

మనువు బ్రాహ్మణులకు సమాజములో అత్యున్నత స్థానమును కల్పించినాడు. బ్రాహ్మణులకు వారియొక్క పుట్టుక మరియు మేధో సంపత్తిని బట్టి సమాజములో ఉన్నత స్థానము కల్పించబడింది. మనువు బ్రాహ్మణులను ద్విజులు లేక రెండుసార్లు పుట్టిన వారుగా వివరించినాడు. వేదానుసారము జీవిస్తూ పవిత్రతను పొందిన బ్రాహ్మణ పండితుడు మాత్రమే రాజుకు మార్గదర్శిగా వ్యవహరించగలడు. బ్రాహ్మణులను గౌరవించుట రాజుయొక్క ధర్మము. మనువు వివరించిన ప్రకారము ధర్మ పరిరక్షణ బ్రాహ్మణుల బాధ్యత. బ్రాహ్మణుడు ధర్మ పరిరక్షకుడు. బ్రాహ్మణుడు పవిత్ర చట్టాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేయాలి. ఎందువలననగా చట్టముపై బ్రాహ్మణుని వ్యాఖ్యానాలను సమాజము అంగీకరిస్తుంది. మను ధర్మశాస్త్ర ప్రకారము అధ్యయనము, జ్ఞాన సముపార్జన బ్రాహ్మణుని కర్తవ్యమైనప్పటికీ వారు దేశ రక్షణలో పాల్గొనవచ్చును మరియు వ్యవసాయము చేయవచ్చును. అనగా వారికి వృత్తి మార్పు అంగీకరించబడింది. మనువు యొక్క మాటలలో బ్రాహ్మణులు ఆధ్యాత్మిక గురువుగా, అధ్యాపకుడిగా, న్యాయకోవిదునిగా, యజ్ఞ నిర్వాహకునిగా బహుముఖ బాధ్యతలను నిర్వర్తించాలి. మను ధర్మశాస్త్రములో కొన్ని బాధ్యతలను కేవలము బ్రాహ్మణులే నిర్వహించవలెనని వివరించడాన్ని బట్టి బ్రాహ్మణులకివ్వబడిన ఆధిక్యత అర్థము చేసుకొనవచ్చును. ఆ బాధ్యతలను ఇతర కులములు నిర్వహించడాన్ని నిషేధించడం జరిగింది. బ్రాహ్మణులు ఇతర దిగువ కులాల వారిని వివాహమాడుట నిషేధించబడింది. బ్రాహ్మణునికి, బ్రాహ్మణ స్త్రీకి పుట్టిన పిల్లలే బ్రాహ్మణులౌతారు.

కుల క్రమములో దిగువ స్థాయిలో ఉన్న సూద్రులకు పవిత్ర గ్రంధ ( వేదాలు ) అధ్యయనం నిషేధించబడింది. మనువు సూద్రులను "పుట్టికతో బానిసలుగా" అభివర్ణిస్తూ వారు ఇతర పై కులముల వారికి సేవ చేయడం బాధ్యతగా చెప్పడం జరిగింది. మనువు వివిధ కులముల కర్తవ్యాలను వివరిస్తూనే బ్రాహ్మణులు రక్షణ వ్యవసాయ రంగములలో పాల్గొనవచ్చని, కాని క్షత్రియులు, వైశ్యులు బ్రాహ్మణుల కర్తవ్యములను నిర్వహించరాదని వివరించెను. క్షత్రియులు, వైశ్యులు వేదాలను అధ్యయనం చేయవచ్చు కానీ వారు వాటిని భోధించుట కాని, పౌరోహిత్యం వహించడంకాని చేయరాదు.

మనువు చండాలురు, లేక వర్ణ సరేకరులను గూర్చి కూడా వివరించడం జరిగింది. మనువు రెండు రకాల వివాహములను గూర్చి వివరించాడు.

1. అనులోమ వివాహము.

2. ప్రతిలోమ వివాహము.

1. అనులోమ వివాహమనగా ఉన్నత కులానికి చెందిన వ్యక్తి దిగువ కులానికి చెందిన స్త్రీని వివాహమాడుట.

2. ప్రతిలోమ వివాహమనగా దిగువ కులానికి చెందిన వ్యక్తి ఉన్నత కులానికి చెందిన స్త్రీని వివాహమాడుట. ప్రతిలోమ వివాహములు దంపతులకు వారి సంతానమునకు హానికరమని మనువు వాటిని నిరుత్సాహపరిచాడు.

మనువు కుల క్రమానుగత శ్రేణిలో కుల అసమానతలను వివరిస్తూ ప్రకృతి నుండి కొన్ని ఉదాహరణలను ఇవ్వడం జరిగింది. దిగువ కులాలు ఎగువ కులాల వారికి ఆహారముగా వర్ణించడం జరిగింది.

## 5.3.1 సమాజములో స్త్రీల స్థానము :

మనువు యొక్క భావాలు స్త్రీల విషయములో అస్పష్టతకు దారితీసేవిగా ఉన్నాయి. మనువు స్త్రీల పట్ల గౌరవ భావాన్ని ప్రకటిస్తూనే వారికి స్వేచ్ఛను సమానత్వాన్ని నిరాకరించడం జరిగింది. సమాజములోని సమూహములన్నింటిలో తండ్రి, తల్లి, పిల్లలతో కూడిన కుటుంబము అత్యంత ప్రాధాన్యత కలిగినది. మనువు వివాహము పవిత్రమైనదిగా, వ్యక్తి భార్యను దేవుని నుండి పొందుతాడు గనుక ఆమెను రక్షించడం తన బాధ్యత అని చెప్పినాడు. మనువు విడాకులను భార్యాభర్తలు వేరువేరుగా జీవించడాన్ని అంగీకరించలేదు. మనువు కుటుంబ సభ్యులకు స్త్రీలను సంతోష పెట్టాలని, స్త్రీలు ఎక్కడైతే గౌరవించబడతారో అక్కడ దేవుళ్ళు సంతోషిస్తారని సూచించడం జరిగింది. కుటుంబ వ్యవహారాలను నిర్వహించడంలో భార్య ముఖ్య పాత్ర పోషిస్తుంది. ఆర్ధిక భౌతిక వనరులను నిర్వహించడం ఆమె యొక్క బాధ్యత. 'భవిష్యత్‌కు దేవతగా' స్త్రీని అభివర్ణించడం జరిగింది. మనువు వ్యభిచారమును వ్యతిరేకించాడు. స్త్రీ గౌరవాన్ని, హుందాతనాన్ని కాపాడటానికి ప్రాధాన్యతనిచ్చాడు. సరియైన వ్యక్తిని వివాహమాడుటకు స్త్రీకి స్వేచ్ఛ ఇవ్వబడింది. వివాహ వయస్సు వచ్చిన మూడు సంవత్సరములలోపు తన తండ్రి సరియైన వ్యక్తితో వివాహము జరిపించక పోతే ఆ స్త్రీ తన భర్తను తానే నిర్ణయించుకొనే స్వేచ్ఛను మనువు స్త్రీకి ఇచ్చాడు. అసమర్ధుడను వివాహమాడుట కంటే వివాహమాడకుండ ఉండటం మంచిదని మనువు సూచించాడు. సాధ్వీమణియైన వితంతువుకు మనువు రెండవ వివాహమును నిషేధించాడు. అయితే వివాహము జరగక ముందే భర్త కావలసిన వ్యక్తి చనిపోయిన యెడల, వివాహము జరిగి భార్యాభర్తల కలయిక జరుగక పోయినా అట్టి స్త్రీలు పునర్వివాహమునకు అర్హులు. పైన వివరించిన అంశాలు మనువు స్త్రీలకిచ్చిన గౌరవాన్ని, ప్రాధాన్యతను తెలియజేస్తుంది.

అయితే మనువు స్త్రీ స్వేచ్ఛకు అర్హురాలు కాదని స్పష్టంగా చెప్పడం జరిగింది. స్త్రీ స్వేచ్ఛగా ఇతరుల రక్షణ లేకుండా జీవించడాన్ని మనువు వ్యతిరేకించాడు. స్త్రీ ఎల్లప్పుడూ ఎవరో ఒకరి రక్షణలో ఉండాలని తెల్పినాడు. చిన్నతనములో తండ్రి యొక్క రక్షణ, యవ్వనంలో భర్తయొక్క రక్షణలో, వృద్ధాప్యంలో కుమారుని రక్షణలో ఉండాలని నిర్ధారించాడు. వేదకాలములో స్త్రీలు సమాజములో సమానత్వాన్ని అనుభవించారు. గార్గి, మైత్రేయి లాంటి స్త్రీలు తత్వచింతనా చర్చలలో పాల్గొన్నారు. కానీ మనువు స్త్రీలకు వేదాధ్యయనాన్ని నిషేధించాడు.

అందువలన మనువు స్త్రీ వ్యతిరేకిగా ముద్ర వేయబడటంలో ఆశ్చర్యము లేదు. స్త్రీ వాదులు మనువు వ్యక్తము చేసిన అభిప్రాయాలను తీవ్రముగా వ్యతిరేకించారు.

## 5.4 రాజ్యము - మనువు అభిప్రాయములు :

మనువు బహుశా తన కాలములో అమలులో ఉన్న ఏకఛత్రాధిపత్య ప్రభుత్వమును గురించి వివరించినాడు. మనువు యొక్క అభిప్రాయము ప్రకారము సమాజము మరియు ప్రజల శ్రేయస్సు కొరకు రాజు దేవుని చేత సృష్టించబడ్డాడు. మనువు ప్రకారం ప్రారంభంలో రాజు లేదా పాలకుడు ఎవ్వరూ లేరు. ప్రభువు లేకపోవుట వలన సమాజము అల్లకల్లోలమై ప్రజలు నిస్సహాయులై నిరుత్సాహపడ్డారు. ప్రజలు అభద్రతా భావనకు గురైనారు. ఎందువలననగా సమాజములో చట్టాన్ని అమలు పరచి ఒక క్రమమును సాధించి ప్రజలకు రక్షణ కల్పించుటకు ఎటువంటి అధికార యంత్రాంగము లేదు. కనుక ప్రజలు సృష్టికర్తయైన బ్రహ్మను ఈ పరిస్థితిని తొలగించవలసినదిగా వేడుకొన్నారు. ప్రజల యొక్క విన్నపము మేరకు బ్రహ్మ చట్టమును అమలు జరిపి సమాజములో ఒక క్రమమును ఏర్పరచడానికి, చట్టవ్యతిరేకులను శిక్షించడానికి ప్రజలకు రక్షణ కల్పించడానికి ఒక రాజును సృష్టించాడు. బ్రహ్మ అన్ని రంగాలలో నిష్ణాతుడైన శక్తివంతుడైన రాజును సృష్టించాడు. ఎనిమిది మంది దేవుళ్ళ అంశతో ( అగ్ని, వాయువు, సూర్యుడు, చంద్రుడు, యముడు, కుబేరా, వరుణ, ఇంద్రుడు) బ్రహ్మ రాజును సృష్టించాడు. రాజు దైవాంశ సంభూతుడు గనుక రాజు చిన్నవాడైనను శక్తిమంతుడే కనుక ప్రజలంతా అతనికి విధేయులై యుండాలి.

## 5.5 రాజ్యము - సప్తాంగ సిద్ధాంతము :

మనువు సప్తాంగ సిద్ధాతమును ప్రతిపాదించినాడు. మనువు ప్రకారము రాజ్యము తన బాధ్యతలను సక్రమముగా నిర్వహించడానికి ఏడు ముఖ్య అంగాలు అవసరము. 1. రాజు (స్వామి), 2. అమాత్య (మంత్రి), 3. పుర (ముఖ్య పట్టణం), 4. జనపద (భూభాగము), 5. కోశ (ధనాగారము), 6. సైన్యము (బల), 7. మిత్ర (మిత్ర దేశము) .

రాజు (స్వామిన్) : రాజు సార్వభౌమాధికారము గల పాలకుడు. రాజు దైవాంశ సంభూతుడు కనుక రాజు అత్యంత శక్తిమంతుడు మరియు సమాజములోని అందరి కంటే శ్రేష్టుడు. రాజు మానవ రూపంలో ఉన్న దైవాంశ సంభూతుడు కనుక ఆయన న్యాయాధిపతి. రాజు అత్యంత శక్తివంతుడు గనుక ఆయనను ఎవ్వరూ ఎదిరించలేరు. ఎవ్వరైనా రాజును ఎదిరించినట్లయితే అతడు తప్పక నాశనము చేయబడతాడు. రాజును గురించి మను ఈక్రింది విధముగా చెప్పినాడు. అగ్ని వ్యక్తిని మాత్రమే దహిస్తుంది. రాజుయొక్క కోపాగ్ని ఆ జాతినే దహిస్తుంది.

అమాత్య (మంత్రి) : రాజు జాగ్రత్తగా పరిశీలించిన తరువాత ఏడు లేక ఎనిమిది మంది మంత్రులను నియమించాలి. వారు విద్యాధికులు, ధైర్యముగల, ఆయుధాలను ఉపయోగించడంలో నైపుణ్యత గల, ఉన్నత వంశ పారంపర్యము కలిగిన వారై ఉండాలి. యుద్ధము, శాంతి, రాజ్య పరిస్థితులు, రాజ్యరక్షణ మున్నగు అంశాల పై రాజు మంత్రులను సంప్రదిస్తాడు.

పురము (ముఖ్య పట్టణము) : మనువు చెప్పిన ప్రకారము రాజు సహజ రక్షణ కవచములైన ఎడారి, నీరు, అడవులు, సాయుధ సైన్యము, కొండలు కలిగిన పట్టణములో నివసించాలి. ఎడారి క్రూరమృగములు మరియు జింకలతో కూడి, నీరు, మొసళ్ళతో కూడి, అడవులు కోతుల గుంపులను కల్గి, చుట్టు ప్రక్కల సాయుధ సైన్యము రాజుకు మంచి రక్షణగా ఉంటాయి.

జనపద (భూభాగము) : రాజ్యభూభాగములో వ్యవసాయ యోగ్యమైన మరియు నిరుపయోగమైన భూమి ఉండాలి. భూమి చిత్తడిగా అశుభ్రముగా ఉండరాదు. ఆ భుభాగములో ఆర్యులు నివసిస్తున్నట్లయిన మంచిది. ఆ రాజ్య భుభాగములు బ్రాహ్మణులు అత్యధికముగా నివస్తున్నట్లయిన ఆ రాజ్య ఔన్నత్యము పెరుగుతుంది. శూద్రులు అత్యధికముగా నివసిస్తున్న ఎడల ఆ రాజ్యములో కరువు, రోగాలు ప్రబలుతాయని మనువు వివరించాడు.

కోశ (ధనాగారము) : మంచి నిజాయితీ పరులను ధనాగార నిర్వహణకు నియమించాలి. అత్యాశ గలిగినవారిని ధనాగార

బాధ్యులుగా నియమించరాదు.

బల (సైన్యము) : శత్రుసైన్య దాడుల నుండి రాజ్యాన్ని రక్షించడానికి సైన్యము అవసరము. దాడి చేయడానికి అవసరమైన ఆయుధాలు, క్రమ శిక్షణ సైన్యము యొక్క శక్తిని ఇనుమడింప చేస్తాయి.

మిత్ర (మిత్ర దేశము) : తెలివైన రాజు భూభాగము, ధనముకంటే, మిత్ర దేశాలను సంపాదించుకోవడానికి ప్రాధాన్యత నిస్తాడు. యుద్ధ కాలములో మరియు దౌత్యపరమైన సంక్షోభము ఏర్పడినపుడు మిత్రులు ఎంతో ఉపయోగపడతారు. మనువు యొక్క అభిప్రాయములో ఈ ఏడు అంగాలు సమానమైన ప్రాధాన్యతను కల్గిఉంటాయి. ఏ ఒక్క అంగము ఇతర అంగము కంటె ఉన్నతమైనది కాదు. ఈ సప్తాంగాలు సక్రమముగా ఉన్నప్పుడే ప్రభుత్వము సక్రమముగా నడుస్తుంది.

## 5.6 రాజు - అధికారాలు :

మనువు చెప్పిన ప్రకారము రాజు దైవాంశ సంభూతుడు మరియు ప్రజలను రక్షించడానికి బ్రహ్మ రాజును సృష్టించినాడు కనుక రాజు అత్యంత శక్తిమంతుడు. ప్రజలను రక్షించడం రాజు యొక్క నైతిక బాధ్యత. ప్రజలకు రక్షణ కల్పించలేక పోతే రాజు ప్రజల యొక్క గౌరవాన్ని కోల్పోతాడు. రాజు ఎనిమిది మంది దేవుళ్ళ అంశతో సృష్టించబడినాడు గనుక ఏ మానవుడు రాజుతో సరిపోల్చతగడు. రాజు చట్టాన్ని అతిక్రమించిన వారిని మరియు తనకు లోబడని వారిని శిక్షించే అధికారము కలిగి ఉంటాడు. రాజు పవిత్ర జీవితము గడుపుతూ బ్రాహ్మణులను పూజించాలని మనువు తన గ్రంధములో పేర్కొన్నాడు. భౌతిక శక్తి కంటే ఆధ్యాత్మిక శక్తి గొప్పది కనుక, ఆధ్యాత్మిక శక్తికి ప్రతినిధులు బ్రాహ్మణులు కనుక బ్రాహ్మణులు రాజు యొక్క గౌరవాన్ని పొందదగిన నైతిక హక్కును కలిగియున్నారని మనువు యొక్క భావనగా కనిపిస్తుంది.

## 5.7 రాజు యొక్క లక్షణాలు :

మనువు ఆదర్శవంతమైన రాజు లక్షణాలను వివరించడం జరిగింది. రాజు దైవాంశ సంభూతుడుగా మరియు అతని సామర్ధ్యమును బట్టి మాత్రమేకాక, తాను కలిగి ఉండే ఉత్తమ లక్షణాలను బట్టి కూడా ప్రజల యొక్క గౌరవాన్ని పొందుతాడు. ఆదర్శవంతమైన రాజు న్యాయవంతుడు, సత్ప్రవర్తన, వినయము, అణుకువ కలిగియుండాలి. రాజు వేట, పాచిక లాడుట, పగలు నిద్రించుట, త్రాగుట, నృత్యము మొదలగు వ్యసనములకు దూరముగా ఉండాలి. రాజు సరళమైన స్వభావమును కలిగియుండాలి. రాజు స్వీయ నియంత్రణ, స్వీయ క్రమశిక్షణ కలిగియుండాలి. రాజు ఇంద్రియాలను తన ఆధీనములో ఉంచుకోగలగాలి. రాజు వేదాలలో నిష్ణాతులైన బ్రాహ్మణులను పూజించాలి మరియు వారి సలహాలను పాటించాలని మనువు పేర్కొన్నాడు. రాజు బాధ్యత కలిగి తన ప్రజల యొక్క సమస్యలను పరిష్కరించినట్లయితే ప్రజలకు రాజు పట్ల గౌరవ భావము పెంపొందుతుంది మరియు రాజు తమ కొరకే యున్నాడని ప్రజలు విశ్వసిస్తారు. రాజు తన పని తీరు మరియు ప్రవర్తన ద్వారా ప్రజలకు ఆదర్శప్రాయుడౌతాడు. పరిస్థితులను బట్టి రాజు సరళముగాను, కఠినముగాను వ్యవహరించాలి. రాజు తన సామ్రాజ్యాన్ని పరిరక్షించుకుంటూ శత్రువు యొక్క రాజ్యాన్ని నాశనము చేయాలి. ఆదర్శవంతమైన రాజు యొక్క విధానాలను, వ్యూహాలను జంతు ప్రపంచ ఆధారముగా మనువు వివరించాడు. తాబేలు రక్షణ కొరకు తన కాళ్ళను, మెడను వెనుకకు తీసుకొన్నట్లు, రాజు కష్టకాలములో వ్యవహరించాలి. నీటి పక్షిలా మంచి అవగాహనతో ప్రణాళిక రూపొందించుకోవాలి. సింహములా తన బలాన్ని ప్రదర్శించాలి. తోడేలులాగా తనకు రావలసిన భాగాన్ని బలవంతముగా పొందాలి. కుందేలు వెనుకకు పోయినట్లు రాజు తన విధానాలను వెనుకకు తీసుకోవాలి.

## 5.8 రాజు యొక్క అధికారములు :

రాజు యొక్క అధికారములను మనువు ఈ క్రింది విధముగా వివరించాడు.

### 5.8..1 కార్యనిర్వాహణాధికారములు :

మనువు వివరించినట్లు రాజు ముఖ్య శాసనాధికారము మరియు కార్యనిర్వాహణాధికారములు కలిగియుంటాడు. రాజు ఆయా

అంశాలలో నైపుణ్యత కలిగిన వారిని మంత్రులుగా నియమిస్తాడు. రాజు మంత్రులతో సంప్రదించి అన్ని అంశాలను పరిగణనలోనికి తీసుకొని నిర్ణయాలు చేస్తాడు. రాజు విధానాలను అమలు పరచడానికి, పన్నులను సమీకరించడానికి అధికారులను నియమిస్తాడు. తెలివిగల, నిజాయితీ గలిగిన వారిని అధికారులుగా నియమిస్తాడు. రాజు ఇతర దేశాలతో సంబంధాలను మెరుగుపరచు కోవడానికి రాయబారులను నియమిస్తాడు. మంత్రులు, అధికారులు, రాయబారులు తమకు నిర్దేశించిన బాధ్యతలను నిర్వహిస్తారు. రాజు వీరందరి చర్యలనూ నియంత్రిస్తూ పర్యవేక్షిస్తాడు.

## 5.8.2 చట్ట నిర్మాణ అధికారము :

వాడుకలో నున్న సాంప్రదాయాలు మరియు స్మృతుల గ్రంధముల ఆధారముగా రాజు అనేక అంశములకు సంబంధించిన చట్టములను రూపొందిస్తాడు. ఏ న్యాయస్థానమునకు గాని, వ్యక్తికి గాని రాజు చేసిన చట్టమును ప్రశ్నించగల అధికారము లేదు.

## 5.8.3 న్యాయాధికారములు :

విద్యాధికులైన బ్రాహ్మణులు మరియు అనుభవజ్ఞులైన అధికారుల సహకారముతో వివిధ వివాదాలకు సంబంధించిన తీర్పులను ప్రకటిస్తాడు.

## 5.8.4 సైనిక మరియు దౌత్యాధికారాలు :

రాజుకు యుద్ధాన్ని ప్రకటించే అధికారము మరియు శాంతి ఒడంబడికలు చేసుకునే అధికారాలుంటాయి. దౌత్యపరమైన వ్యవహారాలను పరిష్కరించడానికి రాయబారులున్నప్పటికి విదేశాంగ విధానమునకు సంబంధించి అంతిమ నిర్ణయం రాజుదే.

## 5.9 రాజు యొక్క బాధ్యతలు :

రాజు అధిక శక్తివంతుడే కాని, నియంత కాదు. రాజు ప్రజల పట్ల తన బాధ్యతలను నిర్వహించవలసి యుంటుంది. రాజు అనేక అధికారములు కలిగియుంటాడు కాని ఆ అధికారములను సమాజ శ్రేయస్సు కొరకు, ప్రజా సంక్షేమము కొరకు వినియోగించాలి. రాజు యొక్క ముఖ్య బాధ్యత సమాజంలో ఒక క్రమాన్ని ఏర్పాటు చేసి దేశ రక్షణా బాధ్యతను నిర్వహించాలి. రాజు క్షత్రియుడు గనుక శత్రుదేశాలు దాడి చేసినప్పుడు వారితో పోరాడి రాజ్య రక్షణ గావించాలి. రాజు ఎందుకొరకు ఏర్పాటు చేయబడ్డాడో, ఆ లక్ష్యాల సాధన కొరకు తన బాధ్యతను నిర్వహించాలి. ప్రజలు రాజులకు వ్యవసాయపన్ను మరియు ఇతర పన్నులను చెల్లిస్తారు. రాజు తిరిగి ప్రజలకు రక్షణ కల్పిస్తాడు. రాజు ఈ ముఖ్య బాధ్యతలను విస్మరిస్తే మరణానంతరము నరకానికిపోతాడు. మనువు చెప్పిన ప్రకారము ప్రజలకు రక్షణ కల్పించే రాజు తన ప్రజల గౌరవాన్ని చూరగొంటాడు మరియు పన్నులను వసూలు చేసే హక్కును కలిగియుంటాడు. దొంగలను శిక్షించలేని రాజు స్వర్గలోకాన్ని కోల్పోతాడు.

రాజు యొక్క ఇంకొక ముఖ్య బాధ్యత ఆర్థిక వ్యవస్థను నియంత్రికరించుట. మార్కెట్‌లో విక్రయించే వస్తు ధరలను నిర్ణయించాలి. తూనికలు, కొలతలను క్రమబద్ధం చేయాలి. వ్యాపారులు, వినియోగదారులను మోసగించకుండా చర్యలు తీసుకోవాలి. మరియు మోసము చేసేవారిని శిక్షించాలి. మనువు రాజును అత్యంత శక్తివంతుడుగా రూపొందించినప్పటికీ అనేక బాధ్యతల మధ్య రాజును బందీని చేయడం జరిగింది. తన బాధ్యతలను విస్మరించిన రాజు నరకానికి పోతాడని అనేక సార్లు హెచ్చరించడం జరిగింది.

## 5.10 దండన గురించి మనువు అభిప్రాయములు :

మనువు యొక్క దండన సిద్ధాంతము ప్రజలు నేరము చేయకుండా నివారించుటకు ఉద్దేశించినది. మనువు వివిధ రకముల నేరములకు వివిధ రకముల శిక్షలను నిర్దేశించడం జరిగింది. నేరము యొక్క తీవ్రతను బట్టి శిక్ష తీవ్రత ఉంటుంది. కొన్ని నేరములకు మరణ దండన కూడా సూచించినాడు. శిక్ష యొక్క ముఖ్యలక్ష్యము ప్రజలెవ్వరూ నేరము చేయడానికి సాహసించని పరిస్థితిని కల్పించడం

అంతేకాక ప్రజలు తమ తమ బాధ్యతలను సక్రమముగా నిర్వహించని వారు శిక్షకు గురి కావలసి యుంటుంది.

మనువు యొక్క దండన సిద్ధాంతము యొక్క ముఖ్య లక్షణము ఏమనగా రాజు కూడా నేరము చేసినట్లయితే శిక్షను తప్పించుకొనజాలడు. రాజు తన బాధ్యతను విస్మరించిన యెడల దండన రాజును, అతని కుటుంబాన్ని నాశనము చేస్తుంది. దండన విషయములో కూడా మనువు బ్రాహ్మణులకు కొంత వెసులుబాటు కల్పించినాడు. ఒకే రకమైన నేరము చేసిన వివిధ కులములలో మిగిలిన మూడు కులముల వారి కంటే బ్రాహ్మణులకు తక్కువ శిక్షను మనువు సూచించాడు. దండన సర్వజీవకోటికి రక్షణ నిస్తుంది. దండన ప్రజల రక్షణకు, ఉన్నతికి మూలము. రాజు, పెద్ద, చిన్న అందరూ తమ తమ బాధ్యతలను నిర్వహించక పోతే దండనకు గురి కావలసినదే. దండన నుండి ఎవ్వరూ తప్పించుకొనజాలరు. అందరూ నిద్రిస్తుండగా దండన మేల్కొని ఉంటుందని మనువు వివరించినాడు. స్త్రీలను, విలువైన వజ్రములను దొంగిలించిన వారికి శారీరిక శిక్షను మనువు సూచించినాడు. బ్రాహ్మణుని పశువులను దొంగిలించిన వారు సగము పాదము కోల్పోవలసి యుంటుంది. బ్రాహ్మణులను, స్త్రీలను, పిల్లలను చంపినట్లయితే మరణశిక్షకు గురికావాలి. వ్యభిచరించిన వారు మరణ శిక్షకు పాత్రులు. బ్రాహ్మణులు వ్యభిచార నేరము చేసినచో గుండు గీయించవలెనని మనువు తెల్పినాడు. వ్యభిచార నేరము విషయములో మనువు బ్రాహ్మణ పక్షపాతిగా వ్యవహరించినట్లు భావించవచ్చును. అయితే దొంగతనము నేరము చేసిన బ్రాహ్మణునకు ఎక్కువ శిక్షను సూచించడం జరిగింది. దొంగతనము నేరము చేసిన శూద్రునికి 8 రెట్లు శిక్ష. అదే వైశ్యునికి 16 రెట్లు, క్షత్రియునికి 32 రెట్లు, బ్రాహ్మణునికి 64 రెట్లు శిక్షను సూచించినాడు. ఈ విధముగా బ్రాహ్మణులకు ఎక్కువ శిక్షను విధించడం బ్రాహ్మణులు అటువంటి నేరము చేయకుండ నివారించడానికి కావచ్చును. అయితే వ్యభిచార విషయములో బ్రాహ్మణులకు తక్కువ శిక్షను ఎందువలన సూచించినదీ అర్థము కాదు.

శిక్షను విధించే వ్యక్తి తెలివైన, స్వచ్ఛమైన, న్యాయమైన మరియు వివక్షత చూపనివాడుగా ఉండాలి. మూర్ఖుడు, త్రాగుబోతు, ఇంద్రియ సుఖములను కోరుకునే వాడు న్యాయతీర్పులు చెప్పడానికి అనర్హుడు. రాజు న్యాయబద్దంగా వ్యవహరించాలి. న్యాయబద్ధమైన తీర్పులు ప్రకటించే రాజు అభివృద్ధి చెందుతాడు. మోసపూరితమైన వివక్షతతో కూడిన తీర్పును ప్రకటించే రాజు తన పతనాన్ని తానే కొని తెచ్చుకుంటాడు.

## 5.11 ప్రభుత్వము గురించి మనువు :

ప్రభుత్వము సక్రమముగా పనిచేయడానికి మనువు అనేక సూత్రాలను సూచించినాడు. వాటిలో కొన్ని ఇప్పటికీ అమలు పరచబడుతున్నాయి. అధికార విభజనను ప్రోత్సహిస్తూ రాజు ప్రజలకు మంచి పాలనను అందించడానికి తప్పకుండా మంత్రుల మరియు అధికారుల సహాయాన్ని తీసుకోవాలని సూచించినాడు. తప్పు చేసిన వారిని శిక్షించడం ద్వారా ప్రభుత్వ ఆస్తులకు రక్షణ కల్పించాలి. అంతర్గత మరియు అంతర్జాతీయ వ్యవహారాలలో రాజు పాటించవలసిన వ్యూహాలను మనువు వివరించినాడు.

ప్రభుత్వ వ్యవస్థలో రాజు మూల సూత్రధారి. ప్రభుత్వాధినేతగానే కాక సమాజములో చట్టాన్ని అమలు పరచి ఒక క్రమాన్ని సాధించడం మరియు రాజ్య రక్షణ బాధ్యత రాజుదే. విధేయులైన, సమర్థులైన మంత్రులు మరియు అధికారుల సహకారముతో రాజు పై లక్ష్యాలను సాధించాలని మనువు సూచించాడు. ప్రభుత్వంలో గూఢచారులు కీలక పాత్రను పోషిస్తారు. గూఢచారులు అధికారులపై నిఘా ఉంచడం ద్వారా సరియైన సమాచారాన్నందిస్తూ రాజుకు సహాయపడతారు. ఇతర దేశాలను గురించిన సమాచారమును రాజుకు అందిస్తారు. లంచగొండి అధికారులను శిక్షించాలని, వారి ఆస్తులను స్వాధీనము చేసుకోవాలని మనువు తెల్పినాడు.

మనువు దొంగలను రెండు రకములుగా విభజించినాడు. 1. బహిరంగ దొంగలు, 2. రహస్య దొంగలు.

1. బహిరంగ దొంగలు : ప్రభుత్వ ఆస్తులైన ఆనకట్టలు, చెరువులు, నీటి పంపిణీ ప్రక్రియలను భగ్నము చేసేవారు.
2. రహస్య దొంగలు : లంచగొండులు, మోసగాళ్ళు, పేకాట రాయుళ్ళు, సరియైన ప్రవర్తన లేని ఉన్నతాధికారులు, డాక్టర్లు.

గూఢచారులు ఈ రెండురకాల దొంగలను గుర్తించడానికి సహాయ పడాలి. దోపిడీ జరిగేటప్పుడు నిర్లక్ష్యముగా వ్యవహరించే

అధికారులను శిక్షించాలి. దోపిడీ, దొంగతనములను నివారించుటలో అధికారులకు సహకరించని ప్రజలను కూడా శిక్షించాలని మనువు సూచించాడు.

## 5.12 స్థానిక ప్రభుత్వము :

ప్రభుత్వములో క్రింది స్థాయి విభాగము గ్రామము. గ్రామమునకు గ్రామపెద్ద అధిపత్యం వహిస్తాడు. గ్రామానికి పై స్థానములో కొన్ని గ్రామాలు ఒక సమూహముగా వివిధ సైజులలో అనేక సమూహాలు ఒక క్రమానుగత శ్రేణిలో ఉంటాయి. ప్రతి గ్రామ సమూహమునకు ఒక గ్రామాధిపతి ఉంటాడు. గ్రామపెద్ద తన పరిధికి సంబంధించిన సమాచారాన్ని తన పై స్థాయి అధికారియైన గ్రామాధిపతికి తెలియజేయాలి. ప్రతి పట్టణానికి ఉన్నత వ్యక్తిత్వము గల, పుట్టుక పరంగా ఉన్నత స్థాయి కుటుంబానికి చెందిన నగరాధిపతి ఉంటాడు. స్థానిక సంస్థల పాలనను అజమాయిషీ చేయడానికి, నియంత్రించడానికి ఒక మంత్రి ప్రత్యేకంగా ఉంటాడు. గ్రామ, పట్టణస్థాయి అధికారులకు జీతభత్యములను ధనరూపంలోను, వస్తురూపంలోను చెల్లించబడాలని మనువు తెల్పినాడు. ప్రతి 300 గ్రామాలకు కొంత సైన్యం రక్షణ కొరకు ఉంచబడుతుంది. అధికారులపై గూఢచారులు నిఘా ఉంచుతారు. అధునిక ప్రభుత్వాల లక్షణాలైన అధికార విభజన, క్రమానుగతాధికారము, పర్యవేక్షణ, నియంత్రణలను మనువు ఆనాడే సూచించినాడు.

## 5.13 విత్త పాలన :

రాజు ప్రజల నుండి పన్నులను వసూలు చేసే అధికారము కలిగియుంటాడు. అయితే రాజు ఇష్టము వచ్చినట్లు పన్నులు విధించరాదు. చేస్తున్న అభివృద్ధికి అనుగుణంగా పన్నులను విధించాలి. ప్రజలకు రక్షణ కల్పించడం రాజు యొక్క బాధ్యత. రాజు పన్నులను వసూలు చేసి ప్రజలకు రక్షణను, భద్రతను కల్పించలేకపోతే రాజు నరకానికి పోతాడు. పన్నులు ఒక్క మోస్తరుగా విధించాలని మనువు తెల్పినాడు. జలగ, అవుదూడ, తేనెటీగ కొద్ది కొద్దిగా అహారాన్ని ఏ విధముగా తీసుకుంటాయో, అ విధంగా రాజు పన్నులను కొద్ది కొద్దిగా ఒక మోస్తరుగా విధించాలి. భూమిపై శిస్తు అ భూమి గుణమును బట్టి విధించాలి. సారవంతమైన భూమిపై ఎక్కువ పన్ను, తక్కువ సారవంతమైన భూమిపై తక్కువ పన్ను విధించాలి. భూమిపై 1/6 నుండి 1/8 వ వంతు పన్ను, లేదా 1/4 వంతు ధాన్యము పన్నుగా విధించాలి. భూమి శిస్తు, ఫీజు, నీటి శిస్తు, పశువుల పై పన్ను, అమ్మకపు పన్ను మొదలుగున్నవి విధించాలి అని మనువు తెల్పినాడు. రాజు వ్యాపారాన్ని నియంత్రించాలి. మార్కెట్‌లోని వస్తువులకు ధరలను నిర్ణయించడం రాజు యొక్క విధి. స్తోత్రీయ బ్రాహ్మణుల పైన, పండితులైన బ్రాహ్మణులపై రాజు ఏ విధమైన పన్నులు విధించరాదని మనువు, రాజుకు సూచించినాడు. పన్నులు విధించేటప్పుడు రాజు శారీరిక శ్రమచేసే పనివారి పట్ల తగిన శ్రద్ధ వహించాలని, పనివారిపై విధించే పన్నులు, వారి ప్రయోజనాల సాధనకు చేసే వ్యయం మధ్య సమతౌల్యత ఉండాలని మనువు సూచించినాడు. పనివాళ్ళు నెలకు ఒకరోజు ప్రభువు కొరకు పనిచేయాలి. ఏదైనా నిధి లభ్యమైనట్లయితే అందులో సగం రాజధనాగారానికి మిగతా సగం బ్రాహ్మణులకు పంచాలని మనువు తెల్పినాడు.

## 5.14 చట్టము - న్యాయపాలన :

మను ధర్మశాస్త్ర ప్రకారము రాజ్యము యొక్క ముఖ్య బాధ్యత న్యాయపాలన. రాజు అనేక కేసులను విచారించవలసి యుంటుంది. రాజు కేసుల విచారణలో పండిత బ్రాహ్మణుల సలహాలను తీసుకోవాలి. మను దృష్టిలో న్యాయాన్ని విస్మరిస్తే అది నాశనాము చేస్తుంది. న్యాయాన్ని రక్షిస్తే అది తిరిగి రక్షిస్తుంది. కనుక న్యాయాన్ని విస్మరించకూడదు. రాజు, న్యాయమూర్తులు న్యాయాన్ని నిష్పక్షపాతముగా, చట్టబద్ధముగా అందించక పోతే వారు తమంతతామే నాశనమవుతారని మనువు తెల్పినాడు. రాజు అత్యున్నత న్యాయాధికారి. మనువు ప్రకారము చట్టమునకు నాలుగు మూలాధారాలున్నాయి. 1. వేదాలలో వివరించిన చట్టాలు, 2. సాంప్రదాయాలు, 3. ప్రాంతీయ ఆచార వ్యవహారాలు, 4. స్వయం సంతృప్తి.

స్వయం సంతృప్తి అనగా రాజు మరియు న్యాయమూర్తులు తమ మనస్సాక్షి ప్రభోధము మేరకు తీర్పులు చెప్పుట. వేటగాడు దెబ్బతిన్న జంతువు రక్తపు చుక్కల ఆనవాళ్ళను బట్టి ఆ జంతువును ఎలా కనుగొంటాడో రాజు న్యాయ విచారణలో సరియైన

మార్గమును అదే విధముగా కనుగొనాలని మనువు సూచించాడు. సాక్షులు చెప్పిన అంశాలను రాజు పరిగణనలోనికి తీసుకోవాలి.

మనువు చట్టాలను రెండు రకములుగా విభజించినాడు. అవి

1) వేదాలపై ఆధారపడిన చట్టాలు.

2) రాజ్యము రూపొందించే చట్టాలు.

సంతానహీనులైన స్త్రీలు, వితంతువులు, రోగగ్రస్తులైన స్త్రీల ఆస్తి హక్కును రాజు పరిరక్షించాలి. వారి ఆస్తులను కాజేయడానికి ప్రయత్నించే వారి బంధువులను శిక్షించాలని మనువు తెల్పినాడు.

ఒక క్షత్రియుడు ఒక బ్రాహ్మణుని అగౌరపరచి దూషించినట్లయితే 100 పనా (డబ్బు) లు చెల్లించాలి. వైశ్యులు అదేతప్పుకు 150 నుండి 200 పనాలు చెల్లించాలి. అదే శూద్రుడైతే శారీరక శిక్షను అనుభవించాలి. బ్రాహ్మణుడు, క్షత్రయుని దూషించినట్లయితే 50 పనాలు, వైశ్యుని దూషించితే 25 పనాలు, శూద్రున్ని అయితే 12 పనాలు చెల్లించాలి. నేరాలను విధించే శిక్షలలో కూడా కుల వివక్షత కనిపిస్తుంది. కుల వ్యవస్థ భ్రష్టమౌతుందన్న కారణంగా మనువు లైంగిక నేరాలను కఠినంగా శిక్షించాలంటాడు. నేర తీవ్రతను బట్టి శిక్షలు ఉరివేయటం నుండి కాళ్ళు, చేతులు నరకటం వరకు ఉండేవి. శూద్రులచే న్యాయ చట్టాలు వ్యాఖ్యానించ బడరాదు. అలా జరిగితే రాజ్యం నశించి పోతుంది. మనువు ప్రకారము న్యాయపాలన బ్రాహ్మణుల సహాయంతో ప్రభువే నిర్వహించాలి.

## 5.15 విదేశాంగ విధానము :

విదేశాంగ విధానముపై మనువు అభిప్రాయాలు మెకైవల్లి అభిప్రాయాలకు కొంత దగ్గరగా ఉంటాయి. విదేశాంగ విధానములో నైతిక విలువలకంటె లక్ష్యసాధనకే ప్రాధాన్యత నివ్వాలని మనువు అభిప్రాయ పడినాడు. విదేశాంగ విధానములో మనువు రాజుకు కొన్ని సూచనలను చేశాడు.

1) ప్రస్తుతము శత్రువు కంటే బలహీనముగా ఉండి భవిష్యత్‌లో బలపడగలనన్న విశ్వాసమున్నప్పుడు రాజు శాంతి ఒప్పందము చేసుకోవాలి.

2) శత్రువును ఓడించ గల్గినంత బలము తనకున్నదని భావించినప్పుడు రాజు యుద్ధము చేయాలి.

3) తన సైన్యము తనపట్ల సంతృప్తి కల్గియుండి పూర్తిగా తన స్వాధీనములో ఉన్నప్పుడు రాజు శత్రువుపైకి యుద్ధానికి బయలుదేరాలి.

4) సైనికపరంగా బలహీనంగా ఉన్నప్పుడు రాజు తటస్థ వైఖరిని అవలంభించాలి.

5) శత్రువుకంటే తనసైన్యము బలహీనముగా ఉన్నప్పుడు తన సైనిక శక్తిని మెరుగు పరచుకోవడము రాజు యొక్క బాధ్యత.

6) అత్యంత శక్తివంతమైన శత్రువును ఎదుర్కొనవలసి వచ్చినప్పుడు రాజు ధనవంతుడు మరియు బలవంతుడైన రాజు యొద్ద ఆశ్రయం పొందాలి.

రాజు తనను ఓడించగల్గిన రాజులపట్ల, నమ్మక ద్రోహుల పట్ల, తనపట్ల ద్వేషము కలిగిన వారిపట్ల జాగ్రత్తగా ఉండాలి. రహస్యముగా శత్రువులతో చేతులు కలిపే స్నేహితులపట్ల, శత్రువు నుండి వేరుపడి తనతో చేతులు కలిపిన వారిపై రాజు నిఘానుంచాలి. రాజు అవసరమైనప్పుడు శత్రువుపై సైనిక చర్య చేపట్టడానికి బలమైన సైన్యాన్ని కలిగి, మిత్ర రాజ్యాలను పెంపొందింప జేసుకోవాలి. నూతన భూభాగాలను జయించడానికి, జయించినవాటిని రక్షించికొనుటకు పోరాడాలి. తనను సవాలు చేసిన వారితో పోరాడటము క్షత్రియ ధర్మము. రాజు తాను జయించిన ప్రాంతాలను స్థిరపరచుకోవటానికి సామ, దాన, భేద, దండోపాయాలను ఉపయోగించాలి.

ఇతర రాజులతో ఏర్పడిన వివాదాలను అంగీకరింప చేయడం (సమాధాన పరచుట) ద్వారా పరిష్కరించుకొన వచ్చును. ఈ పద్ధతి విఫలముయిన యుద్ధము తప్పదు.

## 5.16 సారాంశము :

మనువును ఒక గొప్పసామాజిక రాజకీయ తత్వవేత్తగా, చట్ట నిర్మాతగా కీర్తించడం జరిగింది. ప్రజలసంక్షేమము కొరకు ప్రభుత్వము పనిచేయాలని చెప్పినాడు. రాజు తన మంత్రివర్గము యొక్క మరియు ఇతరుల సలహాలను తీసుకోవాలని సూచించాడు. రాజు యొక్క ముఖ్య బాధ్యత సమాజములో శాంతి భద్రతలను కాపాడి ప్రజలను సంతోషముగా ఉండేలా చేయటం అని మనువు తెల్పినాడు.

మనువు యొక్క దండనీతి ఆధునిక ప్రభుత్వాలకు కూడా ఆచరణీయమే. మనువు చెప్పిన గ్రామపాలన, స్థానిక సంస్థలు అధికార వికేంద్రీకరణకు అధికార విభజనకు సూచికలు. రాజ్యాంగ బద్ధమైన దాతృత్వము కల్గిన చక్రవర్తి, పరిమిత ప్రభుత్వము, సంక్షేమ రాజ్యము మున్నగు భావాలను మనువు బలపరచాడు. మనువు యొక్క సిద్ధాంతము చిన్న వారిపట్ల, బలహీనులపట్ల దయను కల్గియుంది. శక్తిమంతుల నుండి బలహీనులను రక్షించుట రాజధర్మముగా మనువు తెల్పినాడు. మనువు రాజకీయాలను, సమాజాన్ని, పర్యావరణాన్ని అనుసంధానపరచినాడు. రాజు చెట్లను రక్షించాలని మనువు తెల్పినాడు. కానీ మనువు కుల వివక్షత కల్గిన అసమాన సమాజాన్ని, ఉన్నత కులాల ఆధిపత్యాన్ని ముఖ్యంగా బ్రాహ్మణ కుల ఆధిపత్యాన్ని బలపరిచినాడు. శూద్రులు, చండాలుర పరిస్థితి బానిస తనానికి తీసిపోదు. చండాలురను అంటరానివారిగా సమాజానికి దూరముగా వేరు చేయడం జరిగింది. బ్రాహ్మణ ఆధిపత్య సమాజాన్ని బలపరచాడని మనువు విమర్శకు గురైనాడు. జ్ఞాన సముపార్జన, పవిత్ర జీవితం, ఇతరుల మంచికొరకు పనిచేయటం బ్రాహ్మణుని యొక్క బాధ్యతగా మనువు తెల్పినాడు. ఈ నియమాలను పాటించక పోతే అతను తన బ్రాహ్మణత్వాన్ని కోల్పోతాడని మనువు ఎక్కడా చెప్పలేదు. ఇతర కులముల వారు బ్రాహ్మణులు నిర్వహించవలసిన నియమాలను పాటిస్తే వారు బ్రాహ్మణత్వాన్ని పొందుతారని కూడా ఎక్కడా చెప్పలేదు.

Dr.B.R.అంబేద్కర్ మనుస్మృతి శూద్రుల, అంటరాని వారి, సామాజిక, ఆర్థిక, మత, రాజకీయ బానిసత్వాన్ని స్థిరీకరించటానికి మనువు చేసిన ప్రయత్నంగా విమర్శిస్తూ 25 డిసెంబర్, 1927 న మనుస్మృతిని తగుల బెట్టినాడు.

మనువు స్త్రీలపట్ల వ్యక్తంచేసిన భావాలుకూడా అస్పష్టతతోను పరస్పర వ్యతిరేకత కల్గియున్నాయి. స్త్రీలను గౌరవించాలని, భార్యాభర్తల మధ్య పరస్పర ప్రేమ కుటుంబ సంతోషానికి మూలమని, కుటుంబ వ్యవహారాల పర్యవేక్షణ స్త్రీల బాధ్యత అని మనువు చెప్పినాడు. కానీ స్త్రీలకు స్వేచ్ఛ ఉండరాదని, వారు ఎల్లప్పుడూ పురుషుల రక్షణలో ఉండాలని మనువు తెల్పినాడు. అంతేకాక రాజు స్త్రీలతో ఎటువంటి రహస్యమును పంచుకొనగూడదని వారు రహస్యములను దాచలేరని మనువు సూచించినాడు. అందువలనే స్త్రీ వాదులు మనువును తీవ్రంగా విమర్శించారు.

మనువు సూచించిన ప్రభుత్వ సిద్ధాంతం హిందూతత్వం, సాంప్రదాయాలచే ప్రభావితమై క్రీ.పూ. రెండవ శతాబ్దం నాటి సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక మత భావాలను ప్రతిబింబించింది. రాజకీయాలు మిగిలిన వాటి కంటే భిన్నమైనవి కాకుండా అవి సామాజిక వ్యవస్థలో అంతర్భాగముగా కన్పిస్తాయి. అందువల్ల మనుస్మృతి ప్రాముఖ్యాన్ని ఆధునిక దృక్పథం నుంచి కాక మనువు కాలం నాటి సామాజిక, రాజకీయ, మతపరమైన పరిస్థితులను అంచనా వేయడానికి ప్రయత్నించాలి.

## 5.17 వ్యాసరూప ప్రశ్నలు :

1. మనుస్మృతి ప్రకారము రాజ్యము యొక్క కర్తవ్యములను వివరింపుము.
2. రాజు యొక్క వివిధ అధికారములను వివరింపుము.
3. చట్టము, న్యాయపాలనపై మనువు యొక్క భావాలను వివరింపుము.

## 5.18 లఘు వాఖ్యలు :

1. సప్తాంగ సిద్ధాంతము.
2. దండన.
3. స్థానిక ప్రభుత్వము.

## 5.19 చదువదగిన గ్రంథాలు :


| | | |
|---|---|---|
| A.S. Altekar | : | State and Government in Ancient India. |
| Hari Hara Das | : | Indian Political Tradition. |
| J.k. Baral | : | Indian Political Tradition. |
| V.N. Ghosal | : | A History of Indian Political Ideas |


డా . బి . ఉదయ ప్రకాశ్

*****

పాఠం - 6

# హాబ్స్ (క్రీ.శ. 1588 - 1679)

## 6.0 లక్ష్యం :

ఈ పాఠం ప్రధాన లక్ష్యం రాజ్యావతరణ వివరించే సామాజిక ఒడంబడిక సిద్ధాంతాన్ని వివరించడం, హాబ్స్ రాజనీతి తత్వ భావాలైన ప్రాకృతిక వ్యవస్థ, సామాజిక ఒడంబడిక, నిరుపేక్ష సార్వభౌమాధికారాలను వివరించడం.

## విషయ సూచిక :


6.1 పరిచయం

6.2 జీవిత సంగ్రహం

6.3 సమకాలిన పరిస్థితులు

6.4 రచనలు - రచనా పద్ధతులు

6.5 రాజకీయ భావాలు

6.5.1 మానవ స్వభావము

6.5.2 ప్రాకృతిక వ్యవస్థ

6.5.3 సహజ హక్కులు - సహజ న్యాయం

6.5.4 సామాజిక ఒడంబడిక

6.5.5 ప్రభుత్వ స్వభావము

6.5.5.1 సార్వభౌమాధికారం

6.5.5.2 సార్వభౌముని అధికారాలు

6.5.5.3 ప్రభుత్వ వర్గీకరణ

6.5.5.4 స్వేచ్ఛా సిద్ధాంతము

6.6 విమర్శ

6.7 హాబ్స్ సిద్ధాంత విశిష్టత

6.8 సారాంశము

6.9 నమూనా ప్రశ్నలు

6.10 చదువదగిన గ్రంథాలు


## 6.1 పరిచయం :

హాబ్స్ సామాజిక ఒడంబడిక వాదులలో ప్రథమ బ్రిటిష్ రాజనీతి తత్వవేత్త. రాజ్యంలో రాజు యొక్క నిరుపేక్ష సార్వభౌమాధికార సిద్ధాంతాన్ని బలపర్చడానికి సామాజిక ఒడంబడిక సిద్ధాంతాన్ని రూపొందించాడు.

రాజ్యావతరణకు ప్రాకృతిక వ్యవస్థలో ప్రజలు చేసుకొన్న ఒడంబడిక ఫలితంగా ప్రజలు తమ సర్వహక్కులను మానవాధికారికి సమర్పించారని తత్ఫలితంగా ఆ మానవాధికారి నిరుపేక్ష సార్వభౌమాధికారాలు సంతరించుకొని సార్వభౌముడైనాడని వివరించెను.

## 6.2 జీవిత సంగ్రహం :

థామస్ హాబ్స్ 1588వ సంవత్సరంలో ఒక మధ్య తరగతి కుటుంబములో జన్మించి, 1679వ సంవత్సరంలో చనిపోయినారు. ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యలభ్యసించాడు. 1618వ సంవత్సరంలో పట్టభద్రుడుయినాడు. గ్రీక్ భాషలల్లో దిట్ట. విద్యాభ్యాసం పూర్తియిన తర్వాత ఇంగ్లాండ్ రాజవంశమైన "కైవెండిష్" కుటుంబ పిల్లలకు విద్యగరపడానికి నియుక్తుడైనాడు. తద్వారా రాజకుటుంబంతో సత్సంబంధాలు సంపాదించాడు. దీని ఫలితంగా అవకాశం లభించినప్పుడుల్లా ఐరోపా ఖండంలో అనేక ప్రాంతాలు పర్యటించి ఎంతో మంది తత్వవేత్తలతో పరిచయం పెంచుకొన్నాడు. తద్వారా అనేక విషయాలను అవగాహన చేసుకొన్నారు.

స్వాభావికంగా హాబ్స్ రాజత్వాన్ని (Royalty) సమర్ధించేవారు. ఆనాటి ఇంగ్లాండ్ దేశం అంతర్యుద్ధాలతో తిరుగుబాట్లకు తావులేదని హాబ్స్ ప్రకటించినాడు. అంతర్యుద్ధం దేశాన్ని నాశనం చేస్తుందని హాబ్స్ అభిప్రాయం. ఇంగ్లాండ్‌లో 'చర్చి'కి ఆధిక్యం ఉండటం హాబ్స్‌కు నచ్చులేదు. పార్లమెంటరీ ప్రజాస్వామ్య ఆశయాల పట్ల వ్యతిరేకతను తన రచనల్లో వ్యక్త పరిచెను.

1648-49ల ఇంగ్లాండ్‌లో రాజరికానికి వ్యతిరేకంగా అంతర్యుద్ధం మొదలైంది. రాజరికాన్ని బలపర్చిన హాబ్స్ ప్రాణ భయంతో ఫ్రాన్స్ పారిపోయాడు. అక్కడే ఈతడు లెవియధాన్ (Leviathan) అనే గ్రంధాన్ని 1651వ సంవత్సరంలో వ్రాసి నాడు. 1661వ సంవత్సరంలో ఇంగ్లాండ్‌లో తిరిగి శాంతి నెలకొనిన తరువాత హాబ్స్ తరిగి వచ్చాడు. 91 సంవత్సరములు నిండు జీవితం గడిపి-1679 సంవత్సరంలో మరణించేను.

## ...కాలీన పరిస్థితులు :

హాబ్స్ కాలంలో ఇంగ్లాండ్ అంతఃకలహాలకు గురైంది. దేశంలో అరాచకత్వం ప్రబలింది. ప్రజల బద్ధతకు ముప్పువాటిల్లింది. ...త్వంపై వారికి నమ్మకం పూర్తిగా సన్నగిల్లింది. ఇంగ్లాండ్ స్టూవర్ట్ రాజవంశము అన్ని వైపుల నుండి ప్రతిఘటన ఎదుర్కొనవలసి వచ్చినది. ఈ అతర్యుద్ధంలో మొదటి చార్లెస్ ఓటిపాయాడు. అతడు శిరచ్ఛేదానికి గురయ్యాడు. ప్రజల ధనమాన ప్రాణాలకు రక్షణ లేకుండా పోయింది. ఈ పరిస్థితులన్నీ హాబ్స్ మీద ప్రభావాన్ని చూపాయి. అందువల్లనే తన రచనల ద్వారా నిరంకుశ రాజరికాన్ని బలపర్చి ప్రజల భద్రతకు కృషి చేసాడు.

హాబ్స్ తత్వవేత్తకాని రాజకీయ వేత్తకాదు. అతని రాజకీయ తత్వశాస్త్రం (Political Philosophy)లో నిరపేక్ష సార్వభౌమాధికారం (Absolute Sovereignty) ఒక భాగం మాత్రమే. ఇతడు రాజకీయ సిద్ధాంతాన్ని (Political Theory) వేజ్ఞానిక దృష్టిలో చూచిన మొదటి ఆధునిక రాజనీతి తత్వవేత్త. ఇతనికి భౌతిక శాస్త్రంపై నమ్మకం ఎక్కువ. ఈ భౌతిక శాస్త్ర విజ్ఞానమే ఇతని రాజనీతి శాస్త్రానికి (Politics) పునాది అయింది. ప్రత్యక్ష సాక్ష్యం లేనిదే అతడు ఏ సిద్ధాంతాన్ని నమ్మలేడు.

## 6.4 రచనలు - రచన పద్ధతి :

హాబ్స్ అనేక రచనలు చేసాడు. వాటిలో ముఖ్యమైనవి 1. సిటిజన్ (1642), 2. డిసైన్ (1647), 3. లెవియథాన్ (1651). హాబ్స్ రచనలన్నింటిలోనూ లెవియథాన్ గ్రంధం ఉత్కృష్టమైంది. దీనిలో ప్రాకృతిక న్యాయం, మతం, అధికారం, ఒడంబడిక

వంటి విషయాలను వివరింబడ్డాయి. మానవుని సాధారణ లక్షణాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చినాడు. మానవులందరూ శారీరకంగానూ, మానసికంగానూ ఒకేరీతిగా జన్మిస్తారని హాబ్స్ తెలియ చేసారు.

హాబ్స్ ఇతర రాజనీతి శాస్త్రలవలె తన సిద్ధాంత వివరణలో చారిత్రక పద్ధతిని అనుసరించ లేదు. భౌతికశాస్త్ర పద్ధతిలో రేఖాగణిత పద్ధతిననుసరించి రాజనీతిని శాస్త్రీయంగా చర్చించాడు.

## 6.5 రాజనీతి భావాలు :

### 6.5.1 మానవ స్వభావం :

మానవ స్వభావంపై మాకియావెల్లి అను ఇటల రాజనీతి తత్వవేత్త వెలుబుచ్చిన అభిప్రాయములకు హాబ్స్ వెలుబుచ్చిన ప్రాకృతిక వ్యవస్థలో మానవుని స్వభావంనకు చాలా దగ్గర పోలికలు కలవు.

ప్రాకృతిక వ్యవస్థలో మానవుని స్వభావంను గూర్చి హాబ్&స వివరిస్తూ, మానవుడు అత్యాశతో, అధికార దాహంతో నిరంతరం ఒకరితో నొకరు పోరాడుతుండేవారని అభివర్ణించాడు. మానవుడు పుట్టినది మొదలు గిట్టే వరకు ఎడతెగని కోరికలతో విరామం లేకుండా అధికారం కోసం ప్రాకులాడేవాడు మానవుడు 'స్వార్ధపరుడని, మూర్ఖుడని, అహంభావి' అని హాబ్స్ వర్ణించినాడు. (Man is a Selfish, Stupid and Egoistic) మానవుడు ఏ పని తన మేధవల్లకానీ, తన మాట నిలుపుకొనేందుకు కాని చేసేవాడు కాడు. ఎల్లప్పుడు తన స్వార్ధన్ని గురించే ఆలోచిస్తూ తన బాగునే కోరుతూ ఉండేవాడు. తల్లిదండ్రుల మీద ప్రేమ, స్నేహితుల అభిమానం, తోటి వారిమీద దయ వంటివి మానవునికి తెలియవు.

హాబ్స్ మానవ స్వభావాన్ని శాస్త్రీయ పద్ధతిలో వివరించాడు. అతని ప్రకారం ప్రకృతిలో చలనం అతి ముఖ్యమైనది కూడా. ప్రకృతిలో సంభవించే మార్పులన్నింటికీ కారణం చలనమే. ఉదాహరణ. వరదులు, భూకంపాలు, తుఫాను మొదలగున్నవి మానవుని ప్రవర్తన, ఆలోచనలపై సంతోషం, దుఃఖం, ఆశ, నిరాశ, భయం, ధైర్యం, కోపం, శాంతం వంటివన్ని కలుగుతాయి. వ్యక్తులు వారివారి ఇష్టాలతో వారికి పని లేదు. వ్యక్తి ఎప్పుడూ సంపూర్ణ సుఖాన్ని కోరుకుంటాడు. దాని సాధానకై నిరంతరం ప్రయత్నిస్తాడు. ఆ విధంగా ప్రయత్నించేటప్పుడు సంఘర్షణ చెలరేగుతుంది. ఈ సంఘర్షణకు మూల కారణాలు మూడు అవి.

1 వ్యక్తుల మధ్య పోటీ. ఇది వ్యక్తి స్వలాభం కోసం

2 ఎదుట వ్యక్తి పై నమ్మకం లేకపోవటం.ఇది వ్యక్తి రక్షణ కోసం.

3 కీర్తి కోసం ప్రాకులాడుట. ఇది వ్యక్తి ఘనత కోసం చేసేవి.

వ్యక్తి ఈ మూడింటి కోసం ఘర్షణకు దిగుతాడు. ఈ విధంగా హాబ్స్ మానవ స్వభావాన్ని విశ్లేషణ చేసాడు.

### 6.5.2 ప్రాకృతిక వ్యవస్థ :

ప్రాకృతిక వ్యవస్థ అనగా రాజ్యము, ప్రభుత్వం ఏర్పడక ముందున్న పరిస్థితిని ప్రాకృతిక వ్యవస్థగా చెప్పబడినది. హాబ్స్ అభిప్రాయంలో ఇలాంటి ప్రాకృత వ్యవస్థలో మానవుడు సంఘముతో అవసరం లేకుండా నివసించినాడు (State of Nature is pre-social). ఈ వ్యవస్థలో దండనాధికారి లేకపోవడంతో ఒకరితో ఒకరు తగువులాడుకొంటూ ఉండేవారని హాబ్స్ అభిప్రాయం. దానితో ఒకరికి మరిఒకరు శత్రువులే కాని మిత్రులు లేరని తెలుస్తుంది.

లాక్ అభిప్రాయంలో ప్రాకృతిక వ్యవస్థలో కొన్ని దోషాలున్నాయి. అవి (1) తీర్పు పక్షపాతంగా ఉండుట, (2) తీర్పును అమలులో పెట్టడానికి చొరవ చాలదు. (3) తీర్పు వివిధ రకాలుగా ఉంటుంది. ఎందుకంటే ఒక రకం తప్పును వేరుక్కరు మనుష్యులు శిక్ష విధిస్తారు. కాబట్టి, ఈ దోషాలు లేకుండా చేయాలంటే మూడు పనులు చేయవలెను. అవి :

1. తీర్పులో పక్షపాతం లేకుండా చేయడానికి న్యాయస్థానం ఏర్పాటు **(Judiciary).**
2. న్యాస్థానం చేసిన తీర్పును అమలులో పెట్టడానికి పాలక వర్గం **(Executive).**
3. సమానమైన శాసనాలు చేయడానికి శాసనసభ **(Legislature)** కావలెను.

ప్రాకృత వ్యవస్థలోని ఇబ్బందులను తొలగించడానికి పౌర ప్రభుత్వం **(Civil Government)** అన్ని విధాల తగినవని లాక్ అభిప్రాయం.

ప్రాకృతిక వ్యవస్థలో పైనుదహరించబడిన అసౌకార్యలవలన సమాజ శాంతికి భంగం వాటిల్లింది. ప్రజల హక్కులకు భంగం ఏర్పడింది. కొందరు వ్యక్తులు నైతికంగా దిగజారి సమాజ శాంతికి భంగం కలుగ చేయడం ప్రారంభించారు. సహజ హక్కులు న్యాయాలు ఎవరి ఇష్టానుసారంవారు అన్వయించడం ప్రారంభించారు. దానితో ప్రాకృతిక వ్యవస్థలోని మానవుల ఇబ్బందులకు అంతులేకుండా పోయింది. అసంతృప్తి అధికమైంది .చివరకు ఇదే సామాజిక ఒడంబడికను చేసుకొనుటకుదారి తీసింది.

## 7.5.3 సహజ హక్కుల సిద్ధాంతము (Theory of Nature Rights) :

జాన్‌లాక్ ఉదారవాదం వల్ల ప్రభావితుడై సహజ హక్కుల సిద్ధాంతాన్ని గూర్చి వివరించాడు. ఈ సిద్ధాంతం లాక్ రాజనీతి సిద్ధాంతానికి పునాదివంటింది. సహజ హక్కులు మావులకు ప్రాకృతిక వ్యవస్థలోనూ నాగరిక సంఘంలో కూడా ఉంటాయని లాక్ అభిప్రాయం.

లాక్ దృష్టిలో ఈ హక్కులు పుట్టుకతోనే సహజంగా వచ్చినవని, సహజ న్యాయం **(Natural Justice)** నుండి ఉద్భవిస్తాయని అభిప్రాయ పడెను.

సహజ హక్కులలో ముఖ్యమైనవి మూడు అవి.

1) ప్రాణ రక్షణ హక్కు, 2) ఆస్తి హక్కు, 3) స్వేచ్ఛ హక్కు.

లాక్ అభిప్రాయంలో మానవుడు నాగరిక జీవనాన్ని గడుపుటకు ఈ హక్కులు అవసరం. మనిషి కాయకష్టం చేసి ఆస్తి సంపాదిస్తాడు. దాని మీద హక్కు అతనికి సహజంగా ఏర్పడుతుంది. వ్యక్తి శ్రమను వస్తు రూపంలోకి మార్చినప్పుడు ఆ వస్తువు పై అతనికి గల హక్కు సహజమైందే.

## 7.5.4 సామాజిక ఒడంబడిక (Social Contract):

ప్రాకృతిక వ్యవస్థలో ఏర్పడిన కొన్ని అసౌకర్యాల వలన ప్రజల సుఖశాంతులకు తీవ్ర అంతరాయం వాటిల్లింది. సంఘ విద్రోహశక్తులు మరింత విజృంభించడంతో ప్రజలంతో సామూహికంగా యోచించడం ప్రారంభించారు. తత్ఫలితంగా ప్రజలంతా ఒక చోట సమావేశమై ప్రాకృతిక వ్యవస్థకు స్వస్తి చెప్పడానికి నిర్ణయించుకొన్నారు. వారు రెండు సాంఘిక ఒడంబడికలు చేసుకొని రాజ్యాన్ని, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకొన్నారు.

పాటించడం. సహజ న్యాయం అనగా మనకు మనం ఏదైతే చేసుకోమో ఇతరులకు కూడా చేయరాదు. ఈ హక్కుల ద్వారా మానవుడు జీవితాన్ని సురక్షితం చేసుకోగలుగుతాడు.

శాంతి ఉండాలంటే ఎవరికి వారే వారి సహజ హక్కులను కొన్ని వదులుకోవలెను. దానికి కూడా ఒక హద్దు ఉండవలెను. ఇవన్నీ జరగాలంటే అందరిని తృప్తిపరిచి శాసించగల వ్యక్తి కావలెను. ఆ వ్యక్తి సార్వభౌముడు.

### 6.5.4 సామాజిక ఒడంబడిక :

ప్రాకృతిక వ్యవస్థలో దుర్భర జీవితంలో అనుభవిస్తున్న మానవులు, దాని నుండి విముక్తి పొందడం కోసం అంతా ఒక చోట సమావేశమై 'ఒడంబడిక' చేసుకుంటారు. దానినే 'సామాజిక ఒడంబడిక' అంటారు. దానికి కారణం ప్రజలు తమ ఆత్మ రక్షణ, సుఖ జీవనం కోరుకోవటమే. సామాజిక ఒడంబడిక ప్రకారం ఒక నిర్దిష్టాధికారం ఏర్పడి దానికందరూ విధేయతా ప్రకటించినప్పుడు, వ్యక్తి సంరక్షణ వీలవుతుందని మానవుడు గ్రహించాడు. ఒడంబడిక ద్వారా ఏర్పడిన నిర్దిష్టాధికారం ఒకనిల్ కేంద్రీకృతమై ఉంటుంది. ఒడంబడికలో భాగస్వాములైన ప్రజలు తమ కోర్కెలను ఆ వ్యక్తిద్వారా వ్యక్తపరుస్తారు. ప్రజలంతా ఆ దండనాధికారి! విధేయులై ఉంటారు.

హాబ్స్ అభిప్రాయం ప్రకారం ఒడంబడిక ద్వారా రాజ్యం, ప్రభుత్వం అను రెండు సంస్థలు ఏర్పడతాయి. వారు చేసుకొన్న ఒడంబడిక ఈ క్రింది విధంగా ఉంది.

"నన్ను నేను కాపాడుకొనే హక్కును ఫలానా వ్యక్తికి లేదా వ్యక్తుల కూటమికి ఇచ్చాను. అదే విధంగా నీవు కూడా నీ హక్కును ఆ వ్యక్తికి ఇచ్చి అతని ఆధీనంలో ఉండటానకి సమ్మతించాలి".

పై ఒడంబడిక ద్వారా ప్రాకృతిక వ్యవస్థలోని మానవులు తమ సహజ హక్కులన్నింటినీ ఒక నిర్ణీత వ్యక్తికి ఇచ్చి అతని ఆధీనంలో ఉండటానికి అంగీకరించాడు, ఈ వ్యక్తే సార్వభౌముడు ఈ ఒడంబడిక ద్వారా మానవులందరికి ధన మాన ప్రాణఆలకు భద్రత ఏర్పడింది.

సామాజిక ఒడంబడికలోని ముఖ్యాంశాలు ఈ క్రింది విధంగా వివరించబడ్డాయి. అవి.

1. ప్రజల మధ్య జరిగిన ఒకేఒక ఒడంబడిక ద్వారా రాజ్యం, ప్రభుత్వం రెండూ ఏర్పడతాయి.
2. సార్వభౌముడు ఒడంబడిక ఫలితంగా ఏర్పడతాడేగాని ఒడంబడికలో భాగస్వామి మాత్రము కాదు.
3. ఈ ఒడంబడిక ద్వారా మానవులు ఆత్మ రక్షణ హక్కు తప్ప, ప్రాకృతిక వ్యవస్థలో అనుభవించిన సర్వహక్కులునూ కొల్పోతారు.
4. ఈ ఒడంబడిక శాశ్వతము, వదులుకోవడానికి, ఉల్లంగించడానికి వీలులేనిది.
5. సార్వభౌముని అధికారం అవిభాజ్యం, నిరపేక్షం, అనన్యసంక్రామకం.
6. ప్రజలకు సార్వభౌమునిపై తిరుగుబాటు హక్కు లేదు.
7. సార్వభౌముని ఆజ్ఞయే శాసనాలు.
8. సార్వభౌముని అధికారం సంపూర్ణమైంది.
9. సార్వభౌముని అనుమతించిన మేరకే ప్రజలు స్వేచ్ఛ హక్కులు అనుభవిస్తాడు.

### 6.5.5 ప్రభుత్వ స్వభావం :

హాబ్స్ ప్రభుత్వ స్వభావమును గూర్చి ఈ క్రింది విధంగా వివరించెను.

### 6.5.5.1 సార్వభౌమాధికారం :

సార్వభౌమాధికారం నిరపేక్షము, అవిభాజ్యం, అనన్య సంక్రామమకమైంది. హాబ్స్ అభిప్రాయంలో సార్వభౌమాధికారం కలవాడు సార్వభౌముడు. ప్రజలు సార్వభౌమాధికారి ఆదేశాలను, ఆజ్ఞలను తప్పక పాటించాలి. నిరంకుశంగా వ్యవహరించిన తిరుగుబాటు చేయకూడదు.

### 6.5.5.2 సార్వభౌముని అధికారాలు :

సార్వభౌముని అధికారం, ఆజ్ఞలు, ఆదేశాలు రాజ్యంలోని ప్రజలందరికి సమంగా వర్తిస్తాయి. ఇతడు ప్రజల మధ్య వివాదములను పరిష్కరించును. శాంతిభద్రతలను నెలకొల్పుట, యుద్ధాలు చేయుట, సంధులను చేసుకోవడము సార్వభౌమునికే పరిమితం. ఇతడు సలహాదారులను, న్యాయాధికారులను నియమించవచ్చును.

### 6.5.5.3 ప్రభుత్వ వర్గీకరణ :

హాబ్స్ రాజరికం పట్ల ఎక్కువ మక్కువను చూపి, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం పట్ల వ్యతిరేకతను వ్యక్తపరిచెను. హాబ్స్ ప్రభుత్వాన్ని మూడు రకాలుగా పేర్కొన్నాడు. అవి.

1. రాజరికం,
2. ప్రజాస్వామ్యం,
3. కులీన పాలన. వీటిలో రాజరికమే అత్యున్నతమైనదని పేర్కొనెను.

### 6.5.5.4 స్వేచ్ఛా సిద్ధాంతము :

హాబ్స్ వ్యక్తి శ్రేయోవాది. ప్రతివ్యక్తి స్వేచ్ఛను కోరుకుంటాడు. అయితే ఈ స్వేచ్ఛే రాజ్యానికి వ్యతిరేకం ఉండకూడదు. పౌర స్వేచ్ఛ రాజ్యం వల్ల లభిస్తుంది. హాబ్స్ సామాజిక ఒడంబడికలో వ్యక్తి శ్రేయోవాద ధోరణి పలు విధాలుగా ఉంది. హాబ్స్ దృష్టిలో రాజ్యం వ్యక్తి ప్రయోజనాలను నెరవేర్చే సాధనం. వ్యక్తి ప్రాణరక్షణ, ఆస్తి రక్షణ రాజ్య లక్ష్యాలుగా ఉంటాయని హాబ్స్ చెప్పటంలో వ్యక్తి శ్రేయోవాద ధోరణి ఉంది. హాబ్స్ ప్రతిపాదించిన సహజ సమానత్వా సిద్ధాంతం వ్యక్తి శ్రేయోవాదాన్ని తెలియచేస్తుంది. రాజ్యశాసనాలన్నీ ప్రజారక్షణ ధ్యేయంతోనే చేయబడతాయి. ప్రజల ఆర్థిక, కుటుంబ, వ్యక్తిగత విషయంలలో రాజు ప్రవేయం ఉండకూడదని హాబ్స్ అభిప్రాయపడెను.

### 6.6 విమర్శ :

హాబ్స్ సామాజిక ఒడంబడిక సిద్ధాంతం తీవ్రంగా విమర్శకు గురియైనది అవి.

1 హాబ్స్ భావించినట్లుగా ప్రాకృతిక వ్యవస్థలో మానవుడు ఏకాకి అనుట సమంజసంగా లేదు.

2 ప్రాకృతిక వ్యవస్థలోనే మానవుడు సహజ హక్కులు (ప్రాణరక్షణ హక్కు, ఆస్తి హక్కు, స్వేచ్ఛ హక్కు) అనుభవించినట్లు

4 హాబ్స్ నిరుపేక్ష రాజరిక వ్యవస్థను సమర్ధించగా, లాక్ పరిమిత రాజ్యాంగబద్ధ రాజరిక వ్యవస్థనుసమర్ధించెను.

5 హాబ్స్ రాజరికానికి అధిక ప్రాధాన్యత ఇవ్వగా, లాక్ ప్రజాస్వామిక వ్యవస్థకు మంచి ప్రభుత్వంగా పరిగణించెను.

6 హాబ్స్ దృష్టిలో సార్వభౌమాధికారి ఒడంబడికలో భాగస్వామికాదు, లాక్ దృష్టిలో సార్వభౌమాధికారి కూడా భాగస్వామియే.

7 హాబ్స్ దృష్టిలో సార్వభౌమాధికారము, నిరుపేక్షం, శాశ్వతం. అనన్యసంక్రమమకమైంది. అయితే లాక్ దృష్టిలో సార్వభౌమాధికార తన బాధ్యతలను విస్మరించినప్పుడు ప్రజలను అతనిని తొలగించవచ్చును.

8 హాబ్స్ దృష్టిలో ఒక ఒడంబడిక ఫలితంగా రాజ్యం, ప్రభుత్వం ఏర్పడగా, లాక్ దృష్టిలో రెండు ఒడంబడికలు జరిగినవి. ఆ రెండి ఫలితంగానే రాజ్యం, ప్రభుత్వం ఏర్పడింది.

## 7.7 లాక్ సిద్ధాంత ముఖ్యాంశాలు :

1 లాక్ ప్రాకృతిక వ్యవస్థ హాబ్స్ చెప్పినంత భయంకరమైనది కాదు.
2 లాక్ సిద్ధాంతంలో రెండు ఒడంబడికలున్నాయి. అవి (1) సామాజిక ఒడంబడిక, (2) ప్రభుత్వ ఒడంబడిక.
3 రాజు ఒప్పందంలో భాగస్వామి.
4 లాక్ సిద్ధాంతంలో సార్వభౌముడు చెప్పినదే న్యాయం కాదు. ప్రజల ఇష్టపడినదే న్యాయం.
5 సార్వభౌముడు ఒడంబడికను ఉల్లంఘిస్తే ప్రజల సార్వభౌముని పదవి నుండి తొలగించవచ్చు.
6 ప్రజలు హక్కులన్నింటినీ విడువనక్కర లేదు. కొన్ని హక్కులను మాత్రమే ఒప్పందానికి విడవవలె.
7 రాజుకు సార్వభౌమాధికారం లేదు. కాబట్టి అతని ఆజ్ఞ చట్టం కాదు శాసనసభ అభిప్రాయానుసారం చట్టాలు చేస్తుంది.
8 సార్వభౌమాధికారం రాజకీయ సమాజానికే ఉంటుంది. ప్రభుత్వానికి కాదు.

## 7.8 విమర్శ :

లాక్ రాజకీయ సిద్ధాంతము అనేక విమర్శలకు గురియైంది. వానిలో ముఖ్యమైనవి.

1 లాక్ రాజకీయ సార్వభౌమత్వాన్ని గుర్తించాడేగాని న్యాయ సార్వభౌమాధికారాన్ని గుర్తించలేదు.
2 లాక్ సహజ హక్కుల వాదనను ఆధునిక ఆధునిక రాజనీతి శాస్త్రవేత్తలు అంగీకరించుటలేదు.
3 లాక్ ప్రభుత్వ విభజన సరైంది కాదు.
4 ప్రాకృతిక వ్యవస్థలో ప్రజలకు రెండు ఒడంబడికలు చేయగల చైతన్యం ఉందనేది సందేహమే.

## 7.9 లాక్ రాజనీతి సిద్ధాంత విశిష్టత :

లాక్ రాజనీతి తత్వంలో కొంత విమర్శకు గురియైనప్పటికి దానిలో కొంత ప్రాధాన్యత లేకపోలేదు.

1 లాక్ సమాజానికి **(State)** ప్రభుత్వానికి **(Government)** గల వ్యత్యాసం గుర్తించాడు.
2 పరిమిత రాజరిక వ్యవస్థ ఇతని **సిద్ధాంత విశిష్టత.**

**లఘు వ్యాసరూప ప్రశ్నలు :**

1 హాబ్స్ వ్యక్తి శ్రేయోవాద భావాలు తెల్పుము.

2 హాబ్స్ రాజనీతి తత్వ విశిష్టతను పేర్కొనుము.

3 మానవుని స్వభావంపై హాబ్స్ భావాలను వివరింపుము.

**6.10 చదువదగిన గ్రంథాలు :**

1 ఆధునిక ప్రాశ్చాత్య రాజనీతి తత్వవిచారం - తెలుగు అకాడమి.

2 రాజనీతి తత్వవిచారం - తెలుగు అకాడమి.

3 హిస్టరీ ఆఫ్ యూరోపియన్ - ప్రో. భండారీ.

డా. యం. పాండురంగారావు

పాఠం - 7

# జాన్ లాక్ (క్రీ.శ. 1632-1704)

## 7.0 లక్ష్యం :

ఆధునిక పాశ్చాత్య రాజనీతితత్వ విచారము శాస్త్రవేత్తలలో సామాజిక ఒడంబడిక సిద్ధాంతమును ప్రతిపాదించిన వారిలో జాన్‌లాక్ రెండవవాడు. లాక్ సామాజిక ఒడంబడిక సిద్ధాంతమును, దాని ప్రాధాన్యతను, హాబ్స్ ఒడంబడిక సిద్ధాంతానికి లాక్ ఒడంబడికకు గల వ్యత్యాసాన్ని గూర్చి కూడా వివరించడం ఈ పాఠం లక్ష్యం.

## విషయ సూచిక :


7.1 పరిచయం

7.2 జీవిత సంగ్రాహం

7.3 రచనలు - రచనా పద్ధతులు

7.4 సమకాలీన పరిస్థితుల ప్రభావము

7.5 లాక్ రాజనీతి భావాలు

- 7.5.1 మానవుని స్వభావం
- 7.5.2 ప్రాకృతిక వ్యవస్థ
- 7.5.3 సహజ హక్కుల సిద్ధాంతము
- 7.5.4 సామాజిక - ఒడంబడిక
- 7.5.5 ప్రభుత్వ ఒడంబడిక
- 7.5.6 సార్వభౌమాధికారం
- 7.5.7 ప్రభుత్వాల వర్గీకరణ
- 7.5.8 సమ్మతి సిద్ధాంతము
- 7.5.9 ధర్మకర్త
- 7.5.10 ప్రతిఘటన హక్కు

7.6 హాబ్స్, లాక్ రాజకీయ సిద్ధాంత వ్యత్యాసము

7.7 లాక్ సిద్ధాంత ముఖ్యాంశాలు

7.8 విమర్శ

7.9 సిద్ధాంత విశిష్టత

7.10 సారాంశము

7.11 నమూనా ప్రశ్నలు

7.12 చదువవలసిన గ్రంథాలు

## 7.1. పరిచయం :

సామాజిక ఒడంబడిక సిద్ధాంత వాదులలో ముఖ్యులు ముగ్గురు - హాబ్స్, జాన్‌లాక్, రూసో. జాన్‌లాక్ రెండవవాడు. ఇతడు బ్రిటిష్ రాజనీతి తత్వవేత్త. హాబ్స్, రూసోవలె ఇతడు కూడా రాజ్యావతరణకు సామాజిక ఒడంబడిక కారణమంటారు. అయితే ప్రాకృతిక వ్యవస్థ వర్ణణలునూ, సహజ హక్కులు, సహజ న్యాయాలు, ఒడంబడిక, సార్వభౌమాధికారల వర్ణన విషయాల్లోను హాబ్స్, రూసోలతో విభేదిస్తూ తనకంటూ ఒక ప్రత్యేకత సంతరించుకొన్నాడు. జాన్‌లాక్ సిద్ధాంతంలో మనకు మూడు విషయాలు స్పష్టమవుతాయి. అవి.

1) ప్రజల కొరకే ప్రభుత్వము
2) ప్రభుత్వం ప్రజల మీద ఆధారపడి ఉన్నది
3) ప్రభుత్వాధికారం పరిమితమైనది.

## 7.2 జీవిత సంగ్రహం :

జాన్‌లాక్ 1632వ సంవత్సరంల ఒక మధ్యతరగతి కుటుంబములో ఇంగ్లాండ్ నందు జన్మించెను. ఇతని కాలంలో ఇంగ్లాండ్ నందు రెండు విప్లవాలు జరిగాయి. అవి 1. అంతర్యుద్ధం (1648-49), 2. రక్తరహిత విప్లవం (1688). ఈ రెండు విప్లవాలు జాన్‌లాక్‌ను ఎంతో ప్రభావితం చేసాయి.అంతేకాక తండ్రి స్టూవర్టు రాజుకు వ్యతిరేకంగా పాల్గొనటం జరిగినది.

జాన్‌లాక్ ప్రాధమిక విద్య ముగియగానే 1652 సంవత్సరంలో ఆక్సఫర్డ్‌లో ఉన్న క్రైస్ట్ చర్చి కళాశాలలో చేరెను. 1655వ సంవత్సరంలో లాక్ పట్టభద్రుడుయ్యెను, తరువాత ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో తత్వశాస్త్రశాఖలో ట్యూటర్‌గా పనిచేసెను అయితే అతనికి అధ్యాపక వృత్తి రుచింపలేదు. ఆ వృత్తిని వదలివేసి వైద్యశాస్త్రం పట్ల ఆశక్తిని పెంచుకొనెను. "రాయల్ సొసైటీ వ్యవస్థాపకుల్లో ఒక్కడైనాడు. అతనే స్వయంగా వైద్యవృత్తిని చేపట్టెను. వైద్యశాస్త్ర అనుభవం ద్వారా అంతర్యుద్ధములోను, చార్లెస్ రెండును పునఃప్రతిష్టించుటలోను ప్రముఖ పాత్రవహించిన లార్ట్ ఆష్లికి వ్యక్తిగత కార్యదర్శిగాను, వైద్యునిగాను జాన్‌లాక్ నియమింపబడెను. లార్డ్ ఆష్లితో ఉన్న సంబంధాలవలన ఇంగ్లాండ్‌లోని ప్రముఖ వ్యక్తులతో సంబంధాలను లాక్ అభివృద్ధి పరచుకోగలిగాడు. ఆ కాలంలోనే లాక్ రాజకీయాలతో ఎక్కువగా సంబంధాలను ఏర్పరచుకొని అనేక ఉన్నత పదవులు పొందెను. ఇతనికి అమెరికాలోని కరోలినా కాలనీకి ఒక రాజ్యాంగము తయారు చేయు అవకాశం లభించినది అయితే అతడు రాజ్యాంగ రచనలో సిద్ధాంతానికి ఆచరణకు సమన్వయం కుదురేటట్లు సహనం పాటించవలెనని బహటంగా ప్రకటించడంలో పరిస్థితులు వివాద స్పదంగా తయారై అతడు ఇంగ్లాండ్ నుండి హాలండ్ పారిపోవలసి వచ్చింది. హాలండ్ నందు విలియం ఆరంజ్‌తో సంబంధాలను జాన్‌లాక్ ఏర్పరచుకొనెను. ఇంగ్లాండ్‌లో రక్తరహిత విప్లవ ఫలితంగా రాజు జేమ్స్ రెండు స్థానంలో విలియం ఆరంజ్‌ను సింహాసనం అదిష్టించవలసినదిగా ప్రజలు ఆహ్వానించిరి తిరిగి రక్తరహిత విప్లవం తర్వాత జాన్‌లాక్ ఇంగ్లాండ్‌కు తిరిగి వచ్చాడు. అంతేకాకక అనేక రాజకీయ పదవులను నిర్వహించి 1704 సంవత్సరంలో మరణించెను.

## 7.3 రచనలు - రచనా పద్ధతులు :

జాన్‌లాక్ లాటిన్, ఆంగ్ల భాషల్లో దాదాపు 35 గ్రంధాలు రచించాడు. వాటిలో ముఖ్యమైనది Two Tratises of Government (1690) ఇతని రచనల్లో వ్యక్తి స్వేచ్ఛకు, సమానత్వానికి అధిక ప్రాధాన్యతనిచ్చాడు. ప్రభుత్వ వ్యవహారాల పట్ల ప్రజలు తమ అభిప్రాయాలు వ్యక్తం చేస్తూ స్వేచ్ఛగా జీవించడానికి అవకాశం కల్పించాడు. ఇతని రాజనీతితత్వ సిద్ధాంతంలో మానవుని సహజ హక్కులకు అగ్రస్థానం లభించినది.

## 7.4 సమకాలీన పరిస్థితుల ప్రభావము :

జాన్‌లాక్ తన రాజకీయ సిద్ధాంతాన్ని (Political Theory) తాను పెరిగిన పరిస్థితులకు ప్రతిబింబంగా చిత్రించినాడు. 1688వ సంవత్సరంలో విలియం ఆఫ్ ఆరంజ్‌ని ఇంగ్లాండ్‌కు రాజుగా ఆహ్వానించడానికి బ్రిటిష్ పార్లమెంట్ ఒక చారిత్రిక నిర్ణయం తీసుకొంది. దీనినే రక్తరహిత విప్లవ అంటారు. ఈ విప్లవ ఫలితంగానే రాజు దైవదత్త అధికారాలు తొలగించి రాజ్యాంగబద్ధ రాజరికం ఏర్పరచారు. 1689 సంవత్సరంలో హక్కుల బిల్లు (Bill of Rights) తయారైంది. దీని మూలంగా ఆర్థిక సైనిక విషయాల్లో రాజు ప్రమేయం చాలా వరకు తగ్గింది. రాజు నియంతృత్వంగా వ్యవహరించుటకు వీలులేదు.

హాబ్స్, ఫిలిమర్ మొదలగు రాజనీతి తత్వవేత్తల రచనలకు జాన్‌లాక్ ప్రభావితుడయ్యెను. హాబ్స్ నిరుపేక్ష రాజరిక వ్యవస్థను సమర్థించగా లాక్ దానిని పూర్తిగా వ్యతిరేకించి రాజ్యాంగ బద్ధమైన రాజరిక వ్యవస్థను సమర్థించెను.

## 7.5 లాక్ రాజనీతి భావాలు :

జాన్‌లాక్ తన రచనల్లో మానవుని స్వభావమును గూర్చి, ప్రాకృతిక వ్యవస్థ, చట్ట స్వభావము, సామాజిక ఒడంబడిక, రాజ్య స్వభావము, ప్రభుత్వ స్వభావమును గురించి వివరించెను.

### 7.5.1 మానవుని స్వభావం (State of Human Nature) :

లాక్ దృష్టిలో ప్రాకృతిక వ్యవస్థలోని మానవులు స్వతంత్ర జీవులు గాను, మంచివారుగాను, సంఘ జీవులుగాను ఉండినారు ఎవరుమటుకు వారు స్వతంత్రంగా తావు ఇష్టపడినరీతిగా నివసించేవారు. ఒకరికి లోబడి మరొకకరు ఉండేవారు కాదు. మానవుడు హేతుబద్ధంగా ఆలోచించేవాడు మానవులు శాంతి ప్రియులు. ఒకరితో మరొకరు పోట్లాడుకొనే మనస్తతత్వం కాదు. వారు ఎల్లప్పుడు స్వార్ధపరులు కాదు. కొన్ని సమయాల్లో వారు తమ ఉదార స్వభావమును వ్యక్తపరచేవారు. లాక్ అభిప్రాయంలో మానవులందరరు సమానులే. ప్రతి వ్యక్తి సహజ హక్కులైన జీవించే హక్కు **(Right to life)**, స్వేచ్ఛ హక్కు **(Right to liberty)** మరియు ఆస్తి హక్కు **(Right to property)** లను అనుభవించినట్లు జాన్‌లాక్ అభిప్రాయపడెను. ఈ విధంగా మానవ స్వభావంపై లాక్ అభిప్రాయం హాబ్స్ అభిప్రాయమునకు భిన్నంగా ఉన్నాయి.

### 7.5.2 ప్రాకృతిక వ్యవస్థ (State of Nature) :

హాబ్స్‌వలె లాక్ కూడా తన సిద్ధాంతాన్ని ప్రాకృతిక వ్యవస్థతో ప్రారంభించాడు. లాక్ ప్రకారం ప్రాకృతిక వ్యవస్థలో సామాజిక జీవనముంది కానీ రాజకీయ జీవం లేదు. సాటి మనిషి ప్రకృతిక న్యాయాన్ని అవగాహన చేసుకొని తోటివారితో అన్యోన్యంగా జీవించే వాడని అభిప్రాయం వ్యక్తం చేసాడు. ప్రాకృతిక న్యాయానికి హేతువు మూలమని వ్యక్తితో హేతువు (సహజ న్యాయం) ఉండబట్టి ప్రకృతిక న్యాయాన్ని అవగాహన చేసుకోగల వాడని లాక్ అభిప్రాయపడెను.

లాక్ ప్రాకృతిక వ్యవస్థ అతి క్రూరమైంది కాకుండా సద్గుణాలు కలిగిన అరాచక వాదుల సమూహంగా ఉండేది. వీరికి న్యాయస్థానాలు, పోలీస్ అధికారులు అవసరంలేదు. వీరు న్యాయబద్ధంగా ఉండేవారు. ఈ రాజ్యంలో అందరికి స్వాతంత్ర్యం ఉంది. పరులను హద్దులో పెట్టే స్వాతంత్రం కూడా ఉంది. ఎవరకి వారు వారి ఆస్తులను, పదవులను విరమించుకొనే స్వాతంత్రముంది. ఈ రాజ్యంలో అందరు సమానులే, ఒకరి కంటే మరొక్కరికి ఎక్కువ అధికారం లేదు.

ప్రాకృతిక వ్యవస్థలో వర్తక వాణిజ్యం లేదు. అప్పటి వారికి భూమి ఆకారం ఎట్లా ఉంటుందో తెలియదు. కళలు ఉద్భవించవు. మనిషి మనస్సులో ఏదో ఒకందుకు నిరంతరం భీతి, మానవుని జీవితంలో చివరికి మిగిలేది 'ఒంటరితనం, దారిద్ర్యము, నీచము, క్రూరము, స్వల్పము (The life of man is solitary, poor, nasty british and short) తప్పు, ఒప్పు, న్యాయము, అన్యాయము అనే మాటలకు ప్రాకృతిక వ్యవస్థలో తావులేదు.

ప్రాకృతిక వ్యవస్థ ఎంతో దుర్భర స్థితిలో ఉన్నట్లు హాబ్స్ వర్ణించాడు. ఈ స్థితిలో మానవులు దారుణ మరణ భీతితో సర్వదా సతమతమవుతూ ఉంటారు. ఎందుకంటే శాంతిని భంగపరిచే వాళ్లను శిక్షించే అధికారం ఎవరికీ లేదు. శాంతి భద్రతలను కాపడ కలిగే మార్గమొకటి ఉన్నప్పుడే ప్రజలు సుఖంగా ఒకరితో నొకరు సఖ్యంగా ఉండగలరు. ప్రశాంత వాతావరణం ఏర్పడాలంటే ఒక అధికారి కావలెను.

ప్రాకృతిక వ్యవస్థలో ముఖ్యంగా మూడు లక్షణాలున్నాయి. అవి.

1 తప్పుకు ఒప్పుకు తేడా లేదు.

2 న్యాయానికి అన్యాయానికి తేడా లేదు.

3 సొంత ఆస్తి లేదు.

మానవులు ఆవేశపరులు, ఆలోచనా పరులుకారు. చట్టం లేదు. చట్టం లేని చోట న్యాయానికి తావు లేదు. సొంత ఆస్తికి అవకాశంలేదు. ఎందు చేత నంటే శక్తి ఉన్నవాడే హక్కు దారుడు (Might is right) ప్రాకృతిక వ్యవస్థలో మానవుడు 'అడవి న్యాయాన్ని' అనుభవించాడు. అనగా బలవంతునిదే రాజ్యం అనే భావన ఉన్నది.

### 6.5.3 సహజ హక్కుల - సహజ న్యాయము :

హాబ్స్ అభిప్రాయంలో ప్రాకృతిక వ్యవస్థలో మానవుడు సహజ హక్కులను, సహజ న్యాయాన్ని అనుభవించినట్లు వివరించెను. హాబ్స్ ఈ రెండింటికి తేడా గుర్తించాడు.

### 1. సహజహక్కు :

ప్రతి మానవుడు తనను తాను కాపాడుకొనే స్వేచ్ఛ. సహజ హక్కులు ప్రతి మానవుని కోర్కెలు తీర్చడానికి వీలు కల్గిస్తాయి. ఈ నేపధ్యంలో స్వేచ్ఛ అనగా ఇతరుల వల్ల ఏ విధమైన అడ్డంకులు లేకుండా చూచుకొవడం. సహజ హక్కుల మూలంగా ఒకరితో మరొకరు ఘర్షణకుదిగే ప్రమాదముంది. హాబ్స్ అభిప్రాయంలో సహజ హక్కులు ప్రధానం మూడు అవి. 1. జీవించే హక్కు (Right to life), 2. స్వేచ్ఛ హక్కు (Right to Liberty), 3. ఆస్తి హక్కు. (Right to Property)

పై మూడు హక్కులను మానవుడు ప్రాకృతిక వ్యవస్థలోనే అనుభవించినట్లు, భగవంతుని ద్వారానే మానవునికి సంక్రమించినట్లు హాబ్స్ అభిప్రాయంపడెను.

### 2. సహజ న్యాయము :

ఇది ఒక భావన. జ్ఞానంతో ఏర్పడి మానవుడు తనను తాను నాశనం చేసుకోకుండా అరికట్టేది. ఇది హక్కులు వినహా మిగిలిన వాటిని అనుభవించటానికి వీలుకల్గుతుంది. అంతరాత్మ ప్రభోదం ప్రకారం ప్రతి వ్యక్తి వ్యవహరించడమే సహజ న్యాయాన్ని

లాక్ అభిప్రాయం ప్రకారం ప్రాకృతిక వ్యవస్థలో ప్రజలంతా కలసి చేసుకొన్న ఒడంబడికలు రెండు అవి.

1. సమాజిక ఒడంబడిక 2. ప్రభుత్వ ఒడంబడిక.

### సామాజిక ఒడంబడిక :

ఈ ఒడంబడిక ప్రకారం ప్రాకృతిక వ్యవస్థ నుంచి విడివడి నాగరిక సంఘాన్ని ఏర్పాటు చేయడం. ఈ ఒప్పందము ప్రకారమే ప్రాకృతిక వ్యవస్థలో మానవులు అనుభవించిన హేతువాద న్యాయం, నాగరికతకు సంబంధించిన హక్కులు సమాజానికి ఇచ్చివేస్తారు. ఆ విధంగా మొదటి ఒడంబడిక మూల్గంగా ప్రాకృతిక వ్యవస్థ అంతమై విశాలమైన రాజ్యం ఏర్పడింది. ఈ ఒడంబడికలో ప్రజలంతా తమలో తాము ఒడంబడిక చేసుకొని తమ హక్కులు, అధికారాలు సమాజానికి ఇచ్చివేస్తారు. దీని అర్ధము ఏమనగా సమాజం ప్రజల ప్రాణ రక్షణ హక్కు, ఆస్తి హక్కు, స్వేచ్ఛ హక్కును కాపాడాలి దాని కొరకే ప్రజలంతా ఈ ఒడంబడిక చేసుకొని రాజ్యాన్ని ఏర్పరచుకొన్నారు. ఈ ఒడంబడిక ప్రకారం సార్వభౌమాధికారం సమాజానికి చెందుతుంది. అదే రాజకీయ సార్వభౌమాధికారము.

### 7.5.5 ప్రభుత్వ ఒడంబడిక :

లాక్ అభిప్రాయంలో మొదటి ఒడంబడిక ఫలితంగా నాగరిక సంఘం ఏర్పాటుకాగా, తరువాత ప్రజలందరు సమిష్టిగా రెండో ఒడంబడిక చేసుకొంటారు. దీనినే ప్రభుత్వ ఒడంబడిక అంటారు. ఇది ప్రజలకు, సార్వభౌమునికి మధ్య జరుగుతుంది. ఇది ప్రజా సమ్మతితో ఏర్పడి ప్రజల హక్కులను కాపాడుతుంది. దీని ఆశయాలు, అధికారాలు పరిమితమైనవి. ఈ ప్రభుత్వం ఒడంబడిక షరతులను ఉల్లంఘిస్తే దాన్ని తొలగించే అధికారం ప్రజలకుంది. ఆ ప్రభుత్వాన్ని తొలగించి ప్రజలు ఇంకొక అధికారిని(ప్రభుత్వాన్ని) ఎన్నుకొన వచ్చును. దీనిని ఆధారంగానే చేసుకొని లాక్ ప్రజలకు రాజుపై తిరుగుబాటు చేసే హక్కును బలపరచినట్లు తెలుస్తుంది.

### 7.5.6 సార్వభౌమాధికారం (Sovereingnty) :

లాక్ తన సిద్ధాంతంలో పరిమిత సార్వభౌమత్వాన్ని ప్రతిపాదించాడు. ఒడంబడికలో సార్వభౌముడు కూడా భాగస్వామే కాబట్టి అతని అధికారాలు పరిమితమైనది. ప్రజల హక్కులను రక్షించే బాధ్యత సార్వభౌమునిది. ఇతడు తన అధికారాన్ని దుర్వినియోగం చేస్తే తిరుగుబాటు చేసి అతన్ని తొలగించి మరొకరిని ఏర్పాటు చేసుకోవచ్చని లాక్ వివరించెను.

ఈ సందర్భంలో లాక్ అభిప్రాయంనకు హాబ్స్ అభిప్రాయంనకు గల వ్యత్యాసాన్ని గుర్తించవలసి ఉన్నది. హాబ్స్ నిరుపేక్ష సార్వభౌమాధికారిని సూచించగా, లాక్ పరిమిత సార్వభౌమాధికారిని సూచించాడు. హాబ్స్ ఒడంబడిక ప్రకారం ప్రజలు ఒక్క ప్రాణ రక్షణ హక్కు తప్ప మిగిలినవన్ని సార్వభౌమునికి అప్పగిస్తారు. అయితే లాక్ అభిప్రాయంలో సార్వభౌమునికి అర్పించకుండా సమాజానికి అర్పిస్తారు. సమాజ ఆశయాలను నెరవేర్చడమే సార్వభౌముని విధి. అదే ప్రజల హక్కులకు రక్షణ.

### 7.5.7 ప్రభుత్వాల వర్గీకరణ (Classification of Government) :

అరిస్టాటిల్ (Aristotle) అనే గ్రీక్ తత్వవేత్త వలే లాక్ కూడా ప్రభుత్వాన్ని మూడు రకాలుగా విభజించినాడు. అవి

1. ప్రజాస్వామ్యం (Democracy)
2. స్వల్పజన పరిపాలన (Oligarchy)
3. రాజరికం (Monarchy)

ప్రభుత్వ వర్గీకరణము నిర్ణయించడానికి శాసనాలు చేసే అధికారం ఆధారంగా ఉంది. అవి మూడు రకాలు

1. శాసన సభ,
2. కార్యనిర్వాహక వర్గము
3. న్యాయధికార వర్గం.

లాక్ దృష్టిలో ఈ మూడు ప్రభుత్వాలలోకి రాజరికం మంచిది కాదు. స్వల్పజన పరిపాలన కూడా అంత మంచిది కాదు. ప్రజాస్వామ్య పరిపాలన ఒక్కటే మంచిదని లాక్ అభిప్రాయపడెను.

### 7.5.8 సమ్మతి సిద్ధాంతము (Theory of Consent) :

ప్రభుత్వానికి పునాది సమ్మతి **(Consent)** అని లాక్ అభిప్రాయం. అంటే ప్రజలు ఏ విధమైన ప్రభుత్వం కోరితే అటువంటి ప్రభుత్వమే ఉండవలె. ప్రభుత్వ చర్యలన్నింటికీ సమ్మతి ప్రధానం కాబట్టి ప్రజల ఆస్తిని, వారి సమ్మతిలేనిదే తీసుకొరాదు. లాక్ వ్యక్తుల సమ్మతికి ఎక్కువ ప్రాధాన్యమిచ్చినాడు.

### 7.5.9 ధర్మకర్త (Trustee) :

అన్ని సంస్థల కంటె శాసన సభ ఉన్నతమైనదని, చివరికి పాలక వర్గం కూడా శాసన సభకు లోబడి ఉండవలెనని లాక్ ఉద్దేశము. శాసనసభ వెనుక ప్రజలు అభిప్రాయం ఉందని, అందువల్ల శాసనసభ ధర్మకర్తృత సంబంధమైన అధికారి అని లాక్ అభిప్రాయం.

### 7.5.10 ప్రతిఘటన హక్కు :

ఎప్పుడైతే ప్రజల సమ్మతికి ప్రాధాన్యత ఉందో అప్పుడు వారికి ప్రతిఘటన హక్కుకూడా ఉంటుంది. నిరంకుశ ప్రభువు న్యాయవ్యతిరేకి, అటువంటి ప్రభువును ప్రతిఘటించినట్లైతే ప్రజలు న్యాయాన్ని రక్షించినవారవుతారని లాక్ అభిప్రాయపడెను. సార్వభౌముడు తన అధికారాన్ని దుర్వినియోగం చేస్తే అతనికి ప్రజలు బద్ధులై ఉండాల్సిన అవసరం లేదు. అతన్ని తొలగించి మరొకరిని సార్వభౌమునిగా ఎన్నుకొనవచ్చని లాక్ అభిప్రాయ పడెను.

## 7.6 హాబ్స్, లాక్ రాజకీయ సిద్ధాంత వ్యత్యాసము :

1 హాబ్స్‌కు లాక్‌కు చెప్పుకొతగిన వ్యత్యాసము ఎక్కడంటే హాబ్స్ ప్రాకృతిక వ్యవస్థలో సహజ న్యాయం లేదు. పైగా సహజ హక్కు ఉంది. ఇతను వివరించిన రాజ్యంలోని మనిషికి, సంఘటిత రాజ్యం **(Organised State)**లోని మనిషికి పూర్తిగా తేడా ఉంది. కాని లాక్ ప్రాకృతిక వ్యవస్థలోని మనిషి ఒక అధికారి లేకుండా న్యాయబద్ధంగా నివసించగలడు.

2 హాబ్స్ ప్రాకృతిక వ్యవస్థ యుద్ధమయం కాని లాక్ ప్రాకృతిక వ్యవస్థ శాంతి మయం.

3 హాబ్స్ ప్రాకృతిక వ్యవస్థ రాజకీయంగాను, సాంఘికంగాను కూడా వెనుకబడినదని వివరించాడు. అయితే లాక్ అందుకు భిన్నంగా తన ప్రాకృతిక వ్యవస్థలో రాజకీయ వ్యవస్థ లేకపోయినా, సాంఘిక వ్యవస్థ ఉండేదని స్పష్టంచేసాడు.

హాబ్స్ అభిప్రాయపడెను. అయితే ఇలాంటి హక్కులు నాగరిక జీవనంలో మాత్రమే సాధ్యపడతాయని రచయితల భావన.

3 హాబ్స్ రాజ్యాన్ని ప్రభుత్వాన్ని ఖచ్చితంగా వేరు చేయలేదు

4 హాబ్స్ నిరుపేక్ష రాజరికానేకే అధిక ప్రాధాన్యతను ఇచ్చి, ప్రజాస్వామ్యాన్ని నిర్లక్ష్యము చేసెను.

5 హాబ్స్ ప్రాకృతిక వ్యవస్థకు చారిత్రికాధారాలు లేవు.

6 సార్వభౌముని ఆజ్ఞత చట్టాలనడం సమంజసం కాదు, వాటిపై కొన్ని సగేతుకాలైన నిర్భందాలు అవసరం.

7 హాబ్స్ రాజనీతి తత్వ విచారం నాడు సరిపోయినా నేడు ఆచరణోగ్యము కాదు.

## 6.7 హాబ్స్ సిద్ధాంత విశిష్టత:

హాబ్స్ సిద్ధాంతం కొంత విమర్శకు గురియైనప్పటికి దానిలో కొంత విశిష్టత లేక పోలేదు. అవి.

1 హాబ్స్ రాజనీతి శాస్త్రానికి శాస్త్రీయ దృక్పధాన్ని కల్పించాడు.

2 మానవునిపై హాబ్స్ అభిప్రాయాలు గమనించదగ్గవి.

3 హాబ్స్ సామాజిక ఒడంబడిక సిద్ధాంతాన్ని జాన్‌లా, రూసోలు అభివృద్ధి పర్చారు.

4 జాన్ ఆస్టిన్ హాబ్స్ వివరించిన సార్వభౌమత్వాన్ని మరింత స్పష్టపర్చాడు.

5 ఇతని స్వేచ్ఛా వివాదం బోడిన్ చెప్పిన ఉపయోగితా వాదానికి మూలమైంది.

6 రక్షణ కల్పించలేని రాజును తొలగించవచ్చుని హాబ్స్ చెప్పడం వల్ల ఇతడు స్వేచ్ఛవాది, వ్యక్తి శ్రేయోవాదిగా పేరు గాంచెను.

## 6.8 సారాంశము :

హాబ్స్ రాజనీతి తత్వాన్ని ఈ క్రింది విధంగా క్లుప్తీకరించ వచ్చును. హాబ్స్ రాజనీతికి శాస్త్రీయ దృక్పధాన్ని కల్పించాడు. మానవ స్వభావంపై హాబ్స్ భావన గమనించ తగినది ఇతని సామాజిక ఒడంబడికని జాన్‌లాక్, రూసోలు అభివృద్ధి పర్చారు. హాబ్స్ వ్యక్తి శ్రేయోవాది. ఉపయోగితావాదానికి మూల పురుషుడని చెప్పవచ్చును. హాబ్స్ తత్వవేత్త కాని రాజకీయవేత్త కాదు. అతని రాజకీయ తత్వశాస్త్రం (Political Philosophy)లో నిరపేక్ష స్వారభౌమాధికరాం ఒక భాగం మాత్రమే.

## 6.9 నమూనా ప్రశ్నలు :

1 హాబ్స్ ప్రాకృతిక వ్యవస్థను వర్ణింపుము.

2 హాబ్స్ సామాజిక ఒడంబడిక సిద్ధాంతాన్ని వివర్మనాత్మకంగా వివరింపుము.

3 ఇతడు చేసిన ప్రభుత్వ విభజన మాంటిస్క్యూ ప్రతిపాదించిన అధికార పృధక్కరణ సిద్ధాంతానికి దోహదం చేసింది.

4 శాసన సభ వెనుక ప్రజల అభిప్రాయం ఉందని, అందువల్ల శాసనసభ ధర్మకర్తృత్వ సంబంధమైన అధికారి అని లాక్ వివరించుటతో పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి పునాది వేశాడు.

5 శాసనసభ, కార్యనిర్వాహక వర్గాన్ని వేరు చేసిన మొదటి రాజనీతి శాస్త్రవేత్తే జాన్‌లాక్.

6 లాక్ సార్వభౌమత్వ సిద్ధాంతము అమెరికా విప్లవానికి దారితీసింది.

7 లాక్ ఉదాహార రాజ్యాన్ని **(Liberal State)** సృష్టించాడు.

## 7.10 సారాంశము :

జాన్‌లాక్ రాజనీతి తత్వంలో సహజ హక్కుల సిద్ధాంతము అవి ప్రధానమైనది. విప్లవ సిద్ధాంతానికి లాక్ ప్రతిపాదించిన సమ్మతి సిద్ధాంతమే మూలం. లాక్ ఉదార రాజ్యాన్ని **(Liberal State)** సృష్టించాడు. లాక్ ఉదాహావాద సిద్ధాంత ప్రభావము అన్ని దేశాల్లోను ప్రభావం చూపింది. చకోస్లోవేకియా, పోలెండ్, రుమేనియా వంటి కట్టుబాట్లులో ఉన్న దేశాలలో కూడా ఉదారవాదం ప్రబలంది. ఈ రోజుకు కూడా లాక్ సిద్ధాంతం నిలచి ఉన్నదని చెప్పవచ్చును.

## 7.11 నమూనా ప్రశ్నలు :

1 జాన్ రాజనీతితత్వ భావాలను విమర్శనాత్మకంగా వివరింపుము.

2 సహజ న్యాయం, సహజ హక్కులపై లాక్ భావాలు తెల్పుము.

3 సామాజిక ఒడంబడికపై లాక్ అభిప్రాయంను పేర్కొనుము.

### లఘు వ్యాసరూప ప్రశ్నలు :

1 లాక్ ప్రకృతిక వ్యవస్థను వర్ణింపుము.

2 జాన్‌లాక్ సిద్ధాంత ప్రాముఖ్యతను వివరింపుము.

3 మానవ స్వభావముపై లాక్ అభిప్రాయమును పేర్కొనుము

4 హాబ్స్, లాక్ సిద్ధాంతంలోని తారతమ్యంను తెల్పుము.

## 7.12 చదువదగిన గ్రంథాలు :

1 రాజనీతి తత్వవిచారం - తెలుగు అకాడమి.

2 Political Science Theory - Prem Arora.

3 ఆధునిక పాశ్చాత్య రాజనీతితత్వ విచారము - తెలుగు అకాడమి

డా. యం. పాండురంగారావు

పాఠం : 8

# జీన్ జాక్విస్ రూసో

## 8.0 లక్ష్యం

జీన్ జాక్విస్ రూసో, సోషల్ కాంట్రాక్ట్ అనే గ్రంథంలో సామాజిక ఒడంబడిక సిద్ధాంతాన్ని రచించాడు. జనేచ్ఛ అనే ఒక నూతన రాజనీతి భావాన్ని ప్రపంచానికి అందించాడు రూసో. ఆయన రాజనీతి భావాలను వివరించడమే ఈ పాఠం యొక్క లక్ష్యం.

విషయసూచిక:


8.1 ఉపోద్ఘాతం
8.2 జీవిత విశేషాలు
8.3 రచనలు
8.4 మానవ స్వభావ విశ్లేషణ
8.5 ప్రాకృతవ్యవస్థ
8.6 సామాజిక ఒడంబడిక - షరతులు
8.7 జనేచ్ఛ సిద్ధాంతము
8.8 జనేచ్ఛ లక్షణాలు
8.9 జనేచ్ఛ ప్రాముఖ్యత
8.10 రాజ్యానికి ప్రభుత్వానికి మధ్య గల తేడా
8.11 రూసో గొప్పదనం
8.12 సారాంశము
8.13 నమూనా ప్రశ్నలు
8.14 చదువదగిన గ్రంథాలు


## 8.1 ఉపోద్ఘాతము:

**"Man is born free and ever where he is inchains"**

**J.J. Rousseau.**

"స్వేచ్ఛగా పుట్టిన మానవుడు సర్వత్రా శృంఖలా బద్ధుండై ఉన్నాడు" అనే అద్భుతమైన వాక్యాన్ని ప్రపంచానికి అందించిన రాజనీతి తత్వవేత్త రూసో. ఈ పై వాక్యం రూసోకు స్వేచ్ఛపై ఎంత ప్రగాఢమైన ప్రేమ ఉందో తెలియచేస్తుంది. మానవుడు స్వేచ్ఛా ప్రియుడు. అయితే అతని స్వేచ్ఛను నాగరిక సమాజంలోని ఆచారాలు, సాంప్రదాయాలు, నిబంధనలు, చట్టాలు హరించివేస్తున్నాయి. మానవుడు సహజంగా కోరుకునే స్వేచ్ఛను, రాజకీయ సమాజంలో తిరిగి పొందే విధంగా సామాజిక ఒడంబడిక అనే గ్రంథంలో ఒక బ్రహ్మాండమైన సిద్ధాంతాన్ని సూత్రీకరించాడు.

హాబ్స్, లాక్, రూసో ఈ ముగ్గుర్ని సామాజిక ఒడంబడిక సిద్ధాంతకర్తలంటారు. నిరపేక్ష రాచరికాన్ని సమర్థించాలనే లక్ష్యంతో హాబ్స్, పార్లమెంటు అధికారాన్ని సమర్థించాలనే లక్ష్యంతో జాన్ లాక్ సామాజిక ఒడంబడిక సిద్ధాంతాన్ని రచించారు. కాని రూసోకు రాజును సమర్థించాలనికాని, పార్లమెంటును సమర్థించాలని

కాని ఒక ప్రత్యేకమైన లక్ష్యంలేదు. అతని లక్ష్యం వ్యక్తి స్వేచ్ఛను పరిరక్షించే రాజకీయ వ్యవస్థను రూపొందించటమే.

### 8.2 రూసో జీవితం :

రూసో ఫ్రాన్స్ దేశానికి చెందిన గొప్ప రాజనీతి తత్వవేత్త. సామాజిక ఒడంబడిక సిద్ధాంతాన్ని ప్రచారం చేసిన ముగ్గురు తత్వవేత్తలలో చివరివాడు. 1712వ సంవత్సరంలో జెనీవా ప్రాంతంలో అతి నిరుపేద కుటుంబంలో జన్మించాడు. రూసో పుట్టిన కొద్ది రోజులకే తల్లి అనారోగ్యంతో మరణించింది. తండ్రి,రూసో ఆలన పాలన గురించి పట్టించుకునేవాడు కాదు. అందువల్ల రూసో చిన్నతనం నుండే చెడు జీవితానికి అలవాటుపడ్డాడు. ఇంటి నుండి పారిపోయాడు. ఎక్కడెక్కడో తిరిగాడు. తెగిన గాలిపటంలా, చుక్కాని లేని నావలా గమ్యం తెలియని బ్రతుకు గడిపాడు. తల్లిదండ్రుల ఆలన పాలన లేదు. తినడానికి సరైన తిండి ఉండేది కాదు. దేశ దిమ్మరిలా తిరగుతూ చిన్నతనం నుండే ఎన్నో చేదు అనుభవాలను పొందాడు. రూసో జీవితం పూలపాన్పు కాదు, ముళ్లబాట. ఎన్నో అవమానాలు పొందాడు. దుర్భర జీవితం గడిపాడు. బ్రతకటానికి అప్పుడప్పుడూ, అవినీతి చర్యలకు పాల్పడేవాడు. బ్రతుకుతెరువు కోసం స్త్రీలతో అక్రమ సంబంధాలు కూడా పెట్టుకునేవాడు. మనిషి, జీవితంలో ఎంతవరకు పతనమైపోగలడో, అంతగా పతనమైపోయాడు. అందుకనే రూసోకు నీతి గురించి చెప్పడానికి స్వానుభవం ఎంతో దోహదం చేసింది. అవినీతి వల్ల ఉత్పన్నమయ్యే విపరీతాలను స్వయంగా అనుభవించడం వలన, రూసో, వ్యక్తికి నీతి చాలా అవసరం అని, రాజ్యంలో వ్యక్తి నీతివంతునిగా రూపు దిద్దుకోవాలని సామాజిక ఒడంబడిక గ్రంథంలో నొక్కి వక్కాణిస్తాడు.

### 8.3 రూసో రచించిన గ్రంథాలు :

వాస్తవానికి రూసో గొప్ప విద్యావేత్త కాదు. మేధావికాదు. సంపన్న కుటుంబంలో జన్మించలేదు. రాజకీయ అనుభవం కూడా లేదు. ఇవేమీ లేకుండా రూసో గొప్ప రాజనీతి తత్వవేత్త కాగలిగాడంటే ఆశ్చర్యం కలగడం సహజమే కదా. మరి రూసో గొప్పవాడు కావడానికి కారణమేంటి? అందుకు కారణం కేవలం అదృష్టం అంటాడు ఎబెన్‌స్టీన్ పండితుడు. రూసో గొప్ప రచయితగా ప్రపంచానికి పరిచయం కావటానికి దోహదం చేసిన ఒక గొప్ప సందర్భాన్ని గురించి తెలుసుకుంటే రూసో ఎలా గొప్పవాడు కాగలిగాడు అనే విషయం అర్థమవుతుంది.

1949లో జరిగిన ఒక అనుకోని సంఘటన రూసోను ఒక గొప్ప రచయితగా ప్రపంచానికి పరిచయం చేసింది. అకాడమీ ఆఫ్ డిజోన్ (Academy of Dijon) అనే సంస్థ, ఒక వ్యాస రచన పోటీని నిర్వహిస్తున్నట్లు ప్రకటించింది. విజేతలకు బహుమతులను కూడా ప్రకటించింది. వ్యాస రచన పోటీకి ఇచ్చిన అంశం, శాస్త్రాలు, కళల అభివృద్ధి అవినీతికి దోహదం చేస్తున్నాయా లేదా నీతికి దోహదం చేస్తున్నాయా? అయాచితంగా ఈ పత్రికా ప్రకటనను చూసాడు రూసో, ఒక వ్యాసాన్ని తయారు చేసి అకాడమీకి పంపించాడు రూసో. ఆశ్చర్యం! రూసో పంపిన వ్యాసానికి 1750 లో మొదటి బహుమతిని ప్రకటించింది అకాడేమీ. తత్ఫలితంగా ఒక మంచి రచయితగా రూసో ప్రపంచానికి పరిచయమయ్యాడు. ఆయన రచనా వ్యాసంగం నుండి వెలువడిన గ్రంథాలు:

1. A DISCOURSE ON THE MORAL EFFECTS OF THE ARTS AND SCIENCES (1751)
2. A DISCOURSE ON THE ORIGIN OF INEQUALITY
3. THE NOURELLE HELOISE
4. THE EMILE
5. THE SOCIAL CONTRACT

వీటిలో ది సోషల్ కాంట్రాక్ట్ అనే గ్రంథం రూసోకు ఎనలేని కీర్తి, ప్రతిష్టలను సంపాదించింది.

### 8.4. మానవ స్వభావ విశ్లేషణ:

హాబ్స్, లాక్ వలెనే రూసో కూడా మానవ స్వభావాన్ని విశ్లేషించాడు. మానవుడు జన్మతహ మంచివాడు. స్వేచ్ఛా ప్రియుడు, అమాయకుడు, అతనిలో రెండు గుణాలు ఉన్నాయి. అవి

1. వ్యక్తిగతమైనది
2. సామాజిక పరమైనది

మొదటి గుణం వ్యక్తి క్షేమాన్ని మాత్రమే కోరుకుంటుంది. రెండవది సామాజిక శ్రేయస్సును, ఇతరుల క్షేమాన్ని కూడా కోరుకుంటుంది.

## 8.5. ప్రాకృత వ్యవస్థ : (STATE OF NATURE)

రూసో సామాజిక ఒడంబడిక సిద్ధాంతం ప్రాకృత వ్యవస్థతోనే ప్రారంభమవుతుంది. ఒక రాజనీతి శాస్త్ర పండితుడు రూసో సిద్ధాంతముపై చక్కని వ్యాఖ్యానము చేసాడు. అదేమనగా, రూసో సామాజిక ఒడంబడిక సిద్ధాంతము, లాక్‌తో ప్రారంభమై, హాబ్స్‌తో అంతమవుతుంది. అనగా రూసో భావాలు ఆదిలో లాక్ భావాలతో ఏకీభవించగా, చివరలో ఆయన అభిప్రాయాలు హాబ్స్ అభిప్రాయాలకు దగ్గరగా ఉన్నాయి.

ప్రాకృత వ్యవస్థలో మానవుడు, స్వేచ్ఛగా, ఒంటరిగా హాయిగా, ఏ బాధలు లేకుండా ఆనందంగా ఉండేవాడు. ప్రకృతిలో దొరికిన పండ్లు, దుంపలు, పచ్చి మాంసం తింటూ తిరిగేవాడు. అతనికి భాషగాని, వస్త్రధారణ గాని తెలియదు. ఇలాంటి ఆనందమయ మైన జీవితం మానవ చరిత్రలో మరెప్పుడూ ఉండదు అంటాడు రూసో, కాని ఈ జీవితం ఎంతో కాలం సాగలేదు. కాలక్రమంలో కొన్ని తప్పనిసరి పరిస్థితులవలన సంతోషం, అదృశ్యం కావటం ప్రారంభించింది. వాతావరణం, భూసారంలో ఉండేటటువంటి తేడాలు మానవుని జీవితంలో మార్పులు తెచ్చాయి. అమాయకుడు, నిస్వార్థపరుడు అయిన మానవుడు, ఒక పదునైన రాయిని తీసుకొని జంతువులపై దాడి చేసి, వాటిని చంపి, పచ్చి మాంసం తినేవాడు, నదులు, సముద్రపు ఒడ్డులలో చేపలు పట్టి తినేవాడు. అనుకోకుండా నిప్పు తయారుచేయటం నేర్చుకున్నాడు. పచ్చి మాంసం బదులు మాంసం కాల్చుకు తినటం మొదలు పెట్టాడు. విల్లు, బాణాలు, లోహాలు కనుగొన్నాడు. గుహలలో జీవించే మానవుడు, చిన్న చిన్న ఇల్లు నిర్మించుకొని, స్వంత కుటుంబం ఏర్పరచుకొన్నాడు.

ఏ వ్యక్తయితే మొదటిసారిగా కొంత భూమిని ఆక్రమించుకొని ఇది నాది అని చెప్పి, ఇతరులు దానిని అంగీకరించేటట్లు చేసాడో అతనే ఆస్తి అనే వ్యవస్థ మరియు, రాజకీయ వ్యవస్థకు మూలపురుషుడు అంటాడు రూసో. అది మొదలుకొని ప్రయివేటు ఆస్తి అనేది మానవ జీవితంలోకి విషసర్పంలా ప్రవేశించి, వారి శాంతియుత జీవితాన్ని భగ్నం చేసింది. ఆస్తి తర్వాత మానవుని స్వేచ్ఛాయుత, సమతా జీవితాన్ని భగ్నం చేసిన మరొక కారకం వ్యవసాయం, వ్యవసాయం చేయడానికి సమూహాల శక్తి, సహకారం కావలసివచ్చింది. అలాగే లోహాల తయారీ ప్రారంభించాడు. ఈ రెండు ఉత్పత్తి ప్రక్రియలలో వ్యక్తులలోని శక్తి, సామర్థ్యాలు బహిర్గతం కావటం ప్రారంభమైంది. బలవంతుడు, నైపుణ్యం కలిగిన వాడు ఎక్కువ పని చేసి ఎక్కువ సంపాదించడం మొదలు పెట్టాడు. దానితో సమాజంలో ధనికులు, పేదలు అనే రెండు వర్గాలు ఏర్పడ్డాయి.

అప్పటివరకు మనుషులలో వున్న సమానత్వం అంతరించి, అసూయ, స్వార్థం, అసమానత్వం, గర్వం మొదలైన అవలక్షణాలు చోటు చేసుకున్నాయి. సహజీవన ప్రక్రియ భంగమైంది. ప్రస్తుతం నాగరిక సమాజంలో గల సకల రుగ్మతలు మానవులలో ప్రవేశించాయి. దోపిడీ వ్యవస్థ మొదలైంది. ఇది చాలా తీవ్రమైన సమస్యగా పరిణమించింది.

### 8.6. సామాజిక ఒడంబడిక – షరతులు :

ఈ దోపిడీ వ్యవస్థను ప్రజలు నిరంతరం కొనసాగాలని కోరుకోవటం లేదు. ఈ సమస్యకు సత్వర పరిష్కారం కోసం ప్రజలు తమలో తాము ఒక ఒడంబడిక కుదుర్చుకొని ఒక రాజకీయ సమాజాన్ని (Body Politic) ఏర్పరచుకోవాలని నిర్ణయించుకొన్నారు. ఒడంబడికలో భాగస్వామి అయ్యే ప్రతీవ్యక్తి తన శక్తిని, ఆస్తిని, జనేచ్ఛ అనే ఒక సర్వోన్నత శక్తికి అప్పగించాలి. A, B, C మొదలైన వ్యక్తులు, A+B+C+etc. అనే రాజకీయ వ్యవస్థకు తమ హక్కులను సమర్పించుకున్నారు. ఈ సంఘటితమైన వ్యక్తుల సముదాయాన్నే రాజ్యం అంటారు. ఈ రాజ్యానికి ఒక ఇచ్ఛ ఉంటుంది. అదే జనేచ్ఛ. ఈ జనేచ్ఛ ప్రజలందరి క్షేమం కోసం పాటుపడుతుంది. వ్యక్తి, జనేచ్ఛకు బద్ధుడై జీవించినట్లయితే, ప్రాకృత వ్యవస్థలో ప్రారంభంలో అతను పొందిన, స్వేచ్ఛ, సమత, ఆనందాలను తిరిగిపొందుతాడు.

**సామాజిక ఒడంబడికలోని షరతులు:**

1. ఇది ప్రజల మధ్య జరిగిన ఒప్పందము
2. ఈ ఒప్పందం ఫలితంగా ప్రాకృతవ్యవస్థ అంతమయ్యి, రాజకీయ వ్యవస్థ ప్రారంభమౌతుంది.
3. ప్రతీ వ్యక్తి తన సమస్త హక్కులను, శక్తిని, జనేచ్ఛకు ఇచ్చి, దాని మార్గదర్శకత్వంలో నడచుకొనుటకు అంగీకరించాడు.
4. ఈవిధంగా ప్రతీ ఒక్కడు 'జనేచ్ఛకు' విధేయుడై ఉండటానికి ఒప్పందం చేసుకున్నాడు.
5. రాజకీయ వ్యవస్థ, మరియు రాజకీయ అధికారం వ్యక్తి సమ్మతి ద్వారా మాత్రమే ఏర్పాటుకావాలి.
6. రాజకీయ వ్యవస్థను ఏర్పరచిన తర్వాత, వ్యక్తిని, అతని ఆస్తిని రక్షించే బాధ్యత రాజ్యానిదే.
7. ఈ బృహత్తరమైన విధిని "జనేచ్ఛ" నిర్వహిస్తుంది.
8. ప్రజలకు కావలసిన విధానాలు, శాసనాలు జనేచ్ఛ ద్వారానే ప్రకటించబడతాయి.
9. ప్రజలందరూ జనేచ్ఛకు బద్ధులై, జనేచ్ఛకు కట్టుబడి జీవించాలి.
10. ప్రజలు జనేచ్ఛకు కట్టుబడి జీవిస్తే, వారు పోగొట్టుకున్న స్వేచ్ఛ, స్వాతంత్ర్యము, ఆనందము రాజకీయ వ్యవస్థలో తిరిగి పొందుతారు.

### 8.7. జనేచ్ఛ సిద్ధాంతము :

రూసో రూపొందించిన ఒక అద్భుతమైన సిద్ధాంతము జనేచ్ఛ. వ్యక్తి స్వేచ్ఛకు, రాజ్యం అధికారానికి మధ్య గల వైరుధ్యాన్ని జనేచ్ఛ సిద్ధాంతము ద్వారా సమన్వయ పరచాలని ప్రయత్నించాడు రూసో. రూసో జనేచ్ఛ సిద్ధాంతము నిగూఢమైనది, కష్టమైనది. దానిని అర్థం చేసుకోవటానికి వ్యక్తికి విశాల దృక్పథం, సామాజిక చింతన చాలా అవసరం.

ప్రాకృత వ్యవస్థలోని ప్రజలు, అక్కడున్న అసాంఘిక పరిస్థితుల నుండి బయటపడటానికి, తమలో తాము ఒక ఒప్పందం చేసుకొని ఒక రాజకీయ వ్యవస్థను ఏర్పాటుచేసుకున్నారని తెలియచేయటం జరిగింది. ఈ రాజకీయ వ్యవస్థకు ఒక ఇచ్ఛ ఉంటుంది. అదే జనేచ్ఛ. The state has a will and that is called the 'General will'. So the general will is the will of the body politic. జనేచ్ఛ అంటే ఏమిటి అని తెలుసుకోవాలంటే ముందుగా మరి కొని ఇచ్ఛల గురించి తెలుసుకోవాలి. అవి ఏమనగా

1. బయటకు కనిపించే ఇచ్ఛ (Actual will)
2. నిజమైన ఇచ్ఛ (Real will)
3. జనులందరి ఇచ్ఛ (Will of all)

1. **బయటకు కనిపించే ఇచ్ఛ (Actual will)** : నాణానికి బొమ్మా, బొరుసు ఉన్నట్లే , ప్రతి మనిషిలోను బయటకు కనిపించే ఇచ్ఛ, హృదయాంతరాలలో ఉండే నిజమైన ఇచ్ఛ అనే రెండు ఇచ్ఛలు ఉంటాయి. వ్యక్తిలోని

చెడు, లేదా దుర్మార్గమైన, స్వార్ధపూరితమైన ఆలోచనలకు రూపమే Actual will లేదా బయటకు కనిపించే ఇచ్ఛ. ఇది స్వార్ధపూరితమైనది. నిరంతరం వ్యక్తి స్వార్ధాన్ని మాత్రమే కోరుకుంటుంది. ఇతరుల గురించి ఆలోచించదు. ఇది క్షణికమైనది, అశాశ్వతం, అవివేకమైనది. వ్యక్తిలో ఈ Actual will ప్రభావం ఎక్కువైతే మనిషి సంఘశ్రేయస్సు మరచి, స్వార్ధపరుడుగా, దుర్మార్గుడుగా, ఒక్క మాటలో రాక్షసుడుగా మారతాడు.

**2. నిజమైన ఇచ్ఛ (Real will) :**

మనిషిలోని మానవత్వానికి, మంచితనానికి ప్రతిరూపమే నిజమైన ఇచ్ఛ. ఇది నిస్వార్ధమైనది. శాశ్వతమైనది, వ్యక్తి శ్రేయసుకన్నా సామాజిక శ్రేయస్సును కోరుకొంటుంది. వ్యక్తిలో నిజమైన ఇచ్ఛ ప్రభావం ఎక్కువగా ఉంటే మనిషి మంచివాడుగా మహాత్ముడుగా జీవిస్తాడు. ఈ నిజమైన ఇచ్ఛ వ్యక్తికి, సమాజానికి మధ్య సామరస్యాన్ని ఏర్పాటుచేస్తుంది.

**3. జనులందరి ఇచ్ఛ (Will of all) :**

సంఘంలోని వ్యక్తులకు చెందిన ఇచ్ఛల కలయికనే, జనులందరి ఇచ్ఛ అంటారు. ఇందులో స్వార్ధ పూరితమైన Actual wills, సంఘ పరమైన నిజమైన ఇచ్ఛలు Real wills ఉంటాయి.

**జనేచ్ఛ అనగా నేమి? (WHAT IS A GENERAL WILL)?:**

జనేచ్ఛ అనగా ఏమి? ఈ జనేచ్ఛ ఎలా జనిస్తుంది.

"రాజకీయ సమాజంలోని వ్యక్తుల నిజమైన ఇచ్ఛల కలయికే జనేచ్ఛ" అని అంటాడు రూసో. జనేచ్ఛ ఈ క్రింది విధంగా జనిస్తుంది –

1. రాజకీయ సమాజంలోని పౌరులందరూ ఏదైనా అంశంపై నిర్ణయం తీసుకోవటానికి ఒకచోట సమావేశమౌతారు.
2. ముందుగా పౌరులందరూ తమ వ్యక్తిగత అభిప్రాయాలను లేదా వ్యక్తిగత ఇచ్ఛలను వెల్లడిస్తారు (ఇదే Will of all).
3. ఈ ఇచ్ఛలలో కొన్ని స్వార్ధపూరితమైన (Actual wills) ఇచ్ఛలు ఉంటాయి. అలాగే కొన్ని నిస్వార్ధమైనవి, సమాజక్షేమాన్ని కాంక్షించే నిజమైన ఇచ్ఛలు (Real wills) ఉంటాయి.
4. ఆ పిమ్మట చర్చ ప్రారంభమవుతుంది. చర్చలో ప్రతివ్యక్తి వివేకవంతంగ, విశాల హృదయంతో, ప్రశాంతంగా, సంఘ పరంగ, ప్రజలందరికోసం ఆలోచించి నిర్ణయం ప్రకటించాలని కోరటం జరుగుతుంది. చర్చ తర్వాత వ్యక్తి హృదయాంతరాలలో నుండి గుండె లోతుల్లో నుండి, నిజమైన ఇచ్ఛ, జనిస్తుంది. మొదట స్వార్ధపూరితంగా ఆలోచించిన వ్యక్తులు, విస్తృతమైన చర్చ జరిగిన తరువాత, సమాజక్షేమం కోసం, అందరి మంచి కోసం, అందరి కోసం తమ వ్యక్తిగతమైన, స్వార్ధ పరమైన ఆలోచనను ఉపసంహరించుకొంటారు. ఆవిధంగా స్వార్ధపూరితమైనటువంటి ఇచ్ఛలు (Actual wills) అదృశ్యమై వాటి స్థానంలో నిజమైన ఇచ్ఛలు (Real wills) ఏర్పడతాయి.

అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయాన్ని ప్రజలందరూ ఏకాభిప్రాయంతో తీసుకుంటారు. ఈ నిర్ణయం అందరి నుంచి జనించి, అందరికీ వర్తిస్తుంది. దీనినే జనేచ్ఛ అంటారు. ఈ జనేచ్ఛ ప్రజలందరి సుఖాన్ని, సంతోషాన్ని, మంచిని కోరుకుంటుంది.

జనేచ్ఛకు ఏ విధమైన మినహాయింపులు ఉండవు. చేతులు పైకి ఎత్తడం ద్వారాగాని, ఓట్లు లెక్కించడం

ద్వారాగాని, జనేచ్ఛను తెలుసుకోలేము. జనేచ్ఛను తెలుసుకోవాలంటే ఒకే ఒక మార్గముంది. అదేమనగా. అది సమాజంలోని ప్రజలందరి క్షేమాన్ని పెంపొందింప చేస్తుందా? లేదా?

జనేచ్ఛను అందరూ కోరుకోవాలి. అందరూ కలిసి నిర్ణయించాలి. వ్యక్తి కేవలం తనకు ఏది మంచిదోననేది గ్రహిస్తే సరిపోదు. దానిని నిర్ణయించుకోగలగాలి. దాన్ని చట్టంగా తయారు చేసుకోవాలి. అంటే ప్రజలకు కావలసిన చట్టాలను ప్రజలే రూపొందించుకోవాలి. ఆ చట్టాలకు విధేయులై జీవించాలి. అప్పుడు మాత్రమే స్వేచ్ఛకు, చట్టాలకు మధ్య గల వైరుధ్యం తొలగిపోతుంది. అలా జరిగినప్పుడు చట్టాలు సంకెళ్ళు కావు. అవి పూలదండలౌతాయి. ఈ విధంగా రూసో వ్యక్తి స్వేచ్ఛకు, రాజ్యం అధికారానికి మధ్య నున్న వైరుధ్యాన్ని పరిష్కరిస్తాడు.

**8.8 జనేచ్ఛ లక్షణాలు :** జనేచ్ఛకు కొన్ని నిర్దిష్టమైన లక్షణాలున్నాయి. అవి ఏమనగా

1. ఐకమత్యం
2. శాశ్వతం
3. అవిభాజ్యము
4. బదిలీ చేయ వీలులేనిది
5. ఎవరూ దానిని ప్రతిపాదించ వీలులేనిది
6. అవధులు లేనిది
7. ఎప్పుడూ తప్పు చేయదు
8. నిరపేక్షమైనది
9. సర్వాధికారి

## 8.9 జనేచ్ఛ ప్రాముఖ్యత :

రాజనీతి శాస్త్రానికి, రూసో అందించిన ఒక అద్భుతమైన సిద్ధాంతం జనేచ్ఛ. రూసో మేధస్సు నుండి వెలువడిన ఒక ఆదర్శవంతమైన ఆలోచనకు, మనిషిలోని నైతిక విలువలకు ప్రతిరూపమే జనేచ్ఛ సిద్ధాంతము.

జనేచ్ఛ సిద్ధాంతం గురించి క్షుణ్ణంగా అర్థంచేసుకోవాలన్నా దాని లక్ష్యం గురించి, దాని యొక్క గొప్పతనం గురించి తెలుసుకొని జనేచ్ఛకు అనుగుణంగా దేశ ప్రజలందరూ జీవించాలన్నా, విద్య చాలా అవసరమని గుర్తించినవాడు రూసో. దేశ ప్రజలంతా విద్యావంతులైనప్పుడే జనేచ్ఛ సిద్ధాంతం విజయవంతమౌతుంది. విద్యావంతులైన ప్రజలు మాత్రమే సమాజపరంగా, విశాల దృకృథంతో దేశం కోసం, నిర్మాణాత్మకంగా ఆలోచించగలుగుతారు. అందువలన జనేచ్ఛ, విద్యా రెండు అవిభాజ్యమైనవి.

## 8.10 రాజ్యానికి – ప్రభుత్వానికి మధ్య గల తేడా :

రూసో రాజ్యానికి, ప్రభుత్వానికి మధ్య గల తేడాను స్పష్టంగా వివరించాడు. రాజ్యం అంటే, ప్రజల ఒప్పందం ద్వారా ఏర్పడిన రాజకీయ సమాజమని, ప్రభుత్వం అంటే, ప్రజలు తీసుకున్న నిర్ణయాలను, వారు ఆమోదించిన చట్టాలను అమలుపరచడానికి, ప్రజలచే నియమింపబడిన వ్యక్తుల బృందమని చెబుతాడు రూసో. ప్రభుత్వము ఎలా ఏర్పడుతుంది?

1. ప్రజలందరూ ముందుగా, సామాజిక ఒడంబడిక ద్వారా రాజ్యాన్ని ఏర్పాటు చేసుకున్నారు.
2. సార్వభౌమాధికారం కలిగిన ప్రజలు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవటానికి సమావేశమౌతారు.
3. వారికి ఏ తరహా ప్రభుత్వం కావాలి? అంటే రాచరికమా, కులీనపాలనా, ప్రజాస్వామ్యమా. ఏది కావాలో

నిర్ణయించుకొంటారు.

4. ఆ నిర్ణయానికి అనుగుణంగా ప్రభుత్వాన్ని నియమిస్తారు.
5. ప్రభుత్వం ప్రజలకు విధేయంగా ఉండాలి.
6. ప్రజల అభీష్టం మేరకు ప్రభుత్వాన్ని మార్చుకోవచ్చు. ఎందుకంటే ప్రజలే సార్వభౌములు కనుక.
7. చట్టాలను తయారు చేసుకొనే అధికారం ప్రజలకు మాత్రమే ఉంది.
8. ప్రజలు ఆమోదించిన చట్టాలను అమలు జరిపే బాధ్యత ప్రభుత్వానిది.

8.11 రూసో గొప్పదనం :

రాజనీతి తత్వవేత్తలలో రూసో ఒక గొప్ప తత్వవేత్త. ఆయన రచనలు, ఆలోచనలు రాజనీతి శాస్త్ర అభివృద్ధికి ఎంతగానో దోహదపడ్డాయి. భావితరాలపై రూసో రచనల ప్రభావం చాలా వుంది. ఈ క్రింది అంశాలు రూసో గొప్పతనానికి తార్కాణాలు :

1. రూసో ప్రపంచ ప్రసిద్ధి చెందిన గ్రీకు తత్వవేత్తలైన ప్లేటో, అరిస్టాటిల్ రచనల వలన బాగా ప్రభావితుడైనాడు. వారి రాజనీతి భావాలను ఆధునిక కాలంలో తిరిగి పునరుద్దరించడానికి తీవ్రంగా ప్రయత్నించాడు. అందుకే రూసో కూడా, రాజ్యం ఒక జీవివంటిదని ప్రజలు ఆ శరీరంలో భాగాలని, వారి మనుగడ, అభివృద్ధి రాజ్యం ద్వారానే సాధ్యమౌతుందని ప్లేటో, అరిస్టాటిల్ వెల్లడించిన అంగాంగిక సిద్ధాంతాన్ని సమర్ధిస్తాడు. రాజ్యంలో నైతిక ప్రాముఖ్యాన్ని గుర్తించిన వాడు రూసో. వ్యక్తి కన్నా రాజ్యం గొప్పదంటాడు రూసో. పౌరుడు చట్ట నిర్మాణంలో, విధాన నిర్ణయకల్పనలో నిరంతరం భాగస్వామి కావాలని చెప్పటం, ప్రత్యక్ష ప్రజాస్వామ్యంపై ఆయనకున్న అమితమైన ప్రేమను తెలియచేస్తుంది. పౌరుడు నిరంతరం రాజ్య కార్యకలాపాలలో పాల్గొంటూ, ఒక నైతిక జీవిగా పరిపూర్ణతను సాధించాలని రూసో అభిప్రాయపడతాడు.
2. జనేచ్ఛ (GENERAL WILL) అనే ఒక నూతన భావాన్ని ప్రపంచానికి అందించినవాడు రూసో.
3. హాబ్స్ సూత్రీకరించిన మంచి ప్రభుత్వం, లాక్ సూత్రీకరించిన ప్రజాప్రభుత్వాన్ని సమ్మేళనం చేసి 'జనేచ్ఛ' సిద్ధాంతాన్ని రూపొందించాడు రూసో.
4. మానవుడు 'స్వేచ్ఛగా పుట్టాడు' (Man is born free) అని ప్రకటించి మానవ హక్కుల (Human Rights) భావనకు గొప్పపునాదివేసాడు.
5. ఆయన బోధించిన సమ్మతి సిద్ధాంతము (Theory of consent) ప్రజాస్వామ్య ప్రభుత్వాలకు పునాదిగా కొనసాగుతున్నది.
6. వ్యక్తి రాజ్య పరిపాలనా వ్యవహారాలలో చురుకుగా, నిరంతరం పాల్గొనాలంటాడు రూసో.
7. రూసో జనేచ్ఛ సిద్ధాంతం హెగెల్‌ను విశేషంగా ప్రభావపరచడం వలన , హెగెల్ చెప్పిన జాతీయ రాజ్య సిద్ధాంతానికి స్ఫూర్తిని కలిగించింది.
8. రూసో చెప్పిన, స్వేచ్ఛ, సమానత్వం, ప్రజాసార్వభౌమత్వం ఫ్రెంచి విప్లవకారులను ఉత్తేజపరచి, 1789 ఫ్రెంచి విప్లవానికి దారితీసాయి.
9. అమెరికా రాజ్యాంగ నిర్మాతలపై రూసో ప్రభావం ఎంతగానో ఉంది.
10. ప్రజాసార్వభౌమత్వాన్ని సమర్థించిన వాడు రూసో (He was a champion of popular sovereignty).
11. ప్రాతినిధ్య ప్రజాస్వామ్యంలోని లోపాలను సరిదిద్దటానికి ప్రయత్నం చేసాడు. ప్రత్యక్ష ప్రజాస్వామ్యాన్ని వెలుగుల్లోకి తెచ్చాడు.

12. విద్య మనిషికి చాలా అవసరమని, సమాజంలోని ప్రజలందరూ విద్యావంతులు కావాలని, అప్పుడే 'జనేచ్ఛ' విజయవంతమౌతుందని నొక్కి వక్కాణిస్తాడు.
13. ప్లేటో, అరిస్టాటిల్ వలె వ్యక్తి నైతిక ఔన్నత్యాన్ని పొందాలంటాడు.
14. అంగాంగిక సిద్ధాంతాన్ని ప్రబోధించాడు. వ్యక్తి పరిపూర్ణ అభివృద్ధి రాజ్యంలోనే సాధ్యమంటాడు.
15. పార్టీరహిత రాజకీయ వ్యవస్థకు శ్రీకారం చుట్టాడు.

## 8.12 సారాంశము :

"Man is born free every where he is in chains" అంటాడు రూసో, ఫ్రెంచి దేశానికి చెందిన రాజనీతితత్వవేత్త. సామాజిక ఒడంబడిక సిద్ధాంతకర్తలలో చివరివాడు. రాజ్యం ప్రజలు తమలో తాము చేసుకున్న ఒడంబడిక వలన ఏర్పడిందనే సిద్ధాంతాన్ని వెల్లడించిన గొప్ప రాజనీతితత్వవేత్త రూసో. జనేచ్ఛ అనే నూతన భావాన్ని ప్రపంచానికి అందించినవాడు రూసో. జనేచ్ఛ అనగా సమాజంలోని ప్రజలందరి క్షేమం కోసం తీసుకునే నిర్ణయం. సమాజంలోని ప్రజలందరూ వారి స్వార్థపూరితమైన ఆలోచనలు విడనాడి అందరికోసం, వివేకంతో, విశాల హృదయంతో తీసుకునే నిర్ణయమే జనేచ్ఛ. జనేచ్ఛకు, నా, నీ అనే బేధంలేదు. అందరిలో నుండి జన్మించి, అందరి కోసం, అందురూ ఏకగ్రీవంగా తీసుకునే నిర్ణయమే జనేచ్ఛ. జనేచ్ఛ విజయవంతం కావాలంటే ప్రజలందరూ విద్యావంతులు కావాలి. వ్యక్తి కన్నా దేశం గొప్పది అనే సూక్తికి జనేచ్ఛ నిదర్శనం.

## 8.13 నమూనా ప్రశ్నలు

1. రూసో జనేచ్ఛ సిద్ధాంతమును వివరింపుము.
2. రూసో గొప్పదనమును తెలియచేయుము.

## 8.14 చదువదగిన గ్రంథాలు :


1. G.H. SABINE : A History of Political Theory
2. W.A. DUNNING : A History of Political Theories
3. C.L. WAYPER : Political Thought
4. MULFORD. O. SIBLEY : Political Ideas and Ideologies


డాక్టర్ ఎ. వెంకటరావు

పాఠం - 9

# ఉపయోగితావాదము - బెంథామ్

## 9.0. లక్ష్యం :

ఈ పాఠాన్ని చదివిన తర్వాత విద్యార్థులు ఈ క్రింది విషయాలను గురించి తెలుసుకోగల్గుతారు.

- బెంథామ్ ఉపయగితావాదం సిద్ధాంతం గురించి వివరించగలరు.
- రాజ్యం, సమాజములపై బెంథామ్ అభిప్రాయాలు తెలుసుకోగలరు.
- ఓటుహక్కు, న్యాయం, విద్య మొదలగు అంశాలపై బెంథామ్ మనో భావాలు పరిశీలించగలరు.

విషయ సూచిక


9.1 పరిచయం
9.2. ఉపయోగితావాధము - అర్థవివరణ
9.3. బెంథామ్ జీవితము రచనలు
9.4. ఉపయోగితావాద నియమ నిబంధనలు
9.5. ఉపయోగితా వాదం - దశలు
9.6 సహజ హక్కులపై బెంథామ్ విశ్లేషణ
9.7 ఓటు హక్కు
9.8 రాజ్యము - ప్రభుత్వము
9.9 న్యాయ సంస్కరణలు
9.10 విద్య (లో సంస్కరణలు) పై బెంథామ్ పరిశీలన
9.11 చట్టం - స్వేచ్ఛపై బెంథామ్ మనోభావాలు
9.12 బెంథామ్ సిద్ధాంతంపై విమర్శ
9.13 సిద్ధాంత ప్రాముఖ్యత
9.14 సారాంశం
9.15 నమూనా ప్రశ్నలు
9.16 చదువదగిన గ్రంథాలు


## 9.1. పరిచయం

18వ శతాబ్దం మధ్యలో ఉపయోగితావాదం ఇంగ్లాండులో ఆచరణలోకి వచ్చినది (బాగా ప్రబలి ఉంది). ఇది సుమారుగా ఒక శతాబ్దంపాటు అమలులో ఉన్నది. ఉపయోగితావాదానికి మూలం ఇంగ్లాండు అని చెప్పవచ్చు. దీని వలన రాజకీయ సిద్ధాంతం, నైతిక విలువలు అభివృద్ధి చెందినాయి. ఈ ఉపయోగితా వాదం ఇంగ్లాండు అనుభవ వాదంతో (Empiricisam)తో ముడిపడి ఉంది. ఇది చాలా పురాతనమైనది. ఉపయోగితా వాద పద్ధతి తర్కబద్ధమైనది వాస్తవ బద్ధమైనది. ఈ ఉపయోగితావాద సిద్ధాంత సమర్థులలో ప్రముఖులు డేవిడ్ హ్యూమ్ (David Hume), జెర్మిబెంథామ్ (Jerme Bentham) జేమ్స్ మిల్ (James Mill) జాన్ స్టూవర్ట్‌మిల్ (J.S.Mill) బెంథామ్ తాను రచించిన ఫ్రాగ్మెంట్స్ ఆఫ్ గవర్నమెంట్ అను గ్రంథంలో ఉపయోగితావాద సిద్ధాంతాన్ని గురించి వివరించాడు. ఉపయోగితావాదం అనే పదాన్ని మంచి లేదా విలువ అనే పదానికి ప్రత్యామ్నాయంగా ఉపయోగించాడు. ప్రిస్ట్లే (Priestly.) అను ప్రఖ్యాత రచయిత రూపొందించిన నినాదము "The greatest happiness of the greatest member" (అత్యధిక సంఖ్యాకులకు అత్యధిక సంతోషం) బెంథాంకు ఉపయోగితా వాదానికి స్ఫూర్తినిచ్చింది.

## 9.2 ఉపయోగితావాదం - అర్థం వివరణ

బెంథామ్ అభిప్రాయంలో మానవుడు చేసే ప్రతి పనిలోను "సంతోషము" (Happiness) లేదా బాధ (Pain) ఉంటుంది. ప్రతి మానవుడు సంతోషం పొందటానికి ఏ పని అయినా చేస్తాడు. బాధ కొరకు ఎవరూ ఏ పని చేయరు. ఏ పని అయితే మానవునికి సంతోషాన్ని ఇస్తుందో అదే ఉపయోగమైనది. ప్రభుత్వ శాసనాలుగాని, ప్రభుత్వ విధానముగాని, మానవుని చర్యలుగాని అతడికి సంతోషం కలిగించడానికి ఉపయోగపడాలి. మానవుడి ఉపయోగం ప్రాతిపదికగా రూపొందించిన సిద్ధాంతం కావున దీనిని ఉపయోగితా వాదము అని ప్రాచుర్యంలోనికి వచ్చింది.

ఉపయోగితా వాదులు ప్రతి వ్యక్తి సంతోషాన్ని కోరుతారు. దుఃఖాన్ని దూరంగా ఉంచాలి అంటారు. ప్రతి ప్రభుత్వం తన ప్రతి సౌకర్యం కొరకు వారిని సంతోషంగా ఉంచటానికి అహర్నిశలు పనిచేయాలి. ఆధునిక కాలంలో రాజ్యాలు చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రజలను సంతోష పెట్టడానికి ఉద్దేశింపబడినవే. ఉపయోగితా వాదుల అభిప్రాయం ప్రకారం రాజ్యం ఏర్పడటానికి, కొనసాగటానికి కారణం దాని వల్ల ప్రజలకు ప్రయోజనం ఉండుటకు ఏ రాజ్యమైతే ప్రజలకు అత్యంత సంతోషం కలిగిస్తుందో అదే ఆదర్శ రాజ్యం. ఈ విధంగా ఉపయోగితా వాదులు రాజ్యాన్ని ఒక సాధనంగా వ్యక్తిని ప్రయోజనాన్ని కల్పించే సంస్థగా భావిస్తారు.

## 9.3. బెంథామ్ జీవితం - రచనలు

ఉపయోగితా వాదులు అందరిలో ఆదర్శవంతుడైన జర్మిబెంథామ్ 1748వ సం॥లో ఇంగ్లాండులో జన్మించెను తండ్రి సంపన్నన్యాయవాది. లాటిన్, గ్రీక్, ఫ్రెంచ్ భాషలను నేర్చుకున్నాడు. 16 ఏటనే పట్టభద్రుడు అయిన బెంథామ్ 1766లో యం.ఏ. డిగ్రి పొందారు. విజ్ఞాన శాస్త్రంలో ఆసక్తి కనబరిచి, న్యాయశాస్త్రాన్ని అభ్యసించి న్యాయవాద వృత్తిని కొంత కాలం నిర్వహించారు.అయితే ఆ వృత్తిలో ఆసక్తి ఏర్పడ్డక రసాయనిక, భౌతిక శాస్త్రము అధ్యయనము చేశాడు. మానవ సంతోషాన్ని ఇనుమడింప చేయుటానికి ఏ తత్వం ఏ పద్ధతులు ఉపయోగపడతాయి అనే అంశాన్ని అధ్యయనం చేయడం మొదలుపెట్టాడు. బ్రిటీషు న్యాయ వ్యవస్థ పునర్నిర్మాణం కోసం తీవ్ర కృషి చేశాడు.

1808లో జేమ్స్‌మిల్‌తో సన్నిహితత్వము ఏర్పడినది. 1832లో మరణించాడు. బెంథామ్ అనేక గ్రంథలు రచించాడు. వాటిలో ముఖ్యమైనవి.

ఏ ఫ్రాగ్‌మెంట్ ఆన్ గవర్నమెంట్, ఎమనేట్ యువర్ కాలనీస్ (emanate your colonies) డిస్కోర్సు ఆన్ సివిల్ అండ్ పీనల్ లెజిస్లేషన్, ఎడిపెన్స్ ఆఫ్ హుజరీ, ఇంట్రడక్షన్ టు ది ప్రిన్సిపల్స్ ఆఫ్ మోరల్స్ అండ్ లెజిస్లేషన్ ఎట్రిటెజ్ ఆన్ జ్యుడిషియల్ ఎవిడెన్సు, ఎ థియరీ ఆఫ్ పనిష్‌మెంట్స్ అండ్ రివార్డ్స్, పేపర్స్ ఆన్ కోడిఫికేషన్ అండ్ పబ్లిక్ ఇన్‌స్ట్రక్షన్, ఎస్సే ఆన్ పొలిటికల్ టాక్ టాక్స్, రాడికలిజం నాట్ డేంజరస్, ది బుక్ ఆఫ్ ఫెలాసిస్.

## 9.4. బెంథామ్ ఉపయోగితావాద సిద్ధాంతం - నియమ నిబంధనలు

ఉపయోగితా వాదమునకు మూలప్రాతిపదిక సంతోషం ఇది మానవ జీవితమునకు ప్రధానమైనది. మానవుడు జీవితములో ఆనందం కోరుకుంటారు. మానవ జీవిత ధ్యేయము కూడా ఆనంద సముపార్జనమే, బెంథామ్ తన ప్రధాన గ్రంథమైన"The principles of morals and Legislations" ది ప్రిన్సిపల్స్ ఆఫ్ మోరల్స్ అండ్ లెజిస్లేషన్‌లో ఉపయోగితా వాదము గురించి చర్చించారు.

మానవుడు తన చర్యల ద్వారా ఆనందము (Pleasure) పొందుటకు ప్రయత్నించును బాధను నివారించుటకు ప్రయత్నించును. మానవుడు ఆనందమును పొందటానికి బాధను నివారించటానికి ఒకే కాలంలో ఒక చర్య తీసుకొనవచ్చును. ఆనంద సముపార్జన లేదా బాధ నివారణ మినహాయించి మానవ చర్యలు ఉండటానికి ఆస్కారము లేదు. బెంథామ్ రాజనీతి తత్వము మానవుడు సంతోషాన్ని కోరుకుంటాడనే సూత్రము మీద ఆధారపడినది.

బెంథామ్ మానవుడు కోరుకునే దానిని 2 రకాలుగా వర్గీకరించెను. అది ఆనందం (Pleasure) మరియు సంతోషం (Happiness) ఆనందం ఇంద్రియములను సంబంధించినది. కొన్ని మానవ చర్యల వలన ఇంద్రియముల ద్వారా ఆనందం కలుగును లేదా

బాధకలుగవచ్చును. ఆనందమనేది ఇంద్రియ జ్ఞానాలను తెలియజేస్తుంది. ఇంద్రియ జ్ఞానము వలన కలిగిన ఆనందాలే, ఒక్కోసారి తాత్కాలికముగా మానవునికి ఆనందం కలిగించినను, తరువాత మానవునికి బాధను నష్టమును కలిగించ వచ్చును. ఆనందం అంచనా వేయటానికి కూడా ఉపయోగితావాద నియమము పనికి వస్తుంది. ఒక చర్య ఆనందాన్ని కల్గిస్తుందా లేదా దు:ఖాన్ని కల్గిస్తుందా నిర్ణయించడానికి ఈ అంశాలు తోడ్పడతాయి.

(1) ఆనందం యొక్క తీవ్రత (Intensity) (2) కాలపరిమితి (Duration) (3) నిశ్చితత్వం(Certanity) (4) అనిశ్చితత్వం (Uncertanity) (5) సామాన్యత (Praseinity), (6) దూరం (Remoteness) (7) విస్తీర్ణత అనుభవించేవారి సంఖ్య (8) స్వచ్ఛత (Purity). శాసన నిర్మిత వాటిని దృష్టిలో పెట్టుకొని చట్టాలు రూపొందించాలి. ఏ చర్య వల్ల ఎక్కువ మందిని సంతోషం కలుగుతుందో లేదా బాధ కలుగుతుందో చట్ట నిర్మాతలు ముందుగా అంచనా వేయాలి చట్ట నిర్మాణంలో సాధారణ ఉపయోగితను ఒక నిర్దేశిక నియమంగా తీసుకోవాలి. బెంథామ్ ఆనందాలను సాధారణమైనవిగాను క్లిష్టమైనవిగా వర్గీకరించెను. 14 రకాలు అయిన ఆనందాలు ఉన్నాయి.

(1) స్పందన లేదా జ్ఞానేంద్రీయముల వలన కలిగి ఆనందం (2) సంపద వలన సంతోషం (3) ప్రావీణ్యం వల్ల సంతోషం (4) స్నేహం వల్ల సంతోషం (5) ఖ్యాతి వలన సంతోషం (6) అదికం వలన సంతోషం (7) తన లిపి నెరవేర్చుట వలన సంతోషం (8) ఇతరులకు దయచూపుట వలన సంతోషం (9) ఇతరులకు చెడు చేయటం వలన సంతోషం (10) కొన్ని జ్ఞాపకాల వలన సంతోషం (11) ఊహల ద్వారా పొందే సంతోషం (12) సంఘ జీవనం వలన పొందే సంతోషం (13) జరగబోయే దానిని గురించి పొందే సంతోషం (14) బాద తొలగిపోపుట వలన సంతోషం.

బెంథామ్ 12 రకాలు అయిన బాధలు కూడా ఉంటాయని పేర్కొన్నాడు.

(1) లేమి (కావలసినది కాకపోవటం) (2) స్పందన (జ్ఞానేంద్రియాల వలన బాధ) (3) ఎబ్బెట్టు ( అననుకూల పరిస్థితుల వలన బాధ) (4)శత్రుత్వం (5) అపఖ్యాతి (6) తన విధి నెరవేర్చలేక బాధ (7) ఇతరులు దయచూపుట వలన బాధ (8) ఇతరులు చెడు చేయుట వలన బాధ (9) కొన్ని జ్ఞాపకాల వలప వచ్చే బాధ (10) ఊహించుకోవడం వల్ల బాధ (11) జరగబోయే దానిని గురించి బాధ (12) ఇతరులతో కలసి ఉండుట వలన బాధ, సంతోషాన్ని బాధలను కొలవటానికి బెంథామ్ " ఫెలిసిఫిక్ కాల్కులస్" అనే సూత్రాన్ని (గణితశాస్త్రంలోని) రూపొందించాడు. దీనిద్వారా ఆనందంతో ఉపయోగాన్ని అంచనా వేయటం సాధ్యమని బెంథామ్ భావిస్తాడు. మానవుడు ఆనందాన్ని లేదా ఉపయోగాన్ని పెంచే చర్య చేస్తాడు. అందువల్ల వాటిని అంచనా వేయటం సాధ్యమవుతుంది. ఆనందాన్ని లేదా బాధను కలిగించే అనేక అంశాలు ఉన్నాయి. ఉదా॥కు ఆరోగ్యం, బలం, ధృఢత్వం, శారీరక అసంపూర్ణత, మేధాశక్తి, నైతిక ధృఢత్వం, శారీరక అసంపూర్ణత, మేధాశక్తి నైతిక ధృక్పధం, మతి స్పందన, శరీరము , మనస్సు మొ॥వి.

## 9.5 ఉపయోగితా వాదం - దశలు

ఉపయోగితావాదంలో 4 ప్రధాన దశలు ఉన్నవి. ఊపయోగితావాదం ఎవరి ఆనందం కోసం ప్రయత్నిస్తుందనే దానిని బట్టి 4 దశలుగా జెర్మీ బెంథామ్ ప్రతిపాదించినాడు. మొదటిది మానవుడు నిస్సందేహముగా స్వార్థజీవి. తన సంతోషం కొరకే ప్రయత్నిస్తాడు. కాని మానవునిలో వివేకము కూడా ఉంది.

రెండవదశ మానవుడు తన ఆనందంతోపాటు ఇతరుల ఆనందములనుకూడా అభిలషిస్తాడు. మూడవదశ అత్యధిక సంఖ్యాకుల అత్యధిక ఆనందం నాలుగవ దశ ఈ ఆనందం సంపాదన కోసం కృషి చేయడం.

## ఉపయోగితావాద ముఖ్యలక్షణాలు

బెంథామ్ ఉపయోగితావాద ముఖ్యలక్షణములు ఈ క్రింది విధముగా చెప్పవచ్చు.

1. ఉపయోగితావాదం గుణాత్మకమైనది.

2. ఈ వాదం ఆనందానికి సంబంధించిన సిద్ధాంతం

3. ఇది ఫలితాలను మాత్రమే గుర్తిస్తుంది కాని కారకాలను కాదు

4. ఉపయోగితావాదం అనుభవపూర్వకమైనది.

5. ఎవరి సంతోషం లేదా ప్రయోజనం కోసం కృషి చేయాలో తెలుపుతుంది.

6. మానవ ప్రవర్తన ఏ విధంగా క్రమబద్ధం చేసుకోవాలో వివరిస్తుంది.

7. ఉపయోగితావాదం సార్వజనీనమైన సిద్ధాంతం బెంథామ్ చెప్పిన ఉపయోగితావాదం ఆధునిక శ్రేయోరాజ్య లక్ష్యమునకు స్ఫూర్తిదాయకమైనది అని చెప్పవచ్చు.

## 9.6. సహజహక్కులపై బెంథామ్ విశ్లేషణ

బెంథామ్ సహజ హక్కుల సిద్ధాంతాన్ని అంగీకరించలేదు. బెంథామ్ అభిప్రాయంలో అన్ని హక్కులకు మూలం చట్టం. చట్టం ఉపయోగితావాద సూత్రంపై ఆధారపడి ఉంది. హక్కులతోపాటు విధులు కూడా ఉంటాయి. ఒక హక్కును ఉల్లంఘించిన చర్య శిక్షార్హము. సార్వభౌమాధికారము అన్ని హక్కులకు మూలము. సార్వభౌమాధికారం నిరపేక్షం అయినప్పటికి అది ఉపయోగపడనప్పుడు దానిని ఎదిరించే హక్కు ప్రజలకున్నది. జాన్‌లాక్ ప్రతిపాదించిన సహజహక్కులను బెంథామ్ తిరస్కరించినప్పటికి ఉపయోగాన్ని ఆధారము చేసుకొని ఆస్తిని మాత్రము సహజహక్కుగా అంగీకరించాడు. ప్రతివ్యక్తి అన్ని విషయాలలోను మరొకవ్యక్తితో సమానం కాబట్టి అధిక సంఖ్యాకుల అధిక ప్రయోజనాన్ని నెరవేర్చటానికి హక్కులు ఉపయోగపడాలని బెంథామ్ భావించాడు.

## 9.7. ఓటుహక్కు

ఓటుహక్కు అందరికి సమానంగా ఉండవలయును.విద్యావంతులైన పురుషులు అందరికి సమానముగా ఓటుహక్కు కల్పించబడవలయును. పిల్లలు, స్త్రీలకు ఓటుహక్కు కల్పించటానికి బెంథామ్ ఆసక్తి చూపలేదు. ఓటుహక్కు కల్పించడంలో విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలని బెంథామ్ అభిప్రాయపడినాడు. చదవడం, వ్రాయడం, లెక్కించడం వచ్చినవారికి ఓటు హక్కు ఉంటుంది అని ఆయన ఉద్ఘాటించారు. ఏకశాసనసభ వ్యవస్థ ఉన్నట్లు అయితే అది ప్రజల ప్రయోజనాలను ప్రతిభింబిస్తుంది కావున అత్యధిక సంఖ్యాకుల ఆనందమును సమకూర్చుటకు వీలు అవుతుంది.

## 9.8. రాజ్యము - ప్రభుత్వము

బెంథామ్ దృష్టిలో రాజ్యావతరణ ముఖ్య ఉద్దేశ్యము ప్రజల సంతోషాన్ని పెంపొందించడమే. రాజ్యానికి సార్వభౌమాధికారంగలదు ప్రజలు సార్వభౌమాధికారి ఆజ్ఞలు శిరసావహించవలెను. ప్రజలు రాజ్యాధికారికి విధేయులై ఉండవలెను. రాజ్యాధినేత ప్రజల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని శాసనాలు రూపొందించి అమలు చేయవలెను. ప్రజలు పాలకునికి విధేయులై ఉండడంవలన ప్రజలకు ఎక్కువ ఉపయోగం చేకూర్చిన ఎడల ప్రజలు రాజ్యానికి విధేయుత చూపగలరు. నష్టం కల్గించినచో తిరుగుబాటు చేయించెదరు. ప్రాతినిధ్య ప్రభుత్వమే (Representative Government) ఉత్తమమైనదిగా బెంథామ్ అభిప్రాయం.

## 9.9. న్యాయ సంస్కరణలు

న్యాయాన్ని ఉపయోగ సూత్రం ఆధారంగా చేసుకొని వర్గీకరణ చేసినట్లయితే ఏ న్యాయాలను నిర్మూలన చేయవలనో, ఏ కొత్త న్యాయాలను చేయవలెనో తెలుస్తుంది అని బెంథామ్ అభిప్రాయం. న్యాయ వ్యవస్థలో సంస్కరణలు రావాలని భావించారు.అత్యధికులు ప్రయోజనాన్ని, ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించే సార్వభౌమాధికారి ఆజ్ఞలే శాసనాలని బెంథామ్ పేర్కొన్నారు. ఇంగ్లాండులోని చట్టాలను, న్యాయ నిర్వహణా పద్ధతులను సమూలంగా మార్చాలని బెంథామ్ అభిప్రాయ పడ్డారు. న్యాయవ్యవస్థలో ఈ క్రింది విధమైన మార్పులు

రావాలని బెంథామ్ అభిలషించారు. (1) ప్రజలకు న్యాయశాసనాలు అందరికి అర్థంఅయ్యేటట్లు తెలికభాషలో రూపొందించవలయును. (2). శాసనాల లక్ష్యం అధిక సంఖ్యాకులకు ప్రయోజనం కల్గించడమే (3) శాసనాలు కాలానుగుణంగా మారుతూ ఉండాలి. (4) మితవ్యయం, అనవసర కాలయాపన జరగకుండా న్యాయశాసనాలు అమలు చేయవలెను. (5) న్యాయాధిపతులు వారు చేసే అన్ని తీర్పులకు వారే బాధ్యత వహించవలయును.

## 9.10. విద్య పై బెంథామ్ మనోభావాలు

(1) విద్య జీవనోపాధి కల్పించేదిగా ఉండాలి.

(2) విద్యార్థి అభిరుచికి భిన్నంగా, సమాజశ్రేయస్సుకు భిన్నంగా విద్య ఉండరాదు.

(3) విద్యార్థుల శక్తిని గమనించి తేలికగా అర్థమయ్యే విధంగా విద్యా బోధన ఉండాలి.

(4) ఉన్నత వర్గాల వారికి, క్రింది వర్గాల వారికి వేరు వేరు విద్యాలయాలు ఉండటం మంచిది అని బెంథామ్ అభిప్రాయపడ్డారు.

(5) జాతీయ విద్యా విధానం అవసరాన్ని గుర్తించారు బెంథామ్.

## 9.11. చట్టము స్వేచ్ఛ పై బెంథామ్ మనోభావాలు

ప్రభుత్వం తన శాసనాల ద్వారా ప్రజలకు ఎక్కువ ప్రయోజనాలు కల్పించవలెను. అత్యధిక సంఖ్యాకులకు అధిక సంతోషం కల్పించే బాధ్యత ప్రభుత్వానిదే కావునా ప్రభుత్వం ఆ దృష్టితోనే పురాతన శాసనాలను సవరించవలెను. నూతన శాసనాలు రూపొందించవలెను. ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను పాలకుడు కాపాడలేక పోయిన ఎడల తమ ప్రయోజనం ప్రజలు తిరుగుబాటు చేస్తారని బెంథామ్ అభిప్రాయం. ప్రజావసరమైన చట్టాలు చేయాలని బెంథామ్ భావించాడు. అందులో ముఖ్యమైనవి వారసత్వహక్కు తొలగింపు, శిక్షాస్మృతిలో మార్పు, అవినీతి నిర్మూలన, భిక్షాటనపై నిషేధం మైద్యావసతుల విస్తరణ మొ॥వి చట్టాల ద్వారా సాధించాలని బెంథామ్ పేర్కొన్నాడు.

## 9.12. బెంథామ్ ఉపయోగితావాద సిద్ధాంతం పై విమర్శ

భెంథామ్‌కు ఉపయోగితావాద సిద్ధాంతం అనేక విమర్శలకు గురి అయినది. భెంథామ్ రాజనీతి తత్వంలో ముఖ్యంగా అతనికి మనస్తత్వ శాస్త్రాన్ని గురించి అవగాహన తక్కువ అని ఎక్కువ మంది విమర్శకులు అభిప్రాయపడినారు.బాధ, సంతోషం రెండూ కూడా మనస్సుకు సంబంధించినవి. ఇవి రెండూ కృత్రిమ భావాలు వీటి ఉపయోగానికి సరైన కొలబద్ద లేదు. ఇవి మానవుని మనఃప్రవృత్తిని బట్టి మారుతూ ఉంటాయి. ప్రతి పనికి బాధ, సంతోషం ఆధారమైతే భేంథామ్‌కు తత్వశాస్త్రము స్వభావాన్ని దాటిపోలేదు దూరదృష్టిలో ఉండే విలువ బెంథామ్‌కు తెలియదని విమర్శించినారు. ఎల్లప్పుడు సంతోషాన్ని కోరినట్లయితే నైతిక విలువలకు తావులేదు. బెంథామ్ సిద్ధాంతంపై వచ్చిన విమర్శలను సంక్షిప్తంగా ఇలా పేర్కొనవచ్చు.

(1) మానవుని సంతోషమును అంచనా వేయటం సాధ్యంకాదు.

(2) ప్రతి వ్యక్తి తన సంతోషమునే ఆలోచించిన ఎడల రాజ్య శ్రేయస్సు దెబ్బతింటుంది.

(3) ఉపయోగితావాదం కేవలం భౌతికమైనది(Materialistic) దానిలో ఆధ్యాత్మికత ఏ మాత్రం లేదు.

(4) బెంథామ్ సమాజ శ్రేయస్సును తక్కువగా అంచనా వేసెను వ్యక్తి శ్రేయస్సు కన్నా సమాజశ్రేయస్సు ప్రధానమైనది.

(5) బెంథామ్ భావించినట్లుగా గణిత శాస్త్రానికి రాజకీయాలకు ఏ విధమైన సంబంధంలేదు. రాజకీయ సంస్థలు చారిత్రిక పరిస్థితి ఆధారంగా ఏర్పడినవే గాని ప్రజా ప్రయోజన దృష్ట్యాకాదు.

(6) ఈ సిద్ధాంతం కాలానికి అనుగుణం అయిన సిద్ధాంతం కాదు. బెంథామ్‌కు అభిప్రాయంలో ప్రజలుగాని, పాలకులుగాని తమ తక్షణ ప్రయోజనాలకు కృషిచేయాలి. కాని ఈ దాటి వ్యక్తులు లేదా పాలకులు భావితరాలవారిని దృష్టిలో పెట్టుకొని ఎన్నోపథకాలు రూపొందించవలసిన అవసరం ఉన్నది.

రాజకీయ అధికారానికి (Political Authority) మానవులు అలవాటుపడితే విధేయతే మూలం అని బెంథామ్ వాదన. బెంథామ్ సిద్ధాంతంపై కొన్ని విమర్శలు ఉన్నప్పటికి అతని సిద్ధాంతంలో కొన్ని అంశాలు అన్ని కాలాలకు వర్తిస్తాయి. బెంథామ్ ఉపయోగితావాదం ఈ నాటి శ్రేయా రాజ్యమునకు స్ఫూర్తిదాయకమైనది. రాబోయే శతాబ్దాలకు తగిన విధంగా అనేక సంస్కరణలు ప్రతిపాదించెను. రాజ్యము ప్రభుత్వము యొక్క ప్రయోజనమును చక్కగా విశ్లేషించుటకు కాక మానవుల ప్రవృత్తిని చక్కగా అర్ధం చేసికొన్నాడు.

## 9.14. సారాంశము

ఆధునిక రాజనీతి తత్త్వ విచారంలో బెంథామ్‌కు సముచితమైన స్థానం ఉన్నది. 19వ శతాబ్దంలో బ్రిటన్‌లోని రాజనీతితత్వంపై ఉపయోగితా సిద్ధాంతం ద్వారా తనదైన ముద్రవేయగలిగినాడు. తన జీవితమంతా రాజకీయ విద్యాన్యాయ మరియు మత సంస్కరణల కోసం కృషిచేసినాడు. ప్రజలు పౌరులుగా రాజ్యమునకు, ప్రభుత్వమునకు విధేయులై ఉండినా రాజకీయ బద్ధత విషయంలో ఉపయోగితా సిద్ధాంత సూత్రాన్ని వినియోగించిన ఘనత బెంథామ్‌కే దక్కుతుంది.

## 9.15. నమూనా ప్రశ్నలు

(1) బెంథామ్ ఉపయోగితా సిద్ధాంతము గురించి వివరించుము

(2) రాజ్యం న్యాయవ్యవస్థలపై బెంథామ్ అభిప్రాయాలు విశ్లేషింపుము

## 9.16. చదువవలసిన గ్రంథాలు


| | |
|---|---|
| Sabine: | A History of Political theory |
| J.P.Sudha | A History of Political thought |
| Mac Pherson | The life and times of liberal democracy |
| Rosenblum | Bentham's Theory of the modern state |
| డా॥వి.కృష్ణారావు | ప్రాశ్చాత్య రాజనీతి తత్త్వ విచారము |


డా॥ బి.వి.వి. బాలకృష్ణ

పాఠం - 10

# ఉపయోగితావాదము - జె.యస్.మిల్.

## 10.0. లక్ష్యం :

ఈ పాఠాన్ని చదివిన తర్వాత విద్యార్థులు ఈ క్రింది విషయాలను గురించి తెలుసుకోగల్గుతారు.

- జాన్ స్టూవర్ట్ మిల్ ఉపయోగితావాద సిద్ధాంతం వివరించగలరు.
- స్వేచ్ఛపై మిల్ అభిప్రాయాలు పేర్కొనగలరు.
- మిల్ ప్రాతినిధ్య ప్రభుత్వాలు ఏ విధంగా చిత్రించినది వివరించగలరు.

**విషయ సూచిక**


10.1 పరిచయం

10.2. జె.యస్.మిల్ జీవితం - రచనలు

10.3. ఉపయోగితావాద సిద్ధాంతం

10.4. వ్యక్తి శ్రేయోవాదం

10.5. ఆస్తి పై మిల్ అభిప్రాయాలు

10.6 ప్రాతినిధ్య ప్రభుత్వం

10.7 సామ్యవాదంపై మిల్ అభిప్రాయం

10.8 మిల్ బెంథామ్‌ల మధ్య భిన్నత్వం

10.9 మిల్ సిద్ధాంతంపై విమర్శ

10.10 సారాంశం

10.11. నమూనా ప్రశ్నలు

10.12. చదువదగిన గ్రంథాలు


## 10.1. పరిచయం

రాజనీతి శాస్త్రం, తత్వశాస్త్రంలో ఉదారవాది అయిన జె.యస్.మిల్. బెంథామ్ ఉపయోగితావాదానికి వారసుడు అని చెప్పవచ్చు మిల్ తన వ్యక్తి స్వేచ్ఛావాదం ద్వారా రాజనీతి శాస్త్రంలో ఒక ముఖ్యమైన చర్చకు తెర తీసాడు. సమకాలీన రాజకీయాలలో వ్యక్తి స్వేచ్ఛను సమర్థించడంలో, ఉదారవాదాన్ని వివరించడంలో మిల్ అగ్రస్థానాన్ని పొందాడు. బెంథామ్ రచించిన ఉపయోగితావాద సిద్ధాంతాన్ని ఆధునికతతో తీర్చిదిద్ది దాని ప్రాధాన్యతను ఇనుమడింప చేయడానికి ఎనలేని కృషి చేసాడు.

## 10.2 మిల్ జీవితం - రచనలు

జె.యస్.మిల్ మే 20, 1806వ సం॥లో లండన్ నగరంలో జన్మించారు. ఇతడు బెంథామ్ సమకాలికుడు అయిన జేమ్స్‌మిల్ పెద్ద కుమారుడు. బెంథామ్ తన తండ్రికి సమకాలీనుడు కావడం వల్ల బెంథామ్ ప్రభావం మిల్‌పై ఎక్కువగా ఉన్నది. చిన్న వయస్సులోనే గ్రీక్, లాటిన్ భాషలను నేర్చుకొని పాండిత్యాన్ని సాధించాడు. 14 ఏటనే ఫ్రాన్సులో ఒక సంవత్సర కాలం గడిపి ఫ్రెంచి భాషను నేర్చుకొన్నాడు జె.యస్.మిల్ 17 సం॥ల వయస్సులో తన తండ్రి అయిన జేమ్స్ మిల్, బెంథామ్ ప్రభావంతో 'యుటిలిటేరియన్' అనే సంస్థను తీవ్రవాద భావాలను ప్రచారము చేయడానికి స్థాపించాడు. "వెస్ట్‌మినిస్టర్" పత్రికకు తరచు వ్యాసాలు వ్రాసేవాడు. "లండన్ రివ్యూ" పత్రికకు సంపాదకునిగా పని చేశాడు. 1866 నుంచి 1868 వరకు బ్రిటీష్ పార్లమెంటు సభ్యుడుగా కొనసాగాడు. 1873 మే నెలలో మరణించాడు.

మిల్ రచనలు : జె.యస్.మిల్ అనేక ప్రముఖ గ్రంథాలు రచించాడు. రాజనీతి శాస్త్రము, నీతి శాస్త్రము, తర్కము, ఆర్థిక శాస్త్రము, భౌతిక శాస్త్రము మొ॥గు శాస్త్రాలపై అనేక రచనలు చేశాడు. వాటిలో కొన్ని రచనలు 1) సిస్టమ్ ఆఫ్ లాజిక్ రేషియో, సియనేటిక్ అండ్ ఇండక్టివ్ (1843) (2) ప్రిన్సిపాల్ ఆఫ్ పొలిటికల్ ఎకానమి (1848) (3) ఆన్ లిబర్టీ (1859), (4) థాట్స్ ఆన్ పార్లమెంటరీ రిఫార్మ్స్ (1859), (5) కన్సిడరేషన్ ఆన్ రిప్రజెంటేటివ్ గవర్నమెంట్ (1860), (6) యుటిలిటేరియజమ్ (ఉపయోగితావాదం) (1863), (7) ఎడ్మిషన్ ఆఫ్ ఉమన్‌ని టు ఎలక్టోరల్ ఫ్రాన్‌ఛైజ్ (1867), (8) ఉమన్ సఫ్రేజ్ (1873) (9) సబ్జెక్షన్ ఆఫ్ ఉమన్ 1869).

## 10.3. మిల్ ఉపయోగితావాద సిద్ధాంతం

జె.యస్.మిల్. బెంథామ్ ప్రతిపాదించిన ఉపయోగితావాద సిద్ధాంతాన్ని యథాతథంగా అంగీకరించలేదు. ఉపయోగితావాదంలో కొన్ని గుణాత్మకమైన మార్పులను మిల్ ప్రవేశపెట్టాడు. ఈ మార్పులు ఉపయోగితావాద స్వరూపాన్ని మార్చివేశాయి.

మిల్ వివరించిన ఉపయోగితావాద సిద్ధాంతం సంపూర్ణ మానవ వికాసానికి తోడ్పడింది. మానవుని జీవితంలో సంతోషాన్ని పెంచే చర్యలు మంచివని, దుఃఖాన్ని లేదా బాధను కల్గించేవి చెడ్డవని ఈ వాదం భావిస్తుంది. సంతోషం అంటే ఆనందం అని ఉపయోగితావాదుల అభిప్రాయం కాని మిల్ ఉద్దేశ్యంలో ఆనందాలు పరిమాణాత్మకంగానే కాకుండా గుణాత్మకంగా ఉన్నత ఆనందాలు, నిమ్నానందాలు ఉంటాయి. బెంథామ్ "ఆనందాలను పరిమాణాత్మకంగానే గుర్తించవచ్చు. గుణాత్మకంగా కాదు" అన్నాడు. మిల్ దృష్టిలో గుణాన్ని అనుసరించి ఆనందాల్లో వ్యత్యాసాలు ఉంటాయి. మిల్ ఈ సందర్భంలోనే సంతృప్తి చెందిన మానవుడి కంటే, అసంతృప్తి చెందిన సోక్రటీస్ ఉత్తముడు. ఈ విధంగా మిల్, బెంథామ్‌కు ప్రతిపాదించిన ఉపయోగితావాద సిద్ధాంతంలోని ఆనందాల పరిణామాత్మక సిద్ధాంతాన్ని తిరస్కరించాడు.

మిల్ ఉద్దేశ్యంలో బెంథామ్ ప్రతిపాదించిన ఉపయోగితావాదం కేవలం భౌతిక ప్రయోజనానికే పరిమితం అవుతుంది. మానవుడు కేవలం తన స్వంత ప్రయోజనం నెరవేర్చుకోవడానికి ప్రయత్నిస్తాడు. అలాంటి వ్యక్తుల సమూహంతో సమాజం ఏర్పడ్డప్పుడు దానికి ఒక సుస్థిరత, రూపం, విలువ గుర్తింపు ఉండవు. కేవలం లౌకిక భౌతిక ప్రయోజనానికే పరిమితమైన మానవుడు చివరకు యాంత్రిక మృగంగా మారి ఏ విధమైన హృదయ భావాల స్పందన లేకుండా మారిపోయే ప్రమాదం ఉన్నది. అందుచే ఉపయోగితావాదంలో మానవతాపరమైన బావనే ఉత్తమ జీవన ప్రాతిపదికగా మిల్ ప్రవేశపెట్టాడు.

మిల్ అభిప్రాయంలో వ్యక్తి ఉత్తమ జీవనం సామాజిక ప్రయోజనంతో ముడిపడిఉన్నది. నిజమైన ఆనందం, సంతోషం ఉన్నత ధ్యేయ సాధనలోనే సాధ్యమవుతాయి. ప్రతి వ్యక్తి ఉత్తమ జీవనం కోసం నైతిక సుగుణాలు అలవర్చుకోవాలన్నాడు.

బెంథామ్ ఉద్దేశ్యంలో ప్రముఖ శాస్త్రవేత్త సి.సి. మాక్సి భావించినట్లుగా "మానవుడు గుంటనక్కల సమాజంలో గుంటనక్కగా, సాధువుల సమాజంలో సాధువుగా ఉండాలి" అని మిల్ వ్యక్తిని గుంటనక్కగా కాకుండా సాధువుగా ఉండాలని సంబోధిస్తాడు. దానికి అనుగుణంగా ఉపయోగితావాదాన్ని మార్చినాడు. ఉపయోగితావాదం రాజకీయమైందని దానికి ఎలాంటి నైతిక లక్ష్యాలులేవని అన్న బెంథామ్ భావాలను, ఆలోచనా సరళిని మిల్ తీవ్రంగా ఖండించి ఉపయోగితావాదానికి నైతిక పవిత్రత కల్పించినాడు.

## 10.4. వ్యక్తి శ్రేయోవాదం

మిల్ వ్యక్తి శ్రేయోవాదాన్ని (Individualism) సమర్థించి, వ్యక్తి శ్రేయస్సు పూర్తిగా పెంచాలని కోరినాడు. వ్యక్తి నైతిక విలువలు, మేధ పెరగటానికి తగిన అవకాశం ఉండవలె. వ్యక్తి శ్రేయస్సు లేనిదే సమాజం పురోగమించదు. ప్రతి వ్యక్తికి తగిన ప్రోత్సాహమున్నట్లు అయితే ఆ వ్యక్తి సమాజానికి కొంతైనా తోడ్పడగలడు. సాంఘీక శాసనము, ప్రజా ప్రభుత్వము వ్యక్తిని మార్చటానికి, అతనిని సంఘంలో భాగస్వామ్యం చేయడానికి ప్రయత్నించవు. అందువల్లనే మిల్ ప్రభుత్వ విద్యను నిరశించాడు. తల్లిదండ్రులు అందరూ తమ పిల్లలను చదివిస్తున్నదీ, లేనిదీ చూసుకొని, అవసరమైన చోట ఆర్థిక సహాయం చేయవలనే గాని, విద్య నేర్పడంలో మాత్రం ప్రభుత్వ జోక్యం కలిగించుకొనరాదు. ప్రభుత్వ విద్య పిల్లల స్వతంత్ర ఆలోచనలకు అవకాశం ఇవ్వలేదు. వ్యక్తుల ఆలోచనలకు, పనికి, మాటకు స్వాతంత్ర్యం ఉండవలె. వ్యక్తి సమాజంలో

ఒక సభ్యుడు. అతడు సమాజంలో సభ్యుడు కదా అని పూర్తిగా కట్టుబాట్లలో పెట్టడం మంచిది కాదు. కొంత వరకు కట్టుబాట్లలో ఉంచడం ధర్మం. అందువల్ల సమాజానికి ఎక్కువ అధికారాలు ఇవ్వరాదు.

జె.యస్.మిల్. వ్యక్తి శ్రేయోవాదానికి మరొక ఆధారం అభివృద్ధి. అభివృద్ధి మీద మిల్‌కు నమ్మకం ఎక్కువ. అభివృద్ధి శక్తి ప్రవర్తన మీద ఆధారపడి ఉన్నది. కొత్త మార్పు రావాలంటే అది వ్యక్తి చేయవలసిందే కాని ఒక జాతివల్ల కాదు. పరిశోధన చేయటానికి పూర్తి స్వేచ్ఛ అవసరం.

ఆర్థిక రంగంలో మిల్ వ్యక్తి శ్రేయోవాదాన్ని సమర్థించలేదు. సమాజ శ్రేయస్సు కోసం ప్రభుత్వం ఆర్థిక రంగంలో పూర్తిగా కలుగ చేసుకోవలె. మిల్ తన అవసాన దశలో సామ్యవాద భావాలను ప్రోత్సహించాడు. మిల్ రాజనీతి ఉదారవాదాన్ని (Political Liberalism) ఆర్థిక సామ్యవాదంతో (Economic Socialism) మిళితం చేసినాడు. మొత్తం మీద మిల్ సమాజ శ్రేయస్సును వృద్ధి చేయవలెనని వ్యక్తిత్వాన్ని (Individuality) సురక్షితంగా ఉంచవలెనని చాటి చెప్పినాడు.

ఉన్నతమైన ఉపయోగితావాదిగా మిల్ మానవ మనుగడకు ఆనందమే ఆలంబన అని పేర్కొన్నాడు. స్వాతంత్ర్యానికి కూడా సమానమైన స్థానమున్నది. మిల్ కోరిన స్వేచ్ఛ, వ్యక్తి స్వేచ్ఛ మిల్ ప్రతి విషయాన్ని ప్రతి సమస్యను వ్యక్తి స్వేచ్ఛ దృష్ట్యా ఆలోచించినాడు. అదే మిల్ గొప్పదనం అని చెప్పవచ్చు.

సమాజం నైతిక విలువలకు ప్రాధాన్యతనిచ్చి చక్కటి నడవడిక కలిగిన సభ్యులతో నిండి ఉండవలెనని మిల్ భావన. బెంథామ్ అట్లాకాక వ్యక్తి నైతిక విలువలు కాపాడుకోవలెనని అభిప్రాయపడినాడు. వ్యక్తి తన ఆనందాన్ని సంతోషాన్ని పెంచుకోవలె కాని మిల్ మరో అడుగు ముందుకు వేసి వ్యక్తి తన ఆనందాన్ని, సంతోషాన్ని పెంపొందించుకొనటమేకాక సర్వజన సుఖ సంతోషాలకు తోడ్పడవలెనని భావించాడు. బెంథామ్ వలె కాక మిల్ వ్యక్తిని సమాజంలో వ్యక్తిగా చూసినాడు. అంటే బెంథామ్, మిల్ వ్యక్తిని ప్రత్యేకంగా చిత్రించినారు. మిల్ వ్యక్తిని, సమాజంలో ఒక సామాజిక ప్రకృతి (Social instict) కలిగిన సభ్యునిగా భావించాడు. అందువల్లనే మిల్ వ్యక్తి శ్రేయోవాదం ఆహ్లాదకరమైనదే గాక ఆచరణయోగ్యమైనదిగా చెప్పవచ్చు.

## 10.5. ఆస్తిపై మిల్ అభిప్రాయాలు

జె.యస్. మిల్ వ్యక్తిగత ఆస్తి (Private Property) సిద్ధాంతాన్ని, వారసత్వ సిద్ధాంతాన్ని (Inheritance) యాజమాన్య సిద్ధాంతాన్ని (Ownership) పునర్విమర్శ చేసినాడు. అతడు, వ్యక్తి తన శక్తి సామర్థ్యాలను ఉపయోగించుకొని తాను చేయగలిగినది చేయవచ్చు అన్న నిర్ధారణకు వచ్చినాడు. వ్యక్తులకు తమ స్వంతమైన దానిని వీలునామాపరంగా ఎవరికైనా ఇచ్చే హక్కు ఉంటుంది. ఆస్తి సామాజిక వ్యవస్థ. మానవజాతి పురోగమనానికి అవసరమైనది. సంఘంలో సమానత్వానికి అవకాశం లేదు. ఆస్తి హక్కుకు ఎన్నో నియమాలు ఉన్నాయి. ఉదా॥ పిల్లలు ఉన్నవారికే ఆస్తి ఉండాలి. ఎందువలనంటే పిల్లలను పెంచి పెద్ద చేయటానికి ఆస్తి అవసరం అవుతుంది అని మిల్ అభిప్రాయం. అధికారం దుర్వినియోగం చేసేవారికి పదవి నుండి తొలగించే అధికారం పార్లమెంటుకు ఉండవలెను.

## 10.6. ప్రాతినిధ్య ప్రభుత్వము

వ్యక్తి స్వేచ్ఛా సమర్థుడైన మిల్ సహజంగానే వ్యక్తుల ప్రోత్సాహంతో పాల్గొనే ప్రభుత్వ విధానాన్ని సమర్థించాడు. "ప్రజలు పాల్గొనే ప్రభుత్వ విధానాన్ని సమర్థించాడు". "ప్రజలు పాల్గొనే ప్రభుత్వమే రాజ్య అవసరాలను తీర్చగలుగుతుంది. అయితే ప్రజలు ఏ విధంగా పాల్గొంటారు?" అనే ప్రశ్నకు ప్రాతినిధ్య పద్ధతి ద్వారానే ప్రజలు అందరికి ప్రజా కార్యకలాపాలలో పాల్గొనడానికి అవకాశం కలుగుతుంది. అని మిల్ భావించాడు. "ప్రజలందరూ లేదా అధిక సంఖ్యాక ప్రజలు తమ ప్రతినిధుల ద్వారా (ఒక నిర్ణీత కాలానికి ఎన్నికైన) అధికారాన్ని చెలాయిస్తూ చిట్టచివరి నిర్ణయాధికారం తమ వద్ద ఉంచుకొని వ్యవహరిస్తే అది ప్రాతినిధ్య ప్రభుత్వం అవుతుంది.

ప్రాతినిధ్య ప్రభుత్వం (Representative Government) అను గ్రంథంలో ప్రాతినిధ్య ప్రభుత్వము యొక్క విశిష్టతను వివరించినాడు. అని వ్యవస్థల కన్నా ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం ఉత్తమమైనది. రాజరిక వ్యవస్థలో ప్రజాభిప్రాయానికి విలువలేదు. అందువల్ల

ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం ప్రభుత్వం ఆచరణ యోగ్యమైంది. ప్రాతినిధ్య ప్రభుత్వం ఉత్తమమైనది అని నిరూపించడానికి దానిని ఆచరణ యోగ్యము చేయడానికి మిల్ చేసిన సూచనలలో కొన్ని ముఖ్యమైనవి. ఈ దిగువన పేర్కొనటం జరిగింది.

1) ప్రజలలో రాజకీయ పరిజ్ఞానం పెంచటం ద్వారా వారి హక్కులకు రక్షణ కల్పించుట ద్వారా ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం ఉత్తమ విలువలను సంతరించుకొనగలదు.

2) ప్రాతినిధ్య ప్రజాస్వామ్యంలో ప్రజా ప్రతినిధులు మాత్రమే శాసనసభలలో పాల్గొనగలరు. అందువలన వారు ప్రజాభిప్రాయాలకు అనుగుణంగా శాసనాలను రూపొందించుటకు కృషి చేయవలెను. కార్యవర్గం చర్యలను పార్లమెంటు అజమాయిషీ చేయాలి. భూమి రూపంలో స్వంత ఆస్తిని మిల్ సమర్థించాడు. కొన్ని కొన్ని షరతులు పెట్టినాడు. భూమి పండాలంటే దానిని కొన్ని కావలసిన పెట్టుబడులు పెట్టి వ్యవసాయం చేయవలె. దీనికి కొంత ధనం అవసరం అవుతుంది. ఆ ధనం మళ్ళీ వెంటనే చేతికి రాదు. అందువల్ల విధేయత ఉంటేగాని పెట్టుబడిదారులు ధనం వెచ్చించటానికి ముందుకు రారు. మిల్ తన చివరి దశలో రాజ్యమే మొత్తం భూస్వామిత్వం వహించవలెనని అభిప్రాయపడినాడు. పార్లమెంట్ అభిప్రాయమే ప్రజాభిప్రాయం.

3) ఎన్నికలలో మెజారిటీ సంపాదించిన వర్గం లేక పార్టీ మాత్రమే పాలనాధికారం స్వీకరించినప్పటికి వారు అల్ప సంఖ్యాకుల అభిప్రాయాలను కూడా గౌరవించాలి. "అత్యధికుల అభిప్రాయమే సరి అయిన అభిప్రాయం" అను సిద్ధాంతంలో మిల్‌కు నమ్మకం లేదు.

4) అత్యధిక సంఖ్యాకుల (Tyranny of the majority) నియంతృత్వాన్ని మిల్ తిరస్కరించాడు. లోపభూయిష్టమైన ఎన్నిక విధానాల వల్ల మొత్తం ఓట్లలో మెజారిటీ రాకపోయినా అభ్యర్థి ఎన్నికలలో గెలవవచ్చు. అతడు ఓటు వేయనివారికి కూడా ప్రాతినిధ్యం వహించవలసి ఉంటుంది. అందువలన ఎన్నిక విధానమును సవరించుటయే కాక అల్ప సంఖ్యాకులకు శాసనసభలో ప్రాతినిధ్యం కల్పించవలెనని జె.యస్.మిల్ అభిప్రాయం.

5) ప్రజా ప్రతినిధులు ప్రజా సేవే ప్రధానంగా భావించవలెను. వారికి జీతభత్యాలు ఉండరాదు.

6) నైష్పత్తిక ప్రాతినిధ్య విధానం ఉత్తమమని మిల్ పేర్కొన్నాడు. నైష్పత్తిక ఎన్నిక విధానాన్ని ప్రవేశపెట్టి అల్పసంఖ్యాక వర్గాల వారు వారి సంఖ్యా బలాన్ని బట్టి పార్లమెంటులో ప్రాతినిధ్యం వహించుటకు అవకాశం కల్పించవలెను. ఇది ఉత్తమమైన పద్ధతి.

7) స్త్రీ, పురుష భేదము లేకుండా పౌరులు అందరికి ఓటు హక్కు కల్పించి వీరు అందరూ ప్రభుత్వ వ్యవహారాలలో పాల్గొనేటట్లు చేయవలె. ఆనాడు మహిళలకు ఓటు హక్కులేదు. అందువలన మహిళల వ్యక్తిత్వం వికసింపజేయుటకు వారికి ఓటు హక్కు కల్పించవలసిన ఆవశ్యకతను ప్రకటించెను. ఓటు హక్కుకు విద్యార్హత ఉండటం మేలు అని మిల్ భావించాడు. ఓటు హక్కుకు విద్యతో పాటు ఆస్తి అర్హతలుగా ఉండాలి. విద్య ఉన్నవారు ఆస్తి ఉన్నవారు బాధ్యతతో ప్రవర్తించగలరు.

8) మిల్ ప్లూరల్ ఓటింగ్ విధానాన్ని సమర్థించాడు. కేవలం సంఖ్యా బలాన్ని బట్టి ప్రజాస్వామ్యం నిర్వహించబడటం సమంజసం కాదు. యోగ్యునికి, అయోగ్యునికి ఒకే ఓటు ఉండరాదు. యోగ్యులైన వారికి ఎక్కువ ఓట్లు కల్పించి వారి అభిప్రాయానికి అధిక ప్రాముఖ్యత కల్పించవలెనని మిల్ వాదించెను.

9) రహస్య ఓటింగ్ కన్నా బహిరంగ ఓటింగ్ పద్ధతి ఉత్తమమైనది అని మిల్ అభిప్రాయం. అందువలన ప్రజాశ్రేయస్సుకు వ్యతిరేకంగా, తన వ్యక్తిగత శ్రేయస్సుకు అనుకూలంగా ఎవరూ ఓటు చేయలేరు.

## 10.7. సామ్యవాదంపై మిల్ అభిప్రాయాలు

జె.యస్.మిల్ ప్రారంభదశలో వ్యక్తి శ్రేయోవాదాన్ని బలపరచి, సామ్యవాదాన్ని వ్యతిరేకించాడు. కాని చివరిదశలో సామ్యవాదంతో ఉన్న ఆదర్శాన్ని, ప్రయోజనాలను గ్రహించాడు. తీవ్రమైన సామ్యవాదం పట్ల మిల్‌కు సదభిప్రాయం లేదు. భూములను జాతీయం చేయాలనే వాదన, భూ సంస్కరణలు అమలు చేయాలనే భావనలను వ్యతిరేకించాడు. ఆర్థిక, సామాజిక జీవనంలో పోటీ చాలా అవసరమని అప్పుడే ప్రజలు పురోగమించగలరని మిల్ భావించాడు.

ప్రజాస్వామ్యంలో బలపడుతున్న స్వేచ్ఛా సమానత్వాలను గుర్తించి సంఘవాదాన్ని ప్రోత్సహించాడు. ప్రజల మధ్య సంఘీభావాన్ని ప్రబోధించి, ప్రోత్సహించి తద్వారా నియంత శక్తులను అణచివేయటానికి ప్రయత్నించాడు.

సామ్యవాదం ప్రజలకు అనుకూలంగా ఉన్నంతకాలం మిల్ దాన్ని మంచి దృష్టితో చూశాడు. సామ్యవాదం, సమసమానత్వం భావాలతో ప్రజలను వర్గీకరించకూడదని అభిప్రాయపడినాడు. సంఘంలోని మార్పులకు సామ్యవాద సిద్ధాంతమే ప్రధాన సాధనమనేతీరు జె.యస్.మిల్ కు నచ్చలేదు.

కర్మాగార చట్టాలను మిల్ సమర్థించాడు. సామ్యవాదాన్ని కొంత వరకు మిల్ సమర్థించినా వ్యక్తి శ్రేయోవాదాన్ని వదలలేదు. పారిశ్రామిక రంగంలో ప్రభుత్వం జోక్యం ఉండడం మంచిదికాదు అని మిల్ భావన. వ్యక్తి శ్రేయోవాదానికి సంబంధించిన అన్ని రంగాలలో ప్రభుత్వ అజమాయిషి కొంత వరకే అవసరమని వాదించాడు.

## 10.8. బెంథామ్ - మిల్‌ల మధ్య వైవిధ్యం / భిన్నత్వం

బెంథామ్ ప్రతిపాదించిన ఉపయోగితావాదం సిద్ధాంతం అధిక ప్రాధాన్యత పొందుతున్న సమయంలో మిల్, బెంథామ్ భావాలను నిరసించాడు. మిల్ యాంత్రికమైన ఉపయోగితావాదం కంటే విలువలను అనుసరించి వాచింప దగ్గ ఉత్తమ జీవనానికి వ్యక్తి స్వేచ్ఛకు ప్రాముఖ్యత ఇచ్చాడు. బెంథామ్, మిల్ ఇద్దరూ ఉపయోగితావాదాన్ని, వ్యక్తి స్వేచ్ఛావాదాన్ని, ప్రజాస్వామ్యాన్ని బలపరచినప్పటికీ వీరి మధ్య వైవిధ్యాలు ఉన్నాయి.

1. బెంథామ్ మానవ చర్యకు సంతోషం కొలబద్ద అని సంతోషాన్ని అనుభవించడమే మానవ జీవిత పరమార్థమని వివరించాడు. మిల్ అభిప్రాయంలో ఈ వాదన మానవ నైతిక పతనాన్ని అతని చెడు ప్రవర్తనను తెలియ జేస్తుందని వ్యాఖ్యానించాడు. బెంథామ్ అభిప్రాయంలో సంతోషం పరిమాణాత్మకమైందని వాదించగా, మిల్ దాన్ని వ్యతిరేకించి, సంతోషం గుణాత్మకమైందని వాఖ్యానించాడు.

2. బెంథామ్ వ్యక్తి ఆనందానికి ప్రాముఖ్యత ఇచ్చాడు. మానవుడు సుఖం, బాధ అను రెండు ముఖ్య అంశాలతో పరిపాలితుడౌతాడని చెప్పిన తీరును సవరించి, మిల్ మానవ వికాసానికి గౌరవమే ప్రధానమైందని వ్యక్తి ఆనందం కన్నా సమాజ ప్రయోజనమే సమిష్టి ఆనందాన్ని కలుగజేస్తుందని మిల్ అభిప్రాయం. బెంథామ్ ఆనందానికి ప్రాముఖ్యత ఇస్తే మిల్ స్వేచ్ఛ వైపు మొగ్గు చూపాడు.

3. సంతోషంతో పాటు గౌరవం ముఖ్యమైందిగా ఉంటుంది అని మిల్ వాదించాడు. ఈ విషయంలో మిల్, బెంథామ్‌తో విభేదించాడు.

4. బెంథామ్ సార్వజనీన ఓటు రహస్య బ్యాలట్ పద్ధతి సమర్థించగా మిల్ బహిరంగ ఓటు పద్ధతిని సమర్థించాడు. మిల్ ప్రతిపాదించిన ప్లూరల్ ఓటింగ్ పద్ధతిని బెంథామ్ వివరించలేదు.

5. బెంథామ్ ఏక సభా విధానాన్ని ప్రతిపాదించగా మిల్ ద్విసభా విధానాన్ని సమర్థించాడు.

6. ఉపయోగితావాదం రాజకీయమైందని నైతికమైందని కాదని బెంథామ్ అభిప్రాయాన్ని మిల్ సవరించి రాజకీయ ఉపయోగిత కన్నా నైతిక శ్రేష్ఠతను స్ఫురింపజేసే మౌలిక విలువలకు ఎక్కువ ప్రాధాన్యత కల్పించాడు.

## 10.9. మిల్ సిద్ధాంతం పై విమర్శ

వ్యక్తి స్వేచ్ఛను మిల్ సమర్థవంతంగా ప్రతిపాదించినప్పటికి మిల్ సిద్ధాంతము మీద 2 ప్రధాన విమర్శలు ఉన్నవి.

1. వ్యక్తికున్న శక్తిని (energy) అతని ప్రత్యేక (Originality) తెలివితేటలుగా భావించాడు. మానవుని ప్రత్యేక కార్యాచరణశక్తి అతని eccentilicity గా మారవచ్చును. అది అతని వ్యక్తిత్వ బలమునుగాక బలహీనతను తెలియచేయును.

2. మానవుడు జీవితములోని వైవిధ్యము కొరకు ప్రయోజనములు చేయుట ద్వారా వైవిధ్యములు ఏర్పరచవచ్చును. వైవిధ్యము వ్యక్తి శీలము (Character) కాదు. ఎంత ఉన్నతుడైనా, ఇతరుల నుండి నేర్చుకోవటానికి అవకాశం ఉంటుంది. వ్యక్తి తన ప్రత్యేక జీవన పద్ధతులను, సామాజిక నిర్బంధాలు, అవరోధాలు ఉన్నప్పటికి ఏర్పరచుకోవటానికి అవకాశం ఉన్నది.

3. వ్యక్తి స్వేచ్ఛపైన పరిమితులు ఉండరాదనుట సమంజసం కాదు.

4. రాజ్య విధులు పెంపొందించడం వ్యక్తి స్వేచ్ఛకు భంగకరమనుట వాస్తవం కాదు.

5. తన మనస్సుపైనా, శరీరం పైన వ్యక్తి పూర్తి స్వేచ్ఛ గలదనుట హర్షించలేము. ఉదా : ఆత్మ హత్య వ్యక్తిగతమైన చర్య అయినా దానిని బలవంతంగా నిరోధించాలి కదా! కొద్దిపాటి లోపాలు ఉన్నా మిల్ స్వేచ్ఛావాదం గొప్పదిగా పేర్కొనవచ్చును.

## 10.10 సారాంశం

మిల్ ప్రజాస్వామ్యవాదే కాకుండా ఉదారవాది. నిజానికి మిల్ ఉదారవాది కాదు అంటే మిల్ మొదట ఉదారవాది. తరువాతనే అతని ప్రజాస్వామ్య ప్రాతినిధ్య ప్రభుత్వం ఉదారవాద పునాదులపై నిర్మితమైనది. ఉదారవాద భావాలు ప్రాతిపదికగా ప్రజాస్వామ్య సమాజం ఏర్పడటానికి ఏమైనా అవకాశాలు ఉన్నాయా అనే అన్వేషణే మిల్ ప్రధాన ధ్యేయమైంది. ఏ ప్రభుత్వం అయితే వ్యక్తి స్వేచ్ఛలో అతి తక్కువ జోక్యం చేసుకుంటుందో ఆ ప్రభుత్వం ఉత్తమ ప్రభుత్వం అని మిల్ అభిప్రాయం.

## 10.11 నమూనా ప్రశ్నలు

1. జె.యస్.మిల్ రాజనీతి తత్వ విచారమును వివరించుము.
2. మల్ ఉపయోగితావాద సిద్ధాంతమును విశ్లేషించుము.
3. ప్రాతినిధ్య ప్రభుత్వం పై మిల్ అభిప్రాయాలు.

## 10.12. చదువదగిన గ్రంథాలు :


| | |
|---|---|
| Sabine | A History of Political Theory |
| Bowle | Western Political Movement |
| J.S. Mill | On Liberty |
| డా॥ వి. కృష్ణారావు | పాశ్చాత్య రాజనీతి తత్వ విచారం |
| డా॥ యం.వి. సుబ్బారావు | ఆధునిక పాశ్చాత్య రాజనీతి తత్వ విచారము |

# హెగెల్

## 11.0 లక్ష్యం :

ఈ పాఠాన్ని అధ్యయనం చేసిన తరువాత విద్యార్థులు ఈ క్రింది విషయాలు తెలుసుకుంటారు

* ఆదర్శవాదం అనగానేమి?
* హెగెల్ జీవితం - రచనలు
* హెగెల్ రాజనీతి పరిశీలన పద్ధతి
* హెగెల్ రాజ్య సిద్ధాంతం
* ఆధునిక అధికారయుత వాదానికి ఆద్యునిగా హెగెల్
* ప్రభుత్వం, శాసన సభలు, కార్యనిర్వాహక వర్గము మొ॥
* వాటిపై హెగెల్ యొక్క భావాలను గురించి సవివరంగా వివరించగలుగుతారు.

## విషయసూచిక :

11.1 పరిచయం
11.2 ఆదర్శ వాదం
11.3 హెగెల్ జీవితం
11.4 హెగెల్ రాజనీతి పరిపాలనా పద్ధతి
11.4.1 హెగెల్ గత తార్కికము
11.4.2 సమన్వయము
11.5 హెగెల్ రాజ్య సిద్ధాంతం
11.6 ఆధునిక అధికారయుత విధానాలకు ఆద్యుడుగా హెగెల్
11.7 జాతీయ సార్వభౌమత్వం పై హెగెల్ భావాలు
11.8 ప్రభుత్వం పై హెగెల్ భావాలు
11.9 శాసనసభల పై హెగెల్ అభిప్రాయం
11.10 పాలక వర్గం పై హెగెల్ అభిప్రాయం

11.11 స్వేచ్ఛ పై హెగెల్ భావన
11.12 హెగెల్ సిద్ధాంతం పై విమర్శ
11.13 హెగెల్ విశిష్ఠత
11.14 సారాంశము
11.15 నమూనా ప్రశ్నలు
11.16 చదువదగిన గ్రంధాలు

## 11.1 పరిచయం :

రాజ్యాధికారము, దాని స్వభావము మొదలగు అంశాలను గురించి చర్చించిన సిద్ధాంతాలలో ఆదర్శవాద సిద్ధాంతం ప్రధానమైనది. ఈ సిద్ధాంతానికి ప్లేటో, అరిస్టాటిల్ వంటి ప్రముఖ ప్రాచీన తత్వవేత్తలు తమ రచనలలో నాంది ప్రస్తావన చేసిరి యూరప్‌లో 18 వ శతాబ్దంలో ప్రాచుర్యంలోనికి వచ్చిన ఉపయోగితావాదం అనేక సమస్యలకు సమాధానం చెప్పలేకపోయింది. అటువంటి స్థితిలో సాంఘీక జీవనంలోని లోపాలకు శాస్త్రీయమైన వివరణలు కావాలని భావించబడినది. ఇటువంటి పరిస్థితులలో ప్లేటో,అరిస్టాటిల్ భావాలు జర్మనీలో క్రొత్తరూపం ధరించాయి. కాంట్, హెగెల్, ఫీచ, హంబోల్ వంటి తత్వవేత్తలు రాజనీతి తత్వాన్ని ప్రభావితం చేసే ఆదర్శవాన్ని ప్రతిపాదించిరి. England లో గ్రీన్, బ్రాడ్లే, బొసాంకె మొ॥ శాస్త్రవేత్తలు ఆదర్శవాదాన్ని పునరుద్దించి, ఆక్స్‌ఫర్డ్ నూతన ఆదర్శవాదులుగా ప్రసిద్ధిచెందిరి.

ఆదర్శవాదాన్ని రకరకాల పేర్లతో పిలిచిరి. అయితే ఆదర్శవాదం ప్రతిపాదించిన మరియు శాస్త్రవేత్తలు యిచ్చిన వివరణలు పదజాలం, దృక్పధం వేరువేరుగా ఉన్నప్పటికి వారి మౌలికసూత్రాలు, సాధారణ లక్షణాలు సమానంగా ఉన్నాయి. ఆదర్శవాదాన్ని బొసాంకే "రాజ్యతాత్విక సిద్ధాంతం" అన్నాడు. జోడ్ దానిని "సంపూర్ణ అధికార సిద్ధాంతము" అని పేర్కొన్నాడు. హాబ్ హౌస్ "ఆది భౌతిక రాజ్య సిద్ధాంతము" అని వ్యవహరించాడు. అటువంటి ఆదర్శవాద సిద్ధాంతాన్ని హెగెల్ మరియు గ్రీన్‌లు విపులంగా చర్చించారు.

## 11.2 ఆదర్శవాదం :-

పురాతన గ్రీకులు రాజ్యం యెడల ఉద్వేగపూరితమైన భక్తి ప్రపత్తుల్ని ప్రదర్శించారు. వారికి రాజ్యమే సర్వస్వమూ, రాజ్యము అవసరం లేకుండా జీవించే వ్యక్తి దైవమన్నా అయి ఉండాలి లేదా పశువైనా అయి ఉండాలి కాని మానవుడు కానేరడు అని అరిస్టాటిల్ అన్నాడు. పెరిక్లీజ్ తన 'దహన సంస్కారోపన్యాసం' లో (Funeral Oration) రాజ్య సంరక్షణలో ప్రాణాలు కోల్పోయిన ఎందరో సైనికుల్ని ఆదర్శప్రాయులైన దేశభక్తులుగా కీర్తించి అలాంటి దేశభక్తి ప్రజలలో ఉన్నంతకాలం రాజ్యంలో అస్థిత్వానికి ప్రమాదం లేకుండా ప్రజలందరికి అర్ధవంతమైన జీవనం సాధ్యమవుతుందని, రాజ్య రక్షణలో ప్రాణాలు కోల్పోయిన అమర వీరులకు జోహారులర్పించారు. ఆదర్శ ప్రాయమైన ధర్మబద్ధమైన నైతిక జీవనం రాజ్యంలోనే సాధ్యమని, రాజ్యం వ్యక్తి యొక్క విరాట స్వరూపమేనని, అది అత్యున్నతమైన నైతిక వ్యవస్థ, అనే నైతికత మానవ జీవన సారమైనట్లయితే అది రాజ్య వ్యవస్థలోనే సాధ్యమై పరిపూర్ణం చెంది సార్ధకమవుతుందని ప్లేటో తాత్వీకరించారు.

18 వ శతాబ్దంలో జర్మనీలో ఆదర్శవాదం అంకురించినది. ఆ కాలంలో ప్రబలంగా ప్రచారంలో ఉన్న లాల్. హ్యూమ్ మొ॥ తత్త్వవేత్తలు భావాల్లోని భౌతిక హేతువాదానికి (Materialist Rationation) వ్యతిరేకంగా జర్మనీలో ఆదర్శవాద తత్వం జనించింది. "జ్ఞానోదయం" కాలం (The age of enlightenment) తాత్వికులు రాజ్యంతో సహా మానవ వ్యవస్థలన్న మానవ హేతు (Human Reason) జనతా లేనినదని భావించటాన్ని జర్మని ఆదర్శవాదులు తిరస్కరించారు. ఈ వ్యవస్థలన్ని మానవుని నైతిక స్వభావ జనతాలని జర్మన్ ఆదర్శవాదులు వాదించారు. ఆదర్శవాద సిద్ధాంతము నిరుపేక్ష రాజ్యసిద్ధాంతమని, తాత్విక-పూరిత సిద్ధాంతమని (Philosophical Theory), అది భౌతిక సిద్ధాంతమని (Metaphysical Theory) వివిధ రకాలుగా పేర్కొనవచ్చు. ప్రాచీన గ్రీకు రాజనీతి తత్వం లాగానే ఆధునిక జర్మన్ ఆదర్శవాదం కూడా రాజ్యాన్ని ఒక నైతిక వ్యవస్థగానే భావిస్తుంది. రాజ్యంలో వ్యక్తి విడదీయ వీలులేని భాగం. అతని వ్యక్తిత్వమూ, అస్థిత్వము రాజ్యం యొక్క మనుగడ పైన ఆధారపడి ఉంటాయి. గ్రీకుల వలే జర్మన్ ఆదర్శవాదులు కూడా రాజ్యానికి సమాజానికి కూడా గల భేదాన్ని గుర్తించలేదు. రాజ్యం లేదా సమాజం అత్యున్నతమైన నైతికవ్యవస్థ. మిగిలిన వ్యవస్థలన్నీ వ్యక్తులతో సహా అందులో విడదీయ వీలులేని భాగాలే. రాజ్యం లేకుండ ఏ వ్యవస్థకైన వ్యక్తికైన అస్థిత్వం పూజ్యమే. రాజ్యానికి వెలుపల వ్యక్తి కేవలం నైతిక శూన్యమైన నైరూప్య భావన (Mere Unethical Abstraction) గానే మిగులుతాడు. నిష్పక్షపాతమైన హేతువుకు ప్రతిరూపమే రాజ్యం. రాజ్యం వ్యక్తి నైతిక జీవన పరిరక్షకుడు నిరపేక్ష అధికారం (Absolute Power) దానిసారం. రాజ్యం తనదైన వ్యక్తిత్వము (Personality), ఇచ్ఛ (Will) కలిగిఉండి సర్వశక్తివంతము (Omini Potent), సర్వజ్ఞాని (Ominisent), నాశనం లేనిదిగా (Infalliable) సాక్షాత్కరిస్తుంది. కాబట్టి దాని అధికారం తిరుగులేనిది. వ్యక్తి జీవన పరమార్ధం రాజ్యవిధేయతలోనే సాధ్యమౌతుంది. రాజ్యం దైవేచ్ఛ. రాజ్యధ్యేయం నిరపేక్ష అధికారం గల రాజ్యమే. వ్యక్తి సేవకుడై దాని రక్షణకు ఎల్లెడా సర్వసన్నద్ధుడై ఉండాలి. అతని వ్యా హక్కులు రాజ్యప్రసాదిత రాజ్యానికి వ్యతిరేకంగా వ్యక్తికి ఏహక్కులూ ఉండవు. స్వయం చైతన్యం, స్వయం సమృద్ధత దాని జీవైక గుణాలు. రాజ్యంలో మాత్రమే తన జీవితాన్ని పరిపూర్ణ మొనర్చుకునే వీలుంది. రాజ్యానికి వైరుధ్యమే లేదు.

## 11.3 హెగెల్ జీవితం - రచనలు:-

జాన్ విక్ హమ్ ప్రెడ్రిక్ హెగెల్ ఆగస్టు 1770 లో జర్మనీలో స్టట్‌గార్ట్ పట్టణంలో జన్మించాడు. హెగెల్ తండ్రి స్టట్ గార్ట్ గ్రామర్ స్కూల్ లోను, వెట్టిబర్గ్ ప్రభుత్వంలోను ఉద్యోగం చేసినాడు. స్టట్ గార్డ్ గ్రామర్ స్కూల్ లో విద్యాభ్యాసం చేసినాడు. హెగెల్ 18 వ ఏట మత తత్వ శాస్త్ర అభ్యాసానికి టు బిన్ జెన్ విశ్వవిద్యాలయంలో చేరాడు. ఆ తరువాత జెనా విశ్వవిద్యాలయంలో విద్యార్థిగా చేరి సి.జి. విద్యను అభ్యసించి అక్కడే అధ్యాపకునిగా నియమింపబడినాడు. 1790 హెగెల్ పి. హెచ్. డి. పూర్తి చేసినాడు. 1806 లో ఫ్రాంక్ ఫర్డ్ లోను, బెర్లిన్ లోనూ, అధ్యాపకునిగా పనిచేశాడు. 1806 లో ఫ్రాన్స్‌కు, జర్మనీకి జరిగిన జెనా యుద్ధాన్ని Hegel కళ్ళారా చూశారు. ఆ యుద్ధంలో ఫ్రాన్స్ గెలిచింది. దాంతో ఫ్రెంచి విప్లవాన్ని గురించి, నెపోలియన్ గురించి అభిమానం మెండుగా పెంచుకున్నాడు. Hegel నెపోలియన్ మనిషిరూపంలో చరిత్ర చోదశక్తిగా (An embodiment of Historical Force) భావించారు. 1816లో హైడల్ బర్గ్ విశ్వవిద్యాలయంలో తత్వశాస్త్రాచార్యుడుగా చేరాడు. ఈ కాలంలోనే Hegel ఎన్నో తత్వశాస్త్ర గ్రంధాలు రచించారు. తన "ది ఫెనామినాలజీ ఆఫ్ స్పిరిట్" ను 1807 లోనూ "ఆబ్‌జెక్టివ్ లాజిక్" ను 1812 లోనూ "సబ్‌జెక్టివ్ లాజిక్" 1816 లోనూ "ఎన్‌సైక్లోపీడియా ఆఫ్ ఫిలాసాఫికల్ సైన్స్" ను 1817లోనూ ప్రచురించారు. ఈ గ్రంథాలు అతనికి జర్మనీలో ఎంతో పేరు ప్రఖ్యాతులు సంపాదించి పెట్టాయి. దానితో బెర్లిన్ విశ్వవిద్యాలయము ఆయనను తత్వశాస్త్రాచార్యుడిగా ఆహ్వానించింది. 1821లో తన "ఫిలాసఫీ ఆఫ్ రైట్" ను ప్రచురించాడు. 1823-27 మధ్య కాలంలో "ఈస్థటిక్ ఫిలాసఫీ ఆఫ్ రిలిజీయన్" అనే గ్రంథాలు రచించాడు. ఈ గ్రంధాలలో Hegel జర్మన్ ఆదర్శవాదాన్ని సాంప్రదాయాన్ని అత్యున్నత శిఖరాలకు చేర్చి తాను బతికుండగానే ఎందరో యువ మేధావుల్ని ఆకర్షించి తన అనుయాయులిగా చేసుకుని జర్మనీలో స్థిరదైన

ప్రత్యేక తాత్విక సాంప్రదాయానికి ఆకర్షితుడైన ప్రముఖుల్లో మార్క్స్ ఒకడన్న సంగతి మనకుతెలిసిందే. ప్రష్యారాజ్య ఆస్థాన తాత్వికుడిగా నియమింపబడ్డాడు. కొన్నాళ్ళ పాటు బెర్లిన్ లోనూ ఒక వార్తాపత్రిక సంపాదికునిగా వ్యవహరించాడు. ఇతడు రచించిన "సైన్స్ ఆఫ్ లాజిక్" అనే గ్రంథం తత్వశాస్త్ర విద్యార్థులకు ప్రమాణ గ్రంథం Hegel. 1831 లో కలరా వ్యాధిసోకి తన 55వ యేట మరణించాడు.

## 11.4 Hegel రాజనీతి పరిశీలనా పద్ధతి:-

రాజనీతి పరిశీలనకు ఆంగ్లేయ వేదాంతులు పరిశీలనా పద్ధతిని హెగెల్ నిరసించాడు. అనుభవము, పరిశీలన, విషయ సంకలనము, జ్ఞానసముపార్జనకు తాత్కాలిక సిద్ధాంత నిర్మాణానికి సహకరిస్తాయిని ఆంగ్లేయ మేధావులు భావించినారు. కాని హెగెల్ అనుభవపూర్వక (Empirical) పద్ధతిని నిరసించి జ్ఞానసముపార్జన కోసం అమూర్తమైన హేతువు (Abstract, reason) పై ఆధారపడినాడు. చారిత్రక పద్ధతికి (Historical Method) ఎక్కువ ప్రాధాన్యమిచ్చినాడు. చరిత్రను సరిగా అధ్యయనం చేస్తే నిష్పాక్షిక విమర్శకు సహకరించే సూత్రాలు లభిస్తాయి. సత్యాన్ని అసత్యం నుంచి ప్రాధాన్యతను అల్ప నుంచి, శాశ్వతాన్ని అశాశ్వతం నుంచి, వాస్తవికతను అవాస్తవికతనుంచి వేరు చేసే విచక్షణా జ్ఞానం చారిత్రక పరిశోధన వలన కలుగుతుంది. ఈ అధ్యనానికి ప్రత్యేకమైన మేధా సంపత్తి కావలె. చారిత్రక పరిణామాన్ని అర్థం చేసుకోవాలంటే విశ్లేషణ శక్తి (Power of Analysis) చాలదు. అంతకన్నా ఉన్నతమైన మేధాశక్తి కావలె. ఈ ఉన్నతమైన మేధాశక్తి రెండు విషయాల వలన సమకూరుతుంది. మొదటిది అవగాహన (Understanding). రెండవది హేతువు (Reason). అవగాహన సజీవ ప్రపంచాన్ని యావత్తు అధ్యయనం చేసేందుకు వీలుగా అనేక భాగాలుగా విశ్లేషిస్తుంది. హేతువు ఈ భాగాలలోకి చొచ్చుకొనిపోయి ఈ భాగాలను సృష్టించి, నియంత్రణ చేసే అంతర్గతమైన శక్తులను పరిశోధిస్తుంది. అవగాహన హేతువుల మేలుకలయిక ఫలితంగా చారిత్రక పరిణామ తర్క వివరణ సులభగ్రాహ్యమవుతుంది. భవిష్యత్తులో రానున్న విషయాలను కచ్చితంగా నిర్ధారణ చేయలేకపోయిన, సుమారు అవి ఏ దశలో సంభవించనున్నవో గ్రహించడానికి ఈ ఉన్నత మేధాసంపత్తి సహకరిస్తుందని Hegel భావించినాడు.

### 11.4.1. హెగెల్ గత తార్కికము:

తార్కిక, వివేచనా క్రమంలో హేతువు కృషి చేస్తుందనే సిద్ధాంతం హెగెల్ తత్వ విచారంలో అతి ప్రధానమైనది. యిదే విశ్వజనీనమైన గత తార్కికము. అందుకు చర్చ, వాగ్వివాదము సహకరిస్తాయి. ప్రత్యర్థుల వాదన, ప్రతివాదనలను చర్చించడము ద్వారా యదార్ధ నిర్ణయం జరుగుతుంది. ప్లేటో (Plato) సంవాదాలలో ప్రజలు అర్థరహిత ప్రసంగాలలోని, మూఢనమ్మకాలలోని లోపాలను ఎత్తి చూపేందుకు సోక్రటీస్ (Socrates) గత తార్కిక విధానాన్నే అనుసరిస్తాడు. స్వచ్ఛమైన హేతు ప్రపంచం (World of Pure Reason) అనంతమైనది., నిశ్చలమైనదని రుజువు చేయడానికి సుప్రసిద్ధ గ్రీకు తత్వవేత్త ప్లేటో గత తార్కిక విధానాన్నే వినియోగిస్తాడు. ఈ ప్రపంచం పరిణామరహితమైనది, స్థిరమైనది. కాని హెగెల్ గత తార్కిక వాదం స్వచ్ఛమైన ఆలోచన ప్రపంచం (World of Pure Thought), అంతిమ వాస్తవిక ప్రపంచం (World of Ultimate Reality) స్థిరమైనది, కఠినమైనది, నిశ్చలమైనది కాదని రుజువు చేయడాన్నే ఉదిష్టమైంది. స్వచ్ఛమైన హేతువు స్వభావసిద్ధంగా తనను తానే బహిర్గతం (unfold) చేసుకొంటూ అభివృద్ధి చెందుతుంది, మార్పు, పెరుగుదల, అభివృద్ధి, పరిణామము భ్రమలు కావు. హేతువు యొక్క ప్రగతి (Movement of Reason) గత తార్కికమని హెగెల్ భావించినాడు. యిది సత్యాన్ని సమీపించేందుకు సహకరించే సాంకేతిక సాధనము. యిది కేవలం వ్యతిరేక విధానాల మధ్య సామరస్యాన్ని చేకూర్చే పద్ధతి. తాటాకు వర్ణన కాదు. గత తార్కికమంటే తక్కువ పరిపూర్ణత నుంచి నిరపేక్షత (Absolute) కు హేతువు పయనించే పరికరం అంతిమ సత్యమే ఈ ?గోపేకిత అందుకు మారమే ఈ గత తార్కికము.

తత్వ శాస్త్రములో ప్రతి విషయాన్ని రుజువు చేయవలె. ఏ విషయాన్ని ముందే ఊహించుకోరాదు. ప్రతి విషయాన్ని తీర్మానించుకోవలె. గత తార్కికంలో సమాప్తంలేని వ్యర్థ వాదోపవాదాలకు తావు లేదు. దీనికి ఒక విధానము, ఒక పద్ధతి, ఒక ఆవశ్యకత, ఒక ముగింపు ఉంటాయి. రేఖా గణితం (Geometry) లోని కఠినమైన విధానాన్ని తత్వశాస్త్రం కూడా అవలంబించినట్లయితే, తత్వశాస్త్రంలోని నిర్ణయాలు నిర్దిష్టంగాను ఉంటాయని స్పినోజా (Spinoza) డేకార్టే (Desceartes) లు భావించారు. హెగెల్ కూడా వారి అభిప్రాయంతో చాలా వరకు ఏకీభవించినాడు. ఒక త్రిభుజంలో 3 కోణాలు మొత్తానికి సమానము అన్న ప్రతిపాదన నిర్దుష్టమైనది. ఏ దేశంలోనైనా, ఏ కాలంలోనైనా ఈ ప్రతిపాదనకు తిరుగులేదు. అందువల్ల ఈ ప్రతిపాదన విశ్వజనీనంగా ఆమోదింపబడిన సత్యము అందులో అభిప్రాయ భేదాలకు తావులేదు. కాని యితని అభిప్రాయములో రేఖాగణితము, కఠిన విధానాలను తత్వశాస్త్రంలో అవలంబించేందుకు రెండు ముఖ్యమైన అభ్యంతరాలు ఉన్నాయి. మొదటిది రేఖాగణితము స్వయం సిద్ధాంతాలు పై ఆధారపడి ఉంటుంది. స్వయం సిద్ధాంతమంటే తనకు తానే వివరించుకొనే సత్యం (Self-evident truth). ఈ స్వయం వివరం సత్యము తార్కికంగా రుజువైనది కాదు. అందువల్ల యిటువంటి సత్యము మూఢ విశ్వాసం కావచ్చు. పరిశీలించని అభిప్రాయం కావచ్చు. కాన నిర్దుష్టమైనది, వివాదాతీతమైనది కానేరదు. రెండోది, రేఖాగణితము అవగాహనకు సంబంధించినది. యిందులో వ్యతిరేకాలే (opposites) పూర్తిగా ఒక దానితో నొకటి సంబంధం లేకుండా ఉంటాయి. అంటే ఒకదానిలో ఉండే లక్షణాలు యింకొక దానిలో ఉండవు. (Mutually exclusive) హేతువు అవగాహన నుంచి విభేదిస్తుంది. హేతువు వేరు, అవగాహన వేరు. హేతువు అవగాహనకు సహకరిస్తుంది. కాని హేతువు అవగాహన కాదు. హేతువు వ్యతిరిక్తాలలో ఏకత్వాన్ని గుర్తిస్తుంది. అవగాహన వివిధ విషయాల మధ్య ఉన్న భిన్నత్వాలను వివరించి స్పష్టపరుస్తుంది. అందువల్ల అవగాహన కూడా అవసరమైనదే,. కాని చాలదు (Understanding is necessary but not sufficient) అవగాహనకు హేతువు ఒక కూడినప్పుడు అంతిమ సత్యాన్ని చేరుకొనే మార్గం లభిస్తుంది. అవగాహన, హేతువు కలయిక గత తార్కికము.

### 11.4.2. సమన్వయము:

చరిత్రలో హేతువు వాదము, (Thesis) ప్రతివాదము (Anti-thesis) సంశ్లేషనము (Syntesis) అనే 3 స్థాయిల్లో పయనిస్తూ ఉంటుంది. వాదము ఒక విషయాన్ని గురించి ప్రస్తావిస్తుంది. సంశ్లేషణము వాద, ప్రతివాదముల సమన్వయము. సంశ్లేషణములో వాద ప్రతివాదాలలోని వ్యత్యాసాలు నిర్మూలమవుతాయి. సంశ్లేషణము యింకొక వాదం కావచ్చు. ఈ వాదంలోని లోపాలను ప్రతివాదము ఎత్తి చూపుతుంది. సంశ్లేషణ ఈ వాద ప్రతివాదనలోని వ్యత్యాసాలను నిర్మూలిస్తుంది. ఈ సంశ్లేషణ యింకొక వాదము. ఈ వాదానికి ప్రతివాదం ఈ రెండింటికి సంశ్లేషణం. యిది ఒక ప్రక్రియ. ఈ ప్రక్రియ అనంతము, హేతువు ఈ ప్రక్రియ ద్వారా అనంత సత్యాన్ని చేరే దాకా పయనిస్తుంది. యిక్కడ ఒక ముఖ్య విషయాన్ని గమనించవలె. సంశ్లేషణ వాద ప్రతివాదనలోని అసత్యాన్ని అల్పాన్ని, అశాశ్వితత్వాన్ని, అవాస్తవికతను విసర్జించి, సత్యాన్ని ప్రాధాన్యతను, శాశ్వతత్వాన్ని వాస్తవికతను భద్రపరుస్తుంది. ఈ వాద ప్రతివాద, సంశ్లేషణా ప్రక్రియ ద్వారా ఆదర్శము (Ideal) ఒక స్థాయి నుండి ఉన్నత స్థాయికి ఉత్పన్నమౌతుంది. ఈ పరిణామ ప్రక్రియలో విలువైనదేదీ నష్టపోదు. అంతిమ సంశ్లేషణ చరిత్రలోని అన్ని దశలలోని వాస్తవికతను భద్రపరుస్తుంది. ఈ దశలన్నీ అంతిమ సంశ్లేషణలో మిశ్రితమై పోతాయి.

### 11.5. హెగెల్ రాజ్య సిద్ధాంతము:

హెగెల్ తన రాజ్య సిద్ధాంతాన్ని కూడా గతతార్కిక సిద్ధాంతం ఆధారంగానే ప్రతిపాదించారు. మానవ సమాజం మొదట కుటుంబ వ్యవస్థగా, తరువాత పౌరసమాజంగా, అటు తరువాత రాజ్యంగా ఏర్పడి పరిపూర్ణత సాధిస్తుంది. మానవ సమాజం గత తార్కికాభివృద్ధి క్రమములో కుటుంబ వాదంగా దర్శనమిస్తుంది. కాని దానిలో యింకా అపరిపక్వ లక్షణాలే ఉంటాయి. అది

మానవుని అవసరాలన్నీ తీర్చగలిగిన శక్తి గలది గాదు. అందుకే అది తన ప్రతివాదమైన పౌర సమాజాన్ని (Civil Society) తనలో నుండే సృష్టించుకుంటుంది. తన కాలంలో దర్శినమిచ్చిన బూర్జువా సమాజం ఒడంబడిక, పరస్పర పోటీ ఆధారంగా ఏర్పండిందేననీ, ఐక్యత పరస్పర ప్రేమానుసారంగా ఏర్పడిన కుటుంబమనే హేతువానికి, పరస్పర పోటీసారంగా ఏర్పడిన బూర్జువా సమాజమునే ప్రతివాదానికి ఏర్పడిన వైరుధ్యాల ఫలితమే జాతి రాజ్యమని, యిది సమన్వయమని హెగెల్ సిద్ధాంతీకరించారు. దీనిసారం విశ్వజనీనతే, కుటుంబంలోనూ, పౌర సమాజంలోనూ, హేతుశీల గుణాలున్న మాట నిజమే కాని అవి రాజ్య ఆవిర్భావంతోనే పరిపూర్ణ హేతువుగా రూపుదిద్దుకుంటాయి.

రాజ్యం కేవలం మానవ సమూహాల కూటమి కాదు. అది హెగెల్ ఉద్దేశ్యంలో అంగాంగి ఏకత్వం గల పరిపూర్ణ హేతురూపం, వ్యక్తులు చిన్న చిన్న సంస్థలు అందులో విడదీయ వీలులేని అంగాలు మాత్రమే. ఈ అంగాలు మాత్రము రాజ్యంలో భాగంగా మాత్రమే గుర్తింపును, అర్థాన్ని సంతరించుకుంటాయి. నిర్ద్వంద్వమైన రాజ్య విధేయతే వీటి అస్థిత్వ పరమార్థం. రాజ్యం సామాజిక ఒడంబడిక వాదము పేర్కొన్నట్లు సమాజ హక్కులు కలిగిన మానవులు ఏర్పరచుకున్న వ్యవస్థ కాదు. హెగెల్ భావనలో వ్యక్తికి రాజ్యం వెలుపల అస్థిత్వమే లేదు.

రాజ్యం హెగెల్ భావనలో "ప్రత్యక్ష దైవమే" (The actual god). అందుకే దీనిపై నైతికపరమైన, శాసనపరమైన ఏ ఆంక్షలు ఉండవు. నిజానికి నైతిక విలువలూ, శాసనాలూ, సృష్టించేది రాజ్యమే. మంచి ఏదో, చెడు ఏదో, తప్పు ఏదో, ఒప్పు ఏదో నిర్ణయించగలది పరిపూర్ణ హేతు రూపమైన రాజ్యమే. సహజ న్యాయం (Natural Law) కూడా రాజ్యాని కన్నా సమున్నతమైనదేవీ కాదు. వ్యక్తి అనుభవించే నిజమైన స్వేచ్ఛ రాజ్య ప్రసాదితమే. వ్యక్తులందరిలోనూ, వ్యక్తిత్వం, స్వేచ్ఛా సారాన్ని పీల్చుకుని అత్యున్నతమైన వ్యక్తిగా, అత్యున్నతమైన స్వేచ్ఛా ప్రదాయినిగా రాజ్యం ప్రదర్శితమౌతుంది. హెగెల్ భావనలో రాజ్యం "A self - know king and self - actualising individual" రాజ్యంలో భాగంగా మాత్రమే వ్యక్తి కుటుంబం, పౌరసమాజము తమతమ పరిపూర్ణ లక్ష్యాలను, రక్షణను సాధించుకోగలవు. రాజ్యం సర్వశక్తివంతమూ (Ommipotent), సర్వజ్ఞాని (Ommiscent), నిరక్షేపమూ (Absolute), శాశ్వతమూ (Infalliable), సర్వవ్యాప్తి (Ommipresent) అయిన పరిపూర్ణ హేతువుకు రూపమూ, సారమూనూ, రాజ్యం భూమిపై దేవదేవుని మహాప్రస్థానమే (The march of God on Earth) అని హెగెల్ సిద్ధాంతీకరించాడు.

రాజ్యశాసనాలను ఆమోదించడం ద్వారా మాత్రమే వ్యక్తి నిజమైన స్వేచ్ఛను పొందుతాడు. రాజ్యం దైవేచ్ఛకు రూపం కాబట్టి అది దివ్యమైనది.

రాజ్యం భౌతికంగా సంస్థలు (Associations), సంఘాలు (Corporation), వృత్తి సంఘాలు (Guids) ఎక్కువ సమూహారము కాని వ్యక్తుల సమూహం మాత్రం కాదు. ఈ సంస్థలే వ్యక్తి నైతిక జీవనానికి మూలం. అది రాజ్యములో పరిపూర్ణం చెందుతుంది. ఈ వ్యవస్థలే వ్యక్తికి రాజ్యసభ్యత్వం కొరకు తర్ఫీదునిస్తాయి.

రాజ్యానికి, వ్యక్తికి వైరుధ్యం లేదు. రాజ్యమనే, మాధ్యమం (Medium) ద్వారానే వ్యక్తికి జీవనసాఫల్యం చేకూరుతుంది. రాజనీతి, వ్యక్తినీతికి, రాజాత్మకు, వ్యక్తి ఆత్మకు విడదీయరాని అంగాంగి సంబంధముంటుందని హెగెల్ పేర్కొన్నారు. పౌరుల సామాజిక నైతిక జీవనాన్నే రాజ్యం ప్రతిబింబిస్తుందని అన్నాడు హెగెల్.

## 11.6. ఆధునిక అధికారయుత వాదాలకు ఆధ్యుడుగా హెగెల్:

హెగెల్ ప్రతిపాదించిన రాజ్య సిద్ధాంతం ఆధునిక అధికారయుత వాదాల ఆవిర్భావానికి నాంది పలికింది. చిదాత్మజాత - రాజ్యం (Nation-state) లోనే పరిపూర్ణం చెందుతుందని, జాతి - రాజ్యంగా ఆవిర్భవించిన సమాజంలోని పౌరులే నిజమైన స్వేచ్ఛను, పరిపూర్ణమైన నైతిక జీవనాన్ని అనుభవించే వీలుటుందని ఈ సిద్ధాంతం పేర్కొంది. అవి ప్రాచ్యనిరంకుశతత్వం (Oriental Despotism) లో సాధ్యం కాలేదు. దీనికి కారణం ప్రాచ్య నిరంకుశతత్వంలో కేవలం ఒక్కడే (నిరంకుశ ప్రభువు) స్వేచ్ఛను కలిగి ఉండటమే. పురాతన గ్రీసులో కూడా పరిపూర్ణమైన రాజ్యం ఏర్పడలేదు. దీనికి కారణం అందరికి స్వేచ్ఛ ఉందని గ్రీకులు భావించడమే. "ప్రాచ్య నిరంకుశతత్వం" గ్రీకు ప్రజాస్వామ్యం ఒకదానికొకటి విరుద్ధమైన వాద, ప్రతివాదాలైతే, ఈ రెంటిలోనూ అసంగతాలను తొలగించి, ఏర్పడిన సమన్వయమే "రాజ్యంగ బద్ధ రాజరికం" (Constitutional Monarchy). మానవ చరిత్రలో అలాంటి సమన్వయము జర్మన్ జాతిలోనే ఏర్పడిందని, చిదాత్మ జర్మన్ జాతిలోనే పరిపూర్ణం చెంది జాతిరాజ్యంగా ఏర్పండిందని హెగెల్ తాత్వీకరించాడు. అలా పరిపూర్ణంగా ఏర్పడిన రాజ్యమే దివ్యమైనదనీ, సర్వశక్తివంతమైనదనీ, సర్వజ్ఞాన అని భూమిపై ఏర్పడిన దైవస్వరూపమని, హేతువు అని హెగెల్ రాజ్యాన్ని విపరీతముగా పొగిడారు. దాని అధికారం ఆంక్షలులేని నిరపేక్ష అధికారమే. రాజ్యం ఆదర్శవంతమైన వ్యవస్థ. రాజ్యాన్ని తన మార్మిక సిద్ధాంతం ద్వారా ఔన్నత్యాన్ని ఆపాదించి విమర్శలకు అతీతమైన వ్యవస్థగా సిద్ధాంతీకరించాడు. అంతర్జాతీయ న్యాయసూత్రాలు కూడా దానిపై ఆంక్షలు విధించలేవు.

హెగెల్ ప్రతిపాదించింది అధికారయుత రాజ్య సిద్ధాంతమేనని చెప్పనవసరం లేదు. చరిత్రలో జర్మన్ జాతి రాజకీయానుభవానికి హేతుబద్ధతను ఆపాదించి, ఆదర్శవంతమైన జాతిగా ప్రతిపాదించడమే యితని తాత్విక లక్ష్యంగా గోచరిస్తుంది. ఈ ప్రయత్నంలో హెగెల్ అధికరయుత వాదానికే తాత్విక గౌరవ ప్రతిష్టలు కల్పించారు.

ఆయన తన రాజ్య సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన నాటి నుంచి ప్రపంచ రాజకీయాలపై ముఖ్యంగా జర్మన్ రాజకీయ జీవనంపై అది చూపిన ప్రభావం అపారం. ఆధునిక రాజకీయ గతిని యింతగా ప్రభావితం చేసిన సిద్ధాంతం మరొకటి లేదంటే అతిశయోక్తి కాదు.

20వ శతాబ్దంలో ఆవిర్భవించిన అధికారయుత వాదాలు, ఫాసిజం, నాజీయిజం హెగెలియన్ తత్వ ప్రభావితాలే. ఈ వాదనలోనే జాతీయతాభావం అంతర్జాతీయ న్యాయాన్ని కూడా త్రోసిరాజని ఉన్మాద పూరితమైన యుద్ధ తాత్వాన్ని ప్రభోదించింది. జాతి రాజ్య సిద్ధాంతాన్ని ఫాసిజం ఆదర్శీకరించి అధికారయుత అప్రజాస్వామిక తత్వంగా మలచింది హెగెల్ సిద్ధాంతాల ఆధారంగానే.

## 11.7 జాతీయ సార్వభౌమత్వంపై హెగెల్ భావలు:

సమాజ సార్వభౌమత్వము హెగెల్ హస్తాలలో తారాస్థాయి నందుకొన్నదని చెప్పవచ్చు. హెగెల్ దృక్పథంలో జాతీయ సార్వభౌమత్వము, మానవత్వం కన్న మహోన్నతమైనది. యిది ఆశ్చర్య జనకము. గత తార్కిక ప్రగతి (dialectical movement) మానవ సమాజాన్ని తార్కికంగా ప్రపంచ ప్రభుత్వానికి చేర్చవలె. కాని యితను ఈ నిర్ణయానికి రాలేదు. అతని అభిప్రాయంలో జాతీయ సార్వభౌమత్వం కన్నా ఉన్నతమైనదేదీ లేదు. జాతీయ సార్వభౌమత్వమే పరిణామ పర్యవసాన అంతిమ లక్ష్యం. అందువలన జాతీయ సార్వభౌమత్వము ఏ ఉన్నత శక్తికి లోబడి ఉండదు. శాసనాలను నీతులను, మతాన్ని సృష్టించే నిజమైన సృష్టికర్త జాతీయ రాజ్యమే. సాంస్కృతిక చరిత్ర జాతీయ సాంస్కృతిక చరిత్ర సమ్మేళనము జాతీయ రాజ్యంలోనే సృజనాత్మక వ్యక్తి వివేచనాత్మకంగా ప్రకటితమవుతుంది. జాతీయతను రాజ్యాన్ని ఆదర్శవంతం చేయడమే హెగెల్ రాజనీతి శత్వం విచారంలోని అత్యంత ప్రధానమైన లక్షణము.

ప్రపంచ ప్రభుత్వ వ్యవస్థాపనకు, శాశ్వత ప్రపంచ శాంతికి కాంట్ (Kant) వంటి మేధావులు చేసిన సూచనలను ఈయన నిరసించినాడు. అంతర్జాతీయ న్యాయాన్ని ఒడంబడికలను వ్యతిరేకించిన జాతీయ రాజ్యాలు, అంతర్జాతీయ న్యాయస్థానం కోసం పంక్తులు వలె హాజరు కావలెనని ఫిచ్ (Fichte) చేసిన ప్రతిపాదనలను హెగెల్ పగటికలగా వర్ణించినాడు. హెగెల్ అంతిమ న్యాయనిర్ణేతను గుర్తిస్తాడు. కాని అది అంతర్జాతీయ న్యాయస్థానం కాదు. అది మానవ నిర్మితం కాదు. హెగెల్ దృక్పథంలో అది ప్రపంచ ఆత్మ (Worldspit). అది ప్రపంచ చరిత్ర ద్వారా వ్యక్తమౌతుంది. ప్రతి జాతీయ రాజ్యానికి సార్వభౌమాధికారం ఉంటుంది. వివిధ జాతీయ రాజ్యాల మధ్య సమస్యలు ఉత్పన్నమైతే ఈ సమస్యలను పరిష్కరించే ఉన్నతాధికారి లేడు. అంతర్జాతీయ సమస్యలు మధ్యవర్తి, ఆ జాతీయ సార్వభౌమాధిపతుల అనుమతిపైనే వ్యవహరిస్తుందని గాని, ఆ అధిపతులపై ఉన్నతాధికారి కాజాలడు. సమస్య అపరిష్కృతమైతే యుద్ధం అనివార్యమవుతుంది.

ప్రత్యేక నమ్మకాలు (Particular convictions) ను ప్రోత్సహించే వారిని శిక్షించే హక్కు రాజ్యానికుందని హెగెల్ భావించాడు. అంటే భిన్నమైన ఆలోచనా విధానాన్ని అణచివేసే అధికారం రాజ్యానికి ఉందని గ్రహించవలె. ప్రత్యేక నమ్మకాలకు ప్రచారం వచ్చినట్లయితే రాజ్యపు పునాదులు కదలిపోతాయి. విశ్వజనీనత క్షీణిస్తుంది. అందువలన రాజ్యం ఉనికికి ప్రమాదం కలిగించే విమర్శలను, ఉద్యమాలను అణిచివేసే అధికారము రాజ్యానికి ఉందని అతను వాదించాడు. హెగెల్ దృక్పథంలో ఏది వాస్తవమైనదో, అదే వివేచనాత్మకమైనది. రాజ్యం వాస్తవమైనది. అందువలన అది వివేచనాత్మకమైనది. అది విమర్శకు అతీతమైనది. రాజ్యన్ని తాత్వికంగా సమర్థించడమే హెగెల్ ముఖ్య ఉద్దేశ్యము. హెగెల్ ఉద్దేశ్యాన్ని జర్మన్ రాజకీయ జీవితము, ఆలోచనా విధానము ధృవపరుస్తాయి.

## 11.8 ప్రభుత్వం పై హెగెల్ భావాలు:

Hegel, Monlesquieu అధికార విభజనను అంగీకరించి, పునర్ వ్యాఖ్యానించి, సరిదిద్దుతాడు. శాసనసభ, పాలక వర్గం న్యాయ శాఖల మధ్య ప్రభుత్వాధికారాల మధ్య విభజించినట్లయితే, ప్రతిశాఖ యితర శాఖల ఆధిపత్యం నుంచి తన అధికార పరిధిని రక్షించుకొంటుంది. ఈవిధంగా ఏ ఒక్క శాఖకు నిరపేక్షాధికారాలు లభించవు. ఈ అధికార విభజన, ఈ విభజన లక్ష్యం కూడా హెగెల్‌కు సమ్మతమే. కాని యితని దృక్పథంలో ఈ విభజనకు ఒక పరిమితి ఉండవలెను. లేకపోతే ఈ 3 శాఖలు ఒక దానితో ఒకటి సంబంధం లేకుండా స్వతంత్రించి వ్యవహరిస్తాయి. అప్పుడు రాజ్యమే రద్దయిపోతుంది. నిరపేక్ష అధికార విభజన, అరాచకానికి దారితీస్తుంది. భిన్నత్వం వెనుక ఏకత్వం ఉండవలె. ఈ మూడు శాఖల కార్యనిర్వాహణలను సమన్వయం చేసే అంగము (Organ) యింకొకటి ఉండవలె. ఈ అంగం మూడు ప్రభుత్వాంగాలకు ఉన్నతమై ఉండవలె.

శాసనసభ, పాలకవర్గం న్యాయశాఖల మధ్య అధికారాలను సమానముగా మాంటిస్క్యూ విభజించినాడు. ఈ విభజన స్థానంలో హెగెల్ నూతన అధికార విభజనను ప్రవేశపెట్టినాడు. హెగెల్ అధికారాలను శాసనసభ, పాలకవర్గం, చక్రవర్తుల మధ్య విభజించినాడు. శాసనసభ పాలకవర్గం ఒకదాని ఆధిపత్యం నుంచి యింకొకటి రక్షించుకుంటాయి. కాని ఈ రెండు శాఖల కార్యనిర్వాహణ చక్రవర్తి సమన్వయం చేస్తాడు. శాసనసభ రాజ్యంలోని విశ్వజనతకు ప్రతినిధ్యం వహిస్తుంది. పాలకవర్గం శాసనాలను వ్యక్తిగత వివాదాలలో అమలు పరుస్తుంది. యిక్కడ ఒక ముఖ్య విషయాన్ని గమనించవలె. న్యాయశాఖ, పాలకవర్గంలోని భాగము, శాసనసభ, పాలకవర్గం విధులలో పాల్గొంటూ, ఈ రెండింటిని కార్యనిర్వాహణకు చక్రవర్తి సమన్వయపరుస్తాడు. ఈ 3 ప్రభుత్వాంగాలు ప్రజాస్వామ్యాన్ని, కులీన పాలననూ, రాజరికాన్ని సూచిస్తాయి. బహు సంఖ్యాకుల పాలన ప్రజాస్వామ్యము, కొద్దిమంది పాలన కులీన పాలన, ఒక్కరి మహోన్నత పాలన రాజరికము.

## 11.9 శాసనసభపై హెగెల్ అభిప్రాయం:

ప్రభుత్వాంగాలలో శాసనసభ ఒకటి. అది శాసనాలను అభివృద్ధి పరచి, క్రొత్త పరిస్థితులకు అనుగుణంగా సరిదిద్దుతుంది. శాసనశాఖలో రెండు సభలు ఉంటాయి. ఒకటి భూస్వాములతోను, రెండవది వృత్తి. అందరికీ ఓటు హక్కు ఉండడాన్ని హెగెల్ వ్యతిరేకించాడు. ఎక్కువ మంది అజ్ఞానులు కనుక వారికి ఓటు హక్కు ఉపయోగించుకోవడములో, ఉత్సాహము ఉండదు. కొద్దిమంది చేతులలో అధికారం కేంద్రీకృతం కాకుండా ఉండాలంటే ప్రజలను వర్గాలుగాను, కార్పొరేషన్‌లుగానూ, వ్యవస్థీకరించాలి. శాసనసభలో వీటికి ప్రాధాన్యత ఉండాలి.

## 11.10 పాలకవర్గం పై హెగెల్ అభిప్రాయం:

హెగెల్ పాలకవర్గం కేవలం ఒక పరిపాలనా క్రమము (Administrative hierarchy). ఈ పరిపాలనా క్రమంలో మంత్రులే గాక, పౌర ఉద్యోగులు అందరూ ఉంటారు. ఈ పరిపాలనా క్రమములో న్యాయాధికారులు, రక్షణశాఖాధికారులు కూడా ఉంటారు. పాలకవర్గం ప్రభుత్వ వ్యవహారాలను క్రమబద్ధం చేయవలె. శాసనాలు సాధారణంగాను (simple) పరిమితం (Few) గాను ఉండవలె. వీటిని నిర్ణీత సందర్భాలలో అమలుజరిపే అధికారం పాలకవర్గానికుండవలె. వివరాలు పాలకవర్గంచే నిర్ణయం కావలె. అంటే నియోజిత శాసన నిర్మాణాధికారము Deligated Ligislation ఉండవలెనని భావము. విత్తపాలనలో పాలక వర్గానికి స్వేచ్ఛ ఉండవలెనని హెగెల్ అభిప్రాయం. అధికారులు రాజ్యపాలన చేస్తే శాసనసభ నిర్మాణము చెయ్యవలె.

## 11.11 స్వేచ్ఛపై హెగెల్ అభిప్రాయం:

హెగెల్ ఆలోచనలో స్వేచ్ఛ అనేది మానవుని యొక్క జీవిత లక్ష్యం. స్వేచ్ఛను కోల్పోతే తన మానవత్వం కోల్పోయే ప్రమాదమున్నది. స్వేచ్ఛలేని వ్యక్తి మానవుడిగా జీవించలేడు. స్వేచ్ఛ అనేది వ్యక్తిలోని ప్రతివ్యక్తిగత తాత్కాలిక కోరికలకు బానిస అని చెప్పుట కాదు. స్వేచ్ఛ అనేది రాజ్యము ద్వారా అభివృద్ధి చెందుతుంది. హెగెల్ యిలా చెప్పేవాడు. "రాజ్యం ఒక నైతిక వ్యవస్థ. అది స్వేచ్ఛకు వాస్తవ రూపం కల్గిస్తుంది". హెగెల్ స్వేచ్ఛా సిద్ధాంతమును రూపొందించుటలో చాలా వరకు రూసోకు, కాంట్‌కు రుణపడి ఉన్నాడు. హెగెల్ అభిప్రాయంలో స్వేచ్ఛ సామాజిక నీతి, శ్రేయస్సుకు అనుగుణంగా సమాజాభిష్టానికి కట్టుబడి ఉండుట. రాజ్యం ఈ సామాజిక నీతికి ప్రతిబింబం. "రాజ్యం సంఘం నైతిక అభీష్టానికి ప్రతీక" అని హెగెల్ అభిప్రాయపడినాడు.

రాజ్యం ద్వారానే నీతి పుట్టునని హెగెల్ చెప్పినాడు. వ్యక్తి తన స్వాతంత్ర్యాన్ని రాజ్యం ద్వారా చెప్పుట జరిగింది. దీని ద్వారానే అభివృద్ధి చేస్తుంది. రాజ్యము వ్యక్తి అవసరాలను తీర్చుతుందే కానీ, అవసరాలకు అవరోధం కల్గించదు. హెగెల్ స్వేచ్ఛయైనది చిదాత్మ కాని ద్రవ్యం కాదు అని చెప్పినాడు. ద్రవ్యం అనేది గురుత్వాకర్షణ న్యాయానికి లోబడి నడుచుకోవాలి. చిదాత్మను పెంచటం వ్యక్తి స్వాతంత్ర్యాభివృద్ధి మీద ఆధారపడి ఉంటుంది. మానవజాతి చరిత్ర అంతా కూడా స్వతంత్ర చరిత్రను తెలియజేస్తుంది. రాజ్యం ఉత్తమమైనదిగా కొనసాగాలంటే దాన్ని స్వాతంత్ర్యం అవసరమని హెగెల్ చెప్పినాడు. వ్యక్తి రాజ్యాధికారము పట్ల భయంతో దానికి బద్ధుడై వుంటే అది నిజమైన స్వాతంత్ర్యం వ్యక్తికి వచ్చినట్లు కాదు. నిజమైన స్వాతంత్ర్యం అంటే వ్యక్తి మనసా, వాచా, కర్మల చేత రాజ్యానికి విధేయుడై ఉంటే అప్పుడు స్వాతంత్ర్యం అనుభవిస్తున్నాడు అని చెప్పవచ్చును. హెగెల్ అభిప్రాయంలో స్వాతంత్ర్యం అనేది విధేయతను సూచిస్తుంది. రాజ్యం కోసము పౌరుడు స్వేచ్ఛాయుతమైన విధేయతను చూపాలని తెలియజేసినాడు.

## 11.12 హెగెల్ సిద్ధాంతంపై విమర్శ:

హెగెల్ చెప్పిన సిద్ధాంతాన్ని అనేక మంది రాజనీతి తాత్త్వికులు అనేక విధాలుగా విమర్శలు చేసినారు. హెగెల్ రాజ్యం దైవ నిర్ణయమనడం, స్వేచ్ఛకు తృప్తికరమైన నిర్వచనం ఇవ్వకపోవడము వంటి అంశాలను కూడా హెగెల్ సిద్ధాంతములోని లోపాలు. హెగెల్ అంగాంగీవాదం సిద్ధాంతాన్ని బలపరచి వ్యక్తిని రాజ్యానికి బానిసను చేసినాడు అని మరికొందరి విమర్శ. యితడు యుద్ధానికి, జాతీయ రాజ్యానికి ఎక్కువ ప్రాముఖ్యతను యిచ్చినాడని మరికొందరు విమర్శించినారు.

హెగెల్ గత తార్కిక వాదంపై మరి కొన్ని విమర్శలు ఉన్నాయి. సిద్ధాంతంగా దానికి విలువ ఉన్నప్పటికీ, కొన్ని వాస్తవాలను వివరించడంలో యిబ్బందులున్నాయని కొందరు విమర్శకుల అభిప్రాయం.

మతం కళకు ఏ విధంగా వ్యతిరేకతమవుతుంది? హెగెల్ తన పరిణామ వాదంలో యుద్ధం బలపరచినాడు. యిది సమర్ధనీయం కాదు. సెబైన్ గత తార్కికము హేతుబద్ధమైనది కాదంటాడు. హెగెల్ చెప్పిన ప్రకారం ప్రతి దాని పరిణామము క్రమంగా సంభవిస్తుంది. ఒక లక్ష్యాన్ని చేరడానికి నిర్దుష్ట ప్రయత్నం అవసరం లేదని, అదే చరిత్ర సహజ ప్రక్రియ అనే భావం ప్రతిపాదించింది. యిది నాగరికతాభివృద్ధిని హరింపజేసే ప్రమాదకర ధోరణిమైంది.

## 11.13 హెగెల్ విశిష్టత:

హెగెల్ ప్రతిపాదించిన గత తార్కిక పద్ధతి అతడు తయారుచేసిన, తత్త్వ విచారం వల్ల మార్క్స్ ప్రభావితుడైనాడు. దీని ద్వారా సామ్యవాద చరిత్రలో ఒక క్రొత్త దృక్పథం ఏర్పడింది. హెగెల్ జాతి రాజ్య సిద్ధాంతానికి ప్రాధాన్యత కల్పించినాడు ఉదారవాద సిద్ధాంతములో మార్పులు తీసుకురావడానికి యితని సిద్ధాంతము ముఖ్య కారణము. హెగెల్ తయారు చేసిన గత తార్కిక వాదం, ఫాసిస్ట్, కమ్యూనిస్ట్ సిద్ధాంతాలు ఉద్భవించడానికి తోడ్పడింది. హెగెల్ అభివృద్ధి చేసిన జాతీయ వాదము రాజ్యాన్ని ఆదర్శవంతం చేసిందని మార్క్స్ అభిప్రాయపడినాడు. తత్త్వ శాస్త్రాన్ని సంపూర్తిగా పునర్నిర్మించడానికి హెగెల్ చేసిన కృషి మహత్తరమైనది. హెగెల్ ప్రతిపాదించిన "యదార్ధ ఇచ్ఛ" సిద్ధాంతము తత్త్వశాస్త్ర చరిత్రలో ఒక క్రొత్త పంథాను సృష్టించింది.

## 11.14 సారాంశము:

రాజ్యాధికారము, దాని స్వభావము మొ॥ అంశాలను గురించి చర్చించిన సిద్ధాంతాలలో ఆదర్శవాద సిద్ధాంతము ప్రధానమైనది. ఈ సిద్ధాంతానికి ప్లేటో, అరిస్టాటిల్ వంటి ప్రముఖ ప్రాచీన తత్త్వవేత్తలు తమ రచనలలో నాంది ప్రస్తావన చేసారు.

హెగెల్ ఆంగ్లేయ పరిశీలనా పద్ధతిని నిరసించాడు. మరియు అనుభవ పూర్వక పద్ధతిని నిరసించి జ్ఞాన సముపార్జన కోసం అమూర్తమైన హేతువుపైన ఆధారపడినాడు. యితడు చారిత్రాత్మక పద్ధతికి ఎక్కువ ప్రాముఖ్యత యిచ్చినాడు. హెగెల్ అది భౌతిక వాది లేదా భావవాది. ఈ భౌతిక విశ్వానికి మూలమైన అది భౌతిక శక్తి ఒకటున్నదని, భౌతిక విశ్వం దాని వ్యవస్థీకరణేనని యితడు విశ్వసించారు. నిరంతర చలనశీలమైన భౌతిక యదార్ధత హేతుబద్ధమైనది కాదు. హేతుశీలమైన, సర్వ స్వతంత్రమైన చిదాత్మే (Spirit) యదార్థమూ, సత్యమూ, దీని వ్యవస్థీకరణే అశాశ్వితమైన నిరంతర గమనశీలమైన భౌతిక ప్రపంచమని హెగెల్ భావన. చిదాత్మ భావానుగుణంగానే భౌతిక ప్రపంచం మారుతూ నిరంతరం ఉంటుందని చిదాత్మకు హెగెల్ ప్రధమ స్థానాన్నిచ్చారు. చిదాత్మ స్వయం చోదిత శక్తి కలిగి పరిపూర్ణత సాధించే వరకూ చలిస్తూనే ఉంటుంది. చిదాత్మ హేతుబద్ధమైనదీ, యదార్ధమైనదీ, ఆదర్శవంతమైనదిగానూ, అందుకే అది స్వేచ్ఛా పూరితమూ, స్వయంచోదితమూ, పరిపూర్ణమూ ఐనట్టిది.

అపరిపూర్ణదశ నుండి పరిపూర్ణ దశకు అది తనను తాను వ్యక్తీకరించుకోవటానికి అవసరమైన సర్వశక్తి సంపన్నతను తనలోనే కలిగి ఉంది.

హెగెల్ రాజ్యానికి విశేష ప్రాముఖ్యతనిచ్చినాడు. రాజ్యం భూమిపై నడిచే భగవంతుని ప్రతిరూపమని హెగెల్ రాజ్యాన్ని వర్ణించాడు. రాజ్యానికి స్వత: సిద్ధమైన ఉనికి, గమ్యం లక్ష్యము ఉంటాయి. అది వ్యక్తి కంటే, సమాజం కంటే ఉన్నతమైనది. దాని అభీష్టానికి వ్యతిరేకంగా ఎవరు వ్యవహరించరాదు. ప్రజలకు రక్షణ కల్పించడం మినహాయించి వారికి ఏమో చేయవలసిన అవసరం రాజ్యానికి లేదు. హెగెల్ సామాజిక ఒడంబడిక సిద్ధాంతాన్ని తిరస్కరించాడు. స్వేచ్ఛాయుతమైనటువంటి మానవులు ప్రాకృతిక వ్యవస్థలోనే ఇబ్బందులను తొలగించుకోవడానికి ఒప్పందము ద్వారా రాజ్యన్ని ఏర్పాటు చేసుకొన్నారని చెప్పడం తప్పుడు భావన అని హెగెల్ అంటాడు. ఒకవిధంగా చెప్పాలంటే హెగెల్ దైవదత్తాధికార సిద్ధాంతాన్ని పునరుద్ధరించాడని చెప్పవచ్చు. యితని సిద్ధాంతము ప్రకారము ప్రారంభంలో మానవ జీవనము హింసాయుతముగా, అమానుష చర్యలతో అరాచకంగా ఉండేది. మానవులు వ్యక్తిగతంగా కాకుండా సమూహాలుగా జీవించేవారు. అవసరాలు తీర్చుకోవడానికి కుటుంబ వ్యవస్థ లేర్పరచుకొన్నారు. కుటుంబం వాదమైతే కొద్దికాలం బూర్జువా సమాజం ప్రతివాదంగా ఏర్పడుతుంది. వీటి నుంచి మంచి సమన్వయముగా రాజ్యమేర్పడుతుంది. హెగెల్ ఉద్దేశ్యములో రాజ్యం ద్వారానే స్వేచ్ఛ అభివృద్ధి చెందుతుంది. స్వేచ్ఛ చట్టం ద్వారా వ్యక్తమౌతుంది. చట్టం పట్ల విధేయత చూపించడం ద్వారా వ్యక్తి తన స్వేచ్ఛను అనుభవించగలుగుతాడు.

## 11.15 నమూనా ప్రశ్నలు:

I. ఈ క్రింది వానికి వ్యాసరూపంలో జవాబులు వ్రాయండి?

1. ఆదర్శవాద సిద్ధాంతములో వ్యక్తికి, రాజ్యానికి గల సంబంధాన్ని చర్చించండి?
2. హెగెల్ రాజనీతి తత్వానికి సేవలను వివరింపుము?
3. రాజ్యావతరణ, రాజ్య స్వభావం వివరించడానికి హెగెల్ ఏ విధంగా గత తార్కిక ప్రక్రియను ఉపయోగించాడు?

II. లఘు ప్రశ్నలు:

1. రాజ్యం పై హెగెల్ అభిప్రాయాలు
2. హెగెల్ గత తార్కిక పద్ధతి
3. జాతీయ సార్వభౌమాధికారం పై హెగెల్ భావాలను వివరించుము?
4. స్వేచ్ఛపై హెగెల్ అభిప్రాయం.

## 11.16 చదువదగిన గ్రంథాలు:


1. యాండ్రోహకర్ : పొలిటికల్ థీరి
2. జె.పి. సుధ : ఏ హిస్టరీ ఆఫ్ పొలిటికల్ థాట్
3. ఆర్.సి. గుప్తా : [illegible] లిటికల్ థింకర్స్
4. ఫోస్టర్ యం.బి : మాస్టర్స్ ఆఫ్ పొలిటికల్ థాట్


డా॥ కె. రామచంద్రమూర్తి

పాఠం - 12

# టి.హెచ్. గ్రీన్

## 12.0 లక్ష్యం :

ఈ పాఠాన్ని అధ్యయనం చేసిన తరువాత మీరు ఈ క్రింది విషయాలు అర్థం చేసుకోగలరు:

* టి.హెచ్ గ్రీన్ యొక్క ఆదర్శవాదం
* టి.హెచ్ గ్రీన్ యొక్క హక్కుల సిద్ధాంతము
* రాజ్యము పై గ్రీన్ యొక్క భావన. ఆస్థి హక్కు, శిక్షా సిద్ధాంతము రాజ్య విధులు మొ॥ వాటిపై గ్రీన్ యొక్క భావాలు

విషయసూచిక :


12.1 పరిచయము

12.2 టి.హెచ్. గ్రీన్ జీవితం - రచనలు

12.3 గ్రీన్ హక్కుల సిద్ధాంతం

12.4 స్వతంత్ర ఇచ్ఛ

12.5 రాజ్యము పై గ్రీన్ భావన

12.6 రాజ్యము - సంఘము

12.7 రాజ్యానికి ఆధారం ఇచ్ఛ కాని, శక్తి కాదు

12.8 రాజ్య విధులు

12.8.1 నీతిని పెంపొందించడం

12.8.2 హక్కులు అమలుచేయడం

12.8.3 నిశ్చయాత్మక విధులు

12.8.4 వర్గాల మధ్య సర్దుబాట్లు

12.9 సంవర్ధక స్వేచ్ఛ

12.10 ఆస్థి హక్కుపై గ్రీన్ అభిప్రాయం

12.11 శిక్షా సిద్ధాంతం

12.12 సారాంశము

12.13 నమూనా ప్రశ్నలు

12.14 చదువదగిన గ్రంథాలు

## 11.1 పరిచయం :

టి.హెచ్ గ్రీన్ 1830 నాటికి వ్యక్తి స్వేచ్ఛా వాదము పట్ల బ్రిటీష్ దృక్పధంలో కొంత మార్పు వచ్చింది. బీదవారు, మధ్య తరగతి ప్రజలు ధనిక వర్గంతో పోటీ పడలేకపోయారు. అన్ని వర్గాల ప్రజలకు ఆర్థిక స్వయం సంవృద్ధిని సాధించడానికి స్వేచ్ఛా వ్యాపారం ఒక అడ్డంకి అయింది. దీనితో వారు అందరి ప్రయోజనం కోసం రాజ్య జోక్యం అన్ని రంగాలకు విస్తరించాలి అనే ఆందోళన ప్రారంభమైంది. ఈ విధంగా వ్యక్తి స్వేచ్ఛ వాదము సమిష్టి వాదానికి దారి తీస్తుంది. అతివాద నిరంకుశ ధోరణిని తొలగించినట్లయితే హెగేలియన్ తత్వాన్ని బ్రిటీష్ వాళ్ళు అంగీకరించేవారు. ఆ కాలంలో జర్మన్ ఆదర్శవాదానికి బ్రిటీష్ ఉదారవాదానికి మధ్య ఒక సమన్వయము అవసరమైంది. దీనిని టి.హెచ్ గ్రీన్, బ్రాడ్‌లే, బోంసాంకేలు పూర్తి చేసారు. వీరిని నూతన హెగేలియన్ తత్వవేత్తలు అంటారు. ఆక్స్‌ఫర్డ్ ఆదర్శవాదులుగా కూడా వీరు ప్రసిద్ధి చెందారు.

## 12.2 టి.హెచ్ గ్రీన్ యొక్క జీవితము - రచనలు :-

గ్రీన్ బ్రిటీష్ ఉదారవాదానికి హెగేలియన్ ఆదర్శవాదానికి సమన్వయం చేయడానికి ప్రయత్నించాడు. యితడు 17, 1836లో యార్క్ షైర్ దగ్గర వెస్టైరెడింగ్ గ్రామంలో జన్మించాడు. యితని తండ్రి క్రైస్తవ మతాచార్యుడు. మొదట యార్క్‌షైర్ లోను తరువాత రగ్బీలోను గ్రీన్ విద్యాభ్యాసం చేశాడు. కళాశాలలో ఉన్నత విద్యనభ్యసించాడు. స్థానిక కార్యకలాపాలలో చురుకుగా పాల్గొన్నాడు. కొంతకాలము ఇన్స్‌పెక్టర్ ఆఫ్ సర్కార్‌గా పని చేశాడు. ఆక్స్‌ఫర్డ్ కౌన్సిల్‌కు తరువాత ఎన్నిక అయినాడు. అతి చిన్న వయస్సులో అనగా 46వ ఏట 1882లో మరణించాడు. రాజనీతి తత్వ శాస్త్రానికి గ్రీన్ అనేక అంశాలను చేర్చాడు. యితని రచనలలో ముఖ్యమైనవి:-

1. లెక్చర్స్ ఆఫ్ ప్రిన్సిపల్ ఆఫ్ పొలిటికల్ ఆబ్లిగేషన్స్

2. లిబరల్ లెజిస్లేషన్ అండ్ ఫ్రీడమ్ ఆఫ్ కంట్రోల్

3. లెక్చర్స్ ఆఫ్ ఇంగ్లీష్ రెవల్యూషన్

4. పోలెగోమేనా టు ఎథిక్స్

## 12.3 గ్రీన్ యొక్క హక్కుల సిద్ధాంతము :-

గ్రీన్ ఉద్దేశ్యంలో మానవ చైతన్యము స్వేచ్ఛను కోరుతుంది. స్వేచ్ఛ హక్కుల చుట్టు పరిభ్రమిస్తుంది. హక్కులు రాజ్యాన్ని కోరుతాయి. గ్రీన్ సహజ హక్కుల సిద్ధాంతాన్ని అంగీకరించలేదు. అదే సమయంలో సామాజిక ఒడంబడిక సిద్ధాంతాన్ని కూడా తిరస్కరించాడు. రాజ్యము సహజముగా వ్యక్తం చేయడానికి హక్కులు అవసరము. హక్కులు వ్యక్తులకు అన్ని అధికారమైన సదుపాయాన్ని కల్పిస్తాయి. వీటిని సమాజం గుర్తిస్తోంది. ఒక వ్యక్తిగా కాక సమాజ సభ్యునిగా హక్కులు ఉపయోగించుకొంటారు.

హక్కులకు రెండు లక్షణాలు ఉన్నాయి. చట్టబద్ధమైన నైతిక హక్కులని వర్గీకరిస్తారు. అది ఒకటి స్వేచ్ఛాయుత చర్యను సూచిస్తుంది. స్వేచ్ఛాయుత ధ్యేయాన్ని సాధించడానికి అవసరము. అయితే కేవలం కోరికే అయితే హక్కును కల్పించదు. సామాజిక ప్రయోజనాన్ని సాధించడానికి దానికి సంబంధించిన చర్యలలో పాల్గొనడానికి హక్కు ఉపయోగపడుతుంది. రెండవ లక్షణం హక్కు సాధారణ ప్రయోజనానికి ఉపయోగపడాలి. ఈ విధంగా సూచించినప్పుడు గ్రీన్ ఉద్దేశ్యములో హక్కు వ్యక్తిగతమైనదే కాక

సమాజపరమైనది కూడా. గ్రీన్ చట్టబద్ధమైన, నైతిక హక్కులు అని వర్గీకరిస్తాడు. చట్టబద్ధమైన హక్కులను రాజ్యము చూపిస్తే నైతిక హక్కులను సమాజం గుర్తిస్తుంది. ఈ రెండింటి మధ్య సంబంధాన్ని గ్రీన్ గుర్తిస్తాడు. హక్కులు రాజ్యాన్ని కోరతాయి. కాబట్టి రాజ్యానికి వ్యతిరేకంగా హక్కులు ఉండటానికి అవకాశం లేదు. సహజ హక్కులు రాజ్యాన్ని కోరుతాయి. గ్రీన్ దీనిని వ్యతిరేకించినప్పటికి ఆ భావాన్ని ఆదర్శ హక్కులను వివరించడములో ఉపయోగించినారు. చట్టబద్ధమైన హక్కులకు, ఆదర్శ హక్కులకు మధ్య ఘర్షణ ఏర్పడే అవకాశాన్ని గ్రీన్ గుర్తించాడు. ఈ విధంగా చూసినప్పుడు గ్రీన్ హెగెల్ సిద్ధాంతము నుండి కొంత వైవిధ్యాన్ని చూపించాడు.

## 12.4 స్వతంత్ర్యేచ్ఛ (Free Will) :-

గ్రీన్ అభిప్రాయంలో ప్రతి వ్యక్తి యొక్క "ఇచ్ఛ" (will) అతని వాస్తవికత మూర్తిమత్వాన్ని ప్రకటిస్తుంది. యిది ఒక ప్రత్యేకమైన శక్తి కాదు. మానవుడే ఈ ఇచ్ఛ. ఇచ్ఛ అనివార్యంగా నైతికమైనది. యిది తన శ్రేయస్సును వాంఛిస్తుంది. ప్రతి ఇచ్ఛ యొక్క శ్రేయస్సు నుండి జీవితంలోకి ప్రస్ఫుటవుతుంది. ప్రతి ఇచ్ఛ ముఖ్యముగా ఆత్మ సంతృప్తిని కోరుతుంది. కానీ నైతిక కార్యాలను నిర్వర్తించడంలోను ప్రతి ఇచ్ఛ నిజమైన తృప్తి పొందగలడు. ఆత్మ సంతృప్తి అంటే శరీర సంబంధమైన భోగలాలస కాదు. ప్రతి వ్యక్తి సమాజములో ఒక సభ్యుడు. అందువల్ల తన అభివృద్ధి కోసం కృషి చేసే ప్రతి ఇచ్ఛ సమాజాభివృద్ధికి సహకరిస్తుంది. సమాజం వ్యక్తుల కూడలి. ప్రతి వ్యక్తి అభివృద్ధి చెందితే తత్ఫలితంగా సమాజం యావత్తు అభివృద్ధి చెందుతుంది. వ్యక్తులందరూ పరమాత్మ (Divine Spirit) స్వరూపాలే. అందువల్ల ప్రతి మానవుడు అందరిని వాంఛిస్తాడు. మానవుడు ప్రపంచం నుండి విడిపోయిన ఒక అణువు కాదు. అతడు మొత్తంలో ఒక భాగము. ఈ మొత్తం సమాజములో అతనితో బాటు యితర మానవులందరూ భాగస్వాములే. అందువల్ల ఈ అవగాహన ననుసరించి గ్రీన్ వ్యక్తిగత హక్కులను నిరసించాడు. తగిన పరిస్థితులు చేకూర్చితే ఈ మంచితనం తనంతతానే అభివృద్ధి చెంది ప్రకటితమవుతుంది. అందువల్ల ఈ లక్ష్య సాధనకు అవసరమైన పరిస్థితులను రాజ్యం విధిగా కల్పించవలెను.

ఇచ్ఛ స్వతంత్రమైనదంటాడు గ్రీన్ అంటే ప్రతి ఇచ్ఛ స్వేచ్ఛను కోరుతుంది. ఎవరి యిష్టం వచ్చినట్లు వారు చేయడానికి ఉండే స్వాతంత్ర్యము నిజమైన స్వేచ్ఛ స్వాతంత్ర్యం కావని గ్రీన్ అభిప్రాయము. చేయవలసిన పనులను చేయడానికి గల స్వాతంత్ర్యమే నిజమైన స్వాతంత్ర్యము. స్వేచ్ఛ అంటే కేవలం అవరోధాలు లేకపోవడం కాదు. అనుభవించవలసినవి అనుభవించడానికి చేయవలసినవి చేయడానికి గల స్వాతంత్ర్యమే నిజమైన స్వాతంత్ర్యము. గ్రీన్ దృక్పధంలో స్వాతంత్ర్యం అంటే ముఖ్యంగా రెండు విషయాలున్నాయని గ్రహించవలెను. మొదటిది స్వాతంత్ర్యం అంటే ప్రతి వ్యక్తి యిష్టానుసారంగా ప్రవర్తించేందుకు గల స్వేచ్ఛ కాదు. రెండోది, స్వాతంత్ర్యం అంటే మంచి పనులను అభిలషణీయమైన పనులను యితరుల మంచిని పెంచే పనులు సమాజ శ్రేయస్సుకు ప్రతిపాదిస్తుంది. ఆత్మ తనను గురించి తాను తెలుసుకోవడమే గాక, తన ఇచ్ఛను వాంఛిస్తుంది. ఆత్మ వాంఛించే ఇచ్ఛ ఎల్లప్పుడూ ఆదర్శ లక్ష్యాలతో సమైక్యాన్ని కోరుతుంది. ఆత్మ తన ఇచ్ఛనేగాక యితరుల ఇచ్ఛను కూడా గుర్తిస్తుంది. యితరుల ఇచ్ఛ కూడా తన ఇచ్ఛ వంటిదేనని గ్రహిస్తుంది. అందరి ఇచ్ఛల లక్ష్యాలు ఆదర్శప్రాయమైనవని గమనిస్తుంది. అందువల్ల వ్యక్తి అనుభవించేవి, చేసేవి అందరితో కలసి అనుభవించేటట్లుగా చేసేవిగా ఉండవలెనని గ్రీన్ వివరించినాడు.

## 12.4 రాజ్యంపై గ్రీన్ భావన :-

మానవ చైతన్య ఫలితంగా రాజ్యం ఉద్భవించిందని గ్రీన్ అభిప్రాయము. మానవ చైతన్యం స్వేచ్ఛను రూపొందిస్తుంది. స్వేచ్ఛ హక్కుల ఫలితములు హక్కులు రాజ్యాన్ని డిమాండ్ చేస్తాయి. అందువల్ల రాజ్యం అనివార్యంగా ఆత్మజ్ఞానం వల్ల

ఆవిర్భవించింది. రాజ్య శాసనాలలోను, రాజ్యంలో సభ్యులుగాను, మాత్రమే మానవులు వ్యక్తుల పరస్పర హక్కులను గుర్తించి గౌరవించగలరు. ఈ హక్కులను వినియోగించనిదే సమిష్టి శ్రేయస్సు అభివృద్ధి చెందడం సాధ్యం కాదు. ఈ హక్కుల వినియోగం ద్వారా నైతిక జీవి అయిన మానవుడు తన మూర్తిమనతత్వాన్ని పెంచుగోగలడు. శరీరంగా అంగాలు ఉన్నంతకాలం వారు అభివృద్ధి చెందగలరు. అట్లానే వ్యక్తి రాజ్యంలో సభ్యులుగా ఉన్నంతకాలం మాత్రం వారు అభివృద్ధి చెందగలరు. అందువలన రాజ్యం లేనిదే వ్యక్తుల నైతిక జీవితం సాధ్యం కాదు. రాజ్యం వ్యక్తి శ్రేయస్సుకు విభిన్నమైన శక్తి కాదు. మేధస్సుకూ మానవుడు మధ్య విపర్యయము ఎట్లా ఉండదో అలాగే వ్యక్తికి రాజ్యానికి మధ్య విపర్యయం ఉండదు. రాజ్యం ఆత్మ జ్ఞానం గల వ్యక్తుల వ్యవస్థ రాజ్యం లేనిదే వృత్తులు లేవు, హక్కులు లేవు. రాజ్యం అనివార్యమైన చెడు కాదు. అభిలషణీయమైన తప్పనిసరియైన, వాస్తవికమైన మంచి.

రాజ్యం సహజ న్యాయశాస్త్రం (Natural jurisprudence) చే కూడా సమర్థింపబడినదని గ్రీన్ వాదించినాడు. రాజ్యంలో ఏ శాసనాలు అమలు జరపవలెనో, ఏ హక్కులను మంజూరు చేయవలెనో సహజ న్యాయం విశదీకరిస్తుంది. రాజ్యంలోని ఈ శాసనాలు అమలు జరపబడి, ఈ హక్కులను మంజూరు చేయడం జరిగింది. కనుక రాజ్యాన్ని అనివార్యమైన చెడు (Necessary evil) గా భావించరాదు. మనము ఏ పనులు చేయవచ్చునో, ఏవి చేయకూడదో, మన నైతిక జ్ఞానము హెచ్చరికలను నిర్లక్ష్యం చేసే వ్యక్తులను వ్యవస్థీకరింపబడిన శక్తితో నిర్బంధం చేయడానికి రాజ్యం ఉండి తీరవలె. అన్ని శాసనాలకు, హక్కులకు మూలాధారమైన రాజ్యం సర్వశక్తివంతమై ఉండవలె. ఒక్క రాజ్యం నుంచే అన్ని హక్కులు సంక్రమిస్తాయి. రాజ్యం ఆవిర్భవించక ముందు కుంటుంబాలలో హక్కులు ఉండి ఉండవచ్చు. కానీ రాజ్యం ఆవిర్భవించిన తరువాత యివి గుర్తింపబడి ఆమోదింపబడతాయి. అప్పుడు ఈ హక్కులకు మూలం కుంటుంబం నుంచి రాజ్యానికి తరలించడం జరుగుతుంది.

సరైన హక్కులు రాజ్యంలోనే లభిస్తాయి. రాజ్యం లేనిదే హక్కులు లేవు. సహజ న్యాయశాస్త్రం దృష్ట్యా ప్రజాభిప్రాయము అనుసరించిన హక్కులను మాత్రమే వ్యక్తి పొందగలడు. రాజ్యం అనుమతించిన హక్కులను మాత్రమే వ్యక్తి అనుభవించగలడు. అంటే ఏ కారణం వివరించకుండా వ్యక్తి హక్కులను ఉపసంహరించే అధికారం రాజ్యానికి ఉందని గ్రహించవలె.

కుటుంబం అన్నా గుంపు అన్నా, సమూహిక జీవితమన్నా గ్రీన్‌కు బహుప్రీతి. గ్రీన్ దృక్పధంలో రాజ్యం ఒక సార్వభౌముని అధికారం కింద సమీకరింపబడిన సముదాయం కాదు. మానవుల హక్కులు మునుపే కుటుంబాలలో నిర్దేశింపబడినవి. వివిధ కుటుంబాలలోను హక్కులను సమీకరించి సమన్వయించి రాజ్యానికి పూర్వం గల కుటుంబం వంటి వ్యవస్థల నుంచి మానవులు తమ హక్కులను గ్రహించినప్పటికీ రాజ్యం ఆవిర్భవించిన తరువాత ఆ వ్యవస్థలన్నీ రాజ్యంలో భాగాలైపోతాయి. అప్పుడు ఈ హక్కుల మూలము ఆ వ్యవస్థల నుంచి రాజ్యానికి తరలించబడతాయి. ఈ విధంగా రాజ్యం సర్వ హక్కులకు మూలంగా రూపొందుతుంది. రాజ్యము చిన్న వ్యవస్థల మధ్య గల హక్కులను సరిచేసి సమన్వయపరుస్తుంది. వాటిపై దానికి మహోన్నతాధికారం ఉంటుంది. పౌరునికి, భర్తగాను, ఆస్తికి హక్కుదారుగాను, గల హక్కులు ఇదివరలో కుటుంబం నుంచి సంక్రమించినా, రాజ్యం ఏర్పడిన తరువాత రాజ్యం నుండి మాత్రమే లభిస్తాయి. ఈ విధంగా రాజ్యానికి వ్యష్టిగాను, సమిష్టిగాను, పౌరులపై మహోన్నతాధికారము ఉందని గ్రీన్ ధ్రువపరచినాడు.

## 11.6 రాజ్యము - సంఘము :-

రాజ్యం కన్న సంఘం ముఖ్యమైనదని గ్రీన్ వాదిస్తాడు. వ్యక్తిగత పౌరుల వాంఛల కన్నా; ప్రయోజనాల కన్నా సంఘం యొక్క, సమిష్టి శ్రేయస్సు అనేక రెట్లు ముఖ్యమైనది. పౌరుల నైతిక, లౌకిక ప్రయోజనాల అభివృద్ధి సంఘం, సంఘం తరుపున

రాజ్యము, పౌరుల స్వవిషయాలలో కలుగజేసుకొనవచ్చునని గ్రీన్ ప్రకటించినాడు. హెగెల్, బొసాంకేల అభిప్రాయం ప్రకారం సంఘము రాజ్యములో భాగము. అందువల్ల సంఘం రాజ్యానికి, విధేయురాలై ఉండవలె. కాన గ్రీన్ అభిప్రాయం ప్రకారం సంఘము రాజ్యం కన్న ముఖ్యమైనది. సంఘం యొక్క ఏజెంట్ రాజ్యం, కొన్ని సందర్భాలలో సంఘం యొక్క ప్రయోజనాలు పరస్పరం సంఘర్షించవచ్చు. ముఖ్యంగా రాజ్యం స్వార్థపరుడైన నిరంకుశ సార్వభౌముని పరిపాలనలో ఉన్నప్పుడు ఈ పరిస్థితి ఏర్పడుతుంది. అటువంటి పరిస్థితులలో స్వార్థపరుడైన సార్వభౌముని నిరంకుశ ఆజ్ఞలకు మహోన్నత స్థానాన్నివ్వడానికి గ్రీన్ సమ్మతించలేదు. అందువలనే సంఘము రాజ్యంకన్నా మిన్న అని గ్రీన్ వాదించినాడు. జాతీయ విషయాలలో కూడా రాజ్యం ప్రయోజనాల కన్నా సమాజం మొత్తం ప్రయోజనాలు అతి ముఖ్యమైనవని గ్రీన్ స్పష్టపరచినాడు. గ్రీన్ అభిప్రాయంలో రాజ్యం కేవలం సంఘం ఏజెంటు అంటే జనేచ్ఛ (General will) యొక్క ఏజెంట్, ఏజెంటు చర్యలు అధికారి ఆదేశాలకు వ్యతిరేకంగా ఉంటే, ఆ చర్యలను వెంటనే నిలిపి వేయవలెను.

## 12.7. రాజ్యానికి ఆధారం ఇచ్ఛ కాని శక్తి కాదు :-

ప్రభుత్వం పాలితుల అనుమతిపై ఆధారపడి ఉండవలెనా అన్న ప్రశ్న చాలా పురాతనమైనది. లాక్ (Locke) వంటి ఉదారతావాదులు ప్రభుత్వం ప్రజల అనుమతిపైన ఆధారపడి ఉండవలెనని వాదించినారు. వారి వాదము ప్రకారం ఒడంబడిక (Contract) ఫలితంగా ఉద్భవించింది. అందువల్ల రాజ్యం తన అధికారాన్ని ప్రజల అనుమతి నుంచి స్వీకరించినది. అంతేకాక, రాజ్యం తన అధికారాలను దుర్వినియోగం చేస్తే ఆ రాజ్యాన్ని ప్రతిఘటించే హక్కు ప్రజలకుంటుంది. అందువలన గతంలోను ప్రస్తుతంలోను రాజ్యం ప్రజల అనుమతిపై ఆధారపడి ఉంటుందని ఉదారవాదుల వాదన, కాన ఒడంబడిక సిద్ధాంతం పై ఆధారపడిన ఈ వాదనను గ్రీన్ అంగీకరించలేదు. సామాజిక ఒడంబడిక ఫలితంగా రాజ్యం ఆవిర్భవించినదనే వాదనను గ్రీన్ నిరసించినాడు. గ్రీన్ అభిప్రాయంలో అనేక రాజ్యాలు శక్తి ఫలితంగా ఉద్భవించినాయి. సామాజిక ఒడంబడిక సిద్ధాంతము చారిత్రకంగా అసత్యమైనది. తార్కికంగా అసంగతమైనదని గ్రీన్ అభిప్రాయము. కానీ రాజ్యానికి ఆధారం ప్రజలు అనుమతి అన్న సిద్ధాంతాన్ని మాత్రం గ్రీన్ నిరసించలేదు. అందువల్ల నిజమైన పరిపూర్ణమైన రాజ్యానికి ఆధారం జనేచ్ఛ (General will) కాని, శక్తి కాదని గ్రీన్ అనుమతి సిద్ధాంతాన్ని పునర్వ్యాఖ్యానించాడు.

## 12.8. రాజ్య విధులు :-

రాజ్యంపై గ్రీన్ భావాలు మానవ స్వభావంపై ఆధారపడి ఉన్నాయి. రాజ్యం ఒక సహజ అవసరమైన సంస్థ. అది మానవుని నైతికాభివృద్ధికి అవసరము. మానవుని అంతర్వివేకశీలత (Consciousness) నుండి రాజ్యం ఉద్భవించినదని గ్రీన్ వివరించినాడు. రాజ్యం దానికదే ఒక లక్ష్యం కాదు. మానవుని నైతికాభివృద్ధికి అది సాధనం అని గ్రీన్ అభిప్రాయం. రాజ్యం ప్రజలందరి మంచిని పెంపొందిస్తుంది. గనుక వారు రాజ్య శాసనాలకు విధేయులుగా ఉంటారు.

### 12.8.1 నీతిని పెంపొందించడము : -

గ్రీన్ అభిప్రాయం ప్రకారం మానవుడు స్వయం నిర్ధారిత నైతిక జీవి. నీతివంతుడైన వ్యక్తి సమిష్టి శ్రేయస్సు కోసం కృషి చేస్తాడు. రాజ్యం నీతిని పెంపొందించాలి. అయితే ప్రత్యక్షంగా ఆ పని రాజ్యం చేయలేదు. నీతిని పెంపొందించడంలో రాజ్యం సంవర్థకంగా (positive) వ్యతిరేకాత్మకంగా (Negative) వ్యవహరించాలి. వ్యక్తి నైతికాభివృద్ధికి ఎదురైయ్యే అడ్డంకులను తొలగించి, వ్యక్తికి సహాయపడాలి. వ్యక్తుల వ్యక్తిత్వాలు వికాసం పొందాలంటే ఆదర్శం నెరవేరేటట్లు రాజ్యం సహాయపడాలి. అందుకు

తగినట్లు స్వచ్ఛందంగా మంచి పనులు నిర్వహించడంలో ఉత్పన్నమయ్యే బాహ్య అవరోధాలను రాజ్యం తొలగించాలి. ఆ విధంగా "మంచి సాంఘీక జీవనానికి ఎదురైయ్యే అడ్డంకులను అడ్డుకోవడమే రాజ్య విధి" (The function of the state is to hinder the hindrances) అని గ్రీన్ అభిప్రాయబడ్డాడు.

### 12.8.2 హక్కులు అమలు చేయడం :-

హక్కులు అమలుచేయడం ఎంతో అవసరమని గ్రీన్ ఉద్దేశ్యం. అమలు చేయబడని హక్కులు అర్థరహితమని గ్రీన్ అంటాడు. అవసరమైతే బలవంతంగానైనా రాజ్యం, హక్కులు అమలు చేయాలని చెప్పాడు. ఒక సమిష్టి ప్రయోజనానికి రాజ్యం ప్రాతినిధ్యం వహిస్తుంది. గనుక ఆ లక్ష్యం నెరవేర్చుకోవడానికి రాజ్యం బల ప్రయోగము చేయడాన్ని కూడా గ్రీన్ సమర్థించాడు. కాన అంతమాత్రం చేత గ్రీన్ నిరపేక్ష రాజ్యాన్ని సమర్థించాడని భావించరాదు.

### 12.8.3 నిశ్చయాత్మక విధులు :-

రాజ్యం యొక్క ఉద్దేశ్యము నిశ్చయాత్మక విధులు నిర్వహించడం. అందరి శ్రేయస్సు లక్ష్యంగా వ్యక్తులు తమను తామే నిర్దేశించుకోవడానికి తగినట్లు వారిని శక్తివంతులను చేయాలి. నిరక్షరాస్యత ఒక అవరోధంగా ఉంటే రాజ్యం విద్యలయాలు నెలకొల్పాలి. పేదరికం వ్యక్తి అభివృద్ధికి నైతిక - భౌతిక అవరోధమైనప్పుడు రాజ్యం దేశ సహజ వనరులను పెంపొందించి, ఆస్థి పంపిణీకి చర్యలు తీసుకోవాలి. అదే విధంగా మద్యపానం వ్యక్తి నైతికాభివృద్ధికి అవరోధమైనప్పుడు దానిపై నిషేధం విధించాలి. ఆరోగ్యం గృహ వసతి వ్యక్తి - వ్యక్తిత్వం అభివృద్ధి చెందడానికి అవసరం కనుక అవి రాజ్య నియంత్రణలో ఉండాలి. సామాజిక చట్ట నిర్మాణాన్ని గ్రీన్ కోరాడు. కర్మాగారాలలో స్త్రీలు, పిల్లలు పని చేయడం నిషేధించాలని ప్రతిపాదించాడు. అందువలన గ్రీన్ ప్రతిపాదించిన రాజ్యం సంక్షేమ రాజ్యం అనవచ్చు. సర్వజన శ్రేయస్సుకు అవరోధంగా వుండే ఆర్థిక దోషాలను రాజ్యం తొలగించాలని గ్రీన్ ప్రతిపాదించాడు.

### 12.8.4 వర్గాల మధ్య సర్దుబాటు : -

గ్రీన్ వివరించిన కార్యకలాపాలు చాలా విస్తృతమైనవి. ఒక వర్గాన్ని మరొక వర్గంతో సర్దుబాటు చేసి, పౌరుల హక్కులను, క్రమబద్ధం చేయాలి. సమాజంలోని ఒక వర్గం స్వేచ్ఛను రక్షించడానికి రాజ్యం బానిసత్వాన్ని నిర్మూలించాలి. అదేవిధంగా విద్యారంగంలోను, ఆరోగ్య నిబంధనలలోను రాజ్యం జోక్యం చేసుకోవాలని గ్రీన్ అభిప్రాయపడ్డాడు.

వివిధ వర్గాల మధ్య సర్దుబాటు చేయడంలో రాజ్యానికి అంతిమాధికారం ఉంది. అయితే సంస్థలు, రాజ్యం స్వభావాన్ని బట్టి రాజ్యం ఆధిక్యత పరిమితమవుతుంది. రాజ్య ఆధిక్యత ఉన్నప్పటికి అది బాధ్యతారహితంగా తన ఆధిక్యతను ప్రయోగించలేదు. అది వర్గాల, వ్యక్తుల హక్కులను తగిన విధంగా గౌరవించాలి. రాజ్యం నియంతగా ఉండే వీలులేదు. ఈ విషయంలో గ్రీన్ భావాలు అరిస్టాటిల్ భావాలకు సన్నిహితంగా ఉంటాయి. రాజ్యం ఆధిక్యతను, ప్రయోజనాన్ని గుర్తించినా గ్రీన్ అరిస్టాటిల్ వలె దానిని నిరంకుశమైందిగా చేయలేదు. రాజ్యం లోపల బయట కూడా పరిమితి కలిగి ఉంటుంది. వ్యక్తుల అంతర్యాలను రాజ్యం నియంత్రణ చేయలేదు. అందువలన అది ప్రత్యక్షంగా వారిలో నీతిని పెంపొందించలేదు. వ్యక్తుల వ్యక్తిత్వ వికాసానికి ఎదురైయ్యే అవరోధాలను తొలగించే ప్రయత్నం చేసి పరోక్షంగా వారి నైతికాభివృద్ధికి దోహదం చేస్తుంది. ప్రతి వర్గం కూడా దాని లోపల హక్కుల వ్యవస్థ క్రమం కలిగి ఉంటాయి. అందువలన రాజ్యం వాటి మధ్య సర్దుబాటు చేసే హక్కు కలిగి ఉంటుంది.

## 12.9 సంవర్ధక స్వేచ్ఛ :-

గ్రీన్ ఉద్దేశ్యంలో శాశ్విత స్వయం చైతన్యం లేదా భగవత్ శక్తి ఉన్నది. దానితో మన హేతువును గుర్తింపచేయడానికి ప్రయత్నించాలి. ఈ స్వయం చైతన్యం వైపు పయనిస్తుంది. వ్యక్తి తన యొక్క ఆత్మ చైతన్యాన్ని ఏకాకిగా కాక సమాజంలో జీవించడం ద్వారా విస్తృతము చేసుకుంటాడు. ఈ సందర్భంలో ఆత్మ తనను తాను తెలుసుకోవటమే కాకుండా తన యిచ్ఛను బార్కర్‌తానే నిర్ణయించుకుని దానికి అనుగుణముగా వ్యవహరిస్తుంది. దానితో గుర్తింపు పొందుతుంది. అని బార్కర్ వ్యాఖ్యానిస్తాడు. మనం ఉన్నత సంస్థలో ఉన్నప్పుడు ఈ ఆత్మ చైతన్యాన్ని పొంది శాశ్విత చైతన్యం వైపు పయనించడానికి అవకాశం ఉంటుంది.

స్వేచ్ఛ అంటే కేవలం పరిమితులు లేని చర్యా స్వాతంత్ర్యం కాదు. ఒక కార్యక్రమాన్ని నిర్వహించుటలో, ఒక ఉపయోగమైన పని చేయటములో తద్వారా కలిగే ఆనందాన్ని అనుభవించడంలో సంవర్ధక స్వేచ్ఛ ఉంటుంది. యిది నైతిక భావాల ప్రతీక అయిన చట్టాన్ని అనుసరించుట ద్వారా వ్యక్తమౌతుంది. యిటువంటి స్వేచ్ఛ వ్యక్తి వికాసానికి చాలా అవసరము.

## 12.10 ఆస్థి హక్కుపై గ్రీన్ అభిప్రాయం:

గ్రీన్ అభిప్రాయం ప్రకారము స్వతంత్ర జీవనానికి ఆస్థి ప్రధాన సాధనం. నైతిక జీవనానికి స్వేచ్ఛ అవసరము కాన ఆస్థి ఆర్థిక అసమానత్వాలకు దారి తీస్తుంది. అందువలన ఎక్కువ సంపద కొద్ది మంది చేతులలో కేంద్రీకృతము కాకుండా చూడాలి. అనేక దేశాలలో భూస్వాములు, వ్యవసాయ కూలీల శ్రమను దోచుకుంటున్నారు. యిది ఆస్థికి సంబంధించిన లోపం కాదు. ఆస్థిని నిర్వహించడంలో ఉన్న లోపం. దీనిని స్వతంత్ర ఆర్థిక విధానం ద్వారా శ్రామికులను బాధ్యతా యుతమైన విద్యావంతులుగా చేయుడం ద్వారా సరిదిద్దవచ్చునని గ్రీన్ భావించాడు. ఆస్థి వ్యక్తి యొక్క వ్యక్తిత్వాన్ని పెంపొందించడానికి అవసరమే. అయితే సమాజం భూసంపదను నియంత్రణ చేయాలి. గ్రీన్ వ్యక్తి శ్రేయోవాదానికి సోషలిజానికి మధ్య మార్గం వివరించాడు.

## 12.11 శిక్షకు సంబంధించిన సిద్ధాంతము :-

రాజ్యం నేరస్తులను శిక్షించాలని సంఘ వ్యతిరేక శక్తులను, యితరుల స్వేచ్ఛను అడ్డుకునే వారిని, సంఘ శ్రేయస్సుకు హాని చేసేవారిని కఠినంగా శిక్షించే అధికారం రాజ్యానికి ఉందని గ్రీన్ అభిప్రాయము. శిక్ష ప్రతీకారచర్యగా ఉండరాదు. ఒక వ్యక్తి యింకొక వ్యక్తి వల్ల బాధింపబడితే, రాజ్యం బాధింపబడినట్లే. వ్యక్తులను రాజ్యం రక్షించాలి గనుక రాజ్యం నేరస్తులను శిక్షించాలి. నేరస్తుడిని శిక్షించడంలో వ్యక్తిగత కక్షలేదు. శిక్ష నేరాన్ని నివారించేదిగా ఉండాలి. దాని ముఖ్యోద్దేశం హక్కులను అతిక్రమించకుండా ఉండేటట్లు చేయడమే. నేరస్తులు తిరిగి అటువంటి నేరాలు చేయకుండా చూడడమే శిక్ష లక్ష్యం. అయితే నేరానికి, శిక్షకు సాయపడాలి. శిక్షించేటప్పుడు నేరం జరిగిన పరిస్థితులు పరిశీలించాలి. దానినిబట్టి శిక్ష నామమాత్రంగా లేదా తీవ్రంగా ఉండాలి.

## 12.12 సారాంశము :-

గ్రీన్ బ్రిటీష్ ఉదారవాదానికి హెగెలియన్ ఆదర్శవాదానికి సమన్వయం చేయడానికి ప్రయత్నించాడు. యిది వ్యక్తి యొక్క స్వేచ్ఛ ఇచ్ఛ పై ఆధారపడి ఉంటుంది. నైతిక చర్యను సూచిస్తుంది. ఈ సందర్భంలో మానవ చైతన్యం స్వేచ్ఛను ప్రతిపాదిస్తుంది. స్వేచ్ఛ హక్కుల చుట్టూ తిరుగుతుంది. హక్కులు రాజ్యాన్ని కోరుతాయి అంటాడు గ్రీన్.

గ్రీన్ హెగెల్‌ను అనుసరించినప్పటికి తన వాదంలో కొన్ని వ్యక్తి స్వేచ్ఛ భావాలను ప్రవేశపెట్టాడు. గ్రీన్ యొక్క ఉదారవాదం దృక్పథం హెగెల్ ప్రతిపాదించిన సంపూర్ణ వాదాన్ని కొంతవరకు సడలించింది. హెగెల్ వలె గ్రీన్ కూడా దివ్య హేతువు లేదా చిదాత్మ ఉన్నదని విశ్వసించాడు. యిద్దరు కూడా మానవుడు పరిపూర్ణతను రాజ్యంలోనే సాధించగలడని భావించినారు. ఆ విధంగా రాజ్యానికి సంబంధించినంతవరకు గ్రీన్, హెగెల్‌కి దాదాపు ఏకాభిప్రాయమున్నది. అయితే గ్రీన్‌లో వ్యక్తి స్వేచ్ఛా భావాలు ఎక్కువ కన్పిస్తాయి. హెగెల్ రాజ్యానికి రాజ్యమే లక్ష్యమని భావిస్తే, లక్ష్యసాధనకు రాజ్యమొక పనిముట్టని గ్రీన్ భావించాడు. రాజ్యం యొక్క ధ్యేయం వ్యక్తి యొక్క నైతిక ఔన్నత్యాన్ని కాపాడటము. గ్రీన్ ఉద్దేశ్యములో సంస్థలు వ్యక్తి కొరకు ఏర్పాడాలే గాని, వ్యక్తి సంస్థల కొరకు కాదు. అందువల్ల రాజ్యానికి వ్యక్తి య్యొక్క నైతిక చైతన్యానికి మధ్య ఘర్షణ ఏర్పడినప్పుడు వ్యక్తి రాజ్యాన్ని వ్యతిరేకించవచ్చునని గ్రీన్ వాదిస్తాడు. ఈవిధంగా హెగెల్ ప్రభావము ఉన్నప్పటికి గ్రీన్ వ్యక్తికి ప్రాముఖ్యతనిచ్చాడు.

## 12.13 మాదిరి ప్రశ్నలు:

ఈ క్రింది వానికి వ్యాసరూపంలో జవాబులు వ్రాయండి?

1. టి.హెచ్. గ్రీన్ యొక్క హక్కుల సిద్ధాంతాన్ని వివరించండి?

2. గ్రీన్ యొక్క రాజనీతి తత్వ ప్రధానాంశములను వ్రాయుము?

3. "రాజ్యానికి ఆధారము ఇచ్ఛ కాని, శక్తి కాదు" చర్చించండి?

## లఘు ప్రశ్నలు:

1. సంవర్ధక స్వేచ్ఛ
2. ఆస్థి హక్కుపై గ్రీన్ భావన
3. గ్రీన్ ఉద్దేశ్యములో రాజ్య విధులు

## 12.14 చదువదగిన గ్రంథాలు:


| | | | |
|---|---|---|---|
| 1. | యాంగ్రోహకర్ | : | పొలిటికల్ థీరి |
| 2. | జె.పి. సుధ | : | ఏ హిస్టరీ ఆఫ్ పొలిటికల్ థాట్ |
| 3. | ఆర్.సి. గుప్తా | : | గ్రేట్ పొలిటికల్ థింకర్స్ |
| 4. | ఫోస్టర్ యం.బి | : | మాస్టర్స్ ఆఫ్ పొలిటికల్ థాట్ |


డా॥ కె. రామచంద్రమూర్తి

పాఠము - 14

# సామ్యవాదం - కార్ల్‌మార్క్స్

**(1818 - 1883)**

విషయసూచిక-


14.1 పరిచయం
14.2 కార్ల్‌మార్క్స్ జీవిత సంగ్రహం
14.3 రచనలు
14.3.1 ది కమ్యూనిస్ట్ మానిఫెస్టో
14.4 మార్క్స్ పై ప్రభావాలు
14.5 గతితార్కిక భౌతికవాదం
14.6 చారిత్రక భౌతికవాదం
14.7 అదనపు విలువ లేక మిగులు విలువ సిద్ధాంతం
14.8 వర్గపోరాట సిద్ధాంతం
14.9 శ్రామికవర్గ నియంతృత్వం
14.10 కమ్యూనిస్ట్ వ్యవస్థ
14.14.1 మొదటిదశ
14.14.2 కమ్యూనిస్ట్ ఉన్నతదశ
14.14.3 రాజ్యరహిత సమాజం
14.11 రాజ్య సిద్ధాంతం
14.12 మార్క్సిజం పై విమర్శ
14.13 మార్క్స్ విశిష్టత
14.14 చదువదగిన గ్రంథాలు


## 14.1 పరిచయం :

సామ్యవాదం అనే భావన 1804లో మొదలైంది. 1815 నాటి ఆర్థిక పరిస్థితులు సామ్యవాద భావాలకు ఊపిరిపోశాయి. ఐరోపాలో పారిశ్రామిక విప్లవం జరిగింది. దానితోపాటే అనేక సామాజిక, ఆర్థిక దుస్థితులేర్పడినాయి. ఫ్యాక్టరీ ఉత్పత్తి విధానం సంపన్నులను మరింత సంపన్నులుగాను, పేదవారిని మరింత పేదరికంలోకి మార్చివేసింది. అశేష సంఖ్యలో పల్లెల నుండి పట్టణాలకు వలస ఆరంభమైంధి. నిరక్షరాస్యత, పేదరికం, మురికివాడలలో వసతి, దుర్భరజీవన పరిస్థితుల వలన శ్రామికులు నిరాశ నిస్పృహలకు లోనైనారు. కార్మిక సంఘాలు స్థాపించబడినాయి. పెట్టుబడిదారీవర్గానికి, శ్రామిక వర్గానికి మధ్య అంతరం పెరిగింది. హక్కుల పోరాటాలు అణచివేయబడినాయి. ఇట్టి పరిస్థితుల నుండి బయటపడాలన్న శ్రామికుల తపనే సామ్యవాద సిద్ధాంతానికి మూలాధారమైంది. తొలిసామ్యవాద భావాల పుట్టుక జరిగింది.

సెయింట్ సైమన్, రాబర్ట్ ఓవెన్ మొదలగు ఇంగ్లీష్ తాత్వికులు, ఫ్రెంచి సామ్యవాదులు ఉపయోగితావాద సామ్యవాదాన్ని ప్రతిపాదించారు. 1820 నాటి ఇటలీలో సామ్యవాదం ఉధృతంగా ప్రచారమైంది. సంస్కరణల ద్వారా పెట్టుబడిదారీ వ్యవస్థలో మార్పుతెచ్చి సామ్యవాద వ్యవస్థగా రూపొందించవచ్చునని ఊహించారు. వారికి తమగమ్యం తెలుసు. గమ్యం చేరాలనే ఆలోచనావుంది. కాని గమ్యాన్ని చేరే మార్గమే తెలియదు. వారి భావాలు ఊహలకే పరిమితం అయ్యేయి కాల్పనిక సామ్యవాదులు మానవతావాదులుగానే మిగిలిపోయారు. ఒక పరివర్తనాశీలసిద్ధాంతాన్ని ప్రతిపాదించలేకపోయారు.

మితవాద సామ్యవాద ధోరణిని నిరసిస్తూ అతివాద సామ్యవాదం అవతరించింది. కార్ల్‌మార్క్స్, ఫ్రెడ్రిక్ ఏంగెల్స్ ఈ అతివాదానికి ఆద్యులు. వీరి భావాలే మార్క్సిజంగా ప్రసిద్ధిచెందాయి. కాల్పనిక జగత్తు నుండి సామ్యవాదం వాస్తవంలోకి అడుగుపెట్టింది. చరిత్రను అధ్యయనం చేయటంలోనూ, సమకాలీన ఆర్థిక, సామాజిక పరిస్థితిని విశ్లేషించటంలో శాస్త్రీయ అధ్యయన పద్ధతులను ప్రయోగించటం వలన మార్క్సిజం శాస్త్రీయతను ఆపాదించుకుంది. శాస్త్రీయ సామ్యవాదంగా ఈ మార్క్సిజం ఖ్యాతిపొందింది. దేశదేశాలలో పీడిత ప్రజానీకం విముక్తి కోసం ఎదురుచూస్తున్న తరుణంలో మార్క్సిజం అవతరించింది. వారికి మార్గదర్శకత్వంగా నిలిచింది. ఆధునిక సామాజిక జీవనాన్ని మార్క్సిజం ప్రభావితం చేసినంతగా రాజనీతితత్వ చరిత్రలో ఏ ఇతర సిద్ధాంతం చేయలేదని నిస్సందేహంగా చెప్పవచ్చును.

## 14.2 కార్ల్‌మార్క్స్ జీవిత సంగ్రహం :

శాస్త్రీయ సామ్యవాద పితామహుడుగా ఖ్యాతినార్జించిన కార్ల్‌మార్క్స్ 1818 మే 5న ప్రష్యా (జర్మనీ)లో రైన్‌లాండ్ రాష్ట్రంలో ట్రెవెస్ నగరంలో జన్మించాడు. తండ్రి పేరు హెర్షల్‌మార్క్స్. ఇతడు యూదు మతస్థుడు. 1824లో మార్క్స్ బాల్యంలో ఈ కుటుంబం క్రైస్తవ మతం స్వీకరించింది. మార్క్స్ తన జీవితపర్యంతం ఏ మతం లేకుండానే గడిపాడు. 1835లో న్యాయశాస్త్ర అధ్యయనానికి బాన్ విశ్వవిద్యాలయంలో చేరాడు. 1836లో బెర్లిన్ విశ్వవిద్యాలయంల్లో చేరాడు. బ్రూనో, బౌర్ రచనలను అధ్యయనం చేసి నాస్తిక భావాలను అలవర్చుకొన్నాడు. డెమోక్రటిస్ తత్వానికి ఎపిక్యూరియన్ తత్వానికి గల తారతమ్యాలపై పరిశోధన వ్యాసాన్ని సమర్పించి 1841లో జెనా యూనివర్సిటీ నుండి డాక్టరేట్ డిగ్రీని పొందాడు. 1843లో చిరకాల స్నేహితురాలైన జెన్నీవాన్ వెస్ట్‌ఫాలెన్‌ను వివాహం చేసుకొన్నాడు.

ఎపిక్యూరియన్ సిద్ధాంతములోని భౌతికవాదం మార్క్స్‌ను బాగా ఆకర్షించింది. భావ సిద్ధాంతాలకన్న, భావాలు సాధించటానికి దారితీసిన భౌతిక పరిస్థితులకే ప్రాధాన్యత వుండాలని మార్క్స్ విశ్వసించాడు. బాన్ విశ్వవిద్యాలయంలో ఆచార్య పదవిని ఆశించాడు. అతని విప్లవ భావాల వలన ఆ అవకాశం లభించలేదు. అదే కనుక పొందివుంటే బహుశా "కమ్యూనిస్టు మానిఫెస్టో" వంటి విప్లవాత్మక రచన చేసేవాడు కాదు. శ్రామికుల అర్థశాస్త్రం వైపు మరలేవాడుకాదు. (మార్క్స్ వ్యాఖ్యానం).

వార్తాపత్రిక రచయితగా, సంపాదకునిగా విప్లవధోరణితో తిరుగుబాటు భావాలను ప్రచారం చేశాడు. 1843లో ప్రష్యన్ పాలకులు ఇతని ప్రచురణలను నిషేదించారు. కుటుంబ సమేతంగా కార్ల్‌మార్క్స్ ఫ్రాన్స్‌కు చేరుకున్నాడు. తన జీవితాంత సహచరుడైన ఏంగెల్స్‌ను ఇక్కడే కలుసుకున్నాడు. తన సిద్ధాంతాలలో సమాన భాగస్వామిని చేశాడు. వీరిరువురూ ప్రతిపాదించిన ఆర్థిక, సామాజిక సిద్ధాంతాలే మార్క్సిజంగా ప్రసిద్ధిపొందాయి.

ఫ్రాన్స్‌లో విప్లవరాజకీయాలలో పాల్గొన్నాడు. 1895లో ఫ్రాన్స్ నుండి మార్క్స్ బహిష్కరింపబడినాడు. ప్రవాసులందరకూ ఆశ్రయం కలిగివున్న బ్రస్సెల్స్ చేరాడు. తత్వశాస్త్రం, రాజకీయ, ఆర్థిక, సాంఘీక శాస్త్రాలను అధ్యయనం

చేశాడు. విప్లవాలలో చురుకుగా పాల్గొన్నాడు. ఏంగెల్స్ సహకారముతో "కమ్యూనిస్ట్ మేనిఫెస్టో" రచన ఇక్కడే జరిగింది. 1849లో శాశ్వతంగా దేశబహిష్కరణకు గురిఅయ్యాడు.

ఏంగెల్స్ సహాయంతో లండన్ చేరుకున్నాడు. అమూల్యమైన తనకాలాన్నంతా బ్రిటిష్ మ్యూజియమ్ లైబ్రరీలో గడిపాడు. 'దాస్ కాపిటల్' మొదటి భాగాన్ని ప్రచురించాడు. అతని మరణానంతరం మిగిలిన భాగాలను ఏంగెల్స్ పూర్తిచేశాడు. మరణించేవరకు దుర్భరదారిద్ర్యాన్ని అనుభవించాడు.

మార్క్స్ ఒక క్రియాశీలక వ్యక్తి. 1864లో ఏంగెల్స్‌లో కలిసి కమ్యూనిస్ట్ ఇంటర్ నేషనల్ అనే సంస్థను స్థాపించాడు. కమ్యూనిస్ట్ కమిటీ ఆఫ్ కరస్పాండెన్స్‌ను, కమ్యూనిస్ట్ లీగ్‌ను స్థాపించాడు. జీవితకాలమంతా కష్టాలతో, ఉద్యమాలతో గడిచింది. వృద్ధాప్యంలో ఆరోగ్యం క్షీణించి 1883 మార్చి 14న మార్క్స్ మరణించాడు. అతని మార్క్సిజం కోట్లాదిమంది శ్రామికులను, మేధావులను ఉత్తేజపరచింది.

## 14.3 రచనలు :

కార్ల్‌మార్క్స్ విరివిగా రచనలు చేశాడు. ఈ క్రింది వాటిని అత్యంత ప్రధానంగా పేర్కొనవచ్చును.

1. ది పావర్టీ ఆఫ్ ఫిలాసఫీ (1847)
2. ది కమ్యూనిస్ట్ మానిఫెస్టో (1848)
3. ది క్రిటాక్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ (1859)
4. దాస్ కాపిటల్ (1867)
5. వేల్యూ, ప్రైస్ అండ్ ప్రాఫిట్ (1867)
6. ది సివిల్ వార్ ఇన్ ఫ్రాన్స్ (1870 - 71)

### 14.3.1 ది కమ్యూనిస్ట్ మానిఫెస్టో :

మార్క్స్, ఏంగెల్స్ లిరువురూ కలిసి రచించిన ది కమ్యూనిస్ట్ మానిఫెస్టో 1848లో లండన్‌లో ప్రచురింపబడింది. విప్లవకర ఉత్తేజంతో, సృజనాత్మకతతో రచింపబడింది. నాలుగు భాగాలుగా విభజింపబడింది. మొదటిభాగంలో సామాజిక పరిణామ చరిత్ర, ఆధునిక పెట్టుబరీదారీ, వాణిజ్యవర్గాల (బూర్జువా) వృద్ధి వివరింపబడింది. కమ్యూనిస్ట్ పార్టీ సిద్ధాంతాలు, పరిధి, ప్రణాళిక కార్యక్రమాన్ని అమలుచేయు సాధనాలను రెండవభాగం విశదీకరిస్తుంది. మూడవభాగం సమకాలీన సోషలిస్ట్, కమ్యూనిస్ట్ సాహిత్యాన్ని పరిశీలించింది. కాల్పనిక సామ్యవాదంను తీవ్ర పదజాలంతో గర్హించింది. నాల్గవభాగం విభిన్న ప్రతిపక్షాలతో కమ్యూనిస్ట్‌ల సంబంధాన్ని, స్థితిని, కమ్యూనిస్ట్‌ల మౌలిక, తాత్త్విక సిద్ధాంతాన్ని అత్యంతశక్తివంతంగా వివరించింది.

కమ్యూనిస్ట్ మానిఫెస్టో సామాజిక విప్లవానికి సాధనం. ఆధునిక ప్రపంచ సామాజిక, ఆర్థిక, రాజకీయ విధానాన్ని ఇంత అమితంగా ప్రభావితం చేసిన రాజకీయ రచన వేరొకటిలేదు. అసంఖ్యానీక వ్యాఖ్యానాలకు, ఉద్యమాలకు దారితీసింది.

## 14.4 మార్క్స్ పై ప్రభావాలు :

బాన్ విశ్వవిద్యాలయంలో మార్క్స్ విద్యార్థిగా ఉన్నకాలములో హెగెల్ తత్వశాస్త్రంలో ఆచార్యునిగా పనిచేశాడు. తన రాజనీతి తత్వం ప్రతిపాదించుటలో "గతితార్కిక" భావాన్ని ప్రవేశపెట్టాడు. పరిణామక్రమంలో 'వాదం'(Thesis)

ప్రతివాదం'(Anti-Thesis) 'సమన్వయం' (Synthesis) లు వుంటాయని, అశాశ్వతత్వం నుంచి శాశ్వతాన్ని, అవాస్తవికత నుండి వాస్తవికతను వేరుచేయవచ్చని వివరించాడు. హెగెలియన్ ఆదర్శవాదాన్ని తిరస్కరిస్తూ అతని గతితార్కిక భావాన్ని మార్క్స్ తన చారిత్రక పరిణామ విశ్లేషణలో సరైన సాధనంగా ఉపయోగించాడు.

ఫ్రెంచి భౌతికవాదుల ప్రభావం కూడా మార్క్స్ పై కనబడుతుంది. రాజకీయ వ్యవస్థతోపాటు, మతం, మతతత్వం, అధి భౌతికవాదం (Meta Physics) లకు వ్యతిరేకంగా వారు పోరాడినతీరు మార్క్స్‌ను ఆకర్షించింది. అర్థశాస్త్రాన్ని అధ్యయనం చేసి కొన్ని పరిశోధనలు నిర్వహించాడు. ప్రఖ్యాత ఆర్థికశాస్త్ర వేత్తలైన ఆడమ్‌స్మిత్, డేవిడ్ రికార్డో రచనలను అధ్యయనం చేశాడు. సాంఘిక వ్యవస్థను సమస్త కాలాలలోను ప్రభావితం చేసేవి ఆర్థిక సంబంధాలేననే భావనతో తన సిద్ధాంతాన్ని ఆరంభించాడు. రికార్డో ఆర్థిక వ్యవస్థను సామాజిక దృక్పథంతో పరిశీలించి శ్రమవిలువ సిద్ధాంతాలను ప్రతిపాదించాడు. దాని ఆధారంగా మార్క్స్ తన "మిగులు విలువ" సిద్ధాంతాన్ని వివరించాడు. శ్రమించేవ్యక్తి నిరుపేదగా మారుతున్నాడు. శ్రమ చేయని వ్యక్తి సంపద నానాటికీ వృద్ధి పొందుతుంది. ఈ వైపరీత్యానికి గల కారణాలను మార్క్స్ స్పష్టంగా పేర్కొన్నాడు.

జర్మన్ భావజాలం, ప్రధానంగా హెగెల్ గతితార్కికవాదం, బ్రిటిష్ ఆర్థికశాస్త్రవేత్తల ఆలోచనాసరళి, ఫ్రెంచి మేధావుల భౌతికవాదం, విప్లవవాదం, సామాజిక విధానాలు మొదలైన అనేకం కార్లమార్క్స్ సిద్ధాంతాలలో వ్యక్తీకరించబడినాయి. అతని ఉద్దేశ్యంలో భౌతికవాదమంటే సామాజిక వ్యవస్థను పూర్తిగా మార్చివేయుట, మతాన్ని నిరసించుట, ఆశయ సాధనకై ఉద్యమాలను నిర్వహించుట. గతితార్కిక భౌతికవాదం శ్రామికులకు విప్లవ తత్వశాస్త్రం కాగలదని భావించాడు. మార్క్స్ భావాలకు, సిద్ధాంతాలకు గతితార్కిక భౌతికవాదం పునాదిగా నిలిచింది.

## 14.5 గతితార్కిక భౌతికవాదం (Dialectical Materialism) :

మార్క్సిజం - గతితార్కిక భౌతికవాదంలు రెండు ఒకదానికొకటి పర్యాయపదాలుగా మారాయి. గ్రీకుభాషలో వాద, ప్రతివాద విద్యను "డైలెక్టిక్"గా వ్యవహరిస్తారు. వాద, ప్రతివాదాలు రెంటిలోనూ మంచి, చెడులు, వాస్తవాలు, అవాస్తవాలు కలిసే వుంటాయి. వాటిలో అంతర్గతంగా వున్న మంచిని, వాస్తవాన్ని గ్రహిస్తూ, 'సమన్వయం' ముందుకు వస్తుంది. హెగెల్ తన ఆదర్శవాద ప్రతిపాదనలో గతితార్కిక పద్ధతిని తాత్విక దృష్టితో వివరించాడు. భావజగత్తుకే పరిమితం కాబడింది. అదే గతితార్కిక భౌతికవాదాన్ని మార్క్స్ గ్రహించి భౌతికస్థితి గతులను అధ్యయనం చేయడానికి వినియోగించాడు. దాని సహాయంతో చారిత్రక విశ్లేషణ చేశాడు. మార్క్స్ వివరించిన సామాజిక సిద్ధాంతాలన్నింటికి గతితార్కిన భౌతికవాదమే తాత్వికపునాది అయింది.

హెగెల్ ఆదర్శవాది. గతివార్కికవాదాన్ని చరిత్రతత్వానికి అన్వయించాడు. భౌతిక ప్రపంచానికి అతీతంగా, నిగూఢంగా ఒకశక్తి వుంటుందని దానికి "చిదాత్మ" (Spirit) అని, పేరుపెట్టాడు. ఇది సర్వస్వతంత్రంగా వుంటుంది. తనకు తానుగా పరిపూర్ణత్వాన్ని పొందటానికి నిరంతరం యత్నిస్తూనే వుంటుంది. తనలో తానే వైరుధ్యాలు సృష్టించుకొని అంతః సంఘర్షణలకు లోనౌతుంది. కొంతకాలానికి తన పూర్వపు స్థితి కోల్పోయి వేరొక ఉన్నతస్థితికి చేరుతుంది. వాదం, ప్రతివాదంల మధ్య సంఘర్షణ తీవ్రస్థాయికి చేరిన తరుణంలో ఆ రెంటిలో వుండే చెడు లేక అవాస్తవికత తొలగిపోయి, వాటిలో వుండే మంచి లేక వాస్తవికత బహిర్గతం అవుతుంది. అనగా సమన్వయం ఏర్పడుతుంది. విరుద్ధాంశాల మధ్య ఘర్షణ ఫలితంగా జ్ఞానాభివృద్ధి కలుగుతుంది. ఈ సమన్వయం మళ్ళీ కొంతకాలానికి వాదంగా మారి అంతఃసంఘర్షణకు లోనౌతుంది. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతూనే వుంటుందని హెగెల్ వివరించాడు.

హెగెల్ భావుకతావాదాన్ని నిరశించి మార్క్స్ భౌతిక ప్రపంచ వాస్తవాలనే పరిగణనలోకి తీసుకున్నాడు. హెగెల్ యొక్క గతి తార్కికత తలక్రిందులుగా నిలబడిందని, దానిని తాను సరిచేస్తున్నానని మార్క్స్ ప్రకటించుకొన్నాడు. భౌతిక ప్రపంచపు అభివృద్ధి క్రమాన్ని గతితార్కిక విధానంలోనే అధ్యయనం చేసి తన సామాజిక సిద్ధాంతాలను ప్రతిపాదించాడు.

సామాజికాభివృద్ధి మానవుల ద్వారానే జరుగుతుంది. తమ చరిత్ర తామే లిఖించుకొంటారు. ఇది భౌతికపరిస్థితుల ఆధారంగా వుంటుంది. భౌతిక ప్రగతిని, ఉత్పత్తి శక్తుల - ఉత్పాదక సంబంధాల మధ్య గల ఘర్షణలను, విభిన్న చారిత్రక పరిస్థితులలో సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిణామాలు జరిగిన విధానాన్ని వివరించే సూత్రాలను తెలపటానికి గతితర్కాన్ని మార్క్స్ వినియోగించుకున్నాడు. దీన్నిచరిత్రకు అన్వయిస్తూ ఆర్థికశక్తుల ప్రగతిద్వారానే చరిత్ర ప్రభావితమైందని అంటాడు. ప్రకృతితో మన సంఘర్షణ ఫలితమే మన భావాలు. బాహ్య ప్రపంచంలోను, మానవ చింతనలోనూ జరిగే చలనానికి చెందిన సాధారణ నియమాలను వివరించే సిద్ధాంతమే గతితార్కికవాదం. చరిత్ర అధ్యయనానికి ఇది మూలాధారం. విషయ అవలోకన సాధ్యమవుతుంది.

## 14.6 చారిత్రక భౌతికవాదం (Historical Materialism) :

గతితార్కిక భౌతికవాద సూత్రాలను వివిధ కాలాలలో జరిగిన సమాజపరిణితికి అన్వయింపచేయటమే చారిత్రక భౌతికవాదం. భౌతికదృక్పథంతో లేక ఆర్థిక దృక్పథంతో మానవ చరిత్రను విశ్లేషిస్తుంది. ఆర్థికపర స్థితిగతులే చారిత్రక విషయాలను నిర్ణయిస్తాయని ఈ సిద్ధాంతం చెపుతుంది - "మనుషులు తాము బతకాలనుకుంటే తినాలి" **(Simple truth, which is the clue to the meaning of history, that men must eat to live),**

భౌతికావసరాలను తీర్చుకొనుటకై వ్యక్తి కృషిచేశాడు. వస్తూత్పత్తి చేయుటలో సాధించిన విజయంపై మానవ మనుగడ ఆధారపడుతుంది. మానవుడు చేసే పనులన్నీ వస్తూత్పత్తికి చెందినవే. భౌతిక జీవనావసరాలన్నీ తీర్చగల ఒకేఒక ప్రక్రియ వస్తూత్పత్తి. మానవుడు తన అవసరాలన్నీ తానే ఒంటరిగా సమకూర్చుకోలేడు. ఇతరుల సహకారం, సహజీవనం తప్పనిసరి. ఈ భౌతికావగాహనే మానవ సమాజనిర్మాణానికి దోహదం చేసింది. అప్పటికీ తన అవసరాలు తీరనప్పుడు ఉత్పత్తి పద్ధతులలోగాని, ఉత్పత్తి సాధనాలలో గాని లోపాలున్నాయని తెలుసుకుంటాడు. అలా గ్రహించలేనివ్యక్తి దేవుణ్ణి మానవాతీతశక్తుల్ని, మతాన్ని ఆశ్రయిస్తాడు. అవసరాలు తీరే అవకాశం లేని భౌతిక సామాజికోత్పత్తిలో మతమే మనుషులకు మత్తుమందులా పనిచేస్తుందని మార్క్స్ అంటాడు.

సామాజిక, రాజకీయ, నైతిక జీవనానికి పునాది వస్తూత్పత్తి. భౌతిక పరిస్థితులే సమాజజీవన పరిస్థితులను నిర్ణయిస్తాయి. ఉత్పత్తి రంగంలో వచ్చే మార్పులే సామాజిక చైతన్యంలో కూడా మార్పులు తెస్తాయి. ఈ భౌతిక పరిస్థితులే సామాజికాభివృద్ధిలో చారిత్రక పరిణామాలకు మూలం. మానవులు తమనుతాము మెరుగుపరచుకొనే వివిధ దశల పరిణామమే మానవచరిత్ర.

మానవచరిత్రను నాలుగు దశలుగా మార్క్స్ వర్గీకరించి వర్ణించాడు

**1. ఆదిమ సమాజం లేక ఏషియాటిక్ దశ :** ఈ దశలో ఉత్పత్తి సాధనాలన్నీ మొత్తం సహజ ఆధీనంలో వుంటాయి. ఇది సమసమాజం. ఉన్నవారు, లేనివారు అనే బేధాలులేవు. కొంతకాలానికి గతితార్కికంగా ఈ దశ అంతరిస్తుంది.

**2. ప్రాచీన సమాజం :** ఈ దశలో ఉత్పత్తి సాధనాలన్నీ యజమానుల ఆధీనంలో వుంటాయి. యజమానులు, బానిసలు అనే వర్గాలేర్పడినాయి. ప్రాచీన గ్రీసు, రోమను సమాజాలు దీనికి ఉదాహరణలు. అనివార్యంగా ఏర్పడిన పరిణామాలవల్ల ఈ సమాజం అంతరించింది.

**3. భూస్వామ్య సమాజం :** ఉత్పత్తికారకమైన భూమిపై యజమాన్యం కొద్దిమందికే లభించింది. భూస్వామ్య వర్గం అవతరించింది. మిగిలినవారు కర్షకులుగా తీర్థబానిసలుగా జీవించేవారు. అంతర్గత వైరుధ్యాలతో ఈదశ క్రమంగా నశించి, అంతరించింది.

**4. పెట్టుబడిదారీ సమాజం :** యంత్రాలు, ఫ్యాక్టరీలు, భూమి, పెట్టుబడి మొదలగు ఉత్పత్తికారకాలు అతికొద్ది మంది చేతిలో కేంద్రీకరింపబడినాయి. మిగిలిన ప్రజానీకం శ్రామికులుగా మిగిలిపోయారు. వర్గ సమాజం అవతరించింది: పెట్టుబడిదారీ వర్గం, శ్రామికవర్గం.

పైన వివరించిన చారిత్రక పరిణామం రెండవ, మూడవ, నాల్గవ దశలలో వరుసగా యజమానులు, భూస్వాములు, పెట్టుబడిదారులు మిగిలిన ప్రజానీకాన్ని పీడనకు, దోపిడీకి గురిచేశాయి. వివిధ రూపాలలో కనిపించిన ఆస్థి సంబంధాలే సామాజికవర్గ సంబంధాలుగా వర్గీకరింపబడి అసమానతలు తెచ్చాయి.

ఉత్పత్తి విధానంలో ఎప్పటికప్పుడు వైరుధ్యాలేర్పడతాయి. అనివార్యంగా నూతన విధానం ఆరంభం అవుతుంది. వ్యవసాయానికి ప్రాథమిక దశలో నాగలి ప్రధానమైన ఉత్పత్తి సాధనం. క్రమంగా ట్రాక్టరు అవసరంచోటు చేసుకుంది. చేనేత పరిశ్రమలు, కుటీర పరిశ్రమలు స్థానంలో, ఫ్యాక్టరీలు, యంత్రాలు ఉత్పత్తి రంగంలో ప్రవేశించాయి. ఈ పరిణామాలు జీవనరంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చాయి. ఈ మార్పులు జరిగేతరుణం తీవ్రస్థాయికి చేరినపుడు హింసాపూరిత ఘర్షణలు, ఉద్యమాలు జరగవచ్చు. ఫలితంగా నవ్యసమాజ నిర్మాణం జరుగుతుంది. అభివృద్ధి పథంవైపు నడుస్తుంది. వీటన్నింటికి మూలకారణం గతివార్మిక వైరుధ్యాలేనని మార్క్సువాదము. ఉత్పత్తి శక్తుల ఆధారంగా భిన్నసమాజాల పుట్టుక, అభివృద్ధి, పరిణామం, పతనాల గురించి తన చారిత్రక భౌతికవాదంలో వివరించాడు.

## 14.7 అదనపు విలువ లేక మిగులు విలువ సిద్ధాంతం (The Theory of Surplus Value) :

ఆర్థిక అన్వేషణలో మౌలిక భావం అదనపు విలువ సిద్ధాంతం. రికార్డో ప్రతిపాదించిన శ్రమవిలువ సిద్ధాంతాన్ని విస్తృతపరచి మార్క్స్ అదనపు విలువ సిద్ధాంతం రూపొందించాడు. వస్తూత్పత్తికి వినియోగించిన శ్రమశక్తే ఆ వస్తువు విలువను నిర్ణయిస్తుందని డేవిడ్ రికార్డో సిద్ధాంతం. వస్తువుకు విలువ లభించేది మానవ శ్రమ ద్వారానే అని మార్క్స్ తన సిద్ధాంతాన్ని కొనసాగించాడు. శ్రమశక్తిని, శ్రమించే కాలానికి ధర నిర్ణయించి పెట్టుబడిదారుడుకొంటాడు. యంత్రాలను, ముడి పదార్థాలను సేకరించి వస్తూత్పత్తి చేస్తాడు. మార్కెట్లలో ఆ వస్తువులకు మారకవిలువ వుంటుంది. ఈ మారకపు విలువకు శ్రామికుడు తన శ్రమశక్తికి పొందే వేతనానికి మధ్యగల తేడాయే 'అదనపు విలువ' ఇది 'దాగిన విలువ'. పెట్టుబడిదారుడు దీనిని సొంతం చేసుకుంటాడు. న్యాయంగా శ్రామికునికి చెందవలసిన ఈ అదనపు విలువను పెట్టుబడిదారుడు తన సొంతం చేసుకొనుట ద్వారా దోపిడీవిధానం అవలంబిస్తాడు. ఆధునిక పారిశ్రామిక వ్యవస్థలో దోపిడీ విధానం అత్యంత ప్రధానమైన అన్యాయం.

"ఎవరైతే ఉత్పత్తి సాధనాలను తమ ఆధీనంలో వుంచుకుంటారో వాళ్ళు ఆర్థిక వ్యవస్థనేకాక రాజకీయవ్యవస్థను కూడా నియంత్రిస్తారు (మార్క్స్) సంపద కేంద్రీకరణ తీవ్రరూపం దాలుస్తుంది. శ్రమించని పెట్టుబడిదారుడు సౌఖ్యంగా జీవిస్తాడు. శ్రామికుడు దారిద్ర్యంతో, నిరుద్యోగంతో, బానిసత్వంతో నిరాశ, నిస్పృహలకులోనౌతాడు. కొంతకాలానికి ఈ

శ్రామిక వర్గం చైతన్యం పొంది సంఘటితపడుతుంది. పెట్టుబడిదారీవర్గం - శ్రామిక వర్గాలమధ్య తీవ్రమైన ఘర్షణ జరుగుతుంది. పెట్టుబడిదారీవ్యవస్థ పతనం చెందడం అనివార్యం అని మార్క్స్ ప్రకటించాడు. శ్రామికవర్గాన్ని దారిద్రస్థితికి నెట్టి, దోపిడీకి గురిచేసి వారిలో వర్గచైతన్యాన్ని కలుగచేసి, సంఘటితపరచి తన అంతానికి పెట్టుబడిదారీవర్గముతానే కారణమవుతుంది.

## 14.8 వర్గపోరాట సిద్ధాంతం (Class Struggle) :

The history of all hitherto existing society is the history of class struggles - Karlmarx (communist Manifesto).

మానవజాతి చరిత్ర గమనాన్ని సంఘర్షణగా మార్క్స్ వర్ణించాడు. 'ఆదిమ వ్యవస్థనుమినహాయించి మిగిలిన అన్ని చారిత్రక దశలలోను మానవసమాజం వర్గాలుగా విడిపోయింది. ఈ వర్గవైరుధ్యాలే వివిధ దశలలో సమాజం అభివృద్ధి చెందటానికి చోదకశక్తిగా పనిచేసింది.

"సర్వ సమాజ చరిత్ర వర్గ సంఘర్షణల చరిత్రే. యజమాని - బానిస, కులీనుడు - సామాన్యుడు, భూస్వామి-కర్షకుడు, చేతిపరిశ్రమల యజమాని - కూలివాడు, ఒక్కమాటలో పీడించేవాడు - పీడితుడు, ఒకరితోనొకరు నిరంతరం వైరుధ్యంతో వుంటారు. ఈ పోరాటం ఒకప్పుడు ప్రచ్ఛన్నంగా, బహిరంగంగా కొనసాగుతుంది. ప్రతీ పర్యాయం సమాజ విప్లవాత్మక పునర్నిర్మాణం జరుగ్గటయో లేక పోరాడే వర్గాల పరస్పర నాశనాత్మక పునర్నిర్మాణం జరుగటయో లేక పోరాడేవర్గాల పరస్పరనాశనమో సంభవిస్తేనే ఈ పోరాటం అంతమవుతుంది". (కార్ల్‌మార్క్స్)

ఆదిమ సమాజం వర్గసమాజంగా మారింది. యజమానులు - బానిసలు అనే వర్గాలేర్పడినాయి. యజమానులు ఉత్పత్తి సాధనాలనుతమ ఆధీనంలో వుంచుకొని తమ అవసరాలకనుకూలంగా సమాజాన్ని నిర్థేశిస్తారు. అస్తిత్వాన్ని నిలుపుకొనుటకై దోపిడీని అరికట్టాలనే భావం పీడితవర్గాలలో కలగటానికి పీడితవర్గమే కారణమౌతుంది. వర్గసంఘర్షణకు దారి తీస్తుంది. నూతన సమాజ వ్యవస్థ జన్మిస్తుంది, మానవచరిత్రలో వివరించిన మూడుదశలూ - బానిస సమాజం, భూస్వామ్యసమాజం, పెట్టుబడిదారీసమాజం ఈ పద్ధతిలోనే జన్మించాయి. పోరాటాల ఫలితంగా నూతన సమాజాలు జన్మించాయి. ప్రతీ సమాజం ఆరంభదశలో అభివృద్ధికరంగా నడిచాయి. కాలం గడిచేకొద్దీ అంతర్గత వైరుధ్యాలు బహిర్గతం అవుతాయి. వర్గపోరాటాలు సంభవిస్తాయి.

పెట్టుబడిదారీ విధానంలో వైరుధ్యాలే స్పష్టంగాను, చాలా తీవ్రంగాను వుంటాయి. ఒకవైపు పెట్టుబడిదారులు ఉత్పత్తి సాధనాలన్నింటినీ తమ ప్రైవేటు ఆస్థిగా మార్చి గుత్తాధిపత్యాన్ని సాధిస్తారు. రెండవ వైపు శ్రామికవర్గం తమ శ్రమను పెట్టుబడిగా తద్వారా అవసరాలకుచాలని వేతనాలతో జీవనసమరం సాగిస్తుంది. శ్రామికుల శ్రమను మిగులు విలువగామార్చి సొంతం చేసికొని (దోపిడీ) అత్యధిక లాభార్జిస్తారు పెట్టుబడిదారులు. ఈ స్థితిలో వర్గపోరాటం అనివార్యం.

వర్గపోరాటాన్ని, దాని పర్యావసానాన్ని తన కమ్యూనిస్ట్ మానిఫెస్టోలో మార్క్స్ విశదపరచాడు. పారిశ్రామికాభివృద్ధి పెరిగినకొద్దీ శ్రామికసంఖ్య పెరుగుతుంది. వారు కార్మిక సంఘాల నేర్పరచుకొని సంఘటితపడతారు. దేశంలో కార్మిక సంఘాలన్నీ ఒక దశలో ఏకమై తమన్యాయ పోరాటాన్ని సాగిస్తాయి. ఇది ఒక జాతీయపోరాటంగా మారుతుంది. పెట్టుబడిదారీ వ్యవస్థ బలపడినకొద్దీ ఆర్థిక సంక్షోభాలేర్పడతాయి. నిరుద్యోగం, దారిద్ర్యం ప్రబలుతాయి. తన పతనానికి తానే విప్లవబీజాలు నాటుతుంది. అంతిమంగా పెట్టుబడిదారీవ్యవస్థ పతనమై అంతరిస్తుంది. సామాజికస్థితిలో ప్రగతిశీలక మార్పులేర్పడతాయి. నూతనశకం ఆరంభం అవుతుంది. 'శ్రామికవర్గ నియంతృత్వం' అమలులోకి వస్తుంది.

## 14.9 శ్రామికవర్గ నియంతృత్వం (Dictatorship of the Proletariat) :

శ్రామికవర్గం విప్లవం ద్వారా పెట్టుబడిదారీవ్యవస్థపై విజయాన్ని సాధించి శ్రామికవర్గ నియంతృత్వ విధానాన్ని ప్రవేశపెడుతుంది. కమ్యూనిస్టు సమాజాన్ని స్థాపించేది శ్రామికవర్గ నియంతృత్వమేనని మార్క్స్ విశ్వసించాడు. ఇది సంధి దశలో ఏర్పడే ఒక తాత్కాలిక విప్లవవ్యవస్థ. దీన్ని సోషలిస్ట్ వ్యవస్థగా పేర్కొనవచ్చు. పెట్టుబడిదారీ వ్యవస్థ పతనానంతరం వెంటనే కమ్యూనిస్ట్ సమాజస్థాపన జరగదు. ఇంతవరకు ప్రైవేటు ఆస్తిగా చెలామణి అయిన సంపదను స్వచ్ఛందంగా సమాజపరం చేయటానికి బూర్జువావర్గం ఇష్టపడరు. బలప్రయోగం ద్వారా తప్ప విప్లవవ్యతిరేక శక్తులను అణచివేయటం, అంతరింపచేయటం వీలుకాదు. బూర్జువా సాంస్కృతిని నిర్మూలించటానికి కొంత వ్యవధి అవసరమౌతుంది.

పెట్టుబడిదారీ విధానాలను రద్దుచేయడానికి, దాని ప్రయోజనాలను అంతమొందించటానికి, రాజ్యాధికారాన్ని, ప్రభుత్వ యంత్రాంగాన్ని శ్రామికవర్గం తన ఆధీనంలోకి తెచ్చుకోడాన్ని శ్రామికవర్గ నియంతృత్వమని మార్క్స్ అంటాడు. ప్రైవేటు ఆస్తులను స్వాధీనం చేసికొని, ప్రజలందరకూ సంపదలో భాగస్వామ్యం ఇచ్చి, రాజకీయాధికారాన్ని, ద్రవ్య వ్యవస్థను కేంద్రీకృతం చేస్తుంది. వార్తాపత్రికలు, ప్రచార సాధనాలను, రవాణా సౌకర్యాలను స్వాధీనం చేసుకుంటుంది. ఉత్పత్తికారకాలన్నింటికీ ప్రభుత్వమే యజమాన్యం వహిస్తుంది. వ్యవసాయం, పారిశ్రామిక రంగం వంటి ఉత్పత్తి రంగాలన్నీ సహకారవిధానంలోకి మార్పుచెందుతాయి. ప్రైవేటు వ్యక్తుల గుత్తాధిపత్యం అంతంకాబడుతుంది. ఈ ఏర్పాట్లన్నీ తాత్కాలిక అంతమొందే ప్రాతిపదికపై ప్రవేశపెట్టబడతాయి. పెట్టుబడిదారీ విధానం పూర్తిగా కొనసాగుతాయి. సామ్యవాదసమాజ స్థాపనే శ్రామికవర్గ నియంతృత్వం అంతిమ లక్ష్యం.

అసమానతలకు, శ్రమదోపిడీకి, పీడితవర్గ అణచివేతకు మూలాధారమైన ప్రైవేటు ఆస్థినిక్రమక్రమంగా అంతమొందించి, వర్గసమాజానికి బాసటగా నిలచిన రాజ్యాధికారాన్ని అంతరింపచేయటానికి శ్రామిక వర్గ నియంతృత్వం నిరంత కృషి చేస్తుంది. తన ఆశయం నెరవేరగానే తాను కూడా అంతరించి చరిత్రలో కలసిపోతుంది. దోపిడీ సాధనమైన రాజ్యం అంతరిస్తుంది. వర్గరహిత, సమాజం స్థాపించబడుతుంది. దీనికి కమ్యూనిస్ట్ వ్యవస్థ అనిపేరు.

## 14.10 కమ్యూనిస్ట్ వ్యవస్థ :

కమ్యూనిస్ట్ సమాజ స్థాపనతో శ్రామికవర్గ నియంతృత్వం అంతరిస్తుందని మార్క్స్ తన "క్రిటిక్ అఫ్ ది గోథాప్రోగ్రాం'లో పేర్కొన్నాడు. ఈ సమాజం రెండుదశలలో పరిణామం చెందుతుందని వివరించాడు. 1. కమ్యూనిస్ట్ మొదటిదశ, 2. కమ్యూనిస్ట్ ఉన్నతదశ.

## 14.14.1 కమ్యూనిస్ట్ మొదటిదశ :

ఇది పరివర్తన దశ. ఇందులో పెట్టుబడిదారీ సమాజలక్షణాలు కొంతవరకూ మిగిలేవుంటాయి. ఉత్పత్తి సాధనాలన్నీ సమాజపరం అవుతాయి. జాతీయం చేయబడతాయి. ప్రతివ్యక్తి సమాజసభ్యునిగా జాతీయసంపదకూ హక్కుదారుడౌతాడు. భాగస్వామ్యం పొందుతాడు. వస్తూత్పత్తికి ప్రజలందరూ శ్రమిస్తారు. శ్రమించినంత మేరకు ప్రతిఫలం పొందుతారు. ఎంతశ్రమిస్తే అంతే ప్రతిఫలం (వేతనాలు) వుంటుంది. విద్యా, వైద్యము, సాంఘిక సంక్షేమము, వార్తారవాణా సౌకర్యాలు, గృహవసతులు మొదలైన ప్రజోపయోగ కార్యక్రమాలు పబ్లిక్ నిధి నుండి నిర్వహింపబడతాయి. ఈ దశలో సమానత్వం పూర్తిగా స్థాపితంగాదు. హెచ్చుతగ్గులు కొనసాగుతూనే వుంటాయి. అయితే సంపద ప్రభుత్వ యాజమాన్యంలో వుండుటవల్ల

దోపిడీవిధానం వుండదు. "పనిచేయని వారికి తిండితినే హక్కు లేదు" అనే స్థితి కొనసాగుతుంది. వేతనాలలో అసమానతలుంటాయి. సాంకేతిక నిపుణులు, మేనేజర్లు, సివిల్ ఉద్యోగులు మొదలైనవారు సాధారణ శ్రామికులకన్న అధిక వేతనం పొందుతారు. ఉత్పత్తి సాధనాలన్నీ ప్రభుత్వపరం అగుటయే కమ్యూనిస్ట్ సమాజపు తొలిదశగా మార్క్స్ వివరిస్తాడు.

### 14.10.2 కమ్యూనిస్ట్ ఉన్నతదశ :

అంతిమంగా రాజ్యం అంతరించుకుపోవుటయే కమ్యూనిస్ట్ ఉన్నతదశ. "ప్రతి ఒక్కరి సామర్థ్యాన్నిబట్టి శ్రమ, ప్రతి ఒక్కరి అవసరాన్నిబట్టి ప్రతిఫలం" (Each according to his ability and each according to his needs) అనే పద్ధతి ఆచరింపబడినపుడు రాజ్యం అవసరం తీరిపోతుంది. అది అంతరించిపోతుంది (State will wither away). సామాజిక సంబంధాల మౌలిక నియమాలను పాటించడానికి ప్రజలుస్వచ్ఛంధంగా అలవాటుపడతారు. తమ సామర్థ్యానుసారం వస్తూత్పత్తికి శ్రమిస్తారు. తమ అవసరాలకు అనుగుణంగా ప్రతిఫలాన్ని (వేతనాన్ని) స్వేచ్ఛగా పొందుతారు. మనుషులు మనుషులను పాలించరు. ఒకరు ఇంకొకరిని దోపిడీ చేయరు. అభివృద్ధి సాధిస్తూ ప్రతీవ్యక్తి పరిపూర్ణుడుగా రూపొందుతాడు

### 14.10.3 రాజ్యరహిత సమాజం (Stateless Society) :

కమ్యూనిస్ట్ సమాజంలో చివరిదశలో ప్రజలమధ్య అంతరాలు పూర్తిగా తొలగిపోతాయి. సమానత్వం స్థిరపడుతుంది. ప్రజలందరూ శ్రామికులే. సంపదలో వారందరూ భాగస్వాములే. రాజ్యం తన అస్తిత్వాన్ని కోల్పోతుంది. "రాజ్యం క్రమంగా అంతరిస్తుంది". సామాజిక పరిణామ క్రమంలో ఒక దశలో రాజ్యం అవతరించింది. దోపిడీసాధనంగా నిలచింది. వర్గరహిత సమాజస్థాపనతో రాజ్యం అంతరిస్తుంది. రాజ్యరహిత సమాజం అంటే పాలకవర్గం లేని స్వేచ్ఛాసమానత్వాలు గల సమాజం.

పెట్టుబడిదారీ విధానంలో దోపిడీకి గురిఅయి, నష్టపడి, నిస్సహాయస్థితిలో దుర్భర జీవితాన్ని అనుభవించిన శ్రామికులను సంఘటితపరచి ఒకనిర్దిష్ట కార్యక్రమం ద్వారా కమ్యూనిస్ట్ సమాజస్థాపనకు మార్క్స్ తన సిద్ధాంతాల ద్వారా కృషిచేశాడు. అతడు వాస్తవికవాది. వర్గరహిత, రాజ్యరహిత సమాజస్థాపననే కర్షకుల, కార్మికుల అంతిమలక్ష్యం కావాలని వాదించాడు. నవసమాజనిర్మాణంపై ఇంతకు ముందున్న భావాలను మరింతగా ముందుకు తెచ్చాడు.

### 14.11 రాజ్య సిద్ధాంతం :

ఉత్తమజీవనం అందించుటకే రాజ్యం అవతరించిందని అరిస్టాటిల్ సిద్ధాంతం. దానికి భిన్నంగా వర్గప్రాబల్యాన్ని పెంచి, పోషించే సాధనమని మార్క్సువాదం. ఒకప్పుడు రాజ్యవ్యవస్థలేదు. మానవసమాజం అంతర్గత వైరుధ్యాలలో వర్గాలుగా చీలిపోయిన తరుణంలో రాజ్యావతరణ జరిగిందని మార్క్సిజం చెపుతుంది. స్వాభావికంగా రాజ్యం అవతరించలేదు. వర్గసంఘర్షణ కారణంగా ఏర్పడింది.

రాజ్యమనేది ఒక వర్గముకు చెందిన పాలనాంగం. దోపిడీ వర్గానికి పీడించే ఒక బలమైన ఆయుధంగా రాజ్యం జన్మించింది. పీడనచట్టబద్ధం చేయబడింది. పీడికవర్గం రాజకీయాధికారాన్ని తమ ఆధీనంలో వుంచుకుంటారు. వారి ప్రయోజనాలను, ఆస్తులను కాపాడుటలోనే రాజ్యవ్యవస్థ కొనసాగుతుందని మార్క్స్ వాదించాడు.

సమాజం, రాజ్యం ఈ రెండు వ్యవస్థలు తామంత తాముగా ఏర్పడవని మార్క్సిజం భావిస్తుంది. సమాజం యొక్క ఉపరితల నిర్మాణమే రాజ్యంగా రూపొందుతుంది. వైరుధ్యాలు పెరిగినకొద్దీ పీడితులను అణచివేసే తత్వాన్ని

రాజ్యాధికారం బహిర్గతం చేస్తుంది. శ్రామికవిప్లవం ద్వారా వర్గరహిత సమాజాన్ని సాధించటానికి 'శ్రామిక' రాజ్యం సహాయపడుతుంది. శ్రామికవర్గం ఏదో ఒక దశలో వర్గసమాజాన్ని అంతం చేస్తుంది. దానితో రాజ్యఅవసరం కూడా తీరిపోతుంది. ప్రాబల్యాన్ని కోల్పోయి రాజ్యం క్రమేపీ తానంతతానే అంతరించిపోతుందని మార్క్సిస్టు రాజ్యసిద్ధాంతం వివరిస్తుంది.

## 14.12 మార్క్సిజం పై విమర్శ :

రాజనీతితత్వము, రాజకీయాలు, మానవ మనస్తత్వం, భౌతికజీవన విధానం మొదలగు అనేక రంగాలను గతితార్కిక భౌతికవాద దృష్టితో స్పృశించి మార్క్సిస్టు సిద్ధాంతం ఒక సంచలనం కలిగించింది. అనేక విమర్శలు కూడా చేయబడినాయి.

1. మార్క్స్ ప్రతిపాదించిన చారిత్రక భౌతికవాదానికి సమగ్రత లోపించింది. కేవలం ఆర్థికపరదృష్టిలోనే మానవసంబంధాలను నిర్ధారించుట సమంజసం కాదు. నైతికతా, మానవతా విలువలు విస్మరింపబడినాయి. నైతికపర బోధనలతో మహాప్రవక్తలు మానవాళిని ప్రభావితం చేసారనుట ఒక చారిత్రక సత్యం. నైతికధర్మాలు మానవ సమాజాలను సంస్కరించాయి. ఈ యదార్థాలను మార్క్స్ విస్మరించాడు. ప్రవర్తనా, ఆదర్శాలు, సత్యాన్వేషణలకు కూడా మానవ సమాజంలో ప్రముఖస్థానమే వున్నది.

2. మానవ సమాజం అంటే కేవలం పీడకలు - పీడితులు అనే రెండు పరస్పర వైరుధ్యవర్గాలే కాదు. వీటికతీతంగా వేరే ఇతర వర్గాలు కూడా వుంటాయి. నిర్వాహకులు, నిపుణులు, సలహాదారులు, మధ్యతరగతి వర్గము మొదలైనవారు కూడా సమాజంలో భాగాలే.

3. వర్గసిద్ధాంతం పాలకవర్గాలలో వుండే వైరుధ్యాలను, అంతఃకలహాలను పట్టించుకోలేదు. మధ్యయుగాలలో రాజులకు -మతాధిపతులకు మధ్య కలహాలు ఆనాటి భౌతిక జీవన పరిస్థితులపై (Negative) వ్యతిరేక ప్రభావాన్ని చూపెట్టాయి.

4. మార్క్స్ తన దృష్టినంతా పారిశ్రామిక సమాజంపైనే కేంద్రీకరించాడు. వ్యవసాయక సమాజాన్ని నిస్తేజంగా భావించాడు. చైనా, రష్యాలవంటి వ్యవసాయక దేశాలలో విప్లవం జరిగింది. పారిశ్రామికంగా అత్యంత అభివృద్ధిని సాధించిన ఐరోపా దేశాలలో ఇంతవరకు మార్క్స్ ఊహించిన విప్లవం జరగలేదు.

5. మిగులు విలువ సిద్ధాంతం కూడా అసంపూర్ణమే. ఉత్పత్తి సాధనాలలో శ్రమ అనేది ఒక భాగం. వస్తువుల విలువ నిర్ధారించుటలో ఇతర సాధనాలను పరిగణించలేదు.

6. వర్గపోరాటం సత్యదూరం, అవాస్తవికం. ఒక వర్గం నుండి వేరొక వర్గానికి ప్రజలు మారడమనేది సహజంగా, స్వాభావికంగా జరుగుతోంది. సమాజాభివృద్ధికి అందరి సహకారం, సామరస్యం వుండితీరాలి. పెట్టుబడిదారుల ప్రయోజనాలకు - శ్రామికుల ప్రయోజనాలకు మధ్య సమన్వయం చేకూర్చుట అసాధ్యమేమీకాదు. వర్గ సంఘర్షణ ఒక్కటే మార్గం కాదు.

7. సామాజిక విప్లవం అనివార్యమని మార్క్స్ భావించాడు. నేటి ఆధునిక సమాజాలలో విప్లవాలు జరిగితే విపరీత, విపత్కర పరిణామాలేర్పడతాయి. ఫాసిజంవంటి నియంతృత్వ పాలనకు దారితీయవచ్చు.

8. పారిశ్రామిక విప్లవ సందర్భంగా పుట్టిన సిద్ధాంతాలు - ఉదారవాదం, మార్క్సిజం. రాజ్యపరిధిని అత్యల్పస్థాయికి నియంత్రించాలని ఉదారవాదం భావిస్తుంది. రాజ్యం పూర్తిగా అంతరిస్తుందని మార్క్సిజం ఊహిస్తుంది. వాస్తవ పరిస్థితులు

ఈ రెండు సిద్ధాంతాల ధోరణులకు అతీతంగా వున్నాయి. రాజ్యం ఒక బలమైన శక్తిగా మారింది. ప్రజాశ్రేయస్సుకై పాటుపడింది. శ్రేయోరాజ్యాన్ని ప్రజలు ఆదరిస్తున్నారు. అభిమానిస్తున్నారు. మార్క్స్ ఊహకు ఇది అందని పరిణామం.

9. పెట్టుబడిదారీ విధానం పతనం చెందితే శ్రామికవర్గ నియంతృత్వమే ఏర్పడాలనే నిర్బంధమేమీలేదు. అరాచకశక్తులతో నియంతృత్వపాలన ఏర్పడినా ఆశ్చర్యమేమీలేదు.

10. జాతాయతావాదాన్ని మార్క్సిజం గమనించలేదు. ప్రపంచ చరిత్రలో మహావిప్లవాలకు జాతీయవాద భావాలే దోహదం చేశాయి. జర్మనీ, ఇటలీలలో జాతీయవాదమే దీనికి నిదర్శనం.

11. విప్లవం మాత్రమే సమస్యలను పరిష్కరించలేదు. నేటి కార్మికసంఘాలు తమ సంఘటితశక్తితో అనేక సౌకర్యాలు సాధిస్తున్నాయి.

12. కమ్యూనిస్ట్ సిద్ధాంతం ప్రజాస్వామిక విలువలను వ్యతిరేకిస్తుంది. దౌర్జన్యపూరిత, హింసాయుత విప్లవాలను ప్రోత్సహిస్తుంది. మతాన్ని మత్తు మందుగా భావించి ద్వేషిస్తుంధి. సమాజ-సంస్కరణలలో మత ప్రభావాన్ని మార్క్స్ గుర్తించలేదు. మానసిక ప్రశాంతత, వికాసానికి తోడ్పడే సాధనాలలో మతంకు ప్రముఖస్థానం వుంది.

మార్క్స్ కోరుకున్నట్లు ఆధునిక యుగంలో విప్లవమే సంభవిస్తే సమసమాజనిర్మాణమాటెలా వున్నా దారుణ పరిణామాలేర్పడుట తథ్యం. శ్రామికవర్గ నియంతృత్వం అప్రజాస్వామికం. నియంతృత్వమనేది ఏ రూపంలోనున్నా అది వాంఛనీయంకాదు. వర్గరహిత, రాజ్యరహిత సమాజం కేవలం మార్క్స్ ఊహలకే పరిమితం.

## 1413 మార్క్స్ విశిష్టత :

మార్క్సిజంపై ఎన్ని విమర్శలున్నా ఆధునిక సమాజాన్ని ఈ సిద్ధాంతము ప్రభావపరచినంతగా వేరొకటిలేదు. మార్క్స్ నవయుగానికి నాంది పలికిన యుగకర్త. సామ్యవాద సిద్ధాంతాన్ని శాస్త్రీయంగా విశ్లేషించి "ప్రపంచ కార్మికులారా ఏకంకండి" అనే విప్లవ సందేశాన్ని అందించాడు. వారికి ఆరాధ్యదైవమయ్యాడు. పెట్టుబడిదారీ విధానంలోని లోపాలను బహిర్గతం చేశాడు.

మార్క్స్ ఒక వాస్తవికవాది. ఆర్థిక వ్యవస్థకు - సమాజ పరిస్థితులకు మధ్యగల సంబంధాన్ని గతితార్కిక పద్ధతులలో విశ్లేషించాడు. ఇతని గతితార్కిక భౌతికవాదం, చారిత్రక భౌతికవాదాలు విశ్వవ్యాప్తంగా గుర్తింపుపొందాయి. మార్క్స్ యొక్క శాస్త్రీయ సామ్యవాదం కొన్ని ప్రాథమిక సత్యాలను వివరించింది. వ్యక్తి కన్నా సమాజం ప్రధానం. మార్గాలకన్నా ధ్యేయాలే ముఖ్యం. ఇది మార్క్స్ క్రియాత్మక ధోరణిని తెలుపుతుంది. సామ్యవాద ఉద్యమాలకు ఊపిరిపోస్తుంది.

"శూన్యం నుండి పదార్థం ఉత్పత్తికాదు" అన్న మార్క్స్‌వాదం శాస్త్రసాంకేతికాభివృద్ధికి దోహదపడింది. ప్రపంచ వ్యాప్తంగా సామాజిక తత్వవేత్తలు, రాజనీతి తాత్వికులు, సంఘ సంస్కర్తలు, విప్లవకారులు, విమర్శకారులు, మార్పుకాంక్షించేవారు - తర్కించుటకో, విమర్శించుటకో మార్క్స్ సిద్ధాంతాలను అధ్యయనం చేశారు. అనుకూలంగానో, ప్రతికూలంగానో ప్రభావితులైనారు.

పీడిత ప్రజానీక ఆశావాది కార్ల్‌మార్క్స్. పరిస్థితులను శాస్త్రీయంగా విశ్లేషించి జీవనసత్యాలనే సిద్ధాంతంగా ప్రతిపాదించి తన ప్రత్యేకతను నిరూపించుకున్నాడు. ప్రప్రథమంగా లెనిన్ తన నాయకత్వంలో బోల్షవిక్ అనుచరులతో కలిసి రష్యాలో విప్లవం ద్వారా రాచరికపాలన అంతమొందించి శ్రామికవర్గ నియంతృత్వ వ్యవస్థను స్థాపించాడు. అనేక తూర్పు ఐరోపా, ఆసియా రాజ్యాలలో కమ్యూనిస్ట్ ప్రభుత్వాల స్థాపనకు మార్క్స్ సిద్ధాంతమే స్ఫూర్తినిచ్చింది.

"అతని సందేశ శక్తివలన, బోధనలలో ఆవేశం వలన, భావిచరిత్రకాభివృద్ధిపై ప్రభావం వలన, ప్రపంచంలోని గొప్ప రాజనీతి తత్వవేత్తలలో మార్క్స్ ప్రముఖస్థానాన్ని పొందాడనుట నిస్సందేహం" (సి.ఎల్.వేపర్)

"For the power of his message, for the inspiration of his teaching and for his effect upon future development Marx can be sure of his place in any collection of the World's great masters of Political thought".

## 14.14 చదువవదగిన గ్రంథాలు :


1. Ebenstein, W, - Great Political Thinkers
2. Wayper, C.L. - Political Thought
3. Sabine, G.H. - Political Theory
4. Andrew Hacker - Political Theory
5. Spargo. J. - Karlmarx, his life and work
6. Allen - The history of Political thought in 16th Century.


**ప్రశ్నలు :**

1. హెగెల్, మార్క్స్‌లు ప్రతిపాదించిన గతితార్కిక వాదాల మధ్య పోలికలను, బేధాలను చర్చించండి.
2. మార్క్స్ ప్రతిపాదించిన గతితార్కిక, చారిత్రక భౌతికవాదాలను వివరించండి.
3. మార్క్స్ ప్రతిపాదించిన రాజనీతి సిద్ధాంతాన్ని విమర్శనాత్మకంగా చర్చించండి.
4. రాజనీతి సిద్ధాంత చరిత్రలో మార్క్స్ స్థానమేమిటి ?
5. అదనపు విలువ, వర్గపోరాటాలను గురించి వివరించండి.
6. మార్క్స్ చారిత్రక భౌతికవాదాన్ని విశ్లేషింపుము.
7. అదనపు విలువ సిద్ధాంతాన్ని విమర్శనాత్మకంగా పరిశీలింపుము.
8. రాజనీతితత్వానికి మార్క్స్ సేవ ఎట్టిది.
9. వర్గపోరాటం వివరింపుము.
10. వర్గరహిత, రాజ్యరహిత సమాజం వివరణ.
11. కమ్యూనిస్ట్ మానిఫెస్టో ప్రాధాన్యత తెలుపుము.

రచయిత : డా॥ యస్. సుబ్బారావు

పాఠం - 15

# భారత జాతీయోద్యమ తాత్విక భావన - (ఎ) మితవాదులు, (బి) అతివాదులు, (సి) గాంధీయుగం.

## 15.0 లక్ష్యం

భారత జాతీయ ఉద్యమం ఒక చిరుజల్లులా ప్రారంభమై, చినుకు, చినుకు గాలి వానలా, చివరకు పెద్ద ఉప్పెనగా మహోధృతమైన ప్రవాహంగా మారి, భారత స్వాతంత్ర్యోద్యంగా రూపు చెంది, రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యాన్ని, భారత గడ్డ నుండి బ్రిటన్‌కు తుడిచి పెట్టుకుపోయింది. 200 సంవత్సరాలపాటు భారతదేశాన్ని పాలించిన, సామ్రాజ్యవాద పాలన నుండి భరతమాతను విముక్తం చేయటానికి ఎందరో దేశభక్తులు రక్తతర్పణం, ప్రాణత్యాగాలు చేసారు. అందరికీ వందనములు. భారత ప్రజల బానిస జీవనాన్ని సమాప్తం చేయటానికి భారతీయులు సాగించిన భారత స్వాతంత్ర్య అహింసా పోరాటం, స్వాతంత్ర్యపోరాటాలకు ఒక ఆదర్శం, గొప్ప స్ఫూర్తి. ఈ పోరాటంలో పాల్గొని జాతి జనులను జాగృతం చేసిన నాయకులు, ఉద్యమాలు, తదితర అనేక విషయాలను ప్రతీ భారతీయుడు తెలుసుకోవాలి. మరి ముఖ్యంగా రాజనీతిశాస్త్రాన్ని అధ్యయనం చేసే ప్రతి విద్యార్థి, ఈ సజీవ సంఘటలను తెలుసుకొని పునీతులు కావాలి. ఆ నాయకుల, త్యాగ ధనుల ఆశలను లక్ష్యాలను ఆచరణలో పెట్టడానికి పునరంకితం కావాలి. ఈ పాఠం లక్ష్యం అదే.

**విషయసూచిక :**


15.1. జాతీయత అర్థం

15.2. భారత జాతీయతా భావనకు దోహదం చేసిన అంశాలు

15.3. భారత జాతీయ కాంగ్రెసు ఆవిర్భావం

15.4. మితవాద దశ (1885-1905)

15.4.1. అతివాద దశ (1906-1920)

15.4.2. గాంధీయుగం (1920-1947)

15.5. సారాంశము

15.6. నమూనా ప్రశ్నలు

15.7. చదువదగిన గ్రంథాలు


## 15.1. జాతీయత అర్థం :

జాతీయత అనేది పాశ్చాత్యుల భావన. మేకియవల్లి, హెగెల్, మజినీ, బిస్మార్క్ మొదలైన రాజనీతి తత్వవేత్తలు, ఈ భావాన్ని వెల్లడించారు. జాతీయత అనేది ఒక ఆత్మీయ భావ. ఒక దేశపు ప్రజలందరినీ ఐక్యం చేయగల శక్తి గలిగిన భావన. భాషలు వేరైనా, ప్రాంతాలు వేరైనా, మతాలు వేరైనా, తెగలు వేరైనా, మేమంతా ఒకే తల్లి బిడ్డలం, ఒక దేశ ప్రజలం అనే ఐక్యభావనే జాతీయత. సాంఘిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థల పటిష్టతకు ఇది దోహదం చేస్తుంది. భిన్నత్వంలో ఏకత్వం సాధించటమే జాతీయత లక్ష్యం.

## 15.2 భారత జాతీయతా భావానికి దోహదం చేసిన అంశాలు :

భారతదేశాన్ని అనేకులు పరిపాలించారు. పలువురు ఈ దేశంలో ప్రవేశించి ఈ దేశ సంపదను కొల్లగొట్టుకొని పోగా కొంతమంది ఈ దేశంలోనే ఉండిపోయారు. ఈ దేశంలో ఆదిమ వాసులు, ద్రావిడులు తర్వాత ఈ దేశానికి మధ్య ఆసియా, మధ్య ఐరోపా నుండి వచ్చినవారు ఆర్యులు, ఆ తర్వాత వచ్చినవారు ముస్లింలు. ఆర్యులు, ముస్లింలు ఈ దేశంలోనే ఉండిపోయారు. చివరగా వచ్చినవారు యూరోపియన్లు. పోర్చుగీసు, డచ్చి, ఫ్రెంచి, ఆంగ్లేయులు యూరప్ దేశాల నుండి భారతదేశానికి వర్తక, వ్యాపారాల కోసం వచ్చారు. భారతదేశంలో వ్యాపారం కోసం గిడ్డంగులు, వ్యాపార కేంద్రాలు నిర్మించుకొన్నారు. భారతదేశంలోని రాజకీయ అనైక్యతను నిశితంగా పరిశీలించిన పిమ్మట, రాజకీయ అధికారాన్ని చేజిక్కించుకోవాలనే రాజ్యకాంక్ష వారిలో మొదలైంది. ముఖ్యంగా ఫ్రెంచివారు, ఆంగ్లేయులు భారతదేశంలో అనైక్యతతో కొట్టుమిట్టాడున్న హిందూ, ముస్లిం పాలకుల మధ్య విభేదాలు సృష్టించారు. విభజించి పాలించు అనే రాజనీతి తంత్రాన్ని ఆచరణలో పెట్టారు. ఒక రాజును ఫ్రెంచివారు సమర్థిస్తే, మరొకరాజును ఆంగ్లేయులు సమర్థించేవారు. వారి వద్ద నున్న అధునాతన ఆయుధాలైన, తుపాకి, ఫిరంగులు వారికి విజయాలను తెచ్చిపెట్టాయి. చివరకు, పోర్చుగీసు, డచ్చి, ఫ్రెంచి వారిని ఓడించి భారతదేశాన్నుండి తరిమివేసి ఆంగ్లేయులు అధికారాన్ని హస్తగతం చేసుకొన్నారు. కేవలం కొన్ని వందల , ఆ తర్వాత వేల సంఖ్యలో ఉన్న విదేశీ వర్తకులు, భారతదేశంలో స్వదేశీయులైన కోట్ల జనాభా కలిగిన హిందూ, ముస్లింలను అధికారం నుండి తప్పించి, పాలకులను, పాలితులుగా మార్చడం ఒక చారిత్రక దురదృష్టం. ఇందుకు కారణాలు చెప్పుకుంటూ పోతే అనేకం. అవేమనగా -

1. భారతదేశంలో ప్రజల మధ్య మేమంతా ఒకటే, ఒకే తల్లి బిడ్డలం, ఒకే జాతి జనులమనే జాతీయతా భావం మచ్చుకైనా లేకపోవటం.
2. భారతదేశంలో హిందూ, ముస్లింల మధ్య మత పరమైన విద్వేషాలు
3. హిందూ మతస్థుల మధ్యే కుల పరమైన అడ్డుగోడలు, కులతత్వం, అంటరానితనం మనుషుల మధ్య అనైక్యతకు దోహదం చేస్తున్నాయి.
4. మనువాదం వల్ల హిందూ మతంలో వందలాది ఉపకులాలు. వారి మధ్య సమానత్వ భావం లేదు. అంతరాలే తప్ప అంతరంగాలు లేవు. స్త్రీ, పురుషుల మధ్య సమానత్వం లేదు. పురుషాధిక్య సమాజంలో స్త్రీలు స్వేచ్ఛా, స్వాతంత్ర్యం లేని బానిసలు. వంటింటికి మాత్రమే పరిమితం. స్త్రీల మధ్యనే సమానత్వం లేదు. కులాల మధ్య సమానత్వంలేదు. సహపంక్తి భోజనాలులేవు. వర్ణాంతర వివాహాలు లేవు. అసమానత్వమా నీ పేరే హైందవం. ఇలాంటి సాంఘిక అసమానత్వంతో కొట్టుమిట్టాడుతున్న ప్రజల మధ్య ఐక్యత, జాతీయత ఏర్పడటం చాలా కష్టమే. అందుకే భారతదేశానికి వ్యాపారానికి వచ్చి పాలకులై అఖండ భారతాన్ని పాలించిన ఆంగ్లేయుల పాలనకు స్వస్తి చెప్పడానికి, ప్రజలను జాతీయతా భావంతో ఏకం చేసి ఒక మహా స్వాతంత్ర్య సంగ్రామం నడిపి దేశాన్ని స్వతంత్రం చేసి స్వరాజ్య స్థాపన సాధించడానికి సుమారు 200 సంవత్సరాలు పట్టింది. ఈ స్వాతంత్ర్య సమర ప్రవాహంలో ఎన్నో పిల్ల కాల్వలు, కాలువలు, నదులు ఉద్యమ రూపంలో చేరి మహా ప్రవాహమై, బ్రిటీష్ సామ్రాజ్యాన్ని పెకళించింది. అన్ని ఉద్యమాలు దేశ స్వాతంత్ర్యం కోసమే. వారి త్యాగాల రూపమే ఈనాటి ఈ స్వతంత్ర భారతావని.

## 15.3. భారత జాతీయ కాంగ్రెసు ఆవిర్భావం :

ప్రజల్లో సాంఘిక, రాజకీయ చైతన్యం పెంపొందించటానికి భారత జాతీయ కాంగ్రెసు ఆవిర్భావానికి ముందే కొన్ని మత సంస్థలు, కొంత మంది నాయకులు శ్రీకారం చుట్టారు. అందులో ప్రధానమైనవి.

1. రాజా రామ్మోహన్ రాయ్ స్థాపించిన బ్రహ్మ సమాజం
2. దయానంద సరస్వతి స్థాపించిన ఆర్య సమాజ్

3. ప్రార్థనా సమాజ్

4. రామకృష్ణ మిషన్

5. దివ్యజ్ఞాన సమాజము.

6. ముస్లింలలో చైతన్యం కలిగించడానికి సర్ సయ్యద్ అహ్మద్‌ఖాన్ 'వహీబ్' ఉద్యమాన్ని ప్రారంభించాడు. గురు గోవిందసింగ్, సిక్కులలో చైతన్యాన్ని కలిగించడానికి తీవ్రంగా కృషి చేసారు.

వీటితో పాటు కొంత మంది జమీందార్లు వారి ప్రయోజనాల కోసం స్థాపించిన మరికొన్ని సంఘాలు కూడా కొంత పరిమితమైన కృషి సల్పాయి. 1837లో స్థాపించిన జమిందారీ అసోసియేషన్, 1842లో స్థాపించిన బెంగాల్ బ్రిటిష్ ఇండియన్ సొసైటీ, 1851లో స్థాపించిన బ్రిటీష్ ఇండియా అసోసియేషన్, దాదాబాయ్ నౌరోజీ 1866 లో లండన్ నగరంలో స్థాపించిన ఈస్ట్ ఇండియన్ అసోసియేషన్, 1867లో మహాదేవ గోవింద రనడే స్థాపించిన పూనా సర్వజనిక్ సభ, 1875లో సిసిర్ కుమార్ ఘోష్ స్థాపించిన ఇండియా లీగ్, 1881లో మహదేవ గోవింద రనడే స్థాపించిన మద్రాస్ మహాజనసభ, 1885లో బద్రీరుద్దీన్ తాయాబ్జీ, ఫిరోజ్‌షా మెహతా స్థాపించిన బొంబే ప్రెసిడెన్సీ అసోసియేషన్ ప్రధానమైనవి.

అలాన్ ఆక్టేవియన్ హ్యూమ్ (Allan Octavian Hume) అనే శ్వేత జాతీయుడు, భారత జాతీయ కాంగ్రెస్ రూప శిల్పి. ఈయన 1849లో భారత ప్రభుత్వ ఉద్యోగిగా భారతదేశానికి వచ్చి, మంచి అధికారిగా గుర్తింపు పొందాడు. 1857 సిపాయిల తిరుగుబాటు సమయంలో చాలా సమర్థవంతమైన పాత్రను నిర్వహించాడు. తిరుగుబాటును అణచివేసిన తర్వాత అనేక సంక్షేమ కార్యాలను అమలుపరచడంలో కీలక పాత్ర నిర్వహించాడు. 1870లో భారత ప్రభుత్వ దేశీయాంగ శాఖలో కార్యదర్శి అయినాడు. అయితే బ్రిటీష్ ప్రభుత్వం భారతీయుల పట్ల అనుసరిస్తున్న కొన్ని విధానాలు నచ్చక పోవటంతో 1879లో తన ఉద్యోగానికి రాజీనామా చేసాడు. చివరకు 1882లో ఇండియన్ సివిల్ సర్వీసుకు రాజీనామా చేసాడు.

భారతీయుల పట్ల, వారి సమస్యల పట్ల హ్యూమ్ చాలా ఉదారంగా స్పందించేవాడు. భారతీయుల సమస్యలను ప్రభుత్వానికి విన్నవించి వాటికి పరిష్కారాలను పొందటానికి ఒక వేదికను ఏర్పాటు చేస్తే బాగుంటుందని హ్యూమ్ భావిస్తూ ఉండేవాడు. ఇంగ్లండ్ దేశంలో ప్రజాసమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకు వెళ్ళే గురుతర బాధ్యతను ప్రతిపక్షం నిర్వహిస్తుంది. కాని భారతదేశంలో ప్రజాస్వామ్యం లేని కారణంగా, ఆ విధి నిర్వహణ కోసం ఒక ప్రజా వేదిక ఆవశ్యకత ఎంతైనా ఉంది. అందుకోసం ఒక ప్రజా వేదికను ఏర్పాటు చేయాలనే ఆలోచనల రూపమే భారత జాతీయ కాంగ్రెసు. మార్చి 1, 1883న కలకత్తా విశ్వవిద్యాలయంలోని విద్యార్థులకు ఒక బహిరంగ ఉత్తరాన్ని వ్రాస్తూ, మాతృభూమి సేవలో భాగస్వాములై త్యాగాలు చేయటానికి కనీసం ఒక యాభై మంది విద్యార్థులు ముందు కొచ్చి తాను స్థాపించబోయే, అఖిల భారత జాతీయ కాంగ్రెసులో చేరాలని పిలుపునిచ్చాడు. ఆ తర్వాత అప్పటి గవర్నరల్ జనరల్ డెఫ్రిన్ ప్రభువుతో కూడా ఆ అంశంపై చర్చించగా, డెఫ్రిన్ కూడ సానుకూలంగా స్పందించాడు. అటు పిమ్మట హ్యూమ్ బ్రిటన్ కూడా సందర్శించి అక్కడ అనేక మంది నాయకులతోను శ్రేయోభిలాషులతోను, భారతదేశం పట్ల సానుభూతిని తెలిపే వారితోను విస్తృతంగా చర్చలు జరిపి వారి ఆశీర్వాదాలు పొందాడు. భారతదేశంలోను, బ్రిటన్‌లోను అనేక మంది ప్రముఖులతో చర్చించిన తర్వాత తాను స్థాపించబోయే అఖిల భారత సంస్థలో పాల్గొనటానికి 1885 డిసెంబరు 25 నుండి 28వ తేదీ వరకు పూనా పట్టణంలో నిర్వహించే సభా సమావేశాలకు హాజరు కావలసిందిగా దేశంలోని అనేక మంది ప్రముఖులకు, మేధావులకు, విద్యార్థులకు ఆహ్వానాలు పంపాడు. అయితే పూనా పట్టణంలో ప్లేగు వ్యాధి సోకి అంటు రోగాలతో ప్రజలు బాధపడటంతో అనివార్య పరిస్థితులలో సమావేశాన్ని బొంబాయి పట్టణంలో డిసెంబరు 28, 1885న ప్రారంభించడం జరిగింది. 1885 డిసెంబరు 27 సాయంత్రానికే ప్రతినిధులు బొంబాయి చేరుకున్నారు.

**చారిత్రాత్మక భారత జాతీయ కాంగ్రెసు స్థాపన :** 1885, డిసెంబర్ 28వ తేదీ భారత స్వాతంత్ర ఉద్యమ చరిత్రలో ఒక చారిత్రక దినం. సుమారు 62 సంవత్సరాల పాటు భారతీయుల సమస్య కోసం పోరాడి, స్వాతంత్ర్య సముపార్జనలో దేశ ప్రజలను నడిపించిన మహోన్నత సంస్థ భారత జాతీయ కాంగ్రెస్ **ఆవిర్భావం, జరిగిన తేదీ డిసెంబరు 28.** 1885, డిసెంబరు 28వ తేదీ మధ్యాహ్నం

12 గంటలకు అఖిల భారత జాతీయ కాంగ్రెస్ మొదటి సమావేశానికి హాజరైన డెబ్బైరెండు మంది ప్రతినిధులు బొంబాయిలోని గోకుల్‌దాస్ తేజపాల్ సంస్కృత కళాశాలలో ఒక మహోన్నత లక్ష్యంతో భారత మాత, మాతృదేశం సేవలో పునీతులు కావటానికి ఉత్కంఠంగా ఎదురుచూస్తున్నారు. ఆ మహోన్నత సమయం ఆసన్నమయింది. సర్వశ్రీ ఉమేష్ చంద్ర బెనర్జీ, కలకత్తాలో ప్రముఖ న్యాయవాది అధ్యక్షత వహించగా అఖిల భారత జాతీయ కాంగ్రెస్ మొదటి సమావేశం ప్రారంభమైంది. సమావేశంలో సంస్థ స్థాపనకు సంబంధించిన లక్ష్యాలు, తదితర విషయాలు చర్చించారు.

భారత జాతీయ కాంగ్రెస్ స్థాపించిన తర్వాత భిన్న వర్గాల వారు, భాషలవారు, ప్రాంతాలవారు, మతాల వారు సభ్యులుగా చేరారు. సభ్యుల సంఖ్య మొదటి సమావేశంలో పదుల సంఖ్యతో ప్రారంభమై తర్వాత, వందలు, తర్వాత వేలుగా పెరిగిపోయింది. ఆ తర్వాత లక్షలు, కోట్ల సంఖ్యకు చేరటం జరిగింది. జాతీయ కాంగ్రెస్‌లోని సభ్యుల వివరాలను బట్టి, ఇది ఒక "కాస్మోపాలిటన్ సంస్థ" అని చెప్పవచ్చును. ఉమేష్ చంద్ర బెనర్జీ, దాదాభాయ్ నౌరోజీ, సురేంద్రనాథ్ బెనర్జీ, గోఖలే, మాలవ్య, మౌలానా, అబుల్ కలామ్ ఆజాద్, అరవిందో, లాలా లజపతిరాయ్, బాలగంగాధర తిలక్, బిపిన్ చంద్రపాల్, ఫిరోజ్ మెహతా, మోతీలాల్ నెహ్రూ, అనిబిసెంట్ మొదలైనవారెందరో కాంగ్రెసులో చేరి తమ సేవలను అందించారు.

1885లో భారత జాతీయ కాంగ్రెసు ప్రథమ అధ్యక్షుడు, ఉమేష్ చంద్ర బెనర్జీ, క్రైస్తవుడు. 1886లో రెండవ అధ్యక్షుడు, దాదాభాయ్ నౌరోజీ, పార్సీ, జొరాష్ట్రియన్. 1887లో మూడవ అధ్యక్షుడు బదీరుద్దీన్ తాయాబ్జీ ముస్లిమ్. 1888లో నాలుగవ అధ్యక్షుడు, జార్జియూలి ఆంగ్లేయుడు, 1889లో ఐదవ అధ్యక్షుడు సర్ వేడర్ బర్న్ ఆంగ్లేయుడు.

ఈ విధంగా కాంగ్రెసు స్థాపించిన నాటి నుండి, స్వాతంత్ర్యం సాధించే వరకు జరిగిన ఉద్యమాన్ని మూడు దశలుగా వర్గీకరించారు.

అవి. (ఎ) మితవాద దశ (1885-1905), (బి) అతివాద దశ (1906-1920), (సి) గాంధీయుగం (1920-1947)

## 15.4. మితవాద దశ (1885-1905) :

1885లో భారత జాతీయ కాంగ్రెసు స్థాపించిన నాటి నుండి 1905 వరకు, ఇరవై సంవత్సరములు కాంగ్రెసు నిర్వహించిన ఉద్యమ విధానాలను మితవాద ఉద్యమాలు అంటారు. మితవాదులు ప్రధానంగా సంస్కరణాభిలాషులు. బ్రిటీష్ వారి ఉద్యమ విధానాలను మితవాద ఉద్యమాలు అంటారు. మిత వాదులు ప్రధానంగా సంస్కరణాభిలాషులు. బ్రిటీష్ వారి ఉదార వాదంలోను, న్యాయ విధానంలోను వీరికి అపారమైన నమ్మకం, ప్రభుత్వ చట్టాల ద్వారా, రాజ్యాంగ సంస్కరణల ద్వారా భారతీయులకు మేలు చేయమని వీరు కోరేవారు. శాంతియుత మార్గాలైన, విన్నపాలు, విజ్ఞాపనలు, దరఖాస్తుల ద్వారా బ్రిటిష్ ప్రభుత్వానికి సమస్యలను నివేదించేవారు. వీరికి, హింస, బల ప్రయోగం, రక్తపాతంలో నమ్మకం లేదు. ఈ కాలాన్ని సంస్కరణల యుగంగా పేర్కొనడం జరిగింది.

కాంగ్రెసు స్థాపించిన మొదట్లో మితవాదుల పద్ధతులు చాలా వరకు విజయవంతమైనాయి. అటు బ్రిటిష్ అధికారులు, ఇటు కాంగ్రెస్ నాయకుల మధ్య చక్కటి సుహృద్భావ వాతావరణం ఏర్పడి, ప్రభుత్వం కాంగ్రెస్ నివేదించిన సమస్యలపై సానుకూలంగా స్పందించి సమస్యా పరిష్కారాలు చేసింది. మొదట్లో కాంగ్రెస్ నివేదించిన ప్రధాన కోరికలు :

1) గవర్నర్ జనరల్, గవర్నర్ల కార్యనిర్వాహక మండళిలో భారతీయులకు ప్రాతినిధ్యాన్ని విస్తరించాలి.

2) కేంద్ర, ప్రాంతీయ శాసన మండళ్లలో భారతీయులకు ప్రాతినిధ్యం పెంచాలి.

3) ఐ.సి.యస్ (ఇండియన్ సివిల్ సర్వీస్) పరీక్షలను భారతదేశంలోకూడా నిర్వహించాలి. పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల వయోపరిమితిని పెంచాలి.

4) భారతదేశంలో పరిపాలనను పరిశీలించడానికి ఒక ఉన్నత స్థాయి సంఘాన్ని నియమించాలి.

5) ఇండియా కౌన్సిల్‌ను రద్దు చేయాలి.

6) భారతదేశంలో రక్షణ వ్యయం తగ్గించాలి. సైన్యంలో బ్రిటీష్ అధికారుల స్థానంలో భారతీయ అధికారులను నియమించాలి.

7) ఉప్పుపై పన్ను తగ్గించాలి.

8) భారతీయులకు ఉద్యోగాలు ఇవ్వటానికి వీలు కల్పించడానికి అనువుగా నూతన పరిశ్రమలను నెలకొల్పాలి.

9) జమిందారుల దోపిడీ నుండి రైతులను రక్షించాలి.

10) ప్రజల వాక్ స్వాతంత్ర్యాన్ని, పత్రికా స్వేచ్ఛను పరిరక్షించాలి.

11) సాంకేతిక, వృత్తి కళాశాలలను ఎక్కువగా స్థాపించాలి.

12) రైతులకు తక్కువ వడ్డీకి అప్పులు ఇవ్వటానికి వ్యవసాయ బ్యాంకులను నెలకొల్పాలి.

**మితవాదులు సాధించిన ప్రగతి :**

1. భారతీయులలో రాజకీయ చైతన్యానికి మొదట్లో గట్టి పునాదులు వేసింది నిస్సందేహంగా మితవాదులే.
2. భారతీయులలో జాతీయ భావం పెంపొందించి, వారికి రాజకీయపరమైన శిక్షణకు దోహదం చేసింది మితవాదులే.
3 1892 చట్టం జారీలో మితవాదుల పాత్ర ఎంతో వుంది
4. భారతదేశంలో కేంద్ర ప్రభుత్వం, ప్రాంతీయ ప్రభుత్వాలలో భారతీయులకు ప్రాతినిధ్యం కల్పించడానికి మితవాదులే కారణం.
5. భారతదేశంలో కేంద్ర శాసనమండలి, రాష్ట్ర శాసన మండళ్ళలో భారతీయులకు ప్రాతినిధ్యం పెంచడానికి మితవాదులే కారణం.
6. ఐ.సి.యస్ పరీక్షలు భారతదేశంలో నిర్వహించడానికి కారణం మితవాదులే.

**15.4.1. అతివాద దశ (1906-1920)** : 1906 నుండి 1920 వరకు భారత జాతీయ కాంగ్రెసు ఉద్యమాన్ని అతివాద దశగా అభివర్ణించారు. నిజానికి జాతీయకాంగ్రెస్ ప్రారంభంలో అందరూ మితవాదులే. డబ్ల్యూ.సి. బెనర్జీ, దాదాభాయ్ నౌరోజి, గోపాలకృష్ణ గోఖలే, బాలగంగాధర్ తిలక్ మొదలైనవారందరూ మితవాదులే. మితవాదుల డిమాండ్లను కొన్నింటిని బ్రిటిష్ ప్రభుత్వం పరిశీలించి సానుకూలంగా స్పందించింది. అయితే కొంత కాలం తర్వాత మితవాదుల విజ్ఞాపనలను, బ్రిటిష్ ప్రభుత్వం పట్టించుకోవటం మానివేసింది. వారి డిమాండ్ల పట్ల నిర్లక్ష్యం చూపడం మొదలుపెట్టింది. తత్ఫలితంగా కాంగ్రెసులో సైద్ధాంతిక విభేదాలు తలెత్తాయి. మితవాదుల పార్ధనలు, విన్నపాలు, విజ్ఞాపనలు బ్రిటిష్ ప్రభుత్వ విధానాలలో మార్పు తీసుకురాలేవని, వాటికి కాలం చెల్లిపోయిందని, బ్రిటిష్ వారి వైఖరిలో మార్పు తీసుకొని రావాలంటే, ఆందోళన, ఒత్తిడి తప్పదని, బాలగంగాధర్ తిలక్, బిపిన్ చంద్రపాల్, లాలా లజపతిరాయ్ మొదలైనవారు గట్టిగా వాదించేవారు. ఈ విధమైన పద్ధతులను సమర్థించేవారినే అతివాద వర్గంగా గుర్తించడం, వీరిని లాల్, బాల్, పాల్ అని సూక్ష్మరూపంలో పేర్కొనటం ప్రారంభమైనది. 1907 లో కాంగ్రెసు రెండు వర్గాలుగా చీలి గోపాలకృష్ణ గోఖలే తదితరుల నేతృత్వంలో మితవాదులు, బాలగంగాధర్ తిలక్ నేతృత్వంలో అతివాదులు వేరు, వేరుగా స్వాతంత్ర్య ఉద్యమంలో పని చేయటం ప్రారంభమైనది.

**అతివాదుల పద్ధతులు - విధానాలు :** అతివాదులు కూడా రాజ్యాంగ పద్ధతులనే అనుసరించారు. ఈ పద్ధతులు, కొంచెం తీవ్రంగా, ఒత్తిడి తీసుకు వచ్చేవిగా ఉండేవి. అవి ఏమనగా Demand, Question, Protest, Dharna, Procession, Agitation మొదలైనవి. మాకు అది చేయండి, ఇది చేయండి అని ప్రార్థించే పద్ధతి మాని, ఎందుకు చెయ్యరు, చెయ్యవలసిన బాధ్యత మీకు లేదా అని గట్టిగా అడగాలి అంటారు అతివాదులు. అయితే అతివాదుల పద్ధతులు మితవాదులకు, మితవాదుల పద్ధతులు అతివాదులకు నచ్చేవికావు. అతివాద కాంగ్రెసు నాయకుడైన తిలక్, తరచూ గోఖలే తదితర మితవాద నాయకులను (National Beggars Association) అంటూ హేళనగా మాట్లాడేవారు. ఈ విధమైన విమర్శలు మితవాదులు, అతివాదుల మధ్య పెద్ద అగాధాన్ని సృష్టించాయి. చివరకు 1907లో కాంగ్రెసు అతివాదులు, మితవాదులుగా చీలిపోయింది.

**అతివాదుల విధానాలు :** అతివాదులు స్వరాజ్య సాధన కాంగ్రెసు లక్ష్యంగా ప్రచారం ప్రారంభించారు. స్వరాజ్య సాధనకు ప్రత్యక్ష చర్య, ఆందోళన సాధనాలుగా ఉండాలని చాటారు. స్వరాజ్యసాధన కోసం వీరు దేశభక్తిని, ఐక్యతలను బాగా నూరిపోసారు. యువకులు అధిక సంఖ్యలో హాజరయ్యేవారు. రోజు రోజుకూ ఈ నినాదాల పట్ల బాగా ఆకర్షితులయ్యారు. అతివాదుల సభలకు యువకులు అధిక సంఖ్యలో హాజరయ్యేవారు. రోజు రోజుకు అతివాదుల ప్రాధాన్యం పెరగటం, మితవాదుల ప్రాధాన్యం తగ్గటం మొదలైంది.

**అతివాదుల ప్రణాళిక :** స్వరాజ్య సాధన కోసం అతివాదులు నాలుగు సూత్రాల ప్రణాళికను రూపొందించారు. 1906లో దాదాభాయ్ నౌరోజీ అధ్యక్షతన కలకత్తా సమావేశంలో ఈ నాలుగు సూత్రాల ప్రణాళిక కాంగ్రెస్ ఉద్యమంలో ఆచరించాలని ప్రకటించబడింది. ఆ సూత్రాలు ఏమనగా -

ఎ) విదేశీ వస్తువుల బహిష్కరణ (Boycott of Foreign Goods)

బి) స్వదేశీ (Swadesi)

సి) స్వరాజ్ (Swaraj)

డి) జాతీయ విద్య (National Education)

1906 నుండి భారత స్వాతంత్ర్య ఉద్యమంలో ఈ నాలుగు సూత్రాలు, నాలుగు మంత్రాలుగా ప్రచారమయ్యాయి. "లోకమాన్య" బిరుదాంకితుడైన బాల గాంగాధర్ తిలక్ నిష్కళంక దేశభక్తుడు. మచ్చలేని నాయకుడు, గొప్ప రచయిత, శక్తివంతమైన వక్త. ఆయనకు మాతృదేశం అంటే ప్రాణం, దేశ ప్రజలలో దేశభక్తి, ఐక్యత పెంపొందించడం కోసం ఎన్నో కార్యక్రమాలు నిర్వహించేవాడు. బ్రిటిష్ వారు భారతదేశాన్ని ఎలా దోపిడీ చేస్తున్నదీ ప్రజలకు తెలియజేసి స్వరాజ్య సాధన ఆవశ్యకతను వివరించేవాడు. 'స్వాతంత్ర్యం నా జన్మహక్కు'ని చాటి చెప్పాడు. రాజకీయంగా స్వరాజ్, ఆర్థికంగా స్వదేశీ నా రాజకీయ సిద్ధాంతమని ప్రకటించాడు. దాదాభాయ్ నౌరోజి, సంపద తరలింపు (Drain Theory) అనే సిద్ధాంతము ద్వారా భారతదేశ సంపద ఇంగ్లండుకు ఎలా తరలిపోతున్నదీ కళ్ళకు కట్టినట్లు వివరించేవాడు. పంజాబు కేసరి, లాలా లజపతిరాయ్ వీరితో జత గట్టారు. వీరంతా కలసి అతివాద కాంగ్రెసు ప్రణాళికలను విస్తృతంగా దేశంలో ప్రచారం చేయడం మొదలుపెట్టారు.

**ఎ. విదేశీ వస్తువుల బహిష్కరణ (Boycott of Foreign Goods):** వ్యాపారానికై వచ్చిన తెల్లవారు, తెలివిగా రాజకీయ అధికారాన్ని చేపట్టి భారతదేశంలో తమ వ్యాపారం జోరుగా సాగటానికి అవసరమైన రాజకీయ, ఆర్థిక విధానాలను అమలు చేయటం ప్రారంభించారు. భారతీయులు తమ మాతృదేశంలోనే పాలితులుగా రాజకీయ బానిసత్వం గడుపుతున్నారు. తెల్లవారు తమ దేశంలో యంత్రాల ద్వారా ఉత్పత్తి చేసిన వస్తువులను భారతదేశానికి ఎగుమతి చేసి, భారతీయులకు విదేశీ వస్తువులు వాడే అలవాటు చేసారు. భారతీయులు విదేశీ మోజులోపడి స్వదేశంలో తయారయ్యే వస్తువులు ఉపయోగించడం మానివేసారు. అందువల్ల భారతదేశంలో కుటీర, చేనేత పరిశ్రమలు మూతబడ్డాయి. భారతీయుల ఆర్థిక స్థితి దెబ్బతింది, వారి బ్రతుకులు భారమైనాయి. ఈ దుర్భర పరిస్థితి నుండి భారతీయ కుటీర, చేనేత పరిశ్రమలను చక్కదిద్దటానికి అతివాదులు విదేశీ వస్తువులను బహిష్కరించమని పిలుపునిచ్చారు. దీని ప్రకారం భారతీయులెవ్వరూ, తెల్లవారు తయారు చేసిన వస్త్రాలు, వస్తువులు, పదార్థాలు ఉపయోగించరాదు. ప్రభుత్వ కార్యాలయాల్లో, న్యాయ స్థానాలలో కాలేజీలలో, పాఠశాలల్లో పనిచేయరాదు, విద్యను అభ్యసించరాదు. దీనినే బహిష్కరణ అంటారు. గాంధీజీ 1920 తర్వాత చేపట్టిన స్వాతంత్ర్య ఉద్యమంలో దీనినే సహాయ నిరాకరణ ఉద్యమంగా మార్పు చేసారు. ఈ కార్యక్రమానికి దేశంలో విశేష స్పందన లభించింది.

**బి) స్వదేశీ (Swadesi) :** భారతీయులలో విదేశీ మోజు పెరిగిపోయి, స్వదేశీ వస్తువులను నిరాదరిస్తున్నారు. విదేశీ వ్యామోహం పోగొట్టి, స్వదేశీ పై అభిమానం, ఆదరణ పెంచటానికి తిలక్ స్వదేశీ పిలుపునిచ్చాడు. భారతీయులంతా స్వదేశంలో తయారైన వస్తువులనే వాడాలి. మన సంస్కృతి, సాంప్రదాయాలకు అనుగుణంగా జీవించాలి, ప్రజలలో జాతీయత, ఐక్యత పెంచటానికి, జాతీయ పండుగలు, నాయకుల జన్మదిన వేడుకలు నిర్వహించేవారు. స్వదేశీ వస్తువుల వినియోగం వలన, కుటీర, చేనేత పరిశ్రమలు బలపడి ప్రజలలో స్వావలంబన పెరుగుతుంది. భారతీయులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారు. ఈ స్వదేశీ ఉద్యమాన్నే 1920 తర్వాత గాంధీజీ, నూలు వడకండి, రాట్నం

తిప్పండి, ఖద్దరు తయారు చేయండి అంటూ ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు దైనందిన కార్యక్రమంగా నిర్దేశించారు. స్వదేశీ ఉద్యమం కూడా ప్రజల్లో బాగా చొచ్చుకుపోయింది. భారతీయులలో విదేశీ వ్యామోహం పోయి, స్వదేశీపై ఆదరణ పెరిగింది.

**సి) స్వరాజ్** (Swaraj) : స్వరాజ్ లేదా స్వరాజ్యం అంటే స్వపరిపాలన. అతివాదులలో బ్రిటీష్ వారిని తరిమికొట్టి, భారతదేశానికి స్వాతంత్ర్యం సంపాదించాలనే ఆలోచన ఇంకా ఏర్పడలేదు. స్వపరిపాలన అంటే బ్రిటిష్ వారి ఆధిపత్యంలో ఉంటూనే, పాలనా వ్యవస్థలలో భాగస్వామ్యం విస్తృత పరచుకుంటూ, క్రమంగా అన్ని రంగాలలోను భారతీయులే ప్రాతినిధ్యం కలిగి వుండే విధానం. ఈ భావం తిలక్ ఆలోచనల్లో నుండి జనించింది. తిలక్ ఆర్థిక సిద్ధాంతం స్వదేశీ. రాజకీయ సిద్ధాంతం స్వరాజ్.

**డి) జాతీయ విద్య** (National Education) : భారతదేశంలో విద్యావ్యాప్తిపై గత పాలకులెవ్వరూ దృష్టి కేంద్రీకరించలేదు. కనుకనే ప్రజలు నిరక్షరాస్యులుగా, తెలివి తక్కువ తనంతో, అమాయకుల్లా విదేశీయుల మోసానికి, దోపిడీకి గురవుతూ వచ్చారు. ప్రపంచంలో గ్రీకు, పాశ్చాత్య దేశాలలో, విద్యా వ్యాప్తికై పాలకులు తీవ్రంగా కృషి చేయగా, భారతదేశంలో ప్రజలందరికి విద్యను అందించటానికి హిందూ రాజులు కాని, ముస్లిం పాలకులు కానీ సరైన ప్రయత్నాలు చేయలేదు. కేవలం ఒకటి, రెండు అగ్రవర్ణాలవారు మాత్రమే విద్యాభ్యాసం చేసేవారు. వెనుకబడిన, అంటరాని కులాలకు, కొండ జాతులవారికి అంటే సామాన్య ప్రజానీకానికి విద్యావకాశాలు లేనే లేవు. స్త్రీలకు కూడా విద్యావకాశాలు లేవు. విద్య పూర్తిగా నిర్లక్ష్యం చేయబడింది. కొద్దిమంది మాత్రమే చదువుకొని, ఉద్యోగాలు పొందగలిగేవారు. అందుకే దేశం బాగా వెనుకబడిపోయింది. సామాన్య ప్రజానీకానికి విద్యావకాశాలు కల్పించిన ఖ్యాతి ఆంగ్లేయులకే దక్కుతుంది. విచిత్రమేమిటంటే సంస్కృతం నేర్చుకుంటే శూద్రులు ఎన్నో భయంకరమైన శిక్షలకు గురయ్యేవారు, కాని ఆంగ్లేయులు, ఆంగ్ల భాష నేర్చుకోమని ఎన్నో విధాలుగా ప్రోత్సహించేవారు. శూద్రులు, బలహీన వర్గాలు నివసించే ప్రాంతాలలోకి, గుడిసెల్లోకి, గుడారాల్లోకి వెళ్ళి , వారి భాష నేర్చుకోమని క్రైస్తవ మతంలో చేరమని ఉత్సాహపరచేవారు. దొరలు, దొరసానులు ఈ విధంగా పేటల్లో సంచరిస్తూ, పేద ప్రజల హృదయాలు దోచుకునేవారు. కాని భారతీయులై వుండి విద్యాధికులైన అగ్రవర్ణాలలోని బ్రహ్మణులు కాని, క్షత్రియులుకాని పేటల్లోకి వెళ్ళి వారిని చదువుకోమని ఏనాడూ ప్రోత్సహించలేదు. పైగా అంటరానివారు పాఠశాలల్లో, దేవాలయాలలో ప్రవేశించరాదంటూ ఆంక్షలు విధించి వారిని నిరక్షరాస్యులుగా మిగిల్చారు. బ్రిటిష్ వారు భారతదేశంలో సంస్కరణలు ప్రవేశపెట్టిన తర్వాత ఆంగ్ల విద్యావ్యాప్తిపై దృష్టి పెట్టారు. యూనివర్సిటీలు, కాలేజీలు స్థాపించి, విద్యా కుసుమాలను అందించడం మొదలు పెట్టారు. పేటల్లో, గ్రామాల్లో క్రమేపి ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత పాఠశాలలు ప్రారంభమయ్యాయి. ఆంగ్ల విద్యతో పాటు, ప్రాంతీయ భాషల్లోను విద్యావ్యాప్తి ప్రారంభమైంది. ఆంగ్ల భాషను చదువుకొన్న బ్రాహ్మణులు ఆంగ్లేయుల పాలనలో నౌకరీలు సంపాదించారు. గమ్మత్తయిన విషయమేమిటంటే, జాతీయ కాంగ్రెస్‌లో చేరి, స్వాతంత్ర్యోద్యమంలో ప్రజలను చైతన్యవంతులను చేసి నాయకత్వం వహించిన వారంతా ఆంగ్ల విద్య నేర్చుకుని, ఉన్నత విద్యార్హతలు కలిగిన అగ్ర వర్ణాలవారే. దేశంలో రాను రాను ఆంగ్ల విద్యపై మోజు పెరగసాగింది. ఆంగ్ల భాషను నేర్చుకొని పాశ్చాత్య రాజనీతి భావాలను జీర్ణించుకున్న బుద్ధి జీవులైన మధ్య తరగతి వర్గమే జాతీయోద్యమంలో కీలకమైన భూమికను నిర్వహించడం గమనార్హం. అయితే తిరిగి ఈ వర్గమే స్వదేశీపై అభిమానాన్ని పెంచుకోవాలని ప్రచారం ప్రారంభించింది. జాతీయ పాఠశాలలు, కళాశాలలు భారతీయులే స్థాపించాలని, భారతీయులు ఈ విద్యా సంస్థలలో చేరి భారతీయ భాషలు నేర్చుకొని విదేశీ భాషలపై ఆధారపడటం తగ్గించుకోవాలని ప్రజలకు బోధించారు. ఈ స్ఫూర్తి వల్ల అనేక కళాశాలలు, పాఠశాలలు స్థాపించబడ్డాయి. భారతీయులు క్రమ క్రమంగా ఈ విద్యా సంస్థలలో చేరి విద్యాభ్యాసం చేయడం ప్రారంభించారు. బెనారస్ హిందూ కళాశాల, D.A.V. College మొదలైన ఎన్నో కళాశాలలు స్థాపించబడ్డాయి.

**అతివాద ఉద్యమంలో ప్రధానమైన సంఘటనలు :**

1) 1905లో గవర్నర్ జనరల్ ఆఫ్ ఇండియా అయిన లార్డ్ కర్జన్ బెంగాలును తూర్పు, పశ్చిమ బెంగాలుగా విభజించినప్పుడు, అతివాదులు ఈ విభజనను వ్యతిరేకిస్తూ ప్రచారం చేసారు. వందేమాతరం ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. బెంగాలు ప్రజలు విభజనకు వ్యతిరేకంగా ప్రారంభించిన ఉద్యమం యావద్భారతావనికి విస్తరించడానికి కారణం అతివాదుల ప్రచారమే. ఈ ఉద్యమం వృధా కాలేదు, 1911 లో బెంగాల్ విభజన రద్దయి బెంగాల్ ఏకమైనది.

2) 1906లో అతివాద కాంగ్రెసు ప్రణాళికను 1906లో కలకత్తా కాంగ్రెసు సమావేశంలో అధ్యక్షులైన దాదాబాయ్ నౌరోజీ ప్రకటించారు.

3) 1907లో సూరత్‌లో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో కాంగ్రెస్ అతివాదులు, మితవాదులు అనే రెండు వర్గాలుగా చీలిపోయింది.

4) మితవాదుల ప్రోత్సాహంతో బ్రిటిష్ ప్రభుత్వం 1908లో తిలక్‌ను నిర్బంధించి బర్మాలోని మాండలే జైలులో 1908-1914 వరకు 6 సంవత్సరాలు జైలులో పెట్టారు

5) తిలక్ జైలు నుండి విడుదలై 1916లో హోమ్‌రూల్ లీగ్‌ను స్థాపించి అనిబిసెంట్‌తో కలిసి హోంరూల్ ఉద్యమం చేపట్టి దేశంలో సుడిగాలి పర్యటన చేసారు.

6) కాంగ్రెసు రెండుగా చీలిపోవటం వలన జాతీయ ఉద్యమం బలహీనపడిందని గ్రహించిన ఇరు వర్గాల నాయకులు ఐక్యతారాగం మొదలుపెట్టారు. 1916లో అతివాదులు, మితవాదులు లక్నో కాంగ్రెస్ సమావేశంలో ఏకమై ఐక్య కాంగ్రెసుగా బ్రిటీష్ ప్రభుత్వంపై పోరాడాలని నిర్ణయించారు.

7) 1917లో అనిబిసెంట్ అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షురాలుగాను 1918లో తిలక్ అధ్యక్షుడుగా ఎన్నుకోబడ్డారు.

8) 1920లో తిలక్ మరణించాడు. 1915లో గోఖలే మరణించాడు. వీరిద్దరి మరణంతో జాతీయ కాంగ్రెస్ సారధ్యం క్రమేపి గాంధీజీకి దక్కింది. అక్కడ నుండి గాంధీ శకం ఆరంభమైంది.

**అతివాదులు సాధించిన విజయాలు :**

1. నత్తనడకలా సాగుతున్న భారత జాతీయ ఉద్యమానికి జవసత్వాలు నింపి, ఉద్యమకారుల్లో ఉత్సాహాన్ని రేకెత్తించి, ఉద్యమాన్ని వేడెక్కించినవారు అతివాదులు.
2. అతివాదుల పద్ధతులు, విధానాలు భారతీయ యువతను విశేషంగా ఆకర్షించాయి.
3. అతివాదుల ఆర్థిక సిద్ధాంతాలు భారతీయ పరిశ్రమల పటిష్టతను వాటిపై ఆధారపడిన కార్మికులకు పరిపుష్టిని కలిగించాయి.
4. స్వరాజ్య భావన భారతీయులలో ఆత్మ విశ్వాసాన్ని కలిగించింది. అతివాదుల ఉద్యమం ఫలితంగా బ్రిటిష్ ప్రభుత్వం అనేక రాజకీయ, పాలనా పరమైన సంస్కరణలు చేపట్టింది. 1909లో జారీ చేసిన మింటో మార్లే సంస్కరణల చట్టం 1919లో జారీ చేసిన మాంటెగ్యూ - చెమ్స్‌ఫర్డ్ సంస్కరణల చట్టం అతివాదుల ఉద్యమ ఫలితంగా జారీ చేయబడినవే. ఈ చట్టాలు భారతదేశ పరిపాలనలో ఎన్నో మార్పులు తెచ్చాయి.
5. అతివాద ఉద్యమం ప్రజల్లో పిరికితనాన్ని పోగొట్టి ధైర్యం కలిగించింది. ఇది మరింత పెరిగి, భారత స్వాతంత్ర్యోద్యమానికి దోహదం చేసింది.
6. భారతదేశంలో విద్యా సుగంధం గుబాళించింది. దేశం నలు దిశలలో విద్యాలయాలు స్థాపించబడ్డాయి. భారతీయ భాషలకు ఆదరణ, గుర్తింపు, ప్రాముఖ్యత లభించింది. సామాన్యులు, స్త్రీలు చదువుకోవటం ప్రారంభించారు.

**అతివాద ఉద్యమంలో లోపాలు :** అతివాద ఉద్యమంలో కొన్ని అపశృతులు దొర్లాయి. ఇది కేవలం కొన్ని అగ్ర కులాల నాయకులకు పరిమితమైన ఉద్యమమని, రైతులు, కార్మికులు, బడుగు, బలహీన వర్గాలు ఇందులో పెద్దగా పాలు పంచుకోలేదని విమర్శలు వచ్చాయి. అతివాద ఉద్యమం భారత జాతీయ ఉద్యమంలో ఒక మరపురాని చైతన్య దీపిక, ఒక నవయుగానికి నాంది.

**15.4.2. గాంధీయుగం (Gandhian Era 1920-1947) :** 1915లో మితవాద నాయకుడైన గోపాలకృష్ణ గోఖలే మరణం, 1920లో అతివాద నాయకుడైన తిలక్ మరణం, కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహాన్ని దెబ్బతీసాయి. కొత్త నాయకత్వానికి ఆహ్వానం పలికింది. కాంగ్రెస్ నేతృత్వంలో భారత జాతీయ ఉద్యమాన్ని విజయవంతంగా నడిపించడానికి నాయకత్వం వహించడానికి రంగ ప్రవేశం చేసాడు మహాత్మా మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ. 1869 అక్టోబర్ 2వ తేదీన గుజరాత్ రాష్ట్రం, పోర్‌బందర్ గ్రామంలో జన్మించిన

మోహన్‌దాస్ చిన్నప్పటి నుండి వినయ, విధేయతలతో పెరిగాడు. తల్లిలోని దైవ చింతన, హిందూ మత భావాలు, అణకువ మొదలైన లక్షణాలు చిన్ననాటి నుండే అలవడ్డాయి. భారతదేశంలో డిగ్రీ పూర్తి చేసిన తర్వాత, లండన్ వెళ్ళి లా డిగ్రీ పొందాడు. తర్వాత భారతదేశానికి వచ్చి న్యాయవాద వృత్తిని ప్రారంభించాడు. 1893లో ఒక కంపెనీ తరపున దక్షిణాఫ్రికా వెళ్ళి 1914 వరకు అక్కడే ఉన్నాడు. అక్కడ ఆసియా వాసుల సమస్యలపై దక్షిణాఫ్రికా ప్రభుత్వంపై అహింసాయుత ఉద్యమం నడిపి ప్రపంచానికి పరిచయమయ్యాడు. గోపాలకృష్ణ గోఖలే పిలుపు మేరకు 1915లో భారతదేశానికి వచ్చాడు, కాంగ్రెస్‌లో చేరాడు. అయితే అతివాద కాంగ్రెస్ ఉద్యమం ప్రబలంగా ఉన్న రోజుల్లో గాంధీ సామాన్య కాంగ్రెస్ కార్యకర్త. పెద్దగా గుర్తింపులేనివాడు. 1920లో తిలక్ మరణం, గాంధీ నాయకత్వానికి మార్గం సుగమం చేసింది. గాంధీపై తల్లి ప్రభావం ఎక్కువగా ఉండేది. హరిశ్చంద్ర నాటకంలోని హరిశ్చంద్రుని పాత్ర, సత్యవాక్య ఆచరణకై ఆయన పడిన కష్టాలు గాంధీపై విశేషమైన ప్రభావాన్ని చూపాయి. భగవద్గీత, రామాయణం, బుద్ధుని బోధనలు, క్రీస్తు శాంతి సందేశం, ఖురాన్, రస్కిన్, టాల్‌స్టాయ్‌ల ప్రభావం గాంధీపై ఎక్కువ ఉంది. My Experiments with truth, అనే ఆత్మకథ రచించాడు. మితవాది గోపాలకృష్ణ గోఖలే తన రాజకీయ గురువుగా ప్రకటించుకున్నాడు. మితవాదుల పద్ధతులనే జాతీయ ఉద్యమంలో సరికొత్త పంథాలో అనుసరించి స్వాతంత్ర్య సముపార్జన చేసాడు.

**గాంధీజీ సిద్ధాంతాలు :**

1) రాజకీయాలను నైతిక విలువలతో జతపరచాడు

2) అహింసావాది

3) హిందువు - మతవాది

4) పరమత సహనము కలిగినవాడు

5) సత్యము - అహింస, సహాయ నిరాకరణ, శాసనోల్లంఘన, నిరాహార దీక్ష ఆయన స్వాతంత్ర్యోద్యమంలో ఉపయోగించిన పద్ధతులు

6) గ్రామ స్వరాజ్

7) కుటీర, చేనేత పరిశ్రమల అభివృద్ధి

8) అధికార వికేంద్రీకరణ

9) ఖద్దరు వాడకం

10) మద్యపాన నిషేధం

11) అస్పృస్యతా నివారణ - స్త్రీ విద్య.

స్వాతంత్ర్యోద్యమంలో కాంగ్రెస్‌లో ఏ పదవులు ఆశించలేదు. స్వాతంత్ర్యం తర్వాత స్వతంత్ర్య భారత ప్రభుత్వంలో ఏ అధికార పీఠాన్ని కోరలేదు. దేశానికి ఒక మార్గదర్శకునిగా, ఒక నిష్కర్మయోగిగా జీవించాడు. రవీంద్రనాథ్ ఠాగూర్ మహాత్మా అని బిరుదునిచ్చాడు. దేశ ప్రజలు జాతి పితగా గౌరవించారు. నెహ్రూ గౌరవంగా బాపూ అని పిలిచే అహింసావాది మహాత్మా గాంధీ, నాథూరామ్ గాడ్సే అనే ఒక మతోన్మాది తుపాకీ గుళ్ళకు బలియై 30-1-1948న హత్య గావింపబడ్డాడు. ఒక భారతీయుడు, ఒక భారతీయుడిని, ఒక హిందువు, ఒక హిందువుని హత్యచేయటం దురదృష్టం.

గాంధీ స్వాతంత్ర్యోద్యమంలో ఒక నూతన మార్గాన్ని అవలంబించాడు అదే అహింసా మార్గం. శాంతియుత, అహింసా పద్ధతులలో కాశ్మీర్ నుండి, కన్యాకుమారి వరకు, ఆబాల గోపాలాన్ని అన్ని వర్గాల కులాల, మతాల ప్రజలను ఏకత్రాటిపై స్వాతంత్ర్య సమరంలో నడిపిన మహానాయకుడు గాంధీ. మేధావులకే తప్ప, సామాన్యులకు చోటులేని కాంగ్రెస్ ద్వారాలను తెరచి సామాన్య ప్రజలను భాగస్వాములను చేసి, రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని కేవలం 27 సంవత్సరాల ఉద్యమం ద్వారా దేశం నుండి తరిమికొట్టిన ఖ్యాతి గాంధీకే దక్కింది.

పాఠశాలలో అభ్యసించలేదు. ఇంటి వద్ద ఫెర్టినాండ్ టి బ్రూక్స్ అనే (Fertinand T. Brooks) టీచరు వద్ద నేర్చుకున్నాడు. చిన్నతనంలో నేర్చుకున్న ఈ విద్య శాస్త్ర విజ్ఞానం పట్ల ఆయనకు ఆసక్తిని పెంచినది. ప్రతి విషయాన్ని నిశితంగా ఆలోచించగల స్థాయి, ఆసక్తి కలిగేటట్లుగా చేసినది. 15వ ఏట హారో (Harrow) లోని ఒక స్కూల్లో చేరి 1907లో కేంబ్రిడ్జి ట్రినిటీ కళాశాల (Cambridge Trinity College) లో అడ్మిషన్ పొందాడు. ఆ తరువాత లండన్‌లో లా డిగ్రీ చదివాడు. విద్యార్థిగా ఉన్నప్పుడే ఇటలీలో విప్లవవాది 'గారిబాల్డీ' (Gari Baldy) రచనలు అనేకం చదవడంతో జాతీయతా భావం పట్ల ఆకర్షితుడైనాడు. కేంబ్రిడ్జిలో విద్యార్థిగా ఉన్నప్పుడు 'బెర్నార్డ్‌షా', 'వెబ్స్' (Bernard Shaw , Webbs) తో పరిచయం ఏర్పడడం వలన వారి భావాలు ఆయనకు స్ఫూర్తినిచ్చాయి. లండన్‌లో విద్యార్థిగా ఉన్నప్పుడే 'లాకే', 'రూసో', 'బెంథామ్స్' 'మిల్' (Locke, Rousseau, Bentham, J.S. Mill) ల భావాలను క్షుణ్ణంగా అధ్యయనం చేశాడు. స్వేచ్ఛావాదం పట్ల ఆకర్షితుడయినాడు. భారతదేశంలో జరుగుతున్న స్వాతంత్ర్య పోరాట ఘటనల గురించి తనకు తండ్రి వద్ద నుండి వచ్చే ఉత్తరాల ద్వారా ఎప్పటికప్పుడు తెలుసుకొనుచుండెడి వాడు. 1912లో భారతదేశానికి తిరిగి వచ్చి న్యాయవాద వృత్తిని చేపట్టి దానిపట్ల ఆసక్తి లేకపోవుటచే విడిచి పెట్టినాడు. జాతీయ ఉద్యమము పట్ల, స్వాతంత్ర్య పోరాటము పట్ల ఆసక్తిని పెంచుకున్నాడు. 1916లో లక్నో కాంగ్రెస్ సమావేశంలో మొదటిసారిగా గాంధీజీని జవహర్‌లాల్ కలుసుకోవటం జరిగింది.

## 16.2 స్వాతంత్ర్య సమరంలో నెహ్రూ పాత్ర:

విద్యాభ్యాసము పూర్తి చేసుకొని భారతదేశం తిరిగి వచ్చిన తరువాత తన తండ్రి మోతీలాల్ నెహ్రూతో కలసి స్వాతంత్ర్య సమరంలో పాల్గొంటూ 1916లో గాంధీజీని కలిసెను. గాంధీ పట్ల ఎటువంటి భావన ఆయనకు కలుగలేదు. ఒక ప్రత్యేకత కలిగిన వ్యక్తిగా మాత్రమే గాంధీజీని ఆయన గుర్తించాడు. కాని నెమ్మది నెమ్మదిగా ఆ అభిప్రాయం మార్చుకొనుటకు వీలు కల్గినది. స్వతంత్ర సముపార్జనకి ఆయన అనుసరించే అహింస, సహాయ నిరాకరణ పద్ధతులే సరైన మార్గాలని నెహ్రూ భావించాడు. గాంధీజీతో బలపడిన సన్నిహితత్వమే ఈ భావనకి కారణం. అనతికాలంలోనే జాతీయ కాంగ్రెస్ నాయకుడిగానే కాక వివిధ సంస్థలలో, ఉద్యమాలలో నాయకునిగా ఎదిగాడు. 1918లో అనిబిసెంట్, బాలగంగాధర్ తిలక్ (AnneBesant and Balagangadhara Tilaq) ఆరంభించిన 'హోంరూల్ ఉద్యమం' (Home Rule Movement) లో చేరి దానికి కార్యదర్శిగా నియమితుడయ్యాడు. 1919లో జలియన్‌వాలా బాగ్ దురంతాలపై నియమింపబడిన కమిటీ (దర్యాప్తు సంఘం)లో సభ్యత్వం ద్వారా మరింతగా పేరు ప్రఖ్యాతులు సంపాదించాడు. 1920లో ఉత్తరప్రదేశ్ రైతు ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నాడు. గాంధీజీ ఆరంభించిన సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొనడంతో అరెస్ట్ కాబడి 1923 వరకు జైలులోనే ఉండిపోవలసి వచ్చినది. 1928లో (All India Trade Union Congress) ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ అధ్యక్షునిగా ఎన్నుకొనబడినాడు. 1929లో నెహ్రూ రాజకీయ జీవితం మలుపు తిరిగింది. ఆయన 'జాతీయ కాంగ్రెస్' అధ్యక్షునిగా ఎన్నుకోబడ్డాడు.

నెహ్రూ అధ్యక్షతన 1929 జాతీయ కాంగ్రెస్ లాహోరు సమావేశంలో ప్రసిద్ధ స్వతంత్ర్య తీర్మానము ఆమోదించబడినది. 1930, జనవరి 26 స్వాతంత్ర్య దినముగా ఆయన ప్రకటించినాడు. అది భారతీయులు ఎవ్వరితోను పంచుకొనలేని జన్మహక్కు అని, తమ నేల ఫలాలు, స్వేచ్ఛా వాయువులు అనుభవించే హక్కు అన్ని దేశాలలోని ప్రజల వలె భారతీయులకు కూడా ఉందని అది ఎవరూ కాదనడానికి వీలు లేదని ఆయన ప్రకటించినాడు. జాతీయ కాంగ్రెస్‌లోని కొందరు (Dominion Status) అధినివేశ ప్రతిపత్తిని అంగీకరిద్దామని భావించినా నెహ్రూ మాత్రం (Purna Swaraj) పూర్ణ స్వరాజ్యమే తన ధ్యేయమని ప్రకటించాడు. గాంధీజీ పిలుపు మేరకు శాసనోల్లంఘన ఉద్యమం (Civil disobedience Movement) దండి మార్చితో (Dandi March) 1930లో ఆరంభమయింది. 1930లో నెహ్రూ అరెస్ట్ కాబడి 1931 జనవరి వరకు జైలులోనే గడపవలసి వచ్చినది. తిరిగి 1931లో అరెస్ట్ కాబడి 1933 వరకు జైలు జీవితం గడిపినాడు. ఆ సమయంలోనే తన ప్రసిద్ధ గ్రంథము 'Glumses of World' ఆ గ్రంథంలో సామ్రాజ్యవాదాన్ని వలసవాదాన్ని, ధనిక వర్గాన్ని నిశితంగా విమర్శించి సామ్యవాదాన్ని సమర్థించాడు. 1934లో ఆలీపర్ జైలు నుండి కొన్ని షరతులతో విడుదలయ్యాడు.

ఆ సమయంలోనే తన భార్య శ్రీమతి కమల స్విట్జర్లాండ్‌లో చనిపోవడం కొద్ది సంవత్సరాలకే తన తల్లిని కూడా కోల్పోవడం జరిగాయి. 1936లో నెహ్రూ జాతీయ కాంగ్రెస్ అధ్యక్షునిగా రెండవసారి ఎన్నుకొనబడినాడు. 1937లో 3వ సారి అధ్యక్షుడయినాడు. ఆ సందర్భంలోనే భారతదేశ సమస్యలకి సామ్యవాదం పరిష్కారమని నొక్కివక్కాణించాడు. 1938లో బ్రిటన్, స్పెయిన్, జెకొస్లొవేకియాలో పర్యటించాడు. 1939లో చైనా సందర్శించాడు. రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో జాతీయ కాంగ్రెస్‌ని సమయస్ఫూర్తితో నడిపించిన ఘనత ఆయనకే దక్కినది. 1942లో జాతీయ కాంగ్రెస్ సమావేశంలో గాంధీజీ నెహ్రూను తన వారసునిగా ప్రకటించాడు. 1942 జాతీయ కాంగ్రెస్ బొంబాయిలో సమావేశమై చారిత్రాత్మకమయిన 'క్విట్ ఇండియా' (Quit India) తీర్మానమును ఆమోదించినది. యిది జరిగిన వెంటనే నెహ్రూ అరెస్ట్ కాబడి 1945 వరకు జైలు జీవితం గడిపినాడు. ఆ సుదీర్ఘ జైలు జీవితంలో తన ప్రసిద్ధ గ్రంథము 'ది డిస్కవరీ ఆఫ్ ఇండియా' (The Discovery of India) పూర్తి చేసెను.

1946లో తిరిగి కాంగ్రెస్ అధ్యక్షునిగా ఎన్నుకొనబడినాడు. తాత్కాలిక ప్రభుత్వ అధిపతి (Interim Government) గా కూడా కొనసాగినాడు. 1947 ఆగస్ట్‌లో బ్రిటిష్ ప్రభుత్వము భారతదేశాన్ని ఇండియా, పాకిస్థాన్‌గా విభజించినది. కాంగ్రెస్ దీనిని తీవ్రంగా వ్యతిరేకించినా చివరకు ఆమోదించవలసి వచ్చినది. స్వతంత్ర భారత తొలి ప్రధానిగా నెహ్రూ కొనసాగినాడు. 1946లో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడిన దగ్గర నుండి 1964 మే 27వ తారీకు తను అస్తమించే వరకు స్వతంత్ర భారతదేశానికి ప్రధానమంత్రిగా నెహ్రూ ఎనలేని సేవ చేసి దాని అభివృద్ధికి పాటుపడినాడు.

## 16.3 తాత్త్విక పునాదులు (The Philosophical Foundations):

నెహ్రూ తండ్రి మోతీలాల్ ఒక అజ్ఞేయవాది (Agnostic). ఆయన హేతువాది, యదార్థవాది. జవహర్ తండ్రి కుమారునిగా అతని గుణాలను పుణికి పుచ్చుకున్నాడు. పేటర్ (Pater), ఆస్కార్ వైల్డ్ (Oscar Wilde) రచనలు జవహర్‌లాల్‌ను ఆయన జీవితపు తొలి సంవత్సరాలలో ప్రభావితం చేసినాయి. మేధా సంబంధమైన అధ్యయనాల లేదా ఆది భౌతికవాద వాదోపవాదాల వలన గాని ఆయన జీవితపు తత్త్వం రూపొందలేదు. ఆయన స్వీయ అనుభవం నుంచే అది ఏర్పడినది. జీవితం పట్ల ఆయనది ఆశావాది వైఖరియే. ప్రాచీన గ్రీకుల వలె మానవుని అంతర్గత శక్తుల సామరస్య వికాసము ఉండగలదని ఆయన విశ్వసించాడు. సాహసోపేత కార్యాల ద్వారా జీవితంలో ఆనందించాలని ఆయన భావించాడు. ఆయన ఒక సాంఘిక ఆదర్శవాది. సామాన్యుని బాధల పట్ల సానుభూతి గల ఒక ప్రజాస్వామిక వాది. ఆయన జీవితం, రాజనీతి తత్త్వం పై బౌద్ధ ప్రభావం గాఢంగా ఉంది. ప్రజా సంక్షేమానికి పాటుబడ్డ చక్రవర్తిగా ఆయన అశోకుని కూడా ఎంతో ప్రశంసించాడు. 1954లో బౌద్ధ భావన అయిన 'పంచశీల' (Pancha Sheel) ను ఆయన సహజీవన నియమాలను సూచించడానికి లౌకికపరమయిన సందర్భంలో వాడటం జరిగింది.

1. **చరిత్రతత్త్వం** (Philosophy of History) :- నెహ్రూ చరిత్ర విద్యార్థి. ఆయనకు చారిత్రక అవగాహన ఎక్కువ. మానవ నాగరిక చరిత్రలో ఆయన ఆసక్తి కనబరచాడు. చెంఘిస్ ఖాన్, నెపోలియన్‌ల పై అభిమానం ఎక్కువ. చరిత్రలో వస్త్వాశ్రయ శక్తుల (Objective Forces) పాత్ర గురించి ఆయన చర్చించినా నెహ్రూ పూర్తి భౌతిక వస్త్వాశ్రయ వాది కాదు. చరిత్రలో వ్యక్తుల (Heroes) గొప్ప పాత్రను గురించి ఆయన ప్రస్తావించాడు. ఉదాహరణకు ఆధునిక భారత రాజకీయాలలో గాంధీజీ సృజనాత్మక పాత్రను ఆయన అంగీకరించాడు. గాంధీజీ విశిష్ట వ్యక్తిత్వం దాదాపుగ విప్లవమనేటంతటి సాంఘిక, రాజకీయ మార్పులను తీసుకు వచ్చింది అని భావించాడు. ఒక వ్యక్తి లక్షలాది మంది జీవితాలను మార్చవచ్చునని ఆయన భావన. రష్యన్ విప్లవానికి ఆ తర్వాత మార్పులకు లెనిన్ కారకునిగా ఆయన పరిగణించాడు.

## 16.4 సాంఘిక భావాలు (Social Views):

భారతదేశ సాంఘిక సమస్యల పట్ల నెహ్రూకు అవగాహన ఉంది. ఆయన శాస్త్రీయ వైఖరి ఆయనను ఆధునిక ప్రతిపాదకునిగా

చేసినది. (His scientific attitude made him an exponent of modernism). పుట్టుకతో ఆయన హిందూ అయినా స్వభావ రీత్యా ఆయన లౌకిక వాదాన్ని బలపరచాడు. సనాతన బ్రాహ్మణ కుటుంబంలో జన్మించినా ఆచార సంప్రదాయాలకు, మూఢ నమ్మకాలకు, సంకుచిత కుల వ్యవస్థకు ఆయన తన జీవితంలో చోటు యివ్వలేదు. చిన్నతనం నుండి శాస్త్రీయ అవగాహన, అభివృద్ధి పైననే దృష్టి సారించాడు. హిందూ మతాన్ని ఆయన ద్వేషించలేదు. కాని దాని ప్రచారానికి కూడా పూనుకోలేదు. నెహ్రు దృష్టిలో మతం వ్యక్తిగతమయినది. వ్యక్తి తన యిష్టమున్న మతాన్ని స్వీకరించే స్వేచ్ఛ కలిగి ఉన్నాడు. కాని సంఘాన్ని ఏ ఒక్క మతం తన చెప్పు చేతలలో ఉంచుకొని నియంత్రించాలని చూడరాదని ఆయన భావన. రాజకీయాలలోకి మతాన్ని చొప్పిస్తే ఏ దేశమయినా చిన్నా భిన్నమయి పోతుందని ఆయన ఉద్ఘాటించాడు. మతాన్ని రాజకీయాలను జోడించడం ఆయన వ్యతిరేకించాడు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత భారతదేశంలో ఉన్న అన్ని మతాల మధ్య సామరస్యత ఉండాలంటే లౌకిక వాదమొక్కటే మార్గమని, అన్ని మతాలు తమ తమ కార్యకలాపాలను స్వేచ్ఛగా కొనసాగించాలంటే భారతదేశం లౌకిక రాజ్యంగా రూపుదిద్దుకోవాలని రాజ్యం మత విషయాలలో జోక్యం చేసుకొనరాదని, అన్ని మతాలను సమదృష్టితో చూడాలని దానికి లౌకిక రాజ్యమొక్కటే మార్గమని భావించాడు. భారతదేశ ప్రజలలో లౌకిక పర ఆలోచనకి ఆయన ఎనలేని కృషి చేశాడు. మానవతే ఆయన దేవాలయం, పేదల సేవే ఆయన మతంగా భావించాడు. మారుతున్న కాలానికనుగుణంగా సాంఘిక వ్యవస్థలో కూడా మార్పులు అనివార్యం. సాంఘిక దురాచారాలు, ఛాందస భావాలు, కుల వ్యవస్థ మార్పును త్వరగా అంగీకరించని కఠిన ఆచారాలు వీటన్నిటిలోనూ మార్పు క్రమేపీ రావాలని తదనుగుణంగా ప్రజల ఆలోచనా సరళి, అలవాట్లు, ప్రవర్తనా రీతి మార్పు చెందాలని పోటీతత్వం విభేదాలకి బదులుగా సహకార భావన, సమానత్వం, సాంఘిక న్యాయం ఉన్న నవ సమాజ స్థాపన జరగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సాంఘిక ప్రగతి కార్యక్రమంలో స్త్రీలు కూడా పురుషులతో సమానంగా అన్ని రంగాలలో ముందుకు రావాలని, కుల, మత, వర్గ బేధాలు లేని ఒక నూతన సాంఘిక వ్యవస్థ నిర్మింపబడాలని ఆయన ప్రగాఢ వాంఛ.

1. **లౌకిక వాదం (Secularism):** నెహ్రు ఉదార సాంస్కృతిక పెంపకం వలన (వాతావరణంలో పెరగడం వలన) లౌకిక దృక్పథాన్ని అలవరచుకున్నాడు. హిందూ మహాసభ నాయకులను అభివృద్ధి నిరోధకులుగాను, ఉన్నత వర్గాల ప్రయోజనాల పరిరక్షకులుగాను విమర్శించాడు. ఆయనకు గల లౌకిక దృక్పధం అల్ప సంఖ్యాకులకు ఎంతో ఊరట కలిగించింది. ఆయన ఉద్దేశ్యంలో లౌకిక వాదమనగా ప్రధానంగా ఆధ్యాత్మిక విలువలు, కొన్ని ప్రవర్తనా ప్రామాణికాలు కలిగి ఉండాలి. జాతీయ వాదం, లౌకిక వాదం కలిసే ప్రయాణిస్తాయని భావించాడు. సామ్యవాదం, లౌకిక వాదం రెండూ విడదీయుటకు వీలులేని భావాలు. ప్రజాస్వామ్య సామ్యవాదంలో మత రాజకీయాలకు తావు లేదు. భారతదేశంలో లౌకిక భావనాభివృద్ధికి ఆయన చేసిన కృషే ఆధునిక రాజనీతి తత్వానికి ఆయన చేసిన మహత్తర సేవ.

## 16.5 రాజకీయ భావాలు (Political Ideas):

నెహ్రు ప్రజాస్వామ్యాన్ని ఒక విస్తృత సిద్ధాంతంగా భావించాడు. అది కేవలం రాజకీయ, ఆర్థికపరమైనది కాదు. అది మానవ మేధస్సుకి సంబంధించినది. సాధ్యమయినంత వరకు అందరికీ రాజకీయ ఆర్థిక రంగాలలో సమాన అవకాశాలు లభించడమే ప్రజాస్వామ్యమని ఆయన నిర్వచించాడు. వ్యక్తి సంపూర్ణ వికాసానికి అవసరమయిన స్వేచ్ఛ, ఇతరుల అభిప్రాయాలను సామరస్యంతో అర్థం చేసుకోవడం దీనిలోని ముఖ్యాంశాలు. కొన్ని మౌలిక విలువలతో నిండినదే ప్రజాస్వామ్యం. సత్యాన్వేషణ, సత్య సంధత దీనిలో ఉంటాయి.

**16.5.1 రాజకీయ ప్రజాస్వామ్యం (Political Democracy):** ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛ అత్యంత ప్రాధాన్యత కలిగి ఉంటుంది. ప్రాతినిధ్య ప్రభుత్వం, ప్రజాసార్వభౌమాధికారం, రాజకీయ ప్రజాస్వామ్యంలో ప్రధాన అంశాలు అని ఆయన భావించాడు. ఎన్నికలు, చర్చల ద్వారా నిర్ణయాలు, నిర్ణయాలకి అందరూ కట్టుబడి ఉండడం, ప్రజాస్వామ్యంలో ఆయన అభిమానించి..

విషయాలు. సర్వజన వయోజన ఓటింగు ద్వారా రాజకీయ సమానత్వంతో పాటు ఇతర సమానత్వాలు కూడా పొందాలని ఆయన కోరుకున్నాడు. రాజకీయ సమానత్వమే అన్ని సమానత్వాలకి మూలం అని ఆయన భావన. సమర్థవంతమయిన పరిపాలనకు రాజకీయ పక్షాలు, ప్రభుత్వ నిర్మాణానికి వాటి ఆవశ్యకతను నెహ్రూ గుర్తించాడు.

**16.5.2 ఆర్థిక ప్రజాస్వామ్యము (Economic Democracy) :** భారత రాజ్యాంగములోని ప్రాథమిక హక్కులు, ఆదేశ సూత్రాలు నెహ్రూ ఆర్థిక ప్రజాస్వామ్యము పై కల్గి ఉన్న భావాల నుండే రూపొందినాయి. వ్యక్తి స్వేచ్ఛ, ఆర్థిక స్వాతంత్ర్యం అనే అంశాల మధ్య సమతౌల్యం సాధించాలన్నది ఆయన ఆశయం. దీని ఫలితమే భారతదేశంలో రూపుదిద్దుకొన్న మిశ్రమ ఆర్థిక వ్యవస్థ. నెహ్రూ భావనలో ఆర్థిక, రాజకీయ ప్రజాస్వామ్యాలకు కుల వ్యవస్థ అవరోధం కాబట్టి దానిని నెమ్మదిగా నిర్మూలించాలని భావించాడు.

**16.5.3 సాంఘిక ప్రజాస్వామ్యం (Social Democracy):** ప్రజాస్వామ్యం క్రమశిక్షణ అనే ఆదర్శానికి ప్రాధాన్యమిస్తుంది. సామరస్యత, వర్గరహిత సమాజం, శాంతియుత వాతావరణం, పద్ధతులు, అనే భావనలు దానిలో యిమిడి ఉన్నాయి. ఎటువంటి క్లిష్ట సమస్యలనైనా చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని, ఒక నిర్ణయానికి కట్టుబడి అందరూ పని చేస్తేనే ప్రజాస్వామ్యం మనగలుగుతుందని ఆయన భావించాడు.

**16.5.4 జాతీయత, అంతర్జాతీయతా భావాలు (Nationalism & Internationalism) :** నెహ్రూ జాతీయతా వాది అయినా ఏ నూతన జాతీయతా వాద సిద్ధాంతాన్ని ప్రతిపాదించలేదు. భారతదేశంలో భిన్నత్వంలో ఏకత్వం ఉందని ఆయన అంగీకరించాడు. నెహ్రూ జాతీయతా వాద సిద్ధాంతం ఆచరణ కొన్ని ప్రాతిపదికల పై వృద్ధి చెందినది. బ్రిటిష్ పాలకుల జాత్యహంకారమును ఆయన కుటుంబం చూడడం, అనుభవించడంతో జాతిపరమయిన దురహంకారము సహించరానిదని ఆయన భావించాడు. భారతదేశ పేదరికానికి, దోపిడీకి బ్రిటిష్ పాలన కొంత వరకు కారణ భూతమయినదని ఆయన భావన. విదేశీ సామ్రాజ్యవాదులు అధికారాన్నంతా తమ చేతులలోనే కేంద్రీకరించుకొని, విభజించి పాలించు అన్న సూత్రాన్ని ఉపయోగించి దేశ ఐక్యతని నాశనం చేయడానికి ప్రయత్నించారని ఆయన అభిప్రాయపడ్డాడు.

జాతీయ వాదంతో పాటుగా అంతర్జాతీయతా వాదం కూడా మనకి నెహ్రూ తత్వంలో గోచరిస్తుంది. జాతీయతా భావం పేరున భారతదేశం ఏకాకిగా ఉండడాన్ని, పరదేశ భాష సంస్కృతిని విమర్శించడాన్ని ఆయన అంగీకరించలేదు. సంకుచిత జాతీయతా వాదాన్ని వ్యతిరేకించాడు. ప్రతి దేశ సంస్కృతి నుండి భారతదేశం నేర్చుకొనవలసినది ఎంతో ఉంది అని భావించాడు. అందువల్ల జాతీయతా భావంతోపాటుగా అంతర్జాతీయతా భావాన్ని కూడా భారతీయులు అలవరచుకోవాలని కోరాడు. విశాల దృష్టితో కూడుకున్న అంతర్జాతీయతా వాదం ఆయన బలపరచాడు. శాంతియుత సహజీవనం అహింసా వాదం యొక్క యదార్థ స్వరూపం. ఆయన అంతర్జాతీయతా వాదానికి ఆయన సామ్యవాద భావములే ప్రాతిపదిక. ప్రపంచ నలుమూలలా జరుగుతున్న అనేక అభివృద్ధి విషయాల పై అవగాహన లేకుండా భారతదేశం ఒంటరిగా మనుగడ సాగించడాన్ని ఆయన వ్యతిరేకించాడు. భారతీయులు ప్రపంచ అభివృద్ధి కార్యకలాపాల పట్ల ఆసక్తి పెంచుకొని తమ మేధా సంపత్తిని తదనుగుణంగా పెంపొందించుకోవాలని ఆయన ఆకాంక్ష. నెహ్రూలోని ఈ అంతర్జాతీయతా భావన జాతీయతా భావనకి వ్యతిరేకం కాదు. జాతీయ, అంతర్జాతీయతా వాదాలు రెండూ కలిసే ఉంటాయని ఆయవ అభిప్రాయం. ప్రపంచ ప్రభుత్వాన్ని కూడా కాంక్షించాడు (World Govt). భారత తొలి ప్రధానిగా నెహ్రూ రూపొందించిన విదేశాంగ విధానం జాతీయతా భావముల నుండి రూపుదిద్దుకొన్నది. సంకుచిత జాతీయతా వాద దురహంకార ప్రమాదాలను నెహ్రూ ఊహించాడు. అందువలననే జాతీయ, అంతర్జాతీయ వాదాలు రెండూ కలిసే ఉండాలన్న భావనని బలపరిచాడు. అంతర్జాతీయ సమతౌల్యమునకు పునాదులు వేయడానికి ప్రపంచ ఉద్రిక్తతలను తగ్గించడానికి జాతీయతా వాద, శ్రామిక వాద ఆదర్శాల, అంతర్జాతీయ వాదముల మేళవింపు అవసరమని భావించాడు. ఆయన ఏ సైనిక కూటమిలోనూ చేరడానికి అంగీకరించక

ఐక్యరాజ్య సమితి సభ్యత్వం తీసుకొని ఒక అలీన రాజ్యంగా భారతదేశాన్ని నిలబెట్టగలిగాడు. **అంతర్జాతీయ రాజకీయాలలో** శాంతి సహకారాలు పెంపొందించడానికి 1954లో చైనా ప్రధాని చౌ ఎన్‌లైతో కలసి 'పంచశీల' అనే 5 సూత్రాలను ప్రకటించాడు. ప్రపంచ రాజ్యాల మధ్య సుహృద్భావం, సహకారం ఉండాలని అభిలషించాడు. పంచశీల ప్రకటనలోని 5 సూత్రాలు ఈ భావాన్నే తెలియచేస్తాయి.

1. ఇతర దేశాల ప్రాంతీయ సమగ్రతను, సార్వభౌమాధికారాన్ని పరస్పరం గౌరవించుకోవాలి.
2. దురాక్రమణ చేయరాదు.
3. ఒకరి ఆంతరంగిక విషయాలలో మరొకరు జోక్యం కల్గించుకోరాదు.
4. సమానత్వానికి, సహకారానికి పరస్పరం కృషి చేయాలి.
5. శాంతియుత సహజీవనాన్ని పాటించాలి.

ఈ ఐదు సూత్రాలు అంతర్జాతీయ రంగంలో వివిధ దేశాల మధ్య భద్రతను, నమ్మకాన్ని పెంపొందించడానికి ఉద్దేశింపబడినవి. ప్రాబల్య రాజకీయాలు తట్టుకోవడానికి, బల ప్రయోగాన్ని తగ్గించడానికి యివి తోడ్పడతాయని ఆయన భావన.

## 16.6 ఆర్థిక భావాలు - సామ్యవాదం (Economic Ideas - Socialism):

భారతదేశ సామ్యవాదులలో అతి ప్రధానమైనవాడు నెహ్రూ. కాంగ్రెస్ పార్టీ అనుసరించిన సామ్యవాదం చాలా వరకు నెహ్రూ వలన ఉత్తేజితమైందనవచ్చు. ఆయన సామ్యవాదాన్ని ఒక జీవన తత్వంగా భావించాడు. ఉత్పత్తి శక్తులు, ఉత్పత్తి పంపకం పై రాజ్యాధికారం ఉండడమనే ఆర్థిక సిద్ధాంతంగా ప్రకటించాడు. తన సామ్యవాద భావాలకి రాజకీయ ఉదార వాదం కలిపి వివరించాడు. తన సామ్యవాద భావాలకి రాజకీయ ఉదార వాదం కలిపి వివరించాడు. సామ్యవాదాన్ని ప్రపంచం, భారతదేశం ఎదుర్కొనే సమస్యలకి ఒక పరిష్కారంగా ఆయన భావించాడు. రష్యా విధానాన్ని ఆయన నవ్య నాగరికత అని పిలిచి తనకు సామ్యవాదం పట్ల గల మక్కువని చాటుకున్నాడు. సామ్యవాదం కేవలం ఊహాత్మకమైనదికాదని భూస్వాములు, పెట్టుబడిదారుల నుండి సామాన్య ప్రజానీకానికి విముక్తిని కలిగించే ఒక సిద్ధాంతమని ఆయన అభిప్రాయపడ్డాడు. కొద్ది మినహాయింపులతో ప్రయివేటు ఆస్తిని రద్దు చేయడమే సామ్యవాదమని భావించాడు. ప్రజలలో సహకార భావన పెరగాలని కాంక్షించాడు. జాతీయకరణ (Nationalisation) లో విశ్వాసం కలవాడైనా ఉత్పాదక వనరులను, దాదాపుగా పూర్తి ఉపాధిని పెంచవలెనని నొక్కి వక్కాణించాడు. ప్రభుత్వమే నూతన పరిశ్రమలను నెలకొల్పవలెనని సూచించాడు. 1929లో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ సమావేశంలో నెహ్రూ పట్టుదల వల్ల సామ్యవాద విధానం పార్టీ ముఖ్య లక్ష్యంగా అంగీకరించడం జరిగింది. నెహ్రూ ప్రోద్బలం వలననే రాజ్యాంగ నిర్మాణ సభ భారతదేశాన్ని సోషలిస్ట్ రిపబ్లిక్ (Socialist Republic) గా రూపొందించడానికి అంగీకరించినది. ఆయన కృషి ఫలితంగా కాంగ్రెస్ పార్టీ సామ్యవాద తరహా సమాజ నిర్మాణానికి పూనుకున్నది.

1930 నాటికి నెహ్రూకు శాస్త్రీయ సామ్యవాదంలో (Scientific Socialism) లో నమ్మకం ఉండేది. మార్క్స్ సిద్ధాంతంలోని శాస్త్రీయ ధోరణులు ఆయనను ఆకర్షించాయి. కాని కారల్ మార్క్స్ చెప్పిన కార్మిక నియంతృత్వం వర్గ పోరాటం భావనలు నెహ్రూకు అంతగా నచ్చలేదు. ప్రధాన మంత్రిగా వాస్తవిక పాలన సమస్యలతో సంబంధం ఏర్పడిన తరువాత నెహ్రూ అనుభవవాదిగా మారినాడు. ఆయన ప్రకారం సామ్యవాదానికి ధృడమయిన నిర్వచనం అవసరం లేదు. ఈయన సామ్యవాదం ప్రజాస్వామ్య సామ్యవాదంలో ఒక విధమైనదని చెప్పవచ్చు. మార్క్సిస్టుల చరిత్ర దృక్పధం, తీవ్ర ఉదార వాదం, నిజమైన అంతర్జాతీయ వాదాల మిశ్రమమే నెహ్రూ సామ్యవాదం. ఆయన సంక్షేమ రాజ్య భావనను ఆమోదించినాడు. మిశ్రమ ఆర్థిక వ్యవస్థను సిద్ధాంతరీత్యా, ఆచరణ రీత్యా బలపరచినాడు. భారతదేశంలోని ఆర్థిక సమస్యల పట్ల (నిరుద్యోగం, పేదరికం, ఆహారధాన్యాల కొరత) ఆయనకు పూర్తి అవగాహన ఉండడంతో ఈ రుగ్మతలను తగ్గించడానికి ఆయన ప్రణాళికాబద్ధ ఆర్థిక ప్రగతి భావనను ప్రవేశపెట్టాడు. భారత దేశం ప్రాథమికంగా

వ్యవసాయిక దేశం కాబట్టి దానికి ప్రాధాన్యమిస్తూనే పారిశ్రామికంగా కూడా అభివృద్ధిపరచాలని భావించి మిశ్రమ ఆర్థిక విధానాన్ని అమలు జరపాలని భావించాడు. సాంఘిక సంక్షేమం కోసం వ్యక్తి స్వేచ్ఛను పణంగా పెట్టడాన్ని ఆయన వ్యతిరేకించాడు. ఆ విధంగా నెహ్రూ సాంఘిక సమానత్వం సాంఘిక న్యాయం మరియు వ్యక్తి స్వేచ్ఛల మధ్య సయోధ్య కుదర్చడానికి ప్రయత్నించాడు. నెహ్రూ సామ్యవాదం యితర సామ్యవాదాల కన్నా భిన్నమైనది. భారతదేశంలో సాంఘిక, ఆర్థిక రంగాలలో మార్పును అంచెలంచెలుగా అహింసాయుత పద్ధతుల ద్వారా తేవాలని ఆశించాడు. రష్యాలో వలె ప్రణాళికాబద్ధమైన అభివృద్ధికి కృషి చేశాడు. స్వాతంత్ర్యానంతరం భారతదేశం అనేక కులాలు, వర్గాలుగా విభజించబడి ఆర్థిక వ్యవస్థ మొత్తం పెట్టుబడిదారుల చేతులలోనే నియంత్రించబడినది. కాబట్టి భారత రాజ్యాంగంలోకూడా చట్టం ద్వారా కుల వ్యవస్థ నిర్మూలించాలని ప్రతిపాదించబడినది. కాని పెట్టుబడిదారీ వ్యవస్థ నిర్మూలన గురించి ఎక్కడా ప్రస్తావించబడలేదు.

దీనికనుగుణంగా పెట్టుబడిదారులు కూడా రాజకీయ వ్యవస్థను తమ చెప్పు చేతలలో నిలుపుకోవాలని ప్రయత్నించారు. అందువల్ల సామ్యవాద సూత్రాలకనుగుణంగా ఆర్థికపరమైన మార్పులు తేవడం కష్టతరమయిన పని అవ్వడంతో నెహ్రూ సామ్యవాదం ఆచరణలో పూర్తిగా అమలు జరగలేదు. చివరికి ప్రభుత్వ ప్రయివేటు రంగాలు కలిసికట్టుగా సామ్యవాద సమాజ స్థాపనకు కృషి చేయడానికి అంగీకరించాడు. ఈ ప్రజాస్వామ్య సామ్యవాదంలో మత రాజకీయాలకు తావు లేదు. కాబట్టి ప్రజలు లౌకిక పర ఆలోచన, మత సహనం అలవరచుకోవాలని ఉద్ఘాటించాడు. పంచవర్ష ప్రణాళికా విధానం ద్వారా భారతదేశాన్ని ఆర్థికపరంగా పటిష్టం చేయవచ్చునని, సామ్యవాద సమాజ స్థాపన, సంక్షేమ రాజ్య భావన ఆచరణలోకి తేవచ్చునని ఆశించాడు.

భారతదేశం ఆర్థికంగా వెనుకబడి ఉన్నందున అభివృద్ధి త్వరితగతిన జరగాలంటే ప్రణాళికాబద్ధ ఆర్థికాభివృద్ధికి రూపకల్పన చేయాలని ఆయన భావన. ప్రభుత్వ, ప్రయివేటు రంగాలు రెండు కలసి పని చేయగల మిశ్రమ ఆర్థిక వ్యవస్థ (Mixed Economy) రూపొందించినాడు. కమ్యూనిస్ట్ దేశమయిన రష్యాలో అభివృద్ధిని చూసి ఆకర్షితుడై భారతదేశంలో కూడా ప్రణాళికాబద్ధమైన వ్యవస్థ ద్వారా అభివృద్ధి సాధించవచ్చునని భావించాడు. కాని ఏ దేశాన్ని మనం అనుకరించరాదని స్వశక్తి పై ఆధారపడి స్వయం సమృద్ధి సాధించాలని ఆరాటపడ్డాడు. ఈ ప్రణాళికాబద్ధ వ్యవస్థ ప్రజలందరినీ సంఘం కొరకు, దేశం కొరకు కూడా పని చేయడానికి, వ్యక్తి అభివృద్ధితో పాటు సంఘ, దేశ అభివృద్ధిలో అందరూ భాగస్వాములుగా ఉండేటట్లు ప్రోత్సహించడానికి దోహదపడుతుందని నెహ్రూ భావించాడు.

## 16.7 భారతదేశ అభివృద్ధికి ప్రధానిగా నెహ్రూ చేసిన కృషి (Nehru's Contribution as Prime Minister for the Development of India):

భారతదేశం ఏ రంగంలోనైనా అభివృద్ధి సాధించ గలిగినదంటే (యిప్పటి వరకు) దానికి ప్రథమ ప్రధానిగా జవహర్‌లాల్ నెహ్రూ చేసిన అవిరళ కృషే ప్రధాన కారణం. విభిన్న మతాల కలయిక, భిన్న సంస్కృతుల ఆలవాలమైన భారతదేశంలో త్వరితగతిని అభివృద్ధి జరగాలంటే అందరి సహాయ సహకారాలు అవసరమని గుర్తించి ప్రభుత్వం అన్ని మతాలని గౌరవించి, అందరి శ్రేయస్సుకి పాటుపడాలన్న సదుద్దేశంతో లౌకిక భావనని బలపరచాడు. భారతదేశ ప్రజల సమస్యల పట్ల అవగాహన, అంచెలంచెలుగా వాటిని పరిష్కరించడంలో ఆయన చొరవ, ప్రపంచ చిత్రపటంలో భారతదేశాన్ని అగ్రగామిగా నిలబెట్టాలని ఆయన పడిన తపన, చేసిన కృషి ఎంతో విలువయినవి. ఆధునిక రాజనీతి తత్త్వ చరిత్రలో గాంధీ తరువాత సామాన్యుల హృదయాలలో సముచిత స్థానం సంపాదించి వారిని ప్రభావితులను చేయగలిగిన తన భావాలను వారి సంక్షేమం కోసం వినియోగించి తన ఆకర్షణీయమైన వ్యక్తిత్వంతో నాయకత్వ లక్షణాలతో భారతీయులు మరొకరిని ఆయనకు ప్రత్యామ్నాయంగా ఆలోచించే అవకాశం లేకుండా దాదాపు రెండు దశాబ్దాల పాటు భారత దేశ నాయకుడిగా (1946 - 1964) కొనసాగేటట్లు చేసినది. విలక్షణ వ్యక్తిత్వం, నిబద్ధత ఆయనకు ఒక ప్రత్యేకతను ఆపాదించాయి. స్వాతంత్ర్యం తర్వాత భారతదేశంలో రాజకీయ సమైక్యత (Political Integration) ప్రధాన సమస్య అయింది. దాదాపు 600 స్వదేశీ సంస్థానాలు, అనేక భాషలు, భిన్న సంస్కృతులు వీటన్నిటితో సమైక్యత కష్టతరమైన పని. కాని, నెహ్రూ దాని

ఒక సవాలుగా స్వీకరించి పరిష్కరించడానికి ధైర్యంగా ప్రయత్నించాడు. అన్ని స్వదేశీ సంస్థానాలను భారతదేశంలో విలీనం చేయుటలో ఆయన కృషి, ఎటువంటి హింసాత్మక చర్యలకు తావులేకుండా శాంతియుతంగా యింతటి మహత్తర కార్యం జరగడం ఆయన నాయకత్వంలో ఉన్న విశిష్టతకి ప్రతీక. ఈ మహత్తర కృషిలో సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆయనకు సంపూర్ణ సహకారాన్ని అందించాడు.

ప్రపంచంలో అతి పెద్ద ప్రజాసామ్య దేశమైన భారతదేశంలో సామాన్యులలో రాజకీయ చైతన్యం కలిగించడానికి, ప్రజాస్వామ్యం పట్ల గౌరవం పెంచడానికి ఆయన చేసిన కృషి అమోఘం. ప్రపంచం యుద్ధభయం నుండి బయటపడి ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని ఆయన చేసిన నిరంతర ప్రయత్నం భారతదేశంలోనే కాక యావత్ ప్రపంచంలోనూ ఆయన కీర్తి ప్రతిష్టలను పెంచినది. ఆయన చరిత్ర చదివాడు. చరిత్ర రాశాడు. చరిత్రను సృష్టించాడు. సామాన్య ప్రజల జీవన సరళి మరింత ఆశాజనకంగా, ఆనందంగా చేయడానికి, ఆలోచనా విధానం మార్చాలని ఆయన చేసిన ప్రయత్నం, ఆయన ఒక వ్యక్తి కాదు శక్తి అని అందరూ భావించేటట్లుగా చేసినది. ఆ విధంగా నెహ్రూ తన సాహసోపేతమయిన చర్యల వలన, ప్రజా నాయకునిగా, జాతీయంగా, అంతర్జాతీయంగా చరిత్ర పుటలలో చిరస్థాయిగా నిలిచిపోయిన మహా వ్యక్తి.

## 18.8 సారాంశము:

భారత రాజకీయ చరిత్రలో జవహర్‌లాల్ నెహ్రూకు ఒక ప్రముఖ స్థానం ఉంది. అహింసావాదంతో భారతదేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన ఘనత గాంధీజీకి దక్కితే, స్వతంత్ర భారతదేశాన్ని ప్రగతి వైపు నడపాలని ఆరాటపడి దేశానికి సారథ్యం వహించిన ఘనత నెహ్రూకి దక్కినది. పాశ్చాత్య సంస్కృతిని, నాగరికతను అభిమానించినా భారతీయ సంస్కృతిని గౌరవించేవాడు. భావి భారతదేశం ప్రపంచ శాంతి, సహకారాలలో, పేద దేశాల అభివృద్ధి కార్యకలాపాలలో ప్రముఖ పాత్ర వహిస్తుందని ఆయన విశ్వసించాడు. మంచి జీవితాన్ని గడపాలని దానికి కష్టపడక తప్పదని, గమ్యాన్ని చేరుకోవాలంటే అడ్డంకులను ధైర్యంగా అధిగమించాలన్న భావనను సామాన్య ప్రజానీకంలో కలిగించిన ఘనత ఆయనదే. భారతదేశం గర్వించదగిన నాయకులలో నెహ్రూ ఒకడు. గాంధీజీ భావాలలో కొన్నింటితో విభేదించినా దేశం కోసం తమ జీవితాలు త్యాగం చేసిన నాయకులు యిద్దరూ. భారతదేశాన్ని దాదాపు 17 సంవత్సరాలు పరిపాలించిన కీర్తి నెహ్రూకే దక్కినది.

## 18.9 నమూనా ప్రశ్నలు:

(i) **వ్యాసరూప ప్రశ్నలు**

1. భారత తొలి ప్రధానిగా భారతదేశ అభివృద్ధికి నెహ్రూ చేసిన కృషిని వివరించుము.
2. ఆధునిక భారత రాజనీతి తత్త్వవేత్తలలో జవహర్‌లాల్ నెహ్రూ ప్రముఖునిగా పరిగణింపబడుటకు కారణములు విశ్లేషించుము.

(ii) **లఘు వ్యాస ప్రశ్నలు**

1. ప్రజాస్వామ్యము పై నెహ్రూ భావములేమి?
2. నెహ్రూ సామ్యవాదమును వివరించుము.
3. నెహ్రూలోని జాతీయత, అంతర్జాతీయత భావములేవి?
4. 'పంచశీల' గురించి వ్రాయుము.
5. మిశ్రమ ఆర్థిక వ్యవస్థ అననేమి? నెహ్రూ దానిని ఏల సమర్థించెను?
6. స్వేచ్ఛ, లౌకిక వాదం పై నెహ్రూ భావములు వ్రాయుము.

## 18.10 చదువదగిన గ్రంథాలు:

1. H.H.Das, P.S.N. Patro - Indian Political Tradition
2. Dev Raj Bali - Modern Indian Thought
3. J.K. Bansal - Indian Political Traditions
4. V.P. Varma - Modern Indian Political Thought
5. తెలుగు అకాడమీ - రాజనీతి తత్త్వ విచారము

డా॥ టి.వి. లక్ష్మి

పాఠం - 17

# యం.ఎన్. రాయ్

## 17.0 లక్ష్యం :-

ఈ పాఠాన్ని చదివిన తరువాత విద్యార్థులు ఈ క్రింది విషయాలు తెలుసుకుంటారు.

* యం.యన్ రాయ్ జీవితము రచనలు
* కమ్యూనిస్ట్‌గా రాయ్
* ప్రజాస్వామ్యం, రాజకీయ పార్టీలపై రాయ్ భావాలు
* జాతీయోద్యమము పై రాయ్ అభిప్రాయం
* నవ్య మానవతావాదిగా రాయ్
* రాయ్ తాత్విక జీవితాన్ని మరియు రాయ్ రాజనీతి భావాలను క్షుణ్ణంగా వివరించగలుగుతారు.

## విషయసూచిక :


17.1 పరిచయము

17.2 రాయ్ జీవితం - రచనలు

17.3 కమ్యూనిస్ట్‌గా రాయ్

17.4 ప్రజాస్వామ్యం పై రాయ్ భావాలు

17.5 రాజకీయ పార్టీలు - రాయ్

17.6 జీతీయోద్యమంపై రాయ్ భావాలు

17.7 మార్క్సిజమ్ పై రాయ్ విమర్శ

17.8 రాడికల్ హ్యూమనిజమ్ (లేదా) నూతన (నవ్య) మానవతావాదం

17.9 రాయ్ తాత్విక జీవనం

17.10 సారాంశము

17.11 నమూనా ప్రశ్నలు

17.12 చదువదగిన గ్రంథాలు

## 17.1 పరిచయము :

భారత కమ్యూనిస్ట్ ఉద్యమం తొలి దశలో రాయ్ ప్రముఖ పాత్ర నిర్వహించారు. విప్లవోద్యమకారుడుగా, మార్క్సిస్టుగా, జాతీయవాదిగా, శాస్త్రీయ మానవతావాదిగా రాయ్ తాత్విక జీవితం అంచెలంచెలుగా ఎదిగింది. తాత్వికునిగానే గాక వ్యక్తిగా కూడా ఆయన తన జీవితంలో ఎన్నో మలుపులను దర్శించి విశేషానుభవం గడించినవాడు. 20వ శతాబ్దం పూర్వార్ధంలో జాతీయ అంతర్జాతీయ కార్మికోద్యమాలల్లో ప్రమాదభరితమైన సాహసోపేత జీవితాన్ని వరించి, అర్ధవంతమైన తాత్విక భావన సాంప్రదాయాన్ని నెలకొల్పిన అతికొద్ది మంది భారతీయులల్లో రాయ్‌కి ప్రముఖస్థానం ఉంది.

భారతీయ మానవతావాద ప్రవక్తగా, వ్యాఖ్యాతగా, చరిత్రకారునిగా భారతీయ తత్వ చింతన చరిత్రలో రాయ్‌కి అత్యంత ప్రముఖమైన స్థానం శాశ్వతముగా ఉంటుంది. శాస్త్రీయ విజ్ఞాన తత్వ రంగంలోని పరిణామాలను క్షుణ్ణంగా అవగాహన చేసుకొన్న అతి సమర్ధుడైన భారతీయ విద్వాంసుడు ఎం.యన్. రాయ్. ఆధునిక భారత రాజకీయాలపై, తత్వ శాస్త్రంపై వ్రాసిన విద్వాంసులైన రచయితలలో అగ్రశ్రేణికి చెందినవారు. యం.యన్. రాయ్. ఆయన గొప్ప తత్వవేత్త, వక్త. స్పష్టమైన శక్తివంతమైన శైలి ఆయన సొత్తు.

## 17.2 రాయ్ జీవితం - రచనలు :-

మానవేంద్రనాథ్ రాయ్ అసలు పేరు నరేంద్రనాథ్ భట్టాచార్య. రాయ్ 1886 ఫిబ్రవరి 6వతేదిన బెంగాల్‌లోని ఒక చిన్న గ్రామములో జన్మించాడు. విద్యార్థి దశ నుండి రాయ్ విప్లవవాది. జీవితము తొలిదశలో స్వామి వివేకానంద, బంకించంద్ర ఛటర్జీ, స్వామి దయానంద, రామతీర్థులు వలన ప్రభావితుడైనాడు. 14 సం။రాల వయస్సులోనే విప్లవోద్యమములో చేరాలని నిర్ణయించుకున్నాడు. 1905 లో జరిగిన బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో ప్రముఖ పాత్ర వహించాడు. **1907లో అరెస్ట్ చేయబడి, తరువాత కొద్ది రోజులకు విడుదల చేయబడ్డాడు.** 1910లోను 1911లోను హౌరా కుట్ర కేసులో అరెస్ట్ చేశారు. కాని విడుదల చేశారు.

రాయ్‌కి జతీన్ ముఖర్జీతో సన్నిహిత సంబంధాలు ఉండేవి. రాయ్ ముఖర్జీని తన గురువుగాను, సర్వ సైన్యాధ్యక్షుడుగాను, భావించేవాడు. భారతీయ విప్లవవాదులకు జర్మనీ వాగ్దానం చేసిన ఆయుధాలను తెచ్చేందుకు 1915లో రెండుసార్లు జావా వెళ్ళాడు. కాని ఆయుధాలు అందలేదు. చైనా, జపాన్, అమెరికా సంయుక్త రాష్ట్రాలలో మారు పేర్లతో పర్యటించాడు. కొన్ని రోజుల పాటు ఫాదర్ మార్టిన్ అని పేరు మార్చుకున్నాడు. 1916లో మెక్సికో వెళ్ళాడు. మెక్సికో తనకు పునర్జన్మనిచ్చిందని చెప్పుకున్నాడు. మెక్సికోలో అంతర్జాతీయ కమ్యూనిస్ట్ ప్రతినిధి బోర్డిన్‌ను కలుసుకున్నాడు. బోర్డిన్ నుండి మార్క్సిజం సిద్ధాంతాలను ఆచరణ సూత్రాలను తెలుసుకున్నాడు.

బోర్డిన్ సిఫార్స్‌పై 1920లో రష్యాలో జరిగిన అంతర్జాతీయ కమ్యూనిస్ట్ మహాసభలకు రాయ్‌ని, లెనిన్‌ను ఆహ్వానించారు. ఈ సభలో రాయ్‌ని వలసలకు సంబంధించిన సంఘంలో సభ్యునిగా నియమించారు. 1921లో ప్రాచ్యకార్మిక కమ్యూనిస్ట్ విశ్వవిద్యాలయానికి స్థాపక డైరెక్టర్ అయ్యాడు. భారత జాతీయ కాంగ్రెస్‌ను రష్యా నుండి ప్రభావితం చేయడానికి ప్రయత్నం చేశాడు. కమ్యూనిస్ట్ పార్టీ స్థాపనకు 1920 దశకంలో ప్రయత్నాలు చేశాడు. 1924 జనవరిలో జర్మనీ నుండి బహిష్కరించబడ్డాడు. **1924జూన్‌లో కమ్యూనిస్ట్ వర్గంలోను, దాని స్థాయి సంఘంలోను,** సభ్యునిగా ఎన్నుకోబడ్డాడు. చైనా కమ్యూనిస్ట్ పార్టీకి సలహాలు యిచ్చేందుకు ఉద్దేశింపబడిన సంఘము **నాయకుడిగా 1927లో** రాయ్‌ను చైనా పంపించారు. 1931 మార్చిలో కరాచిలో ఏర్పాటైన

కాం॥గెస్ సమావేశానికి హాజరైయ్యాడు. అక్కడ రాయ్‌ని అరెస్ట్ చేసి విచారణ అనంతరం 12 సం॥రాలు జైలుశిక్ష విధించారు. 1936లో జైలు నుండి విడుదలై ఆయన తరువాత భారత జాతీయ కాం॥గెస్‌లో చేరి అఖిల భారత కాం॥గెస్ కమిటీలో సభ్యుడైనాడు. గాంధీని విమర్శించడం వల్ల కాం॥గెస్‌లో ఉన్నతని పొందలేకపోయినాడు. 1939లో రాడికల్ కాం॥గెస్ వాదుల సంఘాన్ని ఏర్పాటు చేశారు. 1940లో రాడికల్ ప్రజాస్వామ్య పార్టీని స్థాపించాడు. రెండవ ప్రపంచ యుద్ధంలో ఫాసిస్ట్ శక్తులకు వ్యతిరేకంగా మిత్ర రాజ్యాలకు సహాయం అందించడంలో ప్రముఖ పాత్ర వహించాడు. 1946లో డెహ్రాడూన్‌లో భారత పునరుజ్జీవన సంస్థను స్థాపించాడు. 1948లో రాడికల్ ప్రజాస్వామ్య పార్టీని రద్దు చేయడం జరిగింది.

యం.యన్ రాయ్ బహు గ్రంథ రచయిత. అనేక రాజకీయ సిద్ధాంతాలపై విమర్శకుడిగా పేరు పొందాడు. ఆయన వ్రాసిన ముఖ్యమైన రచనలు ఫాసిజం, హిస్టారికల్ రైజ్ ఆఫ్ ఇస్లామ్, మెటిరలిజమ్, ఉమెన్‌హుడ్, అవర్‌టాస్క్స్ యాన్ ఇండియా, చైనా యన్‌రివోల్ట్, విదర్ కాం॥గెస్, కాం॥గెస్ సోషలిస్ట్ పార్టీ, పీపుల్స్ ప్లాన్ ఫర్ యకనామిక్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఇండియా, డ్రాఫ్ట్ కాన్‌స్టిట్యూషన్ ఫర్ ఫ్రీ ఇండియా మొదలైనవి. ఆయన వ్రాసిన "New Orientation" అన్న గ్రంథంలో విప్లవ మానవతావాదంపై ఆయన యిచ్చిన ఉపన్యాసాలు ప్రచురించారు. Politics Power and Politics అన్న గ్రంథంలో వివిధ రాజకీయ పార్టీల పైన అధికార రాజకీయాలపైన ఆయన భావాలను ప్రకటించాడు. 1922లో "పరిమాణంలో భారతదేశం" అన్న పుస్తకాన్ని ప్రచురించాడు. దీనిలో సమకాలీన రాజనీతి తత్త్వాలను విమర్శించాడు. 'భారత రాజకీయాలు భవిష్యత్‌లో' (The Future of Indian Politics) అన్న గ్రంథాన్ని 1926లో ప్రచురించాడు. భారతదేశ సమాజంలోని వర్గ నిర్మాణము సంబంధాల విషయంలో రాయ్ అభిప్రాయాలల్లో మార్పులు వచ్చాయి. చివరగా తన దశలో కూడా రెండు గ్రంథాలు కూడా వ్రాసాడు. అవి మాత్రము Reason, Romanticism and Revolution. చివరి దశలో ఆయన వ్రాసిన రచనల వల్ల వివిధ సిద్ధాంతాలను అవగాహన చేసుకొని సహేతుకంగా ఆయన విమర్శించిన విధానం మానవతా ఉద్యమం పట్ల ఆయనకున్న అభిమానం స్పష్టమవుతాయి. ప్రజాస్వామ్యము, స్వేచ్ఛ, విప్లవము, జాతీయవాదము, మానవతా వాదాలపై ఆయన భావాలను స్పష్టంగానూ, నిర్ణయంగానూ ప్రకటించినాడు.

## 17.3 కమ్యూనిస్ట్‌గా రాయ్ :-

స్టాన్‌ఫర్ట్‌లో ప్రవాస జీవితము గడుపుతున్న కాలంలో రాయ్ మార్క్స్ రచనలచే ఆకర్షితుడైనాడు. అటు తరువాత రష్యన్ కమ్యూనిస్ట్ మైఖేల్ బరోడిన్ సహకారము రాయ్‌ని కమ్యూనిస్ట్‌గా మార్చింది. మెక్సికో నుండి మాస్కో చేరిన తరువాత రాయ్ తన "మెమొయిన్స్"లో "నాకు పునర్జన్మనిచ్చినది (మెక్సికో)ను ఒక క్రొత్త విశ్వాసంతో విడిచి వెళుతున్నాను. ఆర్థిక విముక్తి సాంఘిక న్యాయమూ లేని రాజకీయ స్వేచ్ఛలో యిక్క నాకు ఏ మాత్రం శ్వాస లేదు" అని ప్రకటించారు. రష్యాలో 1920లో జరిగిన కమ్యూనిస్ట్ ఇంటర్నేషనల్ రెండవ సమావేశంలో ప్రసంగిస్తూ వలస, అర్ధ వలస దేశాల్లో కమ్యూనిస్టులు రాజీలేని మిలిటెంట్ విధానాన్ని అవలంబించాలని పేర్కొన్నారు. ఆయా దేశాలలో విప్లవాలు విజయవంతం కావాలంటే బూర్జువా వర్గాల పాత్ర విశ్వచించదగినది కాదని వాదించారు. గాంధీ భారత జాతీయోద్యమములో ప్రగతిశీలమైన పాత్ర నిర్వహిస్తున్నాడన్న లెనిన్ ఉద్దేశ్యాన్ని గూడా రాయ్ నిరాకరించాడు. ఆయన ఉద్దేశ్యంలో గాంధీ అభివృద్ధి నిరోధకుడైన ఛాందసుడు. రాయ్ ప్రతిపాదనలో గుణాత్మకతను గుర్తించి లెనిన్ వలస, అర్ధ వలస దేశాలలోని ఉద్యమ లక్షణాలు, లక్ష్యాలను గురించి రాయ్ సిద్ధాంత ముసాయిదాను ఇంటర్నేషనల్ చేత అంగీకరింపజేశారు.

ముఖర్జీ సహరచయితగా తాను ప్రచురించిన "ఇండియన్ టాన్సిషన్" అన్న గ్రంథంలో భారత జాతీయోద్యమంలోని మితవాదులను బూర్జువా వర్గపు అతివాదులు రాజకీయాన్ని మతంతో మమేకము చేస్తున్నారని విమర్శించాడు. బొంబాయిలో

1890 నాటి సమ్మెలను, 1906లో రైల్వే సమ్మెను, 1907 నాటి కలకత్తా జౌళి కార్మికుల సమ్మెలను గురించి ప్రస్తావిస్తూ సమాంతరంగా వర్గపోరాటం కూడా జరుగుతోంది.

1922లో రాయ్ విప్లవకారకులకు కేంద్ర స్థానమైన బెర్లిన్ వెళ్ళి అక్కడ్నించి "దివాన్ గార్డ్ ఆఫ్ ది ఇండియన్ ఇండిపెండెన్స్" అనే పత్రిక వెలువరించాడు. అదే తర్వాత "అడ్వాన్స్‌డ్ గార్డ్" గాను, అటు తరువాత "వాన్ గార్డు" గానూ మారింది. భారతీయ నావికులు ఈ పత్రికను ఎంతో చాకచక్యంతో దొంగచాటుగా భారతదేశంలోకి తెచ్చేవాళ్ళు. 1922లోను తన గ్రంథం "ఇండియన్ ప్రోబ్లమ్స్ అండ్ ఇట్స్ సొల్యూషన్స్" అనే గ్రంథంలో కాంగ్రెస్ రాజకీయాలను దాని బూర్జువా నాయకత్వములో శ్రామిక వర్గానికి ద్రోహం చేసేవి తప్ప వేరుకాదని రాశాడు రాయ్. సహజసిద్ధంగా ఉన్న జనం ఉద్యమిస్తున్న దశలో గాంధీలాంటి నాయకులు నిప్పులపై నీళ్ళు చల్లినట్లుగా దాన్ని ఆర్పివేస్తున్నారని, ఇవి మధ్య యుగాల నాటి విప్లవ నిరోధక ఛాందస భావాలు తప్ప మరొకటి కాదని పేర్కొన్నాడు.

భారత జాతీయ కాంగ్రెస్ రైతాంగాన్నీ శ్రామిక వర్గాన్ని విస్మరిస్తున్నదనడానికి కారణం అది పెట్టుబడిదారుల అండన బ్రతకటమేనని రాయ్ విమర్శించారు. కాంగ్రెస్‌పై రాయ్‌కి గల ఈ అనుమానంతోనే 1922 నవంబర్‌లో రాంగేకు లేఖ రాస్తూ భారతదేశంలోని విప్లవకారులందరిని సమీకరించి విస్తృత ప్రాతిపదికపై ఒక "మాస్ పార్టీ"ని ఏర్పాటు చేయవలసిన అవసరము ఉందని బహిరంగంగా దాన్ని కమ్యూనిస్ట్ పార్టీగా ప్రకటించకుండా చిత్తశుద్ధి గల విప్లవకారులతో కూడిన పార్టీ ఆధ్వర్యంలో దాన్ని నడపాలని అది కాంగ్రెస్‌లో భాగంగానే ఉంటూనే కాంగ్రెస్‌ను విప్లవీకరిస్తూ సమయం ఆసన్నమైనప్పుడు విప్లవకారులు దాన్ని పూర్తిగా ఆక్రమించుకోవాలని ఒక ప్రణాళికను ప్రతిపాదించాడు రాయ్.

గాంధీ అహింసా సిద్ధాంతం రాయ్‌కి వెగటు కలిగించేది. దాన్ని గురించి మాట్లాడుతూ రాయ్ అహింసాయుత విప్లవం అనేది లేనేలేదని చెప్పారు. చౌరచౌరాలో 1922లో ప్రజ్వరిల్లిన హింసాకాండ దృష్ట్యా గాంధీ సహాయనిరాకరణ ఉద్యమాన్ని నిలిపివేయటాన్ని విమర్శిస్తూ రాయ్ దాన్ని అభివర్ణించాడు. గయలో జరిగిన కాంగ్రెస్ సమావేశాల తరువాత రైతాంగానికి, కార్మిక వర్గానికి కాంగ్రెస్ ఎంత మాత్రం లాభం చేకూర్చే సంస్థ కాదని రాయ్‌కి ధృఢమైన నమ్మకం ఏర్పడింది. కార్మికులలోనూ, కకులతోనూ కూడిన ఒక కార్మిక వర్గం రాజకీయ పార్టీని ఏర్పాటు చేయవలసిన అవసరాన్ని నొక్కి చెప్పాడు. రాయ్ బూర్జువా జాతీయ భావాలకు దాన్ని మోసుకు తిరిగే బూర్జువా వర్గానికి కార్మిక వర్గాలు ఇక ఏ మాత్రము తోకలుగా పని చేయకూడదనీ, కార్మిక వర్గమే పోరాట నాయకత్వం స్వీకరించాలనీ రాయ్ పేర్కొన్నారు. రాయ్ భావాలు ఇరవయ్యో దశకంలో విప్లవకారులు సంఘటితం కావటానికి ఎంతో తోడ్పడాయి.

## 17.4 ప్రజాస్వామ్యంపై రాయ్ భావాలు :-

రాయ్ దృష్టిలో యితర రకాల ప్రభుత్వాల కంటే ఉత్కృష్టమైనది అయినప్పటికీ ప్రజాస్వామ్యాన్ని గ్రుడ్డిగా మెచ్చుకోలేదు. ఈ సంస్థలు నిర్వహణకు సంబంధించి క్షుణ్ణంగా అధ్యయనం చేశాడు. ఏకపక్షపాలన నుండి రక్షణకు సాధనంగా ప్రజాస్వామ్యాన్ని అంగీకరించినాడు. రాయ్ దృష్టిలో ప్రజాస్వామ్యము ప్రాధమికంగా ఏకపక్ష ప్రభుత్వానికి వ్యతిరేకి. మానవతా వాదం పట్ల మానవుని మంచితనం పట్ల రాయ్‌కి ఉన్న నమ్మకం వల్ల ప్రజాస్వామ్యం అంటే అభిమానం ఉండేది. ఫ్రెంచి విప్లవ నాయకుల వలన రాయ్ ప్రభావితుడైనాడు. సాధారణ మానవుని పట్ల ధృఢ విశ్వాసము ఉన్న రాబెస్పియర్ పట్ల ఆరాధన భావం ఉండేది.

విభిన్న దేశాలలో ప్రజాస్వామ్య ప్రభుత్వ స్థాపన ప్రయత్నాలలో ఎదురైయ్యే ఇబ్బందులను అవగాహన చేసుకున్నాడు. చాలా సందర్భాలలో ప్రజలను పెడదోవ పట్టించడానికి రాజకీయ నాయకులు నినాదాలు ఇస్తారని భావించాడు. ప్రజాస్వామ్యం

పరిపూర్ణ మానసిక వైజ్ఞానిక స్వేచ్ఛను కల్పించాలి. ప్రజల జాగ్రత్త వహించలేక పోవటంతో ప్రజాస్వామ్యం విఫలమౌతుందని భావించాడు. ప్రజాస్వామ్య పరిరక్షణలో నిరంతర శ్రద్ధాశక్తులు లేకపోతే ప్రజాస్వామ్యం అంతరిస్తుంది.

రాయ్ ప్రజాస్వామ్యాన్ని మానవతావాదంతో అనుసంధానం చేశాడు. ఆయన దృష్టిలో ఈ రెండు మానవాళికి సంబంధించిన ఉదాత్తమైన కలలు. ప్రజాస్వామ్యాన్ని మానవతావాద సిద్ధాంతానికి, సాంఘీకపరమైన, వ్యవస్థాపరమైన రూపం. మానవతావాదం మానవుని పట్ల నమ్మకం ఉండాలని చెప్తుంది. ప్రజాస్వామ్యం అలాంటి నమ్మకం నుంచే ఆవిర్భవించింది. రెండవ ప్రపంచ యుద్ధంలో రాయ్ అతని సహచరులు జర్మనీ, జపాన్‌లకు వ్యతిరేకంగా బ్రిటీష్ ప్రభుత్వాన్ని సమర్ధించడం, ఆయనకు ప్రజాస్వామ్యం పట్ల గల అభిమానాన్ని తెలియజేస్తుంది. ఫాసిస్ట్ శక్తులు ప్రజాస్వామ్యాన్ని నాశనం చేయడానికి నిశ్చయించుకోవడము వల్ల వాటిని ఏదో విధంగా నాశనం చేయాలి. కాబట్టి బ్రిటీష్ ప్రభుత్వానికి మద్దతునిచ్చినట్లు ఆయన చెప్పాడు.

## 17.5 రాజకీయ పార్టీలు - రాయ్ :-

రాయ్ రాజకీయ పార్టీ వ్యవస్థను విమర్శించాడు. రాజకీయ పార్టీల వలన రాజకీయాలు అధికారం కొరకు ప్రాకులాటగా మారిపోతాయి. ప్రజాప్రతినిధులు ప్రజలకు బాధ్యులు అన్న సూత్రం బూటకం. ప్రజాప్రతినిధులు తమ పార్టీకే బాధ్యులుగా ఉంటారు. దీనివలన రాజకీయ అస్థిరత్వం, రాజ్యాంగ యంత్రాంగం విఫలమై పోవడం జరుగుతుంది. కాబట్టి పార్టీ రాజకీయాల వలన ప్రాజాస్వామ్యం ప్రజలకు అందుబాటులో లేకపోవటమే జరుగుతుంది. ప్రజలు గూడ తమంట తాము ఏమీ చేయలేరు. పార్టీ - ప్రభుత్వం అల్ప సంఖ్యాక వర్గపాలనకు ప్రాతినిధ్యం వహిస్తుంది.

## 17.6 జాతీయోద్యమం పై రాయ్ భావాలు :-

భారతదేశానికి 1930 డిసెంబర్‌లో డాక్టర్ మహమ్మద్ అనే మారు పేరుతో తిరిగొచ్చింది మొదలు 1947 ఆగష్టులో తనను తాను రాడికల్ హ్యూమనిస్ట్‌గా అభివర్ణించుకొనేంతవరకు రాయ్ భావాలలో జాతీయవాదం మార్క్సిజం కలగలిసి పోయినట్లుగా ద్యోతకమౌతుంది. 1931 జులైలో కాన్పూర్ కుట్ర కేసులో అరెస్ట్ అయిన సందర్భముగా రాయ్ అశేష ప్రజానీకానికి లాభం కలుగజేసే ఏ ఆర్థిక కార్యకలాపమైనా సామ్రాజ్య వాదాన్ని, పెట్టుబడిదారీ విధానాన్ని బలహీన పర్చేదేననీ, విప్లవాలను తను కనిపెట్టలేదని కేవలం తను చరిత్ర కావశ్యమైన విప్లవాన్ని చాలా మంది కంటే ముందే పసిగట్టిన వాడ్ని మాత్రమేనని కాబట్టి తనను అరెస్ట్ చేసినంత మాత్రాన విప్లవం ఆగిపోయేది కాదని ప్రకటించారు. సామ్రాజ్యవాదం జాతీయ విప్లవ శక్తులకు పుట్టుకనిచ్చి తన గోతిని తాను తవ్వుకుంటున్నదని 1932లో ప్రకటించిన "ఐ. ఎక్యూజ్" అన్న వ్యాసంలో పేర్కొన్నారు.

1936లో జైలు నుండి విడుదల అయిన తరువాత రాయ్ భారత జాతీయ కాంగ్రెస్‌లో చేరాడు. అప్పటికి జాతీయ బూర్జువా వర్గాలకు వామపక్ష భావాలు గల కార్మిక వర్గానికి సయోధ్య అవసరమనే స్థితికి చేరారు. శ్రామికేతర వర్గాలు కూడా విప్లవాన్ని సాధించగలమనే విశ్వాసాన్ని ప్రకటించారు. ఆయన గాంధీ విధానాలను విమర్శించడం మానలేదు. అలా అని ప్రచారం చేస్తూ కాంగ్రెస్ లాంటి రాజకీయ వ్యవస్థను నూలు వడికే వాళ్ళ సంఘంగా మారుస్తున్నావనీ అహింసను తిరుగులేని సిద్ధాంతమని అనవసరంగా ఆకాశాన్ని రేకెత్తిస్తున్నావనీ రాయ్ గాంధీకి రాసిన లేఖల్లోనే పేర్కొన్నారు. కాంగ్రెస్‌లో ఉంటూనే 1939లో "ది లీగ్ ఆఫ్ రాడికల్ కాంగ్రెస్ మెన్" అనే సంస్థను స్థాపించి 1940లో కాంగ్రెస్ అధ్యక్ష పదవికి అబుల్ కలాం ఆజాద్‌తో పోటీ చేసి చిత్తుగా ఓడిపోయారు.

రెండవ ప్రపంచ యుద్ధం మొదలైన తరువాత రాయ్ దాన్ని ప్రజాస్వామ్యానికి, ఫాసిజనానికి మధ్య జరుగుతున్న యుద్ధంగా వర్ణించారు. కాబట్టి యుద్ధ కాలంలో మిత్ర రాజ్యాలకు సహాయ సహకారాలు అందించాలనీ భారత దేశంలో బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా ఏ పని చేయరాదని యుద్ధం వలన వలసల విముక్తి ఆరంభమైనదనీ, యుద్ధం భారతదేశానికి స్వాతంత్ర్యము తెచ్చి పెడుతుందని, కాబట్టి విముక్తి పోరాటాలు అవసరం లేదని విశ్వసించే స్థితికి రాయ్ చేశారు. 1942లో ప్రారంభమైన క్విట్ ఇండియా ఉద్యమం ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడుతున్న బ్రిటీష్ వారిని బలహీన పరుస్తుందన్న విశ్వాసంతో వ్యతిరేకించారు. క్విట్ ఇండియా ఉద్యమం నడిపే కాంగ్రెస్ నాయకులు భారతీయ తత్వంలో నిగూఢంగా ఉన్న ఫాసిస్ట్ భావాలకు ప్రతి రూపము లేని కాంగ్రెస్‌కు ధన సహాయం చేస్తున్న పారిశ్రామికవేత్తలు లేవదీసిన ఉద్యమమే గాని వేరు కాదని నిశితంగా విమర్శించాడు రాయ్. ఒకవేళ అధికారము కాంగ్రెస్‌కే సంక్రమిస్తే అది ఫాసిస్ట్ నియంతృత్వంగానే పరిణమిస్తుందని తన "నేషనల్ గవర్నమెంట్ ఆర్ పీపుల్స్ గవర్నమెంట్" అనే గ్రంధంలో పేర్కొన్నారు. బ్రిటీష్ వారికి అనుగుణంగా కార్మికులలో ప్రచారం చేసేందుకు ప్రభుత్వ ధన సహాయాన్ని రాయ్ వినియోగించుకున్నప్పుడు జయప్రకాష్ నారాయణ్ ఆయనను బ్రిటీష్ తొత్తుగా అభివర్ణించారు. కాంగ్రెస్ నాయకులు చిల్లరగా తయారయ్యారని వీరిని జైలులో పారేయ్యాలని రాయ్ అన్నాడు. కాంగ్రెస్‌ను అహేతుకమైన ఫాసిస్ట్ భావాల పుట్టగా వర్ణించారు. గాంధీని జాతీయ పెట్టుబడిదారీ వ్యవస్థకు నాయకుడని నెహ్రూ ప్రవచించేది కంటి తుడుపు సోషలిజమనీ వీరిద్దరికి ఒకరి అవసరం మరొకరికి తప్పనిసరిగా అవసరమైందని రాయ్ విమర్శించారు.

యుద్ధ కాలంలో ఫాసిస్ట్ వ్యతిరేక శక్తుల్ని సంఘటిత పర్చే దశలో రాయ్ విప్లవకర శక్తులను క్రొత్తగా విలీన పర్చవలసిన అవసరాన్ని ఇంతకు ముందు ఎన్నడూ ఊహించని విధంగా నొక్కి వక్కానించాడు. కార్మిక నియంతృత్వ సిద్ధాంతము అరిగిపోయి పనికిమాలిన మూఢ విశ్వాసంగా మారిందని విప్లవ పోరాటాలను జాతీయ పోరాటమనీ, కమ్యూనిస్ట్ పోరాటమని వెలిసిపోయే రంగులు పూయనవసరం లేదని పేర్కొన్నారు.

ఫాసిజాన్ని విమర్శిస్తూనే గాంధీని గానీ భారతీయ తత్వ సాంప్రదాయాన్ని గాని తీవ్ర విమర్శలకు గురి చేయకుండా వదల్లేదు రాయ్. భారతీయ సిద్ధాంత తత్వంలోని ఆదర్శాలను వ్యతిరేకిస్తూ శంకరుడు, రామానుజుడు మానసిక మూఢ విశ్వాసానికి మధ్యయుగపు ఛాందస భావాలకు ప్రతీకలని తీవ్రంగా విమర్శించారు. కేవలము తమ జీవన భృతి కోసం ఏర్పరచుకున్న శ్రాద్ధ కర్మల మత జీవన మనుగడకు విలాసవంతమైన పరాన్న భుక్త జీవనానికి మార్గం సులభం చేసే కుల వ్యవస్థ అని ప్రగతిశీలంగా, విప్లవ స్ఫూర్తితో ఎదురుకిని రూపుమాపటానికి సిద్ధమైన బౌద్ధాన్ని నాశనం చేయడానికి బ్రాహ్మణులు సృష్టించిన ఛాందసులే శంకరాచార్యుడు, రామానుజుడని, తత్వ దర్శనాన్ని నిశిత విమర్శకు గురి చేశాడు. రాయ్, వివేకానంద, అరబిందో, గాంధీ భావాలలో ప్రముఖ స్థానాన్ని పొందిన భారతీయ తత్వం రాయ్‌ని ఆకర్షించలేకపోయింది. పశ్చిమ దేశాలు భౌతిక జీవనంతో విసుగులేని ఆధ్యాత్మికతను వాంఛిస్తున్నాయనే వాదనను రాయ్ అపహాస్యం చేశారు. పశ్చిమ దేశాలు పతనావ్యవస్థకు చేరాలంటే పెట్టుబడిదారీ వ్యవస్థ పతనావ్యవస్థకు చేరటమేనని పశ్చిమ దేశాలలో క్లిష్ట పరిస్థితులేర్పడ్డాయంటే బూర్జువా సామాజిక నిర్మితిలో క్లిష్ట పరిస్థితులేర్పడడమే గాని పశ్చిమ దేశాలు మొత్తముగా పతనం కావటం కాదనీ రాయ్ విశదీకరించినాడు. ఈ కోణం నుంచి పరిశీలించినట్లయితే-భారతీయ ఆధ్యాత్మిక చింతన పచ్చి భౌతిక వాదమని అలాంటి చింతనలో విశ్వాసం పెరగడానికి కారణం పెట్టుబడిదారీ వ్యవస్థ పూర్వదశలో భూస్వామ్య సామాజిక వ్యవస్థలను ఆదర్శీకరించి వాటిని నిలుపుకోవడానికి చేసే ప్రయత్నమే భారతీయ ఆధ్యాత్మికత తత్వపు సారమనీ రాయ్ తేటతెల్లం చేశారు. భారతీయులు గాంధీని పూజించడానికి కారణం ఆయన వారి ఆర్థిక దుస్థితిని ఆదర్శీకరించటమేననీ అశేష ప్రజానీకాన్ని ఏకం చేయటానికి ఆయనకు ఉపయోగపడింది. మత సిద్ధాంతాలే కాని తాత్విక దృక్పథం కాదనీ రాయ్ విశదీకరించాడు. ప్రజలు గౌరవించింది ఒక మహాత్ముణ్ణే కాని తత్వవేత్తను గాదు.

## 17.7. మార్క్సిజం పై ఎం.ఎన్. రాయ్ విమర్శ :-

ఎమ్.ఎన్ రాయ్ భారతీయ సామాజిక తాత్విక చింతనలో ముఖ్యమైన రాడికల్ హ్యూమనిస్ట్ సిద్ధాంతానికి మూల పురుషుడు. రాయ్ మార్క్సిజాన్ని లిబరిజాన్ని "అహేతుకమైన కవలలు"గా పేర్కొన్నారు. ఈ దశలో ఆయన మార్క్సిజాన్ని భౌతిక వాదాన్ని అధిగమించే ప్రభుత్వాన్ని ప్రారంభించాడు. మార్క్సిస్టులు నిజమైన తాత్విక భావాలను అర్థము చేసుకోలేక పోయారనీ, దాని మూలతత్వము మానవీయత అని రాయ్ పేర్కొన్నాడు. వీరు విఫలం చెందటం వల్లనే నియంతృత్వాలు ఏర్పడుతాయని రాయ్ భావించినాడు. దీనితో మార్క్సిజం కోల్పోయింది మానవీయతే అని, మానవతా సారాంశము వ్యక్తి స్వేచ్ఛ స్వాతంత్ర్యాలేనని రాయ్ పేర్కొన్నాడు. మార్క్సిస్టు తాత్విక విధానం ప్రభావం రాయ్‌పై పడింది. కాని ఆ తర్వాత ఆయన మార్క్సిజాన్ని నిశితంగా విమర్శించాడు. వ్యక్తి స్వేచ్ఛను నిర్మూలనం చేసేందుకు సమాజాన్నంతటిని ఒక రూపము పోసినట్లుగా తయారు చేసినందుకు దీని పట్ల హేయభావం ప్రదర్శించాడు. గత తార్కిక విధానంతో, చారిత్రిక వ్యాఖ్యానంతో ఆయన ఏకీభవించలేదు. చరిత్ర గతిని భౌతిక పరిస్థితులు మాత్రమే గాక అనేక యితర అంశాలు ప్రభావితం చేశాయని ఆయన భావించాడు. పాలనా వ్యవస్థలోనూ, రాజ్యపు ఆర్థిక కర్యాకలాపాలలోను, ప్రజలు అధిక స్థాయిలో పాల్గొనాలని మానవునికి అన్ని బాధల నుండి విమోచనం కలగాలని అన్ని స్వేచ్ఛలను పూర్తిగా అనుభవించాలని ఆయన వాదించాడు.

తన తాత్విక సామాజిక రచనలో రాయ్ ఎలా మార్క్సిజం నుండి వైదొలగింది వివరించాడు. రాయ్ మార్క్సును అభిమానించినాడు. కానీ ఆయన మార్క్సిజాన్ని విమర్శించాడు. రాయ్ సామాజిక అన్యాయాన్ని నిర్దయగా విమర్శించాడు. స్వేచ్ఛా ప్రియుడిగా, మానవతావాదిగా మార్క్సును అభివర్ణించాడు.

* ఎం.యన్.రాయ్ క్రింది విధంగా కూడా మార్క్సిజమ్‌ను విమర్శించడము జరిగింది.

1. మార్క్స్ భౌతికవాదం అశాస్త్రీయం అంటాడు.

2. మార్క్సిజం చారిత్రక వ్యాఖ్యానాలు తప్పు అని రాయ్ భావించినాడు. భౌతిక శక్తుల ప్రాతిపదికపై చరిత్రను వ్యాఖ్యానించడాన్ని రాయ్ వ్యతిరేకించాడు. మానవుల మేథస్సు వారి సంఘటిత కార్యాచరణ చాలా బలవంతమైన సామాజిక శక్తులు అంటాడు రాయ్. కమ్యూనిస్టులు భావాలకు ప్రాధాన్యత యివ్వరు. వాస్తవికత నుండి చైతన్యం పుడుతుందంట్నారు.

3. రాయ్ చారిత్రక ఆర్థిక కోణాల దృష్టిలో కమ్యూనిస్టులు వ్యాఖ్యానించడం కూడా విమర్శించాడు.

4. రాయ్ దృష్టిలో మార్క్సిజం నైతిక పునాదులు చాలా బలహీనమైనవని అంటాడు. నైతిక భావ చైతన్యం ఆర్థిక శక్తుల నుండి పుట్టలేదని అంటాడు. మానవ నైతిక విలువలు మార్క్సిజం కంటే గొప్పవని భావించాడు.

5. మార్క్సిజం ఉదార వ్యక్తి వాదాన్ని తిరస్కరిస్తుంది.

6. రాయ్ వర్గపోరాటాల సామాజిక తత్వాన్ని అనుమానించాడు. వర్గపోరాటాలు మాత్రమే కాదు. వర్గ ఐక్యత కూడా ఉండదంటాడు. సహజ ఐక్యత కూడా ఉంది. ఆ శక్తులు మాటేమిటి? అని ప్రశ్నిస్తాడు.

7. మధ్య తరగతి అంతరిస్తుందని మార్క్స్ తప్పుగా అంచనా వేసాడని రాయ్ భావించాడు. ఆర్థిక ప్రక్రియ పెరుగుదలలో వాస్తవానికి మధ్య తరగతి ఇంకా బలపడింది. 1919 తరువాత ప్రపంచ చరిత్రలో మధ్య తరగతి సాంస్కృతిక రాజకీయ

నాయకత్వము చారిత్రక బలమైన సత్యం.

8. విప్లవాలలో ప్రజలు ఉద్రేకాలు, ఉన్మాదాలు సమిష్టి ప్రకటన కల్పిస్తుంది.

ఎమ్.ఎన్. రాయ్ తన మానవతావాదంను ప్రారంభంలో కొన్ని మార్క్స్ భావాలను అంగీకరిస్తాడు.

## 17.8. రాడికల్ హ్యూమనిజమ్ (లేదా) నూతన (నవ్య) మానవతావాదం :-

సామాజిక తత్వానికి రాయ్ అందించిన విశిష్ట కానుకయే రాడికల్ హ్యూమనిజం లేదా నూతన మానవతావాదం. రాయ్ అనుచరులు ఆయనను An Intellectual giant (మేధోపర మహాకవిగా) స్వత సిద్ధ ఆలోచనలకు నిరంతర మూలాధారునిగా పేర్కొన్నారు.

రాయ్ తన జీవితం మానవతా స్వేచ్ఛ స్వాతంత్ర్యాల కోసం తపించిన వ్యక్తిగా రాయిస్టులు ఆయనను గౌరవిస్తారు. తన మేధో జీవితంలో ప్రధమ దశలో రాయ్ మార్క్సిస్ట్, కమ్యూనిస్ట్. తరువాత కాలంలో ఆయన మార్క్సిజాన్ని, లిబరలిజాన్ని అహేతుకమైన కవలలు గా పేర్కొన్నాడు. ఈ దశలోనే ఆయన మార్క్సిజాన్ని భౌతిక వాదాన్ని అధిగమించే ప్రభుత్వాన్ని ప్రారంభించెను. వారు నిజమైన తాత్విక భావాలను అర్ధం చేసుకోలేకపోయారని దాని మూలతత్వం మానవీయత అని రాయ్ పేర్కొన్నాడు. వారు ఈ విధంగా విఫలం చెందడం వలన నియంతృత్వాలు ఏర్పడ్డాయని ఆయన భావించాడు.

రాయ్ ప్రతిపాదించిన "రాడికల్ హ్యూమనిజం"ను శాస్త్రీయ మానవతావాదం అని కూడా పిలుస్తారు. ప్రపంచంలో మానవుని స్థానాన్ని శాస్త్రీయంగా అర్ధం చేసుకొనే పద్ధతిని రాడికల్ హ్యూమనిజం అంటారు. తత్వాన్ని గాని శాస్త్రాన్ని గాని అర్ధం చేసుకోవడానికి పద్ధతి ఒక్కటే. తద్వారా ఏర్పడిన తత్వాన్ని భౌతిక వాదమనిగాని, ఏకత్వ ప్రాకృతిక వాదమని గాని అనవచ్చు. దీని లక్షణాలు పాకృతకము, నిర్ణయాత్మకత, ఏకత్వము. ప్రకృతి యదార్ధమనీ, ప్రకృతిలో భాగమైన మానవుడు యదార్ధం అని పాకృతిక వాదం పేర్కొంటుంది. భౌతిక విశ్వమంతా కొన్ని నియమాలను అనుసరించి చలిస్తున్నదని ఈ చలనం ఎంతో క్రమబద్ధమైనదనీ, ఏ సంఘటన కారణం లేకుండా సంభవించదని పేర్కొంటుంది. దీనిలోని చలన శీలత నిర్ణయాత్మకమైనప్పుడు అస్థిత్వం చలనం అనే అంశాలు గుణము ఏకత్వము. మానవునికి దీనిని అర్ధం చేసుకోగల శక్తి ఉన్నదే. దీనికి కారణం అతని హేతుబద్ధమయిన మేథస్సు. మానవుని మేధస్సు యొక్క శక్తి అద్వితీయమైనది. "రాడికల్ హ్యూమనిజం" మానవుని హేతుజీవిగా భావిస్తుంది. అతని ఉద్దేశ్యంలో మాత్రము మానవుని నిర్దేశించే సూత్రాలకు భౌతిక శాస్త్రాలను నిర్దేశించే సూత్రాలకు తేడా లేదు. ఆయన ఈ రెండింటి మధ్య కనుగొన్న ఒక తేడా ఏమిటంటే భౌతిక ప్రపంచంలో భాగమే అయిన మానవునికి హేతుబద్ధమైన మేధస్సు ఉండటం. రాతికి కఠినత్వం ఎట్టిదో మానవునికి హేతువు అట్టిది. హేతువాదం ఆ విధంగా మానవ స్వభావంలో భాగమే. అది వారసత్వంగానూ, పరిణామక్రమంలోనూ మానవునికి సంక్రమించినట్టిది. ఆయన సిద్ధాంతమున చారిత్రక భౌతిక వాదంలో రాయ్‌కి విశ్వాసం ఉన్నప్పటికి ఆయన భౌతిక జీవశాస్త్రాలలో జరుగుతున్న పరిశోధనల కనుగుణంగా దీనిని పున: పరిశీలించే ప్రయత్నం చేశాడు. మార్క్సిజంలో ఆయనది ఒక రకంగా పిడివాదం. మొండివాదం, కనిపించింది. యిదే మనిషిని అధికారానికి దాసుణ్ణి చేసి పచ్చి భౌతిక వాదిగా మార్చిందని ఫలితంగా స్వేచ్ఛ పూరితమైన వ్యక్తిలో అభివృద్ధికి బదులు అధికార రాజకీయాలకు చోటిచ్చిందని రాయ్ భావించాడు.

మానవుడు ప్రకృతిలో భాగమేనని "రాడికల్ హ్యూమనిజం" పేర్కొంటున్నది ఈ మౌళిక భావనే మానవ స్వభావాన్ని శాస్త్రీయంగా అవగాహన చేసుకొనేందుకు అవకాశం కల్పించింది. వ్యక్తి సమాజానికి మధ్య వ్యక్తికే ఎక్కువ ప్రాధాన్యత ఉంటుంది

దానికి కారణం వ్యక్తి కాబట్టి అతనికి సుఖము, దు:ఖము, అభివృద్ధి వెనుకబాటుతనము ఉన్నాయని తెలుసు. మానవుడు తన మెదడు కణాల్లో అనుభూతిని సృజించగల శక్తిని కలిగియున్నాడు. యిది సమాజానికి లేదు. కనుక సామాజిక సుఖం, దు:ఖము సామాజికాభివృద్ధి అనేవి సమాజంలో భాగమైన వ్యక్తుల సుఖ, దు:ఖాలు సమ్మేళనమేనని భావించినట్లయితే అవి అర్ధరహితమవుతాయి. అందుకే హ్యూమనిస్టులు మౌళిక సిద్ధాంతములో మనిషే అన్నిటికీ కొలబద్ద అని విశ్వసిస్తాయి.

రాయ్ ఉద్దేశ్యంలో మానవునికి గమ్యం మానవుడే. ఏ వ్యవస్థ అయినా సంస్థ అయినా కేవలం ఈ గమ్యాన్ని చేరేందుకు మార్గాలు మాత్రమే. వ్యక్తి స్వేచ్ఛకు ఏదీ ధీటురాయి. మానవుడు స్వేచ్ఛ కోసము నిరంతరము పోరాడుచున్నాడని, రాజ్యంలోనూ, సమాజంలోనూ అతను సభ్యుడిగా జీవించేది స్వేచ్ఛను పరిరక్షించుకునేందుకేనని, వ్యవస్థలు, సంస్థలు, అతన్ని బందీని చేసేందుకు తరుచు ప్రయత్నిస్తున్నాయని మానవుని జీవనానికి సామాజిక జీవనానికి యిది విరుద్ధమని హ్యూమనిస్టులు భావిస్తారు.

మానవుడు, అతని స్వేచ్ఛ మాత్రమే ప్రాథమిక సత్యమని భావిస్తూ రాజ్యాన్ని, సమాజాన్ని అవి సాధించేందుకు మార్గాలు మాత్రమేనని హ్యూమనిస్టుల ఉద్దేశ్యము.

ఎమ్.ఎన్. రాయ్ ర్యాడికలిస్టుగా కొనసాగిన చివరి రోజుల్లో నూతన మానవతావాద ప్రతినిధిగా మారాడు. మానవతావాది తత్వ మూలకాలను ప్రాశ్చాత్య రాజనీతి తత్వం వివిధ ఆలోచనా స్కూల్స్ నందు చూడవచ్చును. మానవతా వాదం ధోరణులను: ప్రోడాగోరస్, ఎరాస్మస్, మోర్ బుచ్‌నన్ కన్పిస్తాయి. టర్గాట్ మరియు కన్‌డోరెక్ట్ వలె రాయ్ కూడా శాస్త్ర విజ్ఞానంలో ముందడుగు మానవుని సృజనాత్మకత శక్తుల విముక్తి కారణంగా భావించాడు మరియు బెంధాం లాంటి తాత్విక తీవ్రవాదుల మేధో పివర్స్ మానవతా దశలో సమకాలీన రాజకీయ, సామాజిక ఆర్థిక పరిస్థితులకు వారి విమర్శనాత్మకు పద్దతులలోను యం.ఎన్ రాయ్ ప్రేరణ పొంది తన నూతన మానవతావాదాన్ని రూపొందించాడు.

## 17.9 రాయ్ తాత్విక జీవితం : -

ఎన్నో సంవత్సరాలు రాయ్ కమ్యూనిస్ట్ ఇంటర్నేషనల్‌లో సభ్యుడిగా ఉండి 1929లో దాన్నుండి బహిష్కరింపబడ్డాడు. భారతదేశానికి తిరిగొచ్చిన తరువాత కాంగ్రెస్‌లో చేరాడు. కాని అందులో అతనికి గుర్తింపు లభించకపోవడం విచారకరము. 1948లో భారతీయ పునరుజ్జీవనోద్యమాన్ని ప్రారంభించారు. 1952లో ఆమ్‌స్టర్ డామ్‌లో జరిగిన ఇంటర్నేషనల్ హ్యూమనిస్ట్ అండ్ ఎథికల్ ఎసోసియేషన్ ఆఫ్ ఆమ్‌స్టర్ డామ్" కు ఉపాధ్యక్షుడిగా ఎన్నుకోబడ్డాడు. 1954 జనవరిలో డెహ్రాడూన్‌లోని "రినైసాన్స్ ఇన్‌స్టిట్యూట్"లో దివంగతుడైయ్యాడు.

రాయ్‌ని నవ్య మానవతావాదిగా లేదా శాస్త్రీయ మావనతావాదిగా ఆధునిక భారతీయ రాజనీతి తత్వశాస్త్రం గుర్తించింది. ఆయన ప్రతిపాదించిన మానవతావాదంలో శాస్త్రీయతకు హేతు దృష్టికి కొదవలేనప్పటికి అందులో ఆదర్శవాదం లేకపోలేదని విమర్శకులు భావిస్తున్నారు. యితను ప్రతిపాదించిన మానవతావాదం కొత్తదేమీ కాదు. పశ్చిమ దేశాలలోను, ఆసియాలోను ఎంతో మంది తత్వవేత్తలు వ్యక్తి శ్రేయస్సు గురించి తత్వ చింతన చేశారు. వ్యక్తి స్వేచ్ఛ అంటే రాయ్ ఉద్దేశ్యములో వ్యక్తిని అన్ని రకాల సామాజిక ప్రేరణల నుండి విముక్తుడిని చేయడమే. యిది సాధ్యమయ్యే విషయమేనా? భారతదేశంలోను, విదేశాలలోను ఆయన చరిత్రకు ప్రాముఖ్యం గల ఎన్నో సంస్థలలో ముఖ్యమైన పదవులే అలంకరించినా, ఎక్కుడా ఆయన సంతృప్తి చెందలేక పోయారు. వ్యవస్థాపరమైన అవసరాలకు వ్యక్తి స్వేచ్ఛకు పోటీ ఏర్పడినప్పుడు రాయ్ వ్యక్తి స్వేచ్ఛను సమర్ధించడం వల్లనే తను ప్రపంచంలో స్థిరంగా బ్రతకలేకపోవడానికి ముఖ్య కారణమన్న విషయాన్ని గ్రహించలేదు. అందుకే తన నవ్య మానవతా వాదానికి రావలసినంత పేరు ప్రఖ్యాతులు రాలేదు.

రాయ్ ఎంతో ప్రమాదకరమైన ధైర్యసాహసాలతో కూడిన జీవితాన్ని అనుభవించాడు. కానీ ఎన్నో వ్యధలకు లోనైయ్యాడు. ఆయనలోని మహామేధో సంపన్నతను, విప్లవ భావాలు ఏవో కొద్ది మంది మేధావులు, విప్లవకారులను తప్ప అశేష ప్రజానీకాన్ని ఆకర్షించలేకపోయాయి.

## 17.10 సారాంశము :-

భారతీయ రాజనీతి తత్వ విచారానికి మానవేంద్రనాథ్‌రాయ్ అందించిన ప్రముఖ సిద్ధాంతము "రాడికల్ హ్యూమనిజం" లేదా "నూతన మానవతా వాదం" భారతీయ మానవతావాద ప్రవర్తగా వ్యాఖ్యాతగా, చరిత్రకారునిగా, భారతీయ తత్వ చింతన చరిత్రలో మానవేంద్రరాయ్‌కి ప్రముఖ స్థానమున్నది. ఎమ్.ఎన్. రాయ్ ప్రతిభాసంపన్నుడైన రాజకీయ నాయకుడు. రాజకీయ సిద్ధాంత రంగంలో ఆయన పాత్ర ప్రముఖమైనది. ఆయన భారతదేశంలోని మేధావుల దృష్టిని ఆకట్టుకున్నాడు.

ఎం.ఎన్ రాయ్ ప్రతిపాదించిన పార్టీరహిత ప్రజాస్వామ్యం మంచిదేగాని, అందులోనూ ఆదర్శవాదం లేకపోలేదు. అయినప్పటికీ మార్క్సిజానికి, మానవతావాదానికి రాయ్ పెట్టిన కొత్త ఒరవడి యిప్పటికీ చాలా మందిని ప్రభావితం చేస్తూనే ఉంది. ఆయన అనుయాయులు "రాయిస్టులు"గా రాడికల్ హ్యూమనిస్టులుగా ఇప్పటికీ క్రియాశీలంగా పనిచేస్తూనే ఉన్నారు.

## 17.11 నమూనా ప్రశ్నలు:

I. ఈ క్రింది వానికి వ్యాసరూపంలో జవాబులు వ్రాయండి?

1. భారత జాతీయోద్యమంపై రాయ్ వెలిబుచ్చిన భావాలను పరిశీలించండి?
2. కమ్యూనిస్ట్‌గా రాయ్ పాత్రను వివరించండి?
3. నవ్య మానవతా వాదిగా రాయ్‌ని పరిశీలించండి?
4. మార్క్సిజమ్ పై రాయ్ విమర్శ

II. లఘు ప్రశ్నలు:

1. ప్రజాస్వామ్యంపై రాయ్ భావాలు
2. రాజకీయ పార్టీ పై రాయ్ అభిప్రాయం
3. రాయ్ తాత్విక జీవనం గూర్చి వివరించండి.

## 17.12 చదువదగిన గ్రంథాలు:


| | | | |
|---|---|---|---|
| 1. | యం.యన్ రాయ్ | : | మెటీరియలిజమ్ |
| 2. | యం.యన్ రాయ్ | : | బియాండ్ కమ్యూనిజం |
| 3. | వి.యం. తార్కుండే | : | రాడికల్ హ్యూమనిజం |
| 4. | వి.పి. వర్మ | : | మోడరన్ ఇండియన్ పొలిటికల్ థాట్ |
| 5. | శంకర్ ఘోష్ | : | మోడరన్ ఇండియన్ పొలిటికల్ థాట్ |


డా॥ కె. రామచంద్రమూర్తి

# జయప్రకాష్ నారాయణ్ - రాజకీయ భావాలు
# (Jayaprakash Narayan - Political Ideas)
# (1902 - 1979)

## 18.0 లక్ష్యం:

రాజనీతి శాస్త్రంలో రాజనీతితత్త్వ శాస్త్రం ఒక భాగం. తత్త్వ వేత్తల భావాలే ఏ దేశ రాజనీతికయినా పునాదులు. తత్త్వవేత్తల ఆలోచనా సరళి, విశాల దృక్పథం, నిస్వార్థ సేవ, దూరదృష్టి, జాతీయతా భావం, ఉన్నత ఆదర్శాలు, వివిధ రాజకీయ భావనల పై వారి ఆలోచనలు, నేటి రాజనీతి తత్త్వ విద్యార్థికి ఎంతయినా అవసరం. రాజనీతి తత్త్వ శాస్త్ర అవగాహన విద్యార్థులలో ఉన్నత భావాలకు, జీవితం పట్ల సరైన దృక్పథం అలవరచుకొనడానికి దోహదపడుతుంది. బాధ్యతాయుత వ్యక్తులుగా విద్యార్థులను తీర్చిదిద్దడానికి తత్త్వవేత్తల జీవితాలు, భావనలు స్ఫూర్తినిస్తాయి. అటువంటి ఆధునిక భారత రాజనీతి తత్త్వవేత్తలలో అగ్రగణ్యుడు, నిస్వార్థ నాయకుడు, గాంధేయ వాది, పలువురి చేత 'లోక్‌నాయక్' (Loknayak) అని గర్వంగా కీర్తించబడిన జయప్రకాష్ నారాయణ్ జీవిత విశేషాలు, రాజకీయాల పట్ల, వివిధ రాజకీయ విషయాలలో ఆయన వైఖరి, సర్వోదయ నాయకునిగా ఆయన పాత్ర, దేశ రాజకీయ చరిత్రలో ఆయన స్థానం మొదలయిన విషయాల గురించి సులభ శైలిలో విద్యార్థులకు వివరించడమే ఈ పాఠం యొక్క ప్రధాన లక్ష్యం.

### విషయసూచిక:


18.1 బాల్యం, విద్యాభ్యాసం
18.2 స్వాతంత్ర్య ఉద్యమంలో పాత్ర
18.3 తాత్త్విక పునాదులు
18.4 సాంఘిక భావాలు
18.5 రాజకీయ భావాలు
18.6 ఆర్థిక భావాలు
18.7 సర్వోదయ
18.8 సోషలిజం
18.9 సంపూర్ణ విప్లవం
18.10 సారాంశము
18.11 నమూనా ప్రశ్నలు
18.12 చదువదగిన గ్రంథాలు


## 18.1 జయప్రకాష్ నారాయణ్ - బాల్యం, విద్యాభ్యాసం (Jayaprakash Narayan - Childhood and Education):

జయప్రకాష్ నారాయణ్ 1902, అక్టోబర్ 11వ తేదీన బీహార్ - ఉత్తర ప్రదేశ్ సరిహద్దు గ్రామమయిన **'సితాబ్దియారా'లో**

జన్మించాడు. వారిది బీద రైతు కుటుంబం. తల్లి ఫూల్ రాణి, తండ్రి హరసు దయాళ్. ప్రాథమిక విద్య తన గ్రామంలోనే పూర్తి చేసి తొమ్మిదవ ఏట పాట్నా కాలేజీకి చెందిన స్కూలులో చేరాడు. చిన్ననాటి నుండి ఆయనలోని ఆదర్శవాదం తల్లిదండ్రులకు సమస్యగా మారింది. పరాయి పాలకుల ఆధ్వర్యంలో నడిచే విద్యా సంస్థలలో చదవనని ఆయన భీష్మించుకొని కూర్చున్నాడు. జాతీయ భావాలు గల విద్యార్థుల కోసం నాయకులు బీహారు పీఠం నెలకొల్పడంతో అక్కడ ఇంటర్ పరీక్షలు వ్రాసి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడైనాడు. తదనంతరం సంపాదిస్తూ చదువుకొనే అవకాశాలు అమెరికాలో అధికంగా ఉన్నాయని తెలియడంతో ఆ దేశానికి చేరుకున్నాడు. తన వద్ద గల డబ్బులు ఖర్చయిపోవడంతో ఆ దేశంలో పండ్ల తోటలలో పండ్లను కోయడం, రెస్టారెంట్లలో పని చేయడం, గ్యారేజీలలో మెకానిక్‌గా పని చేసి శ్రమని గౌరవించడం, సర్వ మానవ సమానత్వ భావన అలవరచుకొంటూ కష్టపడి సంపాదన ఆర్జించి తన చదువును కొనసాగించసాగాడు. అక్కడ తోటి శ్రామికుల కష్టాలను, పేదరికాన్ని చూశాకే ప్రతి వ్యక్తికి ఆర్థిక స్వాతంత్ర్యం ఎంత అవసరమో గ్రహించాడు. కెమికల్ ఇంజనీరింగ్, సోషల్ సైన్స్‌లు చదివి స్కాలర్ షిప్‌తో పాటుగా అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగం కూడా సంపాదించి తిరిగి ఎమ్.ఏ. లో చేరాడు. డబ్బు సంపాదనకు రాత్రిళ్ళు కష్టపడి పని చేసే అవసరం తప్పడంతో ఆయన గణిత శాస్త్రం, ఆర్థిక శాస్త్రం, మనస్తత్వ శాస్త్రం, చరిత్ర, సాహిత్యం, భాషా శాస్త్రం అధ్యయనం చేసి ప్రావీణ్యత సంపాదించాడు. వీటన్నింటితో పాటు 'సోషల్ వేరియేషన్' (social variation) అన్న పేపరు రాసి యూనివర్శిటీకి సమర్పించాడు.

సోషియాలజీ ప్రొఫెసర్ 'ఎడ్వర్డ్ రాన్' (Edward Rann) జయప్రకాష్‌కు ఎంతో సాయపడ్డాడు. విద్యార్థి దశలోనే ఆయన 'కారల్ మార్క్స్' విప్లవాత్మక ఆలోచనలకు ఆకర్షితుడయ్యాడు. 'ఎమ్.ఎన్.రాయ్' రచనలు కూడా ఆయనకు మరింత స్ఫూర్తినిచ్చాయి. రష్యా వెళ్ళి కమ్యూనిజాన్ని మరింత విపులంగా చదువుదామంటే అనారోగ్య కారణంగా అమెరికాలో ఉండిపోవలసి వచ్చింది. విద్యార్థిగా ఉన్న రోజుల్లోనే బాల గంగాధర్ తిలక్, అరవింద ఘోష్‌ల ఉత్తేజ పూర్వక ఉపన్యాసాలతో స్వరాజ్య ఉద్యమం వేడిగా సాగుతూ ఉండడం, ఆ సమయంలోనే మైధిలీ శరణ్ గుప్తా, భారతేంద్రు హరిశ్చంద్ర పద్యాలు, సరస్వతి, ప్రభా, ప్రతాప్ పత్రికలలో నాయకుల ఉద్రేక పూరితమైన వ్యాసాలను చదివి ఆయన దేశభక్తి పెరిగింది. తల్లి చిన్నతనం నుండి మతం, దైవారాధన పట్ల గౌరవాన్ని పెంచడంతో భగవద్గీత సారాన్ని గ్రహించగలిగాడు. 1917లో గాంధీజీ చంపారన్ ఉద్యమాన్ని ఆరంభించినపుడు దానిపట్ల జయప్రకాష్ ఆకర్షితుడయినాడు. 1919లో బ్రిటీష్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రౌలత్ చట్టానికి నిరసనగా సహాయ నిరాకరణ ఉద్యమం చేపట్టిన గాంధీజీ పిలుపు మేరకు లాయర్లు కోర్టుల్ని, విద్యార్థులు తరగతుల్ని బహిష్కరించారు. 1921లో పరభాషా విద్య భారతీయుల్ని మరింత బానిసలుగా చేస్తుంది అన్న 'మౌలానా అబుల్ కలాం ఆజాద్' ఉపన్యాసంలోని వాక్యం జయప్రకాష్‌ని ఆలోచింప చేసింది. ఆ ఘట్టం గురించి ఆయనే యిలా అన్నారు. '1921 జనవరి నెల ఒక రోజు ఉదయం పాట్నాలో బహిరంగ సభ జరిగింది. అబుల్ కాలం ఆజాద్ ప్రసంగం శ్రోతలను మంత్ర ముగ్ధులను చేసింది. నేను భావావేశంతో తలమునకలై పోయాను. ఆ మర్నాడు పాట్నా కళాశాల విద్యార్థులు ఊరేగింపుగా రాజేంద్రప్రసాద్ గృహానికి వెళ్ళి ఉద్యమంలో చేరాలన్న తమ దృఢ నిశ్చయాన్ని ప్రకటించారు. ఆ విద్యార్థులను చూసి ఆయన నిశ్చేష్టులై కన్నీరు పెట్టుకొన్నారు. ఆ సంఘటన జయప్రకాష్ జీవితం పై చెరగని ముద్రను వేసింది. ఆ నాటి నుండి స్వాతంత్ర్యం ఆయన జీవిత ధ్యేయానికి గల వెలుగుబాటలలో ఒకటయింది. క్రమక్రమంగా ఈ స్వాతంత్ర్య లక్ష్యం కేవలం తన దేశ దాస్య విముక్తి వరకే పరిమితమైపోకుండా మానవుడెక్కడ ఉన్నా అన్ని రకాల బంధనాల నుండి విముక్తి చెంది మానవ వ్యక్తిత్వం, మానవుని ఆలోచన, మానవుని ఆత్మ స్వాతంత్ర్యం పొందాలన్న భావంగా పరిణమించినది.

1920లో 18 సంవత్సరాల వయస్సులోనే బీహార్‌లోని జాతీయతావాది బ్రిజ్ కిషోర్ బాబు కుమార్తె ప్రభావతితో జయప్రకాష్‌కు వివాహం జరిగింది. ఉన్నత విద్యాభ్యాసానికి అమెరికాలో ఉన్నంత కాలం ప్రభావతి గాంధీజీ సబర్మతి ఆశ్రమంలోనే ఉండేది. ఆ కాలంలో ఆమెకు కస్తూరి బా తో సాన్నిహిత్యం ఏర్పడడమే కాక 'భారత కోకిల' శ్రీమతి సరోజినీ నాయుడు, పాశ్చాత్య విద్యనభ్యసించిన 'కమలా దేవి చటోపాధ్యాయ', ఇంగ్లీషు వనిత గాంధీ శిష్యురాలు 'మీరాబెన్' వంటి నారీమణులతోను, ప్యారీలాల్ నయ్యర్, వినోబా భావే వంటి మహా పురుషులతోను పరిచయం ఏర్పడింది. ఆశ్రమ వాసులందరూ బ్రహ్మచర్యాన్ని పాటించాలనే నియమం ఉండడం

వలన దాని కనుగుణంగా ఆమె వివాహిత అయినా జీవితాంతం వరకు బ్రహ్మచర్యం అవలంబించినది. ఇదే జయప్రకాష్ నారాయణ్, ప్రభావతి జీవితాలలో ఒక అసాధారణ సంఘటన. అందుకే గాంధీ గారి ప్రభావం, గాంధీ నైతికత ఆమె పై చెరగని ముద్ర వేసాయి. జయప్రకాష్ అమెరికాలో ఉన్నప్పుడు 'దాస్ కాపిటల్' మూడు సంపుటాలు, ఎమ్.ఎన్.రాయ్ రచనలు కూలంకషంగా అధ్యయనం చేశాడు. 8 సంవత్సరాల తర్వాత భారతదేశానికి తిరిగి వచ్చి భార్య ప్రభావతిని కలుసుకొని ఒకరి భావాలు మరొకరు తెలుసుకొని గాంధీజీని వార్ధాలో కలుసుకున్నాడు. అప్పటికే నెహ్రూ 1929 సం॥లో లాహోరులో జరుగబోయే కాంగ్రెసు సమావేశానికి అధ్యక్షునిగా ఎన్నికయ్యాడు. ఆయన కూడా వార్ధా రావడం, జయప్రకాష్, నెహ్రూలు ఒకరికొకరు పరిచయం కావడం జరిగాయి. ఆ పరిచయ సంభాషణలో జయప్రకాష్‌ను కాంగ్రెస్ కార్మిక విభాగంలో కార్యకర్తగా పని చేయమని నెహ్రూ కోరడం, జయప్రకాష్ అంగీకరించి భార్యతో అలహాబాద్‌లో కాపురం పెట్టడం జరిగాయి.

## 18.2 స్వాతంత్ర్య ఉద్యమంలో జయప్రకాష్ పాత్ర (The role of Jayaprakash in Freedom Struggle):

1930 - 40 దశకం ప్రపంచ రాజకీయాలలో చాలా ప్రాధాన్యత సంతరించుకొంది. ఆర్థిక మాంద్యంతో కొట్టుమిట్టాడుతున్న పారిశ్రామిక దేశాల ఆర్థిక వ్యవస్థకు భిన్నంగా సోవియట్ రష్యాలో ప్రణాళికాబద్ధ ఆర్థికాభివృద్ధిని సాధించడంతో మేధావులు, యువత దాని గురించి తీవ్రంగా ఆలోచించసాగారు. కాంగ్రెస్ పార్టీలోని యువతరం గాంధీ నాయకత్వం, సత్యాగ్రహం విఫలమయ్యాయని భావించారు. కాంగ్రెస్‌లోనే కొంత మంది తీవ్రవాదులుగా మారారు. గాంధీజీ యిచ్చిన అహింసా సిద్ధాంతం, నిర్మాణ కార్యక్రమాలు ప్రజానీకాన్ని సంఘటితపరచి విప్లవానికి సిద్ధం చేయగలవా అన్న సందేహం జయప్రకాష్‌కి కూడా కలిగింది. కాంగ్రెస్ తీర్మానాలు వారికి సంతృప్తి నివ్వలేదు. యువకులు సోషలిజం వైపే మొగ్గు చూపుతున్నారు. సోషలిస్ట్ భావాలున్న మరి కొంతమంది ఆచార్య అశోక్ మెహతా, ఎమ్.ఆర్. మసానీ, ఎన్.జి. గోరె, ఎస్.ఎమ్. జోషి మొ॥ వారితో సంప్రదించుకొని కాంగ్రెసులోనే సోషలిస్ట్ పార్టీ పెట్టాలని భావించారు. బొంబాయిలో రాష్ట్ర కాంగ్రెస్ సోషలిస్ట్ దళం స్థాపించబడింది. 1931లో బీహార్‌లో సోషలిస్ట్ పార్టీ ఏర్పాటయ్యింది. ఈ విధంగా సోషలిస్ట్ పార్టీ స్వాతంత్ర్య పోరాటంలో జాతీయ ఉద్యమంలో పుట్టి పెరిగినది. కాంగ్రెసులోనే కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీని స్థాపించగలిగాడు జయప్రకాష్ నారాయణ్. 1934లో కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీని స్థాపించిన తరువాత కొందరు కమ్యూనిస్ట్‌లు కూడా దానిలో చేరడంతో కాంగ్రెస్ సోషలిస్ట్‌లకు కమ్యూనిస్ట్‌లకు సయోధ్య కుదరలేదు. దానితో కమ్యూనిస్ట్‌లను కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీ నుండి బహిష్కరించారు. 1942 నాటికి రెండవ ప్రపంచ యుద్ధంలో నాజీ జర్మనీ, ఇటలీలు విజయ పరంపరలో ఉన్నాయి. బ్రిటీష్ ప్రభుత్వము క్యాబినెట్ మంత్రి అయిన 'సర్ స్టాఫర్డ్ క్రిప్స్' (Sir Stafford Cripps) ను భారతీయ నాయకులతో సంప్రదించడానికి భారతదేశం పంపినది. కాని కాంగ్రెస్ నాయకులకు క్రిప్స్ ప్రతిపాదనలు నచ్చలేదు. క్రిప్స్ రాయబారం విఫలమయింది. గాంధీజీ కాంగ్రెస్ సోషలిస్ట్‌లకు 'క్విట్ ఇండియా' తీర్మాన రచనలో సన్నిహితుడయ్యాడు. 'క్విట్ ఇండియా' అనే పదాలను కూర్చినది సోషలిస్ట్ నాయకుడు 'యూసఫ్ మొహరాలె' (Yusaf Moharale). రచనలో తోడ్పడినది. ఆచార్య నరేంద్ర దేవ. ఆ విధంగా క్విట్ ఇండియా ఉద్యమానికి ఊపిరి పోసింది. దేశం నలుమూలలా ప్రచారం చేసినది, రహస్య స్థావరాలు స్థాపించినది సోషలిస్ట్ నాయకులే. జాతీయ జీవన స్రవంతిలో జయప్రకాష్ నారాయణ్, రామ్‌మనోహర్ లోహియా, అరుణ అసఫలీ, అచ్యుత్ పట్వర్ధన్, అశోక్ మెహతా మున్నగువారు. జయప్రకాష్ నారాయణ్ 'ఆజాద్ దస్తాన్' అనే పత్రికను అజ్ఞాతం నుండి ప్రచురిస్తూ ప్రజలకి స్ఫూర్తినిచ్చి, ఉద్యమ వ్యాప్తికి నలుమూలలా సంచరిస్తూ ఉండేవాడు. ప్రభుత్వం ఆయనను అరెస్ట్ చేసి 1946లో విడుదల చేసినది.

1948 మార్చిలో కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీ సభ్యులందరూ భారత జాతీయ కాంగ్రెస్‌ను విడిచి పెట్టారు. గాంధీజీ సోషలిస్ట్‌లంతా కాంగ్రెస్‌లోనే ఉండాలని ఎంత కోరినా లాభం లేకపోయింది. జయప్రకాష్ నారాయణ్‌ను కాంగ్రెస్ అధ్యక్షునిగా ఎన్నుకొంటే బాగుంటుందని గాంధీజీ ఆశించినా కాంగ్రెస్ వర్కింగ్ కమిటి అంగీకరించలేదు. కాంగ్రెస్‌ను సమర్థించని వారు కాంగ్రెస్‌లో ఉండరాదని చెప్పడంతో

సోషలిస్టులు 1948లో కాంగ్రెస్‌ను వీడి సోషలిస్ట్ పార్టీని స్థాపించుకున్నారు. 1952లో జె.బి. కృపలానీ క్రిషక్ మజూదూర్ ప్రజాపార్టీ సోషలిస్ట్ పార్టీతో కలవడంతో దానిపేరు ప్రజాసోషలిస్ట్ పార్టీగా మార్పు చేశారు. జయప్రకాష్ భవిష్యత్ గురించి గాంధీజీ ఒక సందర్భంలో యిలా అన్నారు. 'ఒక రోజు ఈ వ్యక్తి నా భావాలను లోకానికి చాటుతాడు' (perhaps this man will speak my tongue one day). గాంధీజీకి సరిఅయిన అనుయాయుడు జయప్రకాష్. ప్రజా సోషలిస్ట్ పార్టీకి ఎన్నికలలో ప్రజాదరణ అంతగా రాలేదు. దానికి తోడుగా పార్టీలో పెరుగుతున్న వర్గ బేధాలు, కీచులాటలు చూసి మనస్తాపం చెంది 1954లో ఆ పార్టీ జాతీయ కార్యవర్గం నుండి రాజీనామా చేశాడు. జయప్రకాష్ నారాయణ్ ఆనాటి నుండి జాతీయ రాజకీయాలకు దూరంగా ఉన్నాడు. పార్టీలకతీతంగా ఉండే సర్వోదయ కార్యకర్తగా చేరాడు.

## 18.3 తాత్త్విక పునాది (Jayaprakash Narayan - Philosophical Foundation):

తల్లిదండ్రుల ప్రభావం తమ సంతానం పై కొంత వరకు కనబడకమానదు. చిన్న వయస్సులో తన తల్లి దగ్గర పురాణాలు, భగవద్గీత, దైవారాధన మొ॥వి అలవరచుకోవాలని క్షుణ్ణంగా నిశిత పరిశీలనా దృష్టితో వాటిని చదివినా జయప్రకాష్ నారాయణ్ విద్యార్థిగా కమ్యూనిజమ్ వైపే ఆసక్తి కనబరచాడు. కమ్యూనిస్ట్ ఆశయాలే గొప్పవని భావించాడు. తల్లిదండ్రుల ప్రభావం కన్నా కారల్‌మార్క్స్, ఎమ్.ఎన్. రాయ్ విప్లవ భావాల ప్రభావమే ఆయన పై మెండు. జయప్రకాష్ తత్త్వానికి పునాది ఆయన జీవితమే. ఆయన మొదట సంస్కార ఊహా వాదానికి చెందిన రాజకీయవాది కాని మార్క్సిజం పట్ల ఆకర్షితుడై కమ్యూనిస్ట్ భావాలను ఇష్టపడ్డాడు. భారతదేశం తిరిగొచ్చాక కమ్యూనిజంలోని లోటుపాట్లు విశ్లేషించుకొని కాంగ్రెస్‌వాదిగా ఆ తర్వాత సోషలిస్ట్‌గా మారాడు. అన్ని రకాల ప్రభావాలు ఆయన జీవితం పై చెరగని ముద్రవేయడంతో జీవిత చరమాంకంలో సర్వోదయ కార్యకర్తగా, నిస్వార్థ ప్రజానాయకుడిగా మిగిలిపోయాడు. మతం గురించి గాని, కులం గురించి గాని ఆయన భావాలు మనకి విపులంగా ఎక్కడా కనబడవు. కాని మార్క్సిస్ట్‌గా ఉన్నప్పుడు ఆయన భౌతికవాదిగా ఉన్నా గాంధీ అనుచరుడుగా మారిన తరువాత గాంధీజీ భావాలకి విలువని సర్వమత సమభావ, కుల - వర్గ రహిత సమాజ స్థాపన అన్న ఆదర్శాలకి విలువనిచ్చాడు.

## 18.4 జయప్రకాష్ నారాయణ్ - సాంఘిక భావాలు (Jayaprakash Narayan - Social Views):

మహాత్మా గాంధీ వలె జయప్రకాష్ నారాయణ్‌కు కూడా మనిషి మంచితనము పై నమ్మకమెక్కువ. జయప్రకాష్ భావనలో మానవులలో హింస, దౌర్జన్యం, స్వార్థపరత, లోభత్వం వీటిపై ప్రేమ, సహకార భావన, అందరి సంక్షేమానికి చేతనయిన కృషి ఇవే ఆధిపత్యాన్ని కలిగి ఉంటాయి. ఎప్పుడో తప్ప మానవునిలో హింసాత్మక ప్రవృత్తి, స్వార్థపూరిత ఆలోచనలు కనబడవని ఆయన నమ్మకం. అందరూ చెడ్డ గుణాలతో నిండి ఉంటారని ఆయన విశ్వసించడు. మనిషి మానవత్వంతో ఉంటాడని, దయ, ప్రేమ, తోటి వారి పట్ల సానుభూతి కలిగి ఉండబట్టే ఈ ప్రపంచం యింకా విలువలతో కూడిన మానవ సముదాయంగా ఉంది అని ఆయన భావన. కుల, మత ప్రాతిపదికల పై మనుషుల మధ్య తలెత్తే విభేదాలను ఆయన తీవ్రంగా ఖండించాడు. మానవులంతా ఒకటే జాతి వైషమ్యాలు, కుల, మత బేధాలు మానవ సమాజాన్ని విచ్ఛిన్నం చేస్తాయని ఆయన అభిప్రాయం. ప్రేమ, అభిమానం, సత్య ధర్మాలతో నిండినదే ఆయన మతం సర్వజనుల శ్రేయస్సు కాంక్షించేది మతమని ఆయన భావన.

కుల, మత, వర్గ రహిత సమాజం స్థాపించబడాలని దానికి ప్రతి ఒక్కరూ తమవంతు సహాయ సహకారాలనందించడానికి ముందుకు రావాలని దానికి కొంత వరకు స్వార్థచింతన వీడి పరహితం కోసం స్వసుఖాలు త్యాగం చేయడానికి సంసిద్ధులు కావాలని ఉద్బోధించాడు. సద్భావనే మంచి జీవితానికి పునాది అని గ్రహించినాడు. మనుషులలో కష్టలు, కార్పణ్యాలు సమసిపోయి సహకార భావన వృద్ధి చెందుతుందని భావించాడు. వ్యక్తిని, సంఘాన్ని నీతిబద్ధంగా తీర్చిదిద్దడానికి ప్రజలకు కొన్ని సూత్రాలు అనుసరణీయమని ఆయన భావన. అవే సత్యం, అహింస, లక్ష్య సాఫల్యం కోసం సత్సాధనాలు చేపట్టడం, విత్తనాలు బాగుంటే చెట్లు బాగుంటాయి. అలాగే సాధనాలు బాగుంటే ఫలితాలు బాగుంటాయని విశ్వసించాడు. గాంధీ, అరవిందుడు, వినోబా భావేల వలె విలువలతో కూడిన ఆదర్శవంతమైన నవ సమాజ నిర్మాణం జరగాలని జయప్రకాష్ భావించాడు.

## 18.5 జయప్రకాష్ నారాయణ్ - రాజకీయ భావాలు (Jayaprakash Narayan - Political Ideas):

జయప్రకాష్ నారాయణ్‌కు స్వేచ్ఛపట్ల మక్కువ ఎక్కువ. స్వేచ్ఛలేని ప్రజాస్వామ్యం నిరుపయోగం. జీవితంలో స్వేచ్ఛ అనేది అత్యంత ఆవశ్యకమయినది. అధికారానికి కాని, ఆర్థిక అవసరాలకి కాని, వ్యక్తి సర్వతోముఖాభివృద్ధి కి కాని, రాజ్యా ఔన్నత్యానికి కాని దానిని పణంగా పెట్టడాన్ని నేను సహించలేనని ఆయన ప్రకటించాడు. విదేశాలలో విద్యనభ్యసించినా పాశ్చాత్య ప్రజాస్వామ్యం ఆయనకు స్ఫూర్తి నివ్వలేదు. భారతీయ సంస్కృతి విలువల పట్ల ఆసక్తిని కనబరచాడు. తన భావాలకు స్ఫూర్తిని తన దేశం నుండే గ్రహించాడు. భారతీయ ప్రజాస్వామ్య చరిత్ర ఎంతో పురాతనమయినది అని, కొన్ని వేల సంవత్సరాల చరిత్ర కలిగిన రిపబ్లిక్‌లు కూడా భారతదేశంలో ఉన్నాయని ఆయన, తన దేశ గొప్పదనం గర్వంగా చాటుకున్నాడు. ప్రజాస్వామ్యానికి ప్రజలే మూలం. దాని విజయవంతానికి వారి కృషే ప్రధానం. రాజకీయాలలో వారి నిమగ్నత పై వారి ఆసక్తి పై, పాలనలో వారి పాత్ర పై ప్రభుత్వము నుండి వారు పొందే సేవల పై ప్రజాస్వామ్యం, విజయం, గుణాత్మకత ఆధారపడి ఉంటాయని జయప్రకాష్ నారాయణ్ భావించాడు. పాశ్చాత్య ప్రజాస్వామ్యాలన్నీ లీడర్‌కి ప్రాధాన్యతనిస్తాయి. కాని ప్రజలకి కాదని ఆయన భావించాడు. ధనవంతులయిన కొద్ది మంది చేతులలో ప్రభుత్వ కార్యకలాపాలన్నీ కేంద్రీకృతమై ఉంటాయి. కాబట్టి ఆ దేశాలలో వారికి లాభదాయకంగానే ప్రభుత్వ విధానాలు మారుతూ ఉంటాయి. అందువలన జయప్రకాష్ నారాయణ్ పాశ్చాత్య ప్రజాస్వామ్యాన్ని ప్రజాస్వామ్య ఆలిగార్కి (Democratic Oligarchy) అంటాడు. ఆ దేశాలలో ఎన్నికలు, డబ్బు మీడియా చేతులలో మార్పులు చెందుతూ సామాన్య మానవుని నిర్లక్ష్యం చేస్తాయి. ఈ విధానాన్ని జయప్రకాష్ నారాయణ్ సామాన్యులను దోపిడీ చేసే విధానమని ఖండించాడు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం కూడా ఓటర్‌ని ఏ విధంగానూ చైతన్యవంతుడిగా చేయడంలేదని వాస్తవ విషయాల పై అవగాహన కల్పించడంలో విఫలమవ్వడమే కాక తప్పుడు వాగ్దానాలతోను, అతి ప్రచారాలతోను ఓటరు మోసగించబడుతున్నాడని ఆయన ఉద్దేశ్యం.

భారతదేశంలో ఎన్నికల ప్రక్రియపట్ల కూడా తన అసంతృప్తిని ప్రకటించాడు. ఎన్నికలు ఎంతో ఖర్చుతో కూడుకున్నవి కావడంతో సామాన్యులెవరూ పోటీ చేయలేకపోతున్నారని ధనవంతులకి మాత్రమే పోటీ చేసే అవకాశం, ఎన్నుకోబడే అవకాశం ఉంటోంది అని ఆయన భావించాడు. ఎన్నికలలో 50% ఓట్లను మాత్రమే పొందగలిగిన అధికారపక్షం ఆయన దృష్టిలో మైనారిటీ ప్రభుత్వమే. అవి నిజమైన ప్రాతినిధ్య ప్రభుత్వాలు అనిపించుకోవు. భారతదేశంలోని పార్టీ రాజకీయాల పై కూడా తన అసంతృప్తిని వ్యక్తపరిచాడు జయప్రకాష్ నారాయణ్. రాజకీయ పార్టీలు కొందరి పక్షపాత వైఖరితో కొందరి సంక్షేమం కోసం పని చేయకుండా ప్రజలందరి సంక్షేమం కోసం పని చేయాలని ప్రజలకు మరింత చేరువగా ప్రభుత్వం రావాలంటే పార్టీలు ప్రజలకి ప్రభుత్వానికి మధ్య వారధిలా కాకుండా అవరోధంగా నిలుస్తున్నాయని భావించాడు. పార్టీలు జాతీయాభిమానం కన్నా పార్టీ అభిమానాలే ప్రధాన ధ్యేయంగా పని చేయుచున్నాయని తన అసంతృప్తిని వ్యక్తం చేశాడు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరూ తమ వంతు పాత్రని సమర్థతతో పోషించగల స్థాయికి ఎదిగి దాని విజయానికి తమ సహకారాన్ని అందించగలగాలని ఆయన భావించాడు.

అధికార వికేంద్రీకరణ ప్రజాస్వామ్యానికి ప్రాథమిక సూత్రం. గ్రామ పంచాయితీకి వాస్తవ అధికారాలు, ఆర్థిక స్వాతంత్ర్యం ఉండాలని, రాజకీయ పార్టీలు పంచాయితీ ఎన్నికలలో జోక్యం చేసుకొనరాదని, ప్రజలు సమర్థులయిన వారిని తమ నాయకులుగా పార్టీలతో ప్రమేయం లేకుండా, ప్రత్యక్షంగా ఎన్నుకొనాలని, గ్రామ పంచాయితీలు కలసి పంచాయితీ సమితులను, పంచాయితీ సమితులు జిల్లా పరిషత్‌లను ఎన్నుకొనాలని, ప్రజల మద్దతు ఉన్నవారే నిజమయిన నాయకులని ఆయన అభిప్రాయం. ప్రజాస్వామ్య సమాజానికి సత్యసంధత అహింస, స్వేచ్ఛ, క్రూరత్వాన్ని ఎదిరించే ధైర్యం, సహకార స్వభావం, బాధ్యతల స్వీకారానికి సంసిద్ధత, ఇతరుల అభిప్రాయాలను గౌరవించగలగడం ఎంతయినా అవసరం. విద్య ద్వారా మానవ స్వభావాన్ని మార్చుకొనవచ్చునని ఆయన ప్రగాఢ విశ్వాసం. ప్రజల స్వయం పాలనని ఆయన సమర్థించాడు. కాని పార్టీలు లేకుండా ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రభుత్వ నిర్వహణ ఆచరణరీత్యా సాధ్యంకాదని జయప్రకాష్ నారాయణ్ గుర్తించాడు.

## 18.6 జయప్రకాష్ నారాయణ్ - ఆర్థిక భావాలు (Jayaprakash Narayan - Economic Views):

పాశ్చాత్య ఆర్థిక అభివృద్ధిని కాని, రష్యారీతిలో ఆర్థికాభివృద్ధిని గాని జయప్రకాష్ అంగీకరించకపోగా వాటిని నిశితంగా విమర్శించాడు. ఈ రెండు విధానాలలో మనిషి మనిషిగా గుర్తింపబడడం లేదని ఆయన భావించాడు. ఈ రెండింటిలోనూ భారీ పరిశ్రమలకే అత్యంత ప్రాధాన్యత యివ్వబడి మనిషిలోని సృజనాత్మకతని, నైపుణ్యాన్ని అణచి వేస్తున్నాయి. భారీ పరిశ్రమల ప్రోత్సాహం అధికార వికేంద్రీకరణకి దోహదం చేస్తుంది. ధనానికి, అధికారానికి యివ్వబడిన ప్రాధాన్యం మనిషికి యివ్వబడలేదు. కేవలం యంత్రంలోని భాగంగా మాత్రమే మానవుడు గుర్తింపుని పొందుతున్నాడు. భౌతిక వాదానికి, అధికార వికేంద్రీకరణకి వ్యతిరేకి అయిన జయప్రకాష్ భారీ పరిశ్రమలకు బదులుగా చిన్న చిన్న ఆర్థిక ఉత్పత్తి కేంద్రాలను గ్రామాలలో గాని, గ్రామ సముదాయాలలో గాని స్థాపించాలని సూచించాడు. స్థానిక ప్రజల అవసరాలను తీర్చడమే ఈ అధికార వికేంద్రీకరణ ప్రధాన లక్ష్యం కావాలి గాని, లాభార్జన కాకూడదని ఆయన భావించాడు. పోటీ తత్వాన్ని తగ్గించుకొని సహకార ప్రాతిపదికన ఈ ఆర్థిక విభాగాలు పని చేయాలి. శాస్త్ర సాంకేతిక విజ్ఞాన సహాయంతో ఈ పరిశ్రమలు నడవడంలో తప్పులేదని కాని శాస్త్రీయ విజ్ఞానం మనిషి ఆనందంగా జీవితం గడిపేందుకు దోహదపడాలి గాని కొందరి అధికారం లాభార్జన ధ్యేయంగా ఉండరాదు.

శాస్త్రీయ విజ్ఞానం వ్యాపార సరళి నుండి బైటకు వచ్చి మానవత మనుగడికి దోహదపడాలి. శాంతి, సుఖ సంతోషాలకు శాస్త్ర విజ్ఞానాన్ని వాడుకోవాలి కాని అధికారానికి, దానిని ఉపయోగించరాదు అని ఆయన ఉద్దేశ్యం. పరిశ్రమలను వికేంద్రీకరిస్తే గ్రామాలు స్వయం సమృద్ధిగా మనగలవని ఆయన నమ్మకం.

## 18.7 జయప్రకాష్ నారాయణ్ - సర్వోదయ (Jayaprakash Narayan - Sarvodaya):

1954లో పార్టీ రాజకీయాలను విడిచి పెట్టి బుద్ధగయలో జరిగిన సర్వమత సమ్మేళనానికి హాజరైనపుడు వినోబా భావే ప్రారంభించిన భూదాన ఉద్యమం పట్ల సర్వోదయ భావన పట్ల ఆకర్షితుడై సర్వోదయ ఉద్యమానికి తన జీవితాన్ని అంకితం చేశాడు. 'జీవన్ దాని'గా తనను తాను బహిరంగంగా ప్రకటించుకొని వినోబా సహచరునిగా సర్వోదయ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నాడు. సర్వోదయ భావన మొదటగా గాంధీజీది. దానిని మరింత వెలుగులోకి తెచ్చినది వినోబా భావే, మరియు జయప్రకాష్ నారాయణ్. సర్వోదయ ద్వారా సామ్యవాదాన్ని సాధించవచ్చునని ఆయన భావించాడు. రాజ్య సామ్యవాద స్థానే ప్రజల సామ్యవాదాన్ని ప్రతిపాదించాడు. రాజ్యం ద్వారా కాక ప్రజలు తమంతట తామే సామ్యవాదాన్ని సాధించాలని దానికి సర్వోదయ దోహదం చేస్తుందని భావించాడు. అధికార రాజకీయాలను సర్వోదయ ద్వేషిస్తుంది. అది పార్టీ పద్ధతిని, ప్రాతినిధ్య ప్రజాసామ్యమును వ్యతిరేకించి పంచాయితీల స్థాపన ద్వారా భూదాన, గ్రామ దాన ఉద్యమాల ద్వారా ప్రజలను చైతన్యవంతులుగా సాధించవచ్చునని ప్రభోదిస్తుంది. సర్వజనుల శ్రేయస్సే సర్వోదయ. వర్గ పోరాటాన్ని వ్యతిరేకిస్తుంది. మెజారిటీ వైఖరిని గాక ఏకాభిప్రాయసాధనకి ప్రాధాన్యమిస్తుంది. చర్చలు, వాదోపవాదాల ద్వారా పరస్పర సుహృద్భావాన్ని నెలకొల్పవచ్చునని ఆయన భావన. నిస్వార్థపరులయిన కార్యకర్తలతో జన బాహుళ్య జీవనాన్ని స్వయం సమృద్ధం చేయడం స్వయం నియంత్రణ, స్వయం ఆధారితంగా చేయగలగాలి. ప్రస్తుత సమాజం కొందరికే స్వర్గతుల్యం. అందువలన దానిని చిన్న చిన్న సముదాయాలుగా నిర్మించాలి. గాంధీజీ గ్రామ రాజ్యం వంటిది జయప్రకాష్ నారాయణ్ కూడా వివరించాడు. సర్వోదయ సిద్ధాంతం మాత్రమే అహింసాయుతమైనది. దీని ద్వారా సామాజిక విప్లవాన్ని తీసుకురాగల అవకాశం ఉంది. దీనిలో లక్ష్యాలు, సాధనాలు ఒకటిగానే ఉంటాయి. ఇది ప్రపంచానికి యింతవరకు అనుభవంలో లేనిది. కాని స్వాతంత్ర్య పోరాటంలో ఎన్నో నూతన భావాలతో విజయాన్ని సాధించిన భారతీయులకు ఇది కష్టం కాదని జయప్రకాష్ భావించాడు. సర్వజనుల అభివృద్ధి సర్వోదయ లక్ష్యం. అటువంటి సర్వోదయ సమాజంలో ఎవరూ ఎవరి వలనా దోపిడీకి గురికారు. అందరూ కలసి మెలసి అందరి సంక్షేమం కొరకు పని చేస్తారు. రాజ్యరహిత, వర్గ రహిత సమాజ స్థాపనే సర్వోదయ ధ్యేయం. యిక్కడే కారల్ మార్క్సుకి, జయప్రకాష్‌కి బేధం మనకి గోచరిస్తుంది. మార్క్స్ తన కమ్యూనిజమ్‌లో ధనిక, పేద వర్గాల మధ్య వర్గ పోరాటాన్ని గురించి వివరిస్తాడు. కాని జయప్రకాష్ వివరించిన సర్వోదయ సమాజంలో దోపిడీ చేసేవారు గాని, దోపిడీకి గురి అయ్యేవారు కాని

ఉండరు. అందరూ కలసి మెలసి శాంతియుతంగా జీవిస్తారు. ఒకరిని ఒకరు విమర్శించుకొనే బదులు ఒకరికొకరు సహకరించుకుంటారు. సర్వోదయ సమాజంలో భౌతిక సుఖాలకి, సంపదలకి ప్రాధాన్యమివ్వకుండా వారి వారి సంపదలను, వస్తువులను తోటివారితో పంచుకునే స్థాయిలో ఉంటారు. మహాత్ముని భావన అయిన నీతివంతమయిన రాజకీయాలు అన్నదానికి ప్రభావితుడైనప్పటికీ జయప్రకాష్ గాంధీజీ ధర్మకర్తృత్వ భావనని అంగీకరించలేదు. ధనికులు తమ ఆస్తికి ధర్మకర్తలుగా వ్యవహరించి పేదల సంక్షేమానికి తమ సంపదని వినియోగిస్తారన్న భావన పై ఆయనకు విశ్వాసం కలుగలేదు. సర్వోదయ అవగా స్వయం నియంత్రణ. మనిషి తన భౌతిక సౌకర్యాల పై నియంత్రణని అలవరచుకోకపోతే మానసిక శాంతికి దూరం అవుతాడని, నైతిక వ్యక్తిత్వ భావన పెంపొందించుకుంటే ఈ నియంత్రణ సాధ్యమవుతుందని ఆయన భావించాడు. ప్రతి వ్యక్తి తన కోసమే తానుకాక సమాజం కూడా మనదేనని దాని కోసం ఎంతో కొంత స్వసుఖం త్యాగం చేయాలని తాపత్రయపడి కృషి చేసిననాడు సర్వోదయ సమాజ స్థాపన సాధ్యపడుతుంది కాని అసాధ్యం మాత్రం కాదు అని ఆయన ఉద్దేశ్యం.

## 18.8 జయప్రకాష్ నారాయణ్ - సోషలిజం (సామ్యవాదం) (Jayaprakash Narayan - Socialism):

దాదాపు 24 సంవత్సరాలు జయప్రకాష్ నారాయణ్ సోషలిస్ట్‌గా పని చేశాడు. భారతదేశ సామ్యవాదులలో అగ్రగణ్యుడు.. సామ్యవాద ప్రచారకునిగా కూడా ఆయనకు పేరుంది. భారత స్వాతంత్ర్య సమరానికి సామ్యవాదమే నిజమయిన ఆధారమని ఆయన నమ్మకం. సమిష్టి యాజమాన్యం, భారీ ఉత్పత్తుల పై నియంత్రణను ఆయన కోరుకున్నాడు. రవాణా, షిప్పింగ్, గనులు భారీ పరిశ్రమలను జాతీయం చేయాలని ఆయన భావించాడు. ఆయన దృష్టిలో సామ్యవాదం ఒక సంపూర్ణ సామాజిక, ఆర్థిక పునర్నిర్మాణ కార్యక్రమం. అది వ్యక్తిగత నైతిక సిద్ధాంతం కన్నా ఉన్నతమైనది. గొప్ప, బీద తారతమ్యాలు క్రమేపీ అంతరించాలని, ఆర్థిక అవరోధాలు తొలగాలని, సమాజమంతా సామరస్యపూర్వకమైన సమతౌల్య ప్రగతిని సాధించడమే సామ్యవాద ధ్యేయం. జయప్రకాష్ నారాయణ్ సామ్యవాదంలో లక్ష్యాలు ఎంత ప్రధానమైనవో అవి చేసుకొనుటకు అనుసరించే మార్గాలు కూడా అంతే ప్రధానమయినవి. ప్రతి ఒక్కరి భౌతిక అవసరాలు తీరి మానవుడు నాగరికంగా జీవిస్తూ, స్వేచ్ఛ, ధైర్య సాహసాలు అలవరచుకొని దయార్థ హృదయుడుగా ఉండే సామ్యవాద సమాజం సాధించడానికి ఉన్నత మానవ విలువలు, క్రమశిక్షణ, నిబద్ధత ఎంతో అవసరమని జయప్రకాష్ ప్రకటించాడు. భౌతిక సిరి సంపదలు, ఉత్పత్తి నిత్యాభివృద్ధి చెందాలని, జీవన ప్రమాణం సదా పెరుగుతూ ఉండాలని సామ్యవాదం నొక్కి చెబుతుంది. ఉత్పత్తి సాధనాలన్నీ సమాజపరం చేయడం ద్వారా సామ్యవాదం స్థాపించవచ్చునని భావించాడు. భారతీయ సంస్కృతిలోని విలువలకు, సామ్యవాద విలువలకు తేడా లేదని ఆయన భావన.

భారతీయ సంస్కృతిలో తనకున్నది యితరులతో పంచుకోవడమనేది ఒక ఉన్నత ఆదర్శం. కాబట్టి సామ్యవాదం పాశ్చాత్య దేశాల నుండి దిగుమతి చేసుకొన్న భావన కాదని దాని మౌలిక ఆదర్శం భారతదేశంలో రూపొందినదేనని ఆయన భావించాడు. సామ్యవాదం ఆయనకు ఒక జీవన విధానం. అది ఆయన ఆచరించి చూపించాడు. మనిషి ఆర్థిక అవసరాలు తీరనిదే సాంస్కృతిక సృజనాత్మకత సాధ్యపడదని నమ్మిన వ్యక్తి. ఉత్పత్తి సాధనాలు కొద్దిమంది చేతులలో కేంద్రీకరించబడి ఉండడం వలననే పేదరికం, అన్యాయం సమాజంలో ప్రధాన సమస్యలయ్యాయని అభిప్రాయపడ్డాడు.

జయప్రకాష్ అసలు సిసలైన సామ్యవాది. సమాజంలోని పేద, బలహీన వర్గాల గురించిన చింతన, వారి సంక్షేమం పట్ల ధృడ సంకల్పం ఆయనకు మెండు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకి సమాన అవకాశాలు, ఆర్థిక అసమానతల తొలగింపు, ప్రయివేటు ఆస్తి రద్దు జరిగిన నాడు ఒక నవ సమాజం ఆవిర్భవిస్తుందని ఆయన ఆశించాడు. చాలా సంవత్సరాలు సామ్యవాద స్థాపనలో రాజ్యము యొక్క పాత్ర ప్రముఖమైంది అని జయప్రకాష్ విశ్వసించాడు. కాని క్రమేపీ రాజ్యం ఉపయోగించే బల ప్రయోగం పై విముఖత చూపించాడు. ఉన్నత ఆదర్శాలయిన స్వేచ్ఛా, సమానత్వం, న్యాయం, సోదర భావం, రాజ్య రహిత సమాజం మరియు పార్టీ రహిత ప్రజాస్వామ్యములో మాత్రమే సాధ్యపడతాయని ఆయన విశ్వసించాడు. ఆ విశ్వాసమే ఆయనను పార్టీ రాజకీయాలకు దూరంగా ఉండేటట్లు సర్వోదయ తద్వారా సామ్యవాద భావన వైపు ఆకర్షితుడయ్యేటట్లుగా చేసినది.

## 18.9 జయప్రకాష్ నారాయణ్ - సంపూర్ణ విప్లవం (Jayaprakash Narayan - Total Revolution):

భారతదేశ రాజకీయాలలో 1974వ సంవత్సరం ఒక ప్రత్యేకతను సంతరించుకొన్నది. జయప్రకాష్ సంపూర్ణ విప్లవానికి పిలుపు నిచ్చినది ఆ సంవత్సరంలోనే. గుజరాత్‌లోని రాజకీయ అస్థిరతకి వ్యతిరేకంగా విద్యార్థులు ప్రారంభించిన ఉద్యమం ప్రభుత్వాన్ని గద్దె దింపింది. బీహార్‌లో కూడా అదే తరహాలో ఉద్యమం ఆరంభమయింది. ఈ దేశ పాలనా వ్యవస్థను సమూలంగా మార్చాలన్న జయప్రకాష్ తపన రాజకీయ అవకాశవాదుల చేతులలో నలిపి వేయబడింది. కాని పట్టుదల, త్యాగ నిరతి మూర్తీభవించిన జయప్రకాష్ ఓర్పుతో నిరీక్షించి 1974లో బీహార్, గుజరాత్ విద్యార్థుల ఆందోళనలతో సంపూర్ణ విప్లవానికి సమయమాసన్నమయిందని భావించి తన సంపూర్ణ విప్లవ కార్యక్రమాన్ని ప్రకటించాడు. 1974లో జూన్ 5వ తేదీన పాట్నాలో 5 లక్షల మంది హాజరయిన విద్యార్థుల సభలో ఆయన మొదటిసారిగా ఈ సంపూర్ణ విప్లవం గురించి ప్రసంగించారు. ఆనాడు నెలకొని ఉన్న నిరంకుశ ప్రభుత్వ స్థితిని ప్రజాస్వామిక ప్రక్రియ ద్వారా మార్చలేమని విశ్వసించి తన 'ప్రిజన్ డైరీ' (Prison Diary) అన్న గ్రంథంలో ఈ విప్లవం గురించి వివరించాడు. విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ యిది 7 రకాల విప్లవాల కలయిక అని వివరించారు. సాంఘీక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, భావ సిద్ధాంత, విద్యా విషయక, ఆధ్యాత్మిక విప్లవాల కలయికే (సముదాయమే) సంపూర్ణ విప్లవం. హింసాత్మక పద్ధతుల ద్వారా కాక అహింస, శాంతియుత మార్గాల ద్వారా ఈ విప్లవాన్ని సాధించాలని యువతరానికి పిలుపునిచ్చారు. వ్యక్తిని, నివసిస్తున్న సమాజాన్ని సమూలంగా మార్చడమే ఈ విప్లవ ధ్యేయం. ఇది బహుముఖ మార్పును కోరుతుంది. మనిషి ఆలోచనా విధానంలోనే సమూల మార్పు తేవడమే దీని ప్రధాన లక్ష్యం.

1. **సాంఘీక పునర్నిర్మాణమే సాంఘిక విప్లవం:** గ్రామీణ వాతావరణంలో పుట్టి పెరిగిన జయప్రకాష్‌కి గ్రామస్థులలోని కుల తత్త్వం, ఆర్థిక అసమానతలు, విబేధాలు, ఆరోగ్యకర సమాజ నిర్మాణ కార్యక్రమములో అవరోధాలుగా ఉన్నాయని అనిపించి సాంఘిక, ఆర్థిక న్యాయ సమానత్వ సాధనకు విప్లవం అవసరం ఉందని భావించాడు. కుల వ్యవస్థ నిర్మూలన దానిలోని అసమానతల తొలగింపు జరిగిన నాడు సంఘ అసమానతలను, అన్యాయాలను అరికట్టవచ్చునని భావించాడు.

2. **సాంస్కృతిక విప్లవం (Cultural Revolution):** ప్రస్తుత సమాజం ఎన్నో మార్పులకు గురి అవుతోంది. మారుతున్న కాలానికనుగుణంగా మనిషి విలువలలో, తోటి వారిపట్ల అనుసరించే వైఖరిలో మార్పులు అత్యంతావశ్యకాలు. సమాజంలో బాహ్యంగా జరిగే మార్పులకు విలువ ఉండాలంటే సమాజం అంతర్గతంగా కూడా మార్పు చెందాలి. వ్యక్తుల అలవాట్లలోనూ, భావాలలోను మార్పు ఆదర్శ సమాజం కాంక్షిస్తుంది.

3. **విద్యా విప్లవం (Educational Revolution):** వ్యక్తి ప్రగతికి, సాంఘిక అభివృద్ధికి సమాజ ఉన్నతికి విద్య ఎంతో ముఖ్యమైనదని ఆయన భావించాడు. ఆనాడు దేశంలో అక్షరాస్యత చాలా తక్కువ స్థాయిలో ఉంది. కాబట్టి దానిని పెంచాలని, ఆ పెరుగుదల త్వరితగతిన జరగాలని ఆశించాడు. విద్యార్థులు తమ తీరిక సమయాలలో గ్రామాలకి తరలి వెళ్ళి అక్కడ నివసించి చదువుకొనే అవకాశం కరువైన నిరుపేదలకి విద్యావశ్యకతను వివరించి విద్యావ్యాప్తికి, విద్యాసక్తికి కృషి చేయాలని సూచించాడు.

యిక <u>**ఆర్థిక రంగంలో**</u> గ్రామాలన్ని స్వయం సమృద్ధి సాధించడానికి గ్రామస్తులందరూ కలసికట్టుగా కృషి చేయాలని సూచించాడు.

యిక <u>**రాజకీయ రంగంలో**</u> రాజ్యవ్యవస్థ పై ఆయనకు నమ్మకం తక్కువ. ప్రజల భాగస్వామ్యంతో నడిచే ప్రజాస్వామ్యం కోసం ఆయన కలలు కన్నాడు. కాని రాజ్య వ్యవస్థ నిర్మూలించడం సాధ్యపడదని గ్రహించిన జయప్రకాష్ రాజ్యం పరిమిత విధులను మాత్రమే కల్గి ఉండాలని భావించాడు.

ఈ విధంగా వ్యక్తిలోనూ, సమాజంలోనూ సమూలంగా మార్పులు వచ్చిననాడు ఆదర్శ సమాజం నిర్మితమవుతుందని సంపూర్ణ విప్లవం ద్వారా ఈ మార్పులు సాధ్యపడతాయని ఆయన నమ్మకం. హింసాత్మక పద్ధతుల ద్వారా కాకుండా అహింస శాంతియుత మార్గాల ద్వారానే సంపూర్ణ విప్లవం సాధించవలెనని ఆయన ఆశయం.

## 18.10 సారాంశము:

ప్రజా ఉద్యమాలే ఊపిరిగా జీవించిన కొద్దిమంది జాతీయ నాయకులలో జయప్రకాష్ నారాయణ్ ఒకరు. ఆయన ఒక భావుకుడు, ఆదర్శవాది. రాజకీయాలలో నైతికత ఆవశ్యకతను చాటిన మహనీయుడు. లోక్‌నీతి రాజనీతి కన్నా విశిష్టత కలది అని చెప్పిన నిస్వార్థ నాయకుడు. భారత రాజకీయ చరిత్రలో మొదటిసారిగా కాంగ్రెసు పార్టీని గద్దె దింపి జనతా పార్టీ ద్వారా దేశ రాజకీయాలలో క్రొత్త తరహా పాలనకి నాంది పలకడానికి ప్రయత్నించిన మహా మనిషి. ప్రతిఫలాపేక్షలేని జాతీయ నాయకుడు. సాత్త్విక విప్లవవాది. ప్రజలందరి చేత 'లోక్ నాయక్'గా కొనియాడబడిన ధన్యుడు. జయప్రకాష్ ఒక వ్యక్తి కాదని శక్తి అని అఖిల మానవాళికి ఆయన ప్రతీక అని వాజ్‌పాయి కొనియాడారు. సంపూర్ణ విప్లవం అన్నది ఆయన భారత సమాజ పునర్నిర్మాణానికి యిచ్చిన పిలుపు. అధికారం లేకపోయినా సమాజంలో మార్పులు తేవచ్చునని నిరూపించిన నాయకుడు. ఆయనది నైతిక విప్లవం. మనిషి భావనలో, నడవడిలో, మాటలలో, చేతలలో మార్పు. ప్రజలచే రెండవ మహాత్మునిగా సంబోధించబడ్డ నాయకుడు జయప్రకాష్ నారాయణ్.

## 18.11 నమూనా ప్రశ్నలు:

**(i) వ్యాసరూప ప్రశ్నలు:**

1. ఆధునిక రాజనీతి తత్త్వ చరిత్రలో జయప్రకాష్ నారాయణ్‌కు గల స్థానమెట్టిదో అంచనావేయుము.
2. 'భారత రాజకీయ చరిత్రలో నిస్వార్థ ప్రజా సేవకుడు జయప్రకాష్ నారాయణ్' చర్చించుము.

**(ii) లఘు వ్యాస ప్రశ్నలు:**

1. సామ్యవాదం పై జయప్రకాష్ భావములేమి?
2. జయప్రకాష్ రాజకీయ భావములను వివరించుము.
3. సర్వోదయ భావన గురించి వ్రాయుము.
4. సంపూర్ణ విప్లవ భావన వివరించుము.

## 18.12 చదువదగిన గ్రంథాలు:


1. H.H.Das, P.S.N. Patro - Indian Political Tradition
2. Dev Raj Bali - Modern Indian Thought
3. J.K. Bansal - Indian Political Traditions
4. V.P. Varma - Modem Indian Political Thought
5. తెలుగు అకాడమీ - రాజనీతి తత్త్వ విచారము


డా॥ టి.వి. లక్ష్మి

పాఠం - 19

# భారతరత్న భీమ్‌రావ్ రాంజి అంబేడ్కర్ (1891-1956)

## 19.0 లక్ష్యం

అస్పృశ్యతా నిర్మూలనకోసం, సాంఘిక సమానత్వం కోసం తుది శ్వాస వరకు పోరాడిన సాంఘిక విప్లవ వీరుడు, భరతమాత కన్న మరో జాతి రత్నం భారతరత్న డాక్టర్ భీమ్‌రావ్ రాంజీ అంబేడ్కర్. ఆయన జీవితం ఒక యదార్థ చరిత్ర. బురదలో పుట్టిన పద్మంలా, అస్పృశ్యతా మలినంలో పుట్టి, తన విజ్ఞాన సుగంధంతో నవ భారత రాజ్యాంగ నిర్మాతగా దేశ ప్రజలకు ఆయన అందించిన సేవలు ఆచంద్రార్కం స్తుతించబడుతూనే ఉంటాయి. ఆ ధన్యజీవి, బహుముఖ ఆలోచనలను వివరించడమే ఈ పాఠం యొక్క లక్ష్యం.

**విషయసూచిక :**


19.1. బాల్యం

19.2. విద్యాభ్యాసం

19.3. సాంఘిక పోరాటాలకు శ్రీకారం

19.4. లా మినిష్టర్ - రాజ్యాంగ చట్ట నిర్మాత

19.5. నిమ్నజాతుల అభివృద్ధికై డా॥ అంబేడ్కర్ ఏర్పాటు చేసిన సౌకర్యాలు - రక్షణలు

19.6. రచించిన గ్రంథాలు

19.7. సారాంశము

19.8. నమూనా ప్రశ్నలు

19.9. చదువదగిన గ్రంథాలు


## 19.1. బాల్యం :

సమత కోసం, మమత కోసం, అంటరానితనం నిర్మూలన కోసం, మానవ హక్కుల సాధన కోసం, తనతుది శ్వాస వరకు రాజీలేని పోరాటం సలిపిన సాంఘిక విప్లవవీరుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి, గొప్పమేధావి నవ భారత రాజ్యాంగ నిర్మాత, నిజమైన దేశభక్తుడు, నిమ్నజాతుల విమోచకుడు, అభినవ బుద్ధుడు, రాజ్యాంగ కోవిదుడు, ఆదర్శ రాజకీయ నాయకుడు, పరిపాలనా దక్షుడు, స్త్రీ జనోద్ధారకుడు, బహుగ్రంథ పాఠకుడు, బహుగ్రంథకర్త, గొప్ప వక్త, మానవ హక్కుల యోధుడు, మహోన్నత మానవతావాది, భారతరత్న డాక్టర్ భీమ్‌రావ్ రాంజీ అంబేడ్కర్, మహారాష్ట్రలో, అంబవాడ గ్రామంలో మహర్ అనే అంటరాని కులంలో, రాంజీ సక్పాల్, భీమాభాయి దంపతులకు 14వ సంతానంగా 14-04-1891 న జన్మించాడు. అంటరానితనం మనువాదం సృష్టి. అంటరాని తనం ప్రబలంగా ఉన్న ఆ రోజుల్లో, అంటరాని కులంలో పుట్టడం వలన బాల్యం నుండి, మరణించేవరకు ఎన్నో చేదు అనుభవాలను ఎదుర్కొన్నాడు. అంటరాని తనం హిందూ మతానికి మాయని మచ్చ. మానవ సమానత్వానికి, స్వేచ్ఛకు, మానవ హక్కుల సిద్ధాంతానికి వ్యతిరేకమైనది అంటరాని తనం. హేతువాదానికి తర్కానికి నిలువలేనిది అంటరానితనం.

**హిందూ వర్ణ వ్యవస్థ :** భారతదేశంలోని సామాజిక వ్యవస్థ అతి ప్రాచీనమైనదని చారిత్రక పరిశోధకులు వివరించారు. భారతదేశంలో ఉత్తర, దక్షిణ ప్రాంతంలో నివసించిన ఆదిమ సంతతివారు ద్రావిడులు. ఆనాటి భారతీయ సామాజిక వ్యవస్థలో కులాలు లేవు.

కొన్నాళ్ళ తర్వాత మధ్య ఆసియా, మధ్య ఐరోపా ప్రాంతం నుండి దృఢకాయులు, తెల్లని వర్ణం, అందంగా, అర్ధనగ్నంగా, త్రాగుతూ, గంతులు వేస్తూ తిరిగే ఆర్యులనే జాతివారు, ఉత్తర భారత ప్రాంతంపై గుంపులుగా వచ్చి దండయాత్ర జరిపారు. వారి వద్ద నున్న పదునైన ఆయుధాలతో, స్థానికులైన ద్రావిడులపై దాడిచేసి కొంత మందిని చంపి, కొంత మందిని తరిమివేసారు. కొంత మంది భయంతో లొంగిపోయారు. ఈ సంఘర్షణలు సద్దుమణిగిన తర్వాత ఆర్య ద్రావిడ సమ్మేళనంతో ఒక వినూత్న సామాజిక వ్యవస్థ దేశమంతటా ఏర్పడింది.

ఈ నూతన సామాజిక వ్యవస్థలో వృత్తి విభజన ప్రారంభమై కొంత కాలానికి వంశపారంపర్యమైన వర్ణ వ్యవస్థకు దారి తీసింది. వర్ణ వ్యవస్థ మనుధర్మ శాస్త్రం ద్వారా మరింత బలపడింది. దీనికి పవిత్ర మత గ్రంధాలను ప్రామాణికంగా చేసారు. వర్ణ వ్యవస్థ వలన బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య అనే మూడు వర్ణాలు ఏర్పడ్డాయి. అయితే వృత్తుల పంపకంలో కీచులాటలు ప్రారంభమైనాయి, ఇవి ముందుగా బ్రాహ్మణులలో ప్రారంభమై, చివరకు ఒక వర్గం దైవారాధకులుగా మరొక వర్గం పరిపాలకులు (మంత్రులు)గా ఉండటానికి రాజీపడ్డారు. క్షత్రియులను, దేవుళ్ళుగా తయారుచేసారు. పరిపాలన చేసే అధికారం క్షత్రియుల్లో కొందరికి మాత్రమే కేటాయిస్తూ వైదిక శాసన కర్తలు తీర్మానించారు. మిగిలిన వారు సైన్యాధిపతులుగా, దుర్గాధిపతులుగా లేదా సైనికుల్లా విధులు నిర్వహించే ఏర్పాటు చేసారు. ఈ వైదిక నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బ్రాహ్మణాధికత్యతపై తిరుగుబాటు చేసిన క్షత్రియులంతా కులభ్రష్టులై శూద్రులుగా మారిపోయారు. ఈ శూద్రులే నాలుగవ వర్ణంగా మారారు. రాను రాను వర్ణ వ్యవస్థ కుల వ్యవస్థగా రూపుదిద్దుకుంది. ఎన్నో ఉప కులాలు పుట్టుకొచ్చాయి. కత్తి పట్టిన వాడిదొక కులమైతే ఆ కత్తిని తయారుచేసే వాడిదొక కులమైంది. పశువులు మేపే వాడిదొక కులమైతే, గొర్రెలు మేపేవాడిది ఇంకో కులమైంది. మట్టి పాత్రలు చేసే వాడిదొక కులమైతే, ఇనుముతో పనిముట్లు తయారు చేసేవాడిది మరో కులం, బంగారు, వెండి ఆభరణాలు తయారు చేసే వాడిది వేరేకులంగా, కుమ్మరి, కమ్మరి, కంసాలి మొదలైన ఉప కులాలు ఏర్పడ్డాయి. అయితే మను ధర్మ సూత్రాన్ని, ఆర్యుల ఆధిక్యతను, నిర్బంధ వృత్తి విధానాన్ని వ్యతిరేకించిన మరి కొందరిని అంత్యజులుగా వెలివేయటం జరిగింది. సంఘాన్నుండి వెలివేయబడిన ఈ అంత్యజులు బుద్ధుని బోధనలకు ఆకర్షితులై బౌద్ధం స్వీకరించగా, అందుకు ఆగ్రహించిన మనువాద వైదిక నాయకత్వం వీరిని అంటరాదనీ, చూడరాదనీ, చేరరాదనీ త్రివిధ బహిష్కారం చేసినట్టు పరిశోధనల వలన స్పష్టమైనది. ఈ విధంగా అంటరానితనం, తత్ఫలితంగా అంటరాని కులాలను తయారు చేసింది మనువాద నాయకత్వం.

**అస్పృశ్యతా దురాచారం :** అంబేడ్కర్ పుట్టిన రోజుల్లో అంటరానితనం దేశంలో కరాళ నృత్యం చేస్తుంది. కొంత మంది హిందూ మతానికి చెందినవారినే, సాంఘికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వేరు చేసి వారికి నీచమైన వృత్తులను కేటాయించి, వారు ఆ వృత్తులే చేయాలని మనువాదులు తీర్మానించడం అస్పృశ్యత సారాంశం. విచిత్రమేమంటే హిందువులే సాటి హిందువులను వెలివేయటం. అంటరానివారు స్వేచ్ఛగా సంచరించరాదు. అగ్ర వర్ణాలవారు నివసించే వీధుల్లో సంచరించరాదు. వారి గృహాల్లోకి ప్రవేశించరాదు. వారు మిగిలిన కులాలు వారు ఉపయోగించే చెరువులు, బావుల్లో నీళ్ళు ఉపయోగించరాదు. పక్షులు, పశువులు స్వేచ్ఛగా వెళ్ళి చెరువుల్లో స్నానం చేసి, నీళ్ళు తాగుతాయి. కాని అంటరానివారు మాత్రం ఆ నీటిని వాడరాదు. వారికి దేవాలయ ప్రవేశం లేదు. పాఠశాలల్లో ప్రవేశం లేదు. హిందూ రాజులుకాని, ముస్లిం పాలకులు కాని వారు అనుభవిస్తున్న ఈ సాంఘిక వివక్షను రూపుమాపటానికి ప్రయత్నం చెయ్యలేదు. అందుకే అంబేడ్కర్ అంటాడు "మహాత్ములు వచ్చారు, వెళ్ళారు కాని అంటరానివారు మాత్రం అంటరానివారుగానే మిగిలిపోయారు." ఏ దేవుడూ, ఏ పాలకుడు వీరిని ఉద్ధరించలేదు. వారికి మిగిలిన కులాల వారితో కలసిమెలసి జీవించే అవకాశమే లేదు. ఇలాంటి అనాగరిక ఆచారం మరెక్కడా కనిపించదు. వారు మానవ రూపంలో వున్న పశువులకన్నా హీనమైన వింత జంతువులు. ఎందుకంటే హిందువులు ఆవుల్ని, దూడల్ని, మేకల్ని, కుక్కల్ని, పిల్లుల్ని ఎత్తుకొని ప్రేమతో పెంచుతారు. కాని సాటి మనుషులను తరిమికొడతారు, ఛీదరించుకొంటారు. వారు మనుషులే కాని మానవ హక్కులు లేని మనుషులు, వారు కేవలం అగ్రవర్ణాల వారి పొలాల్లో వ్యవసాయ పనులు చేస్తూ, పశువులను మేపుతూ, వారి పశువుల శాలలను పరిశుభ్రం చేస్తూ, పశువుల చర్మంతో చెప్పులు కుడుతూ, వీధులు శుభ్రం చేస్తూ శవాలను కాలుస్తూ, నీచమైన వృత్తులను చేస్తూ అగ్రవర్ణాలవారు దయతో ఇచ్చిన తృణమో, ఫణమో తీసుకోవాలి తప్ప వారిని డిమాండ్ చేయ్యకూడదు.

అలా ఎవరైనా ప్రవర్తిస్తే వారిని చెట్టుకు కట్టి కొరడాలతో కొట్టి చంపవచ్చు. ఇదే మనువాదం, మనుధర్మ సిద్ధాంతం. ఈ అంటరాని వారే ఐదవకులస్తులు, లేదా పంచములు. ఈ అంటరానితనం మానవ హక్కుల ప్రకటనకు విరుద్ధం. ఎందుకనగా మానవహక్కుల ప్రకటన మొదటి ప్రకరణం ప్రకారం.

"All human beings are born free and equal in dignity and rights. They ar endowed with reason and conscience and act towads one another in a spirit of brotherhood".

మానవులందరూ స్వేచ్ఛగా పుట్టినందువలన హక్కులు, గౌరవంలో సమానం, వారిలో వివేకం ఉన్నందు వలన ఒకరిపట్ల మరొకరు సోదర భావంతో మెలగాలి" అని తెలియచేస్తుంది. కాని మానవ హక్కుల ప్రకటనకు జీవంగా భావించే, మానవుల మధ్య సమాన గౌరవం, సమాన హక్కులు, సోదర భావం, భారత దేశంలో మచ్చుకైనా కనిపించవు. అసమానత్వమా నీ పేరే హైందవం. సమాజాన్ని నిచ్చెన మెట్లగా విభజించి, హెచ్చు, తగ్గులు, అగ్రకులాలు, శూద్రకులాలు, అంటరానివారు అంటూ మనుషులను వేరు చేసే హైందవ సంస్కృతి మనుష్యులను ఏక జాతిగా జీవించనివ్వలేదు. ఇలాంటి భయంకర వాతావరణంలో ఒక అంటరాని కులంలో జన్మించిన అంబేడ్కర్ ఈ జాడ్యం ఫలితంగా చిన్న నాటి నుండే ఎన్నో అవమానాలు పొందాడు, కష్టాలు పడ్డాడు. అంబేడ్కర్, ఆయన సోదరుడు కూర్చోవటానికి ప్రతిరోజూ గోనె బస్తాలు ఇంటి నుండి స్కూలుకు మోసుకువెళ్ళేవారు. ఇతర విద్యార్థులతో వారు కలసి కూర్చోకూడదు, ఆటలు ఆడకూడదు, మంచినీళ్ళు తాగకూడదు, మైలపడిపోతామనే భయంతో ఉపాధ్యాయులు వారి నోటు పుస్తకాలు కూడా పరిశీలించేవారు కాదు. వారు హోమ్‌వర్క్ చేసినా వాటిని చూసేవారు కాదు. కేవలం జన్మవల్లనే, అంటే పుట్టుకవల్లనే ఇలాంటి అవమానాలు పడవలసి వస్తుందనేది అంబేడ్కర్‌లో చిన్ననాటి నుండే అర్థమయ్యింది. ఒక వ్యక్తి స్థాయిని, హోదాను, అతని సామర్థ్యం, విద్యతో బట్టి కాక అతని పుట్టుకను బట్టి, కులాన్ని బట్టి నిర్ధారించే అవివేకమైన దురాచారం హైందవ సమాజంలో శతాబ్దాల తరబడి కొనసాగుతున్నా దాన్ని ఎదిరించి, ఖండించినవారు చాలా తక్కువ. సమర్థించి, పాటిస్తున్న వారే నాటికి, నేటికి అధిక సంఖ్యలో ఉండటం దురదృష్టం. ఈ దురాచారాన్ని, ఎదిరించి, తన తుది శ్వాస వరకు పోరాడిన యోధుడు, విప్లవనేత, మహోన్నత మానవతావాది, ఒకే ఒక్కడు ఆయనే డాక్టర్ భీమ్‌రావ్ రాంజీ అంబేడ్కర్.

భారతదేశంలో శూద్రకులాలకు, అంటరాని వారికి, పాఠశాలలు స్థాపించి, గ్రామాలలో, పేటల్లో, బడుగు, బలహీన వెనుకబడిన దళిత వర్గాల ప్రజలకు విద్యా సుగంధాన్ని అందించిన ఖ్యాతి నిస్సందేహంగా ఆంగ్లేయులదే. ముఖ్యంగా ఆంగ్లేయుల పాలనలో క్రైస్తవ మిషనరీలు అస్పృశ్యులు నివసించే పేటల్లోకి పాకల్లోకి వెళ్ళి, వాళ్ళను ఆప్యాయంగా పలకరించి, అంటుకొని వారితో తెల్లదొరలు, దొరసానులు మాట్లాడుతుంటే అదొక గొప్ప అనిర్వచనీయమైన అనుభూతి. శతాబ్దాల తరబడి ఈ దేశంలో జీవిస్తున్నా, ఒక్కనాడుకూడా, ఒక బ్రాహ్మణుడు కాని, ఒక క్షత్రియుడు కాని తమ పేటల్లోకి రాలేదు. వచ్చి తమ పరిస్థితి తెలుసుకోలేదు. తమ కష్టాలు తీర్చే ప్రయత్నం చెయ్యలేదు. పైగా వీళ్ళను అస్పృశ్యులను చేసి, ఊరికి దూరంగా, చీకటిలో దరిద్రంలో, సహజీవం లేకుండా చేసింది బ్రాహ్మణులే కదా. వారి తీర్మానాలను అమలు చేసేది పాలకులైన క్షత్రియులే కదా. మరి కంచే చేను మేస్తే, న్యాయాన్ని, ధర్మాన్ని పరిరక్షించవలసిన వారే ఆంక్షలు విధిస్తే ఏం చెయ్యాలి ? కాని ఆంగ్లేయుల కాలంలో పరిస్థితి మారింది. శతాబ్దాల తరబడి అస్పృశ్యులుగా, సంఘ బానిసలుగా, కనీస మానవ హక్కులు, గౌరవం లేకుండా సాటి హిందువుల ద్వారా పలు అవమానాలు, కష్టాలు అనుభవిస్తున్న, ఈ జాతుల వారిని క్రైస్తవ మతంలోకి చేర్చుకొని వారికి విద్యా బోధనతో పాటు నాగరికతా సంస్కృతులను నేర్పించి క్రైస్తవ మిషనరీలు మాత్రమే. వేదాలను చదవటానికి, వినటానికి నోచుకోని సుబ్బయ్య క్రైస్తవ మతం స్వీకరించి, సాల్మన్‌గా పేరుమార్చుకొని, చదువుకొని పంతులు ఉద్యోగం చేస్తూ, చర్చిలో తెల్లదొరలతో కలసి ప్రార్థన చేసుకోనటం మొదలుపెట్టాడు. రామయ్య రాబర్ట్‌గా, మంగమ్మ మేరీగా మారారు. ఇలా అనేక వేల మంది అస్పృశ్యులు క్రైస్తవ మతం స్వీకరించి, ఆంగ్ల భాష నేర్చుకొని ప్రావీణ్యత సంపాదించి, మంచి ఉద్యోగాలు చేస్తూ, స్వేచ్ఛగా, గౌరవంగా జీవించడం మొదలుపెట్టారు. ఈనాటికి ఈ మత మార్పిడులు నిరంతరంగా కొనసాగటానికి, హిందూ మతంలోని కుల వ్యవస్థ, కుల వివక్షే కారణమనేది అక్షరసత్యం.

## 19.2 విద్యాభ్యాసం :

1896లో అంబేద్కర్‌కు సుమారు 5 సంవత్సరాల వయస్సులో ఆయన తండ్రి దపోలి అనే గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో చేర్పించడంతో, అంబేద్కర్ విద్యార్థి జీవితం ప్రారంభమైంది. తర్వాత సతారా అనే గ్రామానికి మకాం మార్చడంతో అంబేద్కర్ ప్రాథమిక విద్య సతారా గ్రామంలో పూర్తయ్యింది.

ప్రాథమిక విద్య పూర్తయిన తర్వాత, బొంబాయిలోని మరాఠా ఉన్నత పాఠశాలలో చేరాడు. బొంబాయిలో అంబేద్కర్ కుటుంబం చాలా చిన్నగదిలో నివసించేవారు. అన్నీ ఆ చిన్నగదిలోనే చేసుకోవాలి. అందువలన చదువుకోవటం చాలా కష్టంగా ఉండేది. దానితో తండ్రి సక్పాల్ కొడుకుకోసం చిన్న ఏర్పాటు చేసాడు. రాత్రి పూట అంబేద్కర్‌ని భోజనం ముగించిన వెంటనే పడుకోమనేవాడు. అర్థరాత్రి వరకు తండ్రి మేల్కొని ఇంటిలోను చుట్టు ప్రక్కల వాతావరణం సద్దుమణిగిన తర్వాత అర్థరాత్రి దాటిన తర్వాత అంబేద్కర్‌ను నిద్రలేపేవాడు. పడుకోవలసిన సమయంలో పాపం పసిబాలుడు నిద్రలేచి, ముఖం కడుక్కొని, తండ్రిని పడుకోమని తాను తెల్లారేవారకు చిన్న కిరోసిన్ దీపం వెలుగులో చదువుకొనేవాడు. అంబేద్కర్‌కు, భాగ్యవంతుల పిల్లల్లా, చదువుకోవటానికి ప్రత్యేకమైన గది, ఒక కుర్చీ, టేబుల్, విద్యుత్ దీపం, సరైన పుస్తకాలు, బట్టలు ఉండేవి కావు. ఇప్పటి మాదిరిగా ఆయనకు హాస్టలు వసతి కాని, స్కాలర్ షిప్‌కాని లేదు. అయినప్పటికి చదువులో ఆయన విజయవంతంగా ముందుకు దూసుకుపోయేవాడు. చదువంటే ఆయనకు ప్రాణం. చదువుకొని, విజ్ఞానవంతుడై, తన జాతి వాళ్ళనుభవిస్తున్న సాంఘిక దాస్యం నుండి విముక్తం చెయ్యాలని, తాను విముక్తి పొంది మనుషుల్లా గౌరవంగా అందరితో కలిసిమెలిసి జీవించాలని ఆ పసి హృదయం, ఆ అమాయక మనస్సు ఎన్నో కలలు కనేది.

అంబేద్కర్‌కు బాల్యంలో తగిలిన కొన్ని ఎదురుదెబ్బలు, చేదు అనుభవాలు ప్రస్తావించకుండా ఆయన సాంఘిక పోరాటాల గురించి కానీ, ఆయన రాజ్యాంగ రచన ద్వారా నిమ్న జాతులకు సాధించిన రాయితీల గురించి కాని వివరించడం అన్యాయమౌతుంది.

అంబేద్కర్ విద్యార్థిగా ఉన్నప్పుడు చాలా చురుకుగా, తెలివిగా ఉండేవాడు. హైస్కూల్లో, ఒక రోజు గణితం బోధించే అధ్యాపకుడు ఒక లెక్కను, బోర్డుపై చేసి చూపవలిసిందిగా క్లాసులో విద్యార్థులను కోరతాడు. ఏ ఒక్కరూ ఆ లెక్క చెయ్యలేకపోయారు. చివరిగా, ఉపాధ్యాయుడు అంబేద్కర్‌ని పిలిచి లెక్కచేయమని కోరాడు. అంబేద్కర్ ఆనందంతో లేచి లెక్క చేయటానికి బోర్డు వైపుకు రావటం మొదలుపెట్టాడు. అంతే క్లాసులో ఒక్కసారిగా కలకలం మొదలైంది. అంబేద్కర్‌ని వెళ్ళవద్దని పిల్లలంతా కేకలు వేయటం మొదలుపెట్టారు. కారణం ఏమిటని అధ్యాపకుడు వివరణ కోరగా, బోర్డు వెనుక తాము తెచ్చుకున్న భోజనం కేరేజీలు ఉన్నాయని, అస్పృశ్యుడైన అంబేద్కర్ అటుగా వెళితే అతని గాలి సోకితే భోజనాలు మైలపడిపోతాయని, దానితో తాము భోజనాలు పారవేసి, రోజంతా పస్తుతో స్కూలులో గడపాలని చెప్పారు. దానితో అంబేద్కర్ గత్యంతరంలేక, తాను లెక్క చేయగలిగి ఉండికూడా వెనుదిరగవలసి వచ్చింది. అయితే ఇక్కడ గమనించవలసింది ఏమనగా ఒక అంటరాని వాని గాలి సోకితే పదార్థాలు నిజంగా మైలు పడిపోతాయా ? ఆ పసి హృదయాలలో అలాంటి ద్వేషం, వివక్షతో కూడిన భావాలు తల్లిదండ్రులు ఎందుకు నూరిపోసారు. దానికి కారణం మనువాద ధర్మం ప్రకారంగా నడిచే కులతత్వం. ఈ దేశంలో కూటికి పేదలు కావచ్చునేమోకాని కులానికి పేదలుకాదనే సామెత ఉండనే ఉందికదా. మరి ఈ సంఘటనతో అంబేద్కర్ పసి మనసు ఎంత విలవిల్లాడి ఉంటుందో కదా ?.

స్కూల్లో అంబేద్కర్ ఇతర పిల్లలతో కలిసి కూర్చోరాదు. కలిసి ఆడుకోరాదు, వారు త్రాగే కుండలో నీరు త్రాగరాదు. తనకు దాహం వేస్తే, ఎవరినైనా నీళ్ళు పొయ్యమని అడగాలి. అప్పుడు దయతలచి ఏ పిల్లవాడైనా ఒక చిన్న పాత్రలో నీళ్ళు పోస్తుంటే, దోసిలిపట్టి నీళ్ళు త్రాగాలి. ఈ వేద భూమిలో, పుణ్య భూమిలో ఇలాంటి ఉదంతాలు కోకొల్లలు. స్కూల్లో పరిస్థితి ఇలా వుంటే సమాజంలో పరిస్థితి ఎలావుందో మరో సంఘటన ద్వారా తెలుసుకుందాం. ఒక రోజున అంబేద్కర్, ఆయన సోదరుడు దూరంగా ఉన్న తమ బంధువుల ఇంటికి వెళుతున్నారు. ఆ రోజుల్లో ఈనాడున్న, సైకిళ్ళు, రిక్షాలు, ఆటోల వంటి రవాణా సదుపాయాలు లేవు. వెళితే నడిచివెళ్ళాలి, లేదా ఎడ్లబండ్లపై వెళ్ళాలి. పిల్లలు చిన్నవాళ్ళు, దానితో కొంత దూరం ప్రయాణం చేసాక కాళ్ళు పీకడం మొదలుపెట్టాయి. అంతలో ఒక ఎడ్ల బండి ఆదారినే పోవటం గమనించి పిల్లలిద్దరూ బండివాడితో బేరం కుదుర్చుకున్నారు. పిల్లలిద్దరు శుభ్రమైన బట్టలు వేసుకొని, హుషారుగా, చూడముచ్చటగా ఉండటంతో బండివాడు పిల్లల వివరాలు అడగకుండానే బండి ఎక్కమన్నాడు. పిల్లలిద్దరూ సంతోషంతో బండి ఎక్కారు.

కొంత దూరం ప్రయాణించాక నిరక్షరాస్యుడైన బండివాడు పిల్లలను వివరాలు అడిగాడు. ముందు పేరు, ఊరు, తర్వాత ఏం కులం అని అడిగాడు. పిల్లలు తమది మహర్ కులమని చెప్పారు. అంతే బండివాడు తనపై పిడుగుపడినట్లుగా చలించిపోయాడు. పెద్దగా కేకలు వేస్తూ, పిల్లలను నానా బూతులు తిడుతూ ఒక్కసారిగా పిల్లలను బండిలో నుండి క్రిందకు తోసివేసాడు. బండిపై నుండి క్రిందకు దిగి అంటరాని వెధవల్లారా, మీరు మహర్‌లని బండి ఎక్కే ముందు ఎందుకు చెప్పలేదు, మీవల్ల నా బండి మైలబడిపోయింది. దానికి ప్రాయశ్చిత్తంగా మీరు నాకిస్తానన్న డబ్బులకు రెట్టింపు డబ్బులు చెల్లించి నా బండి తోసుకుంటూ రండి అని గర్జించాడు. అభం శుభం తెలియని అంటరాని పిల్లలు వాడు చెప్పినట్లే చేసారు. ఇది ఒక చేదు అనుభవం. అంటరానివాడు ఎడ్ల బండి ఎక్కితే మైల పడిపోతుందా? ఏమో అది మనువాదులకే తెలియాలి.

బండివాడు ఆదేశించినట్లుగా బండితోసి, తోసి, బండివాడు గమ్యం చేసిన తర్వాత, నిరసించిన పిల్లలిద్దరూ, ఒక ఇంటి వద్దకు వెళ్ళి దాహం వేస్తుం కొంచెం నీళ్ళు పోయమని అడిగారు. మీరేముట్లు అంటే మీదే కులమని అడిగాడు ఇంటి యజమాని. మహర్ అన్నారు పిల్లలు. యజమాని నుండి, బండివాడి మాదిరిగానే కేకలు వినిపించాయి. అంటరాని వెధవల్లారా మీకు నేను నీళ్ళు పోయ్యాలిరా అంటే, ఆ ప్రక్కనే వున్న మురికి గుంటను చూపించి దానిలో నీళ్ళు త్రాగమని గద్దించాడట. ఎంత దయామయుడో కదా ఆ ఇంటి యజమాని. ఇలాంటి సంఘటనలు ఎన్నో, ఎన్నెన్నో అంబేద్కర్ పసిమనసును గాయపరిచాయి. బాలుడిలో పట్టుదల పెరిగింది. పెరిగి, పెద్దవాడై, పెద్ద చదువులు చదివి ఈ అన్యాయాన్ని ఎదిరించి సాంఘిక న్యాయం, సమానత్వం, స్వేచ్ఛ, గౌరవం పొందాలని దృఢ దీక్ష బూనాడు. అందువల్లనే పట్టుదలతో చదివి హైస్కూలు విద్యలో ఉత్తీర్ణుడయ్యాడు. 'కృషితో నాస్తి దుర్భిక్షం' విద్యకు లేదు కులం అని నిరూపించాడు.

హైస్కూలు విద్యలో పాసయిన తర్వాత వెంటనే మెట్రిక్యులేషన్‌లో చేరి 1907లో మెట్రిక్యులేషన్ పరీక్షలో ఉత్తీర్ణుడయ్యాడు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా సాంఘిక సంస్కరణ ఉద్యమాలు నడిపిన అంబేద్కర్ బాల్య వివాహ బాధితుడు కావటం ఆనాటి సంప్రదాయాలను వారి తండ్రి కూడా పాటించడమే. మెట్రిక్యులేషన్ పరీక్షలో ఉత్తీర్ణుడైన వెంటనే, ఉత్తమురాలు, తొమ్మిది సంవత్సరాల బాలిక భీమా భాయిని వివాహమాడాడు. వివాహమైన పిమ్మట, బొంబాయిలోని ఎలిఫిన్‌స్టన్ కాలేజీలో F.A. (Fellow of Arts) క్లాసులో చేరి మంచి మార్కులతో ఉత్తీర్ణుడైనాడు. కళాశాలలో చేరి డిగ్రీ చదవాలని ఉత్సాహపడటం మొదలుపెట్టాడు. కాని ఆయన కుటుంబ ఆర్థిక పరిస్థితి అందుకు అనుకూలంగా లేదు. అలాంటి గడ్డు పరిస్థితుల్లో ఆపద్బాంధవుడుగా అంబేద్కర్‌ను అధ్యాపకుడు, సంఘసంస్కర్త అయిన క్రిష్ణాజీ అర్జున్ కేట్లాస్కర్ పండిట్ ఆదుకున్నాడు. అంబేద్కర్‌లో గల తెలివి తేటలు, మేధస్సు కేటాస్కర్ పండిట్ గ్రహించి, ఆయనను, బరోడాను మహారాజు, ధర్మదాత, విద్యాదాతయైన శాయాజీరావు గైక్వాడ్ వద్దకు తీసుకువెళతాడు. గైక్వాడ్ మహారాజు, అంబేద్కర్‌ను కొన్ని ప్రశ్నలు అడుగుతాడు. ఆ ప్రశ్నలకు అంబేద్కర్ ఇచ్చిన సమాధానాలను సంతృప్తి చెంది నెలకు ఇరవై ఐదు రూపాయల ఉపకార వేతనాన్ని మంజూరు చేస్తాడు. ఈ సంఘటన అంబేద్కర్ జీవితంలో పెద్ద మలుపు. ఎందుకంటే గైక్వాడ్ మహారాజు అంబేద్కర్‌కు ఉపకార వేతనం మంజూరు చేసి ఉండకపోతే, అంబేద్కర్ చదువు అంతటితో ఆగిపోయి ఉండేది. ఆయన ఏదో చిరు ఉద్యోగం చేసుకుంటూ జీవనం గడిపి ఉండేవాడు. దళితులు మరికొన్నాళ్ళపాటు సాంఘిక దాస్యంలో కొనసాగేవారు. వేరొకరు భారత రాజ్యాంగ రచన చేయవలసి వచ్చేది. అందుకే రాజాగారి ఉపకారం వృధా కాలేదు. అంబేద్కర్ కాలేజీలో చేరి 1912లో బి.ఎ. డిగ్రీలో మంచి మార్కులతో ఉత్తీర్ణుడౌతాడు. ఈ సంఘటన అంటరానివారికి గొప్ప పండుగ వాతావరణం తెచ్చిపెట్టింది. ఎందుకంటే ఆ రోజుల్లో ఒక అంటరానివాడు బి.ఎ. డిగ్రీలో ఉత్తీర్ణుడు కావటం ఒక అద్భుతం. నిజమే అన్ని సౌకర్యాలు ఉన్న ఈ రోజుల్లోనే పిల్లలు సరిగా చదవలేకపోతున్నారే అలాంటిది ఏ సౌకర్యాలు లేని అప్పటి రోజుల్లో అంబేద్కర్ బి.ఎ. పాసవటం అద్భుతమే కదా !

ఆ రోజుల్లో భారతదేశంలో డిగ్రీ వరకే చదువుకొనే అవకాశం ఉండేది. యూనివర్సిటీ విద్య అనగా ఉన్నత విద్య చదవాలంటే, లండన్ లేదా అమెరికా వెళ్ళి చదువుకోవాలి. డిగ్రీ పాసయిన తర్వాత విదేశాలకు వెళ్లి పెద్ద చదువులు చదవాలని ఎంతో ఆశపడ్డాడు అంబేద్కర్. కాని ఒక అంటరాని వానికి అదెలా సాధ్యం. రెండు పూటలా తినటానికే తిండి లేని వాడికి ఉన్నత చదువుకు డబ్బులెలా వస్తాయి. రోజు రోజుకూ అంబేద్కర్ ఆశలు కొడిగడుతున్నాయి. అంతలో పిడుగులాంటి వార్త, అదే, రాంజీ సక్పాల్ మరణం. ఒక కారణ జన్ముడికి జన్మనిచ్చి, విద్యాబుద్ధులు చెప్పించాడు. కాని కొడుకు ప్రయోజకత్వం కన్నులారా చూడకుండానే కన్నుమూసాడు ధన్యజీవి సక్పాల్. తండ్రి మరణం ఆయనకు పెద్ద దెబ్బ. అయినా అంబేద్కర్ పై చదువుల కోసం ప్రయత్నాలు చేస్తూనే వున్నాడు.

అదృష్టం రూపంలో మళ్లీ చక్కని అవకాశం లభించింది అంబేద్కర్‌కు. విదేశాలకు వెళ్ళి చదువుకునే పేద భారతీయ విద్యార్థులకు ఉపకార వేతనం మంజూరు చేస్తానని ఒక ప్రకటన విడుదల చేసాడు బరోడా మహారాజు శాయాజీరావు గైక్వాడ్. ఆ ప్రకటన చూసి అంబేద్కర్‌లో కొత్త ఆశలు చిగురించాయి. అంతే హుటాహుటిన గైక్వాడ్ మహారాజును దర్శించాడు అంబేద్కర్. అంబేద్కర్‌కు గతంలో సహాయం అందించిన గైక్వాడ్ మహారాజు అడిగిందే తడవుగా అంబేద్కర్‌కు ఉన్నత చదువుకోసం స్కాలర్‌షిప్ మంజూరు చేసాడు. అంబేద్కర్‌కు ఆర్థిక సాయం అందించి, ఆయన గొప్ప మేధావి కావటానికి సహాయపడిన మహారాజా గైక్వాడ్‌కు, అంబేద్కర్ మరియు కోట్లాది అంటరానివారు ఎంతో ఋణపడ్డారు కదా.

**విదేశాలలో అంబేద్కర్ విద్యాభ్యాసం :** తండ్రి మరణంతో పుట్టెడు దుఃఖంతో వున్నప్పటికీ, విద్యాభిలాష, ఉన్నత చదువులు చదవాలనే అంబేద్కర్ సంకల్పబలం, అమెరికా ప్రయాణానికి ప్రధాన కారణం. అందుకే సంకల్పం కావాలి, సంకల్పం ఉంటే ఎన్ని ఆటంకాలు ఎదురైనా ఏమీ చేయలేవు.

అమెరికాలోని న్యూయార్కు నగరంలో 1913, జూలై మూడవ వారంలో అడుగుపెట్టిన అంబేద్కర్ వెంటనే కొలంబియా విశ్వవిద్యాలయంలో తనకు అత్యంత ఇష్టమైన రాజనీతిశాస్త్రము, ఎథిక్స్, ఆంత్రోపాలజీ, ఆర్థిక శాస్త్రము పాఠ్యాంశాలుగా ఎంచుకొని యం.ఎ. డిగ్రీలో చేరాడు.

అమెరికాలో జీవితం అంబేద్కర్‌కు గొప్ప అనిర్వచనీయమైన అనుభూతి. తన మాతృదేశమైన భారతదేశంలో మనువాదం ఫలితంగా తనకు, తన జాతి వారికి లభించని స్వేచ్ఛ, సమానత్వం, గౌరవం ఆయన జీవితంలో మొదటిసారిగా పొందాడు. ఈ స్వేచ్ఛాయుత వాతావరణం అంబేద్కర్‌లో నూతనోత్సాహాన్ని నింపింది. తన జాతి వారు శతాబ్దాలుగా అనుభవిస్తున్న దాస్యం నుండి వారిని విముక్తి చేయటానికి, అస్పృశ్యతా సంకెళ్ళను బద్దలు కొట్టటానికి, శక్తివంతమైన ఆయుధం, విద్య ద్వారా లభించే విజ్ఞానం అని గ్రహించిన అంబేద్కర్ తన పూర్తి సమయాన్ని జ్ఞాన యజ్ఞంకే వినియోగించాడు. గొప్ప మేధావి కావటానికి తను చదివే పాఠ్యాంశాలతోపాటు ఇతర గ్రంథాలు చదివేవాడు. నీగ్రోల విముక్తి కోసం జరిగిన ఉద్యమాలను, ఫ్రెంచి విప్లవాన్ని ఆకళింపు చేసుకొన్నాడు. కొందరు మేధావులను కూడా కలుసుకొని ఎన్నో విషయాలు తెలుసుకొన్నాడు. భారతదేశంలో తాను జరుపబోయే సాంఘిక పోరాటానికి అవసరమైన ఆయుధాలను తన హృదయమనే అమ్ములపొదిలో భద్రంగా దాచుకున్నాడు. కృషి వుంటే మనుషులు ఋషులౌతారు, మహాపురుషులౌతారు. తరతరాలకు తరగని వెలుగౌతారు, ఇలవేల్పులౌతారు. కృషితో నాస్తి దుర్భిక్షం. కృషీవలుడైన అంబేద్కర్ రెండు సంవత్సరాల కఠోరదీక్ష, విద్యా సాధన ఫలించింది. 1915లో కొలంబియా విశ్వవిద్యాలయానికి 'ప్రాచీన భారతీయ వాణిజ్యం' (Ancient Indian commerce) అనే పరిశోధనా వ్యాసం సమర్పించి యం.ఎ. డిగ్రీ పొందాడు. అంటరాని జాతి వారి చరిత్రలో అదొక మహత్తర సంఘటన. మరుసటి సంవత్సరమే అనగా 1916లో 'నేషనల్ డివిడెండ్స్ ఆఫ్ ఇండియా - ఎ హిస్టారికల్ అండ్ ఎనలిటికల్ స్టడీ' అనే మరొక పరిశోధనా వ్యాసాన్ని, కొలంబియా విశ్వవిద్యాలయానికి సమర్పించి డాక్టరేట్ డిగ్రీ పొందారు. డాక్టరేట్ పట్టా పొందిన తర్వాత ఆయనను Dr. Ambedkar M.A., Ph.D., గా పిలవటం ప్రారంభమైంది.

యం.ఎ. డిగ్రీ, డాక్టరేట్ పట్టా పొందిన తర్వాత కూడా డాక్టర్ అంబేద్కర్‌లో విద్యాకాంక్ష తగ్గలేదు. కాని బరోడా మహారాజుగారితో ఉపకార వేతనం మంజూరు చేయించుకొనే సందర్భంలోఉన్నత విద్యపూర్తయిన వెంటనే వచ్చి బరోడా మహారాజు కొలువులో ఉద్యోగం చేస్తానని ఒప్పందం కుదుర్చుకున్న కారణంగా, ఇండియా వచ్చేసాడు. మహారాజా కొలువులో కొంత కాలంపాటు సైనిక కార్యదర్శిగా పని చేసిన తర్వాత, నాలుగు పడగల హైందవ నాగరాజు అనే కుల వ్యవస్థ వేధింపులకు మనస్తాపం చెంది ఉద్యోగం వదిలి లండన్ వెళ్ళి చదువు పరిశోధన కొనసాగించి 1922లో లా డిగ్రీ, 1923లో డాక్టర్ ఆఫ్ సైన్స్ డిగ్రీ పొందాడు.

## 19.3 అంబేద్కర్ నడిపిన సాంఘిక పోరాటాలు :

భారతదేశానికి ఒక మహా మేధావిగా తిరిగివచ్చిన డాక్టర్ అంబేద్కర్ తాను గడించిన విజ్ఞానమనే ఆయుధంతో మనువాదం విధించిన కుల వ్యవస్థ, అంటరానితనం పై అహింసాయుత పోరాటానికి సమరభేరి మ్రోగిస్తాడు. ఈ దేశంలో నిజానికి 1425 నుండి రెండు శాంతియుత అహింసా పోరాటాలు జరిగాయి. అందులో మొదటిది రాజకీయ హక్కుల కోసం హిందువులు మరియు కొంత మంది మహమ్మదీయులు కలిసి గాంధీగారి నేతృత్వంలో అఖిల భారత కాంగ్రెస్ సంస్థ ద్వారా సాగించిన స్వాతంత్ర్యపోరాటం. ఈ పోరాటంలో కొన్ని కోట్ల మంది బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా ఉద్యమించారు. ఈ పోరాటానికి దేశంలోను, ప్రపంచంలోను, పుస్తకాలలోను, పేపర్లలోను విస్తృతమైన ప్రచారం లభించింది. రెండవది కనీసం పౌర హక్కులు కూడా లేకుండా శతాబ్దాల తరబడి, సాంఘిక దాస్యంలో మగ్గిపోతున్నా, హిందూ, ముస్లిం రాజులు, చివరకు ఆంగ్లేయులు కూడా (ఆంగ్లేయులు కేవలం క్రైస్తవ మతం స్వీకరించిన అంటరానివారి పట్ల మాత్రమే శ్రద్ధ చూపించారు తప్ప మతం మారని, హిందూ అంటరాని వారిని పట్టించుకోలేదు). పట్టించుకోకపోవటంతో, మహామేధావి, అంటరాని వారి సంకెళ్ళను చేధించడానికి జన్మించిన కారణజన్ముడు డాక్టర్ అంబేద్కర్ నాయకత్వంలో, వేల మంది దళితులు అటు హిందూ ఛాందస్సులతోను, ఇటు బ్రిటీష్ ప్రభుత్వంతోను సాగించిన అహింసాయుత పోరాటం. ఇది మానవ హక్కుల పోరాటం. దీనికి కొద్ది మంది సంస్కరణాభిలాషులైన హిందువులు మాత్రమే సానుభూతి తెలియచేసారు. అధిక సంఖ్యాకులైన హిందువులు ఈ ఉద్యమాన్ని భగ్నం చేయాలని ప్రయత్నించడం గమనార్హం. పత్రికలు పుస్తకాలలో దీనికి తగినంత ప్రచారం లభించలేదు.

1924 జూలై 20వ తేదీన 'బహిష్కృత హితకారిణీ సభ' అనే పేరుతో ఒక సంఘాన్ని రిజిష్టర్ చేసారు అంబేద్కర్. అస్పృశ్యులు శతాబ్దాలుగా అనుభవిస్తున్న సాంఘిక దాస్యం నుంచి విముక్తి కలిగించటానికి వారిలో ఆత్మవిశ్వాసాన్ని, ఆత్మాభిమానాన్ని పెంపొందించి వారి సమస్య లేమిటో వారు తెలుసుకొని వాటి పరిష్కారం కోసం ఉద్యమించటానికి ఈ సంఘం దోహదం చేస్తుందని అంబేద్కర్ భావించాడు.

అంటరాని వారికి చెరువుల్లో, బావుల్లో నీరు తోడుకునే కనీస పౌర హక్కులేదు, వారికి దేవాలయాలలో ప్రవేశం లేదు, పాఠశాలల్లో ప్రవేశం లేదు, ఇలాంటి మనువాద కట్టుబాట్లు వారిని వింత జంతువుల్ని చేసాయి. కనుక డాక్టర్ అంబేద్కర్ ముందుగా ఈ కనీస హక్కుల సాధనకై తన జాతి వారిని చైతన్య పరచి, సంఘటితపరచి, పోరాటానికి సంసిద్ధులను చేసాడు.

మహద్ చెరువు పోరాటం : భారతదేశంలో కుక్కలు, పిల్లులు, కాకులు, కప్పలు, ఆవులు, గేదెలు, పందులు స్వేచ్ఛగా చెరువుల్లో దిగి స్నానం చేసి మంచినీళ్ళు తాగేస్తాయి. కాని అంటరానివారు ఆ చెరువుల్లోకి వెళ్ళి నీళ్ళు తీసుకోరాదు. ఈ అనాగరిక సాంఘిక దురాచారాన్ని ఎదిరించటానికి బొంబాయి సమీపంలోని మహద్ అదే గ్రామంలోని చెరువు నీటిని వాడుకోవటానికి ప్రయత్నాలు ప్రారంభించాడు. 1926లో బొంబాయి లెజిస్లేటివ్ కౌన్సిల్ ఒక తీర్మానం చేస్తూ మహద్ చెరువు నీటిని వాడుకోవటానికి అనుమతించింది. దానికి అనుగుణంగా మహద్ మునిసిపాలిటీ, చెరువులోని నీటిని అన్ని కులాల వారు వాడుకోవచ్చని ప్రకటించింది. ఆ ప్రకటన వెలువడిన తర్వాత కూడా అస్పృశ్యులు ఆ చెరువులోని నీటిని వాడుకునేందుకు సాహసించలేకపోయారు. ఎందుకంటే చెరువు వద్దకు వెళితే ప్రాణాలు తీస్తామంటూ అగ్ర వర్ణాలవారు బెదిరించసాగారు. డాక్టర్ అంబేద్కర్ చట్ట సమ్మతమైన హక్కు అంటరాని వారికి లభింపచేయటానికి 1927 మార్చి 19వ తేదీన తన అనుచరులతో మహద్ గ్రామంలో సభను ఏర్పాటు చేసారు. సభలో అంబేద్కర్ మహోపన్యాసం చేసారు. మరుసటిరోజు 1927 మార్చి 20వ తేదీన వేలాదిమంది కార్యకర్తలతో మేళతాళాలతో, అంబేద్కర్ ముందు, వెనుక వేలాది మంది కార్యకర్తలు గంభీరమైన నినాదాలతో మహద్ చెరువు చేరారు. ముందుగా డా॥ అంబేద్కర్ చెరువులోదిగి తన దోసిలి నిండా నిల్ళు తీసుకొని త్రాగాడు. తర్వాత వేలాది మంది నీళ్ళు త్రాగి తమ హక్కును తెలియజేసారు. ఇదే చారిత్రక మహద్ చెరువు పోరాటం. తర్వాత 1927 డిసెంబర్ 25వ తేదీన "మను స్మృతి"ని దహనం చేసాడు. శూద్రులు, అస్పృశ్యులు వేదాలు చదవరాదనీ, వినరాదనీ ఒక వేళ శాసనాన్ని ధిక్కరించి ఈ జాతుల వారు వేదాలు చదివితే వారి నాలుకలు తెగనరకాలనీ, వింటే వారి చెవుల్లో సీసం కరిగించి పోయాలని శాసించి, శూద్రులు, నిమ్నజాతులు పైకి వచ్చే అవకాశాలు లేకుండా అణగ ద్రొక్కబడేందుకు కారణమైన మనుస్మృతిని మహద్ గ్రామంలో బహిరంగంగా తగులబెట్టి అసమానత్వ శాసనాన్ని బూడిద చేసాడు సాంఘిక విప్లవవీరుడు డాక్టర్ భీమ్‌రావ్ రాంజీ అంబేద్కర్. అలాగే 1930 నుండి 1935 వరకు సాగిన నాసిక్ దేవాలయ పోరాటం ద్వారా అంటరాని వారికి దేవాలయ ప్రవేశం కల్పించాడు.

1928లో భారతదేశంలో పర్యటించిన సైమన్ కమీషన్ ముందు హాజరై నిమ్న జాతుల సమస్యలపై ఒక వినతి పత్రాన్ని సమర్పించాడు. సైమన్ కమీషన్ సిఫార్సుల ప్రకారం రాజ్యాంగ సంస్కరణలు చేపట్టడానికి బ్రిటీష్ ప్రభుత్వం లండన్‌లో 'రౌండ్ టేబుల్' సమావేశాలు ఏర్పాటు చేసారు. నిమ్న జాతుల తరపున డా॥ అంబేద్కర్, రెట్టపల్లి శ్రీనివాసన్ ఈ సమావేశాలకు హాజరయ్యారు.

**మొదటి రౌండ్ టేబుల్ సమావేశం :** 1930 నవంబర్ 12వ తేదీన మొదటి రౌండ్ టేబుల్ సమావేశం లండన్‌లో ఏర్పాటు చేయబడింది. అంబేద్కర్, శ్రీనివాసన్ తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు. కాని కాంగ్రెసుపార్టీ హాజరు కాలేదు. డా॥ అంబేద్కర్ మొదటి రౌండ్ టేబుల్ సమావేశంలో చేసిన ప్రసంగానికి ప్రపంచ వ్యాప్తంగా ప్రశంసల జల్లు కురిసింది. డా॥ అంబేద్కర్‌లోని ప్రజ్ఞా, మేధస్సు, వాగ్ధాటి, వాదనా పటిమ ఆయనకు అభిమానుల్ని పెంచింది. నిమ్న జాతులకు స్వతంత్రపౌరులుగా జీవించేందుకై రాజ్యాంగ చట్టంలో కొన్ని ప్రాథమిక హక్కుల్ని (Fundamental Rights) కల్పించాలని ఎనిమిది అంశాలతో కూడిన విజ్ఞాపన పత్రం సమర్పించాడు. డా॥ అంబేద్కర్ చేసిన విజ్ఞప్తి మేరకు పోలీసు, రక్షణ శాఖల్లో నిమ్న జాతీయులను చేర్చుకోవాలని బ్రిటీష్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాంగ్రెస్ పార్టీ రౌండ్ టేబుల్ సమావేశాల్లో పాల్గొనకపోవడంతో రాజ్యాంగ సంస్కరణల చర్చలు వాయిదా పడ్డాయి. తిరిగి రెండవ రౌండ్ టేబుల్ సమావేశాల్లో చర్చలు జరుపబడునని తెలిపి సమావేశాలు వాయిదా వేసారు.

**రెండవ రౌండ్ టేబుల్ సమావేశం :** భారతదేశంలో ప్రభుత్వానికి, కాంగ్రెసు పార్టీకి మధ్య జరిగిన చర్చల ఫలితంగా కాంగ్రెసుపార్టీ రెండవ రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరు కావటానికి అంగీకరించింది. రెండవ రౌండ్ టేబుల్ సమావేశాలు 1931 సెప్టెంబర్ 7వ తేదీన లండన్‌లో ప్రారంభమయ్యాయి. కాంగ్రెస్‌పార్టీ తరుపున గాంధీజీ, మాలవ్య,సరోజినీ నాయుడు పాల్గొన్నారు. డా॥ అంబేద్కర్ తన వాదనా పటిమతో నిమ్న జాతుల వారికి ప్రత్యేక నియోజక వర్గాలు మంజూరు చేయాలని కోరగా, గాంధీజి ఈ ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకించాడు. అయితే సమావేశాలలో అల్ప సంఖ్యాక వర్గాల విషయంలో ప్రతినిధులు ఒక అంగీకారానికి రాకపోవటంతో ఆగస్టు 14, 1932న బ్రిటీష్ ప్రధాని రామ్‌సే మేక్ డొనాల్డ్ నిమ్న జాతీయులకు ప్రత్యేక నియోజక వర్గాలను కేటాయిస్తూ 'కమ్యూనల్ అవార్డు' ప్రకటించాడు. ఇది తనకు అంగీకారం కాదంటూ పునాలోని యారవాడ జైలులో ఉన్న గాంధీజీ జైలులోనే ఆమరణ నిరాహారదీక్ష ప్రారంభించాడు. గాంధీజీ ఆమరణ నిరాహార దీక్షతో దేశంలో రాజకీయ వాతావరణం ఉద్రిక్తంగా మారింది. గాంధీజీ అనునాయులు ఈ పరిస్థితికి అంబేద్కర్ కారణమంటూ, దుమ్మెత్తి పోస్తూ నిప్పులు చెరగటం ప్రారంభించారు. ఈ దీక్ష వల్ల గాంధీజీ మరణిస్తే దేశానికి స్వాతంత్ర్యం రావటం దుర్లభమంటూ పటేల్ మొదలు ప్రతి కాంగ్రెస్ వాది దుష్ప్రచారం ప్రారంభించారు. చివరకు గాంధీజీ ప్రాణాలు కాపాడటానికి అంబేద్కర్ తన పట్టు వదలి, గాంధీజీతో ఒక ఒప్పందం కుదుర్చుకున్నారు. 1932 సెప్టెంబర్ 24న గాంధీజీ, అంబేద్కర్ మధ్య కుదిరిన ఒప్పందాన్నే పూనా ఒడంబడిక (Poona Pact) అంటారు.

**Poona Pact :** 1) ఈ ఒప్పందం వలన నిమ్న జాతులకు కేంద్ర శాసన సభలోను, రాష్ట్ర శాసన సభలో ప్రత్యేక నియోజక వర్గాలను రద్దుచేసి, సంయుక్త నియోజకర్గాలు ఏర్పాటు చేస్తారు.

2) నిమ్న జాతులకు కేటాయించిన స్థానాలు రెట్టింపు అవుతాయి.

3) నిమ్న జాతులకు ప్రత్యేక ప్రాతినిధ్యం గడువు 10 సంవత్సరాల వరకు ఉంటుంది.

డా॥ అంబేద్కర్ కృషి, పోరాట ఫలితంగా ఎట్టకేలకు నిమ్న జాతులకు చట్ట సభలలో ప్రవేశం కల్పించబడింది. ఈ విధంగా డా॥ అంబేద్కర్ నిమ్న జాతులకు పౌర హక్కులతో పాటు రాజకీయ హక్కులు కల్పించారు.

## 19.4. లా మినిష్టర్ - రాజ్యాంగ చట్ట నిర్మాత :

భారతదేశంలో స్వాతంత్ర్య సముపార్జన దిశగా పరిణామాలు త్వరితగతిని రూపుదిద్దుకుంటున్నాయి. 1937లో ఎన్నికలు జరిగాయి. నిమ్న జాతుల వారు వివిధ నియోజక వర్గాల నుండి ఎన్నుకోబడి, చట్ట సభల్లో ప్రవేశించారు. ఇది రాజకీయంగా అంబేద్కర్ సాధించిన అఖండ విజయం.

1946లో కేబినెట్ మిషన్ ప్లాన్ ప్రకారం నూతన రాజ్యాంగ నిర్మాణం కోసం రాజ్యం చట్టసభకు ఎన్నికలు నిర్వహించారు. డా॥ అంబేడ్కర్ రాజ్యాంగ సభకు ఎన్నుకోబడ్డారు. రాజ్యాంగ కోవిదుడైన డా॥ అంబేడ్కర్ ప్రజ్ఞా పాటవాలు, మేధస్సు ప్రముఖుల దృష్టిని ఆకర్షించాయి. డా॥ అంబేడ్కర్ కృషి ఫలితంగా రాజ్యాంగ చట్ట సభ 1947, ఏప్రియల్ 29వ తేదీన అస్పృశ్యతను చట్టరీత్యా నిర్మూలించాలని తీర్మానించబడింది. డా॥ అంబేడ్కర్ జీవితాశయం నెరవేరింది. శతాబ్దాలుగా అనుభవిస్తున్న అస్పృశ్యతా శృంఖలాలను బద్దలు గొట్టాడు సాంఘిక విప్లవ వీరుడు డా॥ అంబేడ్కర్.

డా॥ అంబేడ్కర్ ప్రజ్ఞను గుర్తించిన పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ తాత్కాలిక జాతీయ ప్రభుత్వంలో ఆగస్టు మొదటి వారం 1947లో, డా॥ అంబేడ్కర్‌ను లా మినిష్టర్‌గా నియమితులను చేసారు. ఆ తర్వాత రాజ్యాంగ కోవిదుడైన డా॥ అంబేడ్కర్ 29-8-1947న డ్రాప్టింగ్ కమిటీ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకోబడి, భారత రాజ్యాంగ నిర్మాతయ్యాడు.

రాజ్యాంగ నిర్మాతగా, అంబేడ్కర్ నిర్వహించిన పాత్ర సర్వత్రా ప్రశంసలు పొందింది. భారత రాజ్యాంగం సమాఖ్య వ్యవస్థగా ఏర్పాటు చేసే సందర్భంలో ఆయన చేసిన ప్రసంగాలు అద్భుతం. రాజ్యాంగ చట్ట రచనా సంఘంలో 7గురు సభ్యులున్నప్పటికినీ అనేక కారణాల వల్ల సభ్యులంతా హాజరు కాలేకపోయారు. ఒక సభ్యుడు చనిపోయాడు, ఒక సభ్యునికి అనారోగ్యం, ఒక సభ్యుడు విదేశాలలో ఉండిపోయాడు, ఇలా సభ్యులు పలు కారణాల వల్ల రాలేకపోవటం వలన రాజ్యాంగ రచనా భారం డా॥ అంబేడ్కర్‌పైన, బి.ఎన్.రావ్ పైనా పడింది. ఈ మహోన్నతమైన రాజ్యాంగ రచనా బాధ్యతను విజయవంతంగా నిర్వహించి, భారత రాజ్యాంగ నిర్మాతగా ప్రసిద్ధిగాంచాడు. అమెరికా రాజ్యాంగ నిర్మాత, థామస్ జెఫర్ సన్ కన్నా, ఎన్నో రెట్లు కష్టపడి భారతదేశానికి స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, సామాజిక న్యాయం అందించే అపూర్వమైన రాజ్యాంగ రచన చేసి ధన్యుడయ్యాడు.

కాల క్రమంలో హిందూ కోడ్ బిల్ ఆమోదం విషయంలో ప్రధాని నెహ్రూతో అభిప్రాయ బేధాల వలన 27-9-1951న లామినిష్టర్ పదవికి స్వచ్ఛందంగా రాజీనామా చేసి, నైతిక విలువలను కాపాడిన రాజకీయ ఆదర్శవాదిగా స్తుతించబడ్డాడు. జీవిత చరమాంకంలో నాగపూర్‌లోని ధర్మ దీక్షా మైదానంలో ఐదు లక్షల మంది అనుచరులతో 1956, అక్టోబరు 14వ తేదీన బౌద్ధ ధమ్మం స్వీకరించి, ఈ దేశంలో పుట్టి, విదేశాలకు తరలిపోయిన బౌద్ధానికి ప్రాభవం కలిగించాడు.

## 19.5. నిమ్నజాతుల అభివృద్ధికి, డా॥ అంబేడ్కర్ ఏర్పాటు చేసిన సౌకర్యాలు - రక్షణలు :

నిమ్నజాతులు మానవులుగా, ఆత్మగౌరవంతో, స్వేచ్ఛగా జీవించడానికి డా॥ అంబేడ్కర్ రాజ్యాంగ పరంగా ఎన్నో సౌకర్యాలు - రక్షణలు ఏర్పాటు చేసారు. అవి ఏమనగా -

1. భారత రాజ్యాంగ పీఠికలో పేర్కొన్న, సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, మానవ గౌరవం దేశ ప్రజలైన నిమ్న జాతులకు లభిస్తుంది.

2. ప్రాథమిక హక్కుల ద్వారా సాంఘిక, రాజకయ స్వేచ్ఛ, సమానత్వం పొందుతారు.

3. ఆదేశిక సూత్రాల ద్వారా ఆర్థిక న్యాయం లభిస్తుంది. విద్యాభివృద్ధికి ప్రభుత్వాలు కార్యాక్రమాలు రూపొందించబడతాయి.

4. డా॥ అంబేడ్కర్ అంటరాని వారు అనే పదాన్ని తొలగించి, దానికి బదులుగా షెడ్యూల్డు కులాలు అనే ఒక కొత్త రాజ్యాంగ నామమును ఉపయోగించారు. అంటే అంటరానివారు అనే పేరు మనువు పెట్టింది. షెడ్యూల్డు కులాలు అనేది డా॥ అంబేడ్కర్ పెట్టిన పేరు.

5. రాజ్యాంగం పదిహేడవ అధికరణం అంటరానితనాన్ని నిర్మూలించింది. (Art : 17)

6. ప్రపంచ మానవ హక్కుల ప్రకటన ఆర్టికల్ ఒకటిలో ప్రకటించిన మానవ గౌరవం, భారత రాజ్యాంగం ఆర్టికల్ పద్నాలుగు ద్వారా కల్పించబడుతుంది. (Art : 14)

7. భారతరాజ్యాంగం 19వ అధికరణం స్వేచ్ఛ ప్రసాదిస్తుంది. షెడ్యూల్డు కులాలవారు స్వేచ్ఛగా సంచరించవచ్చు.

8. రాజ్యాంగం ఇరవై ఒకటవ అధికరణం జీవించే హక్కు ప్రజలందరికీ కల్పించడం వలన, షెడ్యూల్డు కులాలకు కూడా అది వర్తిస్తుంది. (Art : 21)

9. రాజ్యాంగం ఇరవై ఐదవ అధికరణం మత స్వేచ్ఛ కల్పిస్తుంది. దేవాలయ ప్రవేశానికి, దైవ అనుగ్రహానికి నోచుకోని షెడ్యూల్డు కులాల వారు దేవాలయాలలో ప్రవేశించి, దేవుళ్ళకు, దేవతలకు తమ కష్టాలు చెప్పుకోవచ్చు. ఎందుకంటే వీళ్ళ జీవితమంతా కష్టాలు కన్నీళ్ళే కదా.

10. విద్యాలయాలలోనికి ప్రవేశం లేని కారణంగా వందలాది సంవత్సరాల నుండి విద్యా కుసుమాలు లభించక చీకటిలో, నిరక్షరాస్యులుగా జీవిస్తున్న వీరి బ్రతుకుల్లో విజ్ఞానకాంతులు నింపటానికి, అజ్ఞానం నుండి విజ్ఞానానికి, చీకటి నుండి వెలుగులోనికి, వింత జంతువుల స్థాయి నుండి వివేకవంతమైన మానవులుగా పయనించడానికి రాజ్యాంగం ఇరవై తొమ్మిదవ అధికరణం కల్పించిన విద్యా హక్కు వీరికి అనిర్వచనీయమైన మేలు చేస్తుంది. (Art : 29)

పైన పేర్కొన్న సౌకర్యాలు వీరికి మానవ హక్కులు కల్పిస్తున్నాయి. వీటిని డా॥ అంబేడ్కర్ ఒక్కరే తన మేధస్సుతో, అటు చాంధస హిందూ నాయకులతో, ఇటు బ్రిటిష్ ప్రభుత్వంతో రాజీలేని పోరాటం సలిపి సాధించారు. అందుకే ఆయనను మానవ హక్కుల ప్రదాత, మహోన్నత మానవతావాదిగా అభివర్ణించడం జరిగింది.

11. పైన పేర్కొన్న సౌకర్యాలతోపాటు, శతాబ్దాలుగా రాజకీయ, పాలనా రంగాలకు దూరంగా వుంచిన వీరిని, ప్రజాస్వామ్య పాలనా వ్యవస్థలో భాగస్వాములు చేయటానికి, వయోజన వోటు హక్కు కల్పించారు.

12. రాజ్యాంగం మూడు వందల ముప్పై అధికరణం పార్లమెంటులోని దిగువ సభ అయిన లోక్‌సభలో వీరికి మరియు కొండ జాతుల వారికి ప్రత్యేకంగా సీట్లు కేటాయించింది. (Art : 330)

13. (Art : 332) రాష్ట్రాల అసెంబ్లీలలో షెడ్యూల్డు కులాల, తెగల వారికి సీట్లు కేటాయించబడ్డాయి. దీని వలన వారు రాజకీయ పదవులు చేపట్టి దేశ రాజకీయ పరిపాలనలో భాగస్వాములు కాగలిగారు.

14. (Art : 335) ఈ అధికరణం వీరికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలలో ఉద్యోగాలు కల్పిస్తుంది.

వీటితో పాటు శతాబ్దాలుగా నిరాదరణకు గురైన షెడ్యూల్డు కులాల, తెగల ప్రజలను, జన జీవన స్రవంతిలోనికి తీసుకురావాలనే ధృఢ సంకల్పంతో కేంద్రంలోను, రాష్ట్రాలలోను ప్రభుత్వాలు స్కాలర్ షిప్పులు, హాస్టళ్ళు స్థాపించి, ఈ వర్గాల పిల్లలు చదువుకునే అవకాశాలు కల్పించారు. అలాగే వీరికి ఆర్థికంగా చేయూతనివ్వటానికి అనేక సంక్షేమ పథకాలు, ఆర్థిక పథకాలు రూపొందించబడ్డాయి. ప్రస్తుతం భారతీయ రాజకీయ సమాజంలో, రాజకీయ పదవుల కోసం పోట్లాడుకోకుండా, కేవలం నిశ్శబ్ద వోటర్లగానే కొనసాగుతున్న బలమైన వోట్ బ్యాంక్ షెడ్యూల్డు కులాలు, తెగలు. అటు కేంద్రంలోను, ఇటు రాష్ట్రాలలోను, ఒక రాజకీయ పార్టీని అధికారంలో కూర్చోపెట్టాలన్నా, అధికారంలో నుంచి దించాలన్నా, నిర్ణయించగలిగే వోటింగ్ బలమున్న అతి ప్రధానమైన వర్గము వీరే.

వీరి తలరాతను మార్చి వింత జంతువులను మనుష్యులుగా తీర్చిదిద్దిన కలియుగ బ్రహ్మ డా॥ అంబేడ్కర్. 26-1-1950 రాజ్యాంగం అమలులోకి వచ్చింది మొదలు నేటి వరకు, సర్పంచి నుండి భారత రాష్ట్రపతి వరకు షెడ్యూల్డు కులాల వారు రాజకీయ పదవులు చేపట్టారంటే అది ఆయన పెట్టిన భిక్ష. నాగరికంగా షెడ్యూల్డు కులాలవారు జీవిస్తున్నారంటే అది ఆయన ప్రసాదించిన నూతన జీవితమే. స్వర్గీయ కె.ఆర్. నారాయణన్, ఉపరాష్ట్రపతిగా, (1992-97) ఆ తర్వాత (1997-2002) వరకు రాష్ట్రపతిగా పని చేయటానికి, స్వర్గీయ జి.యం.సి. బాలయోగి లోక్‌సభ స్పీకర్ కావటానికి, అనేక మంది షెడ్యూల్డు కులాలవారు కేంద్రంలోను, రాష్ట్రాలలోను మంత్రులు కాగలిగినా, గవర్నర్లు

కాగలిగినా, రాష్ట్రాలలో ముఖ్యమంత్రులు కాగలిగినా, యం.పి.లు (M.P.), యం.ఎల్.ఎ.లు (M.L.A.) ఇంకా అనేక రాజకీయ పదవులు పొందటానికి దారి చూపిన మార్గదాత డా॥ అంబేడ్కర్. విద్యా రంగంలో, ఉద్యోగ రంగంలో, వైస్ ఛాన్సలర్స్‌గా, ప్రొఫెసర్స్‌గా, కలెక్టర్లగా, సెక్రటరీలుగా ఎన్నో స్థాయిల్లో ఈ వర్గాల ప్రజలు పనిచేస్తూ, తమ సేవల్ని సమాజానికి అందిస్తూ గౌరవంగా బ్రతుకుతున్నారంటే కారణం డా॥ అంబేడ్కరేనని షెడ్యూల్డు కులాల, తెగలకు చెందిన ప్రతీవ్యక్తి మరువరాదు. ఆయన ఈ జాతులకు చేసిన సేవలను తమ పిల్లలకు చెప్పి వారు బాగా చదువుకొని, ఆయన ఆశయాలను సాధించి, గొప్పవారు కావాలని వారిని మోటివేట్ చెయ్యాలి. అదే అంబేడ్కర్ ఆశించింది, ఆలోచించింది అని చెప్పాలి. మట్టి మనుషుల్ని మాణిక్యాలు చేసిన జీవన దాత అని చెప్పాలి.

**డా॥ అంబేడ్కర్ అనుయాయులకి ఇచ్చిన సందేశం :** 'అత్యంత దౌర్భాగ్యకరమైన పరిస్థితుల్లో, తుది అంటూలేని కష్టాల నెదుర్కొంటూ, వ్యతిరేక వర్గాలతో జీవితాంతం పోరాడాను. నే సాధించగలిగినవేవో మీకు సమకూర్చి పెట్టాను. ఎన్నో వ్యయ ప్రయాసలతో ఈ ఉద్యమాన్ని (Caravan) ఈ దశకు తీసుకొని రాగలిగాను. ఎన్ని కష్టాలనైనా ఎదుర్కొని ఈ ఉద్యమాన్ని ముందుకు సాగించండి. అలా ముందుకు సాగించడం మీకు చేతకాకపోతే ఉన్న చోటనే దాన్ని వుంచండి. అంతేకాని దాన్ని వెనక్కు మరల్చే ప్రయత్నం మాత్రం చేయకండి" ఇదే నా సందేశం.

బోధించు (Edecate), సమీకరించు (Organise), పోరాడు (Agitate)

జీవితాంతం సాంఘిక సమానత్వం కోసం, అంటరానివారిని మామూలు మానవులుగా సభ్య సమాజంలో నిలబెట్టి వారికి గౌరవ ప్రదమైన జీవితం కల్పించడం కోసం, శ్రమించి వారికి ఎన్నో హక్కులు, సౌకర్యాలు సాధించిపెట్టి, రాజీలేని పోరాటం చేసిన అవిశ్రాంత విప్లవ జ్యోతి 1956, డిసెంబర్ 6వ తేదీన, కొట్లాది మంది అనుయాయులను దిక్కులేని వారిని చేసి మహాపరినార్వాణం పొందాడు. ఈ వార్త తెలిసిన కోట్లాది మంది షెడ్యూల్డు కులాల వారు షాక్‌కు గురయ్యారు. దేశం యావత్తూ భారత రాజ్యాంగ నిర్మాతను కోల్పోయింది. నవ భారత రాజ్యాంగ నిర్మాత, పూజ్యశ్రీ బాబా సాహెబ్ డాక్టర్ భీమ్‌రావ్ రాంజీ అంబేడ్కర్ M.A., Ph.D., D.Sc., D.Litt., Doctor of Law, Justice of peace, Bar-at-Law. ఇకలేరు.

ఒక అతి సామాన్యమైన కుటుంబంలో జన్మించి, ఎన్నో ప్రతికూల పరిస్థితులు, భయంకరమైన అస్పృశ్యతా ముద్రతో, అన్ని దారులు మూసుకుపోయిన పరిస్థితుల్లో, దీక్షా, పట్టుదల, కృషి, లక్ష్యం ధ్యేయంగా సమాజంలోని ప్రవాహానికి ఎదురీది, మహోన్నత మేధావిగా కీర్తి గడించి గొప్పవాడనిపించుకున్నాడు, శభాష్ అనిపించుకున్నాడు అంబేడ్కర్. William Shakespeare చెప్పినటువంటి

"Some are born great,
Some achieve greatness
Some have greatness thrust upon them,

అనే వాక్యంలోని మాటలను సాకారం చేసారు డా॥ అంబేడ్కర్.

"Lives of great Men remind us
We can make our lives sublime
And departing, leave behind us
Foot prints on the sand of time"
H.W. Long Fellow

డా॥ అంబేడ్కర్ తన ఆలోచనలను, మనకు వదలి వెళ్ళిపోయాడు. ఆయన ఆశించిన సాంఘిక సమానత్వం ఏర్పడి, అంటరానితనం ఈ భారతీయ సమాజం నుండి అంతరించి పోవటానికి ప్రతి భారతీయుడు, చిత్త శుద్ధితో కృషి చేయండి. అదే మనం ఆయనకిచ్చే ఘన నివాళి

భారతరత్న బిరుద ప్రదానం : డా॥ అంబేడ్కర్ భారత రాజ్యాంగ నిర్మాతగా రాజ్యాంగ రచన విజయవంతంగా నిర్వహించి ఒక చక్కని రాజ్యాంగాన్ని భారతీయులకు అందించిన సేవలకు గుర్తుగా ఆనాడే ఆయనకు భారతరత్న బిరుదు ప్రదానం చేసి ఉంటే ఎంతో సముచితంగా, సందర్భోచితంగా ఉండేది. అలాంటి విజ్ఞత పాలకుల్లో లేకపోవటం భావ దారిద్ర్యానికి తార్కాణం.

చివరకు విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ ప్రధానమంత్రిగా పనిచేసిన నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం అంబేడ్కర్ చిత్రపటాన్ని పార్లమెంటు సెంట్రల్ హాలులో 2-4-1990వ తేదీని ఏర్పాటు చేసి నవ భారత రాజ్యాంగ నిర్మాత సేవలకు గుర్తింపు తీసుకొచ్చింది. అంతేకాదు రెండు రోజుల తర్వాత అనగా 4-4-1990వ తేదీన భారత రాష్ట్రపతి, దేశ అత్యున్నత పౌర పురస్కార బిరుదైన భారతరత్నను డా॥ అంబేడ్కర్ గారికి మరణానంతరం ప్రదానం చేసి డా॥ అంబేడ్కర్ దేశానికి చేసిన సేవలకు న్యాయం చేకూర్చారు.

## 19.6. డా॥ అంబేడ్కర్ రచించిన గ్రంథాలు :

డా॥ అంబేడ్కర్ బహు గ్రంధకర్త, ఆయన వ్రాసిన ప్రతీ గ్రంథం ఒక పరిశోధనా గ్రంధమే. ఈ గ్రంధాలు ప్రతి ఒక్కరూ చదవండి.

1. Annihilation of caste
2. Buddha and his Dhamma
3. Who are Untouchables
4. Who are Sudhras
5. What Congress and Gandhi have done to the Untouchables
6. Buddha and Karl Marx
7. The Problem of the Rupee
8. Untouchables and Conversions
9. Thoughts on Linguistic states.

## 19.7. సారాంశము :

మహారాష్ట్రలో మహర్ అనే ఒక అశ్పృశ్యకులంలో జన్మించి, స్వయం కృషితో దీక్షా పట్టుదల, కృషి, దృఢ సంకల్పంతో ఉన్నత చదవులు చదివి, తన మేధాశక్తితో, రాజ్యాంగ కోవిదుడుగా నవ భారత రాజ్యాంగ నిర్మాతగా, విశేష సేవలందించిన దేశ భక్తుడు, జాతీయనాయకుడు భరతమాత కీర్తి కిరీటంలో మరో జాతి రత్నం పూజ్యశ్రీ, డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్. అంటరాని వారికి సాంఘిక సమానత్వ సాధన కోసం, రాజకీయ ప్రాతినిధ్యం కోసం, ఆర్థిక పురోభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమించి రాజీలేని పోరాటం సలిపి భారత రాజ్యాంగం ద్వారా ఎన్నో సౌకర్యాలు, రక్షణలు కల్పించారు. ఆయన ఆశయాలు,స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, సామాజిక న్యాయం.

"దేశ ఔన్నత్యం కోసం అంటరాని తనాన్ని తరిమికొడదాం'

"Let Untouchability be abolished for Nation's Prosperity".

## 19.8. చదువదగిన గ్రంథాలు


| | | | |
|---|---|---|---|
| 1. | Dhananjay Keer | : | Dr. Ambedkar - Life and Mission |
| 2. | Yenduri Chinnaiah | : | Dr. Ambedkar's Jeevita Charitra |
| 3. | Bhagavan Das | : | Thus Spoke Ambedkar |
| 4. | R.C. Gupta | : | Great Political Thinkers - East & West |


డా॥ ఎ. వెంకటరావు

పాఠం - 20

# గాంధీ తత్వము

## 20.0 లక్ష్యం :

ఆధునిక భారత రాజనీతి శాస్త్రతత్వ వేత్తల్లో మహాత్మగాంధీ ఒకరు. గాంధీ సిద్ధాంతాలు-సూత్రాలు, భారత సమాజానికి మరియు అంతర్జాతీయ సమాజానికి ఎంత వరకు ఆచరణయోగ్యమో అధ్యాయనం చేయడము ఈ పాఠం యొక్క ముఖ్య లక్ష్యం.

## విషయ సూచిక :


20.0 లక్ష్యం

20.1 పరిచయం

20.2 జీవిత విశేషాలు

- 20.2.1 విద్యార్థిదశ
- 20.2.2 దక్షిణాఫ్రికా అనుభవాలు
- 20.2.3 గాంధీని ప్రభావితం చేసిన అంశాలు
- 20.2.4 సత్యాగ్రహం ప్రారంబం

20.3 గాంధీ రాజకీయ సిద్ధాంతాలు

- 20.3.1 సత్యాగ్రహం
- 20.3.2 సత్యాగ్రహం - అహింస
- 20.3.3 సత్యాగ్రహ పద్ధతులు
- 20.3.4 లక్ష్యాలు - సాధనాలు
- 20.3.5 రాజకీయాలు - మతం
- 20.3.6 ధర్మ కర్తృత్వ సిద్ధాంతం
- 20.3.7 గాంధీజీ ఆదర్శ రాజ్యం
- 20.3.8 ప్రజాస్వామ్యం

20.4 అంతర్జాతీయంగా గాంధీ సిద్ధాంత ఆచరణోగ్యత

20.5 గాంధీ సిద్ధాంత - విమర్శ

20.6 గాంధీ సిద్ధాంత విశిష్టత

20.7 సారాంశం

20.8 నమూనా ప్రశ్నలు

20.9 చదువదగిన గంథ్రాలు

## 20.1 పరిచయం :

మహాత్మ గాంధీ రాజకీయ తత్వశాస్త్రంలో క్రమ బద్ధమైన విద్యుత్ భావుకుడు (Systematic academic thinker) కాడు. ఆయన ఉత్తేజం పొందిన ఉపాధ్యాయుడు. ప్రవక్త. ప్రపంచ పౌరుడుగా తన పాత్రను ఆయన ఎప్పుడు నొక్కి చెప్పేవాడు. సత్యం, అహింసలను తన జీవితంలో ఆచరించి చూపినాడు. తాను ఏది చెప్పినాడో అదే చేసి, ఏది చేసేవాడో దానినే చెప్పేవాడు. 1893 నుంచి 1914 వరకు గాంధీ దక్షిణాఫ్రికాలో జాతి దురహంకార విధానానికి జాతి వివక్షతకు వ్యతిరేకంగా అకుంఠిత పోరాటం సల్పినాడు. 1915 నుంచి 1948 వరకు గాంధీ భారత స్వాతంత్ర్యానికై అద్వితియంగా శ్రమించాడు. తన జీవిత కాలంలో ఆయన అనుసరించిన పద్ధతులు, ప్రబోధించిన సిద్ధాంతాలు - సూత్రాలకు ప్రభావితులైన మన రాజ్యాంగ నిర్మాతలు, గాంధీ సూత్రాలను కొన్నింటిని మన రాజ్యాంగము 4వ భాగంలోని ఆదేశ సూత్రాల్లో పేర్కొనిరి.

గాంధీ భావనలను తెలుసుకొనుటకు ముందు ఆయన జీవితము, ఆయన పై ఆ కాలంనాడు చూపిన ప్రభావములను క్లుప్తంగా ఈ క్రింది విధంగా వివరింపబడినది.

## 20.2 జీవిత విశేషాలు :

మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ గుజరాత్ రాష్ట్రంలోని కథియవాడ్‌లోని పోర్‌బందర్ గ్రామంలో 1869, అక్టోబరు 2న పుతేబాయ్, కాబాగాంధీ దంపతులకు జన్మించిరి. గాంధీ తండ్రి రాష్ట్రంలో ఒక దివాణాదారుడు. తల్లి మత సాంప్రదాయాలను నిష్ఠతో అనుసరించు ఇల్లాలు. గాంధీ తల్లిదండ్రుల మత సాంప్రదాయ భావాలు, వారి లక్షణాలు, సంస్కృతులను గాంధీపుణికి పుచ్చుకున్నారు. వారి ప్రభావము గాంధీ జీవితం. ఆలోచనా సరళుపై ఎంతో ఉన్నది. ఆనాటి సాంప్రదాయాల ప్రకారం గాంధీకి 12 సంవత్సరములు పూర్తికాగానే కస్తూరి బాయ్‌తో వివాహం జరిగినది. తన బాల్య వివాహ ఫలితంగానే తమ జీవితాంతము బాల్య వివాహంలకు విరుద్ధముగా వ్యవహరించెను.

### 20.2.1 విద్యార్ధిదశ :

గాంధీ తనకు 7 సంవత్సరాల వయస్సు కాలము నందే పాఠశాలలో చేరెను. 1887లో గాంధీ మెట్రికిలేషన్ పరిక్షలో ఉత్తీర్ణులైనారు. తరువాత భావనగర్‌లోని శ్యాముల్ దాస్ కళాశాలలోని ఇంటర్మీడియట్ చదివారు. ఆ తరువాత కుటుంబ మిత్రుల ప్రోత్సాహంతో న్యాయవద విద్యనభ్యసించటానికి గాంధీ ఇంగ్లాండ్ వెళ్ళారు. 1891లో న్యాయవాద విద్య నందు పట్టాపొందిన తరువాత గాంధీ రాజకోటలో న్యాయవాద వృత్తిని ప్రారంభించటానికి భారతదేశానికి తిరిగి వచ్చారు. బొంబాయిలో కొంత కాలం న్యాయవాద వృత్తినవలంబించిరి. అయితే ఈ వృత్తి గాంధీకి అంతగా లాభం లేకపోవుటంతో దక్షిణ ఆఫ్రికాకు వెళ్ళి అచ్చట దాదాపుగా 20 సంవత్సరములు జాతి విచక్షణ విధానానికి వ్యతిరేకంగా భారతీయుల సమానత్వం కోసం పోరాడినాడు.

### 20.2.2 దక్షిణ ఆఫ్రికా అనుభవాలు :

గాంధీ దక్షిణ ఆఫ్రికా నందున్నంత కాలం అనేక అనుభవాలను సవిచూచెను. తద్వారా అక్కడ జీవించే భారతీయుల దుర్భర జీవితాన్ని స్వానుభవంతో గాంధీ గ్రహించెను. ఒక పర్యాయము మొదటి తరగతి రైలు పెట్టెలో ఒక శ్వేత జాతి వానితో కలసి ప్రయాణిస్తున్నప్పుడు ఆ శ్వేత జాతియుని పిర్యాదు మేరకు రైల్వే అధికారులు గాంధీని మూడో తరగతి పెట్టెలోకి మార్చుటకు ప్రయత్నించగా, ఆ మార్పును గాంధీ తిరస్కరించగా రైల్వే అధికారులు ఆయన సామానులను బయటకు పారవేసి గాంధీని బలవంతంగా రైలు నుంచి దించారు. ఇటువంటి జాతి వివక్షణను గాంధీ స్వయంగా అనుభవించెను. అది ప్రభుత్వ విధానపు

తప్పేగాని ఉద్యోగుల తప్పుకాదని గాంధీ భావించెను. చెడును ఎదిరించవలెనే కాని చెడు చేసినవారిని దూషించరాదని గాంధీ విశ్వాసం. అప్పటి నుంచే ఆయనలో అహింసా తత్వం చోటు చేసుకుంది. ఆ తత్వాన్ని తన వ్యక్తిగత జీవితంలో ప్రయోగించిన తరువాతనే దానిని రాజకీయలలో కూడా ప్రయోగించటానికి గాంధీ నిర్ణయించుకున్నారు. ద్వేషానికి ప్రేమ, అసత్యానికి సత్యమే సమాధానమని గాంధీ భావించారు.

గాంధీ దక్షిణాఫ్రికాకు వెళ్ళిన నాటికి జాతి విచక్షణ, వైషమ్యాలు వట వృక్షంలోని వివిధ శాఖోపశాఖలుగా విస్తరించి అచ్చటి భారతీయుల జీవితాలను దుర్భరం చేసాయి. దక్షిణాఫ్రికాలో తెల్లవారికీ, నల్లవారికీ మధ్య ఏర్పడిన విభేదాలు, తెల్లవారు అనభవిస్తున్న ప్రత్యేక సౌకర్యాలు (Privilages) గాంధీ దృష్టిని ఆకర్షించాయి. తత్ఫలితంగానే గాంధీ తన జీవితాంతం వర్ణవిచక్షణకు వ్యతిరేకంగా పోరాటం సల్పెను.

## 20.2.3 గాంధీని ప్రభావితం చేసిన అంశాలు :

గాంధీ, టాల్‌స్టాయి రచనలనలకు, భావాలకు అమితంగా ఆకర్షితుడై తనలో ఒక నిశ్చితమైన భావం ఏర్పరచుకొనెను. ముఖ్యంగా మాటలకూ, చేతలకూ మధ్య వ్యత్యాసం ఉండరాదన్న టాల్‌స్టాయ్ వాదం గాంధీని అమితంగా ప్రభావితం చేసింది.

టాల్‌స్టాయ్ రచనల తరువాత గాంధీని విశేషంగా ప్రభావితం చేసినది రస్కిన్ రచించిన 'అంతిమ క్షణం వరకు' (Unto the last) అను గ్రంథం. ఇది ఆయనకు ప్రామాణికం అయింది. సహకారం పద్ధతిపై ఏ పనినైనా సాధించవచ్చని గాంధీ గ్రహించారు. ఈ భావాన్ని ఆచరణలో పెట్టాలని గాంధీ నిర్ణయించు కొన్నారు.

1904 లో గాంధీ 'ఇంటియన్ ఒపినియన్' (Indian Opinion) అను వార పత్రికను స్థాపించెను. తన అభిప్రాయాలను ఈ పత్రిక ద్వారా భారతీయుల అభివృద్ధికి సంబంధించిన అంశాలను ప్రచారంలోకి తెచ్చెను. ఆ పత్రికా సంస్థలో పనిచేయు వారికి ఒక ఆశ్రమాన్ని స్థాపించెను. గాంధీ ఆ శ్రమ ప్రాధాన్యతను ఇక్కడే గ్రహించెను. ఒక నియమ బద్ధమైన జీవితానికి అలవాటు పడ్డవారే సేవ చేయటానికి అర్హులని ఆయన భావించారు. అందుకుగాను దక్షిణాఫ్రికాలో టాల్‌స్టాయ్ ఫార్మ్, ఫొనెక్స్ ఫార్మ్‌లను గాంధీ నెలకొల్పెను. అవి, సబర్మతి, సేవాగ్రమ్, ఆశ్రమాలకు మార్గదర్శకాలయ్యాయి.

ఎడ్విన్ ఆర్‌నాల్డ్ ఆంగ్లంలో వ్రాసిన "భవద్గీత", "లైట్ ఆఫ్ ఏసియా", "బైబిల్" మొదలైన గ్రంధాలు గాంధీ అనునిత్యము పఠించేవారు. తద్వారా కొంత స్ఫూర్తిని పొందారు.

## 20.2.4 సత్యాగ్రహం ప్రారంభం :

దక్షిణాఫ్రికా ప్రభుత్వము జారీ చేయు చట్టాలు, అధికార పత్రాలు, ఆర్డినెన్స్‌లు మొదలగునవి తెల్లవారికి నల్లవారికి పట్ల - భారతీయుల పట్ల - ద్వేష భావముతో, వైరుధ్య పూరితముగాను రూపొందించిబడేవిగా ఉండేవి. భారతదేశపు గౌరవం దక్షిణ్ఫిగా భారతీయుల భవితవ్యంపై ఆధారపడిందని గాంధీ భావించారు. అందువల్ల ఈ అమానుష ఉత్తర్వులను ప్రతిఘటించాలని ఆయన నిర్ణయించుకొన్నారు. ఈ సందర్భంలోనే గాంధీ 1906లో మొట్టమొదటిగా సత్యాగ్రహాన్ని దక్షిణాఫ్రికాలో ప్రారంభించారు.

గాంధీ జీవతంలో కూడా ఈ దశలో ఒక నూతన వికాసం ఏర్పడింది. దక్షిణాఫ్రికాలోని భారతీయుల నందరినీ సంఘటితం చేసి ప్రతి ఒక్కరు శాంతియుత ప్రతిఘటన (Passive Resistance) సాగించాలని గాంధీ ఉద్దేశించారు. దక్షిణాఫ్రికా భారతీయులు

నిర్వహించే ఉద్యమానికి గాంధీ సాత్విక నిరోధమని పిలిచారు. దీనికి అనుగుణంగా ఆయన "సాత్విక నిరోధం లేదా శాంతియుత ప్రతిఘటన" సంఘాన్ని స్థాపించారు.

## 20.3 గాంధీ రాజకీయ సిద్ధాంతాలు :

### 20.3.1 సత్యాగ్రహము :

"సత్యాగ్రహముం". అను పదము నందు సత్ + ఆగ్రహం అను రెండు పదములు ఇమిడి ఉన్నాయి. సత్ అంటే నిజం, ఆగ్రహం - అంటే పట్టుదల. సత్య అంటే ప్రేమ. ఆగ్రహం అంటే దాని వల్ల కలిగే స్థిరత్వం (బలం) అని కూడ చెప్పవచ్చును. దీని ముఖ్యోద్దేశం సత్యంలో పట్టుదల ఉందని నొక్కిచెప్పడమే. సత్యాగ్రహానికి వాస్తవమైన అర్థం ఏమంటే సత్యం కోసం ఉపవాసం చేయటము. తప్పు చేసిన వారిని బాధించటం సత్యాగ్రహి అభిమతం కాదు. తప్పుదోవన పోయేవారిని మంచితోవకు మళ్ళించటమే సత్యాగ్రహి ధ్యేయము. సత్యాన్ని కానీ, దైవాన్ని కానీ జయించడానికి సత్యాగ్రహం ఒక సాధన.

గాంధీ భావనలో మానవులలో ఆత్మబలం కాని, అహింస కాని అంతర్గతంగా ఉంటుంది. మానవునికి చెడుతో ఏ విధంమైన సంబంధం ఉండరాదని గాంధీజీ బోధించాడు. చెడును చెడుతోకాక మంచితోనే ఎదుర్కోవలె. ఇది వ్యతిరేక భవం కాదు. సత్యాగ్రహులు వారిలో వారు సహకరించుకొంటూ వ్యతిరేకులలో ఉండే సద్గుణాలను స్వీకరించవలె. వ్యతిరేకులకు చెడును ఊహించినే, కఠినంగా మాట్లాడినా సత్యాగ్రహాన్ని అతిక్రమించినట్లు అవుతుంది. కోపం, క్రోధం, విరోధం, ఓర్వలేని తనము మొదలైన దుర్గుణాలు సత్యాగ్రహికి తగవు. పెద్దగా అరవటం, ఓర్పులేకుండా ఉండటం సత్యాగ్రహికి ఉండరానివి. సత్యాగ్రహం హింసకు సంపూర్ణ వ్యతిరేకి. సత్యాగ్రహానికి ఉండవలసిన సద్గుణాలన్నీ లేని పక్షంలో అది దురాగ్రహం అవుతుంది.

చెడును తొలగించటానికి సత్యాగ్రహం ఉపయోగపడుతుంది. సత్యాగ్రహి ఎల్లప్పుడు వ్యతిరేకుల భావాలను మంచివిగా గుర్తించవలె. దీనివల్ల సత్యాగ్రహి ఇతరులను బాధించే అవసముండదు. అవసరమైతే తాన్నే వేదనను అనుభవింవలె. సత్యాగ్రహి, తస్యాగ్రహం ఆచరించే ముందు అనిన రకాలుగా పని సాధించటానికి ప్రయత్నించవలెను. సాధించాలనుకొన్న పనిని శాంతంగాను, సాత్వికంగాను ప్రజలకు నచ్చచెప్పి, తద్వారా సాధించవలెను. ప్రజలను జ్ఞానవంతులుగాను, వివేక వంతులుగాను చేయటానికి ప్రయత్నించవలెను. సత్యాగ్రహి వివిధ ప్రయత్నాలు జరిపినా కూడా సానుకూలత కలగకపోతే అప్పుడు సత్యాగ్రహం ఆరంభించవలె. చెడుకు, చెడుచేసే వాడికి మధ్య ఉన్నతేడాను సత్యాగ్రహి గుర్తించవలె. చెడు చేసేవాడిని ద్వేషించరాదు. సత్యాగ్రహి ఎల్లప్పుడు చెడును, మంచితోను, కోపాన్ని ప్రేమతోను, అబద్ధాన్ని నిజంతోను, హింసను అహింసతోను జయించవలెనని గాంధీ సూత్రీకరించెను.

గాంధీ సిద్ధాంతము ప్రకారం తన సత్యాగ్రహోద్యమంలో పశుబలానికి తావులేదు. ఎన్నికష్టాలు వచ్చినా సత్యాగ్రహులు ఎట్టువంటి పరిస్థితులలోను పశుబలం ఉపయోగించరాదు. వ్యక్తుల శారీరక దుర్భలత్వానికి, సత్యాగ్రహానికి, గాంధీ ఉద్దేశంలో ఎట్టువంటి సంబంధం లేదు. ఎక్కడ పశుబలానికి అవకాశం ఉందో అక్కడ ఆత్మశక్తి తక్కువ స్థాయిలో ఉంటుంది.

సత్యాగ్రహం అందరూ ఆచరించదగినదే. పిల్లలు, పెద్దలు, స్త్రీలు, పురుషులు, ధనికులు, పేదలు అనే వ్యత్యాసం లేదు. అందరూ సత్యాగ్రహ మార్గాన్ని అనుసరించ వచ్చు. అయితే సత్యాగ్రహానికి క్రమశిక్షణ చాలా అవసరం. తగిన శిక్షణ పొందటానికి బ్రహ్మచర్యం, నిరాడంబర జీవనం, శ్రమశక్తి, నిగర్వం సాధనాలు. అన్నింటకంటే ముఖ్యమైనది సత్యాగ్రహికి సంపూర్ణ భక్తి శ్రద్ధలు ఉండాలని గాంధీ ప్రబోధించెను.

### 20.3.2 సత్యాగ్రహం - అహింస :

సత్యాగ్రహాన్ని అహింసాయుత ప్రత్యక్ష చర్యగా వర్ణించ వచ్చును. ఈ పద్ధతిలో పోరాటం సాగించటానికి తగిన శిక్షణ పొందిన వ్యక్తులు సత్యాగ్రహులుగా పోరాటంలో ముందు శ్రేణిలో ఉండాలి. ఎన్ని కష్టాలనైనా ఓర్పుతో, చిరునవ్వుతో, నిగ్రహంతో సహించడానికి సంసిద్ధంగా ఉండాలి. సత్యమే పరమావధి అని అహింస దానిని సాధించే మార్గమనీ గాంధీ నమ్మారు. సత్యం, ఆత్మ నిగ్రహం, అహింస పద్ధతుల ద్వారానే తన ఆశయాలను గాంధీ సాఫల్యం చేసారు. గాంధీ తన అనుచరులకు వాటి స్వరూపం, స్వభావాలను, వాటి ఆవశ్యకతను వివరించేవారు. ఆయన కార్యకలాపాలన్నింటికీ సత్యమే కేంద్ర బిందువు అయింది.

చెడ్డ సాధనాల వల్ల సత్ఫలితాలు ఎన్నడు ఏర్పడవని గాంధీ ప్రగాఢంగా భావించాడు. అందువల్లనే సత్యాన్ని ఎప్పుడూ పాటించాలని, దాని నుంచి ఏ మాత్రం తొలగినా సత్యాగ్రహం పవిత్రతకు భంగం కలుగుతుందని ఆయన బోధించేవాడు.

భారతదేశంలో సత్యాగ్రహోద్యమం చాంపరాన్‌లో ప్రారంభమైంది. సహాయ నిరాకరణ (Non-Cooperation) లో భారతీయులు సత్యాగ్రహం, అహింస సాధనాల పవిత్రతలను గూర్చి నేర్చుకొన్నారు. అన్యాయం, కక్ష, దౌర్జన్యం మొదలైన వాటిని అహింసా పద్ధతులతో ఎదుర్కొవచ్చుని గాంధీ భావించేవారు. అన్యాయాలు, అక్రమాలు చేసేవారు సంతాపం పొంది మంచి మార్గానికి వస్తే సత్యాగ్రహం లక్ష్యం నెరవేరుతుందని గాంధీజీ విశ్వాసం.

### 20.3.3 సత్యాగ్రహ పద్ధతులు:

సత్యాగ్రహంలో అనేక పద్ధతులు కలవు. మొదటిది ఉపవాసమ దీక్ష. రెండవది బాధలు భరించలేక ఇతర ప్రాంతాలకు వలస పోవటం. ఆస్తులను ధ్వంసం చేయటం, సత్యం, అహింస ధర్మాలను పాటించక పోవటాన్ని గాంధీ ఆమోదించలేదు. సత్యాగ్రహి ప్రభుత్వ చట్టాలను యదేచ్ఛగా పాటించాలి. అటువంటి స్థితిలోనే చెడ్డ చట్టాలను ప్రతిఘటించే నైతిక హక్కులను సత్యాగ్రహి పొందుతాడని గాంధీ ప్రభోధించెను.

సత్యాగ్రహం అనేక రూపాలలో ఉంటుంది. ఇందులో మొదటిది సహాయ నిరాకరణ. చెడు చేసిన వారితో సహకరించవద్దు. ఇది చాలా సాధురూప ప్రతిఘటన. దీని తీవ్రస్థాయి శాసనోల్లంఘనం. గాంధీ సిద్ధాంతం ప్రకారం ఆయుధాలతో తిరుగుబాటు కంటే సంపూర్ణ శాసనోల్లంఘన అత్యంత శక్తివంతమైన ప్రతిఘటన. ఏ కల్మషమూ లేని నిరాయిధులను చూచి ప్రజలు చాలా కాలం మౌనం వహించలేదు. ప్రజాభిప్రాయం, ప్రభుత్వ దుష్టచర్యలను ఖండించటమేగాక ఆ ప్రభుత్వం అంతుకూడా చూస్తుంది.

### 20.3.4 లక్ష్యాలు, సాధనాలు - Ends and Means :

లక్ష్యాలు, సాధనాలు విడదీయరానివి. ఉత్తమ లక్ష్యాలను సాధించడానికి ఉత్తమ సాధనాలను అవలంబించాలి. చెడ్డ సాధనాల ద్వారా మంచిని సాధించలేము. ఒక వేళ అలా సాధించ గలిగినప్పటికీ అది మంచిదిగా మిగిలిపోదు. గాంధీ సాధనాలను విత్తనాలతోను, లక్ష్యాలను వృక్షాలతోను పోల్చినారు. సత్యాన్ని సాధించటానికి గాంధీజీ అహింసను సాధనంగా చెప్పినాడు. గాంధీజీ లక్ష్యాలు, సాధనాలు కూడా అత్యుత్తమమైనవిగా ఉండవలెనని ప్రకటించాడు.

### 20.3.5 రాజకీయాలు - మతం :

గాంధీ ఉద్దేశంలో మతం రాజకీయాలకు పునాది. మతం వ్యక్తి గతమైందని, ప్రజాజీవితానికి, మతానికి సంబంధం లేదని అనేక మంది వాదన. అయితే గాంధీ ఈ వాదనను ఏకీభవించలేదు. గాంధీ అభిప్రాయంలో మతం మానవునిలోని పశుత్వాన్ని

తొలగించి అతనిలోని మానవత్వాన్ని, కారుణ్యదృక్పథాన్ని మేల్కొలిపి వ్యక్తుల మధ్య పరస్పర సహకారానికి దోహదం చేస్తుంది. అయిత మతం పేరిట మూఢ విశ్వాసాలను, ఆచారలను, సాంప్రదాయాలను, ఆయన ఎప్పుడూ సమర్ధించలేదు. అంతేకాదు, మతం పేరిట ప్రత్యేక సదుపాయాలను ఎవ్వరికీ కల్పించ రాదని గాంధీ వాదించేవారు. ఈ కారణం వల్లనే రాజ్యం మత ప్రమేయం లేకుండా ఉండాలని భావించారు. ప్రస్తుత రాజ్యాంగం లౌకిక రాజ్యాంగా భారతదేశాన్ని రూపొందించటం బహుళ గాంధీయ సిద్ధాంత ప్రభావ ఫలమే అని చెప్పవచ్చును.

## 20.3.6 ధర్మకర్తృత్వ సిద్ధాంతము - Theory of Trusteeship :

భారతదేశం అతి పేద దేశం ధనిక-పేద తేడా గణనీయ స్థాయిలోనే ఉంది. గాంధీ ధనికులు తమ సంపదను పేద ప్రజల అభివృద్ధి కోసం వ్యయం చేయ్యాలని భావిస్తారు. సమాజంలోని వ్యక్తులంతా పైకి రావాలి. అయితే ఇటువంటి ఆర్ధిక సమానత్వానికి గాంధీ పెట్టుబడిదారీ విధానాన్ని పూర్తిగా ఖండించలేదు. సామ్యవాదాన్ని పూర్తిగా బలపరచలేదు. అలాగని విప్లవపంథా కమ్యూనిజాన్ని సమర్ధించలేదు. బడా పెట్టుబడిదారులను, భూస్వాములను నిర్మూలించే కమ్యూనిస్ట్ తత్వాన్ని గాంధీ అంగీకరించలేదు. అన్ని రాజకీయ సిద్ధాంతాలకు అతీతంగా గాంధీ ఒక మార్గాన్ని సూచించారు. దీనినే ధర్మకర్తృత్వ సిద్ధాంతం అంటారు.

ధర్మకర్తృత్వ సిద్ధాంతం ప్రకారం పారిశ్రామిక వేత్తలు, భూస్వాములు తమ ఆధీనంలో ఉన్న పరిశ్రమలకు, వ్యవసాయ భూములకు సమాజం పక్షాన తాము ధర్మకర్తలమని బావించుకోవాలి. తాము నిర్వహించే కార్యకలాపాలకు కొద్దిపాటి ప్రతిఫలాన్ని తీసుకొని మిగతాది సమాజ ప్రయోజనం కోసం వ్యయం చేయాలి.

ఈ సిద్ధాంతము రెండు రకాల ప్రయోజనాలను సమకూరుస్తుంది వానిలో (1) సంపద పరిశ్రమ, ప్రైవేట్ వ్యక్తుల యాజమాన్యంలో ఉండటం వల్ల ఉత్పత్తి సామర్ధ్యం, శ్రద్ధ పెరుగుతాయి. (2) జాతీయకరణ ద్వారా ప్రభుత్వ రంగంలో కొనసాగుతున్న వ్యాపార సంస్థలలోవలె నష్టాలు అసమర్ధత, బాధ్యతారాహిత్యం ధర్మకర్తృత్వ వ్యవస్థలో కనిపించవు. యజమానులు వారి ప్రతిఫలం పోను మిగిలిన లాభమంతా సమాజ ప్రయోజనాలకు వినియోగించ వచ్చు. పెట్టుబడుదారులు ఈ ఏర్పాటును అంగీకరించక పోతే సత్యాగ్రహం ద్వారా వారిని ప్రజలు ఒప్పించవచ్చని గాంధీ వాదిస్తారు. ఈ విధంగా ధర్మకర్తృత్వ సిద్ధాంతం రాజకీయ ఆర్ధిక వ్యవస్థలకు గాంధీ అందిచ్చిన ఒక ముఖ్యమైన భావనగా భావించవచ్చు.

## 20.3.7 గాంధీజీ ఆదర్శ రాజ్యం - Ideal State of Gandhi :

గాంధీజీకి అత్యంత ప్రీతికరమైన ఉత్తమ రాజ్యము 'స్వరాజ్' (Swaraj). స్వరాజ్‌లో సాంఘిక వ్యవస్థలు అహింసా సూత్రంపై నిర్మింపబడతాయి. స్వరాజ్ అంటే స్వపరిపాలన. అంటే స్వయం నిగ్రహం అని కూడా గ్రహించవలె. గాంధీజీ అభిప్రాయంలో స్వయం పరిపాలన ఆత్మగతమైన ప్రజాస్వామ్య ఆదర్శానికి సాధ్యమైనంత సన్నిహితంగా ఉండవలె. ఈ ఆదర్శ ప్రజాస్వామ్యంలో రాజ్య అవసరమే ఉండదు. అందువల్ల పార్లమెంటరీ ప్రభుత్వాన్ని గాంధీజీ మార్పుకు సహకరించే ఒక వ్యవస్థగా పరిగణించాడు.

సంపూర్ణ ఆర్ధిక స్వాతంత్ర్యం, విదేశీయుల నుంచి దాస్య విమోచన దీని లక్ష్యాలు. అటువంచి స్వరాజ్‌లో ప్రజలకు వారి హక్కులు తెలిసి ఉంటే చాలదు. వారి బాధ్యతలు కూడా తెలిసి ఉండాలి. ఈ స్వరాజ్‌లు ఎవరకి ఎవరూ శత్రువులు కారు. సమిష్టి శ్రేయస్సుకు ప్రతి వ్యక్తి తన శక్తి సామర్ధ్యాలను బట్టి శ్రమిస్తాడు. అందరూ అక్షరాస్యులు. వారి జ్ఞానము దినదినాభివృద్ధి చెందుతుంది. అనారోగ్యం పరిమితమవుతుంది. దారిద్ర్యంనకు తావుండదు. ప్రతి ఒక్కరికి వృత్తి లభిస్తుంది. ప్రతి ఒక్కరు అందరి కోసం జీవిస్తారు. ఏ కొద్ది మందికో గాక అందరికీ అధికార దుర్వినియోగాన్ని ప్రతిఘటించే శక్తి లభించినప్పుడు నిజమైన స్వరాజ్

లభిస్తుంది. పూర్ణ స్వరాజ్ రాజుకు ఎంత అవసరమో పేదలకు కూడా అంతే అవసరం. ధనిక భూస్వామికి ఎంత అవసరమో, భూమిదున్నే వ్యవసాయ కూలికి కూడా అంతే అవసరం. పూర్ణ స్వరాజ్‌కు కుల, మత, వర్ణ భేదాలు లేవు. ఇది స్వరజనీనమైనది. విశ్వవ్యాప్తమైనది. దీని ధ్యేయం సర్వోదయము.

ఓటింగ్ పాల్గొనటానికి గాంధీ ఒక విధిగా పరిగణించాడు. వయోజన ఓటింగ్ పద్ధతిని గాంధీజీ సమర్ధించాడు. ఈ హక్కును సమర్ధించడంలో అక్షరాస్య ప్రాముఖ్యతను గాంధీ విస్మరించలేదు. కాని వ్యక్తినైతిక స్వభావానికి అతడు ఎక్కువ విలువ ఇచ్చినాడు.

## 20.3.8 ప్రజాస్వామ్యము - Democracy :

గాంధీ భావనలో ప్రజాస్వామ్యంలో ప్రతి వ్యక్తి ఇతర ప్రాణాలకు, ఆస్తులకు భంగంలేని విధంగా తనకు స్ఫూర్తించిన రీతిల్లో యధేచ్ఛగా వ్యవహరించే శక్తిని పొంది ఉండవలెను. ప్రతి వ్యక్తి సమాజంలోని అన్ని వర్గాల ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించవలె. ప్రత్యేక వర్గాలకు, ప్రత్యేక ప్రాతినిధ్యం ఉండవచ్చు. ఇది వాంఛనీయం కాదు. అపరిపూర్ణతకు నిదర్శనము. కాబట్టి ఈ ప్రత్యేక ప్రాతినిధ్యం తాత్కాలికంగా ఆమోదించవచ్చు.

గాంధీజీ ఆదర్శ ప్రాయమైన ప్రజాస్వామ్యం అహింస పై ఆదారపడి ఉంటుంది. అందువల్ల అవినీతికి తావులేదు. ఇదే నిజమైన ప్రజాస్వమ్యం. అందువల్ల అవినీతికి తావులేదు. గాంధీ అభిప్రాయంలో ప్రజాస్వామ్యం అంటే మెజారిటీ నిరంకుశత్వం కాదు. మైనారిటీ ప్రజల హక్కులకు పూర్తి రక్షణ ఇవ్వవలె. వారి అభిప్రాయాలను గౌరవించవలె. వారి చర్యలను సహృదయతతో సహించవలెను. మైనారిటీ అభిప్రాయంలో సత్యమున్నట్లేతే అది సమిష్టి శ్రేయస్సుకు సహకరించినట్లేతే ఆ అభిప్రాయాన్ని మెజారిటీ ప్రజలు హృదయ పూర్వకంగా స్వీకరించవలెను.

ప్రజా సామ్యం జయప్రదం కావటానికి సాంఘిక దురాచారాలను, మూఢనమ్మకాలను లేకుండా చేయవలెను. స్త్రీ పురుషులకు సమానావకాశాలుండవలె. తమకు నచ్చని ప్రభుత్వాన్ని ప్రజలు మార్చివెయవలె. గాని ప్రభుత్వాన్ని ప్రతి ఘటించరాదు. ప్రజలే ప్రభుత్వానికి బలము. క్రమశిక్షణ లేనిదే ప్రజాస్వామ్యం రాణించదు. ఈ విధంగా గాంధీజీ ఆదర్శ వాస్తవిక అభిలషణీయ ప్రజాస్వామ్యం గురించి వివరించాడు.

## 20.4 అంతర్జాతీయంగా గాంధీ సిద్ధాంత ఆచరణోగ్యత:

1) జాతీయవాద భావనతో గాంధీకి ప్రగాఢ అనుబంధం ఉంది. అయితే ఆయన అంతర్జాతీయ వాది కూడా. అంతర్జాతీయవాదం యదార్థం కాకముందే భూస్వామ్య వ్యవస్థ, తదితర నియంతృత్వ వ్యవస్థలతో పీడింపబడుతున్న దేశాలు తమ స్వంత భవిష్యత్తును నిర్ణయించు కోవడానికి వీలుగా రాజకీయ స్వాతంత్ర్యం ఉండవలె. అంతర్జాతీయ వాదానికి జాతీయవాదం మజలీ. అంతర్జాతీయ సమాఖ్యను ఏర్పరచుకొనే దేశాలు దాని అభీష్టాన్ని అనుసరించి చేయవలె. అంటే అంతకు మునుపే ఆయా దేశాలు జాతీయ సార్వభౌమత్వాన్ని పొంది ఉండవలెనని గాంధీ భావన.

2) పరాయి దేశాలపై పెత్తనాన్ని చెలాయించే సామ్రాజ్యవాద దేశాలకు గల నైతిక పునాదులు అంతరించిపోయే ప్రమాదము ఉందని గాంధీ హెచ్చిరించెను. అణగారిపోయిన, ఆకలితో అలమటించే లక్షలాది ప్రజలు శ్రేయస్సు కోసం పోరాడటానికి ఉద్భవించేదే గాంధీయ స్వరాజ్య భావన. ప్రతి కార్మికునికీ, కర్షకునికి ప్రతి ఒక్కనికీ తినడానికి తిండి, కట్టుకోవడానికి గుడ్డ సమకూరవలె. ఇట్లా జరిగేటట్లు చూడటం ప్రభుత్వ విద్యుక్త ధర్మం. గాంధీ మాటల్లో చెప్పాలంటే "ఇంత మాత్రం సమకూర్చలేని ప్రభుత్వం

ప్రభుత్వమే కాదు. అది అరాజకము అటువంటి రాజ్యాన్ని శాంతియుతంగా నిరోధించవలె".

3) మానవతా వాదిగా గాంధీ మానవుని సహనం, అవగాహన, నిర్భయత్వం, సౌభ్రాతృత్వం మొదలగు అంశాలను నొక్కిచెప్పెను. గాంధీ సిద్ధాంతంలోని సత్యం, సత్యాగ్రహంలో ఉపయోగించే పద్ధతులు మనకు ఊహజనితంగా కన్పించవచ్చును. అయితే ఆ సూత్రాలను ఆచరణలో పెట్టినట్లైతే హృదయాల్లో మార్పు తీసుకొని రావచ్చును.

4) గాంధీ వాస్తవిక వాదిగా నైతిక విలువలను అధిక ప్రాధాన్యతను ఇచ్చెను. నైతిక విలువలను పాటించకుండా, నైతిక చట్టాలను ఆమోదించకుండా ప్రపంచంలోని వివిధ సమస్యలను శాంతిని నెలకొల్పుట కష్టం. కాబట్టి ఈ నాటి రాజ్యపాలకులు గాంధీ ప్రబోధించిన సిద్ధాంత పవనాలవైపు దృష్టిని మరల్చుచున్నారు.

5) అంతర్జాతీయ సంబంధాలు లేదా అంతర్జాతీయ రాజకీయాలు విలువలను ఆధారంగా ఉండాలని గాంధీజం చెబుతుంది. అనగా రాజకీయాలు సేవా దృక్పధంలో ఉండాలిగాని అధికార చెలాయింపు దృక్పధం కలిగి ఉండరాదని గాంధీజీ భావన.అధికార ఆధిక్యత పోటీ ఫలితంగానే ప్రపంచం రెండు ప్రపంచ యుద్ధాలను చవిచూచింది. తతే ఫలితంగానే ప్రపంచ రాజ్యాలు సర్వోదయ సూత్రాల్లోని గాంధీ మార్గంలోని శాంతి వైపు దృష్టిని కేంద్రీకరించినవి.

6) గాంధీజిలో సూత్రీకరించబడిన సూత్రాలే భారత రాజ్యాంగ పీఠిక నందు ప్రతిబింబిస్తున్నవి. ఉదాహరణకు 'సౌభాతృత్వం' సూత్రం అంతర్జాతీయ సంబంధాల్లో పంచశీల సూత్ర రూపకల్పనకు దోహదపడింది. గాంధీ భావించినట్లుగా ప్రపంచశాంతి, వివిధ రాజ్యాలు మధ్య స్నేహ సహకారాన్ని తోడ్పడే విధంగా ఉన్నవి. మానవ ప్రేమ, అవగాహనకు హద్దులు లేవు. కాబట్టి ప్రపంచ మానవాళి కలసిమెలసి ఒక కుటుంబముగా జీవించాలని గాంధీజం ప్రబోధించెను. ఈ నేపధ్యంలో గాంధీజం ప్రభావం ప్రపంచరాజ్యాలపై ప్రస్ఫుటంగా కన్పిస్తున్నాయి. ప్రతి రాజ్యం ప్రపంచ శాంతికై ప్రయత్నించటం, ప్రాబల్య రాజకీయాలకు (Power Politics) దూరంగా ఉండటం, వివాదాలు, సంఘర్షణ, యుద్ధాలను విడనాడటం, అణ్వాయుధ భయభ్రాంతుల నుండి మానవాళికి రక్షణ కల్పిస్తూ ప్రధాన ధ్యేయాలుగా ప్రపంచ రాజ్యాలు ప్రకటించు కొనుచున్నవి.

7. పశ్చిమ రాజ్యాల్లో అనుసరిస్తున్న ప్రజాస్వామ్య సూత్రాలు - స్వేచ్ఛ, సమానత్వం, న్యాయంలను కూడా గాంధీజం నందు వివరింపబడెను. అయితే గాంధీజింలోని ఈ సూత్రాలు ధ్యేయాలుగా (Goals) గాక, ప్రపంచంలోని అన్ని ప్రాంతాల్లోనూ అణగారిన, దోపిడికి గురికాబడిన వర్గాలకు వెలుగును చూపే సాధనాలు (Means)గానే ఉండాలని గాంధీ భావన. అనగా స్వేచ్ఛ, సమానత్వం, సమన్యాయం సమాజంలోని అనగారిన వర్గాల వారికి (హరిజన, గిరిజన, వెనుకబడిన కులాలు,వర్గాలు, బలహీనవర్గాలు), స్త్రీలకు అందుబాటులో ఉండాలి. అయితే ప్రపంచంలో ఈ సూత్రాలు వాస్తవ రూపందాల్చుటం లేదు. గాంధీజీ సూత్రాలను ఈ విషయంలో ఆచరించినట్లైతే పాలిస్తీనా - ఇజ్రాయిల్ మధ్య, తైవాన్ విషయంలో అమెరికా-చైనా మధ్య, కువైట్ విషయంలో ఇరాక్-సౌదీఅరేబియా మధ్య, కాశ్మీర్ విషయంలో ఇండియా-పాకిస్తాన్ మధ్య వివాదములు వచ్చి ఉండేవి కావి. గాంధీజీ సిద్ధాంతాలు అంతర్జాతీయంగా కొంత వరకు ఆచరణయోగ్యమైనవనే చెప్పవచ్చును.

8 ఆర్థిక సమానత్వ భావనను గాంధీ సమర్థించినాడు. సమాజావసరాలను తీర్చుకోడానికి అందరికీ అవసరమైన వస్తువులు సరఫరా చేసి తీరవలెను. మార్క్సియన్ సిద్ధాంతం "ప్రతి ఒక్కరికి వారి అవసరం మేరకు" ("to each according to his need") అనే భావనకు ఆయన కట్టుబడినాడు. కనీస అవసరాలు అందరికి (తిండి, బట్ట, గూడు, వైద్యం, /చదువు) సమకూరాలి. ఇవి సమకూరాలంటే కుటీర పరిశ్రమలులు మాత్రమే శరణ్యమని గాంధీ అభిప్రాయపడినాడు. ఈనాడు మూడవ ప్రపంచ రాజ్యాలన్ని వీటి కొరకే కృషి చేస్తున్నాయి కదా.

9 గాంధా పెట్టుబడిదారీ వ్యవస్థకు తన తీవ్రమైన వ్యతిరిక్తత కనపరిచనాడు. సమాన పంపిణ (Equal distribution) సిద్ధాంత ఆచరణ కోసం ఆయన శ్రమించాడు. అవసరానికి మించి సంపద పేరుకొని పోకూడదనీ, అధికంగా ఉన్న మిగులు సంపద (Surplus Wealth) సమాజ శ్రేయస్సుకై వినియోగించాలనే ఆయన భావన. గాంధీ భావన తూర్పు ఐరోపా రాజ్యాల్లో ముఖ్యంగా కమ్యూనిస్టు రాజ్యాల్లో వారి వాదన ఇదే.

## 20.5 గాంధీ రాజనీతి సిద్ధాంత విమర్శ :

1 గాంధీ రాజనీతి తత్వంలో స్పష్టత లేదు. ఇవి కేవలం భావాల - సూత్రాల సముదాయానికే పరిమితమైనవి. ఉదాహరణకు రాజ్యం ఉండాలా, లేదా అనే విషయంలో స్పష్టత లేదు. ఒకనొక సందర్భంలో రాజ్యరహిత ప్రజాస్వామ్యం ఉండాలని చెప్పగా. మరొకసారి రాజ్యం మాత్రమే అహింసాయుత పాలన అందించగలదని వివరించింది.

2 గాంధీజీం పూర్తిగా ఆచరణయోగ్యం కాని సూత్రాలతో నిండియున్నది. ఎందుకనగా రాజ్యరహిత ప్రజాస్వామ్యం అసాధ్యం. ప్రజాస్వామ్యమంటేనే ప్రజల తరపున ప్రజాప్రతినిధులు అధికారమును చెలాయించెదరు. అదే విధంగా ధర్మకర్తృత్వ సిద్ధాంతము ప్రకారం ధనవంతులు ఆస్తికి కేవలం ధర్మకర్తలగానే వ్యవహరించాలి. కాని ధనవంతులు తాము సంపాదించిన ఆస్తిని వదలుకొనుటకు ఇష్టపడరు. ప్రపంచంలో సగం మంది ధనవంతులే వున్నారు. కావున ఈ సిద్ధాంతం ఆచరణ యోగ్యం కాదు.

### 3 గాంధీ ఆర్థిక విధానం ఆచరణయోగ్యం కాదు :

ఆధునిక యుగంలో గాంధీ ఆర్థిక విధానం విజయవంతమైనది కాదు. గాంధీ సిద్ధాంతంలోని వికేంద్రీకరణ ఎంతో సమర్థనీయమైనప్పటకీ, యాంత్రీకరణను వదలివేయలేము. ప్రపంచమంతయు పారిశ్రామీకరణ వైపు మొగ్గు చూపుతుండగా కేవలం ఏ ఒక్క దేశం పూర్తిగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై ఆధారపడలేదు. ఈ వాస్తవాన్ని ప్రపంచంలో ఏదేశం కాదనలేదు. భారత దేశం పూర్తిగా గాంధీజీ సిద్ధాంతంపై ఆధారపడినట్లైతే, ప్రపంచంలోని మిగిలిన దేశాలన్నింటి కంటే ఎంతో వెనుకబడి ఉండాలసివస్తుంది.

### 4 అహింసా సూత్రాలు పరిమితం :

వాస్తవానికి గాంధీజీ సిద్ధాంతంలోని అహింసా సూత్రం ఎంతో అమూల్యమైనది. కాని వ్యక్తుల ప్రవర్తన దృష్ట్యా, రాజ్య శ్రేయస్సు దృష్ట్యా, అంతర్జాతీయ సంబంధాల దృష్ట్యా అహింసా సూత్రాన్ని పూర్తిగా వినియోగించుటకు సాధ్యపడక పోవచ్చు. ఒక ముఖ్య విషయాన్ని గుర్తించు కోవాలి. మానవవాళిఅంతయు సాధు స్వభావము కల్గిన వారు కాదు. అలాంటి సందర్భాల్లో అహింసాయుధము పూర్తిగా సత్ఫలితాలను ఇవ్వలేదు.

### 5. సత్యాగ్రహ ఆయుధం అంత తేలికైన సాధనం కాదు :

సత్యాగ్రహ ఆయుధంను దుర్వినియోగం చేయరనే నమ్మకం లేదు.

## 20.6. గాంధీ సిద్ధాంత విశిష్టత :

గాంధీజం కొంత విమర్శకు గురియైనప్పటికి దానిలో కొంత విశిష్టత లేక పోలేదు. అవి.

1. గాంధీ భావించిన ప్రజాస్వామ్యం మహోన్నతమైన మానవ వ్యవస్థ. ప్రజాస్వామ్యానికి క్రమశిక్షణ గీటురాయి. ప్రజాస్వామ్యం ప్రజాశ్రేయస్సు కొరకే పాటుపడుతుంది. ప్రజాస్వామ్య వాదికి తన పార్టీ ప్రయోజనాలు ప్రజాస్వామ్యానికి కన్న ఉన్నతమైనవి కావు. ప్రజాస్వామ్య వ్యవస్థను ప్రతిఘటించ రాదు. అట్లు ప్రతిఘటించినట్లైతే అరాచకం కొని తెచ్చుకొన్నట్లే. అయితే తమకు నచ్చని ప్రభుత్వాన్ని ప్రజలు మార్చి వేయవచ్చు.

2 గాంధీజింలోని అహింసా మార్గాలు ప్రపంచశాంతినే కోరుచున్నవి.

3 గాంధీ తత్వంలోని ధర్మకర్తృత్వ సిద్ధాంతం వ్యక్తుల దోపిడిని నిరోధింపజేస్తుంది.

4 గాంధీజీ ఆదర్శ రాజ్యంలో గ్రామ స్వరాజ్యం (Village Republic) అత్యంత ముఖ్యమైనది. గ్రామ స్వరాజ్యం స్వయం సమృద్ధిని కలిగి, స్వయం శక్తిపై ఆధారపడి ఉంటుంది. నిర్బంధ ప్రాథమిక విద్య, స్త్రీ, పురుషుల మధ్య సమానత్వం కలిగి ఉండే విధంగా ఉంటుంది. ప్రస్తుత కాలంలో అన్ని ప్రభుత్వాలు గాంధీ సూత్రాలు అమలు కొరకే కృషి సల్పుతున్నవి కదా!

5 గాంధీజి హక్కుల కంటే బాధ్యతలకు అధిక ప్రాధాన్యత ఇచ్చినది. బాధ్యతలను విస్మరించి హక్కుల కొరకే పోరాడటం శ్రేయోదాయకం కాదనే గాంధీ భావన ఆదర్శవంతమైనది.

6 మానవుని స్వభావంపై గాంధీ అభిప్రాయాలు గమనించదగ్గవి. మానవుని స్వభావం జడమైనది కాదని, ప్రతివ్యక్తి మంచి పనులు చేసే సమర్థత కలవాడని గాంధీజీ ప్రాథమిక విశ్వాసము.

7 గాంధీ లక్ష్యాలు, సాధనాలు (Ends and Means) కూడా అత్యున్నతమైనవిగా ఉండాలనే భావన గమనించదగినది.

## 20.7 సారాంశము :

గాంధీ నైతిక విప్లవ ప్రవక్త, నైతిక, సామాజిక, రాజకీయ అంతర దృష్టులుగల వ్యక్తి. గాంధీ భారత ఆర్థిక వ్యవస్థకు గ్రామాలు కీలకమైనవని అభిప్రాయపడెను. కుటీర పరిశ్రమలు, ఖాదీలను ప్రోత్సహించడం ద్వారా మానవశక్తిని ప్రయోజనకరంగా ఉపయోగించుకోవాలి - అనేవాడు. గాంధీ ఒకతాత్విక ఆదర్శవాది. స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, న్యాయంకోసం పోరాడిన గాంధీ పాశ్చాత్యత, సామ్రాజ్యవాదాన్ని ప్రతిబింబిస్తుందంటారు. అహింసాయుత సమాజాని గురించి గాంధీ కలలు కనేవారు. మానవ స్వభావంలోని మంచితనంలో ఆయనకు నమ్మకము ఎక్కువ. కాని గాంధీ బోధనలను విని, ఆయన ప్రభోదించిన విషయాలను ఆచరించడంలో భారతీయులు అంతగా ముందంజ వేయలేక పోయినారు. ఏది ఏమైనప్పటికీ తన అసాధారణ వ్యక్తిత్వంతో మానవాళిని ఆశ్చర్య పరచిన గాంధీ భారతదేశ చరిత్రలో మరపులేని, మరపు రాని వ్యక్తిగా నిలిచిపోయినాడు.

## 20.8 చదువదగిన గ్రంథాలు :


| | | |
|---|---|---|
| బి.యస్. శర్మ | - | Gandhi as a Political Thinkers |
| బి.పి. శీతారామయ్య | - | గాంధీ మరియు గాంధీజం |
| ఈ. ఆశీర్వాదం | - | Political Theory |
| జి.యన్. ధావన్ | - | పొలిటిక్ ఫిలాసఫి ఆఫ్ మహాత్మా గాంధీ |
| M.M. Sankhdher | - | Understanding Gandhi Today |

**20.9 మాదిరి ప్రశ్నలు :**

1 గాంధీజీని ప్రభావిత పరిచిన అంశాలను పేర్కొనుము.

2 గాంధీజీ రాజకీయ తత్వ విచారమును పేర్కొనుము.

3 గాంధీజీ సిద్ధాంతము ఏ విధంగా విమర్శకు గురియైందో పేర్కొనుము.

**లఘు వ్యాసరూప ప్రశ్నలు :**

1 గాంధీజీ ఆదర్శ రాజ్యమును పేర్కొనుము.

2 గాంధీజీ సూత్రాలు ఆచరణోద్యమా?

3 గాంధీజీ ధర్మకర్తృత్వ సిద్ధాంతమును క్లుప్తంగా వివరింపుము

4 గాంధీజీ సత్యాగ్రహ సూత్రాలను వివరింపుము.

5 గాంధీజిం ప్రాధాన్యతను పేర్కొనుము.

డా. యం. పాండురంగారావు

(DAPOL 31)

B.A. DEGREE EXAMINATION, MAY 2011.

(Examination at the end of Final Year)

Part II – Political Science

Paper III — POLITICAL THOUGHT

Time : Three hours

Maximum : 100 marks

SECTION A — (2 × 15 = 30 marks)

Answer any TWO of the following.

1. Examine the "Theory of knowledge".

“జ్ఞాన సిద్ధాంతమును” పరిశీలింపుము.

2. Explain the political thought of Facists.

ఫాసిస్టుల రాజనీతితత్వమును వివరింపుము.

3. Examine Gandhi’s ideas on Non – violence.

అహింసపై గాంధీ భావములను పరిశీలింపుము.

4. Discuss the social contract theory of Hobbes.

హాబ్స్ యొక్క సామాజిక ఒడంబడిక సిద్ధాంతమును చర్చింపుము.

5. What are the views of Machiavelli on king?

రాజా పై మాకియవెల్లి అభిప్రాయములు ఏమిటి?

6. Discuss the theory of Rights of T.H. green.

T.H green యొక్క హక్కుల సిద్ధాంతమును చర్చింపుము.

SECTION B — (3 × 10 = 30 marks)

Answer any THREE questions.

7. Examine Hegel’s views on war.

యుద్ధము పై హెగెల్ అభిప్రాయములను చర్చింపుము.

8. "'Class struggle' is not a new concept" – Discuss

“వర్గ పోరాటము” అనే భావము కొత్తది కాదు” – చర్చింపుము.

9. What is Saptanga theory?

సప్తాంగ సిద్ధాంతమనగా నేమి?

10. Explain M.N. Roy's ideas on Democracy.

ప్రజాస్వామ్యముపై ఎమ్.ఎన్.రాయ్ భావములను పరిశీలింపుము.

11. Socialist ideas of jayaprakash narayan.

జయప్రకాష్ నారాయణ్ యొక్క సోషియలిస్టు భావములు.

12. Leviathan.

లివియధాన్.

SECTION C — (3 × 5 = 15 marks)

Answer any THREE of the following.

13. Satyagraha.

సత్యాగ్రహము.

14. Danda Neeti

దండనీతి.

15. Bentham's ideas on punishments.

శిక్షలపై బెంథామ్ భావములు.

16. Lock's ideas on state of Nature.

ప్రాకృతిక వ్యవస్థ పై లాక్ భావములు.

17. Plato's ideas on the rights of women.

స్త్రీ ల హక్కుల పై ప్లేటో భావములు.

SECTION D — (25 marks)

18. (a) Answer the following in 1 or 2 sentences. (10 × 2 = 20)

(i) Nocturnal council.

నాక్టర్నల్ కౌన్సిల్.

(ii) Tyranmy.

క్రూర ప్రభుత్వం.

(iii) Manusmrit.

మనుస్మృతి.

(iv) Prince.

ప్రిన్స్.

(v) Direct democracy.

ప్రత్యక్ష ప్రజాస్వామ్యము.

(vi) St. Simon.

సెయింట్ సైమన్.

(vii) Public voting.

బహిరంగ ఓటింగ్.

(viii) A.O Hune.

ఎ.ఒ. హ్యూమ్.

(ix) Muslim league.

ముస్లిమ్ లీగ్.

(x) Swaraj party.

స్వరాజ్ పార్టీ.

(b) Answer the following in 1 or 2 sentences. (5 × 1 = 5)

(i) Father of political science.

రాజనీతి శాస్త్ర పితామహుడు.

(ii) Who wrote 'Hind Swaraj'?

'హింద్ స్వరాజ్' ని ఎవరు రచించెను?

(iii) Who is the author of Amuktamalyada?

ఆముక్తమాల్యదను ఎవరు రచించిరి?

(iv) Who wrote 'My Socialism'?

'మై సోషలిజమ్' ను ఎవరు రచించిరి?

(v) In which city Rousseau was born?

రూసో ఏ నగరములో జన్మించెను.

---

B.A. DEGREE EXAMINATION, DECEMBER 2010.

(Examination at the end of Final Year)

Part II — Political Science

Paper III — POLITICAL THOUGHT

Time : Three hours

Maximum : 100 marks

SECTION A — (2 × 15 = 30 marks)

Answer any TWO of the following.

1. Examine the main features of Plato's works.

ప్లేటో రచనల ప్రధాన లక్షణాలను పరిశీలింపుము.

2. Critically examine Plato's ideal state.

ప్లేటో ఆదర్శ రాజ్యమును విమర్శనాత్మకముగా పరిశీలింపుము.

3. Write about Aristotle's division of governments.

అరిస్టాటిల్ ప్రభుత్వ వర్గీకరణ గురించి వ్రాయుము.

4. Explain Hobbes political ideas.

హాబ్స్ రాజనీతి భావాలను వివరింపుము.

5. Examine the Social contract theory of John Lock.

జాన్ లాక్ సామాజిక ఒడంబడిక సిద్ధాంతమును పరిశీలింపుము.

6. Write about the political ideas of Bentham.

బెన్థామ్ రాజనీతి భావములను వ్రాయుము.

SECTION B — (3 × 10 = 30 marks)

Answer any THREE of the following.

7. Describe the birth, development and goals of the Indian National Congress.

భారత జాతీయ కాంగ్రెస్ పుట్టుక, అభివృద్ధి, లక్ష్యాలను వర్ణింపుము.

8. Explain Gandhi's ideas on Truth and Non-violence.

సత్యం, అహింసపై గాంధీ భావములను వివరింపుము.

9. Write a note on Nehru's contribution of India.

భారతదేశమునకు నెహ్రూచేసిన సేవను గురించి ఒక నోట్ వ్రాయుము.

10. Write on essay on the contribution of B.R. Ambedkar.

బి.ఆర్. అంబేద్కర్ సేవపై ఒక వ్యాసము వ్రాయుము.

11. Examine Nehru's international philosophy.

నెహ్రూ అంతర్జాతీయ తత్వమును పరిశీలింపుము.

12. Write the main features of Manusmriti.

మనుస్మృతి ముఖ్యలక్షణములను వ్రాయుము.

SECTION C — (3 × 5 = 15 marks)

Answer any THREE of the following.

13. Hobbes on individual freedom.

వ్యక్తి స్వేచ్ఛపై హాబ్స్ భావములు.

14. Lock on governments.

ప్రభుత్వములపై లాక్ భావములు.

15. J.S. Mill works.

జె.ఎస్. మిల్ రచనలు.

16. Bentham on Punishments.

శిక్షలపై బెన్థామ్ భావములు.

17. Hegal on state.

రాజ్యముపై హెగెల్ భావములు.

SECTION D — (25 marks)

18. (a) Answer the following in 1 or 2 sentences :

(i) Republic.

రిపబ్లిక్.

(ii) Cephalus.

కెఫాలస్.

(iii) Statesman.

స్టేట్స్‌మాన్.

(iv) Corrective justice.

సవరణ ధర్మం.

(v) Mahabharat.

మహాభారతం.

(vi) Sukraniti.

శుక్రనీతి.

(vii) Kautilya.

కౌటిల్యుడు.

(viii) Utillarianism.

ఉపయోగితా వాదం.

(ix) Public voting.

బహిరంగ ఓటింగ్.

(x) Hegal.

హెగెల్.

(b) Answer the following in 1 or 2 words.

(i) The founder of Muslim League.

ముస్లిమ్ లీగ్ స్థాపించినది.

(ii) Editor of New India.

న్యూఇండియా సంపాదకుడు.

(iii) Founder of Arya Samaj.

ఆర్యసమాజ్‌ను స్థాపించినది.

(iv) Roy started which party in 1940.

1940 లో రాయ్ ఏ పార్టీని ప్రారంభించాడు.

(v) The author of one year of Non-Cooperation.

'వన్ ఇయర్ ఆఫ్‌నాన్ కో ఆపరేషన్' గ్రంథకర్త.

---

**(DAPOL 31)**

# B.A. DEGREE EXAMINATION, JUNE 2010.

(Examination at the end of Final Year)

Part II — Political Science

Paper III — POLITICAL THOUGHT

Time : Three hours

**Maximum : 100 marks**

## SECTION A — (2 × 15 = 30 marks)

Answer any TWO questions.

1. Explain Plato's Ideal state.

   ప్లేటో 'ఆదర్శ రాజ్యాన్ని' వివరించుము.

2. Discuss Aristotle's views on Slavery and Citizenship.

   బానిస వ్యవస్థ మరియు పౌరసత్వము యెడల అరిస్టాటిల్ అభిప్రాయాన్ని చర్చింపుము.

3. Explain Kautilya's Sapthanga theory of state.

   కౌటిల్యుని సప్తాంగ రాజ్య సిద్ధాంతాన్ని వివరింపుము.

4. Give a critical account of Hegal's views on state.

   'రాజ్యం' పై హెగెల్ భావాలను విమర్శనాత్మకంగా వివరించుము

5. Explain Mahatma Gandhi's contribution to Indian Political thought.

   భారత రాజనీతి తత్త్వానికి మహాత్మాగాంధీ చేసిన సేవను వివరింపుము.

## SECTION B — (3 × 10 = 30 marks)

Answer any THREE of the following.

6. Explain the social contract theory of Thomas Hobbes.

   థామస్ హాబ్స్ యొక్క సామాజిక ఒడంబడిక సిద్ధాంతాన్ని వివరింపుము.

7. What are the main features of Ancient Greek political thought?

   ప్రాచీన గ్రీకు రాజనీతి తత్త్వ విచారం యొక్క లక్షణాలు ఏవి?

8. Explain the views of J.S. Mill on Liberty.

   'స్వేచ్ఛ' ఎడల J.S. మిల్ భావాలు తెలుపుము.

9. Explain the socialist ideas of St Simon.

సెయింట్ సైమన్ సామ్యవాద భావాలను వివరింపుము.

10. Briefly explain the political ideas of Jawaharlal Nehru.

జవహర్‌లాల్ నెహ్రూ యొక్క రాజకీయ భావాలను సంగ్రహముగా వివరింపుము.

11. Write an essay on Ambedkar's views on Indian society.

భారత సమాజంపై అంబేద్కర్ దృక్పథం గురించి వ్యాసము వ్రాయుము.

12. Explain the views of Manu on 'Raja Dharma' and 'Danda'.

'రాజధర్మం' మరియు 'దండ' యెడల మనువు భావాలను తెలుపుము.

SECTION C — (3 × 5 = 15 marks)

Answer any THREE of the following.

13. Philosopher king.

తాత్విక ప్రభువు.

14. Extremists in Indian National Congress.

భారత జాతీయ కాంగ్రెస్‌లో అతివాదులు.

15. John Locke Social Contract.

సామాజిక ఒడంబడిక – జాన్ లాక్.

16. Radical humanism – M.N. Roy.

శాస్త్రీయ మానవతావాదము – M.N. రాయ్.

17. Total Revolution – Jayaprakash Narayana.

సంపూర్ణ విప్లవం – జయప్రకాష్ నారాయణ.

## SECTION D — (25 marks)

18. (a) Answer the following in 1 or 2 sentences : (10 × 2 = 20)

(i) Sophists.

సాఫిస్టులు.

(ii) Distributive Justice.

వితరణ శీల ధర్మము.

(iii) Leviathan.

లెవియధాన్.

(iv) Theory of consent.

సమ్మతి సిద్ధాంతము.

(v) State withers away.

రాజ్యము అంతరించుట.

(vi) Civil disobedience.

శాసనోల్లంఘనము

(vii) Panchasheela.

పంచశీల.

(viii) Robert Owen.

రాబర్ట్ ఓవన్.

(ix) Hizrat.

హిజ్రత్.

(x) Utilitarianism.

ఉపయోగితావాదము.

(b) Answer the following in 1 or 2 words : (5 × 1 = 5)

(i) Who is the father of British Socialism?

బ్రిటిష్ సామ్యవాద పితామహుడు ఎవరు?

(ii) Who advocated the theory of General Will?

ఎవరు జనేచ్ఛ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు?

(iii) According to 'Whom' State is March of God on the earth'.

రాజ్యము భూమి మీద వెలసిన భగవంతుని స్వరూపమని ఎవరు చెప్పినారు?

(iv) Who believed that 'Justice is the interest of the stronger'?

'బలవంతుని స్వప్రయోజనమే ధర్మము' అని ఎవరు భావించారు?

(v) Who is the author of the book 'Philosophy of Right'?

'Philosophy of Right' అనే గ్రంథ రచయిత ఎవరు?

(కత్తిరించి పంపవలెను)

## అధ్యాపకుల, విద్యార్థుల సలహాలు, సూచనలు :

అధ్యాపకులు, విద్యార్థులు ఈ స్టడీ మెటీరియల్‌కు సంబంధించిన సలహాలు, సూచనలు, ముద్రణ దోషాలు తెలియపరచినచో, పునర్ముద్రణలో తగు చర్యలు తీసుకొనగలము. తెలియపరచవలసిన చిరునామా : **డిప్యూటీ డైరెక్టర్, దూరవిద్యా కేంద్రం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్ - 522 510.**

| **Course** | **Year** | **Paper No. & Title** |
|---|---|---|
| B.A. | IIIrd Year | Paper - III : Political Thought |

(కత్తిరించి పంపవలెను)

(కత్తిరించి పంపవలెను)

(కత్తిరించి పంపవలెను)

11. What do you know on Utopian Socialism?

"కాల్పనిక సామ్యవాదం" గూర్చి నీకు తెలిసింది తెల్పుము.

12. Explain M.N. Roy's views on "Radical Humanism".

"అభ్యుదయ మానవతా వాదం"పై ఎం.ఎన్. రాయ్ భావాలను వివరింపుము।

SECTION C — (3 × 5 = 15 marks)

Answer any THREE of the following.

13. Socrates.

సోక్రటీస్.

14. T.H. Green.

టి.హెచ్. గ్రీన్.

15. Dr. B.R. Ambedkar.

డా. బి.ఆర్. అంబేద్కర్.

16. Sarvodaya.

సర్వోదయ.

17. Federick Engles.

ఫెడరిక్ ఏంగిల్స్.

SECTION D — (25 marks)

18. (a) Answer the following in 1 or 2 sentences : (10 × 2 = 20)

(i) Polis.

పోలిస్.

(ii) Thracemachus.

థ్రాసిమాచస్.

(iii) Matsya Nyaya

మత్స్య న్యాయం.

(iv) Varna system.

వర్ణ వ్యవస్థ.

(v) The spirit.

చిదాత్మ.

(vi) Surplus value.

మిగులు విలువ.

B.A. DEGREE EXAMINATION, MAY 2006.

(Examination at the end of Final Year)

Part II — Political Science

Paper III — POLITICAL THOUGHT

Time : Three hours Maximum : 100 marks

SECTION A — (2 × 15 = 30 marks)

Answer any TWO of the following.

1. Explain Aristotle's views on slavery and revolutions.

బానిసత్వం, విప్లవాలపై అరిస్టాటిల్ భావాలను వివరింపుము.

2. Examine Rousseau's views on popular sovereignty.

ప్రజాసార్వభౌమాధికారంపై రూసో భావాలను పరిశీలింపుము.

3. Examine J.S. Mill's views on Liberty and Representative Government.

స్వేచ్ఛ, ప్రాతినిధ్య ప్రభుత్వంపై జె.ఎస్. మిల్ అభిప్రాయాలను పరిశీలింపుము.

4. Discuss Karl Marx's concept of "Dictatorship of the proletariat"

''కార్మిక నియంతృత్వం''పై కారల్ మార్క్స్ భావాలను చర్చింపుము.

5. Explain Jawahar Lal Nehru's views on 'Democratic Socialism".

''ప్రజాస్వామ్య సామ్యవాదం''పై జవహర్ లాల్ నెహ్రూ భావాలను వివరింపుము.

6. Explain J.P. Narayan's views on "Partyless Democracy".

''పార్టీ రహిత ప్రజాస్వామ్యం''పై జె.పి. నారాయణ్ భావాలను వివరింపుము.

SECTION B — (3 × 10 = 30 marks)

Answer any THREE of the following.

7. Explain Locke's views on Natural Rights.

సహజ హక్కులపై లాక్ భావాలను వివరింపుము.

8. Explain Plato's views on Education.

విద్యపై ప్లేటో భావాలను వివరింపుము.

9. Elucidate the Hegel's views on Dialectics.

గతితార్కికంపై హెగెల్ భావాలను విశదీకరింపుము.

10. What are the suggestions given to the prince by Machiavelli?

''ప్రిన్స్''కు మాకియవెల్లి ఇచ్చిన సలహాలేవి?

**3.11.1. విప్లవాలకు కారణాలు :** విప్లవాలు రావటానికి కాని, విప్లవ పరిస్థితులు ఏర్పడటానికి కాని గల కారణాలను అరిస్టాటిల్ రెండు రకాలుగా విభజించినాడు. అవి సాధారణ కారణాలు మరియు ప్రత్యేక కారణాలు.

అరిస్టాటిల్ ఒక రాజ్యంలో విప్లవం రావటానికి ప్రజల సమానత్వ వాంఛ మరియు న్యాయాభిలాషలు సాధారణ కారణాలుగా పేర్కొన్నాడు. సమాజంలో నెలకొన్న అసమానతలు అసంతృప్తికి, అసంతృప్తి తిరుగుబాటుకు దోహదం చేస్తుంది. ఆ విధంగా సమానత్వాన్ని సాధించటానికి విప్లవాలు చోటు చేసుకుంటాయి. వివిధ రకాల అధికారాలు, ప్రత్యేక హక్కులు, సదుపాయాలు అనుభవించేవారు, వారికి అవి లభ్యం కానపుడు తనకు అన్యాయం జరిగింది అనే అసంతృప్తితో పాలక వర్గంపై తిరుగుబాటు చేస్తారు. అదే విధంగా సామాన్య ప్రజలు తమకు లభ్యం కావలసింది పాలకులు తమకు ఇవ్వకుండా అన్నీ వారే అనుభవిస్తున్నారన్న అసంతృప్తితో తిరగబడతారు. ఆర్థిక అసమానతలు, ప్రభుత్వ అధికారాన్ని దుర్వినియోగం చేయటం, సమాజంలోని సమన్వయాన్ని కుదర్చగలిగే మధ్య తరగతి లేకపోవటం విప్లవాలు రావటానికి దోహదం చేస్తాయి.

ఒక రాజ్యంలో విప్లవాలు రావటానికి సాధారణ కారణాలతో బాటు కొన్ని ప్రత్యేక కారణాలు కూడా ఉండవచ్చునని అరిస్టాటిల్ భావించినాడు. స్వార్థం పదవీ వ్యామోహం, దురహంకారం, ప్రజాజీవితంలో కొందరికే అనుచితమైన ప్రాధాన్యత ఇవ్వటం, ఎన్నికల కుతంత్రాలు, విశ్వాస ఘాతకులకు ఉన్నతమైన పదవులు ఇవ్వటం, రాజ్యాంగంలో కొద్దిపాటు మార్పులు చేయటానికి నిరాకరించటం, రాజ్యంలో వివిధ స్థాయిలలో నెలకొని ఉన్న అసమానతలు మొదలైనవి విప్లవాలకు దారితీస్తాయి.

**3.11.2. విప్లవాలను నివారించటానికి మార్గాలు :** అరిస్టాటిల్ విప్లవాలు రావటానికి గల కారణాలను వివరించటమే కాక వాటిని అరికట్టడానికి అవసరమైన నివారణ మార్గాలను కూడా సూచించినాడు. విప్లవాలు రాకుండా నివారించాలంటే మొట్టమొదట చేయవలసినది ప్రజలలో చట్టం పట్ల విధేయతను పెంపొందించటం. ప్రజలందరు శాసనబద్ధంగా వ్యవహరిస్తే అందరికి లాభదాయకమని ప్రజలకు తెలియజేయవలె. ప్రజలను మోసగించే చర్యలు కాని, కపటోపాయాలు కాని పాలకులు అనుసరించరాదు. రాజ్యాధికారం ఒక వ్యక్తి చేతిలో కాని వర్గం చేతిలో కాని కేంద్రీకరింపబడక, అందరినీ సమదృష్టితో చూడవలయును. ప్రభుత్వ అధికారం లభించలేదనే అసంతృప్తి, అర్హులైన పౌరులలో లేకుండా చూడవలెను. పరదేశీయులకు కాని, అపరచితులకు కాని ఉన్నత పదవులు ఇవ్వరాదు. రాజ్య పాలనలో పదవీదుర్వినియోగం, అవినీతి, లంచగొండితనం మొదలగు అవలక్షణాలు లేకుండా చూడవలెను. ప్రభుత్వం యొక్క అంతర్గత వ్యవహారాలు, ముఖ్యంగా ఆర్థిక పరమైన లావాదేవీలపై ప్రజా పర్యవేక్షణకు అవకాశం కల్పించాలి. అపుడే ప్రభుత్వం ఎక్కువ ప్రజాదరణ పొందుతుంది. యోగ్యతననుసరించి పదవులను ఇవ్వాలి. ఏ ఒక్క వర్గానికో అధికారంలో ప్రాధాన్యత ఇవ్వకూడదు. రాజ్యాంగంలో ఉన్నత పదవులన్నీ రాజ్యంగ విధేయత, పరిపాలనా సామర్థ్యం, సచ్ఛీలత ఉన్నవారికి మాత్రమే ఇవ్వాలి. ప్రజలకు రక్షణ కల్పించటమే కాకుండా వారి విలువలను, సాంప్రదాయాలను గౌరవించాలి. రాజ్యాంగం ప్రజలలో అత్యధిక సంఖ్యాకులకు ఆమోదయోగ్యమై ఉండవలెను.

## 3.12. అరిస్టాటిల్ - సిద్ధాంత విమర్శ :

అరిస్టాటిల్ రాజనీతి సిద్ధాంతం మరియు భావనలు ఎంతగా ప్రాచుర్యాన్ని పొందినప్పటికి వాటిలో కొన్ని లోపాలు కూడా కనిపిస్తాయి. అరిస్టాటిల్ బానిస వ్యవస్థను సమర్థించటం, సమర్థించటానికి ఆయన చేసిన వాదనలు అంత సమంజసంగా లేవు. మానవులందరిని రెండు వర్గాలుగా ఆజ్ఞలిచ్చే పాలకులుగాను, శిరసావహించే బానిసలుగాను విభజించుట సహేతుకంగా లేదు. ఆధునికయుగంలోని కార్మికులు, కర్షకులు అతని భావనలో బానిసల క్రిందే లెక్క. కాని ఈ అభిప్రాయం సమర్ధనీయంగా లేదు. బానిస విధానాన్ని సమర్ధించటంలో అరిస్టాటిల్ జాత్యహంకారాన్ని ప్రదర్శించాడు. గ్రీకులను బానిసలుగా చేయకూడదని ఆయన అంటాడు. అదే విధంగా అరిస్టాటిల్ పౌరసత్వానికి ఇచ్చిన వివరణ కూడా చాలా సంకుచితంగా ఉంది. అతని అభిప్రాయంలో పౌరసత్వం కొద్ది మంది ఉన్నత వంశీయులకు, ఆస్తిపరులకే పరిమితమైంది. జన సామాన్యానికి, స్త్రీలకు పౌరసత్వం అందుబాటులో ఉండదు. వారికి స్వేచ్ఛలేదు, హక్కులు లేవు.

## 3.13. అరిస్టాటిల్ - విశిష్టత :

అరిస్టాటిల్ భావాలలో సిద్ధాంతాలలో కొన్ని లోపాలు ఉన్నప్పటికి పాశ్చాత్య రాజనీతి తత్త్వ విచారంలో ఆయన స్థానం విశిష్టమైనది. ప్రాచీన కాలంలోనే రాజకీయ దృగ్విషయాల అధ్యయనానికి శాస్త్రీయ దృక్పథాన్ని జోడించిన మేటి రాజనీతి తత్త్వవేత్త అరిస్టాటిల్. అరిస్టాటిల్ వెలిబుచ్చిన అనేక అభిప్రాయాలు, సిద్ధాంతాలు ఈనాటికి ఉపయుక్తత (relevance) ను కలిగి ఉన్నాయంటే ఆయన మేధా సంపత్తి, శాస్త్రీయ పరిజ్ఞానం ఎటువంటివో మనం ఊహించుకోవచ్చు. ఆయన రచించిన "పాలిటిక్స్" మధ్యయుగ రచయితలనే గాక ఆధునిక కాలానికి చెందిన ఎందరో రచయితలను ఎంతగానో ప్రభావితం చేసింది. ఆధునిక కాలంలో బహుళ ప్రాచుర్యాన్ని పొందిన సమన్వయ పాలన, రాజ్యాంగితావాదం, అధికార పృథక్కరణ సిద్ధాంతం, ప్రభుత్వాల వర్గీకరణ, శాస్త్రీయ దృక్పథం వంటి ఎన్నో భావనలకు, సిద్ధాంతాలకు పునాదులు అరిస్టాటిల్ రచనలలో మనకు గోచరిస్తాయి. పరిస్థితులకు అన్వయించని ఆ ధర్మాలు నిరర్ధకమని అరిస్టాటిల్ భావన. అందువలనే 'ఉత్తమ రాజ్యానికి' సంబంధించి ఆయన వెలిబుచ్చిన అభిప్రాయాలు, సిద్ధాంత పరంగా ఉన్నతమైనవేగాక, ఆచరణాత్మకమైనవి. ఈ రకమైన ఆచరణాత్మక దృక్పథం అరిస్టాటిల్ చర్చించిన అన్ని అంశాలలో, రూపొందించిన అన్ని సిద్ధాంతాలలో మనకు కన్పడుతుంది. ఈ విధంగా రాజనీతి తత్త్వ విచారంలో ప్లేటో ఆదర్శవాదానికి మార్గదర్శి అయితే, అరిస్టాటిల్ వాస్తవికవాదానికి, శాస్త్రీయ దృక్పథానికి ఆచరణాత్మక వాదానికి మూలపురుషునిగా కొనియాడబడినాడు. తద్వారా రాజనీతి శాస్త్రానికి పితామహునిగా (Father of Political science) ప్రసిద్ధికెక్కినాడు.

## 3.14. సారాంశము :

పాశ్చాత్య రాజనీతి తత్త్వ విచారంలో అరిస్టాటిల్ స్థానం చాలా ప్రముఖమైనది. అతని రచనలు, భావాలు సమకాలీన గ్రీకు సమాజంలోని పరిస్థితుల వలన ప్రభావితం అయినప్పటికి, ఆయన వెలిబుచ్చిన అభిప్రాయాలు ఆ తరువాతి కాలంలో ఎందరో తత్త్వవేత్తలను ఎంతగానో ప్రభావితం చేసినాయి. అక్వినాస్, డాంటి, మాకియవెల్లి, మాంటెస్క్యూ, హెగెల్ వంటి ఎందరో రాజనీతి తత్త్వవేత్తలు అతని సిద్ధాంతాల ద్వారా ప్రభావితులై రచనలు చేసినారు. పాశ్చాత్యరాజనీతి తత్త్వ విచారంలో ఒక రకంగా వాస్తవిక వాదం, శాస్త్రీయ దృక్పథం అరిస్టాటిల్ తోనే ప్రారంభమైందని చెప్పటం అతిశయోక్తికాదు. సోక్రటిస్ భావాలకు ప్లేటో వ్రాత రూపమిస్తే, ఆయా భావాలను వాస్తవిక వాదంతో, శాస్త్రీయ దృక్పథంతో వివరించిన ఘనత అరిస్టాటిల్‌కు చెందుతుంది. ఆయన రచించిన 'పాలిటిక్స్' ఆ తరువాతి కాలంలో ఎంతోమంది మేధావులను, రచయితలను ప్రభావితం చేసి చాలా ప్రముఖమైన గ్రంథంగా గుర్తింపును పొందింది.

రాజ్యావతరణ సిద్ధాంతం పట్ల ఆయన వెలిబుచ్చిన అభిప్రాయాలు, రాజ్యాన్ని ఒక సహజమైన సంస్థగా ఆయన అభివర్ణించిన తీరు, బానిస వ్యవస్థను ఆయన సమర్థించిన పద్ధతి చదువరులను ఎంతగానో ఆకట్టుకుంటాయి. రాజ్యం, ప్రభుత్వాల మధ్య వ్యత్యాసానికి సంబంధించి ఆయన ఇచ్చిన వివరణ, రాజ్యాలలో విప్లవాలు రావటానికి దోహదం చేసే పరిస్థితులను, వాటిని నివారించటానికి దోహదం చేసే పరిస్థితులను, వాటిని నివారించటానికి ఆయన సూచించిన మార్గాలు ఈనాటి పాలకులకు కూడా అనుసరణీయమైనవి. తన గురువైన ప్లేటో తన ఉత్తమ రాజ్యంగా ఆచరణ సాధ్యం కాని 'ఆదర్శ రాజ్యాన్ని' అభివర్ణించగా, అరిస్టాటిల్ తన ఉత్తమ రాజ్యాన్ని ఆచరణాత్మక రాజ్యంగా ఉండాలని భావించినాడు. రాజకీయ సంక్షోభాలకు ఆర్థిక వ్యత్యాసాలు మూలమన్న విషయాన్ని గుర్తించి, తీవ్ర ఆర్థిక వ్యత్యాసాలున్న ధనిక, పేద వర్గ ప్రభుత్వాల కంటే మధ్యతరగతి ప్రాబల్యంలో ఉన్న ప్రభుత్వం సుస్థిరతకు దోహదం చేస్తుందని అరిస్టాటిల్ సిద్ధాంతీకరించినాడు. ప్రజలలో సంపదపరంగా ఎక్కువ వ్యత్యాసాలుండటం రాజకీయ సుస్థిరతకు ఆరోగ్యకమైనది కాదంటాడు. రాజకీయ సుస్థిరతకు పరిమిత ఆస్థి, ఆదాయం ఉన్న మధ్య తరగతి ప్రజానీకం ఒక సామాజిక శక్తిగా, వర్గంగా అవసరమని సుమారు రెండు వేల నాలుగు వందల సంవత్సరాల క్రితమే అరిస్టాటిల్ గుర్తించాడంటే ఆయన వాస్తవిక దృక్పధాన్ని, దూరదృష్టిని, మేధాశక్తిని మనం అంచనావేయవచ్చు.

## 3.15. నమూనా ప్రశ్నలు :

**వ్యాస రూప ప్రశ్నలు :**

1. అరిస్టాటిల్ రాజ్యావతరణ సిద్ధాంతాన్ని గురించి వివరించుము.
2. ప్రభుత్వాల వర్గీకరణపై అరిస్టాటిల్ అభిప్రాయాలను విమర్శనాత్మకంగా వివరించుము.
3. అరిస్టాటిల్ అభిప్రాయంలో 'ఉత్తమ రాజ్యం' ముఖ్య లక్షణాలను వివరించుము.
4. విప్లవాలకు సంబంధించి అరిస్టాటిల్ భావాలను విపులీకరించుము.
5. రాజనీతితత్త్వ విచారం అభివృద్ధికి అరిస్టాటిల్ కృషిని విశదీకరించుము.

**2) లఘు రూప ప్రశ్నలు :**

1. అరిస్టాటిల్‌పై సమకాలీన గ్రీకు సమాజ పరిస్థితుల ప్రభావాన్ని వివరించుము.
2. బానిసత్వ వ్యవస్థపై అరిస్టాటిల్ భావాలు సమర్థనీయమా ?
3. పౌరసత్వంపై అరిస్టాటిల్ అభిప్రాయాలను వివరించుము.
4. ప్రజాస్వామ్యంపై అరిస్టాటిల్ భావాలను విశదీకరించుము.
5. విప్లవాలను నివారించటానికి అరిస్టాటిల్ సూచించిన మార్గాలను వివరించుము.

## 3.16. చదువదగిన గ్రంథాలు


1. George H. Sabine : A History of Political Theory
2. W.A. Dunning : A History of Politcal Theories
3. R.P. Sharma : Western Political Thought
4. ఆచార్య కె. సుభాష్ చంద్రరెడ్డి (Ed). : రాజనీతి తత్త్వ విచారం
5. డాక్టర్ శివయ్య (Ed). : రాజనీతి తత్త్వ విచారము


డా॥ ఐ. దోసగిరిరావు

పాఠం - 4

# కౌటిల్యుడు

## 1.0 లక్ష్యం :

ఈ పాఠం ముఖ్య ఉద్దేశమేమనగా కౌటిల్యుని అర్థశాస్త్రములోని అంశాలను, ఆ కాలము నాటి సామాజిక పరిస్థితిని, కౌటిల్యుని రాజనీతి భావాలు మరియు అతని గొప్పతనమును తెలియజేయుటం.

**విషయక్రమము**


4.1 పరిచయము

4.2 కౌటిల్యుని జీవితము - కాలవ

4.3 అర్థ శాస్త్రము

4.4 సామాజిక వ్యవస్థ

4.4.1 స్త్రీల స్థానము

4.5 రాజ్య వ్యవస్థ

4.6 సప్తాంగ సిద్ధాంతము

4.6.1 రాజు

4.6.2 మంత్రి వర్గము

4.6.3 జనపద

4.6.4 దుర్గము

4.6.5 కోశ (ధనాగారము)

4.6.6 బల (సైన్యము)

4.6.7 మిత్రులు

4.7 రాజు యొక్క స్థానము

4.8 రాజు - విద్య

4.9 రాజు యొక్క అధికారములు

4.9.1 కార్య నిర్వాహక మరియు పాలనా పరమైన అధికారాలు

4.9.2 శాసనాధికారము

4.9.3 న్యాయాధికారాలు

4.9.4 ఆర్థికాధికారాలు

మోహన్‌దాస్ చిన్నప్పటి నుండి వినయ, విధేయతలతో పెరిగాడు. తల్లిలోని దైవ చింతన, హిందూ మత భావాలు, అణకువ మొదలైన లక్షణాలు చిన్ననాటి నుండే అలవడ్డాయి. భారతదేశంలో డిగ్రీ పూర్తి చేసిన తర్వాత, లండన్ వెళ్ళి లా డిగ్రీ పొందాడు. తర్వాత భారతదేశానికి వచ్చి న్యాయవాద వృత్తిని ప్రారంభించాడు. 1893లో ఒక కంపెనీ తరపున దక్షిణాఫ్రికా వెళ్ళి 1914 వరకు అక్కడే ఉన్నాడు. అక్కడ ఆసియా వాసుల సమస్యలపై దక్షిణాఫ్రికా ప్రభుత్వంపై అహింసాయుత ఉద్యమం నడిపి ప్రపంచానికి పరిచయమయ్యాడు. గోపాలకృష్ణ గోఖలే పిలుపు మేరకు 1915లో భారతదేశానికి వచ్చాడు, కాంగ్రెస్‌లో చేరాడు. అయితే అతివాద కాంగ్రెస్ ఉద్యమం ప్రబలంగా ఉన్న రోజుల్లో గాంధీ సామాన్య కాంగ్రెస్ కార్యకర్త. పెద్దగా గుర్తింపులేనివాడు. 1920లో తిలక్ మరణం, గాంధీ నాయకత్వానికి మార్గం సుగమం చేసింది. గాంధీపై తల్లి ప్రభావం ఎక్కువగా ఉండేది. హరిశ్చంద్ర నాటకంలోని హరిశ్చంద్రుని పాత్ర, సత్యవాక్య ఆచరణకై ఆయన పడిన కష్టాలు గాంధీపై విశేషమైన ప్రభావాన్ని చూపాయి. భగవద్గీత, రామాయణం, బుద్ధుని బోధనలు, క్రీస్తు శాంతి సందేశం, ఖురాన్, రస్కిన్, టాల్‌స్టాయ్‌ల ప్రభావం గాంధీపై ఎక్కువ ఉంది. My Experiments with truth, అనే ఆత్మకథ రచించాడు. మితవాది గోపాలకృష్ణ గోఖలే తన రాజకీయ గురువుగా ప్రకటించుకున్నాడు. మితవాదుల పద్ధతులనే జాతీయ ఉద్యమంలో సరికొత్త పంథాలో అనుసరించి స్వాతంత్ర్య సముపార్జన చేసాడు.

**గాంధీజీ సిద్ధాంతాలు :**

1) రాజకీయాలను నైతిక విలువలతో జతపరచాడు

2) అహింసావాది

3) హిందువు - మతవాది

4) పరమత సహనము కలిగినవాడు

5) సత్యము - అహింస, సహాయ నిరాకరణ, శాసనోల్లంఘన, నిరాహార దీక్ష ఆయన స్వాతంత్ర్యోద్యమంలో ఉపయోగించిన పద్ధతులు

6) గ్రామ స్వరాజ్

7) కుటీర, చేనేత పరిశ్రమల అభివృద్ధి

8) అధికార వికేంద్రీకరణ

9) ఖద్దరు వాడకం

10) మద్యపాన నిషేధం

11) అస్పృశ్యతా నివారణ - స్త్రీ విద్య.

స్వాతంత్ర్యోద్యమంలో కాంగ్రెస్‌లో ఏ పదవులు ఆశించలేదు. స్వాతంత్ర్యం తర్వాత స్వతంత్ర్య భారత ప్రభుత్వంలో ఏ అధికార పీఠాన్ని కోరలేదు. దేశానికి ఒక మార్గదర్శకునిగా, ఒక నిష్కర్మయోగిగా జీవించాడు. రవీంద్రనాథ్ టాగూర్ మహాత్మా అని బిరుదునిచ్చాడు. దేశ ప్రజలు జాతి పితగా గౌరవించారు. నెహ్రూ గౌరవంగా బాపూ అని పిలిచే అహింసావాది మహాత్మా గాంధీ, నాథూరామ్ గాడ్సే అనే ఒక మతోన్మాది తుపాకీ గుళ్ళకు బలియై 30-1-1948న హత్య గావింపబడ్డాడు. ఒక భారతీయుడు, ఒక భారతీయుడిని, ఒక హిందువు, ఒక హిందువుని హత్యచేయటం దురదృష్టం.

గాంధీ స్వాతంత్ర్యోద్యమంలో ఒక నూతన మార్గాన్ని అవలంబించాడు అదే అహింసా మార్గం. శాంతియుత, అహింసా పద్ధతులలో కాశ్మీర్ నుండి, కన్యాకుమారి వరకు, ఆబాల గోపాలాన్ని అన్ని వర్గాల కులాల, మతాల ప్రజలను ఏకత్రాటిపై స్వాతంత్ర్య సమరంలో నడిపిన మహానాయకుడు గాంధీ. మేధావులకే తప్ప, సామాన్యులకు చోటులేని కాంగ్రెస్ ద్వారాలను తెరచి సామాన్య ప్రజలను భాగస్వాములను చేసి, రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని కేవలం 27 సంవత్సరాల ఉద్యమం ద్వారా దేశం నుండి తరిమికొట్టిన ఖ్యాతి గాంధీకే దక్కింది.

ఆయనకు గల Communication skills అద్భుతం. సత్యం - అహింసా మార్గాలను తాను గృహంలోనే నేర్చుకొని వాటిని విస్తృత స్థాయిలో ప్రభుత్వంపై ప్రయోగించానంటాడు గాంధీజీ.

**భారతదేశంలో గాంధీజీ తొలి ప్రయోగాలు** : గోపాలకృష్ణ గోఖలే పిలుపు మేరకు 1915 భారతదేశానికి తిరిగి వచ్చిన గాంధీజీ ప్రారంభంలో అతి సామాన్య కార్యకర్త, అమాయకుడు, 1917లో తను చేసిన తొలి సత్యాగ్రహ ప్రయోగంతో వెలుగులోకి వచ్చాడు గాంధీ.

1. 1917లో బీహార్ రాష్ట్రంలోని చంపారాన్ అనే ప్రాంతంలో నీలి పంట పండించే రైతుల పంటకు సరైన ధర చెల్లించక, యజమానులు రైతులను ఇబ్బందులు పెడుతున్న సందర్భంలో అక్కడకు వెళ్ళి ఆ సమస్యను పరిష్కరించడంతో ఆయన రాజకీయ ఉద్యమానికి అరంగేట్రం జరిగింది.

2. 1918లో అహమ్మదాబాద్‌లో నూలు మిల్లు కార్మికులకు యాజమాన్యానికి మధ్య తలెత్తిన వివాదాన్ని, ఆమరణ నిరాహారదీక్ష చేపట్టం ద్వారా పరిష్కరించి విజయవంతమయ్యాడు. ఈ సంవత్సరంలోనే గుజరాతులోని కైరా జిల్లాలో బ్రిటిష్ ప్రభుత్వం రైతులపై విధించిన అధిక భూమిశిస్తుకు వ్యతిరేకంగా ఉద్యమం నడిపి శిస్తును తగ్గింప చేయటంలో విజయం సాధించాడు.

3. 1919లో పంజాబులోని అమృతసర్‌లోని జలియన్ వాలాబాగ్‌లో ప్రజలు సభ నిర్వహిస్తుండగా, సమావేశాన్ని జరుపరాదంటూ ప్రాంగణంలో వున్న ఒకే ఒక మార్గాన్ని మూసివేసి, జనరల్ డయ్యర్ అనే ఆంగ్ల సైనికాధికారి కాల్పులకు ఆదేశించాడు. ఆ కాల్పులలో పారిపోవటానికి కూడా అవకాశం లేక వేలాది మంది మరణించారు. ఆ మారణహోమం భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో ఒక విషాద సంఘటన. దీనికి ధీటైన జవాబు చెప్పవలసిన అవసరం భారతీయులపై ఉంది.

4. మొదటి ప్రపంచయుద్ధ కాలంలో విప్లవాత్మక కార్యకలాపాలను అణచివేయటానికి బ్రిటిష్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన చట్టాన్ని రద్దు చేయకుండా, దానిని రౌలత్ చట్టంగా జారీ చేసారు. దీని ప్రకారం ఏ వ్యక్తినైనా, విచారణ జరపకుండానే, అరెస్టు చేసి జైలులో పెట్టవచ్చు. ఈ నిరంకుశ చట్టానికి వ్యతిరేకంగా గాంధీజీ ఆందోళనలు చెయ్యించారు.

5. మొదటి ప్రపంచ యుద్ధంలో బ్రిటన్, టర్కీని ఓడించి సుల్తాన్‌ను పదవి నుంచి తొలగించింది. ప్రపంచ ముస్లింలదరికీ టర్కీ సుల్తాన్ ఖలీఫా లేదా మతాధికారి. ఈ హఠాత్ పరిమాణంపట్ల భారతీయ ముస్లింలు నిరసన వ్యక్తం చేయగా, గాంధీజీ దానికి పూర్తి మద్దతును ప్రకటించి బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఖిలాఫత్ ఉద్యమం నిర్వహించాడు.

**సహాయ నిరాకరణ ఉద్యమం** : జలియన్ వాగ్ దుతంతాల పట్ల, టర్కీ పట్ల బ్రిటీష్ ప్రభుత్వం అనుసరించిన వైఖరి పట్ల నిరసన వ్యక్తం చేయటానికి, సహాయనిరాకరణ ప్రణాళిక మార్చి 20, 1920న విడుదల చేసాడు. ఇది దేశంలో చాలా ఉద్రిక్తతలకు దారి తీసింది. సహాయ నిరాకరణ కాంగ్రెసు విధానంగా 1920, సెప్టెంబర్‌లో కలకత్తాలో డిసెంబర్ నెలలో నాగపూర్‌లో జరిగిన సమావేశాల్లో ఆమోదించబడింది. 1920 నవంబర్‌లో జరిగిన ఎన్నికలను బహిష్కరించడం గొప్ప సంచలనం. 1921 జనవరి నుండి ఈ ఉద్యమం తీవ్ర స్థాయిలో ప్రారంభమైంది.

**సహాయ నిరాకరణ ఉద్యమంలో ప్రధానమైన కార్యక్రమాలు :**

1) ప్రభుత్వం ప్రధానం చేసిన బిరుదులు త్యజించుట, స్థానిక సంస్థలలో నియమించబడిన సీట్లకు రాజీనామా చేయుట

2) ప్రభుత్వ దర్బారులకు, అధికార విందులకు, ఉత్సవాలకు హాజరు కారాదు.

3) ప్రభుత్వంచే నడపబడే లేదా ప్రభుత్వ సహాయంతో నడపబడే కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థులను మాన్పించుట, వీటి స్థానంలో జాతీయ పాఠశాలలు, కళాశాలలు స్థాపించుట

4) బ్రిటిష్ వారి న్యాయస్థానాలను బహిష్కరించుట

5) మెసపటేమియాలో పనిచేయుటకు భారతీయులు తిరస్కరించుట

6) కౌన్సిల్స్ ఎన్నికల్లో పాల్గొనకుండుట

7) విదేశీ వస్తువుల బహిష్కరణ

**సహాయ నిరాకరణకు లభించిన స్పందన :** సహాయ నిరాకరణకు అనూహ్యమైన స్పందన లభించింది. జాతీయ పాఠశాలలు, కళాశాలలు ప్రారంభించబడ్డాయి. మధ్యవర్తుల ద్వారా తగాదాలు పరిష్కరించుకోవడం మొదలుపెట్టారు. విదేశీ వస్తువుల బహిష్కరణ, స్వదేశీ వస్తువుల వినియోగం ప్రారంభించారు. నూలు వడకడం, ఖద్దరు ధరించడం మొదలుపెట్టారు.

**ఉద్యమంలో ప్రధాన ఘట్టాలు :**

1) 1921 జనవరి నుండి విద్యార్థులు కళాశాలలను, న్యాయవాదులు న్యాయస్థానాలను బహిష్కరించారు. సేట్ జమల్‌లాల్ బజాజ్ తన రావుబహదూర్ బిరుదు త్యజించాడు.

2) ఏప్రిల్, జూన్ మధ్యకాలంలో కోటి మంది సభ్యులను కాంగ్రెసులో చేర్పించాలనే కార్యక్రమం ప్రారంభమైంది. 20 లక్షల చరఖాలు పంచి పెట్టాలని నిర్ణయించారు. తిలక్ స్వరాజ్య నిధికి కోటి రూపాయలు వసూలు చేయాలని నిర్ణయించారు.

3) జూలై నుండి విదేశీ వస్తువుల బహిష్కరణ స్వదేశీ వస్తువుల వాడకం మొదలుపెట్టారు.

4) నవంబరు - డిసెంబరు నెలల్లో వేల్సు యువరాజు పర్యటన సందర్భంగా నిరసన ప్రదర్శనలు నిర్వహించారు.

5) 1922 జనవరి 12వ తేదీన గుంటూరు జిల్లా పెదనందిపాడులో పర్వతనేని వీరయ్య చౌదరి నాయకత్వంలో పన్నుల చెల్లింపు నిరాకరణ ప్రారంభించారు.

6) చౌరీ-చౌరీ సంఘటన : ఫిబ్రవరి 5-1922న ఉత్తరప్రదేశ్‌లోని చౌరీ చౌరీ గ్రామంలో కాంగ్రెసు ఊరేగింపు సాగిపోతుండగా, కోపోద్రిక్తులైన ప్రజలు రోడ్డు ప్రక్కన ఉన్న పోలీసు స్టేషన్ పై పడి, ఒక సబ్ ఇన్‌స్పెక్టరును, 21 మంది పోలీసులను స్టేషన్‌లో పెట్టి, స్టేషన్‌కు నిప్పంటించి తగులబెట్టారు. అహింసా మార్గంలో జరుగుతున్న ఉద్యమం ఒక్కసారిగా హింసాత్మకంగా మారటంతో చలించిన గాంధీజీ ఉద్యమాన్ని నిలిపి వేయవలసిందిగా పిలుపు నివ్వమని కాంగ్రెసు వర్కింగ్ కమిటీని కోరాడు. ఆయన సలహా మేరకు 1922, ఫిబ్రవరి 12 నుండి ఉద్యమాన్ని నిలిపి వేయవలసిందిగా కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు సహాయ నిరాకరణ ఉద్యమం ఆపివేయటం జరిగింది. 1922 మార్చి 13న గాంధీజీని అరెస్టు చేసి 6 సంవత్సరాలు జైలు శిక్ష విధించారు.

**శాసనోల్లంఘన ఉద్యమానికి కారణాలు :** 1929లో లాహోరు కాంగ్రెసు సమావేశంలో గాంధీజీ రాజకీయ వారసుడు, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ అధ్యక్షునిగా ఎన్నుకోబడ్డాడు. 1922 మార్చిలో అరెస్టు కాబడి 6 సంవత్సరాలు జైలు జీవితం గడిపి 1928లో విడుదల కాబడిన గాంధీజీ తిరిగి క్రియా రాజకీయాల్లో ప్రవేశించి కాంగ్రెసు శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాడు. లాహోరు సమావేశంలో "సంపూర్ణ స్వరాజ్యం" కాంగ్రెసు లక్ష్యంగా తీర్మానించబడింది. 1929 డిసెంబరు 31న త్రివర్ణ పతాకం జాతీయ జెండాగా ఎగుర వేసారు. 1930 జనవరి 26న దేశ వ్యాప్తంగా ప్రథమ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు. సంపూర్ణ స్వరాజ్య లక్ష్య సాధన కోసం శాసనోల్లంఘన కార్యక్రమాన్ని చేపట్టే బాధ్యతను గాంధీజీకి కాంగ్రెస్ అప్పగించింది.

**శాసనోల్లంఘన ఉద్యమం (1930-34) :** ఈ ఉద్యమానికి ముందు గాంధీజీ 11 డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ప్రభుత్వానికి అందచేసారు. అందులో ప్రజలు పడుతున్న కష్టాలు, దుఃఖం ప్రభుత్వానికి నివేదించారు. అవి -

1) భూమిశిస్తులో 50 శాతం తగ్గింపు

2) ఉప్పుపై పన్నురద్దు

3) తీర ప్రాంతాలలో ఓడలు నడపడానికి భారతీయులకు స్థానం కల్పించాలి.

4) భారతీయ వస్త్ర పరిశ్రమకు రక్షణ

5) పాలనా వ్యయంలో 50 శాతం తగ్గింపు

6) మత్తు పదార్థాల నిషేధం

7) రాజకీయ ఖైదీలందరినీ విడుదల చేయుట

8) ఆత్మ రక్షణ కోసం భారతీయులకు ఆయుధాలు ధరించుటకు వీలుగా ఆయుధ చట్టం సవరించటం మొదలైనవి.

ఈ వినతి పత్రాన్ని సమర్పించిన గాంధీజీ 41 రోజులు ప్రభుత్వ సమాధానం కోసం ఎదురు చూసాడు. ప్రభుత్వం నుండి ఎంటువంటి స్పందన లేకపోవటంతో చారిత్రాత్మకమైన దండి సత్యాగ్రహము లేదా ఉప్పు సత్యాగ్రహము ప్రారంభించాడు. పన్నులు చెల్లించవద్దని తద్వారా ప్రభుత్వ చట్టాలను ఉల్లంఘించాలని పిలుపునిచ్చారు. ఉప్పు తయారు చేయటం, విదేశీ వస్తువుల బహిష్కరణ, స్వదేశీ ఉద్యమం కూడా ఇందులో భాగాలే.

**చారిత్రాత్మక దండి సత్యాగ్రహము :** ఆహారంలో అందరూ ఉపయోగించే అతి చౌక పదార్థం ఉప్పు. 1923లో ప్రభుత్వం ఉప్పుపై పన్ను పెట్టింపు చేసింది. ఉప్పు తయారు చేయటం నేరంగా ప్రకటించింది. ఈ అక్రమ ప్రజా వ్యతిరేక నిబంధనకు వ్యతిరేకంగా గాంధీ ఉప్పు చట్టాలను ధిక్కరించాలని నిర్ణయించాడు.

దండి అనేది గుజరాతులో సముద్ర తీరంలో గల గ్రామం. శాసనోల్లంఘనలో ప్రథమ కార్యక్రమంగా గాంధీజీ 78 మంది సత్యాగ్రహులతో సబర్మతీ ఆశ్రమం నుండి 1930 మార్చి 12వ తేదీన కాలినడకన బయలుదేరి సుమారు 290 మైళ్ళు ప్రయాణం చేసి మార్చి 5వ తేదీన దండిగ్రామం చేరుకున్నారు. దారి పొడవునా ప్రజలు గాంధీజీ బృందానికి స్వాగతం పలికి కొంత దూరం ప్రయాణించేవారు. అదొక అపూర్వ ఘట్టం. దేశభక్తి పరులైన ప్రజల్లో ఉవ్వెత్తున ఎగసిన దేశభక్తి జ్వాలలు బ్రిటిష్ ప్రభుత్వాన్ని కలవరపరచాయి. మార్చి 6వ తేదీన గాంధీజీ స్వయంగా సముద్రపు ఒడ్డుకు వెళ్ళి ఉప్పు తయారు చేయడంతో సత్యాగ్రహులంతా ఉప్పు తయారు చేసి ఉప్పు చట్టాలను ధిక్కరించి, శాసనోల్లంఘన ఉద్యమానికి శ్రీకారం చుట్టారు.

దేశం యావత్తూ శాసనోల్లంఘనకు సమాయత్తమయ్యింది. ఉప్పు తయారు చేయటం అన్ని ప్రాంతాలలో మొదలు పెట్టారు. సారాషాపులను మూయించే కార్యక్రమాన్ని స్త్రీలకు అప్పగించారు. విదేశీ వస్తు బహిష్కరణ, స్వదేశీ వస్త్ర పరిశ్రమకు వర ప్రసాదమయ్యింది.

ప్రభుత్వం యధావిధిగా అణచివేత చర్యలు ప్రారంభించింది. 1930, ఏప్రిల్ 23న విచక్షణా రహితంగా, పెషావర్‌లో ఉద్యమకారులపై కాల్పులు జరపగా అనేక మంది మరణించారు. ఏప్రిల్ 16న నెహ్రూను తదితర కాంగ్రెసు నాయకులను అరెస్టు చేసింది. మే 5న గాంధీని అరెస్టు చేసి యరవాడ జైలులో పెట్టారు. 60,000 మంది ఉద్యమకారులను జైలులో పెట్టారు. కాంగ్రెస్ కమిటీలను చట్ట వ్యతిరేకమైనవిగా నిషేధించారు. ఇంతలో రాజ్యాంగ సంస్కరణల ప్రతిపాదనకై మొదటి రౌండ్ టేబుల్ సమావేశం లండన్‌లో 1930 నవంబర్ 12న ప్రారంభమైంది. ఉద్యమం విరమింపచేయటానికి చేసిన మధ్యవర్తుల ప్రయత్నాలు ఫలించకపోవటంతో కాంగ్రెసు మొదటి రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొనలేదు. తర్వాత 1931, జనవరి 25న కాంగ్రెసు అగ్రనాయకులను ప్రభుత్వం విడుదల చేసింది. 1931, ఫిబ్రవరి 17న గాంధీ, వైస్రాయ్ ఇర్విన్‌ల మధ్య సంభాషణలు జరిగి ఒక ఒప్పందం కుదిరింది. మార్చిలో శాసనోల్లంఘన ఉద్యమం నిలిపి వేసారు.

1931, సెప్టెంబరు 7న ప్రారంభమైన 2వ రౌండ్ టేబుల్ సమావేశాల్లో గాంధీ పాల్గొన్నాడు. కానీ చర్చలు ఫలవంతం కాలేదు. ఇర్విన్ తర్వాత వైస్రాయ్‌గా పదవి చేపట్టిన వెల్లింగ్‌టన్, గాంధీ - ఇర్విన్ ఒప్పందాన్ని అమలు పరచలేదు. రౌండ్ టేబుల్ సమావేశాల నుండి తిరిగి వచ్చిన గాంధీజీ 1932 జనవరిలో శాసనోల్లంఘన ఉద్యమాన్ని తిరిగి ప్రారంభించారు. అయితే ప్రభుత్వ దమన నీతి ఎక్కువ కావటంతో 34 ఏప్రిల్‌లో మొత్తం ఉద్యమాన్ని ఆపివేసారు.

పూనా ఒడంబడిక (Poona Pact) : 2వ రౌండ్ టేబుల్ సమావేశాల్లో భారతీయ ప్రతినిధులు అల్ప సంఖ్యాకుల విషయంలో ఒక అంగీకారానికి రాలేకపోయారు. దానితో బ్రిటిష్ ప్రధానమంత్రి రామ్‌సే మేక్ డొనాల్డ్ కమ్యూనల్ అవార్డు ప్రకటించాడు. దీని ప్రకారం నిమ్నజాతులకు ప్రత్యేక నియోజకవర్గాలు కేటాయించారు. ఈ ప్రత్యేక నియోజకవర్గాల కేటాయింపు తమకు అంగీకారం కాదంటూ గాంధీ ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించాడు. అయితే గాంధీ ఆరోగ్యం బాగా క్షీణించడంతో మధ్యవర్తుల ప్రమేయంతో గాంధీ - అంబేద్కర్ మధ్య సెప్టెంబర్ 24, 1932లో కుదిరిన ఒప్పందమే పూనా ఒడంబడిక అంటారు. దీని ప్రకారం నిమ్నజాతులకు ప్రత్యేక నియోజకవర్గాలకు బదులు సంయుక్త నియోజక వర్గాలను ఏర్పాటు చేయుటకు అంగీకారం కుదిరింది.

9-8-1942 క్విట్ ఇండియా ఉద్యమం (Quit India) : బ్రిటన్ రెండవ ప్రపంచయుద్ధంలో బాగా బలహీనపడుతున్నది. యుద్ధం వలన ద్రవ్యోల్బణం పెరిగి ప్రజల ఆర్థిక పరిస్థితి బాగా దిగజారింది. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ 1942 ఆగస్ట్ 7, 8 తేదీలలో బొంబాయిలో సమావేశమై భారతదేశం నుండి బ్రిటిష్ వారు తక్షణం వైదొలగాలని అందుకు ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చింది. దీనినే Quit India ఉద్యమం అంటారు. గాంధీజీ కూడా Do or Die అంటూ ప్రకటించారు. అయితే ఉద్యమం ఎప్పుడు ప్రారంభించాలనేది నిర్ణయింపబడలేదు. ప్రభుత్వం హడావిడిగా, ఆకస్మాత్తుగా ప్రకటన వెలువడిందే తడవుగా గాంధీజీని, ఇతర నాయకులను ఆగస్టు 9వ తేదీ ఉదయమే అరెస్టు చేయటంతో ఈ హఠాత్పరిణామానికి కోపోద్రిక్తులైన ప్రజలు ఒక నిర్దుష్టమైన కార్యక్రమం లేకుండానే గుంపులు, గుంపులుగా బయలుదేరి ప్రభుత్వ ఆఫీసులపై ఆస్తులపై విధ్వంసం సృష్టించారు. ఏ దిశ నిర్దేశం లేకుండా ఉద్యమం హింసాయుతంగా సాగటం, ప్రభుత్వం పెద్ద ఎత్తున అణచివేత చర్యలు చేపట్టడం జరిగింది. చివరకు ఏమీ సాధించకుండానే ఆగస్టు నుండి డిసెంబరు వరకు జరిగిన ఉద్యమం క్రమేపీ చల్లారిపోయింది. చర్చల ద్వారా తప్ప, హింసాయుత మార్గాల ద్వారా పరిష్కారము సాధించలేమని కార్యకర్తలు నాయకులు గ్రహించారు.

బ్రిటిష్ ప్రభుత్వం రెండవ ప్రపంచయుద్ధం 1945లో ముగియటంతో బ్రిటిష్ ప్రభుత్వం భారతదేశ స్వాతంత్ర్యంపై దృష్టి సారించింది. కేబినెట్ మిషన్‌ను నియమించి ప్రణాళికను తయారు చెయ్యించింది. తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. పండిట్ జవహర్‌లాల్ నాయకత్వంలో జాతీయ ప్రభుత్వం ఏర్పాటయ్యింది. నూతన రాజ్యాంగ నిర్మాణం కోసం, రాజ్యాంగ చట్ట సభ ఏర్పడింది. ఈ సమయంలో ముస్లిం లీగ్ పాకిస్తాన్ కావాలంటూ దౌర్జన్య చర్యలకు పాల్పడటంతో అందుకు నాయకులు, ప్రభుత్వం అంగీకరించిన పిమ్మట భారత్ - పాకిస్తాన్‌లుగా విభజిస్తూ రెండు స్వతంత్ర దేశాలను ఏర్పాటు చేస్తూ బ్రిటిష్ పార్లమెంటు చట్టం చేయటంతో భారత దేశానికి ఆగస్టు, 15, 1947న స్వాతంత్ర్యం లభించింది. మితవాద ఉద్యమంగా ప్రారంభమై, తర్వాత అతివాద ఉద్యమంగా, చివరకు గాంధీజీ, నేతృత్వంలో అహింసాయుతంగా సాగిన పోరాటంలో సత్యం జయించింది. విదేశీయుల పాలన పోయి భారతీయుల పాలన ఏర్పడింది. స్వతంత్ర భారతావని ప్రపంచ పటంలో చోటు చేసుకుంది. దురదృష్టం దేశ స్వాతంత్ర్యం కోసం అహర్నిశలు శ్రమించిన, అహింసామూర్తి గాంధీజీ, ఒక మతోన్మాది నాథూరామ్ గాడ్సే తుపాకీ గుళ్ళకు బలై జనవరి 30, 1948న నేలకొరిగాడు. జాతి పిత ప్రాణాలు అనంతవాయువుల్లో కలసిపోయాయి. ఆయన బోధించిన సత్యం, అహింస మానవాళి పాటిస్తే, ప్రపంచం శాంతిమయమవుతుంది. అదే ఆయనకు మానవాళి అందించే ఘనమైన నివాళి.

## 15.5. సారాంశము :

రాజ్యాంగ పద్ధతుల ద్వారా ప్రజా సమస్యలు పరిష్కరించడానికి 1885, డిసెంబరు 28న జాతీయ కాంగ్రెసు ఏర్పడింది. మొదట్లో అందరూ సంస్కరణాభిలాషులే, అందరూ మితవాదులే. తర్వాత తిలక్ నాయకత్వంలో అతివాద వర్గం బయలుదేరి కొంచెం తీవ్రమైన పద్ధతులను ప్రచారం చేసారు. స్వదేశీ, స్వరాజ్ కార్యక్రమాలు చురుకుగా సాగాయి. 1920లో తిలక్ మరణం తర్వాత కాంగ్రెసు నాయకత్వం గాంధీజీకి దక్కింది. అహింసా మార్గంలో, సహాయ నిరాకరణ, శాసనోల్లంఘన క్విట్ ఇండియా ఉద్యమాల ద్వారా దేశ ప్రజలను ఐక్యం చేసి భారత స్వాతంత్ర్యానికి కారణభూతుడయ్యాడు గాంధీజీ. మహాత్మా, జాతి పిత అని ఆయనను గౌరవంగా ప్రజలు పిలుస్తున్నారు.

## 15.6. నమూనా ప్రశ్నలు :

1. భారత జాతీయోద్యమంలో మితవాదుల భూమికను వివరింపుము ?
2. జాతీయ కాంగ్రెస్‌లో అతివాదులు నిర్వహించిన పాత్రను తెలుపుము ?
3. భారత స్వాతంత్ర్యోద్యమంలో గాంధిజీ నిర్వహించిన ఉద్యమాల తీరు తెన్నులను వివరింపుము.

## 15.7. చదువదగిన గ్రంథాలు


1. Aggarwala. R.C. : Indian Nationalist Movement and Constitutional Development
2. Sudha. J.P. : Indian Custitutional Development
3. K.V. Kotilingam : భారత స్వాతంత్ర్యోద్యమము - రాజ్యాంగ వికాసము.


- డా॥ ఎ. వెంకటరావ్మ

# జవహర్‌లాల్ నెహ్రూ - రాజకీయ భావాలు
# (Political Ideas of Jawaharlal Nehru)
# (1889 - 1964)

## 16.0 లక్ష్యం:

భారత స్వాతంత్ర్య సమర యోధులలో గాంధీజీ తరువాత పేరెన్నికగన్న నాయకుడు భారతదేశం గర్వించదగిన మహావ్యక్తి జవహర్‌లాల్ నెహ్రూ. స్వతంత్ర భారత తొలి ప్రధానిగా భారతదేశ సర్వతో ముఖాభివృద్ధికి ఆయన చేసిన కృషి, తీసుకున్న నిర్ణయాలు భారతదేశాన్ని నేడు ప్రపంచ దేశాలలో అగ్రగామిగా నిలబెట్టడానికి కారణమని చెప్పుకోవడంలో అతిశయోక్తి లేదు. స్వాతంత్ర్య సమర యోధునిగా, భారత రాజ్యాంగ రచనలో ప్రముఖునిగా, భారత తొలి ప్రధానిగా ఆయన నిర్వహించిన పాత్రల గురించి ఆధునిక రాజనీతితత్వ విద్యార్థులకు అవగాహన కలిగించినాడు వారు చేసిన అవిరళ కృషి, త్యాగాల ఫలితమే నేడు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలన్న వాస్తవం ఎవ్వరూ ఎప్పటికీ మరువకూడదని, వారి నిస్వార్థ సేవ, దూరదృష్టి అందరికీ ఆదర్శప్రాయమని, అటువంటి మహనీయుని జీవితం, రాజకీయ భావములు, వివిధ అభివృద్ధి విషయాలలో ఆయన నిర్వహించిన పాత్ర విదేశాంగ విధాన రూపకల్పనలో ఆయన కృషి వీటన్నిటి గురించి విద్యార్థికి సులభ శైలిలో వివరించడమే ఈ పాఠం యొక్క ప్రధాన లక్ష్యం.

## విషయసూచిక:

16.1 బాల్యం, విద్యాభ్యాసం
16.2 స్వాతంత్ర్య సమరంలో నెహ్రూ నిర్వహించిన పాత్ర
16.3 తాత్విక పువాదులు
16.4 సాంఘిక భావాలు
16.5 రాజకీయ భావాలు
  16.5.1 రాజకీయ ప్రజాస్వామ్యం
  16.5.2 ఆర్థిక ప్రజాస్వామ్యం
  16.5.3 సాంఘిక ప్రజాస్వామ్యం
  16.5.4 జాతీయత, అంతర్జాతీయతా భావాలు
16.6 ఆర్థిక భావాలు
16.7 తొలి ప్రధానిగా భారతదేశాభివృద్ధికి చేసిన కృషి
16.8 సారాంశము
16.9 నమూనా ప్రశ్నలు
16.10 చదువదగిన గ్రంథాలు

## 16.1 బాల్యం, విద్యాభ్యాసం:

ధనము బాగా ఆర్జించెను. ఆయన తన కుమారుడయిన జవహర్‌లాల్‌ను కూడా ఉన్నత కుటుంబీకుల వాతావరణంలోనే పెంచాడు. ఈ వాతావరణం జవహర్‌లాల్ ఆలోచనా సరళిని బాగా ప్రభావితం చేసినది. అందరివలె జవహర్‌లాల్ ప్రాథమిక విద్య

పాఠశాలలో అభ్యసించలేదు. యింటి వద్ద ఫెర్టినాండ్ టి బ్రూక్స్ అనే (Fertinand T. Brooks) టీచరు వద్ద నేర్చుకున్నాడు. చిన్నతనంలో నేర్చుకున్న ఈ విద్య శాస్త్ర విజ్ఞానం పట్ల ఆయనకు ఆసక్తిని పెంచినది. ప్రతి విషయాన్ని నిశితంగా ఆలోచించగల స్థాయి, ఆసక్తి కలిగేటట్లుగా చేసినది. 15వ ఏట హారో (Harrow) లోని ఒక స్కూల్లో చేరి 1907లో కేంబ్రిడ్జి ట్రినిటీ కళాశాల (Cambridge Trinity College) లో అడ్మిషన్ పొందాడు. ఆ తరువాత లండన్‌లో లా డిగ్రీ చదివాడు. విద్యార్థిగా ఉన్నప్పుడే ఇటలీలో విప్లవవాది 'గారిబాల్డీ' (Gari Baldy) రచనలు అనేకం చదవడంతో జాతీయతా భావం పట్ల ఆకర్షితుడైనాడు. కేంబ్రిడ్జిలో విద్యార్థిగా ఉన్నప్పుడు 'బెర్నార్డ్ షా', 'వెబ్స్' (Bernard Shaw , Webbs) తో పరిచయం ఏర్పడడం వలన వారి భావాలు ఆయనకు స్ఫూర్తినిచ్చాయి. లండన్‌లో విద్యార్థిగా ఉన్నప్పుడే 'లాకే', 'రూసో', 'బెంథామ్స్' 'మిల్' (Locke, Rousseau, Bentham, J.S. Mill) ల భావాలను క్షుణ్ణంగా అధ్యయనం చేశాడు. స్వేచ్ఛావాదం పట్ల ఆకర్షితుడయినాడు. భారతదేశంలో జరుగుతున్న స్వాతంత్ర్య పోరాట ఘటనల గురించి తనకు తండ్రి వద్ద నుండి వచ్చే ఉత్తరాల ద్వారా ఎప్పటికప్పుడు తెలుసుకొనుచుండెడి వాడు. 1912లో భారతదేశానికి తిరిగి వచ్చి న్యాయవాద వృత్తిని చేపట్టి దానిపట్ల ఆసక్తి లేకపోవుటచే విడిచి పెట్టినాడు. జాతీయ ఉద్యమము పట్ల, స్వాతంత్ర్య పోరాటము పట్ల ఆసక్తిని పెంచుకున్నాడు. 1916లో లక్నో కాంగ్రెస్ సమావేశంలో మొదటిసారిగా గాంధీజీని జవహర్‌లాల్ కలుసుకోవటం జరిగింది.

## 16.2 స్వాతంత్ర్య సమరంలో నెహ్రూ పాత్ర:

విద్యాభ్యాసము పూర్తి చేసుకొని భారతదేశం తిరిగి వచ్చిన తరువాత తన తండ్రి మోతీలాల్ నెహ్రూతో కలసి స్వాతంత్ర్య సమరంలో పాల్గొంటూ 1916లో గాంధీజీని కలిసెను. గాంధీ పట్ల ఎటువంటి భావన ఆయనకు కలుగలేదు. ఒక ప్రత్యేకత కలిగిన వ్యక్తిగా మాత్రమే గాంధీజీని ఆయన గుర్తించాడు. కాని నెమ్మది నెమ్మదిగా ఆ అభిప్రాయం మార్చుకొనుటకు వీలు కల్గినది. స్వతంత్ర సముపార్జనకి ఆయన అనుసరించే అహింస, సహాయ నిరాకరణ పద్ధతులే సరైన మార్గాలని నెహ్రూ భావించాడు. గాంధీజీతో బలపడిన సన్నిహితత్వమే ఈ భావనకి కారణం. అనతికాలంలోనే జాతీయ కాంగ్రెస్ నాయకుడిగానే కాక వివిధ సంస్థలలో, ఉద్యమాలలో నాయకునిగా ఎదిగాడు. 1918లో అనిబిసెంట్, బాలగంగాధర్ తిలక్ (AnneBesant and Balagangadhara Tilaq) ఆరంభించిన 'హోంరూల్ ఉద్యమం' (Home Rule Movement) లో చేరి దానికి కార్యదర్శిగా నియమితుడయ్యాడు. 1919లో జలియన్‌వాలా బాగ్ దురంతాలపై నియమింపబడిన కమిటీ (దర్యాప్తు సంఘం)లో సభ్యత్వం ద్వారా మరింతగా పేరు ప్రఖ్యాతులు సంపాదించాడు. 1920లో ఉత్తరప్రదేశ్ రైతు ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నాడు. గాంధీజీ ఆరంభించిన సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొనడంతో అరెస్ట్ కాబడి 1923 వరకు జైలులోనే ఉండిపోవలసి వచ్చినది. 1928లో (All India Trade Union Congress) ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ అధ్యక్షునిగా ఎన్నుకొనబడినాడు. 1929లో నెహ్రూ రాజకీయ జీవితం మలుపు తిరిగింది. ఆయన 'జాతీయ కాంగ్రెస్' అధ్యక్షునిగా ఎన్నుకోబడ్డాడు.

నెహ్రూ అధ్యక్షతన 1929 జాతీయ కాంగ్రెస్ లాహోరు సమావేశంలో ప్రసిద్ధ స్వతంత్ర్య తీర్మానము ఆమోదించబడినది. 1930, జనవరి 26 స్వాతంత్ర్య దినముగా ఆయన ప్రకటించినాడు. అది భారతీయులు ఎవ్వరితోను పంచుకొనలేని జన్మహక్కు అని, తమ నేల ఫలాలు, స్వేచ్ఛా వాయువులు అనుభవించే హక్కు అన్ని దేశాలలోని ప్రజల వలె భారతీయులకు కూడా ఉందని అది ఎవరూ కాదనడానికి వీలు లేదని ఆయన ప్రకటించినాడు. జాతీయ కాంగ్రెస్‌లోని కొందరు (Dominion Status) అధినివేశ ప్రతిపత్తిని అంగీకరిద్దామని భావించినా నెహ్రూ మాత్రం (Purna Swaraj) పూర్ణ స్వరాజ్యమే తన ధ్యేయమని ప్రకటించాడు. గాంధీజీ పిలుపు మేరకు శాసనోల్లంఘన ఉద్యమం (Civil disobedience Movement) దండి మార్చ్‌తో (Dandi March) 1930లో ఆరంభమయింది. 1930లో నెహ్రూ అరెస్ట్ కాబడి 1931 జనవరి వరకు జైలులోనే గడపవలసి వచ్చినది. తిరిగి 1931లో అరెస్ట్ కాబడి 1933 వరకు జైలు జీవితం గడిపినాడు. ఆ సమయంలోనే తన ప్రసిద్ధ గ్రంథము 'Glumses of World' ఆ గ్రంథంలో సామ్రాజ్యవాదాన్ని ధనిక వర్గాన్ని నిశితంగా విమర్శించి సామ్యవాదాన్ని సమర్థించాడు. 1934లో అలీపూర్ జైలు నుండి కొన్ని షరతులతో విడుదలయ్యాడు.